# పురాణపాత్రలపై కొత్త వెలుగు

## లోహియా ఇతిహాస వ్యాసాలు

అనువాదం

**ఘట్టమరాజు**

**సురమౌళి**

**రావెల సాంబశివరావు**

సంకలనం

**రావెల సోమయ్య**



**రామమనోహర్ లోహియా సమతా ట్రస్ట్**
101, గోధానిలయం, మయూర్ మార్గ్
బేగంపేట్, హైదరాబాద్

**Puranapaatralapai Kottavelugu**
**Lohia Ithihasa Vyasalu**
Ramamanohar Lohia


Compilation
**Ravela Somayya**
Phone : 8121898440



© **Rammanohar Lohia Samata trust,**
101, Godha Nilayam, Mayuri Marg,
Begumpet, Hyderabad



First Edition : November 2022

No. of copies : 500

Cost : Rs.200

Cover design :

**Rmanajeevi**

9951618021

Page makeup :

**Damaraju Nagalakshmi**

9912940182

For copies :

Soul Distributors

**Southern Springs Publishers Pvt. Ltd.**
Hyderabad.
e-mail : southernspringspublishers@gmail.com
Mobile : 9100942260/74/75

Printed at :
M/s. **Karshak Printers**
Vidyanagar, Hyd.



Dedicated

to

**Militant Monk**

and the first

**Socialist**

**in Asia**

**Swamy Vivekananda**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | **ముందుమాట** | 6 |
| | **పురాణపాత్రలకు సామాజిక భాష్యకారుడు**<br>**- కల్లూరి భాస్కరం** | 10 |
| **1.** | **సమత + స్వాతంత్ర్యం + సౌందర్యం = లోహియా** | 48 |
| **2.** | **ద్రౌపది - సావిత్రి** | 64 |
| **3.** | **కృష్ణుడు** | 92 |
| **4.** | **రాముడు - కృష్ణుడు - శివుడు** | 114 |
| **5.** | **వసిష్ఠుడు : వాల్మీకి** | 138 |
| **6.** | **రామాయణ తిరునాళ్ళు** | 164 |
| **7.** | **ప్రముఖుల విశ్లేషణలు** | 197 |
| | 1. పురాణ పాత్రలు - వర్తమాన రాజకీయాలు - లోహియా<br>**- ఓల్గా** | 202 |
| | 2. సాంస్కృతిక మోనోపలికి విరుగుడు లోహియా<br>**- రాణి శివశంకర శర్మ** | 208 |
| | 3. మెదళ్ళకుండే దుమ్ము దులిపే ఆలోచనలు<br>**- డా. నాగసూరి వేణుగోపాల్** | 218 |
| | 4. పురాణ ప్రతీక-ఆధునిక జ్ఞానవీచిక<br>**- డా. అవధానం రఘుకుమార్** | 224 |
| | 5. విశ్వమానవరాగం - లోహియా మానసగానం<br>సమీక్షా వ్యాసం **•- ఎమ్వీ రామిరెడ్డి** | 242 |

*Oh mother India give us the limits of Rama, the exuberant heart of Krishna and the non dimensional mind of Siva.*

*********

*No man's thought should be made the centre of a political action; it should help but not control. Acceptance and rejection are varying forms of blind worship. There are priceless treasures to learn from Gandhi as from Marx., but the learning can only be done when the frame of reference does not derive from an age or a person.*

*********

*Religion is long term politics. Politics is a short term religion. Caste is immobile class. Class is a mobile caste..*

***- Dr. Rammanohar Lohia***

Please visit **www.lohiatoday.com** website

# ముందుమాట

"మిథ్" లేదా  ఒక పురాణ కథ ప్రజల మస్తిష్కంలో కాలాలుగా మిగిలిపోయిన ఓ జ్ఞాపకం. అది ఒక సాంప్రదాయ కథ, గాథా కావచ్చును. లేదా జన బాహుళ్యంలో ఓ పాటగానో, ఓ నాట్య, కళా రూపకంగానో గుర్తుండిపోవచ్చును. గతంలో సుదూర కాలాలలో జరిగిన ఒక సంఘటన, ఓ ఘర్షణ, ఓ అనుభవం, ఓ ఆనందం... చాలాసార్లు అది పురాణ నాయక, నాయికల రూపంలో మనకు తరతరాలుగా అందుబాటులోకి వస్తుంది. అయితే ఆధునిక జ్ఞానం ఈ ప్రతీకలను పుక్కిటి పురాణాలుగా, కట్టుకథలుగా కొట్టివేయనూ వచ్చునూ లేదా దాన్ని సృజనాత్మకంగా పునర్నిర్మించి నేటి సమాజపు అవగాహనకు, అవసరాలకు ఉపయోగించుకోనూ వచ్చును. ఇది ప్రపంచవ్యాప్తంగా జరుగుతూనే వున్న ప్రక్రియ.

భారతదేశపు తాత్విక చింతనలోనూ, రాజకీయాలలో ఒక విభిన్న వ్యక్తిగా, నిరంతరం సమాజపు ఉన్నతికి తపనబడ్డ ఒక "అవిశ్రాంత ఆత్మ"గా, ఆసియా, భారతదేశాలలో సమసమాజ స్థాపనకు ప్రత్యామ్నాయ మార్గాలు ఆవిష్కరించే పనిలో జీవితాంతం తహతహలాడిన వ్యక్తిగా డా॥ రామమనోహర్ లోహియా సుపరిచుతులు. అయితే ఆయన అధ్యయనం, అన్వేషణ, ఆలోచనలు కేవలం రాజకీయాల పైనే కాక సాహిత్యం, కళలు శిల్ప, నాట్యం, భాష... ఇలా అనేక అంశాలపై సాగింది.

అలాంటి విస్తృత అధ్యయనంలో భాగంగా ఆయన ఈ దేశపు పురాణ సాహిణసాహిత్యాన్ని పురాణ పురుషులను, ప్రతీకలను ఎలా అర్థం చేసుకోవాలి అన్న ప్రయత్నం చేశారు. లోహియా ఆలోచనలూ, రచనలూ, ఉపన్యాసాలు, ఉ త్తరాలు.. ఇలా అనేకం గత కొద్ది దశాబ్దాలుగా విరివిగా సేకరించడి, అనేక అంశాలుగా ముద్రణకు నోచుకుంటున్నాయి. అయితే లోహియా హిందూ మతంపై, పురాణగాథలపై చేసిన ఆలోచనలు హిందీలో లభ్యంగా వున్న, తెలుగు లోకానికి

పరిచయం కాలేదు. ఆలోటును భర్తీ చేసే పనిలో భాగంగా – లోహియ రామ, కృష్ణ, శివ, ద్రౌపది. సావిత్రి... ఇలాంటి పౌరాణిక పాత్రలు, కథలపై చేసిన ఆలోచనల తెలుగు రూపమే ఈ సంకలనం. అదే సమయంలో ఈ విషయం పై ఆయన చేసిన ఆలోచనలను ఇతరులు ఎలా అర్థం చేసుకున్నారు, తెలుసుకునే ఉద్దేశ్యంతో మరో ఆరుగురి స్పందనలను కూడా ఈ పుస్తకంలో చేర్చడం అయ్యింది.

ఇది రాజకీయ, సామాజిక స్పృహ కల ఆధునికులకు, నేటి తరానికి ఎంతో ఉపయోగపడుతుంది అన్న నమ్మకంతో ఈ పుస్తకాన్ని మీ ముందుకు తెస్తున్నాం.

భారతదేశపు పౌరాణిక సాహిత్యం, పౌరాణిక పాత్రలపై లోహియా రాసిన అనేక వ్యాసాలను తెలుగు పాఠకులకు పరిచయం చేయడంలో అత్యంత కృషి చేసిన రావెల సాంబశివరావుగారికి ప్రచురణకర్తలు తమ అభినందనలు తెలియచేస్తున్నారు. హిందీ మూలంలో వున్న లోహియా ఆలోచనలు – "కృష్ణుడు", "రాముడు – కృష్ణుడు – శివుడు"లను వారు తెలుగులోకి అనువదించారు. ఇంతకు ముందు కూడా చాలా ముఖ్యమైన నాలుగు లోహియా రచనలను వారు తెలుగులోనికి తీసుకు వచ్చారు. అలాగే ఘట్టమరాజుగారు డా. ధర్మవీర్ భారతి రచన – "సమత + స్వాతంత్ర్యం + సౌందర్యం", "రామాయణ తిరునాళ్ళు" అన్న రెండు అమూల్యమైన ఆలోచనలను హిందీ నుంచి తెలుగులో అనువదించారు. కీ.శే. సురమౌళి గారు గతంలోనే అనువదించిన – "ద్రౌపది – సావిత్రి", "వశిష్ఠుడు – వాల్మీకి" అన్న రచనలను ఇందులో పొందుపరిచాం.

హిందీలో ఉన్న లోహియా రచనల ప్రతులను సంపాదించి మాకు వాటిని అనువదించే అవకాశం కల్పించిన శ్రీ గోపాల్ సింగ్, లోహియా విచార్ మంచ్, అధ్యక్షుడు గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

వీటితోపాటు ఈ అంశంపై లోహియా రచనల గురించి ఒక ఐదుగురు ప్రముఖుల విశ్లేషణలు : ఓల్గా గారి – "పురాణ పాత్రలు వర్తమాన రాజకీయాలు – లోహియా", రాణి శివశంకర శర్మ – "సాంస్కృతిక మోనో పలికే విరుగుడు లోహియా", డా. నాగసూరి వేణుగోపాల్ – "మెదళ్ళకుండే దుమ్ము, ధూళిని దులిపే ఆలోచనలు", అవధానం రఘుకుమార్ – "పురాణ ప్రతీక – ఆధునిక

జ్ఞానవీచిక", శ్రీ ఎమ్.వి. రామిరెడ్డి "విశ్వమానవ రాగం – లోహియా మానసగానం" లు కూడా ఈ పుస్తకానికి నిండుతనాన్ని ఇస్తున్నాయి. శ్రీ ఎమ్.వి.రామిరెడ్డి గారి రచన తొలుత "పాలపిట్ట"లో పబ్లిష్ అయ్యింది. దాని పునర్ముద్రణకు అంగీకరించిన "పాలపిట్ట" యాజమాన్యం రమణారెడ్డిగారికి ధన్యవాదాలు. శ్రీ ఎమ్.వి. రామిరెడ్డి వ్యాసం అంతకుముందు ఈ వ్యాసాన్ని ముద్రించిన "సీనియర్ సిటిజన్స్ వాయిస్" యాజమాన్యం, భూమారెడ్డిగారికి ధన్యవాదాలు.

ఈ పుస్తకాన్ని అర్థవంతంగా తయారు చేయడంలో సహకరించిన శ్రీ కల్లూరి భాస్కరం గారికి కృతజ్ఞతలు. వారి పీఠిక – "పౌరాణిక గంగను సామాజిక భూమార్గం పట్టించిన వాడు" పుస్తకానికి అత్యంత శోభను చేకూర్చింది. అలాగే ఈ పుస్తకానికి అందమైన, ఆకర్షణీయమైన కవర్ డిజైన్ చేసిన రమణజీవి గారికి కృతజ్ఞతలు.

ఎన్నో మార్పులు, చేర్పులను ఓపికగా చేసి పుస్తకానికి ఒక రూపం తీసుకురావడానికి సహకరించిన దామరాజు నాగలక్ష్మి గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు.

చివరిగా పుస్తక ముద్రణకి ఎంతో ప్రోత్సాహం ఇచ్చి నడిపించిన లోహియా సమతా ట్రస్ట్, లోహియా విచార్ మంచ్ పెద్దలక ధన్యవాదాలు.

ఈ పుస్తకాన్ని ఆదరించి, చదివి మరింత ప్రోత్సాహాన్ని అందించవలసిందిగా కోరుతూ...

4.11.2022
హైదరాబాద్

**లోహియా విచార్‌మంచ్**
హైదరాబాద్

# పురాణ పాత్రలకు సామాజిక భాష్యకారుడు

**– కల్లూరి భాస్కరం**

**గా**ంధీకి సమకాలీనంగానూ ఉండి, ఆ తర్వాత కూడా జీవించిన రామ్ మనోహర్ లోహియా అప్పటి స్వాతంత్ర్యోద్యమ నాయకులందరిలోనూ ఒక విలక్షణమైన ఆకర్షణ, అనేకమంది అనంతర నాయకులకు ఒక విశిష్టమైన స్ఫూర్తికేంద్రం, గొప్ప దార్శనికత నిండిన ఆలోచనాధార. ఆయన అధికారానికి, అధికారంలో ఉన్నవారికి దగ్గరగా ఉన్నా, దూరం పాటిస్తూ నిరంతరం జనానికి దగ్గరగా ఉన్న, జనం మనిషి. నాటి ప్రధాని నెహ్రూకు అతిసన్నిహితులలో ఆయన ఒకడన్న సంగతి ఆయన జీవితచరిత్ర చెబుతుంది. అలహాబాద్‌లో నెహ్రూ ఇంట తను పొందిన ఆతిథ్యమూ, ఆదరణే గొప్పవని ఆయన చెప్పుకున్నాడు. అదే నెహ్రూపాలనలో ఆయన చెరసాల శిక్ష అనుభవించడం, నెహ్రూపై, బహుశా అందరికంటే ఎక్కువ పదునూ, పారుష్యమూ కలిగిన విమర్శల శూలాలను ప్రయోగించడం ఆయన విలక్షణ వ్యక్తిత్వాన్ని మరింత పట్టిచూపుతాయి. రాజకీయమైన ఆయన ఆలోచనా సరళినే కాక, పురాణ, ఇతిహాస పరిచయం నుంచి పెంపొందిన ఆయన దృష్టికోణాన్ని కూడా వెల్లడించే ఆ ఘట్టం కూడా ఈ పుస్తకంలో ఉంది. దాని గురించి ముందు ముందు చెప్పుకుందాం.

ఆయన వ్యక్తిత్వంలోని బహుముఖ పార్శ్వాలను 'సమత స్వాతంత్ర్యం సౌందర్యం' అనే ఈ పుస్తకంలోని ప్రథమవ్యాసంలో ప్రసిద్ధ హిందీ పాత్రికేయుడు డా. ధర్మవీర్ భారతి వివరిస్తాడు. ఈ వ్యాసశీర్షికే లోహియా వ్యక్తిత్వం గురించిన స్థూలచిత్రాన్ని మన ముందు ఉంచుతుంది. మిగతా వ్యాసమంతా అందుకు సంబంధించిన వివరాల సమీకరణమే. ఇతర నాయకులను ఎప్పుడు కలిసినా, వారి ముందు నేనొక మరుగుజ్జుగా కనిపించేవాడిననీ, లోహియాతో గడిపిన కొన్ని క్షణాలే నాలోని భయాన్ని పోగొట్టి నన్నొక సహజమానవునిగా తీర్చిదిద్దాయనీ

ధర్మవీర్ భారతి చెప్పుకుంటాడు. 'నీవు ఎవరికంటె తక్కువైన వాడివీ కావు, అలాగే ఎవరూ నీ కంటె తక్కువైనవారూ కా'దన్న గుణపాఠాన్ని తను లోహియా దగ్గరే నేర్చుకున్నానని ఆయన అంటాడు. కేవలం సంపదను సమాజంలోని అందరికీ సమానంగా పంచితేనే సమత సిద్ధించదనీ, మానవీయ అస్మితను సమానంగా పంచినప్పుడే సిద్ధిస్తుందన్నది లోహియా సామాజిక సమతా తాత్వికతగా ఆయన చెబుతాడు. స్వాతంత్ర్యమూ, దాని విలువా ఎలాంటివో లోహియాను కలిసిన తర్వాతే తనకు అర్థమైందని అంటాడు.

లోహియా ఉద్దేశంలో నిజమైన స్వాతంత్ర్యమంటే, మనుషుల్లోని సహజ గుణాలను హరించి మానవత్వాన్ని నాశనం చేసే దుష్టశక్తుల నుంచి తప్పించడమూ, బానిసత్వపు సంకెళ్ళను బద్దలు కొట్టడమే. 'అపజయం ఆయనను ముక్కచెక్కలు చేయలేకపోయింది, జయం ఆయనను తన వశంలోకి తీసుకోలేకపోయింది' అన్న ధర్మవీర్ ఒక్క వాక్యమే, జయాపజయాలకు అతీతమైన ఆయన సువిశాల, సుదీర్ఘకాలిక కార్యక్షేత్రాన్ని మనముందు బొమ్మ కడుతుంది. ఆ క్షేత్రంలో ముందుకు వెడుతున్నప్పుడు తను కట్టుకున్న బొమ్మరిల్లు గోడలు పటిష్ఠంగా లేవనిపిస్తే నిర్దాక్షిణ్యంగా వాటిని కూలగొట్టడానికి ఆయన వెనుకాడరనీ, ఆవిధంగా తను నిర్మించుకున్న బందిఖానా నుంచి సైతం తనను విముక్తం చేసుకునేంత స్వేచ్ఛాపిపాసి అనీ ధర్మవీర్ భారతి అంటాడు.

సమత-స్వాతంత్ర్యంతోపాటు సౌందర్యదృష్టి ఆయన వ్యక్తిత్వాన్ని త్రివేణీ సంగమం చేస్తుంది. సౌందర్యమంటే ఇక్కడ పైకి కనబడే అందచందాలు కావు, ఒక వ్యక్తి, జాతి, దేశం, కళాఖండంలోని అంతరంగ సౌందర్యమని ధర్మవీర్ వివరణ. అలాంటి సౌందర్యాన్ని చూసి లోహియా నిలువెల్లా పులకించిపోయేవాడంటాడు. కళల గురించి లోహియాకు ఉన్న మౌలికదృష్టి, వ్యాఖ్యానకౌశలం పేరు మోసిన కళావిమర్శకులకు కూడా లేవని ఉద్ఘాటిస్తాడు.

నెహ్రూ, లోహియాల ఆలోచనల మధ్య నున్న మౌలికమైన తేడాను ఆయన అద్భుతంగా ఎత్తిచూపుతాడు. ఎన్నో విషయాలలో రాజీపడుతూ భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దడం, దేశంలో ఎన్ని గడ్డు సమస్యలున్నా బయటి ప్రపంచానికి దేశాన్ని ఉజ్వలంగా చూపించడం నెహ్రూ ఆలోచనావిధానమైతే, అలాంటి తప్పుడు సందేశాన్ని

ఇవ్వడం లోహియాకు సుతరామూ నచ్చని విషయం. ఒక్కమాటలో చెప్పాలంటే, దేశం గురించి నెహ్రూది 'వెలుపలి' చూపు అయితే, లోహియాది 'లోపలి' చూపు. స్వాతంత్ర్యోత్తర 'దేశా'న్ని భౌతికంగా అత్యంతఘనంగా, ప్రపంచదేశాల దృష్టికెక్కేలా నిర్మించడం నెహ్రూ ఆలోచనైతే, లోపలి 'జనా'న్ని భౌతికంగానే కాక, మానసికంగానూ మహోదాత్తులుగా నిర్మించడం లోహియా ఆలోచన. పార్టీ ఏదైనా ఇప్పటి నాయకత్వం కూడా 'వెలుపలి'కి చూసే నెహ్రూ ఆలోచనాసరళినే పుణికిపుచ్చుకోవడం, లోహియా ఆలోచన ఇప్పటికీ అసంపూర్ణ అజెండాగానే మిగిలిపోవడం గమనించవలసిన విషయాలు.

* * *

ఈ 'జన'నిర్మాణ క్రమంలో మతాన్ని, మతప్రతీకలను, తాత్త్వికతలను, పురాణ, ఇతిహాసాలను, వాటిలోని ప్రసిద్ధపాత్రలను లోహియా రంగప్రవేశం చేయిస్తాడు, స్వాతంత్ర్యోత్తర జనమానసిక జీవితంతో వాటిని మేళవించడానికి ప్రయత్నిస్తాడు. ఆ విధంగా, పూర్తిగా 'భారతీయ'మైన చింతన నుంచి స్ఫూర్తినిపొందుతూ, సరికొత్త సమత–స్వాతంత్ర్య–సౌందర్యాలతో అలరారే సమాజానికి రూపురేఖలనిచ్చే దిశగా ఆయన ఆలోచనలు సాగుతాయి. ఆయనలో మాత్రమే కనిపించే ఒక ఆశ్చర్యకరమైన, అరుదైన పార్శ్వం ఇది. పౌరాణిక వ్యక్తులతో అంతగా తాదాత్మ్యం చెంది, వారితో మానసికబంధాన్ని పెనవేసుకుని, తన రాజకీయ, సామాజికచింతనలో వారిని భాగస్వాముల్ని చేసుకున్న నాయకుడు మరొకరు కనిపించరు. పౌరాణిక పాత్రలను ఆయన విగ్రహాలుగా మార్చి పూజించడు, వారిపై భక్తిప్రపత్తులు చాటుకోడు, వారిని కేవలం ప్రేమిస్తాడు, వారిని తలచుకుని పులకిస్తాడు, వారు ప్రాతినిధ్యం వహించే విలువలను, భారతీయతాత్త్వికతను రక్తగతం చేసుకుంటాడు. వారి కథల నుంచి నేటి సమాజానికి అవసరమైన కొత్త భాష్యాలను నిర్మిస్తాడు. వారి గురించిన సాంప్రదాయిక భావనలను తలకిందులు చేస్తాడు. ఆపైన, ఈయన నాస్తికుడు!

పురాణ, ఇతిహాసాలను ప్రవచించే పౌరాణికులు చాలామందే ఉన్నారు. వారి ప్రవచనాలు సంప్రదాయం నిర్దేశించిన పరిధుల్లోనే ఉంటాయి. భక్తి, ఆధ్యాత్మికత, ధర్మబోధ వంటి పరిమిత విషయాల చుట్టూనే తిరుగుతాయి. వారి ప్రసంగాలలో పౌరాణికనాయకులు హింసాత్మకమైన ఏకపక్ష ధర్మమూ, దుష్టశిక్షణా కరడుగట్టిన

శిలాకృతులుగా మారతారు. వారి లోపలి తడి ఉన్మీలనం కాదు. పురాణ, ఇతిహాస కథలను సంప్రదాయ విరుద్ధంగా అన్వయించిన వివిధ కళారూపాలూ ఉన్నాయి. కానీ లోహియా మార్గం ఈ రెండు రకాల పంథాలకు భిన్నమైనది. పురాణ, ఇతిహాసాల చుట్టూ అల్లుకున్న సాంప్రదాయిక మనోభావాలను గాయపరచకుండానే, వాటి పట్ల ఎలాంటి అగౌరవం చూపకుండానే ఆయన కొత్త దృక్పథాన్ని నిర్మిస్తాడు. పురాణపాత్రలలోని తడిని తడిమి వాటితో ఒక ప్రేమబంధాన్ని అల్లుతాడు. ఆవిధంగా వాటిని మరింత సజీవమూ, సమకాలీనమూ చేసి పూర్తిగా కొత్త సందర్భంలోకి తీసుకొస్తాడు. అసలీ కోణం నుంచి చూసినప్పుడు, లోహియా స్వాతంత్ర్యోద్యమకాలానికి చెంది ఉండకపోతే పురాణ, ఇతిహాసాలకు ప్రేమా, ఆర్ద్రతా నిండిన కొత్త భాష్యానికి సమగ్రరూపమిచ్చే పూర్తి కాలపు పండితునిగా మారి ఉండేవాడనిపిస్తుంది. స్వాతంత్ర్యోద్యమ నేపథ్యమే ఈ కొత్త ఆలోచనలకు ఆయనను పురిగొల్పి ఉండవచ్చు.

* * *

స్వాతంత్ర్యోద్యమ నేపథ్యానికి చెంది, స్వాతంత్ర్యోత్తర భారతీయ సమాజపు రూపురేఖల్ని తన ఊహల్లో రచించుకుని, దానిని సాకారం చేయదలచుకున్న క్రియాశీలిగానే లోహియా ఇతిహాస, పౌరాణిక కథలకు, పాత్రలకు తనదైన భాష్యాన్ని నిర్మించిన సంగతిని గుర్తుపెట్టుకోవాలి. అయితే, స్వాతంత్ర్యోద్యమ నేపథ్యం ఆయన భాష్యానికి ఒక నవ్యతను తెస్తూనే, ఒక పరిమితినీ విధించింది. అది ఎలాంటిదో ముందు ముందు చెప్పుకుందాం. ఈ పుస్తకంలోని ఆయన భావధార గురించి నా అవగాహన మేరకు ఈ నాలుగు వాక్యాలు రాస్తున్న నేను– పైన చెప్పిన స్వాతంత్ర్యోద్యమ నేపథ్యం లేనివాణ్ణి. పురాణ, ఇతిహాసాలను, వాటిలోని పాత్రలను పురామానవచరిత్ర, పురాచరిత్ర, చరిత్రల కోణంనుంచి పరిశీలించే ఆసక్తీ, ఉత్సాహమూ ఉన్నవాణ్ణి. కనుక ఆయన పరిశీలనలోని నవ్యతకు ఆశ్చర్యచకితుడినీ, ముగ్ధుడినీ అవుతూనే కొన్ని సందర్భాలలో ఆయనతో పూర్తిగా ఏకీభవించనూ లేకపోయాను. అదే సమయంలో కొన్ని విషయాలలో అంత పెద్దమనిషితో నాకున్న ఆలోచనాసారూప్యతను గమనించి ఎంతో సంతోషానికీ, సంతృప్తికీ లోనయ్యాను.

'ద్రౌపది–సావిత్రి' అనే శీర్షికతో మొదలైన వ్యాస ఆరంభమే ఆ సారూప్యతను చూపించింది. 'ఈ స్త్రీలిద్దరూ కేవలం కల్పితపాత్రలే అయి ఉండవచ్చు, లేదా

నిజమూ అయి ఉండవచ్చు. ఏదో ఒక రూపంలో నిజమై ఉండి, ఆ తర్వాత కాలక్రమేణా అనేక కథలను అల్లి వారికి జత చేస్తూ ఉండినా ఉండవచ్చు, లేదా నలుగురైదుగురు ఆడవాళ్ళకు చెందిన కథలను సమీకరించి ఒకే స్త్రీ చుట్టూ అల్లినా అల్లి ఉండవచ్చు' నంటాడాయన. 'ఈ దేశసాంస్కృతిక చరిత్ర విషయానికి వస్తే, ఆ గొప్ప (పురాణ) గాథల్లోని నాయకులు అసలు జీవించినవారేనా, కాదా అన్నది అప్రస్తుతమే అవుతుం' దని మరో సందర్భంలో అంటాడు. ఒక పురాణ, లేదా ఇతిహాసకథ నిజంగా జరిగిందా, లేక కల్పనా అన్నది కేవలం అకడెమిక్ చర్చే కానీ, ఆ గీటురాయి మీద ఆ కథలనే పూర్తిగా తోసిపుచ్చేటంత ప్రాధాన్యం దానికి లేదని నేను కూడా భావిస్తాను. ఆ సంగతిని నా రచనల్లో వివిధ సందర్భాలలో చెబుతూనే వచ్చాను. ఇదే సూత్రం వాటిలోని పాత్రలకు కూడా వర్తిస్తుంది. సరిగ్గా పైన లోహియా చెప్పిన పద్ధతిలోనే కాలక్రమేణా పాత్రల నిర్మాణం జరిగి ఉండవచ్చుననే నా భావన కూడా.

పురాణ, ఇతిహాసకథలు, పాత్రల విషయంలోనే కాక, చారిత్రక వ్యక్తులు, పాత్రల విషయంలో కూడా నాకు అలాంటి భావన ఉంది. ఆయా పాత్రలు ఇలా నిర్మాణం కావడం వెనుక కొన్ని కారణాలు, సూత్రాలు ఉన్నాయి. పురాణ, ఇతిహాసాలే కాక, చరిత్ర కూడా లిఖితరూపం ధరించడానికి ముందు చిరకాలంపాటు వాగ్రూపంలో ఉంది కనుక; కథకులు తమ ఊహాశక్తీ, అభిరుచీ, తాము ఇవ్వదలచుకున్న సందేశం వగైరాలను అనుసరించి పరిమితమైన ఉనికి గల ఒక పాత్ర చుట్టూ అనేక కల్పనల ఆహార్యాలను, అలంకారాలను పేర్చి ఉండవచ్చు, లేదా లేని పాత్రనూ సృష్టించి ఉండవచ్చు. పురాణ, ఇతిహాసకథా శ్రవణంలో కథకుడు – శ్రోతలూ కూడా ప్రత్యక్ష భాగస్వాములు కనుక, శ్రోతలైన జనసామాన్యపు ఆసక్తులూ, ఊహలూ, కల్పనలూ కూడా కథనానికి విస్తరిస్తాయి. ఈ ద్వికర్తృత్వ, లేదా బహుకర్తృత్వ లక్షణం గురించి 'మంత్రకవాటం తెరిస్తే మహాభారతం మన చరిత్రే' అనే నా పుస్తకంలో కొంత చర్చించాను.

కొన్ని దుర్భరపరిస్థితుల్లో నిస్సహాయజనం వీరుని రూపంలో ఒక రక్షకుని సృష్టించుకుంటారు. తమలో లేని గుణాలను, తమ నిస్సహాయతను, వ్యక్తిత్వపు కొరతలను పూరించే పాత్రలను వారు పనిగట్టుకుని నిర్మించుకుంటారు. ఆ నిర్మాణం వాస్తవిక వ్యక్తి ఆధారంగా జరగవచ్చు, లేదా అందుకోసం ఒక కల్పితవ్యక్తిని

సృష్టించుకోవచ్చు. ఇది మన దగ్గరే కాదు, అనేక సమాజాల్లో కనిపిస్తుంది. దీని గురించి కూడా నా పుస్తకంలో చర్చించాను.

పురాణ, ఇతిహాసకథలు, పాత్రలు నిజమా, లేక కల్పనా, లేక రెండింటి మిశ్రమాలా అన్నది ఒక దశలో అకడెమిక్ చర్చగా మారి అప్రధానమవుతుందనడానికి ఇంకో కారణం కూడా ఉంది. వ్యక్తులకు, దేశాలకు చరిత్ర ఉన్నట్టే, సమాజాలకు, భావాలకు, వాటి పరిణామక్రమానికి కూడా చరిత్ర ఉంటుంది. పురాణ, ఇతిహాస కథలు, పాత్రలు అన్నీ పరిమాణభేదంలో కొంత నిజం, కొంత కల్పన అనుకున్నా, లేదా పూర్తి కల్పనే అనుకున్నా, వాటికి ఆధారభూతమైన సమాజం కల్పన కాదు, వాటి చుట్టూ అల్లుకున్న భావాలు కల్పన కావు, అవి వాస్తవిక వ్యక్తులకు చెందినవి. ఈవిధంగా చూసినప్పుడు పురాణ, ఇతిహాసకథలు, పాత్రలు నిజమా, కల్పనా అన్న చర్చకు అతీతంగా మారి, సామాజికంగానూ, భావజగత్తులోనూ తమ ఉనికిని స్థాపించుకుంటాయి. పైన పేర్కొన్న లోహియా భావనకు, నా ఊహలకు మధ్య ఇలా సారూప్యం కుదరడం నాకు ఆశ్చర్యమూ, ఆనందమూ కలిగించింది.

ద్రౌపదికి కృష్ణ అనే పేరు కూడా ఉంది, కృష్ణుడు-కృష్ణల మధ్య ఒక అనుబంధం ఉంది. ఇలా చూసినప్పుడు, మహాభారత కథానాయకుడు కృష్ణుడు కనుక నాయిక పేరు కృష్ణ అయుంటుందని లోహియా ఒక ఆసక్తికరమైన ఊహ చేస్తాడు. నా ఉద్దేశంలో మహాభారతాన్ని అనేక దృక్కోణాలనుంచి చూసే అవకాశముంది కనుక, ఏ ఒక్కరినో నాయకుడిగా చూపించడం కష్టం. అర్జునునే తీసుకుంటే, ద్రౌపదీ స్వయంవరంలో అతడే విజేత, పాండవులందరిలోనూ అతనే మహావీరుడు, యుద్ధంలో ముఖ్యపాత్ర అతనిదే, చివరికి అతని మనవడైన పరీక్షిత్తే హస్తినాపురరాజ్యానికి ఉత్తరాధికారి అయ్యాడు. కనుక అర్జునుడే మహాభారత నాయకుడనిపిస్తాడు. పాండవసోదరుల అనుబంధంలో భ్రాతృస్వామ్య లక్షణాలున్నాయి, ఏ సోదరుడి విజయమైనా జ్యేష్ఠుడైన ధర్మరాజుకే చెందుతుంది, కురుక్షేత్ర విజయఫలమైన రాజ్యం కూడా అతనికే లభించింది, ఈ కోణంలో ధర్మరాజు నాయకుడు కావచ్చు. మొదటినుంచి పాండవులకు తలలో నాలుకలా ఉండి, వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ, ఒక వ్యూహం ప్రకారం వారిని యుద్ధంవైపు నడిపించినవాడు కృష్ణుడు, అర్జునుడికి రథసారథిగా యుద్ధపురోభాగంలో ఉంటూ, మొత్తం యుద్ధానికి

మంత్రాంగ సారథ్యం వహించినది కూడా అతనే, ఆ కోణంలో అతను నాయకుడు కావచ్చు. కృష్ణుని విషయంలో చాలామంది దృష్టిలో పెట్టుకోని ఒక విశేషముంది. ధర్మరాజు సోదరులతో కలసి మహాప్రస్థానానికి సిద్ధమయ్యే ముందు, హస్తినాపుర రాజ్యానికి పరీక్షిత్తును ఉత్తరాధికారిని చేసినట్టే, ఇంద్రప్రస్థ రాజ్యానికి కృష్ణుడి మనవడైన వజ్రుని ఉత్తరాధికారిని చేస్తాడు. ఆ విధంగా కృష్ణుడికి అర్జునుడితో సామ్యం కుదురుతోంది.

ఇవన్నీ అలా ఉంచితే, మహాభారతంలో ఏదో ఒక పాత్రను నాయకుడిగానో, నాయికగానో ఎంచి చూపడం ఆ ఇతిహాసంపట్ల సక్రమమైన దృష్టి కాదని నాకు అనిపిస్తుంది. అన్నివిధాలా శిథిలమైన ఒక సమాజం అంతరించి ఇంకొక సమాజం పుట్టుకనూ, దానికి తాత్వికమైన ఒక అర్థాన్ని కల్పించే కాలస్వభావాన్నీ అది చెబుతోంది కనుక, ఇందులో సమాజమూ, కాలమే నాయకపాత్ర వహిస్తాయని నేను అనుకుంటాను.

ద్రౌపది-సావిత్రుల గురించిన ప్రసంగవ్యాసంలో ఆ ఇద్దరు పౌరాణిక స్త్రీల మధ్య ఉన్న తేడాలను లోహియా వివరిస్తాడు. చివరికి తను ద్రౌపదివైపే మొగ్గ చూపుతాడు. ఈ తేడాల పరిశీలన వెనుక తనదైన ఒక సామాజిక లక్ష్యముంది. 'గత వంద, వేయి సంవత్సరాల కాలంలో హైందవపురుషుల మానసికస్థితి, అసమానతల పునాదుల మీద చాలావరకూ ఘనీభవించి పోయింది కనుక దానిని కరిగించడం, పురాణకథల సారాన్ని పిండుకుని ఆ వెలుగులో మన మానసికస్థితిని పునస్సంఘటితం చేసుకోవడమే' ఆ లక్ష్యం. ఇంతకుముందు అనుకున్నట్టు, స్వాతంత్ర్యోత్తర భారతీయసమాజ, లేదా జననిర్మాణం అనే ఆయన క్రియాశీలపథకంలో ఇది భాగం. భారతీయపౌరాణిక వారసత్వం నుంచి ఈవిధమైన ప్రయోజనాన్ని రాబట్టుకునే దిశగా గాఢమైన ఆలోచన చేసిన మరో నాయకుడు కానీ, రాజకీయపక్షం కానీ కనిపించకపోవడమే లోహియా ప్రత్యేకత. ఈ విషయంలో వామపక్షాలతో సహా మిగతా పార్టీలు, నాయకుల వైఫల్యం దేశానికి ఏ మేరకైనా చెరుపు చేసిందా అన్నది పరిశీలించదగిన ప్రశ్న.

మన మానసికస్థితిని, దృక్పథాన్ని పునర్నిర్వచించుకునే ఈ ప్రయత్నంలో, వివిధ అంశాల మీద, రెండు పక్షాలుగా విడిపోయి దేశవ్యాప్తంగా చర్చాగోష్ఠులను

నిర్వహించాలని లోహియా ఒక ఆసక్తికరమైన సూచన చేస్తాడు. ప్రతి పట్టణంలోనూ చర్చాగోష్ఠి సంఘాన్ని ఏర్పాటు చేసి; వారానికో, పదిహేను రోజులకో ఓసారి వాడవాడకూ వెళ్ళి చర్చలు నిర్వహించాలంటాడు. ఈవిధంగా, ప్రతి ఊళ్ళోనూ విధిగా ఉండవలసిన విద్యుచ్ఛక్తి, మంచినీరు, మురుగునీటిపారుదల వ్యవస్థ, రేషన్ షాపు, ప్రాథమిక ఆసుపత్రి వంటి నిత్యావసరాల పక్కన ఆయన చర్చాసంఘాలను కూడా చేర్చాడన్నమాట! చర్చను అలా ఒక నిత్యావసరంగా పరిగణించడం ఎంత అబ్బురమైన విషయం! ఇది ఒకవిధంగా పార్లమెంటును, శాసనసభలను నేరుగా జనంలోకి తీసుకువెళ్లడమే, ప్రజాస్వామ్యస్ఫూర్తిని మూలమూలకూ విస్తరింపజేయడమే.

ఈనాడు భారతదేశంలో ఆలోచనలు స్తంభించిపోయాయనీ, మేధస్సు చచ్చిపోయిందనీ ఆయన అంటాడు. మేధస్సును పునరుజ్జీవింపజేయడానికి చర్చాగోష్ఠులు ఒక మార్గమంటాడు. ఇలా చర్చను మేధోవర్ధకమైన ఔషధంగా కూడా ఆయన ప్రతిపాదించాడు. కొద్దో గొప్పో భౌతికవస్తువిప్లవంపైనే తప్ప, ఇలా ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం ఆలోచనామథనంతో కూడిన భావవిప్లవంపై దృష్టి పెట్టిన స్వాతంత్ర్యోత్తర రాజకీయనాయకత్వాలు ఒక చేతి వేళ్ళ లెక్కకు కూడా అందవు. కనీసం రాజ్యాంగస్ఫూర్తినైనా జనంలోకి తీసుకువెళ్లే ప్రయత్నం ఇన్నేళ్ల స్వాతంత్ర్యోత్తర కాలంలోనూ జరగలేదు, పాఠశాల స్థాయినుంచీ పాఠ్యగ్రంథాలలో రాజ్యాంగమౌలిక సూత్రాలను చేర్చి భావిపౌరులలో వాటి స్పృహ కనీసంగానైనా పెంపొందించే ప్రయత్నమూ జరగలేదు. భావపరమైన పూర్తి తిరోగమన రూపంలో దాని దుష్ఫలితాలను ఈరోజున ప్రత్యక్షంగా చూస్తున్నాం.

తన కాలంలో 'జనమాధ్యమా'ల ద్వారా ఆయన జరగాలనుకున్న ఆలోచనల వ్యాప్తికి ఈరోజున 'సామాజికమాధ్యమా(సోషల్ మీడియా)'లు అపారమైన అవకాశాన్ని కల్పించాయి. సాంకేతికత అందించిన ఆ కొత్త వనరును మితిమీరిన ఉత్సాహంతో దుర్వినియోగం చేయడమే తప్ప, సద్వినియోగం చేస్తున్నవారు తక్కువ. ఈ అత్యాధునిక మాధ్యమాలలో జరిగే (దు)రాలోచనల మథనం నుంచి అమృతం కన్నా ఎక్కువ విషమే పుడుతోంది. ఈ వేదికల మీద జరుగుతున్న అబద్ధాలు, అర్ధసత్యాల విలయతాండవం సత్యాన్ని అనేక నిలువుల లోతున పాతిపెడుతోంది. కాకపోతే, ఇక్కడ లోహియా అంచనా ఒకటి తప్పింది. 'చర్చాగోష్ఠులను నిర్వహించడానికి నలుగురైదుగురన్నా చదువుకున్నవాళ్లు, పండితులు ఉండాలి.

లేకపోతే అది బజారు స్థాయికి దిగిపోయి, దూషణభూషణలకు ఆలవాలమయ్యే ప్రమాదముం'దని ఆయన అంటాడు. నిజానికీరోజున సోషల్ మీడియాను బజారుస్థాయికి దిగజార్చి, దూషణ, భూషణలకు, అబద్ధాల వ్యాప్తికి ఆలవాలం చేస్తున్నవారిలో ఉన్నతవిద్యావంతులే ఎక్కువమంది. పాలకపక్షాలే ఇందులో స్వయంగా భాగస్వాములయ్యాయి. పురోగమనసూచికగా కనిపించే శాస్త్రసాంకేతిక అభివృద్ధి దేశ ఆలోచనాధారను తిరోగమనం పట్టించిన సందర్భాలలో ఇదొకటి.

* * *

'భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే స్త్రీ ద్రౌపదే కానీ, సావిత్రి కా'దన్నది ఆయన చర్చకు సూచించిన అంశాలలో ఒకటి. 'భారతదేశం నిరంతరం బానిస అవడానికి కారణం నాయకుల, లేదా రాజుల అనైక్యత కాదు, ప్రజల ఉదాసీనత' అనేది ఇంకొకటి. అయిదుగురు భర్తలున్న స్త్రీగా మాత్రమే ద్రౌపదిని గుర్తుపెట్టుకుని ఆమె మిగతా గుణగణాలను పరిశీలించకపోవడం ఈనాడు భారత ప్రజల పతనావస్థకు సంకేతమని ఆయన అంటాడు. యముని వెంటబడి భర్తను తిరిగి జీవింపజేసుకున్న సావిత్రిలోని ఆ పతివ్రతా లక్షణమే మనకు చాలా ఉన్నతంగా కనిపిస్తుందంటాడు. భార్య మరణిస్తే యముని వెంటబడి తిరిగి బతికించుకున్న పురాణకథలు ఎందుకులేవని ప్రశ్నిస్తాడు. ఇది ఎంతైనా న్యాయమైన ప్రశ్నే.

అయితే విచిత్రంగా సావిత్రి కథలాంటిదే, పతి (లేదా కాబోయే పతి) వైపు నుంచి ఒకటి మహాభారతంలో కనిపిస్తుంది. అది రురుడు-ప్రమద్వరల కథ. వారిద్దరికీ వివాహం నిశ్చయమవుతుంది. అంతలో ప్రమద్వర పాముకాటు వల్ల మరణిస్తుంది. రురుడు పట్టరాని దుఃఖంతో ఒంటరిగా ఒక దట్టమైన అడవికి చేరుకుని భోరున విలపిస్తాడు. అప్పుడు ఒక దేవదూత అతని దగ్గరికి వచ్చి, నీ ఆయుర్దాయంలో సగం నీ కాబోయే భార్యకు ధారపోస్తే ఆమె జీవిస్తుందంటాడు. రురుడు అలాగే చేసి ఆమెను బతికించుకుంటాడు. ఇలాంటి కథ కూడా ఒకటుందని చెప్పడానికే దీనిని ప్రస్తావించాను తప్ప; పురాణ, ఇతిహాసాలు పత్నీవ్రతాన్ని ఎందుకు బోధించలేదన్న లోహియా ప్రశ్నతో విభేదించడానికి కాదు.

ఇవన్నీ 'కల్లబొల్లి కథ' లంటూనే, వీటిలో అక్కడక్కడ చాలా గొప్ప విషయాలుంటాయని లోహియా అంటాడు. పురాణకథలపట్ల ఈ సమతూకపు

దృష్టి ఇందులోని వ్యాసాలన్నింటిలో కనిపిస్తుంది. రాముడు, కృష్ణుడు తదితర పౌరాణికపాత్రలలోని సుగుణాలను ఎత్తిచూపి వారిపై అపారమైన ప్రేమను చాటుకుంటూనే; వారిలోని లోపాలను ఎంచుతాడు. తులసీదాసు రామాయణాన్ని సుందరమైన కావ్యమంటూనే, అది బోధించే స్త్రీ–పురుష అసమానతలను, వర్ణధర్మాలను గర్హిస్తాడు. అదే సమయంలో, మానవీయదృక్కోణం నుంచి ఒప్పులు, తప్పుల మధ్య ఒక సమన్వయాన్నీ ప్రతిపాదిస్తాడు. సావిత్రి పాత్రపై నాకు ఏమాత్రం అగౌరవం లేదనీ, సంపూర్ణమైన ఆదరాభిమానాలున్నాయనీ అంటూనే; భారత స్త్రీలకు నిజమైన ప్రతినిధి ద్రౌపదే కానీ, సావిత్రి కాజాలదని అంటాడు. సమతూకం కొనసాగాలంటే, సమాజనిర్మాణం సక్రమంగా ఉండాలంటే స్త్రీ ఒకే పతిని కోరుకున్నట్టుగానే, మగవాడు కూడా ఒకే సతికి కట్టుబడి ఉండాలన్న సూత్రీకరణ మేరకే ఆయన సావిత్రిని తిరస్కరిస్తాడు. అసమానతల పునాదుల మీద ఏర్పడిన స్త్రీ–పురుష సంబంధాల కారణంగా భారతీయ స్త్రీ–పురుషులు తమ మధ్య నిజమైన ప్రేమబంధానికి దూరమైపోయారంటాడు.

ఈవిధంగా, బాల్యంనుంచీ ఇక్కడి జనాల ఊహలతో గాఢంగా అల్లుకున్న పౌరాణిక కథల నుంచి, పాత్రల నుంచి నేటి సమాజ నిర్మాణానికి అవసరమైన సూత్రీకరణలను నిర్మించడానికి ఆయన ప్రయత్నిస్తాడు. స్థూలంగా చూస్తే, ఆ కథలూ, పాత్రల పట్ల ఇదే సముచితమైన, న్యాయమైన వరవడి. జనం మీద పౌరాణిక వ్యక్తుల ప్రభావం ఉన్నంతగా చారిత్రకవ్యక్తుల ప్రభావం లేదు కనుక, వారి మనస్థితులను పునర్నిర్మించడంలో పౌరాణిక వ్యక్తులపైనే ఆధారపడవలసి ఉంటుందన్నది లోహియా చేసిన మరో మౌలిక వ్యాఖ్య. 'చారిత్రకఘటనలు శిలలపై చెక్కినా, లోహాలపై ముద్రించినా కాలగర్భంలో కలసిపోవడం జరిగింది కానీ, (రాముడు,కృష్ణుడు, శివుని వంటి పౌరాణికవ్యక్తుల) గాథలు మాత్రం ప్రజల మనసులపై చెరగని ముద్రలై నిలిచా' యంటాడు.

ద్రౌపది విషయానికి వస్తే, జ్ఞానపరిణతిలో కానీ, సద్యఃస్ఫూర్తిలో కానీ, విషయ అవగాహనలో కానీ, సాహసంలో కానీ ప్రపంచంలో ఎక్కడా ఏ కాలంలోనూ ద్రౌపది లాంటి ఔన్నత్యం కలిగిన స్త్రీ కనిపించదనీ, ఇందులో ఆమెకు కృష్ణుడు ఒక్కడే సమవుజ్జీ అనీ లోహియా అంటాడు. ఈ వ్యాఖ్యలో భావావేశం కొంత

ఎక్కువే ఉండచ్చు కానీ, వాస్తవమూ ఉంది. నాకైతే, ద్రౌపదీ-పాండవుల వివాహం పూర్తిగా రాజకీయవివాహమనీ, ఆ కోణం రాను రాను మరుగున పడి వారి మధ్య సాధారణ సాంసారిక సంబంధం గురించిన ఊహలూ, చిత్రణలే మన బుర్రల్ని పూర్తిగా ఆక్రమించుకున్నాయనీ అనిపిస్తుంది. అసలు ద్రౌపది పుట్టుకే రాజకీయకారణాలపైన! ఆమె వివాహం కూడా రాజకీయంతో ముడిపడినదే. అర్జునుడు మత్స్యయంత్రాన్ని ఛేదించిన వెంటనే కర్ణాదులకు, భీమార్జునులకు జరిగిన యుద్ధమూ రాజకీయసంబంధే. ఆ తర్వాత కూడా పాండవులు రాజకీయంగా పడిన అన్ని ఒదుదుడుకుల్లోనూ ద్రౌపది భాగస్వామి అయింది. అరణ్యవాసంలో తనే పాండవుల వెంట ఉంది తప్ప, వారి ఇతర భార్యలు కాదు. సరే, ఈ కోణంలోకి మరింత లోతుగా వెళ్లడానికి ఇది సందర్భం కాదు.

ఈ రాజకీయకోణాన్ని పక్కన పెడితే, ద్రౌపదిలో లోహియా దర్శించిన సుగుణాలన్నీ ఉన్నాయి. ధర్మరాజు మినహా మిగిలిన నలుగురు పాండవులతో పోల్చి చూస్తే ఈ సుగుణాలతో కూడిన ద్రౌపది వ్యక్తిత్వం మరింత విశిష్టంగానూ, ప్రత్యేకంగానూ కనిపిస్తుంది. ఇక్కడ తేడా ఏమిటంటే, ఆ నలుగురూ అన్నగారి ఆదేశాలకు, ఆలోచనలకు బందీలు. ఇంతకుముందు చెప్పినట్టు వారిది ఒకవిధమైన భ్రాతృస్వామ్యం. ద్రౌపది స్థానం వేరు; భార్యగా భర్తను అనుసరిస్తూనే ఒక్కోసారి భర్తతో విభేదించి, ధిక్కరించే స్వేచ్ఛ ఆమెకు ఉంది. కీచకుడు తన వెంట పడినప్పుడు విరాటరాజు కొలువుకు చేరుకుని ధ్వనిపూర్వకంగా భర్తలను అధిక్షేపించిన ఘట్టంలో ఆ ధిక్కారస్వేచ్ఛ స్పష్టంగా కనిపిస్తుంది. అరణ్యాల పాలయ్యాక కూడా ధర్మరాజు యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ శాంతి పక్షాన మాట్లాడినప్పుడు, భీముడితోపాటు తను కూడా యుద్ధ అవసరాన్ని నొక్కి చెప్పి వాదించడంలో కూడా ద్రౌపది స్వతంత్ర ఆలోచనాస్వేచ్ఛను చాటుకుంది. మిగతా సోదరులు ధర్మరాజుతో ఎప్పుడూ వాదించలేదనీ, ధిక్కరించలేదనీ కాదు; కానీ అంతిమంగా అన్నగారి నిర్ణయానికి వారు బద్ధులు కావలసిందే; ద్రౌపదికి ఆ అగత్యం లేదు. కృష్ణుడు రాయబారానికి వెళ్లబోయే ఘట్టంలో మిగతా పాండవసోదరులకు, ద్రౌపదికి ఉన్న ఈ తేడా మరింత స్పష్టంగా వ్యక్తమవుతుంది. చివరికి భీముడితో సహా తమ్ముళ్ళు నలుగురూ అన్నగారి శాంతిసందేశానికి తల ఒగ్గినాసరే, ద్రౌపది యుద్ధపక్షానే గట్టిగా నిలబడుతుంది. కృష్ణ (ద్రౌపది మరో పేరు), కృష్ణుల మధ్య భావసారూప్యం కుదిరిన ఘట్టాలలో ఇది

కూడా ఒకటి. కృష్ణలానే కృష్ణుడు కూడా అంతిమంగా యుద్ధపక్షపాతే. ఇందులోకి కూడా ఇప్పుడు మరింత లోతుగా వెళ్లదలచుకోలేదు.

కృష్ణా–కృష్ణుల మధ్య ఉన్న సంబంధాన్ని చర్చిస్తూ, అది సఖీ–సఖా సంబంధమంటాడు లోహియా. అందులో ప్రణయ సంబంధమో, అలాంటి స్నేహ సంబంధమో ఉంటుందని నిశ్చితంగా చెప్పలేమనీ, అందులో శారీరకవాంఛా సంబంధమైన ప్రేమ ప్రసక్తి లేదని తన అభిప్రాయమనీ– దానిని వివరించబోతాడు. ఈ వివరణ ద్వారా అనవసరంగా ఆయన అపోహలకు, అపార్థాలకు అవకాశమిచ్చాడనిపిస్తుంది. ఇది పండితులు చెప్పే అన్నా–చెల్లెళ్ల సంబంధంలా అనిపించదంటూనే, చివరికి అన్నా–చెల్లెళ్ల సంబంధంతో సహా అన్ని సంబంధాలనూ ఒకచోట కలగాపులగం చేసి పిండితే వచ్చేదే సఖీ–సఖా సంబంధమంటాడు. అది బాగానే ఉందికానీ, సరళంగానూ, సూటిగానూ ఉన్నదాన్ని అనవసరంగా సాగదీసి సంక్లిష్టం చేశాడా అనిపిస్తుంది. వావి, వరసలను మనం చాలా సున్నితంగా చూస్తాము కనుక, మన ఆంతర్యంలో సదుద్దేశమే ఉన్నప్పటికీ, పైకి అపార్థానికి తావిచ్చే మాటలకు మనం అసంకల్పితంగానే దూరంగా ఉంటాం. ఇక్కడ లోహియాలో ఆ జాగ్రత్త కొంత తగ్గినట్టనిపిస్తుంది. అన్నా–చెల్లెళ్ల సంబంధంలో కూడా భావసారూప్యత ఉండవచ్చు, అది వారి మధ్య అదనపు సాన్నిహిత్యాన్ని కల్పించవచ్చు, అందులో అసహజమేమీ లేదు.

'ఒకవేళ పాతివ్రత్యం అన్న ఒక్క గుణం ఆమెలో లోపిస్తే లోపించవచ్చు, అంతమాత్రాన ఆమెకున్న మిగతా అమోఘమైన గుణాలను అన్నింటినీ విస్మరించి, ఆమెను గౌరవించకపోవడం చాలా అన్యాయ'మంటాడు లోహియా. ద్రౌపదిని భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే స్త్రీగా చూపడం అపార్థాలకు తావిస్తుందన్న సంగతిని గమనించుకుని, ఈసారి తగిన వివరణ ఇచ్చాడు. తన గుప్పిట్లో, అన్నివిధాలా తనదిగానే ఉండే ఒక నిర్జీవిని భార్యగా కోరుకుంటారా, లేక జ్ఞానమూ, తెలివీ, స్వతంత్రాలోచనా కలిగిన ఒక సజీవిని కోరుకుంటారా –అన్న ప్రశ్నను ముందుకు తేవడమే, ద్రౌపదిని భారతదేశ స్త్రీలకు ప్రతినిధిగా ప్రతిపాదించడంలో ఆయన ఉద్దేశం. అయితే, 'పాతివ్రత్యం అన్న ఒక్క గుణం ఆమెలో లోపిస్తే లోపించవచ్చు' అనే వాక్యం అనవసరమని నాకు అనిపించింది. అయిదుగురు భర్తలు ఉన్నంతమాత్రాన

ద్రౌపదిది పాతివ్రత్యం కాదని అనగలమా, పాతివ్రత్యాన్ని ఎలా నిర్వచించాలి, ఒకే భర్త, లేదా పలువురు భర్తలన్న ప్రాతిపదికపై నిర్వచించాలా, పాతివ్రత్య నిర్వచనాన్ని నేటి మన అవగాహనకు పరిమితం చేయడం సామాజిక, చారిత్రక పరిణామదృష్టిని ప్రతిబింబిస్తుందా అన్న ప్రశ్నలు తలెత్తుతాయి.

* * *

ద్రౌపది, సావిత్రుల గురించిన ఈ వ్యాసంలో నన్ను ఆకర్షించినవి మరికొన్ని ఉన్నాయి. మరణశయ్య మీద ఉండి భీష్ముడు చేసిన ఒక నీతిబోధకు లోహియా కల్పించిన అన్వయం వాటిలో ఒకటి. పురాణకథలను, అందులోని పాత్రలను, అవి చెప్పే నీతులను ఎలా అర్థం చేసుకోవాలో ఈ అన్వయం చెబుతుంది. ఇది చాలా ఉపయుక్తమైన మార్గదర్శనం. 'బుద్ధిమంతుడైనవాడు (బహుశా బుద్ధిబలం కలిగినవాడనే అర్థంలో లోహియా, లేదా అనువాదకుడు ఈ మాట వాడారనిపిస్తుంది) ఎవడూ ప్రభుత్వంలో ఏ పదవిలోనూ ఉండకూడ'దని భీష్ముడు అంటాడు. ఒక కోణంలో ఇది చాలా గొప్ప నీతి అని లోహియా అంటాడు. ఎలాగంటే, రాజపీఠాన్ని బుద్ధిబలం కలవాడు అధిష్ఠిస్తే, ఆ బలానికి అధికారబలం తోడవుతుంది కనుక, ఆ రెండూ కలసి ప్రపంచానికి తీవ్రనష్టం కలిగిస్తాయి, అదే రాజపీఠం మీద ఒక మూర్ఖుని కూర్చోబెడితే ప్రపంచం నాశనమయ్యే అవకాశాలు తగ్గుతాయన్నది భీష్ముడి ఉద్దేశంగా లోహియా వివరిస్తాడు. ఇలా చూసినప్పుడు ఈ వివరణ అర్థవంతంగానే కనిపిస్తుంది.

మళ్ళీ లోహియాయే భీష్ముడి నీతిబోధను వ్యతిరేకిస్తూ, రాజకీయలక్ష్యాలలో అధికారపీఠాన్ని గెలుచుకోవడం కూడా ఒకటి కనుక, రాజకీయాలలో పనిచేస్తూ అధికారం వద్దనుకునేవారే అసలైన మూర్ఖులంటాడు. నీతికి సంబంధించిన ఈ రెండు రకాల వివరణలనూ కలిపి అర్థం చేసుకోవాలంటూ, ఒక సమన్వయాన్ని ప్రతిపాదిస్తాడు. ఇటువంటి నీతులన్నీ ఏకపక్షంగా ఉంటాయనీ, ఈ కథలన్నీ ఏకపక్షమైన సత్యాన్ని చెబుతాయనీ, వాటిని స్థిరమైన నీతులుగానూ, సత్యాలుగానూ తీసుకోవడం పొరపాటనీ హెచ్చరిస్తాడు. పురాణ, ఇతిహాసకథలనూ, పాత్రలనూ ఆత్మీయం చేసుకుని; వాటి గురించిన ఆలోచనలను చిరకాలంపాటు బుద్ధిలో నానబెట్టుకున్నప్పుడే ఇలాంటి సమన్వయాలు స్ఫురిస్తాయి.

నన్ను ఆకర్షించిన మరో అంశం, తులసీదాసు రామాయణంలోని ఒక చతుష్పది (నాలుగు చరణాలు కలిగిన పద్యం)గురించి ఆయన రాసినది. స్త్రీ–పురుష సంబంధాలతో సహా వివిధ అంశాలలో తప్పుడు పునాదులపై అల్లిన సుందరకావ్యంగా తులసీ రామాయణాన్ని పేర్కొంటూనే, ఈ చతుష్పదిని ఒక మినహాయింపుగా ఆయన చెబుతాడు. శివపార్వతుల వివాహమైన తర్వాత పార్వతి తల్లి(మేనక) కూతురి గురించి పడిన దుఃఖాన్ని వెల్లడించే పద్యమది. "ఓరి భగవంతుడా, అసలు నువ్వు ఆడదాన్ని ఎందుకు సృష్టించావు, పరాధీనకు స్వప్నంలో కూడా సుఖమనేది ఉండ"దని పార్వతి తల్లి అనుకున్నట్టు అందులోని రెండు చరణాలు చెబుతాయి. ఇందులో, 'పరాధీనకు స్వప్నంలో కూడా సుఖమనేది ఉండ'దన్న రెండవ చరణాన్ని సందర్భంనుంచి విడగొట్టి స్వాతంత్ర్య సంగ్రామానికి ఎలా వాడుకున్నారో లోహియా చెబుతాడు. కాన్పూర్ నుంచి వెలువడే ఒక దినపత్రిక ప్రతిసంచికలోనూ ఈ చరణాన్ని మకుటంగా ముద్రించేదట. అంతకన్నా దారుణమేమిటంటే, తులసీరామాయణ పరిష్కర్తలు మొదటి చరణాన్ని పూర్తిగా తొలగించివేసి, దాని స్థానంలో 'మనసులో బాగా ఆలోచించుకుని చూడు' అనే అర్థమిచ్చే కొత్త చరణాన్ని తెచ్చి పెట్టారు! ఉపన్యాసకేసరులు మధ్యలో కాస్త ఊపిరి తీసుకోడానికి వాడే ఊతపదం లాంటి ఈ నిరర్థకవాక్యాన్ని తులసీదాసు వంటి మహాకవి ఎలా రాస్తాడని లోహియా ప్రశ్నిస్తాడు. భారతీయపురుషుల మనసులు బాగా కుళ్ళిపోయి, మురికిపట్టి ఉన్నాయి కనుకనే తమ మనసును గుచ్చుకునే అసలు వాక్యాన్ని తొలగించి, అక్కడ ఈ నిస్సారమైన వాక్యాన్ని చేర్చి దానిని ఆ మహాకవికి అంటగట్టారని అంటాడు.

మొదటి నుంచీ భారతీయసారస్వతం మొత్తానికి చీడలా పట్టుకున్న ఒక సమస్యను ఈవిధంగా ఆయన ముందుకుతెచ్చాడు. అసలుపాఠంలో తమకు అనుకూలంగా లేవనుకున్న చోట్ల ఇష్టానుసారంగా సవరణలు చేయడం, కొత్త పాఠాలు చేర్చడం, అందుకు వీలుగా లేని చోట్ల అసలు అర్థాన్ని మరుగుపుచ్చి కొత్త అర్థాలు కల్పించడం, లేదా ఆ ఘట్టాలను పూర్తిగా దాటవేయడం చూస్తూ ఉంటాం. భారతీయవాఙ్మయం వాగ్రూప దశను, తాటాకుల దశను దాటి అచ్చురూపం ధరించిన తర్వాత ఈ మకిలి పనులకు కొంత అడ్డుకట్ట పడిందనుకున్నా, కురచబుద్ధులు కొత్తదారులు వెతుకుతూనే ఉన్నాయి. ఇప్పటికీ ఇతిహాస, పురాణ ప్రవచనం చేసేవారు ఆయా ఘట్టాలను దాటించడం, లేదా అసలు అర్థానికి మసిపూయడం యథేచ్ఛగా

జరుగుతూనే ఉంటుంది. జనానికి వాటిలోని మంచినే ఎత్తిచూపాలన్న పేలవమైన సమర్థనను వీరు ముందుకు తెస్తారు. అది జనం వివేకాన్ని చిన్నబుచ్చడ మన్న స్పృహ వీరిలో ఉండదు. ముందు అసలు పాఠాన్ని పూర్తిగా చెప్పి, ఆ తర్వాత కాలానుగుణమైన తమ వ్యాఖ్యానాన్ని దానికి జోడించుకోవచ్చునన్న ఇంగితం లోపిస్తుంది. నిజానికి, ప్రాచీనగ్రంథాల ప్రచురణలో, ప్రచారంలో, అనువాదంలో అనుసరించవలసిన పద్ధతులు, పాటించవలసిన క్రమశిక్షణ, చూపవలసిన నిజాయితీ మనవారికి ఇప్పటికీ అలవడలేదు. అనువాదంలో మూలంలోని కొంత భాగాన్ని వదలి వేయడం, లేదా లేనివి చేర్చి పొడిగించడం, మూలంలోని లేని అర్థాలు చెప్పడం ప్రసిద్ధ ప్రచురణలలో సైతం ఇప్పటికీ కనిపిస్తుంది. ఈవిధంగా సారస్వతం మొత్తానికి జరిగిన, జరుగుతున్న ద్రోహమూ, నష్టమూ అంతా ఇంతా కావు. అయితే, ఇంత దారుణంలోనూ చిన్న ఓదార్పు ఏమిటంటే, ఇలాంటి చేతివాటంలోనూ వీరికి తగిన 'నేర్పు' ఉండదు కనుక, అసలు పాఠం పూర్తిగా వికృతమయ్యే దుస్థితినుంచి కొంతైనా తప్పించుకో గలుగుతోంది.

* * *

'కృష్ణుని విషయంలో ప్రతిదీ జతలుగా ఉంటాయి, ఇద్దరు తల్లులు, ఇద్దరు తండ్రులు, రెండు నగరాలు...' అంటూ, కృష్ణుడు, రాముడి గురించిన వ్యాసాన్ని లోహియా ఎత్తుకోవడమే ఆలోచనాత్మకంగా ఉంటుంది. పురాణపాత్రలన్నింటిలో కృష్ణుడితోనే లోహియా ఎక్కువ తాదాత్మ్యాన్ని, హృదయైక్యతను పొందినట్టు కనిపిస్తాడు. కృష్ణుని వ్యవహారసరళీ, వ్యక్తిత్వాల లోతుల్ని తరచి చూసే ఆయన ప్రయత్నం ఎంతో కొత్తగానూ, ఆసక్తిజనకంగానూ ఉంటుంది. శారీరకమైన పరిమితులను దాటి మానసికంగా మాత్రమే సాధ్యమయ్యే అపరిమితిలోకి వ్యాపించగల తత్వానికి చెందినవాడే కృష్ణుడని ఆయన అంటాడు. ఒక రాధను, లేదా ఒక మీరాబాయిని ఆవహించినట్టుగానే కృష్ణుడు ఆయన తలపుల్ని ఆక్రమించుకుంటాడు. కృష్ణుడు కడు గొప్ప ప్రేమికుడని, అందరితోనూ కలసిపోతాడు తప్ప ఎవరికీ దూరంగా ఉండడని, అతను ఘటనా ప్రపంచానికి చెందిన మానవలీలలను ప్రదర్శిస్తాడని అంటాడు. తనదైన ఒక పరిమితిలో ఉండిపోకుండా, తనది కాని ఇతరాలలోకి కూడా కృష్ణుడు విస్తరిస్తాడనీ, అలా విస్తరించడంలో సొంతాన్ని పూర్తిగా

వదిలేసుకుంటాడనీ అంటూ– అతని వ్యక్తిత్వ వైశాల్యాన్ని మనముందు పరుస్తాడు. ఇలాంటి ఆయన ఊహలు సాంప్రదాయిక చిత్రణలకు భిన్నంగానూ గమ్మత్తుగానూ ఉంటాయి.

కృష్ణుడు గోవర్ధనగిరిని ఎత్తడానికి కారణమైన ఇంద్ర–కృష్ణుల వైరానికి లోహియా అన్వయం కూడా అలాగే ఉంటుంది. తల్లి ఇంద్రుడికి అర్పించడం కోసం సిద్ధం చేసిన ప్రసాదాన్ని కృష్ణుడే ఎందుకు తినేశాడంటే, కేవలం అమృతంతోనే తృప్తిపడే ఇంద్రుడి కంటె, తను ఎంతో తినగలిగిన పెద్ద దేవుడు కనుకనేనట. అతని తిండికి పరిమితులుండవనీ, ఇదే కృష్ణలీలకు చెందిన వెల్లడి కానీ రహస్యమనీ, అమృతం స్వీకరించే దేవతల నుంచి, తిండి తినే దేవతలవరకు సాగే భారతయాత్రే కృష్ణలీల అనీ ఆయన అంటాడు. సురను సేవించే ఆకాశదేవుళ్ళను తరిమికొట్టి, ఈ నేలకు చెంది, వెన్నెముక, రక్తమాంసాలు కలిగి, తమ జాతిపట్ల గౌరవం చాటే వాళ్ళను కృష్ణుడు దేవుళ్ళను చేశాడని అంటాడు. ఈ నేల దేవుళ్ళు మన మధ్యలోనే ఉంటూ, మనతో కలసి భుజిస్తూ, మనల్ని ప్రేమిస్తూ, మనకు రక్షణ కల్పిస్తూ ఉంటారు కనుక; దేవుళ్ళ కోసం ఆకాశం వైపు చూడవద్దన్నది ఈ ఘట్టం నుంచి లోహియా పిండిన సందేశం.

ఈ ఆకాశదేవుళ్లు, నేల దేవుళ్ళ తేడాను ఆయన రాముడికి, కృష్ణుడికి అన్వయించిన తీరు కూడా ఆసక్తికరంగా ఉంటుంది. దానిప్రకారం, దేవుడు కావడానికి మనిషి చేసే నిరంతరప్రయత్నమే త్రేతాయుగపు రాముడు, మనిషి కావడానికి దేవుడు చేసే నిరంతరప్రయత్నమే ద్వాపరయుగపు కృష్ణుడు. దేవుడు అపరిమితుడు కనుక కృష్ణునిలో మానవుడికి అసాధ్యమనిపించే లక్షణాలతోపాటు, అసత్యం, మోసం, హత్య అనేవి కూడా ఉంటాయి. వాటిని అనుకరించాలనుకోవడం మూర్ఖత్వ మవుతుంది, కృష్ణునిలోని సాధ్య సంపూర్ణ మానవతా లక్షణాలపైనే దృష్టి పెట్టాలన్నది లోహియా హెచ్చరిక. ఆయన భావనలోని కృష్ణుడు ఏం చేసినా స్థిరచిత్తంతో చేస్తాడు, అది భుజించడం కావచ్చు, ప్రేమించడం కావచ్చు, రక్షించడం కావచ్చు. ఏ పనిని తలపెట్టినా, తన సమస్త అంగాలనూ దాని మీద కేంద్రీకరించి ఎంతో ఏకాగ్రతతో చేస్తాడు. ఆ సమయంలో 'తన' అనేదాన్ని పూర్తిగా కరిగించివేసుకుని, తనే ఆ పనిగా మారిపోతాడన్నమాట.

అనుభూతి పూర్వకాలైన ఇటువంటి భాష్యాలు ఆయన చింతనలో ఒక పార్శ్వం. భారతదేశపు సామాజిక, రాజకీయ, తాత్వికగమనాన్ని కృష్ణుడు, లేదా కృష్ణతాత్వికత ఎలా ప్రభావితం చేశాయి, కృష్ణుడు అవతారపురుషుడు కావడానికి అవే కారణమా అన్నది అర్థం చేసుకోవడానికి ఈ భాష్యాలు కొంత సాయపడవచ్చు. ఆ తర్వాత, నా లాంటివారికి ఎక్కువ ఆసక్తి కలిగించి, ఎక్కువ అర్థమయ్యే విషయాలలోకి కూడా ఆయన అడుగుపెడతాడు. అలాగని అవి అనుభూతిపూర్వక ఊహాస్పర్శ పూర్తిగా లేనివీ కావు. ఉదాహరణకు, త్రేతాయుగపు రాముడు భారతదేశపు ఉత్తర, దక్షిణ ఐక్యత కోసం ఉద్భవించిన దేవుడనీబీ ద్వాపరయుగపు కృష్ణుడు తూర్పు, పడమరల ఐక్యత కోసం ఉద్భవించిన దేవుడనీ ఆయన అంటాడు. తూర్పు, పడమరల మధ్య ఐక్యతను కూర్చడానికి కృష్ణుని ప్రయత్నాన్ని వివరించే ఉత్సాహంలో, వాటి మధ్య ఉన్న దూరాన్ని మైళ్ళ లెక్కల్లో కూడా ఇస్తూ వస్తాడు. మగధరాజు జరాసంధునితో కృష్ణుని వైరానికి, భీమునితో అతన్ని చంపించడానికీ లోహియా చెప్పిన కారణం కూడా ఆసక్తికరంగా ఉంటుంది. అప్పట్లో ఉత్తర, పశ్చిమప్రాంతాలే ఎక్కువ చైతన్యవంతంగా ఉండేవట; మగధరాజ్యం దానికి దూరంగా, పాతబడి, విస్తరించకుండా ఉండిపోయిందట, త్రికాలజ్ఞుడైన కృష్ణుడు, బహుశా ముందు జరగబోయే విదేశీ దురాక్రమణలను కూడా ఊహించుకుని, భారతదేశ ఐక్యతకు కీలకంగా నిలిచే కేంద్రస్థానాన్ని నిర్మించడం కోసమే మగధరాజ్యాన్ని నాశనం చేసి కురురాజ్యాన్ని బలోపేతం చేయదలచుకున్నాడట.

తూర్పు-పడమరలను, ఉత్తర-దక్షిణాలను ఐక్యం చేయాలనీ, దేశ ఐక్యతకు కీలకమైన కేంద్రనిర్మాణం జరపాలనీ ఆనాడే అనుకున్నారనడం చాలా అవాస్తవికంగా కనిపిస్తుంది. ఈ రోజున ఒక 'దేశం'గా భారతదేశం గురించి ఉన్న కల్పన ఆనాడు ఉందా, ఉండడం సాధ్యమా అన్నది ప్రశ్న. జనాల మధ్య ఐక్యతను కూర్చడంలో కృష్ణుడు ఒక ముఖ్యపాత్ర పోషించి ఉండవచ్చు; అదే ఆయనను అవతారపురుషుణ్ణి చేసి ఉండవచ్చు. అయితే, నా ఉద్దేశంలో అది ప్రాదేశిక ఐక్యత కాదు, కోశాంబీ దృష్ట్యా చెప్పుకుంటే, వివిధ ఆరాధనా పంథాల వారిని ఒక పంథా కిందికి తేవడం ద్వారా ఒక మతైక్యతను తీసుకురావడానికి కృష్ణుడు ప్రయత్నించాడు. రెండోది, విదేశీ దురాక్రమణలను ముందే ఊహించి ఆయన బలమైన కేంద్రనిర్మాణాన్ని

తలపెట్టాడన్న లోహియా ఊహ ఒకవేళ నిజమే అనుకున్నా, ఆ ఆశయం నెరవేరలేదు, దురాక్రమణలు జరగనే జరిగాయి.

చరిత్రకాలానికి వచ్చేసరికి, మహాభారతంలో చెప్పిన దాని కన్నా అతి పెద్దదిగా మారి; భారత, ఉపఖండంలో ఎక్కువ భాగానికి విస్తరించిన మగధరాజ్యం ఒకటి కుప్పకూలనే కూలింది. 'ఆర్యావర్త' విస్తరణలో భాగంగా దానిని అన్వయించడం కనిపిస్తుంది. నా ఉద్దేశంలో అది చాలా బలమైన అన్వయం. ఉదాహరణకు, క్రీ.పూ. రెండవ శతాబ్దికి చెందిన పతంజలి, 'మహాభాష్యం' పేరిట పాణిని సంస్కృతవ్యాకరణాసూత్రాలకు తను చేసిన వ్యాఖ్యానంలో ఆర్యావర్తాన్ని మగధరాజ్యానికి ఇవతలి వరకే గుర్తిస్తాడు. పతంజలి తర్వాతి కాలానికి చెందినదిగా గుర్తించిన మనుస్మృతికి వచ్చేసరికి వింధ్య, హిమాలయాలు, తూర్పు, పడమర సముద్రాల మధ్యనున్న ప్రదేశమంతా ఆర్యావర్తంగా మారింది. అంటే, మగధరాజ్యం పతనమైన తర్వాతే ఆర్యావర్తం పైన చెప్పిన మేరకు విస్తరించిందన్న మాట. లోహియా ఊహల వెలుగులో ఇప్పుడు ఆలోచిస్తే, కృష్ణుని సారథ్యంలో జరిగిన మగధరాజు జరాసంధుని ఓటమికి, చరిత్రకాలంలో మౌర్యుల ఏలుబడిలోని మగధరాజ్య పతనానికి మధ్య ఏకసూత్రత ఏర్పడుతోంది. ఈ రెండో మగధరాజ్య పతనం వెనుక ఆర్యావర్త విస్తరణ శక్తులు ఉన్నాయనుకుంటే, జరాసంధుని అడ్డు తొలగించుకోవడం వెనుక కూడా అదే లక్ష్యం ఉందేమోననిపిస్తుంది. ఆర్యావర్త విస్తరణ అన్నప్పుడు దానిని ఆర్యసంస్కృతీ విస్తరణగానే తీసుకోవాలి తప్ప, ప్రాదేశికవిస్తరణగా కాదు.

ఈ ఆర్యావర్త విస్తరణ కోణాన్ని లోహియా దాటవేశాడు. రాముడు ఉత్తర–దక్షిణభారతాల మధ్య ఐక్యతను తీసుకొచ్చాడన్న ఆయన ఊహకూ ఇదే వర్తిస్తుంది. రాముని వనవాసం దేశాన్ని ఒకే గొడుగు కిందికి తెచ్చే ఉద్దేశంతో సాగిందని ఆయన అంటాడు కానీ; అతను చేసింది కూడా దక్షిణానికి ఆర్యావర్త ప్రభావాన్ని విస్తరింపజేసే ప్రయత్నమే. అక్కడికీ రాముని వనవాసానికి గల 'విస్తరణ' స్వభావం ఆయన అంతఃకరణను సలుపుతూనే ఉన్నట్టుంది. స్పష్టంగా ఆ మాటను వాడనే వాడాడు. 'రామకథలోని విలీనానికి (సుగ్రీవుడి కిష్కింధను, రావణుని లంకను తన రాజ్యంలో కలుపుకోలేదన్న అర్థంలో) దూరమైన విస్తరణ, సామ్రాజ్యకాంక్షలేని సంఘీభావం, అంతర్జాతీయ సంబంధాలలోనూ, క్రియాశీల రాజకీయాల్లోనూ

చురుకుగా పనిచేసిన పరిమితమూర్తిమత్వం శత్రుశిబిరాల్లోని మంచి మిత్రులను వెతుక్కుంటూ సాగిపోయిం'దంటాడు.

పైపైన చూసినప్పుడు, రాముడిలో ఈ సుగుణాలన్నీ నిజంగానే ఉన్నాయనీ, ఆయనలో విస్తరణకాంక్ష లేనేలేదనీ అనిపిస్తుంది. కానీ కాస్త లోతుకు వెళ్ళి తర్కించినప్పుడు అవి అవాస్తవికమైన ఊహలుగా తేలిపోతాయి, రాముడు కిష్కింధను, లంకను విలీనం చేసుకోకపోవడంలో ఆదర్శాన్ని మించి అనివార్యత ఉంది. అప్పటికి ఒక 'దేశ'మనే కల్పనకే కాదుకదా, 'సామ్రాజ్య' భావనకూ అవకాశం లేదు. ఉత్తర భారతంలోని ఒక కేంద్రస్థానం నుంచి దక్షిణాది వరకూ పరిపాలన సాగించడానికి అవసరమైన రాకపోకల సదుపాయాలు, సమాచారవ్యవస్థ, పాలనాయంత్రాంగం అప్పటికి ఉండగల అవకాశమూ లేదు. మౌర్యుల కాలం వరకూ అలాంటివి ఊహకే అందని విషయాలు. అప్పుడు కూడా వాటికున్న అవకాశం తక్కువే. కనుక రాముని వనవాసాన్ని ఆర్యసంస్కృతీ విస్తరణగా చూడవలసిందే తప్ప ప్రాదేశిక విస్తరణగా కాదు.

అదీగాక, ఈ ఆర్యావర్తవిస్తరణ అనేది ఏకపక్షం, సమానుల మధ్య సమైక్యతను తేవడానికి ఉద్దేశించినది కాదు, బలవంతుడు బలహీనుల మీద విధించదలచుకున్న నిర్బంధ ఐక్యత. లోహియా ఇందులోని అసమైక్యతా లక్షణాన్ని పక్కనపెట్టి దీనిని ఐక్యతగా చూపించబోయాడు. దానివెనుక స్వాతంత్ర్యోద్యమ కాలానికి బలపడిన జాతీయరాజ్యమనే ఆదర్శం కలిగించే భావావేశం ఉంది. ఆధునికకాలానికి చెందిన 'భారతదేశం' గురించిన కల్పన ఉంది. అంతర్గత భిన్నత్వాన్ని మరుగుపుచ్చి దేశం మొత్తాన్ని ఏకఖండంగా చూపించే తహతహ ఉంది.

అందులో తప్పు పట్టవలసింది కూడా ఏమీలేదు. లోహియా స్వాతంత్ర్యోద్యమ కాలానికి చెందినవాడు. భారత్‌ను భౌగోళికంగా కూడా ఆధునిక జాతీయరాజ్యంగా మలచడం ఆ ఉద్యమంలో భాగం. దేశం గురించిన ఆ కల్పనలో, అది కలిగించే స్ఫూర్తిలో, భావావేశంలో లోహియా కూడా భాగస్వామి. స్వాతంత్ర్యోద్యమం అనే ఒక ప్రత్యేక సందర్భం ఆయన ఆలోచనలకు, ఆదర్శాలకు విధించిన పరిమితి అది. ఆయన ఉత్తరభారతీయుడు కావడం కూడా ఆయన ఊహలకు ఒక పరిమితిని విధించి ఉండవచ్చు. ఎంతైనా ఆయన కూడా మానవమాత్రుడే. అలాగని ఒక

ఆలోచనాశీలిగా తూర్పు-పడమర, ఉత్తర-దక్షిణాల మధ్య ప్రాంతీయంగా ఉన్న వైరుధ్యాలను ఆయన గమనించలేదని కాదు. వాటి పరిష్కారాన్ని ఆయన స్వాతంత్ర్యోత్తర భారతీయ సమాజ నిర్మాణదశకు వాయిదా వేశాడు, అందుకు సంబంధించిన అజెండాను కూడా తయారు చేసుకున్నాడు. ఈ పుస్తకంలోని వ్యాసాలు ఆ అజెండాను కూడా ముందుకు తెస్తాయి.

* * *

రాముడు, కృష్ణుడు, శివుడి వ్యక్తిత్వాల గురించి, వాటి మధ్య తేడాల గురించి లోహియా చేసిన విశ్లేషణ కూడా ఎంతో కొత్తగానూ, ఆసక్తిదాయకంగానూ ఉంటుంది; మనకు అలవాటుగానూ, పరిపాటిగానూ మారిన సాంప్రదాయికపు చూపునుంచి వారిని తప్పించి వినూత్నమైన చూపులో అది ప్రతిష్ఠిస్తుంది. ఆ విధంగా వారిని సజీవమూ, సమకాలీనమూ చేసి మన మానసిక, సాంస్కృతిక జీవనంలో భాగం చేయడానికి లోహియా ప్రయత్నిస్తాడు. రాముడు ఆదర్శవాదీ, ఏకరూప ఐక్యతా నిర్మాతా, దానికి ప్రతీకా కూడా అయితే, కృష్ణుడు ఆదర్శవాదపు బహురూప ఐక్యతా నిర్మాత అంటాడు. ఏకరూప ఐక్యతా నిర్మాతలుగా రాముడికీ, జరాసంధుడికీ మధ్య ఆయన పోలిక తెస్తాడు. కాకపోతే, జరాసంధుడు భౌతికవాది. కృష్ణ, జరాసంధుల మధ్య యుద్ధం ఆదర్శ-భౌతికవాదాల మధ్య యుద్ధంగా చెప్పడం కొంతవరకు సమంజసమే కానీ పరిపూర్ణమైన ఆలోచన కాదంటాడు. తనకు తెలిసి ఇప్పటి వరకు భారతదేశపు నిర్మాణం భౌతికవాద బహురూప ఏకత్వ ఆధారంగా ఎన్నడూ జరగలేదనీ, ఆదర్శవాదం, భౌతికవాదం కలసిమెలసి వ్యవహరించే బహురూప ఐక్యత ఆధారంగా అది జరగవలసి ఉందనీ, ఆవిధంగా కృష్ణుని ప్రయత్నమే అన్నింటికీ మించి ఆమోదయోగ్యమనీ, అందులో త్రికాలజీవనం కనిపిస్తుందనీ అంటాడు.

అయితే, ఆయన ఆనుకూల్యత మార్చి మార్చి రామ, కృష్ణుల చుట్టూ చక్రభ్రమణం సాగిస్తుంది. ఆ తర్వాత వారి పక్కన శివుడు కూడా వచ్చి చేరతాడు. ఈ ముగ్గురినీ, 'పనిగట్టుకుని మానవప్రవర్తనకు, ఆలోచనా విధానానికి నమూనాలుగా మార్చదలిస్తే వాళ్ళను దిగజార్చినట్టే, వాళ్ళు సకలభారతావనికి కణజాలం, రక్తమాంసాలు' అంటాడు. '(ఈ ముగ్గురూ) భారతదేశపు మూడు

మహోత్కృష్ట స్వప్నాలు. ఏ స్వప్నం దారి దానిదే. రాముడు నియమిత వ్యక్తిత్వానికి, కృష్ణుడు అఖండ సంపన్నమైన వ్యక్తిత్వానికి, శివుడు అనంత వ్యక్తిత్వానికి సమగ్రతను కూర్చినవారు' అంటూ వారి వ్యక్తిత్వాలను నిర్వచిస్తాడు. వీరి పరిమిత, అపరిమిత, అనంత వ్యక్తిత్వాలను సోదాహరణంగా ఆయన వివరించిన తీరు కూడా ఆకట్టుకుంటుంది.

ఉదాహరణకు, సీత అనే ఒకే స్త్రీపైనే జీవితాంతం దృష్టి నిలపడం రాముని పరిమిత వ్యక్తిత్వానికి ఒక సూచన. ఆయన కథంతా ఆమెకు సంబంధించిన ఘటనల చుట్టూనే అల్లుకుంది. ఇందుకు భిన్నంగా అనేకమంది ప్రియురాళ్ళు ఉండడం, గోపికలతో రాసకేళిలో మునిగి తేలుతూ, వారిని చలింపచేస్తూనే తాను అచలంగా ఉండడం కృష్ణుని అపరిమితవ్యక్తిత్వం. రాముడు, కృష్ణుడు మానవులుగా జీవించగా శివుడు ఆద్యంతాలు లేని అనంతుడు. బహుశా మనిషికి తెలిసినంతలో శివుడు ఒక్కడే పరిమితి లేని కల్పిత గాథ, లేదా భావన అంటాడు లోహియా. కాముని శివుడు అశరీరుని చేయడంపై లోహియా అన్వయం కూడా నూతనంగా ఉంటుంది. అప్పటినుంచి తనకు శరీరం లేదు కనుక కాముడు ఎక్కడైనా ఉండవచ్చు, ఎవరిలోనైనా ప్రవేశించవచ్చు, నిషేధమన్నది లేదు. అతడు విసిగించినా అది బయటికి కనిపించదు. పార్వతి మరణానంతరం శివునిలో పెల్లుబికినది అసురదుఃఖం అంటాడాయన. అతడు పార్వతి మృతదేహాన్ని వీపు మీద, భుజాల మీద మోస్తూ దేశమంతా తిరిగాడు, ఆమె చివరి శరీరభాగం పడిపోయేవరకూ తిరిగాడు, మరే ప్రేమికుడూ అలాంటి అరమరికలు లేని సాహచర్యపు సంపూర్ణగాథను మనకు అందించలేదంటాడు. శివుని గాథ భారతదేశపు నశింపులేని, పవిత్రమైన అఖండతను పట్టి చూపుతుందని అంటూ, పార్వతి శరీరభాగాలు పడిపోయిన ప్రతిచోటా పవిత్రతీర్థాలు వెలిసిన సంగతిని ఉదహరిస్తాడు. పార్వతి చెవిపోగు పడిన వారణాసిలోని మణికర్ణికను, తూర్పున కామరూప్‌ను పేర్కొంటాడు.

అమ్మవారి ఆరాధనా ప్రాంతాలు పశ్చిమం నుంచి తూర్పువైపు సాగుతున్న కొద్దీ ఎక్కువగా కనిపిస్తాయని నేను అనుకుంటాను. దీనిని అంత లోతుగా నేనింకా శోధించలేదు. పై సందర్భంలో, 'తూర్పు ప్రాంతపు స్త్రీలు వాళ్ళ వాళ్ళ మగవాళ్ళను మంత్రతంత్రాలతో మచ్చికయ్యే పశువులుగా మార్చేస్తా'రని అమ్మమ్మలు, నాయనమ్మలు హెచ్చరిస్తూ ఉంటారని లోహియా అనడం నా ఊహకు అదనపు బలం.

న్యాయమైనది కాదని తేల్చి చెప్పగల ఏ ఒక్క పనీ శివుడు చేయలేదని లోహియా అంటాడు. శివుడు ఏ పని చేసినా అది తనకు తనే సమర్థనీయతను తెచ్చుకుంటుందంటాడు. అలాంటి ఏకైక సృజనకర్తగా మనిషి శివుని గుర్తించాడని ఆయన వివరణ. దేవుడే కానీ, మనిషే కానీ తమ చర్యలకు ఏదో ఒక విధమైన సమర్థనను కల్పించుకునే ప్రయత్నంలో హేతువాద కౌశల్యం వికటించి అన్యాయాన్ని కూడా న్యాయంగా చూపిస్తుందనీ, దానినుంచి తప్పించే ఏకైకమార్గం శివభావనేననీ అంటూ, శివతత్వాన్ని వినూత్నంగా వ్యాఖ్యానిస్తాడు. ఆవిధంగా శివుడు తక్షణసిద్ధాంతపు అవతారమనీ, అతని ప్రతిచర్యలోనూ తక్షణ సమర్థనీయత నిండి ఉంటుందనీ అంటాడు.

రామ, కృష్ణులు కేంద్రంగా ఆయన ఊహల చక్రభ్రమణం కూడా ఆసక్తికరంగా ఉంటుంది. ఒక కోణంలో కృష్ణుని కన్నా రాముడు సాధించినదే అధికమంటాడు. రామునికి గమ్యం ఉంది కానీ, కృష్ణుడు అగమ్యుడంటాడు. పాపం కృష్ణుడు ఎంత నిస్వార్థంగా కృషిచేసినా ప్రజల మనసుల్లో మాత్రం రాముడే ముందంజలో ఉన్నాడంటాడు. రాముడిలాంటి ఒక పరిమిత మూర్తిమత్వం గొప్పదీ, అర్థవంతమైనదీ కావడం; కృష్ణుడి లాంటి అఖండ మూర్తిమత్వం అల్పమూ, సగమూ కావడం–కనీసం రాజకీయరంగంలో నైనా –ఒక ప్రహేళికలాంటిదంటాడు. మళ్ళీ ఇద్దరిలో ఎవరు అధికులో తేల్చి చెప్పడమూ కష్టమేనంటాడు.

రామ, కృష్ణుల వ్యక్తిత్వాన్ని ఆయన రాజ్యాంగబద్ధప్రజాస్వామ్యానికి అన్వయించిన తీరు అబ్బురంగానూ, ఆలోచనాత్మకంగానూ ఉంటుంది. రాముడు రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం తరహా నియమితమూర్తిమత్వం కలవాడైతే; కృష్ణుడు తన తెలివైన తీర్పులతో అవసరమైనప్పుడు రాజ్యాంగనియమాలను అతిక్రమించే అధిష్ఠానవర్గం లాంటివాడు. రాముని రాజ్యాంగబద్ధ పరిమిత అస్తిత్వానికి సీతాపహరణ ఘట్టాన్ని ఆయన ఉదాహరణగా చూపుతాడు. సీత ఒంటరిగా ఉన్నప్పుడు లక్ష్మణుడు ఆమె చుట్టూ ఒక గీతగీసి, ఎట్టి పరిస్థితిలోనూ దానిని దాటవద్దని చెబుతాడు. అప్పుడు భిక్షకుని రూపంలో రావణుడు వస్తాడు. సీత ఆ గీత లోపల ఉన్నంతవరకూ రావణుడు ఏమీ చేయలేడు, సీతకూ ఎలాంటి ప్రమాదమూ ఉండదు, కానీ ఆమె గీత దాటేసరికి ప్రమాదంలో పడింది.

తన అధికారం చుట్టూ ఏర్పరచుకున్న నియమాలను రాముడు ఎన్నడూ ఉల్లంఘించక పోవడం రెండు, మూడు సందర్భాలలో అతనికి కళంకాన్నే తెచ్చిపెట్టిందని లోహియా అంటాడు. ఒక రజకుడు సీత శీలాన్ని శంకించే మాటలన్నందుకు రాముడు ఆమెను విడిచిపెట్టడం వాటిలో ఒకటి. ఆ మాటలు తుచ్ఛమైనవైనా రాజుగా నియమానుసారం తను వాటిపై స్పందించి చర్య తీసుకోవలసిందే. అది బుద్ధిమాలిన చర్యే అయినా, తను విధించినది క్రూరమైన శిక్షే అయినా రాముడు నియమానికే కట్టుబడ్డాడు, తప్ప దానిని మార్చలేదు. మరోవైపు, వ్యక్తిగా తను తీసుకున్న ఆ చర్యకు అతను జీవితాంతం దుఃఖించాడు. ఒక్కోసారి కళంకాన్ని తెచ్చిపెట్టినాసరే రాజ్యాంగనియమబద్ధంగా నడుచుకోవలసిన అవసరాన్ని లోహియా ఈ ఉదంతం ద్వారా మన దృష్టికి తెస్తాడు. ఆవిధంగా రాజుగా రాముని ఒక గొప్ప ఆదర్శంగా చూపిస్తాడు.

మళ్ళీ కృష్ణుడిది భిన్న వ్యక్తిత్వం. లోహియా అభివర్ణనలో కృష్ణుడు దొంగ, అబద్ధాలకోరు, మోసగాడు, హంతకుడు, కొంచెమైనా పశ్చాత్తాపం లేని నేరాలకు పాల్పడినవాడు. కర్ణుని రథం భూమిలోకి కుంగిపోయిన సందర్భం ఒక గొప్ప దృష్టాంతం. ఆ సమయంలో కర్ణునిపై బాణాలు సంధించమని అర్జునుని కృష్ణుడు ప్రోత్సహిస్తాడు. కర్ణుడు అది తగని పని అంటూ అభ్యంతరం చెబుతాడు. ఆ దశలో చెలరేగిన వాగ్యుద్ధానికి సాటి వచ్చేది మరెక్కడా కనిపించదని లోహియా అంటాడు. అప్పుడు కృష్ణుడు గతంలో జరిగిన ఎన్నో సంఘటనలను ఏకరవు పెడుతూ, 'ఆనాడు నీ నీతి ఏమైం'దని మాటి మాటికీ కర్ణుని దెప్పిపొడుస్తాడు. కృష్ణుని ఆ వాగ్విలసనంలో కాసేపైనా ఇతరమైన తీర్పులన్నీ మూగవోయాయనీ, విశ్లేషణాత్మక బుద్ధికుశలత అంతా ఊడ్చుకు పోయిందనీ లోహియా వ్యాఖ్య. రాజ్యాంగ నియమాలను అతిక్రమించే కృష్ణుని అఖండ, అపరిమిత వ్యక్తిత్వాన్ని ఇందులో గమనించాలన్నది ఆయన ఉద్దేశంలా కనిపిస్తుంది.

నాకెందుకో రామ,కృష్ణుల వ్యక్తిగత వ్యవహరణను, రాజకీయవ్యవహరణను లోహియా కలగాపులగం చేశాడా అనిపిస్తుంది. వ్యక్తులుగా వారిపట్ల తనకున్న సానుకూల భావావేశం, వారి వ్యవహరణలోని రాజకీయాంశను కప్పివేసి, దానిని మించిపోయిందేమోనని తోస్తుంది. రాముడు వ్యక్తిగానూ, రాజుగానూ నియమబద్ధుడే,

అదే సమయంలో రాజకీయ అవసరాల రీత్యా నియమాలను పక్కన పెట్టే రాజకీయవాది కూడా. వాలిని చెట్టు చాటునుంచి చంపడంలో మోసమున్నా రాజకీయంగా అది అవసరం కనుక అలా చేశాడు. ఆ రాజకీయచర్యను ఆయన వ్యక్తిగత నియమబద్ధత నుంచి చూసి వ్యాఖ్యానించడం, రెండింటినీ కలగాపులగం చేయడం అనవసరమేమో! ఆ తర్వాత తను చేసిన పని మంచిదా, చెడ్డదా అన్న ద్వైధీభావనకు ఆయన లోనై ఉండవచ్చు, ఉండకపోవచ్చు, అది అవసరం లేని వివరం మాత్రమే.

స్వపక్షంనుంచి తన పక్షంలోకి ఫిరాయించి, తద్వారా స్వపక్షంలో దేశద్రోహిగా ముద్ర వేయించుకున్న రావణుని తమ్ముడు విభీషణుని రాముడు దగ్గరకు తీయడం కూడా రాజకీయ అవసరమే. దానిని రాముని వ్యక్తిగతంలోకి తీసుకొచ్చి వ్యాఖ్యానించడం కూడా అనవసరమే. ఇలాగే కృష్ణుని నడవడిలో కూడా వ్యక్తిగతాన్ని, రాజకీయాన్ని విడదీసి చూడవలసిందే ననుకుంటాను. కొని సందర్భాలలో రాజకీయ వ్యవహరణకు సంబంధించిన మంచి–చెడులను వ్యక్తిగతంలో కలపకుండా విడిగానే చూసి తీర్పు చెప్పవలసి ఉంటుంది. వ్యక్తిగత నియమబద్ధత తన ప్రజలకోసం, లేదా తనవారి కోసం, రాజకీయాలలో అనైతికంగా కనిపించే చర్యలు, నియమోల్లంఘనలు శత్రువులపై విజయం కోసం, లేదా అంతర్జాతీయ సంబంధాలలో దేశ ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం! నేటి రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యదేశాల వ్యవహరణలో కూడా ఈ తేడాను మనం చూస్తూనే ఉంటాం. ఈ తేడాను దృష్టిలో పెట్టుకోవలసి ఉంటుందని చెప్పడమే ఇక్కడ నా ఉద్దేశం తప్ప రాజకీయాలలో అనైతికతను సమర్థించడం కాదు.

లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు, చెవులు కోయడాన్ని రాముడు వారించకపోవడం ఆయన వ్యక్తిత్వానికి పెద్ద మచ్చే. లోహియా ఈ ఘటనను ప్రస్తావించి కూడా రాముడి మౌనాన్ని ప్రశ్నించకపోవడం లోటుగానే కనిపిస్తుంది. అది అనుకోని విస్మరణే తప్ప ఉద్దేశపూర్వకం కాకపోవచ్చు. అదలా ఉంచితే, లక్ష్మణుని చర్య వెనుకే కాక, రాముని తాటక సంహారం, కృష్ణుడు పూతనను వధించబోవడం తదితర ఘటనల్లో కూడా స్త్రీ, పురుషస్వామ్యాల స్పర్థకు సంబంధించిన మరో కోణం ఉంది. స్త్రీపై విజయాన్ని పురుషవీరోచిత చర్యగా భావించిన ఒక దశ మనదగ్గరే కాక,

దాదాపు ప్రపంచంలోని పురాతన సంస్కృతులన్నింటిలో కనిపిస్తుంది. ఆ మేరకు పురాణకథలను పురుషకేంద్రితంగా మార్చడమూ జరిగింది. దీని గురించి 'మంత్రకవాటం తెరిస్తే మహాభారతం మన చరిత్రే' అనే నా పుస్తకంలో విస్తృతంగా రాశాను.

రావణుడు మరణదశలో ఉన్నప్పుడు, అతని దగ్గరికి వెళ్ళి పద్ధతులు, పాఠాలు నేర్చుకోమని రాముడు లక్ష్మణుని పంపుతాడు. అతనిలోని మర్యాదా పురుషోత్తముని లక్షణంగా దానిని చూపించి లోహియా ప్రశంసించడం బాగానే ఉంది. అయితే, తనే ఎందుకు వెళ్లలేదు, వెళ్లినందువల్ల తన ప్రతిష్ఠ, రావణుని ప్రతిష్ఠ కూడా మరింత పెరిగి ఉండేవి కదా అనిపిస్తుంది. భీష్ముడు మరణశయ్యపై ఉన్నప్పుడు ధర్మరాజు స్వయంగా వెళ్ళి అతని దగ్గర రాజనీతిపాఠాలు నేర్చుకుంటాడు. ఇక్కడ రామ–రావణ సంబంధానికి, ధర్మరాజు–భీష్ముల సంబంధానికి ఉన్న తేడాను, ఇతర అంశాలను ముందుకు తెచ్చి రాముడు వెళ్లకపోవడాన్ని సమర్థించే అవకాశం లేకపోలేదు. అయితే, రాముడు స్వయంగా వెళ్లడంలో ఇనుమడించే అతని వ్యక్తిత్వపు మెరుపు ముందు ఏ సమర్థనలైనా తేలిపోతాయి.

లోహియా సానుకూల భావావేశం రామ, కృష్ణుల మధ్య నిర్విరామంగా ఊగిసలాడుతూ చివరికి ఉభయుల వ్యక్తిత్వాల మధ్య ఒక సమన్వయాన్ని కల్పించడం దగ్గర ఆగుతుంది. 'హిందూదేశానికి కృష్ణుని బహుముఖీన ఐక్యతను అందించండి. రాముని తరహా ద్విజ, శూద్రవిభజనను నిర్మూలించండి. అయితే, సత్యమూ, నియమపాలనా కొనసాగిస్తూ రాముడు ఏర్పరచిన హద్దుల బాటలోనే నడవం' దన్నది ఆ ఐతిహాసిక వ్యక్తిత్వాలనుంచి ఆయన పిండి తీసి ఈ కాలానికి అందించిన సారం. అన్నట్టు ఇక్కడ శివుని ఎలా మరచిపోగలం! ఆయన ఊహలో ఉన్నది కేవలం రామకృష్ణతత్వమే కాదు, శివరామకృష్ణతత్వం కూడా. 'శివుని మనసును, కృష్ణుని హృదయాన్ని, రాముడి మాటలను చేతలను మాకు ఇవ్వు; మమ్మల్ని పరిమితిరహిత మనస్కులుగానూ, విశాలహృదయులుగానూ సృజించి పరిమితులు గల జీవితాన్ని అందించు' అని భరతమాతను ప్రార్థిస్తూ ఆయన ఈ ముగ్గురి వ్యక్తిత్వ, తాత్విక విచారాన్ని ముగిస్తాడు.

* * *

పౌరాణికతతో రాజకీయాంశ ఎక్కువ పెనవేసుకున్న వ్యాసం, 'వసిష్ఠుడు: వాల్మీకి'. అందులో కూడా అది ఒక అసాధారణ ప్రత్యేకత కలిగినది. నెహ్రూలో ఆశ్చర్యకరమైన ఒక భిన్నపార్శ్వాన్ని చూపించడానికి అది ప్రయత్నిస్తుంది. ఆ పార్శ్వం అంత ప్రచారంలో లేనిదే కాదు సరికదా, స్వాతంత్ర్యోత్తరకాలానికి చెందిన జనాల ఊహకు కూడా అందనిది. అది కేవలం లోహియా ఆపాదనా, లేక వాస్తవమా అన్న చర్చను అలా ఉంచితే; అడుగడుగునా అది ఆసక్తిని, ఆలోచనను రేకెత్తిస్తుంది.

ఆయన నెహ్రూలో వసిష్ఠ బ్రాహ్మణత్వం మూర్తీభవించిందంటాడు. దాని రూపురేఖలను వివరిస్తూ, నెహ్రూలో అదెలా వ్యక్తమైందో చెబుతాడు. ఆ చెప్పడంలో కూడా నెహ్రూపై అత్యంత పరుషమైన, నిర్దాక్షిణ్యమైన విమర్శను గుప్పిస్తాడు. అంతర్లీనంగా ధ్వనించే ఒక ధర్మాగ్రహం ఆ పరుష విమర్శకు నైతిక సమర్థనను కల్పించేలా ఉంటుంది. నెహ్రూకు వ్యక్తిగతంగా సన్నిహితుడు, కుటుంబమిత్రుడైన వ్యక్తి నుంచి అలాంటి విమర్శ రావడం మనల్ని మరింతగా ఆశ్చర్యచకితం చేస్తుంది. సన్నిహితుడు, కుటుంబమిత్రుడు అవడం వల్లనే ఆ విమర్శ చేయగలిగాడేమో కూడా!

రాజకీయం పాలు ఎక్కువ ఉన్న వ్యాసమే అయినప్పటికీ, పౌరాణికపాత్రలైన వసిష్ఠ, వాల్మీకులు ప్రాతినిధ్యం వహించే భిన్న పరంపరల మధ్య ఉన్న తేడాల మీదుగా నడిపించడం వల్ల ఇది ఈ పుస్తకంలో ఒదుగుతోంది. నాలాంటి వారికి ఆకర్షణా, ఆసక్తీ, ఉత్సాహమూ గొలిపేదీ కూడా అదే. నెహ్రూ ఢిల్లీలో ప్రధాని పీఠంమీద ఉన్నప్పుడే లోహియా లక్నోలోని జైల్లా జైలులో నిర్బంధంలో ఉన్నాడు. బ్రిటిష్ ప్రభుత్వం పోయి సొంత ప్రభుత్వం వచ్చినా జైళ్లను భర్తీచేయడంలో మాత్రం ఎలాంటి మార్పులేదు; జైళ్ల నిర్వహణలోనూ, వాటిని నరకకూపాలుగా ఉంచడం లోనూ, ఖైదీలపట్ల వ్యవహరించే అమానుష ధోరణిలోనూ మార్పు లేకపోగా పరిస్థితి మరింత దిగజారింది. దీనినంతటినీ ఏకరువు పెడుతూ లోహియా ఉత్తరప్రదేశ్ జైళ్లమంత్రికి రాసిన సుదీర్ఘలేఖ ఈ వ్యాసరూపం ధరించింది, లేదా లేఖ రూపంలోనే ఆయన ఈ వ్యాసం రచించి ఉండవచ్చు.

నరేర్కర్ అనే రచయిత రాసిన 'భూమి కన్య సీత' అనే నాటకం మీదుగా నెహ్రూపై తన విమర్శలకు లోహియా పదును పెడతాడు. భూమి కన్య సీత, భూమిపుత్రుడు శంబూకుడు కేంద్రబిందువులుగా ఈ నాటకం సాగుతుంది. అంటే,

స్త్రీ–శూద్రులు వస్తువుగా అన్నమాట. వసిష్ఠ–వాల్మీకి పరంపర, వాటి మధ్య ఉన్న సంఘర్షణ గురించి చెప్పడం మేరకే ఈ నాటకంతో తనకు ప్రమేయం అంటాడు. వసిష్ఠ–వాల్మీకి పరంపర అనడంలో బ్రాహ్మణ–బ్రాహ్మణేతర పరంపరను ఆయన ఉద్దేశించాడు. ఈ నాటకంలోని వసిష్ఠపాత్ర నాలుక మీద ఎప్పుడూ 'శిరచ్ఛేదం', 'నిర్వాసనం (వెలి, బహిష్కరణ)' అనే మాటలే ఆడుతూ ఉంటాయి. రాముడు రాజైనా, రాజగురువు అయిన వసిష్ఠుని మాటే సాగుతుంది. అయినప్పటికీ రాజగురువుకు కొన్ని పరిమితులూ, మర్యాదలూ ఉంటాయి కానీ; ఇప్పుడు రాజగురువూ–రాజూ ఒక్కరే అయిపోయారని నెహ్రూను ఉద్దేశించి ఆక్షేపణబాణాన్ని ప్రయోగిస్తాడు.

అక్కడి నుంచి ప్రధానమంత్రి తలకిందులైపోతున్నారని అంటూ నేరుగా విషయంలోకి వస్తాడు. రామస్వామి నాయకర్ నాయకత్వంలోని ద్రవిడకజగం వారు రాజ్యాంగ ప్రతులనూ, జాతీయపతాకాలనూ తగలబెడుతుండడం, బ్రాహ్మణుల జందేలను తెంచడం, వారి జుట్లు కత్తిరించడం ప్రధానమంత్రి ఆగ్రహంతో తలకిందులై పోవడానికి కారణం. రాజ్యాంగం, సంప్రదాయం, బ్రాహ్మణస్వార్థం–ఇవన్నీ ఒకేచోట ఎలా ముడిపడ్డాయని–ఆశ్చర్యం మేళవించి లోహియా చణకు విసురుతాడు. ద్రవిడకజగంవారిపై ఆగ్రహంతో విరుచుకుపడిన ప్రధాని, వారిని భారతదేశం నుంచి పొమ్మనడం, పిచ్చాసుపత్రులకు, జైళ్లకు పంపుతామనడంలో వసిష్ఠునితో ఆయనకు సామ్యం తెస్తాడు. ద్రవిడకజగం వారు చేసింది నేరమే కానీ; తనైతే రామస్వామి నాయకర్ హృదయంలో ప్రజ్వలించే అగ్నిని ప్రశంసిస్తూనే, దానిని తప్పుడు పనులనుంచి మళ్లిస్తానని, కానీ ఇక్కడ ప్రధాని ఒక కఠినుడైన శంబూకునికి కఠినాతికఠినుడైన వసిష్ఠుడిగా మారి జవాబు చెబుతున్నాడని అంటాడు.

నెహ్రూలోని వసిష్ఠుని అంశను బహుముఖాలుగా, సోదాహరణంగా ఆయన ఎత్తిచూపుతాడు: 'ప్రధానమంత్రి మనసు మొదటినుంచీ వసిష్ఠబ్రాహ్మణ తామస ఆవేశాన్ని రంగరించుకుంటూనే ఉంది', 'ఆచార, సంప్రదాయాలు; వ్యక్తిగతస్వార్థం, ముఠాస్వార్థాలతో వసిష్ఠబ్రాహ్మణుల మనస్సులు నిండి ఉంటాయి', 'వసిష్ఠబ్రాహ్మణుల విశ్వాసాలూ, ప్రయోజనాలూ దెబ్బతిన్నట్లైతే సర్పం వలె పగ సాధించడానికి బుసకొడుతూ అవకాశం కోసం కాచుకుని ఉంటారు', 'దేశంలో జేబులకు కోమటి యజమాని అయితే, మనసుకు బ్రాహ్మణుడు యజమాని. ఉభయులూ దేశానికి

ఎప్పుడు, ఏపాటి ప్రయోజనాలను సాధించిపెట్టారు, స్థిరత్వాన్ని ఏమేరకు సాధించారన్న విషయాలను ఏకరువు పెట్టడం నా పని కాదు (ఏ ప్రయోజనాలూ సాధించలేదని ఇందులోని ధ్వని)', 'వసిష్ఠుని మనసులో ముస్లింల పట్ల నిజంగా ప్రేమాదరాలు ఉన్నాయన్న విశ్వాసం నాకు లేదు, ఎవరిపట్లా లేవు. ముస్లిములు కూడా వసిష్ఠునికి వస్తువుల వంటివారు. రాజ్యసంఘటన, నిర్మాణం, సంప్రదాయాలకు పనికివచ్చే సామగ్రి, స్వార్థప్రయోజనాల సాధనకు ఉపకరించే సామగ్రి', 'వసిష్ఠుడు బూటకాన్ని ప్రచారం చేసి విస్తరించకపోతే మనజాలడు', భారతదేశం (వసిష్ఠుని పాలనలో) అతి క్రూరమైన దేశంగా మారిపోయింది... బలహీనుడైనవాడు అతి క్రూరంగా వ్యవహరిస్తాడు... అనేకమంది శాకాహారులు క్రూరస్వభావం కలిగి ఉంటారు'. 'వసిష్ఠుడు బహుశా విదేశీయుడై ఉంటాడు. ఈనాటి ప్రధానమంత్రి అయితే, నిశ్చయంగా విదేశీయుడే...ఆయన ముఖం గుర్తుకు వచ్చినప్పుడల్లా ఆర్మీనియా వారి ముఖాలు గుర్తుకొస్తాయి. ఈ ముఖాలను నేను నికోసియాలో చూశాను'.

ఈ మాటలు నెహ్రూ హృదయపు మూలమూలనూ వెతికి మరీ వేయి సూదుల పదునుతో గుచ్చి హింసించి ఉంటాయనడంలో సందేహంలేదు. ఇతరుల్లో అయితే టన్నుల కొద్దీ దిగ్భ్రాంతిని నింపుతాయి. ముందే చెప్పినట్టు నెహ్రూకు బ్రాహ్మణత్వాన్ని ఆపాదించడం, (ఆయన తీసుకున్న హిందూ కోడ్ బిల్లు వంటి) సంస్కరణచర్యల వెనుక కూడా బ్రాహ్మణీయ స్వార్థాన్ని చూడడం, ముస్లింల పట్ల సానుకూల వైఖరితో సహా ఆయన రాజకీయ విశ్వాసాలను కూడా స్వార్థప్రేరితాలైన బూటకాలుగా చెప్పడం...ఒకటేమిటి, అనేకమైన, అతి పెద్ద దిగ్భ్రాంతులు. నెహ్రూ సమకాలికులు, ఆ కాలానికీ, అనంతరకాలానికీ కూడా చెందిన రాజకీయ పరిశోధకులు, చరిత్రకారులు ఈ విమర్శను మామూలుగా తీసుకున్నారో, ఆశ్చర్య భరితులయ్యారో తెలియదు కానీ, ఇన్నేళ్ల కాలగమనంలో నెహ్రూ గురించిన ఒక ఊహకు అలవాటుపడినవారికి మాత్రం పట్టరాని ఆశ్చర్యాలే. తటస్థమైన చారిత్రక దృష్టితో రాజకీయ, సామాజిక గమనాన్ని, వ్యక్తులను పరిశీలించడానికి ఇష్టపడే నాలాంటివారికి ఆశ్చర్యంతో పాటు అపారమైన ఆసక్తిని కలిగించే విమర్శ ఇది.

అంతకంటె ముఖ్యంగా ఈ వ్యాసం కాలికభేదాలను, పార్టీభేదాలను, భావజాల వ్యత్యాసాలను అన్నింటినీ తుడిచివేసి నెహ్రూలో లోహియా దర్శించిన వసిష్ఠ

ద్విజపాలనను– దానికి ఉన్నట్టు ఆయన చెప్పిన సకల లక్షణాలతో సహా– యథాతథంగా వర్తమానంలోనూ పోల్చుకోగలిగేలా ఉంటుంది. అది మరో పెద్ద ఆశ్చర్యం. వసిష్ఠద్విజపాలనకు ప్రత్యామ్నాయంగా వాల్మీకి పరంపరాపాలనను ప్రతిపాదించే లోహియా రాజకీయ, సామాజిక తాత్వికతా; పరిపాలన ఎలా ఉండాలన్న విషయంలో ఆయన చేసిన హెచ్చరికలూ, ఇచ్చిన సందేశాలూ అంతే యథాతథంగా వర్తమానంలో కూడా తమ అవసరాన్ని స్థాపించుకుంటూ ఆశ్చర్యమూ, ఆనందమూ కూడా కలిగిస్తాయి.

ఉదాహరణకు, ఈ వ్యాఖ్యలు చూడండి: 'కొందరు ధర్మహీనులైన హిందువులు ఈ రోజుల్లో రామకృష్ణులను విమర్శించే పుస్తకాలను తగలబెడుతున్న మాట నిజమే. ఇటువంటి వారే విశాలమైన ఈ దేశాన్ని ముక్కలు చేసేదాకా నిద్రపోరు. రామాయణాన్ని తగలబెట్టడం తప్పే. కానీ, అంతకన్నా తప్పు 'రామనింద'ను తగలబెట్టడం, రామనింద చేసినవారి తల నరకడం', 'భరతమాత తన సంతానాని కందరికీ తల్లే, తిరుగుబాటుదారులైన పిల్లలకు కూడా. నాగా సమస్యను ప్రధానమంత్రి సర్వనాశనం చేసిపారేశారు. ఇప్పుడు ద్రవిడసమస్యను చెడగొట్టడానికి బయలుదేరారు', 'దండన సర్వదా చట్టాలనూ, రాజ్యాంగాన్నీ అనుసరించి ఉండాలి కానీ, తాత్కాలిక దండనాధికారుల కోపతాపాలను అనుసరించి కాదు', 'వైరం ఉన్నచోటా, దృఢత్వం కాక కాఠిన్యం ఉన్నచోటా, ఉదారమైన న్యాయప్రియత్వం లేనిచోటా సిద్ధాంతాల బూటకం ప్రబలితీరుతుంది', 'భారతదేశం వంటి భిన్నవృత్తులు గల అతిపురాతన దేశాన్ని సమైక్యంగా ఉంచగలిగేది సిద్ధాంతమూ, సత్యమే. బూటకమూ, కాఠిన్యమూ దీన్ని మరింత ముక్కముక్కలు చేస్తాయి', 'వసిష్ఠద్విజరాజకీయాల ద్వారా పదవీ ప్రతిష్ఠోన్మాద రాజకీయాల ద్వారా భారతదేశాన్ని పునరుజ్జీవింపజేయడం అసాధ్యం. ఏ పార్టీలో అయితే, ఆడవాళ్ళు, శూద్రులు, హరిజనులు, ముస్లిములు అధిక సంఖ్యాకులుగా ఉంటారో ఆ పార్టీ మాత్రమే దేశాన్ని శక్తిమంతం, సుఖవంతం, సత్యశీలవంతం చేయగలుగుతుంది', 'వీలైనంతవరకు విత్తనాలు స్త్రీలు, హరిజనులు, శూద్రులు, ముసల్మానులే కావాలి. వీరిని నాయకత్వస్థానంలో కూర్చో బెట్టాలి. ద్విజులు ఎరువుగా ఉపయోగపడాలి. అటువంటి పార్టీ రూపొందాలి', 'దోషులకు కూడా సత్యం, నియమనిబంధనల ప్రకారం శిక్ష విధించాలి, లేకపోతే, అనేకమంది నిర్దోషులు చిక్కుబడిపోతారు'.

వర్తమానంలో ఈ వ్యాఖ్యల ప్రాసంగికతను గుర్తించడం ఏమంత కష్టం కాదు. ఒక్కో వ్యాఖ్యకూ కావలసినన్ని ఉదాహరణలు దొరుకుతాయి. దేశంలోని సొంతజనాలనే శత్రువులుగా చూస్తూ కక్షకట్టినట్టు వారిని పట్టిపల్లార్చడం జరుగుతోంది. అసమ్మతిని, భిన్నాభిప్రాయాన్ని నిర్దాక్షిణ్యంగా అణగదొక్కడం చూస్తున్నాం. అటు బాహ్యంగా ఉన్నదానికి తోడు, ఏకకాలంలో ఇటు అంతర్గతంగా మరో యుద్ధక్షేత్రాన్ని సృష్టించుకోవడం జరుగుతోంది. జైళ్ళు నిర్విరామంగా నిండుతున్నాయి. విచారణకు దూరంగా ఏళ్లతరబడి ఖైదీలు జైళ్ళలో మగ్గుతూనే ఉన్నారు. ప్రజాస్వామికవ్యవస్థలు చేష్టలుడిగి చూస్తున్నాయి, లోపల్లోపలే తొలుచుకుపోతున్నాయి. ఒక మతానికీ, ఇంకో మతానికీ, ఒక రాష్ట్రానికీ, ఇంకో రాష్ట్రానికీ, ఒక ప్రాంతానికీ ఇంకో ప్రాంతానికీ, ఒక వర్గానికీ ఇంకో వర్గానికీ మధ్య సామరస్య సంబంధాలు పూర్తిగా ఛిద్రమై ఘర్షణాత్మక సంబంధాలు నిరంతరాయంగా రాజుకుంటున్నాయి. చివరికి స్త్రీ–పురుషుల మధ్య కూడా చీలికలను పొటమరింపజేసే ప్రయత్నం జరుగుతోంది. చీలికలు, ఛిద్రాల పునాదుల మీద అధికారాన్ని పటిష్ఠపరచుకునే వ్యూహం అమలవుతోంది. 'ధర్మస్థాపన' కోసమని చెప్పి అసత్యాన్నీ, హింసనూ బాహాటంగా సమర్థించడం కనిపిస్తోంది. ప్రజాస్వామ్యమనే ఆ కాస్త ఆభాసపు ముసుగును కూడా ఉత్తరించివేసే తెగింపు తెరముందుకే వచ్చి తాండవిస్తోంది.

అన్యమతస్థులనే కాదు, హిందువుల్లోనే ఇతర దేవతా ప్రాబల్యం కలిగిన ప్రాంతాలలోని జనాన్ని సైతం వెంటాడి, వేటాడి, హింసించి నిర్బంధంగా పలికించే రాజకీయనినాదం స్థాయికి రామనామాన్ని దిగజార్చడమూ చూస్తున్నాం. దేశమంతటా ఏకరూప, కేంద్రీకృతమతాన్ని విధించడానికి రాముణ్ణి సాధనంగా మార్చుకోవడం గమనిస్తున్నాం. నిజానికి జాతిజీవనంలోనూ, ఊహల్లోనూ ఇంకిపోయిన రామకథ ఒకే వ్యక్తిలో ఏకకాలంలో భిన్నభిన్న సంవేదనలను కలిగిస్తుంది. అందులో సందర్భాన్ని బట్టి దూషణ, భూషణా కూడా కలగలిసి వ్యక్తమవుతూ ఉంటాయి. వేర్వేరు సామాజిక నేపథ్యాలూ, అంతస్తుల వ్యత్యాసాలూ, జెండర్ తేడాలూ, సాంస్కృతిక అంతరాలూ, ప్రాంతీయభేదాలూ ఉన్న ఇక్కడి జనం తమ జీవనానుభవాలకు, ఆదర్శాలకు, హృదయస్పందనలకు అనుగుణంగా ఆ కథను అన్వయించుకుంటారు, తీర్పు చెప్పుకుంటారు.

కూలినాలి చేసుకునే సామాన్యమహిళలు కూడా సీతపక్షం వహించి రాముణ్ణి పాపిష్టిగా తూలనాడడం గురించి లోహియా ప్రస్తావిస్తాడు. సీత కూడా ఒక సందర్భంలో రాముణ్ణి పాపిష్టిగా పేర్కొన్న సంగతిని ఉదహరిస్తాడు. కైక అతణ్ణి నారబట్టలతో అడవులకు పంపుతున్నప్పుడు ఈ మహిళలే కన్నీరు పెడతారు. అనేక రామాయణాలే కాదు, అనేక భారతాలు అవతరించడానికి, పురాణ కథలు భిన్న భిన్న రూపాల్లో ప్రచారంలో ఉండడానికి జనచింతనలో ఉన్న ఈ వైవిధ్యమే అసలు కారణం. పురాణ, ఇతిహాస కథలు జన సంవేదనలతో గాఢంగా అల్లుకుపోయాయి కనుకనే ఎప్పటికప్పుడు నూతనత్వాన్ని తెచ్చుకుంటూ సజీవంగా ఉండగలుగుతున్నాయి తప్ప, పండితభాష్యాలవల్లా, పౌరాణిక ప్రవచనాలవల్లా కాదు. ఇలాంటి వైవిధ్యవంతమైన సంవేదనలను తుడిచిపెట్టి మొరటుగా ఒకే పాఠాన్ని రుద్దే ప్రయత్నం ఇప్పుడు నిర్విరామంగా జరుగుతోంది.

నెహ్రూకు లోహియా ఆపాదించినవన్నీ వసిష్ఠద్విజ లక్షణాలేనని ఆమోదిస్తే, వర్తమానంలో జరుగుతున్నవిగా పైన చెప్పినవన్నీ ఆ వర్గీకరణ కిందికే వస్తాయి. ఈ విషయంలో గత, వర్తమానాల మధ్య అంతూపొంతూ లేకుండా కుదురుతున్న పోలికలు ఆశ్చర్యంలో ముంచెత్తుతున్నాయి. వసిష్ఠుని నాలుకమీద ఎప్పుడూ నర్తిస్తూనే ఉంటాయని లోహియా చెప్పిన శిరచ్ఛేదం, బహిష్కరణ లాంటి మాటలు ఇప్పుడు దేశవ్యాప్తంగా ఒక వర్గంనోట సర్వసాధారణమవడం ఇంకొక గొప్ప పోలిక. ఈవిధంగా ఒక్క వసిష్ఠుడే వేనవేలరూపాలతో దేశమంతటినీ ఆవరించుకున్నాడు.

అయితే, ఉభయ వసిష్ఠద్విజపాలనల మధ్యా మోతాదులో కొంత తేడా లేక పోలేదేమో! అంతర్గతమైన వైరుధ్యాలపై తాత్కాలికంగానైనా తెరదించి అందరినీ ఒక ఉమ్మడి లక్ష్యంవైపు నడిపించే స్వాతంత్ర్యోద్యమమనే ఒక ప్రత్యేకనేపథ్యం–పైన లోహియా రూపుకట్టించిన వసిష్ఠద్విజపాలనకు ఉంది. పైగా ఈ అందరిమధ్యా సంధానకర్తగా గాంధీ అనే వైశ్యుడు ఉన్నాడు. కనుక వసిష్ఠద్విజాంశ సర్దుకుపోయే ప్రయత్నంలో ఎంతో కొంత మెతకదనాన్ని తెచ్చికునీ, పలచబారీ ఉండవచ్చు. అయినప్పటికీ స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజుల్లోనే దాని ఘాటు నసాళానికి అంటే స్థాయికి చేరుకున్న సంగతి లోహియా వ్యాసం ద్వారా అర్థమవుతుంది.

వర్తమానంలో చూస్తున్న వసిష్ఠద్విజపాలన మరో కారణంవల్ల కూడా పూర్తిగా

భిన్నమైనది. దీనికి, వెనకటి వసిష్ఠద్విజపాలకులకు ఉన్నట్టు భిన్న కుల, మతవర్గాలతో కలసి పనిచేసిన స్వాతంత్ర్యోద్యమ నేపథ్యం లేదు, అలాంటి స్వాతంత్రోద్యమ వారసత్వం లేదు. నెహ్రూలో వసిష్ఠద్విజలక్షణాలు లోహియా ఆపాదించిన స్థాయిలోనే ఉన్నాయనుకున్నా, స్వాతంత్ర్యోద్యమ అనుభవం నుంచి సంక్రమించిన లౌకికవాదం ఆ లక్షణాలను ఎంతోకొంత పలచన చేసి ఉండవచ్చు. కానీ వర్తమానంలోని వసిష్ఠద్విజపాలనకు ఆ రకమైన ఎలాంటి ఆదర్శాలూ, మొహమాటాలూ, మెతకదనాలూ, శశభిషలూ ఉండవలసిన అవసరం లేదు. ఇది వేల సంవత్సరాల గతం నుంచి జవజీవాలను తెచ్చుకుంటున్న పాలన.

ఇందులో లోహియా చెప్పిన వాల్మీకి పరంపరకు చెందినవారు, దేశంలోని అత్యున్నతపదవి నుంచి అతి చిన్న పదవి వరకు ఏ పదవిలోనైనా ఉండవచ్చు, అభ్యంతరం లేదు. కానీ వారందరిపైనా అధిష్ఠానంగా వసిష్ఠుడే ఉంటాడు. పెద్దా, చిన్నా పదవులలో విరాజమానులైన వారు అందరూ వసిష్ఠకార్యాన్ని నెరవేర్చే కార్యకర్తలు మాత్రమే, వసిష్ఠుని యుద్ధాలను భక్తిపూర్వకంగా మీద వేసుకుని చెమటను, రక్తాన్ని ఓడ్చే పదాతిదళం మాత్రమే. కాకపోతే పెద్ద పదవిలో ఉన్నవాడు పెద్ద సైనికుడు, చిన్న పదవిలో ఉన్నవాడు చిన్న సైనికుడు, క్రియలో ఉభయులూ సైనికులే!

లోహియా రూపుకట్టించిన ఈ 'వసిష్ఠద్విజపాలన'ను వర్తమానానికి పొడిగించుకుని చూసినప్పుడు, ఆయన గురించే ఒక చిత్రమైన ఊహ కలుగుతుంది. వసిష్ఠద్విజపాలనను వ్యతిరేకిస్తూ స్వాతంత్ర్యోత్తరభారతంలో కూడా చెరజీవితాన్ని అనుభవించిన లోహియా–మరణం తనకు విముక్తిని ప్రసాదించబట్టి సరిపోయింది కానీ– జీవించి ఉంటే ఇప్పటికీ చెరజీవితాన్ని గడుపుతూ ఉండేవాడేమో!

అదలా ఉంచితే, ఒక విషయంలో మాత్రం లోహియా పొరబడ్డాడనిపిస్తుంది. శిరచ్ఛేదం, బహిష్కరణ లాంటి మాటలు భారతదేశపు భాష కాదని ఆయన అంటూ, 'పురాతనధర్మాలు తమపై విమర్శను విని సహిస్తాయి, నవ్వి పారేస్తాయి, అవసరం వచ్చినప్పుడే దృఢంగా మారతాయి. నూతనధర్మాలు పాశ్చాత్య, మధ్య ఆసియాలకు చెందినవి; అవి విమర్శను సహించవు' అంటాడు. మరోచోట, 'రామనింద' కానీ, 'మహమ్మదునింద' కానీ ఓపికగా వినగలిగినదే భారతీయమేధ, విని రక్తం ప్రవహింప చేయడానికి గానీ, పుస్తకాలు తగలబెట్టడానికి గానీ పూనుకోకుండా ఉండేదే భారతీయ

హృదయం' అంటాడు. నాకున్న చారిత్రక అవగాహన దృష్ట్యా చూసినప్పుడు, 'భారత దేశపు భాష' గురించి, 'హృదయం' గురించి ఆయన చేసిన ఊహలో వాస్తవం లేకపోలేదు కానీ, గతం గురించిన కాల్పనిక భావావేశమే దానిని మించి ఉందనిపించింది. వైవిధ్యాన్ని కాలరాస్తూ , ఏకరూపతను విధించే ప్రయత్నం ఇక్కడ సమాంతరంగా మొదటినుంచీ జరుగుతూనే ఉంది. ఇంతకుముందు చెప్పుకున్నట్టు, 'శిరచ్ఛేదం', 'బహిష్కరణ', లేదా వాటికి తుల్యమైన మాటలు ఇప్పుడు సర్వత్రా యథేచ్ఛగా వినిపించడం పాత వారసత్వమే కానీ కొత్తగా పుట్టినదేమీ కాదు. పురాతనధర్మాలు తమపై విమర్శను విని సహిస్తాయన్న ఆయన భావనా సత్యదూరమన్న సంగతి ఈనాడు అడుగడుగునా, అణువణువునా రుజువవుతూనే ఉంది. ఒక పక్క ఆయనే పురాతనుడైన వసిష్ఠుని ద్విజలక్షణాలను నెహ్రూకు ఆపాదిస్తూ, ఇంకో పక్క పురాతనధర్మాలు విమర్శను సహిస్తాయని అనడంలో వైరుధ్యం ఉంది.

* * *

పురాణ, ఐతిహాసిక కథలు, పాత్రల పట్ల సాంప్రదాయికమైన చూపునకు భిన్నమైన ఒక అనుభూతి సాంద్రత, లోతు, నవీనత, సమకాలీనత, సమన్వయం ఉట్టిపడే లోహియా చూపే ఇందులో నాకు ప్రధాన ఆకర్షణ, దానిని నా అవగాహన మేరకు తటస్థంగా పరిచయం చేయడమే, ఇది రాయడంలో నేను పెట్టుకున్న లక్ష్యం. అలాగని ఆ చూపును పూర్తిగా ఆవిష్కరించగలిగాననీ చెప్పలేను. అలాంటి సర్వసమగ్రావిష్కారానికే పూనుకుంటే, ఇప్పటికే పెద్దదైన ఈ పరిచయవ్యాసం మరో రెండింతలు అవుతుంది. పుస్తకం మీ చేతుల్లో ఉంది కనుక మీకు మీరే ఆ చూపులోని వైలక్షణ్యాన్ని మరింతగా తరచి చూసి ఆస్వాదించడమే ఉత్తమం.

మొదటే చెప్పినట్టు, సాంప్రదాయికంగా పురాణ, ఇతిహాసాలకు తామే కాపలాదారుల మనుకునేవారు, వాటిని వ్యాఖ్యానించి, ప్రవచించే బాధ్యతో, అధికారమో తమది మాత్రమే ననుకునేవారు చాలామందే ఉన్నారు. ఆ వర్గానికి చెందకపోగా, లోహియా ప్రధానంగా రాజకీయక్షేత్రానికి చెందినవాడు. అయినప్పటికీ సాంప్రదాయికవర్గాలతో పోల్చితే ఒక 'పౌరాణికు'డిగా ఆయన నిర్వహించిన పాత్ర అసామాన్యమైనది. ఆయన పురాణ, ఇతిహాస కథలను, వాటిలోని పాత్రలను ఒక వినూత్న సృజనాత్మక ఆలోచనాధారలోకి తీసుకొచ్చి వాటికి సరికొత్త యవ్వనాన్ని

సంతరింపజేశాడు. హృదయస్పర్శలోపించిన ధర్మమూ, దుష్టశిక్షణ, భక్తి, ఆధ్యాత్మికత అనే పారంపరికమైన ఒక మూసనుంచి వాటిని తప్పించి; ఒక మనసును మార్దవాన్ని ఇవ్వడానికి ప్రయత్నించాడు. వాటిని జనాలకు హృదయగతం చేసి, వారి నిత్యజీవన స్పందనలో సహజమైన భాగంగా చేయదలచుకున్నాడు. వాటిని సామాన్యీకరించి సమాజపరం చేయడానికి పూనుకున్నాడు. ఈ కోణంలో లోహియాను చదివినప్పుడు సాంప్రదాయిక ప్రవచనకారుల వైఫల్యం చాలా స్పష్టంగా కళ్ళకు కడుతుంది.

ఇందుకు సంబంధించి ఆయన కల్పించుకున్న అజెండా 'రామాయణ తిరునాళ్ళు' అనే వ్యాసంలో విశ్వరూపంలో కనిపిస్తుంది. ఈ రామాయణ తిరునాళ్ళ సంకల్పం ఆయన స్వప్నించిన స్వాతంత్ర్యోత్తర భారతీయసమాజ పునర్నిర్మాణంలో ఒక ఉజ్వలమైన, స్ఫూర్తిదాయకమైన భాగం. ఒక కార్యదక్షుడిగా, శ్రద్ధాశీలిగా ఆ తిరునాళ్ళ నిర్వహణకు అవసరమైన ఆర్థికవనరుల సమీకరణతో సహా ప్రతి వివరాన్నీ పూసగుచ్చినట్టు పొందుపరుస్తూ ఆయన కార్యక్రమాన్ని రూపొందిస్తాడు. అందులో ఆ వివరాలకన్నా కూడా, కట్టలు తెంచుకునే ఆయన తపనా, ఉత్సాహమూ, ఉత్తేజమే మనల్ని ఎక్కువగా ఆకట్టుకుని ముగ్ధుల్ని చేస్తాయి. అలాగని, భావిభారత సమాజదృశ్యాన్ని అన్ని విధాలా ఉజ్వలంగా, శాంతి సామరస్యపూర్వకంగా రూపుకట్టించేలా ఆయన రూపకల్పన చేసిన ఆ కార్యక్రమం మహత్తు ఏమాత్రం తక్కువది కాదు. దేశం నలుమూలలా ఉన్న రామాయణపండితుల్ని ఆహ్వానించి, వివిధ భాషల్లోని రామాయణాలపైనే కాకుండా, విదేశీ రామాయణ పండితుల్ని కూడా రప్పించి వారి రామాయణాలపై కూడా ప్రసంగాలు చేయించడం అందులో భాగం. అలాగే, రామాయణంతో ముడిపడిన జానపదగాథలు, కళారూపాలు కూడా అందులో ఉన్నాయి. పేరుకి రామాయణ తిరునాళ్ళు అయినా అందులో సంస్కృతం లోనూ, ఇతర భారతీయభాషల్లోనూ వెలువడిన భారత, భాగవతాలపై కూడా ప్రసంగాలు ఉంటాయి. అది మళ్ళీ భక్తి, ఆధ్యాత్మికతలకు మాత్రమే సంబంధించిన ఏకపక్ష భాష్యవిన్యాసం కూడా కాదు, అనేక దృష్టికోణాలకు స్థానం కల్పించే ఒక ప్రజాస్వామిక చర్చా వేదిక కూడా. భారతీయ సమాజ పునర్నిర్మాణంలో చర్చకు లోహియా ప్రాణప్రదమైన స్థానం ఇచ్చిన సంగతిని చెప్పుకున్నాం.

వీటన్నింటినీ మించి ఆకట్టుకునే వివరం, ఈ మేళాలో ఇస్లాం, క్రైస్తవం సహా అన్ని మతాల పవిత్రగ్రంథాలపైనా ప్రసంగాలు ఏర్పాటుచేసి ఆ మతస్థులను కూడా

భాగస్వాములను చేయడం. మొత్తం మీద, ఇది పారంపరికంగా నిర్వహించుకుంటున్న కుంభమేళాకు ఏమాత్రం తక్కువ కాని మహాసంకల్పం. కాకపోతే, వైవిధ్యవంతమైన భారతీయ మత, సంస్కృతుల సమన్వయ, సామరస్యాలనుంచి పెంపొందే ఉమ్మడి విలువల ప్రాతిపదికపైన భారతీయసమాజాన్ని పునర్నిర్మించడానికి ఉద్దేశించిన ఒక లౌకికమైన కుంభమేళా ఇది. లోహియా ఊహల్లో రూపుదిద్దుకున్న ఈ స్వప్నం సాకారమై తరచు యావద్భారత స్థాయిలో ఈ మహామేళా జరుగుతూ ఉండి ఉంటే, జనమానసిక జీవితంలోకి దాని ప్రభావం ఇంకి దానిని ఎంతటి సమున్నత సుందర శిల్పంగా మలచి ఉండేదో అంచనాకు అందదు.

భారతదేశంలో మొదటినుంచి ఒక ద్వంద్వనాయకత్వపరిస్థితి నెలకొని ఉంది. ఒకటి జ్ఞాన, సాంస్కృతిక నాయకత్వం, రెండవది డబ్బు, అది తెచ్చే రాజకీయ అధికారంతో కూడిన నాయకత్వం. ఈ రెండూ వేలసంవత్సరాలుగా ఈ దేశంలో సమాంతరయానం సాగిస్తున్నాయి. వాటి మధ్య ఇన్నేళ్ల కాలంలోనూ అంత తేలికగా పూడ్చడానికీ, పరిష్కరించడానికీ అలవి కాని స్థాయిలో పెద్ద అగాధమూ, వైరుధ్యమూ వ్యాపించి ఉన్నాయి. ఒక కోణంలో భారతదేశపు చారిత్రకగమనమంతా– ఏ గమ్యానికీ చేర్చని ఈ అగాధ, వైరుధ్యాల మధ్యనే. ఒక నాయకత్వం జ్ఞానాన్నీ, సంస్కృతినీ తన వద్ద ఉంచుకుని, డబ్బు, దానినుంచి లభించే రాజకీయ అధికారాన్ని ఇంకొకరికి వదిలివేసింది (ఇక్కడ జ్ఞాన, సాంస్కృతిక నాయకత్వం అనడంలో నా ఉద్దేశం వాటిపై గుత్తాధిపత్యాన్ని సూచించడమే తప్ప, ఫలానాదే జ్ఞానమనీ, సంస్కృతి అనీ గిరి గీయడం కాదు). ఇంకో నాయకత్వం డబ్బు, అధికారనాయకత్వాన్ని తను ఉంచుకుని జ్ఞాన, సాంస్కృతిక నాయకత్వాన్ని ఇతరులకు వదిలివేసింది. దాంతో జ్ఞాన, సాంస్కృతిక నాయకత్వం వద్ద డబ్బు, అధికారమూ లోపించాయి, డబ్బు, అధికారం కలిగిన నాయకత్వం వద్ద జ్ఞానమూ, సంస్కృతీ లోపించాయి. దీని దుష్పరిమాణాలను ఈ దేశం మొదటినుంచీ అనుభవిస్తూనే ఉంది. ఇప్పుడూ ప్రత్యక్షంగా అవి మన అనుభవానికి వస్తూనే ఉన్నాయి. డబ్బు, అధికారాల యావకు ఎక్కడ అడ్డుకట్ట వేయాలి; అధికారాన్ని ఎందుకు, ఎలా వినియోగించాలన్న జ్ఞానం లోపించిన ఫలితం ఒకవైపు దేశాన్ని అవినీతి మురికికూపంగా మార్చింది, ఇంకోవైపు విలువలను పక్కన పెట్టి అధికారమే పరమావధిగా సాగే దొమ్మీ స్థాయి నుంచి రాజకీయాన్ని ఎదగకుండా చేసింది. డబ్బునుంచి డబ్బును, అధికారం నుంచి

అధికారాన్ని పుట్టించడమూ, దానినే తరతరాలకు వారసత్వంగా అందించడమే ఏకైక జీవనవ్యాపకంగా మారింది. జ్ఞాన నాయకత్వం జ్ఞానం నుంచి పొందే ఆనందాన్ని ఎంతోకొంత చవిచూసింది కనుక, డబ్బు, అధికారాల యావను కొంతైనా తగ్గించుకోడానికి అలవాటు పడింది. కానీ జ్ఞానం కలిగించే ఆనందానికి దూరమైన రెండవ నాయకత్వం ఇప్పటికీ, డబ్బులోనూ, అధికారంలోనూ ఆనందాన్ని వెతుక్కుంటూ దేశాన్ని అధోగతి పట్టిస్తోంది. ఈ ద్వంద్వనాయకత్వసృష్టిలో అసలు పాత్ర జ్ఞాన, సాంస్కృతికనాయకత్వానిదే కనుక అదే ఇందులో పెద్ద ముద్దాయి.

ఇంతకీ ఇక్కడ నేను చెప్పదలచుకున్నది, లోహియా చింతనలో ఈ ద్వంద్వ నాయకత్వసమస్యకు పరిష్కారం దొరుకుతుందనే. డబ్బు, అధికారాలను జ్ఞాన నియంత్రణలోకి తెచ్చి, తద్వారా వాటికోసం అంగలార్చడానికి అడ్డుకట్టవేసి ఉమ్మడి ప్రయోజనకారకమైన నూతన పరమార్థంవైపు వాటిని మళ్లించడమే ఆయన అజెండాగా ఈ వ్యాసాలలో అర్థమవుతుంది. అందులోనూ డబ్బు, రాజకీయ అధికారాల మీద ఆయన పూర్తిగా భారతీయ మూలాలు కలిగిన జ్ఞానాన్ని ప్రతిష్ఠించదలచుకున్నాడు. అందుకోసమే ఆయన ఇతిహాస, పురాణకథలను, పాత్రల స్వభావాలను మథించి నేటి కాలానికి అవసరమైన సమన్వయాన్ని రాబట్టడానికి ప్రయత్నించాడు.

ఈ ముందుమాట రాస్తున్నంతసేపూ ఇంకొక పెద్ద వెలితీ నా మనసును కెలుకుతూనే ఉంది. ఈ భారతీయ సమాజంలోనే రామాయణ, మహాభారతాలు, పురాణాల ప్రభావానికి వెలిగా అసంఖ్యాకజనాలు ఉన్నారు. వారికి ఈ వారసత్వం ఇప్పటికీ అపరిచితంగానూ, తమది కానిదిగానే కాదు; తమకు అక్కర్లేనిదిగానే ఉండిపోయింది. ఈ కథలూ, వాటిలోని పాత్రలూ వారి జీవితంలో భాగం కాకపోగా, వాటిలోని భావజాలమే తమను చెరపట్టి వెలివాడలలో బందీలను చేసిందనే తిరస్కారం వారిలో ఉంది. వారిలో ఇతిహాస, పౌరాణిక వారసత్వం పట్ల తీవ్ర వ్యతిరేకచైతన్యం గూడుకట్టుకుని ఉండడం ఎంతైనా సహజమూ, సమర్థనీయమే. పైన చెప్పుకున్న 'వైవిధ్యవంతమైన భారతీయ మత, సంస్కృతుల సమన్వయ, సామరస్యాల నుంచి పెంపొందే ఉమ్మడి విలువల ప్రాతిపదికపైన భారతీయసమాజాన్ని పునర్నిర్మించడం' అనే లోహియా ఆలోచనకు అతి పెద్ద పరీక్షా, సవాలూ ఇదే. ఈ వెలివాడల జనం కూడా ఈ ఇతిహాస, పౌరాణిక వారసత్వంలో భాగస్థులు కావడానికి వీలుగా ఆ వారసత్వాన్ని సమూలంగా సంస్కరించడం మరో భగీరథప్రయత్నం అవుతుంది.

వారు కూడా ఆమోదించగల విధంగా జరగవలసిన ఆ ప్రయత్నపు రూపురేఖలు ఈ క్షణాన నా ఊహకు అందడంలేదు. లోహియా ఈ వ్యాసాలలో ఈ కోణాన్ని పెద్దగా స్పృశించకపోవడం నాకు ఆశ్చర్యమే కలిగించింది. అలాగని, ఆయన ఊహలో ఈ కోణం అసలే లేదని నేను అనడంలేదు.

మొత్తానికి లోహియా రామాయణ తిరునాళ్ళ సంకల్పం నెరవేరలేదు. కలసిరాని ప్రభుత్వయంత్రాంగాలు దానిని విఫలం చేశాయి, మొగ్గలోనే తుంచివేశాయి. పంచవర్ష ప్రణాళికల పేరుతో కేవలం భౌతికవనరుల అభివృద్ధిపైనే–అది కూడా అరకొరగా–దృష్టిపెట్టిన ప్రభుత్వాలు, జాతి ఆత్మిక అభివృద్ధికి కీలకమైన ఇలాంటి పూనికల ప్రాధాన్యాన్ని గుర్తించలేని హ్రస్వదృష్టిని, కురచబుద్ధిని నిరుపమానంగా చాటుకున్నాయి. పురాణ, ఇతిహాసాలను సమాజపరం చేసి వాటికి నూతన జవసత్వాలను కల్పించలేకపోవడం సాంప్రదాయికప్రవచనకారుల వైఫల్యమైతే, లోహియా సంకల్పించిన రామాయణ తిరునాళ్ళకు చేయి అందించకపోవడం పాలకుల వైఫల్యం. ఈ వైఫల్యాలకు మత, భాషా, ప్రాంత, కులపరమైన అనేక చీలికలు, అనైక్యతల రూపంలో ఈరోజున భారీగా మూల్యం చెల్లించుకుంటున్నాం. లోహియా దార్శనికత అడవి గాచిన వెన్నెల అయింది. ఆయన స్వప్నభాండం కిందపడి తునాతునకలై మట్టిలో కలిసిపోయింది. భారతదేశం తను ఆశించినదానికి పూర్తి భిన్నంగా, తను ఊహించి కూడా ఉండనంత వేగంతో తిరోగమించడం చూసి ఈసారి నిజంగా ఆయన మరణించి ఉంటాడు, భౌతికంగా కాదు, అంతకన్నా దారుణ మరణమైన ఆత్మికంగా!

పెద్దలు, ప్రముఖ సోషలిస్టు చింతనాశీలి, రామ్ మనోహర్ లోహియా వంటి సోషలిస్టు అగ్రనాయకులతో కలసి పనిచేసినవారు అయిన రావెల సోమయ్యగారు ఈ ముందుమాట రాసే అవకాశం నాకు ఇవ్వకపోతే, లోహియాభావధారను ఈ మాత్రమైనా లోతుగా తడిమి చూసే అవకాశం– నాకున్న ఇతరేతరమైన రాత ఒత్తిడుల వల్ల – ఎప్పటికీ వచ్చి ఉండేది కాదేమో! వారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు తెలియజేసుకుంటున్నాను.

# సమత + స్వాతంత్ర్యం + సౌందర్యం
# = లోహియా

అనువాదం : **ఘట్టమరాజు**

**డా.** రామమనోహర్ లోహియాగారితో పరిచయం నాకెలా కలిగిందో చెప్పాలంటే అదో కుతూహలకరమైన కథే. నా మిత్రుడు దినేశ్‌సింగ్ లోహియాగారిని కలవడానికి సరైన రోజు, సమయం నిశ్చయించాడు– శనివారం పొద్దున సరిగ్గా ఎనిమిది గంటలకు. ఆయన వున్న ప్రదేశం మేమున్న చోటికి కనీసం 18–19 కిలోమీటర్ల దూరం. మేం అక్కడికి చేరాలంటే దాదాపు గంట కాలం పట్టొచ్చు. పొద్దు పుట్టకముందే మేం ఐదారు మంది యువరచయితలం నిద్రలేచి, ప్రయాణానికి తయారయ్యాం. రెండు సైకిళ్ళకూ గాలి కొట్టించి, చిన్న చిన్న మరమ్మత్తులు చేయించాం. ఓ టాంగా, ఓ రిక్షా, రెండు సైకిళ్ళ మీద ఆధునిక హిందీ రచయితలం ఎంతో ఉత్సాహంగా డా. లోహియాగారిని చూడటానికని బయలుదేరాం.

మరి, లోహియాగారున్న చోటంటారా? విచిత్రమైనదేనండోయ్. ఆయన జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ అతిథిగా నైనీ జైల్లో బసచేసి వున్నారు. ఆయన చేసిన కొన్ని ప్రసంగాల, యిచ్చిన కొన్ని ప్రకటనల కారణంగా ఆయనపై కోర్టులో కొన్ని కేసులు నమోదయ్యాయి. మహాత్మాగాంధీ పేరు చెప్పుకొంటూ సత్యం, అహింసల సిద్ధాంతాలు వల్లె వేస్తూ దేశాన్ని పాలిస్తున్న నెహ్రూ ప్రభుత్వం, ఆ రెండు సిద్ధాంతాల్ని త్రికరణశుద్ధిగా పాటించే ఓ మహానాయకుణ్ణి కారాగారంలో బంధించడం చిత్రంగా లేదూ? విచిత్రంగా లేదూ? లోహియాగారు కోర్టులో తన కేసును తానే వాదించుకున్నారు – ఏ వకీలు సాయం తీసుకోకుండా. ఆయన వాదనా పటిమ, కౌశలాలు ఉడుకు రక్తం ప్రవహించే మాలాంటి యువకుల్ని ఉత్తేజితం చేశాయి. మాలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. మాలో కొంగొత్త ఆలోచనల్ని రేకెత్తించాయి.

మేం వున్నామే, మేమెంతో ఉరకలు వేసే వుత్సాహంతో, పరుగులు తీసే

ఉత్తేజంతో ఆధునిక హిందీ సాహిత్యంలో కొత్త పుంతలు తొక్కే దశలో వున్నాం. కొత్త దారులు వెతికే దిశ వైపు పరుగెత్తుతున్నాం. ఎవ్వరి మాటలు వినని బేఖబర్, బేఖాతిర్ నవ యువ బుద్ధిజీవులం అన్నమాట. ఇంకా చెప్పాలంటే మాలోనే మేం తీవ్రమైన చర్చలు చేసుకొంటూ కొట్లాడుకొనేవాళ్ళం. మాలో కొందరు నెహ్రూ భక్తులు, మరి కొందరు జయప్రకాశ్ నారాయణ ఆరాధకులు, యింకొందరు వినోబాభావే అంటే పడి చచ్చేవారు. తక్కిన వాళ్ళంటారా సుభాష్ బోసు అంటే ప్రాణాలు వదిలేందుకైనా సిద్ధం! కాని అనుకోకుండా, అకస్మాత్తుగా డా.రామమనోహర్ లోహియాగారు మా మనసుల్ని లోగొన్నారు. నైనా జైల్లో బంధింపబడ్డ లోహియాగారిని మేం అంతదాకా చూసి వుండలేదు. ఆయన ఉపన్యాసాలు కూడా విని వుండలేదు. కాని ఇప్పుడు మాత్రం ఆయన్ను ఎప్పుడెప్పుడు చూద్దామా అని తహతహలాడుతూ ఆయన గారిని చూడ్డానికి బయలుదేరాం.

యమునా నదిపై పొడవైన, ఎఱ్ఱని ఉక్కు వంతెనపై మేం టాంగా, రిక్షా, సైకిళ్ళ సవారి చేస్తూ కదులుతున్నాం. లోహియాగారు బంధింపబడ్డ జైలు గది ఎలా ఉంటుందో అని నేను ఆలోచిస్తున్నాను. ఆ బంధిఖానాలో ఆయన ఎలా వున్నారో? స్వాతంత్ర్యానికి పూర్వం ఆంగ్లేయాధికారులు ఈ నైనీ కారాగృహంలోనే పండిత్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, డా. సంపూర్ణానంద్, డా. రఫీ మహమ్మద్ కిద్వాయ్ మొదలైన స్వాతంత్ర్య సమరయోధుల్ని బంధించి వుంచారు. జవహర్‌లాల్ నెహ్రూ తమ స్వీయ చరిత్రలో ఈ జైలు గురించి, ఇందులో ఖైదీలుగా వున్న దేశభక్తుల గురించి కళాత్మకంగా, విస్తారంగా రాశారు. దేశభక్తులైన నెహ్రూ, కవి హృదయ సంపన్నులైన పండిట్ తన ప్రియమిత్రుడైన లోహియాను ఈ నైనీ బందిఖానాలో ఎలా ఉంచగలిగారు? ఎత్తయిన, దుమ్ముతో నిండిన గోడలు దైత్యాకారం గల ఇనుప తలుపులుగల ఆ జైలు మహాద్వారం గుండా, ఖైదీలుండే వార్డులు దాటుకుంటూ మేం నడుస్తున్నాం. ఖాళీ ప్రదేశాల్లో నల్లని చారలుగల తెల్లని బట్టలు వేసుకొని, గడ్డపారల్తో నేలను పెళ్ళగిస్తున్నారు. మా వంక ఆశ్చర్యంతో చూస్తున్నారు. మాకు దారి చూపిస్తున్న వార్డరు ఆ ఖైదీలకు మేం డాక్టర్ లోహియాగారిని చూడ్డానికి వచ్చినవారమని చెప్పారు. వాళ్ళు మాకు నమస్కారం చేసి తమ పనుల్లో తాము లీనమై పొయ్యారు. వాళ్ళు కొద్ది రోజుల్లోనే లోహియాగారికి మిత్రులైపోయారు.

**తొలి పరిచయం**

ఓ విశాలమైన వరండాలోని పెద్ద పెద్ద కిటికీలు గల ఓ గది. దాన్లో ఓ మంచం మీద ఓ పరుపు, దాని మీద ఓ పచ్చడం, దిండ్లు– ఖాదీ ధోవతి, అంగీతో కనపడ్డారు డా.లోహియా. నల్లని రంగు, తీక్షణంగా చూసే చిన్న కళ్ళు, నిక్కబొడుచుకొన్న వెంట్రుకలు – తిరుగుబాటు చేస్తున్న ధోరణిలో – లావాటి పెదవులపై చెరగని చిరునవ్వు, ప్రశ్నార్థకంగా కనిపించే ముఖం.

డా.లోహియాగారితో మా అందరి పరిచయం అయ్యింది. మేమంతా గొప్ప వాళ్ళమనే భావం మాకు ఆయన చూపుల్లో కనపడింది. డా. లోహియాగారితో జరిగిన సంభాషణలో మాకు ఈ భావాలు తోచాయి. నిద్రపోతున్న భారతదేశాన్ని మాలాంటి కవులు, రచయితలు మాత్రమే మేల్కొల్పగలరు. మాకు కాలర్లు ఎగరేసుకోవాలన్నంత గర్వం కలిగింది. లోహియాగారి మాటలు వింటుంటే దేశాన్ని జాగృతం చేసే బరువైన బాధ్యత మా భుజాలపై వుందన్న బోధ కలిగింది. లోహియాగారి మాటలు మమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేశాయి. దేశంలోని దరిద్ర నారాయణులకు, అజ్ఞానాంధకారంలో మునిగివున్న కోట్లాదిమంది ప్రజలకు, మాకు మధ్య ఇంతదాకా మూసుకొనివున్న తలుపులు తెరిచిన మహామాంత్రికునిలా కనపడ్డారు డా.లోహియా.

ఆయన మాతో రాజకీయాల గురించి మాట్లాడలేదు. నెహ్రూగారి వూసెత్తలేదు. కోర్టు కేసు గురించి నోరెత్తలేదు. సోషలిస్టు పార్టీ సిద్ధాంతాల గురించి అసలే మాట్లాడలేదు. కవిత్వం గురించి చర్చించారు. నవలల గురించి ప్రస్తావించారు. నేటి సాహిత్య భాషా స్వరూప స్వభావాలను గురించి అడిగారు. మా యింటి సంగతులు అడిగి తెలుసుకొన్నారు. సాహిత్యం, భాష, మానవీయ సంవేదనల గురించి డా.లోహియాగారికున్న విలక్షణమైన దృక్పథం పట్ల మాకు ఆశ్చర్యం కలిగింది. చరిత్ర పట్ల ఆయన ధోరణులు విని మేం నిర్ఘాంతపోయాం.

మన భారతీయసంస్కృతిలో వున్న పరస్పర విరుద్ధ భావాల గురించి ఆయనకున్న ప్రఖరమైన అభిప్రాయాలు విన్న తర్వాత మాకెవ్వరికీ మాట పెగల్లేదు. డా.లోహియాగారే భారతీయ సాహిత్యాన్ని సమీక్షిస్తే కొమ్ములు తిరిగిన మహా

పండితులు కూడా మూకవిస్మితులై పోకతప్పదు అన్న భావన కలిగింది మాకు. ఆయన ఆబాలగోపాలం మాట్లాడే అతి సామాన్యమైన, సరళమైన భాషలో ఎంతో మౌలికమైన, స్వతంత్రమైన ఆలోచనల్ని రేకెత్తించే విషయాలు ప్రస్తావించడం చూసి మేం ముక్కుపై వేలు వేసుకున్నాం. గంగా ప్రవాహంలా సాగే ఆయన వాగ్ధారలో మేం మునిగితేలాం.

ఇంతలో మేమున్న గదిలోకి హఠాత్తుగా ఓ వ్యక్తి ప్రవేశించారు. నల్లని రంగు, భారీ ఆకారం, పెద్ద పెద్ద మీసాలు, భయం గొల్పే ముఖం, చేతిలో లోహం పిడి వున్న బరువైన లాఠీ. మేం ఉలిక్కిపడ్డాం. ఇంతలో ఇద్దరు ఖైదీలు పరుగు పరుగున వచ్చి, ఆయన కూర్చోవడానికని ఓ కుర్చీ వేశారు. ఆయన ఆయాసపడుతూ దాన్లో కూర్చున్నారు. మా ముఖాల్లో కనపడుతున్న భయం, కంగారు చూసి డా.లోహియాగారు మా వంక చిలిపిగా చూస్తూ మాకు ఆ అపరిచిత వ్యక్తిని ఇలా పరిచయం చేశారు– "మీరేం భయపడవద్దండి, ఈయన అసిస్టెంటు జైలరుగారు. చాలా మంచివారు. ఈయన గారు ఒఠ్ఠి జైలరు మాత్రమే అని భావించకండి, ఈయన రచయిత కూడా. భీమశంకర్ 'పర్వానా' (మిడత) అనే పేరుతో కథలు రాస్తారు" అన్నారు.

అసిస్టెంట్ జైలర్ 'పర్వానా' గారు సగర్వంగా మీసాలు మెలివేశారు. చేత్తో లాఠీ పట్టుకుని మా అందరికీ నమస్కారం చేశారు. డా.లోహియా చిరునవ్వు నవ్వుతూ –"మిత్రులారా! మీ పత్రికల్లో ఈయన గారి కథలు రావడం లేదు. ఈయనకి కూడా చాలామంది పాఠకులున్నారు. నేను నాలుగైదు రోజులుగా 'పర్వానా' గారి కథలు చదువుతున్నాను. చాలా కథలు చదివేశాను కూడా" అన్నారు. లోహియాగారు మాతో హిందీ సాహిత్యం గురించి ఎంత సీరియస్‌గా చర్చించారో, అంతే గంభీరంగా అసిస్టెంట్ జైలర్‌గారి కథల్లోని జైలర్, ఖైదీల పరస్పర సంబంధాల గురించి కూడా మాట్లాడారు. కారాగారాల్లో అధికారుల, బందీల జీవితాల్లోని సూక్ష్మాతిసూక్ష్మ విషయాల్ని తెలియజేశారు.

'పర్వానా' గారు కూడా లోహియాగారివైపు కృతజ్ఞతాపూర్వంకంగా చూశారు. అలాగే మా వైపు గర్వంగా చూస్తూ కుర్చీలో ఆసీనులయ్యారు. డా.లోహియా పట్ల శ్రద్ధాభక్తులు కనబరిచారు. ఇప్పుడు ఖైదీ (లోహియాగారు) గురువుగారి హోదాలో

మార్గదర్శనం చేయసాగారు. జైలర్ శిష్యభావంతో గురువుగారి పాదపద్మాల వద్ద తలొంచుకొని కూర్చున్నాడు.

**సమత**

నేను పెద్ద పెద్ద రాజకీయ నాయకుల్ని ఎన్నోసార్లు కలిశాను– నెహ్రూగారు, రాజాజీ, రాష్ట్రపతి సుకర్ణో, రాష్ట్రపతి డా.లియాపోల్డ్ సెంగోర్, షేక్ ముజీబుర్ రహమాన్. వారి దర్శన భాగ్యంతో పాటు పాత్రికేయునిగా వారితో కాస్సేపు ముచ్చటించే సదవకాశం కూడా నాకు లభించింది. వీళ్ళందరి వల్ల ప్రభావితుణ్ణి అయ్యాను. కాని డా.లోహియాగారిని కలిసి, ఆయనతో మాట్లాడిన తర్వాత మంత్ర ముగ్ధుడినైన నా మధురాతిమధుర మధురానుభూతిని మాత్రం నేనెప్పటికీ మరువలేను. పర్వత శిఖరాల్లాంటి మహనీయుల ముందు నేనొక మరుగుజ్జులా కనపడేవాణ్ణి. కాని డా.లోహియాగారితో గడిపిన ఆ కొన్ని క్షణాలు నాలోని భయాన్ని పోగొట్టి నన్నొక సహజ మానవునిగా, భయ సంకోచాలు లేని వ్యక్తిగా తీర్చిదిద్దాయి. ఆచార్య హజారీప్రసాద్ ద్వివేదిగారు రాసిన నవల 'బాణభట్టుని ఆత్మకథ' – నేనెంతో మెచ్చుకొన్న గ్రంథరాజంలోని ఈ మాటలు అప్పుడు నాకు జ్ఞప్తికి వచ్చాయి–

"ఎవరికీ భయపడవద్దు, శాస్త్రాలకూ, గురువులకు కూడా" అన్నది లోహియా గారి సందేశం. ఆయనను  కలుసుకొన్న పిదప, ఆయన రచనలు చదివిన తర్వాత, క్రమక్రమంగా ఆయన్ను చాలాసార్లు కలుసుకొన్న తర్వాత నాలోని భయం తొలగిపోయి నేనొక ధైర్యవంతుడిగా మారిపొయ్యాను.

నేను డా.లోహియాగారి నుంచి నిర్భీతి, ఉద్ధటతనాల పాఠాల్ని నేర్చుకొన్నాను. కాని అవి విశృంఖలత్వానికీ, అంతులేని అహంకారానికీ దారి తీయకూడదనే పాఠం కూడా వారి నుంచే నేర్చుకొన్నాను. వజ్రంలా కఠోరంగా కనపడే డా.లోహియాగారిలో దాగివున్న వెన్నలాంటి మెత్తనైన స్వభావమే నన్ను తప్పటడుగులు వేయకుండా నిలిపింది. నీవు ఎవరికంటే తక్కువైన వాడివి కావు, అలాగే ఎవరు కూడా నీ కంటే తక్కువైన వారూ కాదన్న గుణపాఠం నాకు డా.లోహియాగారు నేర్పిందే. నీవు అల్పుడైనవాడని ఎవర్ని అనుకుంటావో, దూరంగా వుంచాలని భావిస్తావో, అతనికీ ఓ వ్యక్తిత్వం వుందనీ, అస్మిత వుందనీ తెలుసుకో. అతనితో ఓ విషయమై తలపడుట ఎందుకంటావా – అతనూ నీవూ వేర్వేరు మనుషులు కారు. మీరిద్దరూ ఒకటే.

సమతను అర్థం చేసుకోవటంలో ఇది రెండో స్థాయి. కేవలం సంపదను సంఘంలోని వాళ్ళందరికీ సమానంగా పంచితే సమత సిద్ధించదు. మానవీయ అస్మితను సమానంగా పంపకం చేసినప్పుడే ఇది ఏర్పడుతుంది. సమాజంలోని వైషమ్యాన్ని నిర్మూలించడానికి సంఘాన్ని మారిస్తే చాలదు. పరిపాలనా విధానాన్ని బదలాయిస్తే చాలదు. సంఘంలోని ప్రతివ్యక్తీ తన మనస్సును మార్చుకోవాలి. పక్షాన్ని లేదా సమూహాన్ని విప్లవోన్ముఖంగా మార్చడానికి ముందు వ్యక్తి విప్లవభావాలతో తన వ్యక్తిత్వాన్ని నింపుకొనాలి. ఈ క్రాంతి అంతరంగం నుంచి బహిరంగం వైపు సాగాలి. అప్పుడే మానవీయ సంవేదనను అర్థం చేసుకోగలం. మానవీయ బాధను పంచుకోగలం.

కిశోరావస్థలో వున్న ఆ రోజుల్లో నాకు వాడి, వేడి మాటలు చాలా నచ్చేవి. గాంధీ దర్శనం నాకు కల్పనా ప్రపంచంగా తోచేది. డా.లోహియాగారు నెహ్రూగారికి దూరంగా, గాంధీజీకి దగ్గరగా వుండటానికి కారణమేమిటో మొదట్లో నాకు అర్థమయింది కాదు. జీవితంలో ఎన్నో ఆటుపోట్లకు గురయ్యాకా, ఎదురుదెబ్బలు తిన్న తర్వాత రాజకీయక్షేత్రంలో ఉత్థాన పతనాలు చూసిన తర్వాత, కష్టాలు కడగండ్లు అనుభవించిన తర్వాత, శత్రువుల నుంచి ప్రేమ, మిత్రులనుంచి దగా దెబ్బలు తిన్న పిమ్మట, మనస్సు రాటుతేలి, పరిపక్వత సిద్ధించిన పిదప గాంధీజీకి ఇష్టమైన ప్రార్థనా గీతం "వైష్ణవ జనతో తేణే కహియే, జే పీర్ పరాఈ జాణేరే" అర్థమేమో తెలుసుకోగలిగాను. ఇతరుల కష్టనష్టాల్ని అవగతం చేసుకొన్న డా.లోహియా గొప్పతనం ఏమిటో అప్పుడు కాని నాకు బోధపడలేదు. ఆ మహానుభావుడు ప్రసాదించిన సమతా సిద్ధాంత ప్రతిపాదన సమస్త భారతీయ మనీషుల పవిత్ర వారసుల వ్యాఖ్యానమన్న అభిప్రాయం నా మనస్సులో నాటుకొంది. నెహ్రూగారు భారతదేశాన్ని అన్వేషించారు. కాని డా.లోహియాగారు భారతదేశంతో మమేకమయ్యారు. ఈ యిద్దరి మధ్య వున్న ప్రాథమిక వ్యత్యాసం ఇదే.

## స్వాతంత్ర్యం

మేము డా.లోహియాగారిని కలిసిన తర్వాతే స్వాతంత్ర్యం అంటే ఏమిటో, దాని విలువ ఏమిటో, కొత్త కొత్త కోణాల్లో దర్శించి అర్థం చేసుకోవడం మొదలెట్టాం. బ్రిటిషు ప్రభుత్వం కబంధహస్తాల నుండి బయటపడ్డమే కాదు, మనుషుల్లోని సహజ

గుణాల్ని హరించి, మానవత్వాన్ని నాశనం చేసే దుష్టశక్తుల్నుంచి తప్పించుకొని, బానిసత్వపు సంకెళ్ళను బద్దలు కొట్టడమే నిజమైన స్వాతంత్ర్యమన్న ఎరుక కలిగింది డా.లోహియాగారి చలువ వల్లనే. మనం వ్యక్తి యొక్క అస్మితను రూపుమాపి సామాజిక సమానత్వాన్ని సాధించలేం. సంఘంలోని ప్రతి మనిషి యొక్క అస్మితను కాపాడి, పౌరుల ఆత్మగౌరవాన్ని కాలరాయకుండా వాళ్ళకు స్వేచ్ఛాపూరితమైన వాతావరణం ఏర్పాటు చేసినప్పుడు మాత్రమే సమతా రాజ్యాన్ని నెలకొల్పగలం.

1950–60 నాటి మాట. అలహాబాదు నగరంలో హిందీ సాహిత్య జగత్తులో కొత్త ఉద్యమాలు రూపుదిద్దుకొంటున్న కాలం అది. సమత – స్వాతంత్ర్యం, వ్యక్తి–వ్యవస్థ, స్వాతంత్ర్యం– పౌరుల బరువు బాధ్యతలు – వీటి గురించి కళాశాలల, విశ్వవిద్యాలయాల అధ్యాపకులు– విద్యార్థుల మధ్య తీవ్రంగా చర్చలు జరుగుతున్న రోజులవి. విద్యాకేంద్రమైన అలహాబాదులో ప్రగతిశీల్ లేఖక్ సంఘ్ (అభ్యుదయ రచయితల సంఘం 'పరిమళ్', కవి, పండితుల చర్చావేదిక) – ఈ రెండు సంస్థల్లో జరిగే రచయితల ఉపన్యాసాలు, వాదోపవాదాలు, చర్చల మీద డా.రామ్ మనోహర్ లోహియాగారి చింతన – మననాల ప్రభావం ఎంతదాకా వుందన్న విషయం గురించి హిందీసాహిత్య చరిత్రల్లో సముచిత చర్చ ఇంతవరకూ సాగకపోవడం విచారకరం.

డా.లోహియా గారు ఎప్పుడూ ఈ సభల్లో, సమావేశాల్లో పాల్గొనలేదు. మరి మేం ఆయన్ను తరచూ కలిసింది కూడా లేదు. ఎప్పుడోకాని 'జన్' (జనం) గురించి ఉత్తరప్రత్యుత్తరాలు జరిగేవి కాదు.

మా మిత్రులంతా ఏమేం రాస్తున్నామో, ఏమేం ఆలోచిస్తున్నామో లోహియా గారికి ఎప్పటికప్పుడు తెలుస్తూ వుండేది. ఈ భోగట్టా వారికి ఎలా అందేదో మాకు తెలిసేది కాదు. ఈ కథాకమామీషంతా తెలిసినా, ఆయన మాకెప్పుడూ సలహాలు ఇచ్చేవారు కారు. మార్గదర్శనం కూడా చేసేవారు కారు. ఆయనకు గురుపీఠంకానీ, మఠంకానీ వుండేది కాదు. 'పీఠాధిపతి' నన్న భావన ఆయనకు ఎప్పుడూ కలిగిన సూచనలు కూడా మా చెవులకు సోకలేదు. కానీ ఆ మహానుభావుడు తన అభిప్రాయాల్నీ, ఆశయాల్నీ ఢంకా బజాయించి చెప్పే ఒక ధైర్యవంతుల, నిష్కాపరుల తరాన్నే నిర్మించగలిగారు. ఆయన మాకెన్నడూ 'ఇలా వెళ్ళాలి' అని చెప్పిన పాపాన

పోలేదు. అవివేకపు చీకట్లు మా మెదళ్ళను ఆక్రమించేటప్పుడు, మా మస్తిష్కాలు చురుగ్గా పనిచేస్తూ ఆ అజ్ఞానాంధకారాన్ని మా ప్రశ్నల బాణాలు ఛేదించే శక్తిని ఆయన మాకు ప్రసాదించారు. అరువు తెచ్చుకున్న భావజాలాన్ని, దిగుమతి చేసుకొన్న సిద్ధాంతాల్ని ఎదుర్కొనేందుకు సమాయత్తమవుతున్న సమయంలో, మా భవిష్యత్తును మేం నిర్ణయించుకునేందుకు సిద్ధమైన తరుణంలో లోహియా సిద్ధాంతాలు అవసరమైన శక్తిసామర్థ్యాలు మాకు సమకూర్చాయి వడ్డించిన విస్తరుల్లా.

చక్కని కాలిబాటలు కళ్ళెదుట కనపడుతుంటే వాటిని పట్టించుకోకుండా రాళ్ళూ రప్పలూ, మిట్టపల్లాలు, ముళ్ళ కంపలతో కూడివున్న మార్గాన్ని ఎన్నుకొని ముందుకు దూసుకు పోయే ఉత్తేజాన్ని పురికొల్పినవారు లోహియాగారు. ఎదుటివాళ్ళ గోడు విని ద్రవించిపోయే కరుణార్ద్ర హృదయం వున్నంతదాకా లోహియాగారి తేజస్సు ప్రజ్వరిల్లుతూ వుండేది. ఎప్పుడైతే ఆయన భక్తుల పొగడ్తలకు పొంగిపోయి, భక్త కూటముల మధ్య చిక్కిపోయారో అప్పటి నుంచి ఆయన వర్చస్సు రానురాను క్షీణించసాగింది.

ఓసారి డా.లోహియాగారు అలహాబాదు నుంచి నేరుగా బొంబాయి వచ్చారు. ఆయన వెంట కాశీనాథ్ (ప్రసిద్ధ కథారచయిత) వున్నాడు. మా సంభాషణ మధ్య అలహాబాద్ కాఫీహౌస్ ప్రస్తావన వచ్చింది. నేను కాఫీహౌస్‌లో సాహితీ మిత్రుల్ని కలిసి వచ్చాను. వాళ్ళ మాటలు విచిత్రంగా తోచాయి. “ఆరిపోయిన దీపాలతో ఇంకెన్నాళ్ళు పండుగ జరుపుకోగలరు?” – అని అన్నారు లోహియా.

ఇది చాలా రోజుల తర్వాతి మాట అనుకోండి. నేను అలహాబాద్ వదిలి బొంబాయికి వచ్చాను. అక్కడ మా యిద్దరి మధ్య జరిగిన సంభాషణల్ని నేనెన్నటికీ మరువలేను. అది బొంబాయిలో మా ఇద్దరి మొదటి కలయిక. నా మొదటి భార్యతో కాపురం చేయలేక విడాకులు తీసుకొని అలహాబాద్ వదలిపెట్టి బొంబాయి చేరిన తొలి రోజులవి. నా భగ్న వైవాహిక జీవితం, భవిష్యత్తుల గురించి లోహియాగారు మథనపడుతున్నారు. నేను పాత జీవితాన్ని మరిచిపోయి కొత్త జీవితం ప్రారంభించాలనే కోరికతో బొంబాయి రావడం నా అలహాబాద్ మిత్రులెవ్వరికీ నచ్చింది కాదు.

టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూపు వాళ్ళ ‘ధర్మయుగ్’ అనే హిందీ వారపత్రికకు

నేను సంపాదక బాధ్యతను చేపట్టేందుకు ఒప్పుకోవడం నా మిత్రులకు ఇష్టం కాలేదు. అలహాబాద్‌లో డా. లోహియా లాంటి సాహితీమిత్రులు ఆ విషయం గురించి రకరకాలుగా మాట్లాడుకోసాగారు. సంసారం బాదరబందీలకు ఎంతో దూరంగా వున్న; జాతీయ, అంతర్జాతీయ సమస్యలతో పగలూ రాత్రీ సతమతమయ్యే రాజనీతి కోవిదుడు నా వ్యక్తిగతజీవితంలోని సాధకబాధకాల్ని ఇంత గంభీరంగా పట్టించుకోవడం నాకెంతో ఆశ్చర్యం కలిగించింది.

నేను బొంబాయిలో వామన్‌జీ పెటిట్ రోడ్డులో నివసిస్తూ వుండేవాణ్ణి. సుమారు ఉదయం పది గంటలప్పుడు నాకు ఓ మిత్రుడు ఫోన్ చేసి ఇలా చెప్పాడు– "లోహియాగారు యిక్కడికి వచ్చారు. తీరికలేని కారణంగా నీకు చెప్పలేకపోయారు. సాయంకాలం 6 గంటలకు రైల్లో వాపసు పోతున్నారు. నీవు నీ శ్రీమతి పుష్పగారితో పాటు స్టేషనుకు వచ్చి మాట్లాడి పొమ్మన్నారు.

మేమిద్దరం స్టేషన్‌కు వెళ్ళాం. జార్జి ఫెర్నాండెజ్ లోహియాగారి సామాన్లను రైలుపెట్టెలో వుంచుతున్నారు. లోహియా రైలుపెట్టెలో కూర్చొని వున్నారు. మమ్మల్నిద్దర్నీ ప్రక్కన కూర్చోమని చెప్పారు. అప్పుడు ఆ మహానుభావుడు మాతో పలికిన పలుకులు ఆ గడ్డురోజుల్లో, ఆందోళనతో వూగిసలాడుతున్న దినాల్లో మాకెంత ఊరట కలిగించాయని? మా గుండెల్లో ఎంత నిబ్బరం నింపాయని? వర్ణించడానికి మాటలు రావంటే నమ్మండి. మేమిద్దరం మాపై మోపబడ్డ అపనిందలతో, ఆరోపణలతో కొట్టు మిట్టాడుతుంటే, మా ఆవేదనను, ఆరాటాన్ని లోహియాగారు ఎలా పసిగట్టారోకాని మా మనస్సుకు పిసరంత బాధ కూడా కలగకుండా, మా తప్త హృదయాలకు చల్లని లేపనం దిద్దగలిగారా మహాత్ముడు. కుంగిపోతున్న మనస్సులతో దిగాలుపడ్డ మమ్మల్నిద్దరినీ ధైర్యంగా తలెత్తుకు తిరిగేలా, జీవన సమరంలోని ఆటుపోట్లకు ఎదురొడ్డి నిలిచేలా చేశారాయన.

తర్వాత్తర్వాత మా ఇద్దరి మధ్య ఆత్మీయత మరింత గాఢమయింది. ఢిల్లీ, హైదరాబాద్, లక్నో నగరాలు ఆయన కార్యక్షేత్రాలు. అయితే బొంబాయి మహానగరం మాత్రం ఆయన కర్మభూమి కావడంతో పాటు, ఆయన విశ్రాంతధామం కూడా. బొంబాయిలో జార్జి ఫెర్నాండెజ్, మధులిమాయే, మృణాల్, దినకర్, సాక్రేకర్, ఇందుమతి కేల్కర్‌లతో కాలం గడపటంలో లోహియా ఎంతో మనశ్శాంతి

పొందేవారు. ఢిల్లీలోని రాజకీయ వ్యూహాలు, సిగపట్లు, దగా, వంచనలకు దూరంగా, బొంబాయిలోని ఉదారమైన, ముక్త వాతావరణం, ఇంటా బయటా కనపడే పరిశుభ్రత, తమ తమ పనుల్లో మునిగితేలే మనుషులు, పడిలేచే సముద్ర తరంగాలు, సూర్యాస్తమ సమయంలోని కాషాయరంగు, లోహియాగారి మానసిక, శారీరక అలసటను పోగొట్టేవి. ఆయనకు ఎంతో ఆనందాన్నీ ఆహ్లాదాన్నీ కలిగించేవి. ఆయన బొంబాయికి వచ్చి, రాజకీయ కార్యక్రమాలనుంచి ముక్తులై, ఆటవిడుపు స్వీకరించి ఎంతగానో విశ్రాంతి, మనశ్శాంతి పొందేవారు. ఆయన తరచుగా కాఫీ తాగుతూ, రాజకీయాలతో సంబంధంలేని మిత్రుల గురించి మాట్లాడుతూ, ఎన్నెన్నో కబుర్లు చెబుతూ ఉల్లాసంగా కనపడేవారు.

చర్చిగేట్ వద్దనున్న బాంబేలి (ఇప్పుడా హోటల్ లేదు) ఆయనకు ఎంతో ఇష్టమైన స్థలం. ఆయన కార్యాలయం నుంచి ఫోన్ అందగానే, ఆయన చెప్పిన సమయానికి నేను బాంబేలి చేరుకొనేవాణ్ణి. ఆయన జీవిత చరిత్ర రాసిన ఇందుమతి కేల్కర్ పరిచయం నాకు అక్కడే కలిగింది. ఓ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వంలో ఓ సమతావాది (సోషలిస్టు) ముఖ్యమంత్రి అయ్యారు. నేను ఆయన్ను అభినందించాను. "ఇప్పుడే అంత తొందర ఎందుకు? కొన్ని రోజులు గడవనియ్యి. అప్పుడు అభినందిద్దువులే. ఇప్పటిదాకా కాంగ్రెస్ పార్టీ వాళ్ళతో పోరాడుతున్నా. ఇకమీదట కాంగ్రెస్ నాయకులతో పాటు, ఓ రాష్ట్రాన్ని పాలిస్తున్న మా పక్షం నాయకులతో పోరాడాలి"– అంటూ నన్ను మందలించారు లోహియాగారు.

ఆ రోజు ఆయన విచారంగా కనపడ్డారు. అధికారం చేతుల్లోకి రాగానే మనం పాటించాల్సిన నీతి నియమాలూ, విలువలు నిలుస్తాయా? అన్న అనుమానం తొలుస్తూ వున్నట్లుంది కాబోలు. ఎంతటి అపరంజి లాంటివాడు ఈ మనిషి? అపజయం ఆయన్ను ముక్కచెక్కలు చేయలేకపోయింది. జయం ఆయన్ను తన వశంలోకి తీసుకోలేకపోయింది. మనల్ని బుద్ధిజీవులుగా చెప్పుకొంటూ వుంటాం. మనం అప్పుడప్పుడూ ఒత్తిళ్ళకు లోనవుతూ వుంటాం. విచికిత్సలో పడి విలవిలలాడుతుంటాం. అంతస్సంఘర్షణకు గురై, తన్నుకులాడుతూ భ్రమాలోకంలో జీవిస్తుంటాం. మేధోబలంతో సృష్టించుకొన్న శబ్దాడంబరాల మధ్య తలదాచుకుంటాం. కాని లోహియాగారు మాత్రం ఎప్పుడూ తన వివేకాన్ని కోల్పోయేవారు కారు–

ఆయన కట్టుకున్న బొమ్మరిల్లు గోడలు భద్రంగా లేవని భావించినప్పుడు, నిర్దాక్షిణ్యంగా కూల్చివేసేవారు. అంటే ఆయన్ను కట్టుబాట్ల బందిఖానాలు నిర్బంధించ లేకపోయేవన్నమాట. స్వాతంత్ర్యమంటే ఆయనకు అంతిష్టం.

లోహియాగారి అభిభాషణల్ని కాని, ప్రకటల్నికాని ఎవరైనా పైపైన పరికిస్తే, తెలుసుకుంటే సరిగ్గా అర్థం చేసుకోనట్లే; చాలా సందర్భాల్లో అపార్థం చేసుకొనే ప్రమాదం కూడా వుంది. ఉదాహరణకి, భారతదేశంలో ఇంగ్లీషు ఆధిపత్యం, ఇంగ్లీషులో ఆలోచించి, రాతకోతలు చేసే కుహనా బుద్ధిజీవుల గురించి లోహియాగారి మాటలు, రచనలు చాలామందికి ఇనుప గుగ్గిళ్ళుగా తోస్తాయి. కొరుకుడు పడటం కష్టం. ఇంగ్లీషు వార్తాపత్రికలు, మాగజైన్లు లోహియాగారికి ఎంత అన్యాయం చేశాయో, ఆయన వ్యక్తిత్వానికి ఎంత మసిపూయడానికి ప్రయత్నించాయో, ఇంగ్లీషు చదువుకున్న వాళ్ళ దృష్టిలో ఆయన్ను దిగజార్చడానికి ఎంత ప్రయత్నించాయో – అదంతా పాతకథ.

ఎన్నో విషయాల గురించి రాజీపడుతూ భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దాలని నెహ్రూగారి ఆలోచన. భారతదేశంలో ఎన్ని గడ్డు సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నా, బయటి ప్రపంచానికి మాత్రం మనదేశం ఉజ్జ్వలంగా ప్రకాశిస్తోందనే తప్పుడు సందేశం ఇవ్వడానికి లోహియా సుతరాం అంగీకరించేవారు కారు. నెహ్రూగారి ఈ కాల్పనిక, అసత్యదృష్టి ఆయనకు మింగుడు పడేది కాదు. ఆయనకు పైపై పూతలు, మాటలు అస్సలు నచ్చేవి కాదు. భారతదేశాన్ని అట్టడుగు దశ నుంచి మెల్లమెల్లగా బాగుచేయాలన్నది ఆయన తపన, తపస్సు. నిజాన్ని దాచిపెట్టి, ముసుగులు ధరించి ముసి ముసి నవ్వులు నవ్వేవారిపై ఆయన మండిపడేవారు. కుహనా మేధావులైన ఇంగ్లీషు మాట్లాడే మహాశయుల్ని నిర్భయంగా, నిర్దయతో ఖండించేవారు. అప్పుడా పెద్ద మనుషులు తమ ముసుగుల్ని తొలగించి, తమ అసలు రంగును బయటపెట్టారన్న కోపంతో లోహియా ప్రతిపాదనల్ని, సిద్ధాంతాల్ని వక్రీకరించి ఆయనను తేజోవధ చేసేవాళ్ళు. తమ తప్పుల్ని సవరించుకోలేక ఆ బుద్ధిజీవులు ప్రజల దృష్టిలో లోహియాగారిని అపఖ్యాతి పాలు చేసేందుకు ప్రయత్నించేవాళ్ళు.

లోహియా ప్రతి సమస్యకు మూలకారణాన్ని వెతికేవారు. మానవతా

దృక్పథంతో ఆలోచించి, లోతుగా అధ్యయనం చేసి పరిష్కారమార్గాన్ని అన్వేషించేవారు. పల్లెపట్టుల్లోని అట్టడుగు వర్గాల ప్రజల శ్రేయస్సును ఆకాంక్షించేవారు. లోహియాగారి విలక్షణ దృక్పథం ఇది. దేశంలో ఇంగ్లీషుభాష నేర్చిన వాళ్ళు రెండు శాతం మాత్రమే వున్నారు. అలాంటప్పుడు, అతికష్టం మీద బతుకుబండి ఈడుస్తున్న అధిక సంఖ్యాక ప్రజల శ్రేయస్సు; చాలా తక్కువ సంఖ్యలో వున్న ఈ ఆంగ్ల విద్యాధికుల మేలుకోరే ప్రణాళికలు తయారుచేసే వాళ్ళ దృష్టికి ఎలా వస్తుంది? ఇంగ్లీషు చదువుకున్న ఈ రెండు శాతం అల్ప సంఖ్యాకుల అభివృద్ధే దేశాభ్యుదయమా? లోహియా పార్లమెంటులో కాలుమోపాక ఈ అల్పసంఖ్యాక విద్యాధికుల, వాళ్ళ ప్రతినిధుల ముసుగుల్ని తొలగించి వాళ్ళ పన్నాగాల్ని చీల్చి చెండాడారు. వాళ్ళ నోటికి తాళం వేశారు. జనతా ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఇంగ్లీషు పాత్రికేయులు, రచయితలు, విద్యావేత్తలు భారతీయత, దేశీయ భాషల మీద ధ్వజం ఎత్తినప్పుడు; లోహియా సామాజిక తత్త్వచింతనతో ప్రభావితులైనవాళ్ళు ఎవరైనా వాళ్ళని ఎదుర్కొన్నారా? లోహియాలాంటి మగధీరులు ఒక్కరంటే ఒక్కరు లోక్‌సభలో నోరు విప్పారా? లేదే, లేనే లేదే?

లోహియాగారిది కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడే స్వభావం. ఆయన పార్లమెంటులో మాట్లాడేటప్పుడు ఆంగ్లభాషా ప్రియులతోనేకాదు, హిందీ భాషాప్రియులు, విద్వాంసులతో కూడా తలపడేవారు. హిందీభాష అంటే లోహియా దృష్టిలో రాష్ట్రభాష హోదా, హిందీభాషా ప్రచారసభలు, పరీక్షలు, గ్రాంటులు, వగైరా కానేకాదు. సమాజంలోని బడుగు వర్గాల ప్రజల ఆశనిరాశలు, రాగద్వేషాలు, చావుబ్రతుకుల సమస్యలన్నమాట. ఆ భాషద్వారా సన్నజీవాల భావవ్యక్తీకరణకు సులభమైన, సుందరమైన పద్ధతి అన్నమాట. కొంతమంది హిందీని బలపరిచే నాయకులు తమ అజ్ఞానం కారణంగా హిందీభాష ప్రచారం యొక్క మూల ఉద్దేశం, లక్ష్యాల ఉనికినే మరచిపోయి పక్కదారి పడితే లోహియా సహించేవారు కాదు. లోక్‌సభలో రాష్ట్రభాష హిందీ గురించి చర్చ జరిగే సమయంలో డా.లోహియాగారు హిందీ ప్రాముఖ్యం గురించి బల్లగుద్ది వాదించే డా. సేఠ్ గోవిందదాస్ గారితో తీవ్రంగా, దురుసుగా వాదించేవారు. అప్పుడు వారిద్దరి వాదోపవాదాలు సభ్యతా– సంస్కృతుల హద్దులు దాటిపొయ్యేవి. అప్పుడు ఇంగ్లీషు వార్తాపత్రికలకు పేజీలు నింపేందుకు కొండంత సామగ్రి లభించేది.

డా.గోవిందదాస్ గారికి హిందీపట్ల కొండంత భక్తిశ్రద్ధలుండేవి. ఈ విషయమై ఎవరికీ సందేహముండేదికాదు. రాజభాష దిద్దుబాటు గురించి ఓటువేసే సమయంలో ఆయన నెహ్రూ మరియు కాంగ్రెస్‌పార్టీ అభిప్రాయాలకు వ్యతిరేకంగా ఓటు వేశారు. కాని సేఠ్ గోవిందదాసు చుట్టూ తిరిగే కొందరు కాంగ్రెసు నాయకులు, హిందీ అభిమానులు తమ స్వార్థం కోసమై హిందీకి జాతీయభాష హోదా లభించాలని వాదించేవారే కాని వాళ్ళకెవ్వరికీ హిందీభాష గౌరవ ప్రతిష్ఠలు నిలపాలనే సదుద్దేశం ఉండేదికాదు. అంతేకాదు, హిందీకి జాతీయభాషాస్థాయి కలిగించడానికి వారి ప్రయత్నాలు ఆటంకం కలిగించేవి.

పార్లమెంటులో లోహియా, సేఠ్ గోవిందదాస్‌గారల మధ్య తీవ్రమైన, కటువైన వాదోపవాదాలు జరిగిన తర్వాత సేఠ్ గోవిందదాస్‌గారు ఓమారు బొంబాయికి వచ్చారు. నేను వారిని కలిసి "మీరు లోక్‌సభలో డా.లోహియాగారితో వాదించిన తీరు సముచితంగా లేదని" వినమ్రతతో విన్నవించుకొన్నాను. గోవిందదాసుగారు సరళమైన వ్యక్తి. సంస్కారవంతులు. అప్పుడు ఆయన నాతో ఇలా అన్నారు: "లోహియాగారంటే నాకెంతో గౌరవం. కాని ఆయన నా గురించి కటువుగా మాట్లాడినప్పుడు, నేనెలా వూరకుండగలను?" ఆయన మాటలు శ్రద్ధగా విని, నేను అరగంట సేపు ఆయనకు నచ్చచెప్పాను. కొంతమంది హిందీ విద్వాంసులు, పీఠాధిపతులు తమ పబ్బాలు గడుపుకోవడానికి ఆయనకు ఏవేవో నూరిపోశారని మనవి చేశాను. అప్పుడు సేఠ్ గోవిందదాసుగారు ఎంతగానో బాధపడుతూ, "నేనీసారి ఢిల్లీ వెళ్ళినప్పుడు లోహియాగారితో మాట్లాడుతా"నని మాట యిచ్చారు.

ఢిల్లీలో వారిద్దరి మధ్య ఏం మాటలు జరిగాయో తెలియలేదు. కాని తర్వాత ఎప్పుడూ సేఠ్‌జీ లోహియాగారితో అమర్యాదకరంగా వ్యవహరించలేదు. కొంతమంది విశ్వవిద్యాలయ హిందీ ఆచార్య పుంగవులు, నవ్య హిందీ రచయితలు డా.లోహియాగారిని ఆకాశానికి ఎత్తుతూ వుండటం చూసి అసూయతో సేఠ్ గోవిందదాసుగారు డా.లోహియాగారికి వ్యతిరేకంగా కత్తి కట్టారని తెలిసింది. డా. రామ మనోహర లోహియాగారి వ్యక్తిత్వంలోని కొన్ని ముఖ్యమైన గుణాల్ని మనం అవగతం చేసుకోవాల్సివుంటుంది. ఆయన ప్రాచీన భారతీయ సంప్రదాయాలను అంగీకరించేవారు కాదనే దురభిప్రాయాన్ని కొంతమంది ప్రచారం

చేశారు. ఆయన ప్రతిపాదనలనీ, ప్రకటనలనీ ఆంగ్ల పత్రికా రచయితలు మాత్రమే వ్యతిరేకించే వారు కాదు; ఇంగ్లీషు పత్రికల పూత మెరుగులకు వశీభూతులై ఇంగ్లీషు పాత్రికేయుల గౌరవాదరాలు పొందాలని ఆశించి, నిరాశకు గురైన హిందీ పాత్రికేయులలో కొందరు మధ్యందిన మార్తాండునిలాగా ప్రజ్వరిల్లుతున్న డా.లోహియా పంచన చేరారు. వాళ్ళు తమ స్వార్థ చింతనతో లోహియా చుట్టూ మూగారేకాని, ఆయన నిస్వార్థ బుద్ధినిగాని, సమతా స్వాతంత్ర్య భావనాగరిమను కానీ పొందలేకపోయారు. కొంతకాలానికే ఆ హిందీ పాత్రికేయ అనుచరుల బండారం బయటపడింది. ఒకప్పుడు లోహియాగారిపై ప్రశంసల వర్షం కురిపించి, ఆయన్ను ఆకాశానికెత్తిన పాత్రికేయుడు యశ్‌పాల్ కపూర్ వారిలో ఒకరు. మరో పాత్రికేయుడు సంపూర్ణ సామాజిక విప్లవాన్ని సమర్థించి, కొన్ని రోజులకే ప్లేటు ఫిరాయించి హాస్యాస్పదుడయ్యాడు. అతని మర్యాద కాస్తా మంట కలిసిపోయింది. ఈ నకారాత్మక దృష్టి ఎదుటివాళ్ళను చులకనగా చూసే ఓ అనారోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది.

ఈ దృక్పథం డా.రామమనోహర్ లోహియాగారి సిద్ధాంతాలకు పూర్తిగా వ్యతిరేకమైనది.

## సౌందర్యం

లోహియాగారి వ్యక్తిత్వాన్ని సమగ్రంగా తెలుసుకోవాలంటే ఆయన సహజ ప్రవృత్తిలోని ప్రముఖ గుణాలైన సమత, స్వాతంత్ర్యంతో పాటు సౌందర్యాన్ని కూడా పరిగణించాలి. సౌందర్యమంటే పైకి కనపడే అందచందాలు కాదు. ఒక వ్యక్తి, జాతి, దేశం, కళాఖండంలోని అంతరంగ శోభ, అందం. ఇలాంటి అంతరంగ సౌందర్యాన్ని లోహియాగారి పదునైన చూపులు ఇట్టే పసిగట్టేవి. అలాంటి అపురూపమైన సౌందర్యాన్ని చూసి ఆయన నిలువెల్ల పులకించిపొయ్యేవారు.

లోహియాగారు దేవాలయ వాస్తుకళ, శిల్పకళ గురించి 'జన్' పత్రికలో ధారావాహికంగా వ్యాసాలు వెలువరించారు. కళల గురించి లోహియాగారికున్న మౌలికదృష్టి, వ్యాఖ్యాన కౌశలం పేరుమోసిన కళావిమర్శకులకెవ్వరికీ లేదని నేను ఢంకా బజాయించి చెప్పగలను. లోహియాగారు పౌరాణికపాత్రలైన రాముడు, కృష్ణుడు, శివుడు, సీత, ద్రౌపది, విశ్వామిత్రుడు– వీళ్ళ హృదయసౌందర్యాన్ని

విప్పిచెప్పిన వైనం అనన్యసామాన్యం. ఆయన దృష్టి దేవాలయం గోడలపై చెక్కబడిన శిలాప్రతిమల సౌందర్యానికీ, కావ్యనాటకాదుల్లో చిత్రింపబడ్డ పాత్రల సౌందర్యానికే పరిమితం కాలేదు. ఆయన తన కళ్ళ ముందు తిరిగే వ్యక్తులనుంచీ, జరిగే, సంభవించే ఘటనల నుంచీ, ప్రకృతిదృశ్యాలనుంచీ రకరకాల అనుభూతుల్ని అనుభవించేవారు. ఆనందం పొందేవారు. అవకాశం చిక్కినప్పుడల్లా పరిసరాల నుంచి ప్రేరణ పొందేవారు.

ఆ రోజుల్లో జుహూ ప్రాంతంలో ఇప్పటిలాగా పెద్ద పెద్ద హొటళ్ళు, దుకాణాలు వుండేవి కావు. ఇంత రద్దీ అసలే వుండేది కాదు. పూల మొక్కలతో పూల తీగలతో కప్పబడి విడి విడి వసతి గృహాలతో కూడిన జుహూ హొటలు మాత్రం వుండేది. ఈమారు ఆయన ఎవ్వరికీ చెప్పాపెట్టకుండా విశ్రాంతి తీసుకోవటానికే బొంబాయి వచ్చారు. లోహియాగారు సాయంకాలం జుహూ హొటలుకు వచ్చి కలవమన్నారు. ఎందుకంటారా, కొన్ని గంటలపాటు జుహూ బీచ్‌లో ఇసుక మీద కూర్చొని సూర్యాస్తమయాన్ని చూస్తూ వుండటానికే.

ఆ రోజు లోహియాగారు మాంచి మూడ్‌లో వున్నారు. ఆయన హొటల్ గదిలో కూర్చొని మిత్రులందరి మీద వాడి, వేడి జోకులు వేస్తూ కవ్వించసాగారు. టీ సమయం అయ్యేసరికి గది కిటికీకి ఎదురుగా ఆవరణలో కుర్చీలు వేయించి నీలాకాశం కింద అందరికీ పొగలు కక్కే చాయ్ తెప్పించారు. సుదూరంగా సూర్యుడు పడమటివైపు కుంగిపోతున్నాడు. లోహియా రామాయణం ప్రసక్తి లేవనెత్తారు. ఆయన వున్నట్టుండి "రాములవారు పశ్చిమ సముద్రంలో మునిగిపోతున్న దినకరుడు అస్తమించే దృశ్యాన్ని ఎప్పుడైనా చూశారా? రామేశ్వరం తూర్పుతీరంలో వుంది కదా!" అని అన్నారు.

"కాని లంక ద్వీపం కదా. అక్కడి నుంచి సూర్యోదయాన్ని, సూర్యాస్తమయాన్నీ చూడొచ్చుగా" అని అన్నాను.

"సరే కాని, నీవు ఇంటికి వెళ్ళి ఓసారి వాల్మీకి రామాయణం చూడు. అందులో ఎక్కడైనా సాగరతీరంలో సూర్యుడు అస్తమించే దృశ్యవర్ణన వుంటే, చూసి నాకు ఉత్తరం రాయి'' అన్నారాయన. ''సౌందర్యంలో కరుణరసం తొంగి చూస్తుంటుంది. అందుకే కాబోలు ఉదాత్తంగా ఉంటుందా వర్ణన. సూర్యోదయంలో

కదలిక వుంటుంది. ఉత్తేజం, ఉల్లాసం వుంటుంది. సూర్యాస్తమయంలో కరుణ వుంటుంది. మృదుత్వం వుంటుంది. పరిపక్వత ఉంటుంది" అంటూ లోహియాగారు ఎంతోసేపు తన్మయత్వంతో మాట్లాడారు. సూర్యబింబం కొస భాగం క్షితిజాన్ని తాకుతున్న సమయంలో ఆయన కుర్చీ నుంచి లేచి, సముద్రతీరంలోని ఇసుక మీద కూర్చొన్నారు. "భూమిని స్పర్శించడం ఎంతో అవసరం. మాట వరసకు కాదు, ఆమె మనల్ని తన ఒడిలోకి – అక్కునకు హత్తుకొంటుంది. ఆమె ఒడిలో కూర్చోవోయ్, నీకే తెలుస్తుంది" అన్నారు. ఆకస్మాత్తుగా ఆయన కళ్ళల్లో కాంతి తొంగి చూసింది.

ఆయన చిలిపిగా, "నీ కుర్చీ కాస్తా ఎత్తుగా ఉంది డాక్టర్! కాని ఈ ఇసుక తిన్నె వుంది చూశావ్, దాని కంటె చాలా ఎత్తుగా వుంది. దీన్ని నీవు మరువకుండా వున్నావంటే జీవితాంతం పనులు చక్కగా చేస్తూ వుండగలవు. జనక మహారాజుకు ఈ సంగతి బాగా తెలుసు. అందుకనే ఆయన సింహాసనం మీద తామరాకు మీద నీటి బిందువులాగా కూర్చుండ గలిగాడు" అన్నారు. తర్వాత ఆయన రాజర్షి వసిష్ఠుల వారివైపు, ప్రజామనీషి అయిన విశ్వామిత్రులవారి వైపు ఆకర్షితులయ్యారు. పిమ్మట నలుపు– తెలుపు రంగుల పట్ల మరలారు. పిదప అందచందాల లక్షణాలేమిటో, వాటి కొలబద్దలేమిటో చర్చించసాగారు. ఆ తర్వాత సౌందర్యం గూర్చి విరాట్ స్వరూప నేపథ్యంలో ఆలోచించడం మొదలెట్టారు. పొలాల్లో కంకులు కోస్తున్న పల్లెపడుచుల, కార్ఖానాలలో దైత్యాకారపు యంత్రాల దగ్గర చెమటోడ్చి పనిచేస్తున్న కండలు తిరిగిన కార్మికులు, తొట్లలో నిద్రపోతున్న పసికందుల వైపు ప్రేమతో చూస్తున్న తల్లుల కళ్ళు, ఖజురాహో శిల్పాలు, కాంగ్రా రంగుల చిత్రాల్లో కనిపించే నాయికలు, లాహోర్ కోటలోని జైళ్ళు, జింకపిల్లల కళ్ళు, ద్రౌపది– కృష్ణుల స్నేహం, అవధిప్రాంత జానపద గేయాల సౌందర్యం, అజంతా గుహల దగ్గర ప్రవహించే మలుపులు తిరిగే నది సోయగాలు, సముద్రాన్ని ఆవరిస్తున్న చీకటి, హిమగిరి సొగసులు– సముద్ర సౌందర్యాలతులన– ఈ అంశాల్ని తల్లీనులై చర్చించారు. నేను దీఘా ప్రాంతం సముద్రతీరం గురించి నా మధురస్మృతుల్ని వినిపించాను. మరి ఆయన చిత్రకూటంలోని కొండగుట్టల్ని, వనాల్నీ, మందాకినీనది సమీపంలోని లోయల సౌందర్యాన్ని మైమరిచి చెప్పారు.

నేను దక్షిణభారతంలో పర్యటించలేదు. ఈసారి తాను దక్షిణభారతదేశ యాత్ర చేసేటప్పుడు నన్ను వెంట తీసుకెళ్తానని అప్పుడు అక్కడి గుడిగోపురాల

వాస్తు, శిల్పకళ గురించి విడమరిచి చెప్తానని నాతో అన్నారు. కాని నాకా మంగళ ముహూర్తం కలిసి రాలేదు. ఆయన ఢిల్లీ తిరిగి వెళ్ళారు. మంచం పట్టారు. ఓ రోజు సూర్యుడు అస్తమించాడన్న దుర్వార్త దేశాన్నంతటినీ కలచి వేసింది.

ఆ సాయంకాలం మా యిద్దరి చివరి కలయిక. లోహియాగారి వ్యక్తిత్వం – సమత, స్వాతంత్ర్యం, సౌందర్యాల త్రివేణీ సంగమం. ఆయన జీవితాన్ని సంపూర్ణంగా, మనసారా ఆనుభవించాలని అనుకొన్న అపురూపమైన మనిషి. ఆ నల్లనయ్య ముఖంలో అప్పుడప్పుడు త్రిభంగిమలోని కృష్ణుని కాంతులు ఎందుకు వెలిగేవో నేను తరచు ఆలోచిస్తుంటాను.

# ద్రౌపది – సావిత్రి

అనువాదం : **సురమౌళి**

**ఈ** స్త్రీలిద్దరూ కేవలం కల్పిత పాత్రలే అయివుండవచ్చు, లేదా నిజమూ అయివుండవచ్చు. ఏదో ఒక రూపంలో నిజమై ఉండి, ఆ తర్వాత కాలక్రమేణా వారికి అనేక కథలను అల్లి జత చేస్తూ ఉండినా ఉండవచ్చు, లేదా నలుగురైదుగురు ఆడవాళ్ళకు చెందిన కథలను సమీకరించి ఒకే స్త్రీ చుట్టూ అల్లినా అల్లివుండవచ్చు. మహాభారతంలో ద్రౌపది అందరికన్నా గొప్ప స్త్రీ అనేది నిర్వివాదాంశం. ఈమెకు మరోపేరు కృష్ణ. ఈ పేరు ఆమెకు ఎందుకు వచ్చి ఉంటుందన్న విషయం మీద ఎక్కువగా చర్చించకుండా–ఒకే మాట చెపుతాను. బహుశా ఆమె రంగు శ్యామలమైనదై ఉంటుంది. మహాభారత కథానాయకుని పేరు కృష్ణుడు – కనుక నాయిక పేరు కృష్ణ అయి ఉంటుంది. అది కృష్ణాకృష్ణుల గాథ.

కృష్ణాకృష్ణుల సంబంధాలను గురించి తరవాత చెబుతాను. ఇప్పుడు కేవలం కృష్ణ – ఎంత గొప్ప పాత్రో దానిని గురించి మాత్రమే మీకు వివరిస్తాను. భారతదేశంలో ఈనాటి స్త్రీ – పురుషులందరూ, ద్రౌపదికి ఐదుగురు భర్తలుండేవారు కనుక, ఆమె పంచభర్తృత్వ విశిష్టతను మాత్రమే గుర్తు పెట్టుకుని ఆమెను జ్ఞాపకం చేసుకుంటున్నారు. ఇది విచారించవలసిన విషయం. ద్రౌపది యొక్క విశిష్టతల వైపుకు సామాన్య ప్రజల దృష్టి పోదు. ఆమెకు ఐదుగురు భర్తలుండేవారా? ఆరుగురా, ఆరున్నరమందా? అనేది నిరర్థకమైన ప్రశ్న. ఏ స్త్రీకి ఎందరు భర్తలుండేవారు? ఎంతమంది ప్రేమికులుండేవారు? ఈ ఒక్క అంశాన్ని ఆధారం చేసుకుని ఆమె శీలం ఎటువంటిదని మాత్రమే పరిశీలించడం, ఆమెకున్నటువంటి మిగతా గుణగణాలను పరిశీలించకపోవడం ఈ నాడు భారతదేశ ప్రజల పతనావస్థకు సంకేతమే గాని మరొకటి కాదు.

ఇందుకు పూర్తిగా భిన్నమైనది సావిత్రి వ్యవహారం. సావిత్రిని గురించి ప్రజలకు బాగా గుర్తున్న గాథ ఒకటే. ఆమె పతివ్రత – పతివ్రత శబ్దానికి ప్రతీక సావిత్రి పాత్రే. ఎంతటి పతివ్రత అంటే, భర్తను ఎంతగా ప్రేమించిందంటే, భర్త మరణించిన తరవాత కూడా యమధర్మరాజు వెంటపడి వెళ్ళి, తన భర్త ప్రాణాలను తిరిగి తెచ్చుకుని పునరుజ్జీవింపచేసుకున్నది. సావిత్రి మాట ఎత్తితే హిందూ స్త్రీలుగానీ, హిందూ పురుషులుగానీ సంభ్రమాశ్చర్యాలతో, గౌరవ ప్రపత్తులతో వింటారు. 'ఎంత గొప్ప స్త్రీ' అని తలలూపుతారు. హిందూ పురాణాలలో ఇలాంటి పతివ్రతను పోలిన పత్నీవ్రతుని కథ ఏదైనా ఉన్నదా? తన భార్య మరణిస్తే యమధర్మరాజు వెంటపడిపోయి, భార్య ప్రాణాలను తిరిగి తెచ్చి, పునరుజ్జీవింప చేసుకున్న కథ ఏదీ హిందూ పురాణాలలో ఎందుకు లేదు? ఇటువంటి గాథలు ఇరుపక్షాలా ఉంటేనే ఆనందంగా ఉంటుంది కదా! అలాంటి కథ ఏదీ లేదనేది సర్వవిదితం. సమానత్వం పునాదుల మీద నవప్రపంచాన్ని నిర్మించుకోవడానికి ప్రయత్నించే వ్యక్తికి, హిందూపురాణాల్లో లేదా భారతీయ ఇతిహాసంలో 'సావిత్రి' పేరు మీద ఇంత గొప్ప పతివ్రత పాత్ర ఉన్నప్పుడు – అంతగొప్ప పత్నీవ్రతుని పాత్ర కూడా ఎందుకు లేదన్న ప్రశ్న రావడం అసహజం కాదు.

కానీ అలాంటి కథ లేదు. ఇందువల్ల ఏమి రుజువవుతున్నది? ఇలాంటి కథలను అల్లిన కాలంనుంచి, లేదా నిజంగానే ఇలాంటి కథలు సంభవించిన కాలంనుంచి – సావిత్రి కథ నిజంగానే జరిగివుంటుందని కాసేపు భావిద్దాం – ఇప్పటి వరకూ పతివ్రతలను లేదా పాతివ్రత్య ధర్మాన్ని తు.చ. తప్పకుండా పాటించిన ఆడవాళ్ళను, మనో, వాక్కాయాత్మల ద్వారా భర్తతో లీనమైపోయినవారిని భారత ప్రజలు అమోఘంగా గౌరవించారనీ, ఆరాధించారని కదా! ఇందుకు భిన్నంగా ఆడవారిపట్ల మగవాడికి కూడా అటువంటి శ్రద్ధ, లేదా భక్తి లేదా ప్రేమకు సంబంధించిన కథలు, జన్మజన్మాంతరాల వరకూ కొనసాగిన ప్రేమగాథలు ఎందుకు లేవు? ఈ జన్మకు ఎలాగూ ఇటువంటి భర్త లభించాడు. ముందు జన్మలో కూడా ఇటువంటి భర్తే లభించాలన్న తత్వం భారత మహిళ ప్రకృతిలో ఉంటుందని మీరు వినే ఉంటారు. ఆమె నిజంగానే పతివ్రత అయి ఉండినట్లయితే పూర్వజన్మలో కూడా ఇతనే భర్త అయివుంటాడు. పూర్వజన్మలు– ముందుజన్మలూ ఉంటాయా ఉండవా? అనే ప్రశ్నను వదిలేద్దాం. ఈ కథలను నేను కేవలం కథలుగానే పరిశీలిస్తాను.

పూర్వజన్మలను– పునర్జన్మలను నేను విశ్వసిస్తాననుకోవద్దు. నాకలాంటి విశ్వాసం బొత్తిగా లేదు. ఇవన్నీ కల్లబొల్లి కథలే. అయితే ఈ కల్లబొల్లి కథలలో కూడా అక్కడక్కడ, అప్పుడప్పుడూ చాలా గొప్ప విషయాలు లభిస్తుంటాయి. సృష్ట్యాది నుంచీ, స్త్రీ–పురుషుల ఆవిర్భావం వరకూ ఆడది ఒకే మగవాడికి కట్టుబడి ఉండటమనేది ఘోరమైన పతనావస్థ. ఇంతటి అనంతకాలం వరకూ ఒక ఆడది ఒకే పురుషునికి కట్టుబడి ఉండటం మంచిదా కాదా అన్న అంశాన్ని నేను చర్చించదలచుకోలేదు. ఒకే ఒక ప్రశ్న అడగదలచుకున్నాను. సమతూకం కొనసాగించాలంటే సమాజ నిర్మాణం సక్రమంగా ఉండాలంటే జన్మజన్మాంతరాల వరకూ ఆడది ఒకే పతిని కోరుకున్నట్లుగానే, మగవాడు కూడా ఒకే సతికి కట్టుబడి ఉండాలి గదా!

అలాంటి ప్రతీకగానీ, కథగానీ భారతీయ పురాణాల్లో లేదని ఎందుకంటావు, రాముడు లేడా అని కొందరు నన్ను ప్రశ్నించారు. ఒక స్త్రీ కోసం, కట్టుకున్న భార్య కోసం రాముడు ఎంతగా తపించాడు, ఆమె పట్ల అతని కెంత భక్తిప్రపత్తులుండేవని ప్రశ్నిస్తుంటారు. ఈ రెండింటి మధ్యా చాలా అంతరం ఉన్నది. రామకథలో రాముని పాత్రలో నాకు కనిపించిన మూడు నాలుగు లోపాలలో సీతపట్ల ఆయన వ్యవహరించిన తీరు కూడా ఒక లోపం అని నేను భావిస్తున్నాను. మామూలు లోపం కాదు. ఘోరమైన లోపం. మీతో చర్చ జరుపుతున్నప్పుడు నేనీ అంశాన్ని అనేకసార్లు వివరించాను. ముఖ్యంగా యువకులు, రాముని చర్యలో ప్రజాస్వామ్యాన్ని చూడటానికి పూనుకుంటూ ఉంటారు. రాముడు ఎంతటి ప్రజాస్వామ్యవాది, ఒక రజకుని మాట మీద భార్యను అడవులకు పంపాడే, అగ్నిపరీక్ష పెట్టాడే అని చకితులై వాదిస్తూ ఉంటారు. రజకుని మాట మీద అడవులకు పంపాడన్న దాన్ని కాసేపు ఒప్పుకుందాం. మరి అగ్నిపరీక్ష పెట్టవలసిన అవసరం ఎందుకు వచ్చింది? ఆ సమయంలో ఉత్పన్నమైన సమస్య ఏమిటి? మాట వరసకు అక్కడ గుమికూడిన జనంలో గుసగుసలు బయలుదేరినయ్యే అనుకుందాం. సభలో ఎవరో ఒకడు సందేహం వెలిబుచ్చాడనే అనుకుందాం. ఆ సందేహం వెలిబుచ్చిన వ్యక్తి ఎవరో ముందుకు వచ్చి తన సందేహకారణాన్ని వివరించమని అడగటం ప్రజాస్వామ్యం గదా! రాముడు ప్రజాస్వామ్యాన్ని అంతగా ఆరాధించినవాడే అయితే అతనికి మరో మార్గం ఏదీ లేదా? అధికారపీఠాన్ని త్యజించి, సీతతో మళ్ళీ వనవాసానికే వెళ్ళడానికి

పూనుకోవచ్చుగదా! ఈ కథ అంతా మలినమైన కథే. రాముడు సీత పట్ల వ్యవహరించిన తీరును గమనించిన భారత స్త్రీలు ఎవరైనా రాముని భక్తితో ఎలా కొలువగలుగుతున్నారని నాకు అనేకసార్లు ఆశ్చర్యం వేస్తుంది. అయినప్పటికీ 'మర్యాదా పురుషోత్తమ' రామతత్వాన్ని, ముఖ్యంగా రాజకీయరంగానికి సంబంధించినంత వరకు ఆయన పాటించిన కఠిన నియమాలను- తలచుకొంటే నాకు కొంతవరకు సంతోషమే కలుగుతుంది. ఆయనలోని నాలుగైదు లోపాలను కూడా బాగా అవగాహన చేసుకుని, ఆయనకు ఉండిన ఆ మహోన్నత గుణం నుంచి భారతీయులు- స్త్రీలూ - పురుషులూ కూడా కొంతవరకు పాఠం నేర్చుకోవాలని నా అభిప్రాయం. రాజకీయరంగంలో రాముని వంటివారు ప్రపంచేతిహాసంలో నభూతో నభవిష్యతి అని నా అభిప్రాయం. పరిమితులను పరిరక్షించుకొని, నీతినియమాలను పాటించి, అత్యంత సంయమనంతో రాజకీయాలను నిర్వహించేవాడు రాముడు.

భరతు అవధి స్నేహ మమతాకీ
జద్యపి రాముసీమ సమతాకీ

మమతా స్నేహాలకు భరతుడు అవధి. అదేవిధంగా సమతా దృక్పథంలో ఎవరి పాత్రౌచిత్యాన్నయినా, ఎవరి శీలాన్నయినా అంచనావేస్తే రాముడే నిలుస్తాడు. సుఖ-దుఃఖాలలో, గెలుపు-ఓటములలో సమత్వం. అన్ని రకాల అవస్థలలోనూ ఒకే విధమైన సమత్వం. సమత్వంలో ఉంటూ, రాగద్వేషాలకు అతీతంగా ఉంటూ- ఆయన కథను క్షుణ్ణంగా పరిశీలిస్తే పూర్తిగా కాకపోయినా- సాధ్యమైనంత మేరకు ఆయన తన సమభావాన్ని ప్రదర్శించినట్టు అర్థమవుతుంది.

అయినప్పటికీ మీరొక్క విషయాన్ని వింటే బహుశా ఆశ్చర్యపడతారేమో? ఈనాటికీ భారతదేశంలో లక్షలాది, కోట్లాది సంఖ్యల ఆడవాళ్ళు, సీతపక్షం వహించి- ముఖ్యంగా ఇంట్లో ఎవరైనా ప్రసవించినప్పుడు, లేదా వివాహాది శుభకార్యాలు జరిగినప్పుడు పాడుకునే పాటల్లో - రాముణ్ణి పాపిష్టివాడని దూషిస్తూ ఉంటారు. ఈ సంగతి తెలిసినవారు చాలా తక్కువమంది. పుస్తకాలు రాసేవారందరూ చాలా వరకూ సభ్యతా సంస్కారాలున్నవారే కదా! కాని పొలాల్లో పనిచేసే ఆడకూలీలు, గడ్డీగాదం కోసుకునేవారు, తమ హృదయాలను విప్పి దూషిస్తారు. రాముడూ-ఆయన గురువు వసిష్ఠుని కథ మీకు తెలిసిందే కదా! యజ్ఞ సమయంలో సీత అవసరం

రామునికి గుర్తుకువచ్చి, సీత దగ్గరికి వసిష్ఠుణ్ణి పంపుతాడు. వసిష్ఠునితో సీత అంటుంది – “గురువుగారూ! మీరంటున్నారు కనుక మీతోబాటు వస్తాను! కాని ఆ పాపిష్టి ముఖాన్ని మరోసారి చూడను!” అని. ‘పాపిష్టి’ అన్నపదం చాలా తీవ్రమైన పదమే. చెమటోడ్చి బ్రతకడానికి అలవాటుపడ్డ కూలివనితలు మాత్రమే అలాంటి పదప్రయోగాన్ని సులువుగా చేయగలరు. మిగతావారికి ఆ సాహసం ఉండదు. ఇటువంటి ఆలోచనలు ఆదికాలపు రామాయణాల్లో ఉండేవి. కాని తరవాత తర్వాత వాటిని పరిష్కరించి తొలగించారు.

వేలాది సంవత్సరాల భారతీయ ఇతిహాసాల్లోగాని, పురాణాల్లోగాని, లేదా ఇటువంటి కట్టుకథల్లోగాని, ఎక్కడా కూడా స్త్రీ–పురుషుల మధ్య సమానత్వ భావనను చూపించలేదు. అలాంటి కథలను కవులు వర్ణించారు. గాయకులు గానం చేశారు. మళ్ళీ మళ్ళీ వీటినే రచించినవారు, తమ ప్రతిభను వీటిల్లో ప్రస్ఫుటీకరించారు. అయినప్పటికీ స్త్రీ–పురుషుల మధ్య అసమానతలే కొనసాగాయి. అయితే ఈ అసమానతల దృక్పథంతోనే పతివ్రతా ధర్మాన్ని ప్రతిపాదించే ఒక సుందరగాథను కూడా రచించారు. నేను దానిని అవమానించదలచుకోలేదు. అది చాలా సుందరమైన గాథ. ఒకరికన్నా ఎక్కువమందిని ప్రేమించే స్త్రీని – ఒకేసారి అందరినో, లేదా ఒకరి తరువాత ఒకరి చొప్పుననో – ప్రేమించే స్త్రీని నేను గౌరవిస్తున్నానని మీరు అనుకోవద్దు. నాకు కావలసింది సమానత్వం. ప్రపంచం సజావుగా ఉండాలంటే సమానత్వం సాగాలంటే, ఒకరి తర్వాత ఒకరిని ప్రేమించే అధికారం, అవకాశం మగవారికుంటే, ఆడవారికి కూడా ఉండాలి. అసమానతల పునాదులపైననే ఈ సుందర రచన జరిగింది. అయితే అది ఆలోచనలవరకే పరిమితమై పోయింది. దాని ఫలితంగా సమాజంలో ఆచరణ మారలేదు. సమాజం మీద దాని ప్రభావం పడనేలేదు. భారతదేశంలో ఆడదాన్ని ఏ ఏ విషయాల్లో కేవలం పాతగుడ్డల మూటగా తయారుచేశాడు అనేవాటి వివరాలను పేర్కొనడం ఇక్కడ అనవసరం. సామాజికజీవితంలో ఏదన్నా చేసే శక్తిగా కాక ఆడది ఒక భారంగా తయారైంది. అంతేకాక ప్రేమకు సంబంధించిన విషయాల్లో కూడా – ప్రేమ, స్నేహం, మోహం ఏమన్నా అనండి– దానికి సంబంధించిన పరిధిలో కూడా హిందూ స్త్రీ–పురుషులు చాలావరకు వెనుకబడిపోయారని నా అభిప్రాయం. నేనిక్కడ రెండు రెండున్నరా

లేదా మూడువేల సంవత్సరాల క్రిందటి హిందూ స్త్రీ-పురుషులను గురించి గానీ లేదా ఎంచుకున్న ఎవరో కొద్దిమంది స్త్రీ-పురుషులను గురించిగానీ చెప్పడం లేదు. కదాచిత్తుగా ఒక సత్కాలం సంప్రాప్తిస్తుంది. గుప్తరాజుల కాలంలోవాత్స్యాయనుడు కామశాస్త్ర గ్రంథం రాసిన కాలం వంటిది. మొత్తంమీద హిందూ స్త్రీ- పురుషులు ప్రేమాయణంలో వెనుకబడిపోతూనే ఉన్నారు.

ఇంతవరకూ సావిత్రి గురించి చెప్పాను. ద్రౌపది గురించి ఆలోచించేటప్పుడు ఆమెకు ఎంతమంది భర్తలుండేవారన్న అంశాన్ని మరచిపోదాం. ఐదుగురు పాండవులే కాక కర్ణుని చూసినప్పుడల్లా ఆమె మనస్సు కాస్త చలిస్తూ ఉండేదన్న అంశాన్ని కూడా ఇక్కడ చెప్పి మీ మనసుల్లో మరింత సందేహాన్ని కల్పించదలచుకున్నాను. మహాభారతం చదివిన వారికి ఈ సందేహం ఎలాగూ కలుగుతుంది. వీటన్నింటినీ మించిన కృష్ణా-కృష్ణుల సంబంధం. ఇది అన్నా-చెల్లెండ్ల సంబంధమేనని పండితులు చెపుతూ ఉన్నప్పటికీ, మహాభారతం చదివితే అలాగనిపించదు. సఖీ-సఖా సంబంధం. (గర్ల్ ఫ్రెండ్ సంబంధం అని ఒక శ్రోత అందించాడు). అదేమిటో నాకు తెలియదు. సఖీ-సఖా సంబంధంలో ప్రణయ సంబంధమో, అలాంటి స్నేహ సంబంధమో ఉండితీరుతుందని నిశ్చితంగా చెప్పలేం. ఇప్పుడు మీరు వాడిన ఆంగ్లశబ్దం 'గర్ల్ ఫ్రెండ్' సంబంధంలో నిశ్చితంగా అలాంటి సంబంధం ఉంటుంది. సఖీసఖా సంబంధంలో దాని అవసరం లేదు. ఉండనూవచ్చు, ఉండకపోనూవచ్చు. ఎవరికి తెలుసు? చాలా వరకు ఉండదు. కృష్ణా-కృష్ణ సంబంధంలో అలాంటి స్త్రీ పురుష సంబంధం కూడా కొంతవరకు ఉండవచ్చునని, మహాభారత శ్లోకాలనూ, వ్యాఖ్యలనూ- చాలా వరకు వడపోస్తే అర్థం లాగవచ్చు. లేకపోయినట్లయితే అది సఖీసఖా సంబంధమేననీ, అందులో శారీరక వాంఛాసంబంధమైన ప్రేమ ప్రసక్తి లేదనే నాబోటి వాని అభిప్రాయం. ద్రౌపది చాలా మహోన్నతురాలు - పిరికిది కాదు. యావత్ ప్రపంచ చరిత్రలోగాని, ప్రపంచసాహిత్యంలోగాని, వాఙ్మయంలోగానీ, పురాణగాథలలోగాని ఇలాంటి సంబంధం మనకు మరొకటి కానరాదు. ఒకసారి నా మిత్రుడొకడు సవాలు చేశాడు, ఇలాంటి జంటను మరొకదాన్ని చూపించమని. నేను చాలా పరిశోధన చేశాను. రెండు గంటలపాటు అన్వేషించాను. నేను ఏ పేరు చెప్పినా అందులో ఏదో ఒక లోపాన్ని అతడు వేలెత్తి చూపిస్తున్నాడు. చర్చించడం

అతనికి తెలుసు. అప్పటికప్పుడు ఓటమిని అంగీకరించడానికి మనసొప్పలేదు. కాని మరునాడు ఒప్పుకొన్నాను. ఈ విషయంలో నీమాటే నెగ్గిందన్నాను. ప్రపంచంలో ఇలాంటి జంట మరొకటి లేదు. వాఙ్మయంలోగానీ, సాహిత్యంలోగానీ, కవిత్వంలోగానీ- కృష్ణా-కృష్ణుల వంటి జంట లేదు.

ఇది సఖీ-సఖా సంబంధం. ఇందులో అన్నా-చెల్లెండ్ల సంబంధం, ప్రేమికుల సంబంధం, తల్లీకొడుకుల సంబంధం అని అనడానికి బహుశా అవకాశం లేదేమో గాని, తండ్రికూతుళ్ళ సంబంధం, కొంతవరకు తల్లీకొడుకుల సంబంధం కూడా మిళితమై ఉన్నది. అన్నిరకాల సంబంధాలూ ఇందులో సమావిష్టమై ఉన్నాయంటే కూడా, ఒక విధంగా పొరపాటు కాదు. ఒక విధంగా ఇలా అంటే సరిగ్గా ఉంటుందేమో! తల్లీ- కొడుకు, తండ్రీ-కూతురు, ప్రియ-ప్రియులు, అన్నా- చెల్లెలు, అక్కా-తమ్ములు. ఇలాంటి అన్ని సంబంధాలనూ ఒకచోట పోసి, కలగాపులగం చేసి, రసం పిండితే వచ్చేది సఖీ-సఖా సంబంధం అని చెప్పవచ్చు. సఖీ-సఖా సంబంధం చాలా కఠిన సాధ్యమైంది. అయితే చాలా ఉత్తమమైన సంబంధమని ఈ కథ వింటే తెలుస్తుంది. మనస్సునూ, ప్రపంచాన్నీ, సమాజాన్నీ చాలావరకు ఏకం చేయగల సంబంధమది.

ద్రౌపది పాత్రలోని ఈ అంశాన్ని కాసేపు మనస్సులోనుంచి పూర్తిగా తొలగించి, ఇతర అంశాలను గురించి పరిశీలిద్దాం. జ్ఞాన పరిణతిలోగాని, సద్యస్ఫూర్తిలోగాని, విషయావగాహనలోగాని, సాహసంలోగాని, ప్రపంచంలో ఎక్కడా, ఏకాలంలోనూ ఏ స్త్రీ కూడా ద్రౌపది లాంటి ఔన్నత్యం కలిగినదిగా కనిపించదు. ఇవి సాధారణమైన గుణాలా? ఇంతటి జ్ఞాని అయిన స్త్రీ లేనేలేదు. తనకాలంలోని ప్రతి పురుషుణ్ణీ నిరుత్తరుణ్ణి చేయగలిగిన సంభాషణా ప్రతిభ ద్రౌపదికుండేదని నా అభిప్రాయం. ఆమె కాలంలోని ఎంతటి మహాపురుషుడు కూడా వాదప్రతివాదంలో, మీమాంసలో ఆమె ముందు బలాదూర్. అంతటి మహాజ్ఞాని, మేధాశక్తి సంపన్నురాలు. కేవలం ఒక కృష్ణుణ్ణి మినహాయించి-కృష్ణునితో పోటీ సమస్యే రాదు. కృష్ణా-కృష్ణుల మధ్య పోటీ జరుగనేలేదు. ఈ సందర్భంగా-దుర్యోధనుడో, దుశ్శాసనుడో ఆమె వస్త్రాపహరణం చేయడానికి పూనుకున్నప్పుడు ఆమె చేసిన వాదం గురించిన కథ అందరికీ తెలిసే ఉంటుంది.

భీష్మ పితామహుని అంతిమ సమయంలో జరిగిన ఒక సంఘటన, ఒక కథ

బహుశా చాలామందికి తెలిసి ఉండకపోవచ్చు. ఆ కథ ఎంతవరకు యథార్థమన్నది నేను కూడా సరిగ్గా పరిశోధించలేకపోయాను. మూడు సంవత్సరాల క్రితం నాకు ఎవరో ఈ కథ చెప్పారు. అప్పటినుంచీ, లక్షకుపైగా శ్లోకాలున్నటువంటి మహాభారతంలో ఈ అంశం ఎక్కడ ఉన్నదో స్వయంగా పరిశీలించాలని ప్రయత్నిస్తూనే ఉన్నాను. కాని అవకాశం చిక్కలేదు. ఇది ఎంతవరకు నిజమో ఎవరినన్నా అడిగి తెలుసుకొనడానికి కూడా వీలుపడలేదు. మహాభారతంలో అలాంటి కథ అక్షరాలా ఉన్నదా లేదా అనేది స్వల్పమైన ప్రశ్న. కథ మాత్రం ప్రచారంలో ఉన్నది. బహుళ ప్రచారంలో లేకపోయినట్లయితే, చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ద్రౌపది అమోఘమైన ప్రతిభకు, ఈ కథ తార్కాణంగా నిలుస్తుంది. భీష్మ పితామహుడు మరణశయ్య మీద ఉండి రాజనీతిశాస్త్రం బోధిస్తున్నాడు. భారతదేశంలో, ఆ మాటకు వస్తే ప్రపంచంలోనే భీష్మాచార్యుడు రాజనీతిశాస్త్రాన్ని బోధించిన శాంతిపర్వం మొట్టమొదటి రాజకీయశాస్త్ర గ్రంథం అనవచ్చు. చాలామంది, బహుశా కౌరవులూ, పాండవులూ అందరూ కూడా ఆ సమయంలో ఆయన బోధిస్తూ ఉండిన రాజనీతిశాస్త్రాన్ని వింటూ ఉండవచ్చు. ఆ సమయంలో ద్రౌపది పక్కున నవ్వింది. బహుశా పెద్దగానే నవ్వి ఉంటుంది. నిర్భయురాలు. ఆయనేమో ప్రపంచ రాజనీతిశాస్త్రాన్ని విశ్లేషిస్తూ, వివరిస్తూ, జాగ్రత్తగా బోధిస్తూ ఉంటే మిగతావారంతా శ్రద్ధాభక్తులతో ఆలకిస్తూ ఉంటే ద్రౌపది పక్కున నవ్వింది. ద్రౌపది ప్రవర్తన అర్జునునికి అసభ్యంగా కనిపించి కోపగించుకున్నాడు. కోపంతో ద్రౌపది వైపు పరిగెత్తాడు. ఒకరకంగా– ఆ మాట కొస్తే అనేకరకాలుగా అర్జునుడు ఆటవికుడే. కోపంగా ద్రౌపదివైపుకు లంఘిస్తూ ఉంటే కృష్ణుడు ఆపాడు. 'ఆగవయ్యా! కాస్త తమాయించుకో! అసలు ద్రౌపది ఎందుకని నవ్విందో కారణం అడుగు' అన్నాడు. ద్రౌపదినడిగారు. ఆమె సమాధానం చెప్పింది. "బ్రతుకంతా తాను చెప్పుతున్న నీతులకు పూర్తి భిన్నంగా గడిపి, ఇప్పుడు చావబోతూ నీతులు చెపుతున్నాడా?" ఈ మాట విన్న తర్వాత, భీష్ముడు చెప్పిన సమాధానం కూడా అమోఘమైనది. "నిజమే! ద్రౌపదికి నవ్వే అధికారం సంపూర్ణంగా ఉన్నది. ఆమె నవ్వింది కనుక మరొక నీతిని చెబుతున్నాను" అంటూ భీష్మ పితామహుడు చెప్ప నారంభించాడు. ఈ కథలో ఈ భాగాన్ని మాత్రమే నేను పరిశీలించలేకపోయాను, కథకు సంబంధమున్న అంశమేనా కాదా అని.

ఆయన చెప్పిన చివరి నీతి– "తెలివి ఉన్న వాడెవడూ ప్రభుత్వ పదవిని అధిష్ఠించకూడద"ని. ఈ వాక్యాన్ని బాగా గుర్తుంచుకోవాలి. ఈ వాక్యాన్ని అసలు కథలో ఎవరైనా ప్రక్షిప్తం చేసి ఉంటారనుకున్నప్పటికీ కూడా నీతిపరంగా ఇది చాలా గొప్ప మాట అనడంలో సందేహం లేదు. బుద్ధిమంతుడైన వాడెవడూ రాజపీఠాన్ని అధిష్ఠించకూడదన్న నీతి చాలా గొప్పది. రాజపీఠం మీద తెలివైనవాడు ఆసీనుడైతే, అతని తెలివితో శక్తి కూడా కలిసిపోయినప్పుడు, ప్రపంచానికి నష్టం వాటిల్లచేయగల శక్తిని అంచనా వేయడం చాలా కష్టం. అందువల్ల రాజపీఠం మీద సదా మూర్ఖులను కూచోపెడితే, ప్రపంచం నాశనం అయ్యే అవకాశాలను తగ్గించవచ్చు. వృద్ధాచార్యుడు పోతూ పోతూ ఈ నీతిని బోధించిపోయాడు.

ఇటువంటి నీతులన్నీ ఏకపక్షంగా ఉంటూ వుంటాయి. ఇలాంటి ప్రాచీనమైన కథలను చదువుతున్నప్పుడుగానీ, లేదా వింటున్నప్పుడుగానీ, ఏదో ఒక కథను సర్వాంగీణ సత్యమని విశ్వసించి నడుచుకోవడం ప్రారంభిస్తే చాలా పొరపాటు చేసినవారవుతారు. ఇవన్నీ ఏకపక్షమైన సత్యాన్ని వివరించే కథలు. మానవుని మేధస్సు కాస్త వికటించినప్పుడు, కొంత వరకు పరిపూర్ణత్వాన్ని సాధించినప్పుడు మాత్రమే ఇలాంటి కథలు రమ్యంగా ఉంటాయి. లేకపోతే ఈ ఏకపక్ష సత్యాలను, సర్వాంగీణ సత్యాలుగా భావించినట్లయితే, అధికార పీఠాన్ని అధిష్ఠించడం కేవలం మూర్ఖుల పనేననే నిర్ణయానికి వచ్చి సూత్రీకరించుకున్నట్లయితే చాలా ప్రమాదం. రాజకీయాలలో అనేక లక్ష్యాలతోపాటు, అధికార పీఠం మీద అసీనులు కావడం అనేది కూడా ఒక ప్రధాన లక్ష్యం. రాజకీయాలలో పనిచేస్తూ, అధికారపీఠం మాత్రం వద్దనేవారే అసలైన మూర్ఖులు. నీతికి సంబంధించిన ఈ రెండు వాక్యాలనూ కలిపి అవగాహన చేసుకొని ముందుకు సాగాలి.

ద్రౌపది జీవితంలో ఇలాంటి సంఘటనలు ఎన్ని సంభవించాయో! అన్నింటినీ ఇప్పుడు వినిపిస్తూ కూచోవడం నా పనా? మీరు కూడా కొన్నిటిని గుర్తు చేసుకోండి. ఎప్పుడెప్పుడు ఏఏ సమయాలలో, ద్రౌపది ఏఏ సమస్యను ఒక జ్ఞానిగా, మేధావిగా పరిష్కరించిందో గుర్తుచేసుకోండి. ఒక జ్ఞానిగానే ఏమిటి, సద్యస్ఫూర్తితో ఆలోచనా వేగంతో పరిణత మానసిక స్థితితో– రాజదర్బారులోగానీ– మరెక్కడైనాగానీ ఆమె సమస్యలను పరిష్కరించిన తీరును నెమరువేసుకోండి. ఆమెకు రాజదర్బారైనా,

యుద్ధభూమి అయినా, అడవి అయినా, పర్ణశాల అయినా అంతా సమానమే. ఆమెను మించిన సాహసి ఎవరూ లేనేలేరు. చిన్నతనంలో అరణ్యవాసం చేసినప్పుడు గానీ, రాజ్యం చేసినప్పుడుగానీ, మహాభారత సంగ్రామ సమయంలోగానీ చివరికి స్వర్గారోహణఘట్టంలోగానీ–ప్రతి సమయంలోనూ ద్రౌపది ప్రదర్శించిన సాహసం అపూర్వం.

మహాభారతంలోని ఆ చివరి గాథ విషయంలో – ఆమె మృత్యువుకు సంబంధించిన గాథలో– అసలీ కథలు రాసినవారూ లేదా కల్పించిన వారందరూ మగవాళ్ళే కదా – లేకపోతే ద్రౌపది అందరికన్నా చివరగా కరిగిపోవాల్సింది; అందరికన్నా ముందుగా కాదు. ద్రౌపది అందరికన్నా ముందుగా ఎందుకు కరిగిపోయిందో ఆ కథ తెలుపుతుంది. ఆమెకు అనేకమంది ప్రేమికులున్నందువల్ల గానీ, అనేకమంది భర్తలున్నందువల్లగానీ కాదు. అందరు భర్తలనూ సమానంగా చూడక అర్జునుని పట్ల అధిక శ్రద్ధ వహించినందువల్ల. ఈ కథను ఎవరు కల్పించారోగాని, ద్రౌపదికి అనేకమంది ప్రియులు, భర్తల వ్యవహారాన్ని ఎత్తి చూపకుండా అందరిపట్లా సమాన శ్రద్ధ అన్నదాన్ని ఎత్తి చూపించాడు. అతని ఆదర్శం సమానత్వమే. అందువల్లనే ద్రౌపదిని మొదట్లోనే కరిగించిపారేశాడు. నిజం విచారిస్తే భీముడెక్కడ? మిగతా నలుగురెక్కడ? యుధిష్ఠిరుడు మాత్రం? అతనేమన్నా తక్కువ అబద్ధాలాడాడా? తక్కువ చిక్కులు తెచ్చిపెట్టాడా?

జూదంలో ద్రౌపదిని ఓడినప్పటి కథను కూడా మరచిపోవద్దు. నిండు పేరోలగం. రాజర్బారు. యుధిష్ఠురునికి అసలు తనను ఒడ్డే హక్కు లేదని దర్బారులో ఆమె రుజువు చేసింది. జూదంలో తనను పణంగా పెట్టే అధికారం అతనికెక్కడిది? అంతకుముందే అతను ఓడిపోయాడు కదా! స్వయంగా ఓడిపోయిన వానికి, మరొకర్ని పణంగా పెట్టే హక్కు ఉండదు. మహాభారతంలో ఈ అధ్యాయం అంతా చర్చాగోష్ఠిలా సాగుతుంది. ఆమె అప్పుడిలా అన్నది, ఈయనప్పుడు ఇలా అన్నాడు, దానికాయన చెప్పినదిది అంటూ సంవాదంలా సాగుతుంది.

భారత స్త్రీలకు నిజమైన ప్రతినిధి ద్రౌపదేనని, సావిత్రికాదని నేనంటున్నానంటే ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొనే అంటున్నాను. ఆమె జ్ఞానం, ఆమె కుశాగ్ర బుద్ధి, సాహసం, సద్యస్ఫూర్తి, వాదనాపటిమ, అవగాహనా సామర్థ్యం వీటన్నింటినీ గమనించి

నేనీమాట అంటున్నాను. భారతదేశంలోనే కాదు, యావత్ ప్రపంచ వాఙ్మయంలో ద్రౌపది వంటి స్త్రీని నేనెక్కడా చూడలేదు. ప్రపంచ కథ చాలా విశాలమైనదీ, విస్తృతమైనదని భావించినా, భారతదేశంలోనైతే అంతకన్నా గొప్ప స్త్రీ మరెవరూ లేరనడం నిర్వివాదాంశం. కేవలం ఒక పాతివ్రత్యం గుణాన్ని మాత్రమే పట్టుకొని సావిత్రిని తలకెత్తుకోవడం అంత న్యాయోచితమైనది కాదు. మన మనస్సులు ఎంతగా కుళ్ళిపోయినయ్యో, మనం ఎంత మూఢులమై పోయినామో, మగవారి ప్రయోజనాల రక్షణకు మాత్రమే మనం ఎంతగా ప్రాధాన్యాన్నిస్తున్నామో రుజువు చేస్తుందిది. కేవలం ఒకే ఒక గుణం వల్ల సావిత్రిని ఇంతగా తలకెత్తుకున్న మనం– సర్వగుణ సంపన్నురాలైన ద్రౌపదిని – ఒకవేళ పాతివ్రత్యం అన్న ఒక్క గుణం ఆమెలో లోపిస్తే లోపించవచ్చు– అంతమాత్రాన ఆమెకున్న మిగతా అమోఘమైన గుణాలనన్నింటినీ విస్మరించి, ఆమెను గౌరవించకపోవడం చాలా అన్యాయం. భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే స్త్రీ ద్రౌపదేనని నేనన్నప్పుడు– ఈ వాక్యాన్ని వినడంతోనే కొంతమంది నొచ్చుకుంటారు. కొంతవరకు ఈ వాక్యం కొందరికి ఇంపుగానూ ఉంటుంది, మరికొందరు సంతోష పరవశులు కూడా కావచ్చు. కొంతమందికి కోపం కూడా రావచ్చు. అర్థంపర్థంలేని వాదంగా కొందరికి అనిపించవచ్చు. అయితే నిజానికి ఈ వాక్యం వెనుక భారతీయ పురాణేతిహాసాల కథలనూ, హిందూ పురాణాల గాథలనూ వాటి సారాన్ని గ్రహించి, మన మానసిక స్థితిని పునస్సంఘటితం చేయాలన్న ఆకాంక్ష ఉన్నదని గ్రహించాలి. ఇటీవలి వందా లేదా వేయి సంవత్సరాలుగా హైందవ పురుషుల మానసిక స్థితి, అసమానతల పునాదుల మీద చాలా వరకూ ఘనీభవించిపోయింది. దాన్ని మార్చవలసి ఉన్నది. దాన్ని మార్చుడానికి–ఘనీభవించిన ఆ స్థితిని కరిగించడానికి, నలువైపులనుంచీ దానిని దెబ్బ తీయవలసి ఉంటుంది. స్త్రీ– పురుషుల మధ్య సమానత్వాన్ని స్థాపించవలసి ఉన్నది. ఈ వాక్యం అనగానే పంచభర్తృత్వమే గుర్తుకు రాగలదని నాకు తెలుసు. ఆ అంశాన్ని కాసేపు విస్మరించండి. మిగతా అంశాలనూ, మిగతా గుణాలన్నింటినీ పరిశీలించి చెప్పండి– ఎవ్వరికన్నా అలాంటివి ఉన్నవేమో చూపించండి! స్త్రీని ఏ రూపంలో చూడదలచుకున్నారు, జ్ఞానిగానా కేవలం పతివ్రతగానా?

ఇప్పుడు స్త్రీ–పురుష సంబంధాన్ని గురించి కూడా పరిశీలిద్దాం. ఒక్క విషయం నేను స్పష్టం చేయదలచుకున్నాను. ఎవరైనా ఒక పురుషునికి ఒక్కరికన్నా ఎక్కువమంది

ప్రేమికులుగానీ, సతులుగానీ ఉండవలసిన అవసరం ఎలాగైతే లేదని భావిస్తున్నానో, అదే విధంగా ఒక స్త్రీకి ఒక్కరికన్నా ఎక్కువమంది ప్రియులుగానీ, పతులుగానీ ఉండవలసిన అవసరం లేదనేదే నా ఆలోచనా సరళి సారం. ఈ అభిప్రాయం దానికది సరైనదే. అంతేకాదు, ఒక్కొరికి ఒక్కరుగానే ఉండేటట్లయితేనే ఈ ప్రపంచం సక్రమంగా ఉండగలదని కూడా నా అభిప్రాయమని స్పష్టం చెయ్యదలచుకున్నాను. ఈ రెండు మాటలు స్పష్టం చేశాను గదా, ఇప్పుడు ప్రపంచంలోని వ్యవస్థలను సరిగ్గా అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించండి! బడాయిలకుపోయి, లేదా ఒక రకమైన కోరికలోకి పడిపోయి దుష్టమైన సమాజాన్ని రూపొందించడానికి పూనుకోవద్దు. మిగతా అన్నిరకాల అసమానతలకు స్త్రీ–పురుష అసమానత్వమే పునాది. అన్నిటికీ అదే పునాది కాకపోయినా, అసమానతల పునాదులన్నిటిలోనూ గట్టి పునాదిరాళ్ళంటిలోనూ గట్టి పునాది రాయి, అన్యాయాలన్నింటి పునాదులకూ బలమైన పునాది రాయి స్త్రీ–పురుషుల మధ్య అసమానతే.

కొన్ని ప్రకృతి సిద్ధమైన లక్షణాలు కూడా దీనికి దోహదం చేస్తాయి. శారీరకంగా స్త్రీ కొంతవరకు బలహీనురాలు. ఇంతవరకు ప్రపంచంలో వాతావరణంలో ఆడవాళ్ళు త్వరగా ముసలివాళ్ళయి పోతూ ఉంటారు. వారు మరికొన్ని రకాల ప్రమాదాలను కూడా ఎదుర్కొనవలసి వస్తుంది. ఫలితంగా సాంఘికజీవితంలోగానీ, వ్యక్తిగతజీవితంలోగానీ ఆడవారికన్నా మగవాళ్ళకు అధికస్వేచ్ఛ, అవకావకాశాలు లభిస్తాయి. సంస్థల విషయమే తీసుకొందాం. సంఘాలనూ, సంస్థలనూ ఎవరు నడపగలరు? మంచిదైనా కాకపోయినా, చాలావరకు ఎవరైతే బలంగా ముందుకు పోగలరో, వ్యాపించగలరో, దాడి చేయగల ప్రవృత్తి కలిగివుంటారో వారే నడపగలరు కదా! దాడి చేయవలసిన అవసరం లేకపోవచ్చు, కాని ఒకరకమైన ప్రవృత్తి– ఒక స్వభావం అతనికి అవసరమౌతుంది. రాజకీయాల్లో మీరు చూస్తూనే ఉంటారు. అన్యాయం, అసమానత, మోసం, దుందుడుకుతనం, క్రౌర్యం మొదలైన సంఘవ్యతిరేక తత్వాల మీద వేగంగా విరుచుకొని పడగల శక్తియుక్తులు ఎవరికుంటాయో అలాంటివారే కుశల రాజకీయ నాయకులవుతున్నారు. అంటే ఒకరకమైన రాజసగుణం ఉండాలన్న మాట. కాస్త వేగంగా ముందుకు దూసుకునిపోగలగాలి. ఈ వేగం లేదా పౌరుషం అనండి, దాడి చేయగల ప్రవృత్తి అనండి, రాజసం అనండి –ఆడవారిలోకన్నా మగవారిలోనే అధికంగా ఉంటుంది. ఇదేదో ప్రకృతిసిద్ధమైన

గుణంగానే, కనీసం ఈనాటివరకూ సహజప్రవృత్తివలెనే నాకనిపిస్తున్నది.

దీని ఫలితంగా ఆడవాళ్ళు అణిగి మణిగి ఉండవలసివస్తున్నది. తాము ఎంతగా అణగిపడిఉన్నదీ ఆడవారికే తెలియదనేది వేరే విషయం. యూరపు, అమెరికాలలోని ఆడవాళ్ళు, ముఖ్యంగా అమెరికా ఆడవాళ్ళు తమను తాము మగవాళ్ళతో సమస్కంధులుగానే భావించుకుంటారు. కొంతవరకు నిజం కూడాను. అమెరికా సంపదలో 55 శాతం సంపదకు యజమానులు (కొంతకాలం క్రితం వరకు 60 శాతం దాకా ఉండేది. ఇప్పుడు కాస్త తగ్గింది) ఆడవాళ్ళే, మగవారు కాదు. తండ్రి బాగా ఆస్తిపాస్తులు సంపాదించిపెట్టి చనిపోతే, మరొకరు ఆర్జించిన దానిమీద బ్రతకడం ఇష్టంలేక కుమారుడు ఆ ఆస్తినంతా అక్క- చెల్లెండ్లకు ఇచ్చేసి తాను సంపాదించడానికి పూనుకొనే కాలం ఒకటి అమెరికాలో ఉండేది. ఇప్పుడా కాలం కొంతవరకు గతకాలంగా మారిపోయింది. అంతేకాక, ఆడవాళ్ళపై గౌరవమర్యాదలు అక్కడ ఎక్కువ ఉన్నాయి. రోడ్డుమీద నడుస్తున్నామనుకోండి, ఆడవాళ్ళను ముందుగా వెళ్ళనిస్తారు. ఆడవాళ్ళు ఎప్పుడు, ఎక్కడ కనిపించినా లేచి నిలబడతారు. ఇలా అడుగడుగునా ఆడవాళ్ళను గౌరవించే సంప్రదాయం అమెరికాలో ఉన్నది. ఇంట్లో కూడా భర్త భార్యను, ఒక గ్లాసు నీళ్ళిమ్మని అడగడానికి వీలులేదు. అలా ఎవరన్నా అడిగితే, నీ చేతులు తెగిపోయినయా, అన్న ప్రశ్న వెంటనే వస్తుంది. అయితే ఆమె ఇష్టపడితే, భర్త పట్ల స్నేహం ఉట్టిపడుతుంటే, మంచినీళ్ళ గ్లాసు తెచ్చి యిచ్చినా ఇవ్వవచ్చు, కాని సాధారణంగా మాత్రం వ్యవహారం ఇలాగే ఉంటుంది. ఇంటిపనుల్లో కూడా స్త్రీ-పురుషుల మధ్య చాలా వరకు సమానత్వం ఉంటుంది. మగవాడు వంటచేస్తూ ఉంటే ఆడది పాత్రలు శుభ్రం చేస్తూ ఉంటుంది. ఇల్లాలు కూరలు వండుతూ ఉంటే, యజమాని కూరలు తరుగుతూ ఉంటాడు. ఈ విధంగా ఏదో రకంగా ఇద్దరూ సమానంగా పనిచేస్తారు. వీటన్నింటి కారణంగా అమెరికా స్త్రీ- తనను తాను పురుషునితో సమానురాలిగా భావిస్తూ ఉంటుంది.

ఇటీవల నేను అమెరికాలో ఒక సమావేశానికి వెళ్లాను. ఆ సమావేశపు అధ్యక్షమండలికి చెందిన ముప్ఫయి మంది సభ్యులలో ఒక్క స్త్రీ కూడా లేదు. చర్చల్లో పాల్గొనడానికి ఒకటి రెండుసార్లు, లేదా అనువదించడానికి ఒకటి రెండుసార్లు ఆడవాళ్ళు వేదిక మీదకి వచ్చినమాట నిజమే. సమావేశంలో ఆడవాళ్ళున్నారు,

బాగా చదువుకున్న ఆడవాళ్ళు కూడా ఉన్నారు. ప్రఖ్యాత కవయిత్రులు, ప్రముఖ నవలా రచయిత్రులు, ప్రఖ్యాతి వహించిన పండితురాండ్రు చాలామంది సమావేశానికి వచ్చారు. నేనక్కడ ఈ విషయాన్ని ఎత్తి చూపించాను. ప్రపంచంలో జరిగే అన్యాయాలను గురించి, అక్రమాలను గురించి మాట్లాడుతున్న మీరు దీన్ని కూడా గమనించండన్నాను. నా మాట అమెరికా స్త్రీకి విచిత్రంగా ఉంటుందని నాకు తెలుసు. పురుషునితో తాను సమానంగా ఉన్నట్లు ఆమె భావిస్తున్నదికదా! దారిన నడుస్తున్నప్పుడు ఆమె పురుషునికన్నా ముందుండగలుగుతున్నదిగదా? అందువల్ల అమెరికాలో కూడా ఆడవారికన్నా మగవాళ్ళే ముందుంటున్నారని నేను చెపితే అమెరికా మహిళ మనస్సులో నా మాటలు నాటుకోవు. నా మాట ఆమె తలకెక్కదసలు. విషయ పరిజ్ఞానం లేనందువల్ల ఇలా అంటున్నాననుకుంటుంది. చర్చలను నిర్వహించడానికి నాయకులుగా ఎన్నుకున్న ఈ 30 మందిలో ఆడవారు ఒక్కరు కూడా లేరన్న సంగతిని ఎత్తిచూపినా, వారికి విశ్వాసం కలగదు. అమెరికాలో ఆలోచనారంగంలోనైతే, మగవారికన్నా ఆడవారు వెనకబడే ఉన్నారనడానికి ఈ ఉదాహరణ చాలదా? ఈ సమావేశం ప్రత్యేక పరిస్థితులలో విశిష్ట సందర్భంలో జరిగిందని సరిపెట్టుకున్నప్పటికీ– ఈనాడు యూరోపులోగానీ, అమెరికాలోగానీ జరిగే ఇటువంటి సమావేశాలు వేటిల్లోనైనాసరే, స్త్రీ–పురుషులకు సమానస్థానం కానీ, సమానహోదాగానీ, సమాన గౌరవప్రతిష్ఠలుగానీ లభించడం లేదనేది వాస్తవం. ఉన్నతపదవులన్నీ అత్యధికభాగం మగవాళ్లకే లభిస్తాయి. ఆలోచనా రంగంలోనైతే ఎక్కడా కూడా ప్రపంచంలో ఏ దేశంలో కూడా స్త్రీలకు సమానహోదా లేదు.

ఇదికాక మిగతా రంగాలలో కూడా, నేను పేర్కొన్న శారీరక కారణాల వల్ల సమానత్వం ఉండటం లేదు. ఇది ఎంతవరకు సామాజిక గుణమో, ఎంతవరకు ప్రాకృతికగుణమో నేను చెప్పలేను. మీముందు నేనొక విషయాన్ని పెడుతున్నాను. దాని గురించి జాగ్రత్తగా ఆలోచించండి! అదేమిటంటే– మగవారి కోరికలో, ఆకాంక్షలో ఉండే వైచిత్రి, వైరుధ్యం. ఆడది అందంగా ఉండాలి. బాగుండాలి. బుద్ధిమంతురాలై ఉండాలి. చతుర అయివుండాలి. జ్ఞాని అయివుండాలి. వీటన్నింటితోపాటు తనదై వుండాలి. తన అదుపులో వుండాలి. ఈ రెండూ పరస్పర భిన్నమైన కోరికలు. తనదానిగా ఎవరిని చేసుకోగలం, తన గుప్పిట్లో, తన చెప్పుచేతల్లో ఉండేది ఎవరు? కుర్చీలనూ, బల్లలనూ తనవి చేసుకోవచ్చు, అంటే జీవంలేని

వాటిని, గదులను, ఇండ్లను తనవిగా మార్చుకోవచ్చు. జీవం ఉన్న వాటిల్లో కొంతవరకు కుక్కలను తనవిగా చేసుకోవచ్చు. పిల్లిని తనదిగా చేసుకోవడం కొంత కష్టసాధ్యమే. పిల్లితత్వం వేరు. అంటే జీవంలేని వాటినీ, సజీవమైన వాటిలో కూడా సంపూర్ణ సజీవత్వం లేనివాటిని మాత్రమే తనవిగా చేసుకోవడానికి వీలుంటుంది. సజీవత్వం సంపూర్ణంగా ఉన్నదాన్ని దేన్నయినా స్వాధీనం చేసుకోవాలంటే, తన ఆధీనంలో ఉండే తన దానిగా చేసుకోవాలనుకుంటే దానిలో చపలత్వం, చతురత, సచేతనత్వం, సజీవత్వం – అంటే ప్రాణం ఉండటం, బుద్ధిమత్తత, ఉదారహృదయం, ఆలోచనా వేగం, సద్యస్ఫూర్తి ఉండటం అసంభవం అవుతుంది. స్త్రీని పరతంత్రగా, స్వాధీనురాలిగా మార్చుకోదల్చుకుంటే, ఆమెను ఉన్నతురాలిని చేసుకోవాలన్న మోహాన్ని వదులుకోవాలి. లేదా ఆమెను స్వతంత్రురాలిని చేయాలనుకుంటే. అప్పుడామె మగవానివలె ఉన్నతురాలు కూడా అవుతుంది.

అప్పుడీ ఔన్నత్య సాధనలో అనేక ఇబ్బందులనూ ప్రమాదాలనూ ఎదుర్కొనక తప్పదు. ఇందులో మళ్ళీ చిన్నబుచ్చుకోవడమో బెదిరిపోవడమో బాగుండదు. బెదరడం, సమస్యల్లో చిక్కుకోవడం, బాధపడటం, ఎదురుతిరగడం, తగాదా పెట్టుకోవడం మానవస్వభావమే అయితే, ఆడవారి స్వభావం కూడాను. ఎప్పుడైనా, ఎక్కడైనా స్త్రీ–పురుష సంబంధాలు బెడిసిపోవచ్చు. తెగతెంపులు కావచ్చు. మొదట్లో ఒకరిపై ఒకరికి అలకలూ, నువ్వంటే నువ్వని దూషించుకోవడాలూ, స్పర్థలూ, అనుమానాల వంటివి చాలా కాలం కొనసాగుతాయి. ఈనాటి ఆధునికపురుషుడు పరస్పర విరుద్ధమైన రెండు కోరికలనుంచి బయటపడాలి. తన ఆడది తెలివైనదిగా, జ్ఞానిగా, చైతన్యవంతురాలిగా ఉండాలని ఒకవైపూ– తన అధీనంలో, గుప్పిట్లో తనదిగానే ఉండాలని మరొకవైపూ కోరుకోవడం విరమించుకోవాలి. ఈ రెండూ పరస్పర విరోధ భావనలు. తన అధీనంలోనే ఉంచుకుంటే ఆమేరకు ఆమె సచేతనత్వాన్ని సజీవత్వాన్ని కోల్పోగలదు. ఈ రెండు కోరికల్లో ఏదో ఒకదాన్నే ఉంచుకోవాలి. ఇందులో ఏ భావన, ఏ కోరిక మీకు బాగుంటుందో మీరే ఎంచుకోండి! నాకైతే అధీనంలో ఉండే నిర్జీవి నిరర్థకం. స్వతంత్రురాలైన సజీవి గొప్పగా ఉంటుంది.

స్త్రీ–పురుష సంబంధాలను గురించి భారతదేశంలో సుందరమైన కావ్యాలూ, కథలూ అల్లినమాట నిజమే. సావిత్రి కథను నేను చెడ్డ కథ అనడంలేదు. సావిత్రి

అంటే నాకు అగౌరవమూ లేదు. ఆమెపై నాకు సంపూర్ణమైన ఆదరాభిమానాలున్నాయి. పూర్తిగా గౌరవిస్తాను. అయితే ఒకే ఒక్క అంశంలో వ్యతిరేకిస్తాను. ఆడవారి గుణం ఏకాంశమే కాదుకదా! అనేకాంశాలుంటాయికదా! ఏదో ఒక్క అంశను, ఏదో ఒక్క అంగాన్ని పరిపుష్టం చెయ్యడానికి మిగతా అంగాలన్నీ నశించి పోయేట్లయితే, ఒక్క అంశ ప్రభవించడానికి మిగతావన్నీ ప్రమాదంలో పడిపోయేట్లయితే, దాన్ని ఆదర్శం చేసుకోవడం కష్టసాధ్యం అవుతుంది. అందువల్ల ఈ సుందరకావ్యాలను, ఈ సుందరగాథలను తప్పుడు ఆధారాల మీద, తప్పుడు పునాదుల మీద అల్లారని నా అభిప్రాయం. అయితే నాకో చతుష్పది(నాలుగు చరణాలు కల పద్యం) లభించింది. నేను ఇప్పుడు ఏ ధోరణిలో ప్రసంగిస్తూ ఉన్నానో, ఏ రకమైన సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తున్నానో, దానికి అనుగుణంగా ఉన్న చతుష్పది. పార్వతీకళ్యాణం సందర్భంగా రచించిన చతుష్పది ఇది. పార్వతీ కళ్యాణం జరిగిపోయింది. ఒక ఆడపిల్ల తల్లికి, తన అల్లుణ్ణి చూసి – ఈ కథ ఒకవేళ నిజమే అయితే – ఒకవైపు పాములూ, ఒకవైపు బూడిద, కుంటివాళ్ళూ, గుడ్డివాళ్ళు, ప్రమథగణాలు, పెళ్ళి ఊరేగింపులో "బరాతీ"లుగా వచ్చినవాళ్ళు ఒకవైపు ... మనసుకు కష్టం వేయక తప్పుతుందా? మరో కారణం చేత కూడా ఆ అత్తగారి మనస్సుకు కష్టం కలిగింది. ఆమె దుఃఖిస్తూ ఉంటే చాలామంది ఆమెను ఓదార్చారు. శంభుడే స్వయంగా ఓదార్చాడు. "ఎందుకు విచారిస్తున్నావమ్మా! నీ ముద్దుల కూతురు చాలా సుఖపడుతుంది. ఇవన్నీ బాహ్య ప్రతీకలు, వీటిని చూసి భయపడవద్దు" అని కూడా చెప్పి ఉంటారు. ఆ సంగతి ఆమెకు మొదటే తెలుసు. ఆమె దుఃఖానికి కారణం మరొకటి! ఆ సమయంలో ఆమె ఇలా అన్నది.

> కత బిధి సృజీ నారీ జగమాహీ
> పరాధీన సపనేహూ సుఖనాహీ

స్త్రీ–పురుష సంబంధాలపై భారతీయ వాఙ్మయంలో అనేక కవితలూ, కథలూ, దుష్టమైన ఆధారాలతో, క్రూరమైన భావాలతో అతి సుందరంగా రచించినవి అనేకం ఉన్నాయికాని ఈ చతుష్పది ఎంత గొప్పగా, ఎంత రమ్యంగా ఉన్నదో! అంతటి సుందరమైనది నాకు మరొకటి కనిపించలేదు. "హే భగవాన్! హే పరమాత్మా! అసలు నీవు ఆడదాన్ని ఎందుకు సృష్టించావు?" అని ఒక ఆడది, తన హృదయాన్ని

చీల్చుకొని అంటున్నది. 'అసలాడదాన్ని ఎందుకు కల్పించావు?' అని అడుగుతున్నది. "పరాధీనకు స్వప్నంలో సైతం సుఖం ఉండదు" అని అంటోంది. ఆడదాని సృష్టిలోనే కొంతవరకు ఈ లక్షణం ఉన్నది. ఎంతోకొంత ఆమె మగవారికి అధీనం కాక తప్పని పరిస్థితి. ఈ వివరాలన్నింటిని ఏకరువు పెట్టవలసిన అవసరం నాకిక్కడలేదు. మన మహాసభలో కూడా కొందరంటూ ఉంటారు, పిల్లల్ని కనడమే ఆడవారి కర్తవ్యమని. ఆడదాని కర్తవ్యం అదే అయినట్లయితే, ఆమె పరాధీన కావడానికి అది కూడా ఒక కారణం అవుతుంది కదా! ఆమె ఏమి తినాలి, ఏమి తినకూడదు, చంకలో పాపకు ఏమి తినిపించాలి, ఎక్కడ తినిపించాలన్న పరిమితులు, బంధాలు ఏర్పడతాయి కదా? ఒక విధంగా ఆమె పరాధీన అయిపోతుంది కదా! అయితే ఈ పరాధీనతను కొంతవరకు తగ్గించడానికి ఇప్పుడు ప్రయత్నిస్తున్నారు. ఇటువంటి పరాధీనతను వీలైనంతగా తగ్గించే విధంగా నవసమాజ నిర్మాణాన్ని రచించాలని చూస్తున్నారు. స్త్రీ పాపం ఎంతో కొంత పరాధీనగా ఉండక తప్పదనీ, అది ప్రాకృతికమైన అంశమనీ నాకనిపిస్తుంటుంది.

"పరాధీన సపనేహూ సుఖనాహీ" అన్న చతుష్పదికి సంబంధించి ఒక చిన్న కథను మరొకదాన్ని కూడా చెప్పదలచుకున్నాను. చాలాకాలం వరకూ ఈ చతుష్పదిని సందర్భం నుంచి విడగొట్టి స్వతంత్ర సంగ్రామానికి అనుగుణంగా వాడారు. కాన్పూర్ నుంచి ఒక దినపత్రిక వెలువడేది. ఇప్పటికీ వెలువడుతున్నది, "ప్రతాప్" అనే దినపత్రిక. దానిపైన ఇప్పటికీ ప్రతి సంచిక మీదా ఈ చరణం "పరాధీన సపనేహూ సుఖనాహీ" అన్నదాన్ని అచ్చు వేస్తూంటారు. భారతీయుల బానిసత్వానికి, పరాధీనతకు దాన్ని జోడించారు. హిందూ పురుషుల మనస్సులు, భారతీయ పురుషుల మనస్సులు బాగా కుళ్ళిపోయినయి. ఇప్పటికీ మురికిపట్టే ఉన్నాయి. దీని మొదటి చరణాన్ని కొట్టిపారేశారు. నష్టపరిచారు. తొలగించిపారేశారు. మొదటి చరణానికి బదులుగా మరొకదాన్ని తయారుచేసి, జోడించారు. "కర్ విచార్ దేఖహు మనమాహీ"– పరాధీన సపనేహూ సుఖనాహీ. అంత గొప్ప కవితను, అంత సుందరమైన చతుష్పదిని ఎంత వికారంగా, ఎంత కుంటిదానిగా తయారుచేశారో గమనించండి. కవి అయినవాడు "కర్ విచార్ దేఖహు మన మహీ" అంటూ రాస్తాడా? ఇందులోని ప్రతి అక్షరం అనవసరమైనది. 'మనస్సులో బాగా ఆలోచించుకొని చూడు ' అని చెప్పాల్సిన అవసరం ఉంటుందా? ఇలాంటి వాక్యాలను, ఉపన్యాస కేసరులు, ప్రసంగం

మధ్యలో శ్వాస తీసుకోవడానికో, ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడానికో, మధ్య మధ్య అంటూఉంటారు. తులసీదాసు వంటి మహాకవి ఇటువంటి అనవసరమైన, అసందర్భమైన వాక్యాలు రాస్తాడా?

దానిని తులసీదాసుకు అంటగట్టారు. ఎందుకని? "కతబిధి సృజీ నారీ జగ మాహీ" అన్న చరణం ఉంటే, దాన్ని పదే పదే మననం చేసుకుంటే మనస్సుకు గుచ్చుకుంటుందిగదా! ఈ విషయాన్ని గురించి నేను ఇప్పుడు చెప్పేది ఇంతవరకే .... ఎటువంటి ప్రమాదాలను ఎదుర్కొనవలసి వచ్చినా, ఈ దారిలో ఎన్ని రకాల దుర్ఘటనలు సంభవించినా, ఈ ప్రయోగంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా మీకు ఇష్టం లేకపోయినా, నాకు నచ్చకపోయినా–నిజంగా మీరంతా సమానత్వ సిద్ధాంతాన్ని విశ్వసించేట్లయితే, సమానత్వం పునాదుల మీద సమాజ పునర్నిర్మాణం చెయ్యదలచుకున్నట్లయితే, స్త్రీ–పురుష సంబంధాల విషయంలో మన ఆలోచనా పద్ధతిని పూర్తిగా మార్చుకోవలసి ఉంటుంది. ఈ తలకాయ ఉన్నదనుకోండి, దాన్ని తెగకొట్టి, ఏదో విధంగా తెగకొట్టి, ప్రక్కకు పెట్టండి. ఒంటరిగా కూర్చున్నప్పుడు లేదా పడుకున్నప్పుడు లేదా పగటిపూటో, రాత్రిపూటో ఒంటిగా నడుస్తున్నప్పుడు తలకాయను వేరుచేసి, చేతపట్టుకుని దానిలోపల ఇదివరకు నుంచీ ఉన్న చెత్తా దుమ్మూధూళినీ దులిపి శుభ్రంగా తుడిచి, మళ్ళీ దాన్ని అంటించుకోండి. ధరించాలి. ఈ విషయంలో ఈ పనిచేయడమే అవసరం. యావత్ ప్రపంచమూ ఈ పనికి పూనుకోవలసిన అవసరం కలుగుతున్నది.

స్త్రీ–పురుష సంబంధాల విషయంలో యూరోపియన్లు, అన్ని అంశాలలోనూ మనకన్నా ముందున్నారనికానీ, మెరుగుగా ఉన్నారనికానీ, బాగుపడిపోయారనికానీ అనుకోవడానికి వీలులేదు. ఇంతకుముందే ఒక కథ చెప్పానుకదా! అయితే ఆ కథలో ఒక్క విషయం చెప్పడం మర్చిపోయాను. నా ప్రసంగం అయిపోయిన తరవాత కొందరు ఆడవాళ్ళు నన్ను చుట్టుముట్టారు. నలుగురైదుగురు ఆడవాళ్ళయినా వచ్చి నన్ను అభినందిస్తున్నారుగదా, స్నేహాన్ని ఒలకబోస్తున్నారుగదా అని నేను తృప్తి చెందాను. అందులో ఒకామె అన్నది, "ఈ మాట నేనే అనాలనుకున్నాను. నా నోట్లో మాటను ఉన్నదున్నట్లుగా చెప్పారు మీరు. ఈ విషయం చెప్పాల్సిన అవసరం ఏంతైనా ఉన్నది." "మా స్థానం ఏమిటో మీకు తెలియదా?" అని ప్రశ్నించినవారు

కూడా ఒకరిద్దరు లేకపోలేదు. "మీ స్థానం ఫలానాది" అని వారికి నేనేమని చెప్పేది? "తెలుసు- నీవు ఒక గ్లాసు మంచినీళ్ళు కూడా తెచ్చి ఇవ్వ" వని బాగా తెలుసు. ఇంతకు మించిన ఎటువంటి సమానత్వాన్ని మీరు సాధించలేదని కూడా నేను ఒకచోట చెప్పి ఉన్నాననుకుంటున్నాను" అన్నాను. దాన్ని అలా ఉంచండి. ఆ తర్వాత అందరి కన్నా నా మంచి మిత్రుడు, అమెరికా మిత్రుడు వచ్చి నీ మనసులో ఇటువంటి ఆలోచనలా అని అడిగాడు. అవును! నా మనస్సులో ఈ ఆలోచనలు చాలా లోతుగా నాటుకుని ఉన్నాయన్నాను. మనం ఎటువంటి ప్రభుత్వాన్ని ఎలాంటి పరిపాలనావ్యవస్థను రూపొందించదలచుకున్నామో రాజకీయ నాయకుని మనసులో అంతవరకే నాటుకుని ఉండాలనేది అతని అభిప్రాయం. అయితే ప్రభుత్వాన్ని నిర్మించదలచుకున్నవాడు సమాజంలో ఏయే రంగాలలో ఎటువంటి అసమానత లున్నాయో, వాటిని ఏ విధంగా రూపుమాపాలో పరిశీలించకుండా ప్రభుత్వాలను నిర్మించినంత మాత్రాన ఒరిగేదేమిటి? కొందరి ఆలోచనా సరళి ఏకపక్షంగా మారిపోతుంది. ఏదో ఒక దారిని ఎంచుకుంటారు. మిగతా వాటిని చూడటం మానేస్తారు. ఏ మిత్రుని గురించి నేను మాట్లాడుతున్నానో అతను కార్పొరేషన్ల విషయం మాట్లాడుతుంటాడు. వర్తక, వాణిజ్య, కార్పొరేషన్ల గురించి పరిశ్రమల కార్పొరేషన్ల గురించి కర్మాగారాల కార్పొరేషన్ల గురించీ. ప్రపంచమంతటా కార్పొరేషన్లు స్థాపించాలనీ, అన్ని రంగాలలో కార్పొరేషన్లు స్థాపించి, వాటిద్వారా అసమానతలను అంతం చేయవచ్చునంటూ ఉంటాడు. అందువల్ల నేను మాట్లాడిన విషయం అతని దృష్టికి చాలా స్వల్పమైనదిగా కనిపిస్తుంది.

ఈ మార్గంలో కొంత ప్రమాదాన్ని ఎదుర్కొనవలసి వస్తుందని మాత్రం నేను చెప్పదలచుకున్నాను. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లభించాలి. స్త్రీ-పురుషులకు సమాన వేతనాలు లభించాలి. పనిని బట్టి సమాన వేతనాలు మొదలైన చిన్న చిన్న విషయాలన్నీ, ఉత్తమమైన ఏ సోషలిస్టు పార్టీ కార్యక్రమాలలోనైనా భాగం కావలసిందే. ఆడవాళ్ళకు సమానవేతనం, సమానమైన కూలీ, స్త్రీ-పురుషుల సమానత్వం ఇటువంటి విషయాలను గురించి ఇప్పుడిప్పుడే సమాజవాది అవుతున్న వారెవరయినా చర్చలు జరుపవచ్చు. ప్రసంగాలు చెయ్యవచ్చు. కాస్త పాతబడిపోయిన తర్వాత ఇటువంటి వాటిని గురించి చర్చించడానికి కాస్త బిడియపడతాడు. సమాజవాదశాస్త్రంలో, సమాజవాద

సిద్ధాంతంలో, కార్యక్రమాల్లో ఇది మౌలి కాంశమేనని, అభిన్నమైన కార్యక్రమమని అతనికి తెలుసు కనుక. స్త్రీ– పురుషులకు సమాన వేతనాలు, చట్టం దృష్టిలో స్త్రీ పురుషులు సమానం, స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం వంటివన్నీ సమాజవాదులు అంగీకరించినవే. నేను చెబుతున్నది కాస్త ముందుకు వెళ్ళి చెపుతున్నాను, మానసిక దృక్పథాన్ని పునర్వ్యవస్థీకరించుకునే విషయం.

మానసిక స్థితిని, దృక్పథాన్ని పునర్వ్యవస్థీకరించుకునే పనికి పూనుకున్నట్లయితే, సావిత్రి – ద్రౌపది గాథలను గురించి చర్చలను ప్రేరేపించండి. మీమాంసను లేవదీయండి. చర్చాగోష్ఠుల కోసం నేను 22 లేదా 23 విషయాలను సూచించాను. వాటిలో ఒక విషయంగా దీన్ని కూడా చేర్చాను – “భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే స్త్రీ– ద్రౌపదేకాని సావిత్రి కాదని ఈ సమావేశం అభిప్రాయం” అని. ఈ విషయం మీద లక్నోలో, కాన్పూరులో, బొంబాయిలో, ఇటువంటి అనేక ఇతర పట్టణాల్లో గోష్ఠులు జరగాలి. ఇద్దరు వక్తలు ఒక పక్షం, మరో ఇద్దరు వక్తలు మరో పక్షం వహించి ప్రసంగాలు చెయ్యాలి. ఒక్కో పక్షం వహించిన ఇద్దరేసి వక్తల్లో ఒక్కొక్కరు –పురాతన చరిత్ర, పురాణాలు క్షుణ్ణంగా చదివినవారు, పండితులైనవారు ఉంటే మంచిది. చర్చను మరింత ఇంపుగా, భావప్రేరకంగా మార్చగలగాలి. ఈ నలుగురి ప్రసంగాలు అయిన తర్వాత అందరూ చర్చల్లో పాల్గొనడానికి అవకాశం ఇవ్వాలి. సమావేశానికి వచ్చిన వారినందరినీ చర్చలలో పాల్గొనవలసిందిగా ఆహ్వానించాలి. పట్టణమంతా కొన్ని రోజులవరకూ ఇది చర్చావిషయంగా ఉండిపోతుంది. ఆ నోటా ఈ నోటా ఈ మాటలు పాకి పట్టణవాసులందరూ ఆలోచించడం ప్రారంభిస్తారు. ఒకప్పుడు నేను “రామాయణ మేళా” జరపాలని సంకల్పించుకొని దాని విషయం కొంత వివరంగా ప్రకటన చేసినప్పుడు, చాలామంది ఆడవాళ్ళలో కొంతకాలం వరకూ అది చర్చనీయవిషయంగా పాకిపోయిందని నాకెవరో చెప్పారు. గంగాతీరానికి స్నానం చెయ్యడానికి వెళ్ళే ఆడవాళ్ళు తమలో తాము ఈ విషయాన్ని గురించి చర్చించుకుంటూ ఉండేవారట. శ్యామ్‌పాండే అనే ఒక సమాజవాది ఉన్నాడు. ఆయన నాతో ఇలా అన్నాడు, “మీరు రామాయణ మేళా” జరపదలచుకున్న సంగతి నాకు తెలియనే తెలియదు” అని. మీ సమాజవాదులు ఇప్పుడు “రామాయణ మేళా” కూడా జరుపబోతున్నారటగదా! ఎప్పుడు జరుపుతారు?

ఎక్కడ జరుపుతారు? అని మా అమ్మ నన్నడిగితే తెలిసింది. నాకంటే ముందే వారికి తెలిసిపోయిందన్నాడు. ఈ చర్చలో, ఇటువంటి మీమాంసలో ఇంటింటికి చేరే గుణం ఉన్నది. మనస్సును విచలితం చేయగల శక్తి ఉన్నది. అందరినీ ఆలోచింపచేయగల తత్వం ఉన్నది. అయితే ఇటువంటి చర్చాగోష్ఠులను నిర్వహించడానికి నలుగురైదుగురన్నా చదువుకున్నవాళ్ళు, పండితులు ఉండాలి, లేకపోతే అది బజారు స్థాయికి దిగిపోయి, దూషణ భూషణలకు ఆలవాలం అయ్యే ప్రమాదం ఉన్నది! అలాగని, ఆ ప్రమాద భయంతో చర్చాగోష్ఠులే జరపకపోతే మరింత నిష్ప్రయోజకం, మరింత ఘోరం అవుతుంది.

చర్చనీయాంశం ఇదొక్కటే కాదని మీకు చెప్పదలచుకున్నాను. నేనింకా అనేక విషయాలను సూచించాను. 'భారతదేశం నిరంతరం బానిస అవడానికి కారణం నాయకుల లేదా రాజుల అనైక్యత కాదని, ప్రజల ఉదాసీనతని ఈ సమావేశం అభిప్రాయం' అన్నది కూడా నేను సూచించిన విషయాల్లో ఒకటి.(చర్చనీయాంశాల జాబితాను 153, 154 పుటల్లో చూడండి) చర్చ జరపదలచుకుంటే ఈ విషయం ఎంత గొప్పగా ఉంది! మనం ఇప్పుడు ఎక్కడికి పోయినా చీలిక, అనైక్యత అన్న మాటలే ఎదురవుతున్నాయిగదా! ఏ పార్టీ అయినాసరే! కాంగ్రెసు, కమ్యూనిస్టు, ప్రజాసోషలిస్టు పార్టీ, జనసంఘం ఏదైనాసరే, చీలిక– అనైక్యతా – చీలికా – అనైక్యతా ... ఇదేపాట వింటున్నాంగదా! అసలు కారణం చీలికా కాదు, అనైక్యతా కాదు. ప్రజల ఉదాసీనత. ఇలాంటి విషయం మీద ప్రసంగించడానికి అవకాశం లభిస్తే ఎంతగొప్ప అవకాశమది? భారతదేశ చరిత్రసారాన్ని, భారతీయ సమాజ వ్యవస్థసారాన్ని వివరించి చెప్పే అవకాశం లభించగలదుకదా!

విషయాల జాబితా అచ్చయింది. హిందీలో ఎలాగూ ఉండనేవున్నాయి. ఇంగ్లీషులో కూడా ఉన్నాయి. 'చౌఖంభా'లోనూ, 'మాన్‌కైండ్' లోనూ కూడా అచ్చయినాయి. (ఈ పుస్తకంలో 153,154 పుటల్లో కూడా ఉన్నాయి.) ఈ విషయాలపై చర్చాగోష్ఠులను మీ పట్టణంలో జరిపించండి! ఒక కార్యక్రమాన్ని ముందుగానే తయారు చేసుకొని, దాని ప్రకారం కాస్త శ్రమపడి జరిపించండి. ఇలాంటి చర్చాగోష్ఠులను మీరు మాత్రమే నిర్వహించవచ్చునన్న భ్రమలో ఉండకండి! బయటివారి సహాయాన్ని కూడా మీరు పొందాలి. విశ్వవిద్యాలయాల్లో , కళాశాలల్లో,

ఆచార్యులుగా ఉన్నవారి సహాయాన్నీ, రచయితల సహకారాన్నీ, విషయపరిజ్ఞానం ఉండి, బాగా విపులీకరించగల శక్తి సామర్థ్యాలున్న పండితుల సహకారాన్నీ పొందాలి. మొదట ప్రసంగించే నలుగురు విషయపరిజ్ఞానం ఉన్న మేధావులై ఉండాలి. వారు ప్రసంగించాల్సిన విషయం గురించి వారికి కనీసం 15 రోజుల ముందుగానే చెప్పాలి. కాస్త అధ్యయనం చేసి చదువుకొని వచ్చే అవకాశం వారికివ్వాలి. హఠాత్తుగా చెప్పడమంటే – ఇప్పుడు నేను ప్రసంగిస్తూ ఉన్నట్లే ఉంటుంది. 'ద్రౌపది–సావిత్రి' అన్న ఈ విషయం మీద ఉపన్యాసం చెప్పాలని నాకు ఇప్పటికిప్పుడు చెప్పారు. వారికి సంబంధించి నాకు జ్ఞాపకం ఉన్న నాలుగైదు కథలు చెప్పాను. ముందుగా తెలిసివుంటే మరో పదో పదిహేనో కథలను జ్ఞాపకం చేసుకోవడానికి ప్రయత్నించేవాణ్ణి. ఈ విషయాన్ని గురించి ముందునుంచే అధ్యయనం చేసి వచ్చిన వ్యక్తి – ఎవరైనా ఉంటే, మహాభారతాన్నంతటినీ ఒకసారి చదివి, ఇందుకు సంబంధించిన కథలను నోటు చేసుకుని వచ్చివుంటే, మరో ఇరవై పాతిక కథలదాకా చెప్పవచ్చు.

చర్చల్లో పూర్వపక్షం–ప్రతిపక్షం వహించి ప్రసంగించేవారు కూడా కాస్త చదువుకుని వస్తే బాగుంటుంది. ఇటువంటి కార్యక్రమాలు భావవిప్లవానికి చాలావరకు దోహదం చేస్తాయి. ఆలోచనారంగంలో అలలు లేవడానికి, సంచలనం కల్గించడానికి బలమైన పునాదులు ఏర్పడతాయి. ఈనాడు భారతదేశంలో ఉన్న అనేకమైన లోపాలలో ఆలోచనలు స్తంభించిపోవడమన్నది కూడా ఒక లోపమని నా అభిప్రాయం. మేధస్సు చచ్చిపోయింది. దాన్ని పునరుజ్జీవింప చెయ్యాలి. మేధస్సును పునరుజ్జీవింపచేయడానికి అనేక పద్ధతులున్నాయి. అందులో ఒకటి చర్చాగోష్ఠుల పద్ధతి. ఇటువంటి చర్చాగోష్ఠులను ఖర్చు లేకుండా ప్రజలందరిమధ్యా ఏర్పాటు చేయవచ్చు. నేను చిన్న వయసులో ఉండుంటే, ప్రతి పెద్ద పట్టణంలో 'చర్చాగోష్ఠి' సంఘాన్ని ఏర్పాటు చేసి, వాడవాడకూ వెళ్ళి వారానికొకసారో, పదిహేను రోజులకొకసారో చర్చాగోష్ఠులను ఏర్పాటు చేసేవాణ్ణి. ఆ వాడలో ఉన్నవారందరినీ ఆ సమావేశానికి రప్పించేవాణ్ణి. చర్చాగోష్ఠులు కేవలం పాఠశాలల్లోనో, కళాశాలల్లోనో మాత్రమే జరగాలని, కేవలం విద్యార్థులే అందులో పాల్గొనాలన్న నియమం ఏమీలేదు. చర్చాగోష్ఠి జరుగుతూ ఉంటే అక్కడ చేరినవారిలో ఎవరికైనా, అక్కడికక్కడే, వింటూ వింటూనే ఆవేశం పుట్టుకు రావచ్చు. 'సావిత్రి'ని ఉపాసించేవారు, భక్తి

ప్రపత్తులతో కొలిచేవారు బోలెడంత మంది ఎలాగూ ఉండనే వున్నారు. ఈ విషయం మీద చర్చ జరుగుతూ ఉంటే, వినేవారికి ఆవేశం వచ్చి 'నేను మాట్లాడతా' 'నేను మాట్లాడతా'నని చాలామంది ముందుకు రావచ్చు. శ్రోతలు కూడా ఆవేశపడి ఏదన్నా చెపుతామని ముందుకు వచ్చేంత వేడిని మీరు పుట్టించగలిగితే విజయం సాధించినట్లే. కొందరు అనుకూలంగా మాట్లాడవచ్చు. మరికొందరు వ్యతిరేకంగా మాట్లాడవచ్చు. మరికొందరు వ్యర్థ ప్రసంగాలు చేయవచ్చు. ఏదేమైనా మానసిక సంచలనం, ఆలోచనారంగంలో కల్లోలం సంభవిస్తుంది. ఈనాడు మనదేశంలో వ్యాపించిన ఆలోచనా స్తబ్దత, మేధస్సు శవప్రాయమైన పరిస్థితిని తొలగించడంలో మీరు చాలా వరకు విజయం సాధించినట్లే. ఈ విషయం గురించి ఈ నాటికి ఇంత చాలునని నా అభిప్రాయం.

ఈనాడు భారతదేశంలో స్త్రీలకూ- పురుషులకూ - ఇద్దరికి కూడా తిండి దొరకడం లేదు. పూర్తిగా తిండి దొరకడం లేదని కాదు. శరీరాన్ని పోషించుకోవడానికి అవసరమైన తిండి, పౌష్టికాహారం అనేది దొరకక, ప్రతి పదిమందిలో తొమ్మండుగురు ఆకలితో అలమటిస్తున్నారు. ఈ పదిమందిలో ఆకలితో అలమటించే మగవారు, డొక్కలు ఎండిపోయే మగవారు ఐదారుగురిదాకా ఉంటే ఏడెనిమిదిమంది ఆడ వాళ్ళుంటారు. మగవాళ్ళకన్నా ఆడవాళ్ళ డొక్కలే ఎక్కువగా ఎండిపోతుంటాయి. భారతదేశంలో ఆడవాళ్ళు మొదట మగవాళ్ళకు పెట్టి ఆ తర్వాత మిగిలింది తింటారు. మొదట వయస్సు మీరిన మగవాళ్ళు, తర్వాత పిల్లలు, హఠాత్తుగా ఇంటికి ఎవరన్నా అతిథులు వస్తే వారు- అందరూ తిన్న తర్వాత ఆడవాళ్ళు తింటారు. చాలా ఇండ్లల్లో ఇల్లాండ్లు కడుపునిండా తినడానికి మిగలదు. మిగిలిందేదో తింటారు. అనేకుల ఇండ్లల్లో అన్నం గిన్నెలు తొలుచుకుని, నీళ్ళతో కడుక్కుని ఆ నీళ్ళు త్రాగి ఆడవాళ్ళు పడుకుంటారని కూడా నేను విన్నాను. ఆడవాళ్ళు రెండింతలు తింటారన్న నీతివాక్యాలను వల్లె వేసేముందు కాస్త ఆలోచించి, వెనుకా ముందు గ్రహించి మాట్లాడాలని నా అభిప్రాయం.

భారతదేశంలో స్త్రీలను అనేక దుఃఖాలకు గురిచేస్తున్నాం. తిండిలో సైతం ఘోరంగా వ్యవహరిస్తున్నాం. ఎందుకిలా జరుగుతున్నదని నేను చాలా సార్లు ఆలోచించాను. సరైన నిర్ధారణకు ఇంకా రాలేదు. భారతదేశంలో బహుభార్యాత్వం

ఎందువల్ల ఉన్నది? ఇప్పుడు లేదనుకోండి. ఉంటే చట్టానికి వ్యతిరేకం. అక్కడక్కడా ఇప్పటికీ ఈ ఆచారం కొనసాగుతూ ఉన్నదంటే దానికి మొదటి కారణం మీరే! మీరు జాగ్రత్తపడి అలాంటివారిని జైళ్ళకు పంపరు. రెండో కారణం, అలాంటివారు చట్టం నిబంధనలను తప్పించుకోవడానికి కొన్ని జాగ్రత్తలూ, మోసపు ఎత్తుగడలూ పన్నుతారు. మూడవది, ఆడవాళ్ళు అణిగిమణిగి ఉంటారు. కనుక తామే స్వయంగా అల్లరి పెట్టుకోరు. ఏమైనప్పటికీ ఈ నాడు బహుభార్యాత్వం చట్ట విరుద్ధం. అయితే వేలాది సంవత్సరాలుగా ఈ ఆచారం భారతదేశంలో ఉంటున్నదిగదా, ఎందువల్ల?

ముస్లిములలోఈ ఆచారం ఇప్పటికీ ఉన్నది. ఇప్పుడు ఈ శిక్షణశిబిరంలో పాల్గొంటున్న మీరంతా, మనమంతా సమాజవాదులం, హిందువులూ లేరు, ముస్లిములూ లేరు. అయితే, ఒక మతం గురించి మరొక మతం వారు మాట్లాడటానికి ఉండే సంకోచం మాత్రం తొలగిపోవాలి. జనబాహుళ్యం మధ్య, సాధారణ ప్రజల ముందు మాట్లాడేటప్పుడు కాస్త జాగ్రత్త పడవలసి ఉంటుందన్న మాట నిజమే. ఏ మాట మాట్లాడాలి, ఏది మాట్లాడకూడదనేది ఆలోచించుకొనవలసి వచ్చే విషయం కాదననుగానీ, మనలో మనం మాట్లాడుకునేప్పుడైనా, కనీసం మన మధ్యనైనా సంకోచరహితంగా ఉన్నదున్నట్టుగా మాట్లాడుకోగలగాలి. ఆ మాటకు వస్తే ముస్లిములను గురించి నేను అనేక విషయాలు చెబుతూనే ఉంటాను. సాధారణ జనం మధ్య కూడా చెపుతూంటాను. మరొకరు ఎవరన్నా మాట్లాడితే కల్లోలం చెలరేగే అవకాశం ఉంటుంది. అయితే అలా కల్లోలం రేపడం పొరపాటని, తప్పుడు పద్ధతని నేను స్పష్టం చేయదలచుకున్నాను. ముస్లిం స్త్రీలు బురఖాలు ధరించి నడుస్తూ ఉంటే అనేకసార్లు ఏదన్నా చెయ్యాలని బుద్ధి పుడుతుంది. ఏదన్నా చెయ్యడానికి పూనుకుంటే, మరింత కల్లోలం వ్యాపిస్తుందాయె! అందుకని ఏం చెయ్యగలం? 'మా మతంలో రాసి ఉన్నది మహాశయా! నలుగురిని పెళ్ళాడవచ్చు'నని అంటారాయె. కొందరు ఉత్తములైన ముస్లిములు ఏమని చెపుతారంటే, వారి మతంలో నలుగురిని చేసుకోవచ్చునని ఉన్నమాట నిజమేకాని నలుగురి పట్లా సమానంగా వ్యవహరించాలని కూడా ఉన్నదంటారు. ఇక్కడ మళ్ళీ ద్రౌపది కథ గుర్తుకు వస్తుంది. అంతటి సర్వగుణ సంపన్నురాలైన ద్రౌపదే అందరిపట్లా సమానంగా వ్యవహరించలేక పోయినప్పుడు, సాధారణులైన ముస్లిములు నలుగురి పట్లా సమానంగా వ్యవహరించగలరా? అసంభవమనిపిస్తుంది. ఖురాన్‌లో ఏమి రాశారు; ఏమి

రాయలేదనేది నాకు అప్రస్తుతం. ఏ మగవాడైతే, ఆడది కూడా, నలుగురు భర్తలను చేసుకోవడానికి, ఆ నలుగురితో ఏకకాలంలో భార్యాత్వం నెరపడానికి అంగీకరించడో, అలాంటి మగవాడు ఏ ఆధారంతోనైనా సరే– మతాచారం కానీ, మరేదైనాకానీ– తనకు మాత్రం నలుగురు భార్యలను చేసుకునే అధికారం ఉన్నదని అనడం నీచమైన పద్ధతి. నవ్యప్రపంచంలో అతనికి స్థానం లేదు. మన ఆలోచనలనూ, దృక్పథాలనూ ఈ విషయంలో సక్రమంగా మార్చుకోవాలి.

భారతదేశంలో బహుభార్యాత్వం, ఒకేసారి అనేకమంది ఆడవాళ్ళను పెండ్లి చేసుకుని, అనేకమంది భార్యలతో కాపురం చేసే ఆచారం ఉన్నది, లేదా ఉండేది. హిందువుల మధ్య ఈ ఆచారాన్ని ఇప్పుడు చట్టరీత్యా నిషేధించారు కానీ, సంప్రదాయంగా మాత్రం అది కొనసాగింది. మానసిక స్థితి దానికి అనుకూలంగానే ఉన్నది. యూరోపులో ఈలాంటి ఆచారం ఉండేదికాదని నాకనిపిస్తుంది. ఈ విషయం గురించి చాలా పుస్తకాలు చదివాను. ఒకటి రెండు కథలు దొరికాయి. షెర్లమన్ పేరు విన్నారా? లేదా చాల్స్ ద గ్రేట్ లేదా కార్ల్‌దేగ్రూసే? ఈ విషయంలో ఒక్క సంగతి గుర్తుంచుకోవాలి. విదేశీ విషయాలను భారతీయులు పూర్తిగా అంగీకరిస్తూ ఉంటారు. ఆంగ్లేయులు కేవలం స్వరూపాన్నే స్వీకరిస్తారు. మనకున్న అంతర్జాతీయ దృక్పథం ఎంత లోపభూయిష్టమైనదంటే – భారతదేశానికి బయట ఉన్న ప్రతిదాన్నీ మనం ఆంగ్లేయమే ననుకుంటున్నాం. ఈ రకమైన బుద్ధిహీనతను కూడా దూరం చేసుకోవాలి. ఇంగ్లీషే కాదు, జర్మనీ కావచ్చు, ఫ్రాన్సు కావచ్చు కాని భారతదేశంలోని ప్రముఖ రచయితలు, ప్రఖ్యాత కవులూ, గ్రంథకర్తలూ ముఖ్యంగా ఈ హిందీ రచయితలు, బయటిది ఏదైనా సరే దాన్ని అంగీకరిస్తూ ఉంటారు. యూరోపు చరిత్రలో చాల్స్ ద గ్రేట్ అనే గొప్ప రాజును జర్మన్‌వాడా, ఫ్రెంచివాడా అనేది అనుమానాస్పదమైన అంశం– బహుశా ఉభయ లక్షణాలూ ఉన్నవాడై ఉంటాడు. ఆంగ్లేయులు చేసిన నామకరణమది. అతని పేరు– జర్మన్ భాషాపరంగా అయితే 'కార్ల్ దే గ్రూసె, ఫ్రెంచి నామమైతే షెర్లమన్. 'మాగ్నకార్టా' అన్న మాట విన్నారా? 'మాగ్నా' అన్నమాటకు అర్థం తెలుసా? 'పెద్దది' అని. 'మాగ్నా' అన్నమాటను ఫ్రెంచిభాషలో 'మన్' అని ఉచ్చరిస్తారు. షర్లమన్. షర్ల్‌ను ఆంగ్లంలో 'చాల్స్' అనీ, జర్మనీలో 'క్లార్' అనీ ఉచ్చరిస్తారు. అతనికి చాలామంది భార్యలుండేవారని, అతన్ని గురించి కథలున్నాయి. ఈ ఒక్క గాథను మినహాయిస్తే – యూరోపు చరిత్రలో

ఒకేసారి అనేకమంది భార్యలను చేసుకున్న కథలు నాకు కనిపించలేదు. శ్వేత ప్రపంచపు చరిత్రలో ఎవరన్నా ఒక మగవాడు, మామూలు మగవాడుగానీ, మగమహారాజుగానీ, సమాజంలో గొప్పవాడైన మరేరకమైన మగవాడుగానీ, ఒకేసారి ఒకరికన్నా హెచ్చుమంది భార్యలను కలిగివున్న సందర్భం నాకు ఒక్కటి కూడా కనిపించలేదు. గత ఐదువేల సంవత్సరాల చరిత్రను తవ్విచూసినా కానరాలేదు.

మనదేశం పరిస్థితి, సామాజిక వ్యవస్థ, సమాజ నిర్మాణం అన్నీ అతి విచిత్రంగా ఉన్నాయి. ఈ అంశాన్ని గురించి అధ్యయనం చేయండి, పరిశోధనలు చెయ్యండని నేను చాలామందికి సూచించాను. పి.హెచ్.డి. చెయ్యడానికి ఇది ఎంత మంచి విషయం! భారతదేశంలో – ఒక్క భారతదేశంలోనే కాదు, అరబ్ దేశంలో, చైనాలో మగవాళ్ళు ఎంతమంది ఆడవాళ్ళనైనా పెండ్లి చేసుకొనే అధికారం, అంతకు మించి ఉంపుడుకత్తెలను ఉంచుకునే అధికారం మగవారికే ఎందుకిచ్చారు? ప్రేమ– ప్రేమికుల విషయం వేరు. ఇక్కడ మనం పెండ్లిండ్ల గురించి మాట్లాడుకుంటున్నాం. ఏదైనా ఒక్కటే అనుకోవడం పొరపాటు. పెండ్లి అనేది ఒక సామాజిక కార్యక్రమం. సాంఘిక జీవితంలో ప్రధానమైన సంఘటన వివాహం. ప్రియురాండ్రూ – ఉంపుడుగత్తెలూ ఇటువంటి వాటినన్నింటినీ మీరు వదిలేయండని నేను ముందుగానే చెపుతున్నాను. ప్రేమించే స్వాతంత్ర్యం ఆ దేశాలలో ఉండేదంటే – మనదేశంలో మాత్రం తక్కువగా ఉండేదా అని అడుగుతున్నాను. ఎవరినైతే పెండ్లి చేసుకుంటారో కేవలం వారే ప్రియురాండ్లనుకుంటున్నారా? అనేకమైన వివాహాలు చేసుకొనేవారు ప్రియురాండ్రను కలిగి ఉండటంలో కూడా చాలావరకు సాహసులే అయి ఉంటారు. అనేక పెండ్లిండ్లు చేసుకొని, అనేకమంది భార్యలుంటే – ప్రియురాండ్రు ఉండరేమోనన్న భ్రమపడవద్దు. అలాంటిదేమీ ఉండదు.

ఈ సమాజ నిర్మాణం గురించి సంపూర్ణంగా అధ్యయనం జరగాలి. శ్వేత ప్రపంచంలో ఈ ఆచారం ఎందువల్ల లేదు? వారి సంస్కారం, వారి జీవన పద్ధతులు, వారి చరిత్రా, వారి గుణగణాలు ఏదన్నా విశిష్టంగా ఉన్నందువల్ల ఇటువంటి కుళ్ళు వారి జీవితాలలో ప్రవేశించకుండా మొదటినుంచే ఏర్పాటు జరిగిందా? మరొక విధమైన కుళ్ళు ప్రవేశించి ఉండవచ్చు. నా ఉపన్యాసాన్ని వింటున్న మీరు– నేను ప్రియురాండ్రను కలిగి ఉండటాన్ని, ఉంపుడుకత్తెలను కలిగి ఉండటాన్ని సమర్థిస్తున్నాననుకుంటే పొరపాటు. నా ప్రధాన లక్ష్యం సమానత్వం అని నేను

పునరుద్ధాటిస్తున్నాను. ఆ ప్రధాన లక్ష్య సాధనా ప్రక్రియలో ఇటువంటి ఘటనలూ– దుర్ఘటనలూ సంభవిస్తూ ఉంటే నేనేం చేసేది? నిస్సహాయుణ్ణి. మీరు సమానత్వ స్థాపనా లక్ష్యాన్ని సాధించి, మీ మనస్సులోని కోరిక ప్రకారం ఒక భార్య– ఒకే భర్త అన్న పద్ధతిని కచ్చితంగా ఆచరించ గలిగితే అంతకు మించిన ఘనకార్యం మరేదీ లేదు. నేను అంటున్న మాటను పూర్తిగా గ్రహించండి! మీ మనస్సులోని కోరిక తీర్చుకోవడంలో, సమానత్వ సిద్ధాంతాన్ని కచ్చితంగా పాటించాలి. ఒకే సమయంలో ఒకే భార్య– ఒకే భర్త అన్న పద్ధతిని అమలు జరపాలి. అయితే ఇది నాకు కఠిన సాధ్యంగా కనిపిస్తున్నది. పూర్తిగా అసంభవమైనది అని కూడా అనలేం. కాని సాధారణంగా అసంభవమే. ఇప్పటివరకు ఎన్ని ఘనకార్యాలు చేశాడో ఎవరికి తెలుసు? నిజం ఆలోచిస్తే ఇప్పటివరకు మానవేతిహాసం, అనేక విధాలుగా, అనేక కోణాలలో చాలావరకు నీచంగా, అక్రమంగా అస్పష్టంగా కొనసాగింది. ఏపక్షం వహించాలో? ఆ మాటకు వస్తే ఇప్పుడు కూడా మున్ముందు చాలా ఇబ్బంది లున్నాయి. అనేక విషయాలు చెల్లాచెదురుగా, ముక్కలు ముక్కలుగానే వున్నాయి. అయితే మరోవైపుకు సాగితే, యూరోపును గురించి నేను ఇందాక చెప్పిన విషయం– గుణాలకు సంబంధించినది– కేవలం ఆ ఒక్క అంశాన్ని గురించైనాసరే, సాధ్యమైతే పరిశోధనలు చేయండి! అధ్యయనం సాగించండి! ఏదన్నా ఒక విషయానికి పరిమితమయ్యే కదా అధ్యయనం చేసేది. విషయాన్ని అపరిమితం చేసుకున్నట్లయితే అధ్యయనం సాగదు. "ధ్యానావస్థిత సద్గతేన మనసా" వంటి పరిస్థితి ఏర్పడుతుంది. యావత్ ప్రపంచమూ ఒక్కటే. ఒకే పత్ని, ఉంపుడుకత్తె కూడా ఒకటే, ప్రియురాలు ఒక్కర్తే, స్నేహితురాలు ఒక్కర్తే– సఖీ ఒక్కర్తే– అందరూ ఒకటేనంటే సరిపోలేదా? ఇలాగ ఆలోచించుకుంటూ ఉంటే, ఆలోచనలకు మెరుగు పెట్టుకోవడం, మానసికంగా ఎదగడం సంభవమవుతుంది. దీనిని గురించి మీమాంస జరగవలసిందే. ఇది మామూలు విషయం కాదు. శ్వేత ప్రపంచంలో– ఇతిహాసంలో– ఎక్కడాకూడా బహుభార్యాత్వం సంప్రదాయంగా లేకపోవడం ఏమిటి– రంగు ప్రపంచంలో మాత్రమే ఈ సంప్రదాయం ఉత్పన్నం కావడానికీ– బలపడడానికీ కారణం ఏమిటి? మీలో ఎవరన్నా ఈ విషయం మీద బాగా శ్రమపడి – అధ్యయనం చేసి –ఐదో–పదో సంవత్సరాలు పట్టవచ్చు, కృషి సలిపి ఒక పుస్తకం రాసినట్లయితే చాలా గొప్ప పుస్తకం అవుతుంది.

# కృష్ణుడు

అనువాదం : **రావెల సాంబశివరావు**

**కృ**ష్ణుని విషయంలో ప్రతిదీ జతలుగా ఉంటాయి. ఇద్దరు తల్లులు, ఇద్దరు తండ్రులు, రెండు నగరాలు, ఇరువురు ప్రియురాళ్ళు లేదా ఎందరో. తరువాత వాటికి సంసారపక్షంగా అర్థాలు చెప్పినా, సంస్కృతీపరంగా చెప్పినా లేదా సామాజికంగా వివరించినా అవి అసలైన అర్థాలకంటే శ్రేష్ఠంగా, ప్రియంగా నిలిచిపోయాయి. అలా కృష్ణుడు దేవకీనందనుడయినా, అంతకు మించి యశోదా నందనుడు. కృష్ణుని కన్నతల్లి ఎవరో తెలియనివాళ్ళు కొందరు ఉండవచ్చు. కాని తరువాత తల్లి అయిన గొల్లవనిత యశోద పేరు తెలియని వింతవ్యక్తి ఎవరయినా ఉంటారా? అదే విధంగా వసుదేవుడు కూడా వెనుకంజ వేసినట్లే. అసలు తండ్రికి మించి నందునికి గౌరవం దక్కింది. ద్వారక, మధుర ఈ రెండింటినీ పోటీపెట్టి చూపటం సమంజసం కాదు; ఎందుకంటే భూగోళశాస్త్రం, చరిత్ర మధురనే అనుసరించాయి. అయితే కృష్ణుని స్నేహితులు మధుర, మధురాపతికి మించి ద్వారకకు, ద్వారకాధీశునికి అధికంగా ఇష్టులయ్యారు. మధురలో అంతా శిశుప్రాయపు లీలలే. యవ్వనక్రీడల దృష్టితో చూస్తే బృందావనం, వార్షణా వంటివి మరింత విలువైనవి. ప్రియురాళ్ళ వ్యవహారంలో చిక్కులు ఎదురయ్యాయి. ఎవరి విషయంలో మనం బేరీజు వేయాలి? రుక్మిణి సత్యభామల మధ్యనా లేక రాధ రుక్మిణిల మధ్యనా లేక రాధ ద్రౌపదుల మధ్యనా? ప్రేమికులు అనే పదానికి అర్థం సంకుచితం కారాదు. కనుక సఖీసఖుల భావంతో మనం ముందుకు సాగాలి. ఇప్పుడిక మీరాబాయి కూడ పందెం ప్రారంభించింది. ఏది ఏమయినా రాధ అదృష్టవంతురాలు. ముల్లోకాల స్వామి తన చరణదాసుడు. కాలం మలుపు, మహాయుగం, బహుశా ద్రౌపది లేదా మీరాను రాధ స్థానం వరకు నడిపించాయి. అయితే అదంతా అంత నమ్మశక్యం

కాదు. పరిస్థితి ఎటువంటిదయినా రాధ రుక్మిణిని ఢీకొట్టజాలదు.

మనిషి శారీరక పరిమితి వాళ్ళ చర్మము, గోళ్ళ వరకే. ఈ శారీరక పరిమితి ఒక మిత్రుడినో, ఒక తల్లినో, ఒక తండ్రినో దర్శింపజేస్తూవుంటుంది. అయితే కాలం నిరంతరం ఆ పరిమితులకు దూరంగా గంతులేసే ప్రయత్నం చేస్తూంటుంది. అది మనస్సు ద్వారానే అలా గంతులేయగలదు. కృష్ణుడు అదిగో అటువంటి తత్వానికి చెందినవాడు. కడుగొప్ప ప్రేమికుడు. మనస్సుకుగల పరిమితులకు ఎదురు తిరుగుతూనే అందరిలో కలగలిసిపోతాడు; ఎవ్వరితోనూ దూరంగా ఉండడు. ఎందుకంటే కృష్ణుడు ఘటనా ప్రపంచానికి చెందిన మానవలీలలు ప్రదర్శిస్తాడు. అది కేవలం సిద్ధాంతాలకు తత్వాలకు చెందిన వివేచనే కాదు. అందువలన అతనికి సంబంధించినవన్నీ తనదైన ఒక పరిమితిలో ఇమడక రెండో అంతకు మించో ఇతరాలు ఉంటాయి. ఈ విధంగా రెండింటిలోనూ కృష్ణునికి చెందనివి వుంటాయి. అయితే లీలల విషయంలో తన తల్లి, భార్య, నగరం వంటివి ఎక్కువగా పరాయివిగా కన్పిస్తాయి. స్వంతానికంటే పరాయితనాన్ని అలా పెరిగిపోనివ్వటం ఒక అర్థంలో స్వంతాన్ని త్యజించటమే. ద్వారక, మధుర ఏకాధిపత్యాన్ని తొలగిస్తుంది; అయితే ఆ క్రమంలో ద్వారక తన శ్రేష్ఠత్వాన్ని స్థిరపర్చుకుంటుంది.

భారతీయ సాహిత్యంలో యశోద మాతృమూర్తి; కృష్ణుడు ఆమె బిడ్డ.తల్లి – తనయుని విషయంలో యింతకు మించిన బంధం వేరొకటి నాకు కన్పించదు; ఎటునుండి చూచినా శ్రేష్ఠత్వమే గోచరిస్తుంది. మధుర కూడ తప్పుకోదు; అలాగే రుక్మిణి కూడ. మగధలో జరాసంధునితో ప్రారంభించి, శిశుపాలుని చుట్టుకొని, హస్తినాపురంలో ద్రౌపది–పంచపాండవుల వరకు ఏకరూపతే నిలిపినట్లుంటుంది. పరాయితనం స్వంతాన్ని మించిపోయి దానిని తొలగించదు; కేవలం తన పర అనే అడ్డుగోడల్ని కూలగొట్టటమే. లోభం, మోహం, ఈర్ష్య, భయం వంటి వాటన్నింటినీ నాల్గుగోడల మధ్య దాగుడు మూతలద్వారా తమ తమ లేదా స్వకీయ విముక్తిని పొందవచ్చు. సర్వం తమదో, తమదే సర్వమో అయిపోతుంది. కృష్ణునిది గొప్ప రాసలీల; రాధాకృష్ణుల లేదా ద్రౌపదీ సఖుల లేదా రుక్మిణీరమణుల శారీరక పరిమితులలో ప్రేమానందం; రక్తపు వేడిమి, వేగాలలో స్వల్పత్వమేమీ ఉండదు. అయితే ఇవన్నీ వుండికూడా ఏమిటీ పరాయితనం?

అసలీ కృష్ణుడెవరు? గిరిధరుడు, గిరిధరగోపాలుడు! కావటానికి మురళీధరుడు, చక్రధరుడు కూడ. అయితే కృష్ణుని అతి రహస్యమయ రూపం మాత్రం గిరిధర గోపాలునిలోనే శుభ్రపడుతుంది. కన్నయ్య గోవర్ధన పర్వతం తన చిటికెన వ్రేలుతో ఎందుకు ఎత్తవలసి వచ్చింది? ఆయన ఇంద్రునికి పూజలు మాన్పించినందువలన కాదు; ఇంద్రుని ప్రసాదాన్ని స్వయంగా బొక్కినందుకు కాదు; బొక్కుతున్నందుకూ కాదు; ఇంద్రునికి కోపం వచ్చి నీరు, రాళ్ళు, వర్షం మాదిరిగా కురిసేట్లు చేయటం ప్రారంభించాడు. అప్పుడు కృష్ణునికి గోవర్ధనగిరి నెత్తి తన గోవులను, గోపాలురను రక్షించవలసివచ్చింది. కృష్ణుడు ఇంద్రుని ఓగిరాన్ని స్వయంగా ఎందుకు భుజించదలిచాడు? యశోదాకృష్ణుల బాంధవ్యంలో రహస్య వివాదం ఉన్నది. తల్లి ఇంద్రునికి ఆహారం సమకూర్చదలిచింది– అందుకు కారణం అతడు దేవతల పెద్ద కావటమే. కేవలం అమృతంతోనే సంతృప్తి చెందుతాడు. అతనిలోని గొప్పశక్తి ఏమంటే ప్రసన్నుడయిన పిమ్మట అనేక వరాలిస్తాడు; కోపం వస్తే కష్టాలు కలిగిస్తాడు. కొడుకు తాను ఇంద్రుని కంటే కూడ మిన్నయిన దేవతనంటాడు. అందుకు కారణం అతడు అమృతంతో తృప్తి చెందడు;. ఎంతో తినగలడు. అతని తిండికి పరిమితులుండవు. ఇదే కృష్ణలీలలకు చెందిన వెల్లడికాని రహస్యం. అమృతం స్వీకరించేదేవతల నుండి తిండి తినే దేవతల వరకు భారతయాత్రే కృష్ణలీల అంటే.

కృష్ణునికి పూర్వం భారతీయ దేవుళ్ళు ఆకాశంలో వుండేవాళ్ళు. అవతారాలనేవి కృష్ణునికి ముందే ప్రారంభమయ్యాయని నిస్సందేహంగా చెప్పవచ్చు. అయితే త్రేతాయుగపు రాముడెటువంటి మనిషంటే నిరంతరం దేవుడు కావాలనే ప్రయత్నమే. అందువల్ల ఆయనలో ఆకాశదేవతల అంశ కొంత అధికంగా వుండేది. ద్వాపరయుగపు కృష్ణుడు మాత్రం నిరంతరం మనుష్యునిగా నిలవాలనే ప్రయత్నమే. అందులో అతడు సంపూర్ణ సాఫల్యం పొందాడు. కృష్ణుడు సంపూర్ణ మానవుడు; బోధపడని వ్యక్తి; బాగా తింటాడు, తినిపిస్తాడు. ఎంతగానో ప్రేమిస్తాడు. ప్రేమించటం ఎలాగో నేర్పుతాడు; జనగణాలకు రక్షణ కల్పించినవాడు. వాళ్ళకు దారిచూపినవాడు. నిర్లిప్త భోగిగా, గొప్పత్యాగిగా, యోగిగా నిలిచాడు.

ఈ సందర్భంగా మనిషికి, ప్రత్యేకించి రాజకీయ వ్యక్తులకు రాముని బాట సుకరమా లేక కృష్ణుని బాటనా అనేది అర్థంపర్థం లేనిది. ఇక్కడ చెప్పుకోవలసింది

ఏమంటే కృష్ణుడు దేవుడయ్యుండి కూడ నిరంతరం మనుష్యునిగా మారుతూ వుండేవాడు. దేవుడు అపరిమితుడు అయిన కారణంగా కృష్ణునిలో మనుషులకు అసంభవంగా కన్పించే ఎటువంటి మానవ లక్షణాలు ఉన్నాయో– అవే అసత్యాలు, మోసం,హత్యల వంటివాటిని అనుకరించేవాళ్ళు మూర్ఖులు. అందులో కృష్ణుని దోషమేమున్నది? కృష్ణునిలోని సాధ్య సంపూర్ణ మానవతా లక్షణాలపై ధ్యాసను నిలపటం మంచిది; అదీ ఏకాగ్రతతో. కృష్ణుడు ఇంద్రుణ్ణి ఓడించాడు. సురను సేవించే దేవుళ్ళను తరిమికొట్టాడు. ప్రసాదం ఆరగించే దేవుళ్ళను ప్రతిష్ఠించాడు. వెన్నెముక కలిగి, రక్తమాంసాలు కలిగి, వారి జాతిపట్ల గౌరవము కలిగిన వాళ్ళను దేవుళ్ళను చేసాడు. దేవుళ్ళ కోసం గగనాలలో వెతకవద్దు. మీ మధ్యనే, భూమి మీదనే వెతకండి. పృథ్వికి చెందిన దేవుడు భుజిస్తాడు, ప్రేమిస్తాడు, కలసిమెలసి ఉంటూ రక్షిస్తాడు.

కృష్ణుడు ఏమిచేసినా స్థిరచిత్తంతో చేసేవాడు– భోజనం చేసినా అంతే, ప్రేమించినా అంతే, రక్షించినా అంతే; సంపూర్ణ ఆహారం, పరిపూర్ణ ప్రేమ, పూర్తి రక్షణ. కృష్ణుని చర్యలన్నీ తన సంపూర్ణ శక్తియుక్తుల్ని ప్రయోగించినందువల్ల ఓతప్రోతమయ్యేవి. శక్తికి సంబంధించి ఏ కొంచెం కూడా వదలివేయడు. అందులో పిసినారితనం ఉండనే ఉండదు. అటువంటి మనస్సు విసిరేసే, శరీరాన్ని విసిరేసే వ్యవహారం మనుషుల కారణంగా అయ్యేపని కాదేమో. అయినా అతడు మనిషే. శరీరాన్ని విసిరివేయటమన్నది ఎవరికయినా మానవ ఆదర్శాన్ని చేరుకునే ప్రయత్నంలో చివరిమెట్టుకు కొంచెం ముందుగా ఆగిపోవలసి రావచ్చు. కృష్ణుడు స్వయంగా స్థితప్రజ్ఞునిగా గానం చేశాడు– మనిషి తన సర్వశక్తిని పూర్తిగా జమాయించి వాడినట్లుండేది. అటువంటి వ్యక్తిని కర్మఠుడు (ఏదయినా పని నెరవేరువరకు విడిచిపెట్టనివాడు) అంటారు. అటువంటి వ్యక్తి తాబేలు మాదిరిగా తన శరీర భాగాలను తన లోపలికి ముడుచుకుంటాడు. తన ఇంద్రియాలపై ఎంతగా సంపూర్ణ అధికారాన్ని సాధిస్తాడంటే అది కోరుకునే వాటి నుండి పూర్తిగా దూరంగా జరిగేంతగా. కొందరు ఈ సందర్భంగా చెప్పేదేమంటే అలా జరగటం వల్ల భోగం తలక్రిందు లయినట్లుందని. అది సరికాదు. ఏమి చేసినా పూనికతో చేయాలి. అది భోగమయినా, త్యాగమయినా. భోగపురుషుడిగా కృష్ణుడు చేరిపోయాడు. యోగిగా తాను స్థిరపడి

వుండనేవున్నాడు. బహుశా ఆ రెండింటి మధ్య ప్రత్యేకించి తేడా ఏమీలేదు. అయినా కృష్ణుడు ఏక శరీరునిగా ఒక సూత్రాన్ని అందించాడు. అది అచల స్థితప్రజ్ఞుని గురించి; చలించే స్థితప్రజ్ఞుని గురించి కాదు. అయితే ఆయన పరిభాష ఇంద్రియాలను ఇంద్రియాలతోనే జయించి ఎవరైతే పూర్తి అధికారాన్ని సాధిస్తాడో, అతని గురించి కాదు; ఇంద్రియాలను ఇంద్రియాలతోనే రక్షణకై చుట్టిపెట్టగలవాని గురించి. కృష్ణుడు స్వయంగా రెండూనూ. సైద్ధాంతికంగా, ఏకాంగిగా మిగిలిపోయాడు. కృష్ణుడు ఏ పనిని ఎప్పుడు చేస్తాడో అప్పుడు తన సమస్త అంగాలను ఏకాగ్రతతో ప్రయోగిస్తాడు. తనకోసం అసలేమీ మిగలదు.

అందులో అసలు తనదంటూ ఏమీ ఉండదు. కూర్మము వంటి వానితోపాటుగ సమగ్ర అంగ ఏకాంగి కూడ పరిభాషలో కదనుదొక్కుకోవాల్సివుంది. ఏ పని చేసినా పూనికతో చేయాలి– మనస్సును, శరీరాన్ని అందులో లగ్నం చేసి. దేవత కావాలనే ప్రయత్నంలో మానవుడు కొంత పిసినారి అయిపోయాడు. సంపూర్ణ ఆత్మ సమర్పణలో అతడు కొద్దిగా తప్పటడుగు వేసినట్లుంటుంది. అతడు తననితాను వేరొకరికి అర్పించు కొనవలసిన అవసరమేమీలేదు. తన పనులలో తాను పూర్తిగా ఆత్మ సమర్పణ చేసినా చాలును. చీపురుతో ఊడ్చినా ఆ పనిలో లగ్నమైపోవాలి. అంటే తన ఇంద్రియాలను పూర్తిగ వినియోగిస్తూ లేదా తన ఇంద్రియాల నన్నింటిని ఉపయోగంలోకి తెచ్చి యుద్ధంలో రథం నడిపినట్లుగ మనస్సును లగ్నం చేయాలి. శ్యామ పూలమ్మే వ్యక్తిగా మారి రాధ వద్దకు పూలను అమ్మేందుకు వెళ్తే లగ్నమైన మనస్సుతో వెళ్ళాలి. కృష్ణుడు ప్రతిన బూనుతాడు– మనుష్యుల్ని ఉదారులుగా మలిచేందుకు. వాళ్ళ శక్తిని సంపూర్ణంగా, ఏకాగ్రతతో రువ్వినట్లుగా కన్పిస్తాడు. మనిషి ఏదో చేస్తూవుంటాడు; ధ్యాస ఎక్కడో ఉంటుంది. ఊడ్చినా మురికి మూలల్లో అలాగే పడివుంటుంది. ఏకాగ్రతతో కూడిన ధ్యానం లేనప్పుడు సమస్త ఇంద్రియాల ఉదార ప్రయోగం ఎలా ఒనగూడుతుంది? ముడుచుకుపోయే వ్యక్తిని, సమగ్ర అంగ ఏకాగ్రతగల మనిషిగా తయారుచేయాల్సి ఉంది. ఇదే దేవత మనిషిగా మారే ప్రయత్నం అంటే. చూడండి అమ్మ,ఇంద్రుడు కేవలం అమృతం సేవిస్తారు. మనిషి మాత్రం భుజిస్తాడు.

గగనవాసులైన దేవతల్ని పారద్రోలదలచిన వాళ్ళు ఎంతో పరాక్రమవంతులు కావాలి; కష్టాలను ఎదుర్కొనేందుకు సిద్ధపడాలి. అలా ఉన్నప్పుడే కృష్ణుడు గోవర్ధన పర్వతాన్నంతా తన చిటికెన వ్రేలితో ఎత్తవలసివచ్చింది. ఆ చర్య ఇంద్రునికి కోపం తెప్పించింది. తన గోవుల్ని తాను రక్షించుకొనలేకపోతే అటువంటి కృష్ణుని వలన ప్రయోజనమేమిటని అనుకున్నాడు కన్నయ్య. అప్పుడు కృష్ణుని రక్షించే యుగం మొదలుకానుంది. ఒక విధంగా బాలలీలలు, యువలీలల కొనసాగింపే గిరిధరలీల. కాళీయ మర్దనం, కంసవధ, అతని చేతిలో పనులే. గోవర్ధన పర్వతాన్ని ఎత్తటంలో కృష్ణుని వేలికి నొప్పి కలిగి వుంటుంది. తన గోపాలుర్ని, సఖులను కొంత యుద్ధభూమిలో మాదిరిగా సహాయపడమని చెప్పి ఉంటాడు. అమ్మకు ఇంకేదో చెప్పి చిటికెన వ్రేలు నొప్పి పుడుతున్నదని చెప్పివుంటాడు. గోపికల కళ్ళు, తన కళ్ళ మధ్య యుద్ధం జరిగేట్లు చేసి చెరగని తన చిరునవ్వు ద్వారా ఇంకేదో చెప్పి వుంటాడు. అతని పరాక్రమాన్ని చూసి అచ్చెరువొందటం కోసం రాధాకృష్ణుల మధ్య గంభీరమైన, ప్రఫుల్లమైన ముద్రలు కన్పించివుండాలి. కృష్ణుడు ఎవరిపట్ల అధికంగా ముడుచుకుపోతాడు అనేది తేల్చి చెప్పటం కష్టం–

అమ్మవైపు చూపు బాధగానా? రాధమ్మ వైపు చూపు ప్రఫుల్లంగానా? పాపం అతని వేలు మాత్రం నొప్పి పుడుతూనే ఉంది. ఇప్పటివరకు నొప్పిగానే ఉంది. గోవర్ధనగిరికి కూడ అలాగే అన్పిస్తూవుంది. అక్కడే మానసగంగ. కృష్ణుడు గవు వంశరూపుడైన దానవుణ్ణి చంపినపుడు, రాధ మూతి ముడిచింది. ఆ పాప పరిహారార్థం అక్కడే గంగ కావాలన్నది కృష్ణునితో. పాపం కృష్ణునికి ఎటువంటి అసంభవమైన పనులు తవ్వి తలకెత్తుకొనవలసి వచ్చేవో. అటువంటి సందర్భాల్లో ప్రతిసారి అతడు ఇతరుల్ని సుఖపెట్టేందుకు ఏదో ఒకటి చెప్తూండేవాడు. అతని వ్రేలునొప్పి పెడుతూనే ఉంది. పదండి అతనికి సాయపడదాం. గోవర్ధనం వద్ద మార్గమధ్యంలో నడుస్తూ, నడుస్తూ అలా నడిచే వాళ్ళల్లో పూజారులు వుండనే వుంటారు– అందులో ఒకతను 'నేనెక్కడి వాణ్ణి' అని అన్నాడు.

నేను ఆటలు పట్టిస్తూ బదులు పలికాను రాముని అయోధ్యకు చెందినవాడివని.

దానికి పూజారి సమాధానం 'మాయ ...అంతా ఒకటే ...'

నేను ఆటలు పట్టించటం అలా కొనసాగుతుండగానే ఎవరో అననే అన్నారు.

చివరకు సత్వగుణ సంపన్నుడైన రాముడు గోవర్ధన వాసులతో మైత్రిని ఎలా నిర్వహించగలడు? అతని మనస్సు అప్పుడు వెన్న మీగడలు మెక్కే కృష్ణుని రూపంతో నిండివుంది.

వెన్న – మీగడలు మింగే కృష్ణుడు, సత్వగుణ సంపన్నుడు రాముడు కొంత నిజమే. అయితే కృష్ణుని చిటికెన వ్రేలు యిప్పటివరకూ సలుపుతూనే వుంది.

ఒక పర్యాయం మధురలో దారిన పోతూ ఒక పూజారికీ నాకూ మధ్య మాటలు సాగాయి. పూజారుల సాధారణ గీటురాయితో చూచేటట్లయితే దానికి ఫలితం లభించదు. లభించే అవకాశమూ లేదు. అయితే అబ్బ! మధురమైన చిరునవ్వుతో అతడు చెప్పినదేమంటే జీవితంలో రెండు మధురమైన మాటలు దొరికితే మనకు అంతా ఉన్నట్లే. కృష్ణుడు మధురంగా మాట్లాడటం నేర్చుకున్నాడు. గగన విహారులైన దేవతల్ని పారద్రోలాడు. వెన్న మీగడల దేవుళ్ళు ప్రతిష్ఠించబడ్డారు. కానీ, వాళ్ళవికాని, మనవికాని ఏఏ శరీరభాగాలు ఇప్పటి వరకు సలుపుతున్నాయి!

కృష్ణుని మాదిరిగానే మరో వ్యక్తి దేవుడయ్యాడు. అతనూ మనిషిగా తయారయ్యేందుకు ప్రయత్నించాడు. అతని రాజ్యం ప్రపంచంలో ఎక్కువగా విస్తరించింది. బహుశా అందుకు కారణం అతడు ఒక కడుపేద వడ్రంగికి కొడుకు కావటమే. అతడు తన జీవితంలో వైభవం అనేదాన్ని ఎరుగడు. బహుశా అందువల్ల జనరక్షణ విషయంలో ఆయన అంతిమకృషి ఎటువంటిదంటే కేవలం ఆయన వ్రేలు దెబ్బతిని ఊరుకోలేదు; అతని శరీరంలోని ప్రతి రోమం, ప్రతిభాగం ముక్కలు చెక్కలై అతను మరణించాడు. ఇప్పటి వరకు ప్రజలు ఆయన్ని గుర్తుకు తెచ్చుకుంటూ తమకు పరిమితుల్ని విధించేవారికి దూరంగా దుముకుతుంటారు. క్రైస్తవం ప్రపంచంలో బహుశా ఎందువల్ల విస్తరించివుంటుందో తెలుసా? దాని విరోధులు రోమన్ల వల్లనే. వాళ్ళు ప్రస్తుతం అమలులోవున్న సభ్యతకు పూర్వీకులే. దేవుడు రోమన్లపై తిరగబడినాడు. రోమన్లు నేటి ఐరోపా వాసులపై తిరగబడ్డారు. బహుశా అందుకు ఒక కారణం కృష్ణలీలల మజా వ్రజభూమి, భారత భూమిలోని కణకణంలో ఎంతగానో యిమిడిపోవటం. కృష్ణుని కట్టడి అంతటి కఠినమైనది. ఏది ఏమయినప్పటికీ కృష్ణుడు, క్రీస్తు ఇరువురూ ఆకాశ దేవుళ్ళను పారద్రోలారు. ఇరువురి పేర్లలో, గాథల్లో కూడ అక్కడక్కడ పోలికలు కన్పిస్తాయి. అప్పుడప్పుడు గొప్పవారిని

పోల్చి చూపరాదు. ఇరువురూ వారి వారి క్షేత్రాలలో శ్రేష్ఠులే! అయినా క్రీస్తు ప్రేమకు ఆత్మకు సంబంధం విషయంలో అద్వితీయుడు;. కృష్ణుడేమో సంపూర్ణ మానవలీలల విషయంలో. అప్పుడు కృష్ణవంశజులు శక్తిశాలురైన భారతీయులై పోతారు. కనుక కృష్ణుని లీలలకు విశ్వమంతటా రసాన్ని వ్యాపింపజేసే అవకాశం లభించింది.

కృష్ణునితో బంధం భారతదేశంలో ఎంతో అధికం. భారతదేశంలోని దేవుళ్లలో ఎక్కువమంది అవతారాలు ఆ మట్టితో సంబంధం కలవి. ఆ మట్టి నుండి వేరు చేసినప్పుడు వాళ్ళు ఎంతగానో నిష్ప్రాణులవుతారు. త్రేతాయుగపు రాముడు భారతదేశపు ఉత్తర, దక్షిణ ఐక్యతకోసం ఉద్భవించిన దేవుడు. ద్వాపరయుగపు కృష్ణుడు దేశంలోని తూర్పు పడమరల ఐక్యతకోసం ఉద్భవించిన దేవుడు. రాముడు ఉత్తర దక్షిణ భూభాగాలలో, కృష్ణుడు తూర్పు పడమరల భూభాగాలలో తిరుగాడారు. అప్పుడప్పుడు దేశంలోని ఉత్తర దక్షిణాలను, తూర్పు పడమరలను ఒకటి చేయటమే రాముని, కృష్ణుని ఉద్దేశ్యం అన్పిస్తుంది. అలా సకల మతాల పుట్టుక రాజనీతికి సంబంధించినదే. చెల్లాచెదరైన స్వజనాన్ని పోగుచేయటం, వారి మధ్య కలహాలను రూపుమాపటం, పరిష్కరించటం, కుదిరితే అందరి పరిధుల్నీ తమవైపుకు లాక్కోవటమే దానితోపాటు జీవితాన్ని సదాచారం దృష్టితోనూ, ఆత్మావలోకన దృష్టితోనూ కొంచెం ఉద్ధరించటం.

దేశ ఐక్యత కోసం లేదా సమాజపు శుద్ధ సంబంధ కారణాలు, అవసరాల దృష్ట్యా ప్రపంచంలోని గొప్ప గొప్ప మతాలన్నీ ఉద్భవించాయి. విధిగా మతం ఈ అవసరాలకు మించి ఎదిగి మనిషిని సంపూర్ణుని చేసే దిశగా కూడ కృషి జరుపుతుంది. అయితే హిందూమతం ఈ అవసరాలతో ఎంతగా ఓతప్రోతమవుతుందో అంతగా మరే యితర మతమూ కాదు. అప్పుడప్పుడు ఏమనిపిస్తుందంటే రాముని, కృష్ణుని గాథలు మనస్సుకు హత్తుకునే గాథలు. వాటి విషయంలో ఒక అద్వితీయ ఉద్దేశ్యం చెప్పవలసి ఉంది– ఇంతపెద్ద దేశాన్ని ఉత్తర దక్షిణ దిశగా, తూర్పు పడమర దిశగా ఏకీకృతం గావించటం ఈ విలక్షణ లక్ష్యానికి అనురూపమే ఈ విధంగా విలక్షణ కథలుగా రూపుదాల్చటం. ఈ కథలన్నీ మొత్తంగా కొట్టిపారవేయాలని నేను చెప్పటం లేదు. గోవర్ధన పర్వతం ఘటన ఏ విధంగా ప్రచారంలో వున్నదో అందులో అబద్ధం

దాగి ఉండనే ఉందని అనుకోండి, వాటితోపాటుగా మరెన్ని కథలు కల్పించబడినాయో ఎవరికి తెలుసు?

అసలు ఎవరిని గురించి ఎన్నెన్ని కల్పనలు చేసారో ....అందులో ఒకటి కృష్ణుని లేదా రాముని చుట్టూ అల్లారు. అలా అల్లినవాళ్ళ చాకచక్యం మన ముందుంది. ఒకవేళ ఎవరయినా చమత్కార పురుషుల పేర్లు రాముడు, కృష్ణుడు అయ్యుండవచ్చు. చమత్కారం అన్నది వాళ్ళ ప్రపంచ చరిత్రలో లేకుండా తొలగించి వుండవచ్చు. అయితే అటువంటి గ్రంథకారులకు ఇది తక్కువగా సాధ్యపడే చమత్కారం కాదు. ఎవరయితే రాముని, కృష్ణుని జీవితపు ఘటనల్ని ఇలా గొలుసుకట్టుగానూ, వివరంగానూ బిగించి ముడివేసి వుంటారంటే చరిత్ర కూడా వాటి ముందు సిగ్గుపడవలసిందే. నేటి భారతదేశపు రాముని, కృష్ణుని గాథల్లో ఒక్కొక్క గొలుసుకట్టును ఎంతో ఉల్లాసంగా, సప్రమాణంగా తెలుసుకొంటారు; అదే సమయంలో చారిత్రక వ్యక్తులయిన బుద్ధుని, అశోకుని వంటివారి విషయంలో మాత్రం తెగిన జ్ఞాపకాలుగా మాత్రమే మిగిలిపోతాయి.

రామాయణం భారతదేశపు ఉత్తర దక్షిణముల యాత్ర ఎలాగో అలాగే మహాభారతం భారతదేశపు తూర్పు పడమరల యాత్ర. ఉత్తర దక్షిణాల యాత్రలకు రాముడెట్లు నాయకుడో అట్లే తూర్పు పడమరల యాత్రకు కృష్ణుడు నాయకుడు. జనకపురి నుండి శ్రీలంక వరకు రాముడు లేక అతని సహచరులు మాదిరిగానే మణిపూర్ నుండి ద్వారక వరకు కృష్ణుడు కాని, అతని సహచరులు కాని పరాక్రములయ్యారు. కనీసం ఆ పనిలో సరసత్వం అధికం.

రామునితో యుద్ధము లేదా మైత్రి భిల్లులతో, కిరాతులతో, కిన్నెరులతో, రాక్షసులతో జరిగింది. వాళ్ళంతా వేరే నాగరికతకు చెందినవారు. రాముని పని వాళ్ళందరిని తమలో కలుపుకోవటం. తమ నాగరికతలోకి వాళ్ళను మూస పోసుకోవటం. ఇదంతా వాళ్ళను ఓడించకుండానే, ఒకవేళ ఓడించవలసి వచ్చినా ఓడించిన పిమ్మట.

కృష్ణునికి బంధం కుదిరింది తన సొంతవాళ్ళతోనే. ఒకే నాగరికతకు చెందిన రెండు భాగాలలో ఒక భాగాన్ని ఎంచుకొని కృష్ణునికి తూర్పు–పడమర ఐక్యతను సాధించవలసిన అవసరం ఏర్పడింది. ఈ పనిలో జటిలత్వం ఎక్కువ. రకరకాల

సంధి– విగ్రహముల పని పడింది. ఎన్నెన్ని ఎత్తులు, ధూర్తత్వాలు జరిగాయో చెప్పజాలం. రాజనీతికి చెందిన విషయాలలో కూడ పట్టుకొని పిండటాలు కూడ ఎన్నెన్ని ఎదురయ్యాయి. అలా వాటన్నింటిని వడకట్టడం తిరిగి అసలేమీ జరగలేదన్నంతగా. అనేకమైన గొప్పతనాల్ని కూడ స్పృశించారు. మనస్సు లీనమయ్యే ఘటనలు కూడ ఎక్కువగానే జరిగాయి. తూర్పుపడమరల రాజనీతి ఎంత జటిలమో అంతగా మనుషుల మధ్య సంబంధాలు కూడ – మరీ ముఖ్యంగా స్త్రీ పురుష సంబంధాలు. అర్జునునికి మణిపురికి చెందిన చిత్రాంగద; భీమునికి హిడింబి, ఇక పాంచాలి విషయం చెప్పేదేమున్నది? కృష్ణుని మేనత్త కుంతికి ఒక కుమారుడు అర్జునుడు, ఇంకొక కుమారుడు కర్ణుడు. ఇరువురి తండ్రులు వేరు; పైగా కృష్ణుడేమో కర్ణుణ్ణి చీల్చి చెండాడమని అర్జునుణ్ణి రెచ్చగొడతాడు. అయినా ఎందువలన జీవితపు నీచత్వాన్ని వడకట్టి వచ్చాడు? ఎందుకంటే కృష్ణుని వంటి నీచవ్యక్తులు ఇంతకు పూర్వం ఎన్నడూ పుట్టలేదు; . ముమ్ముందు అంతకు మించినవాడు జన్మిస్తాడనేదీ అసంభవమే. రాముడు ఉత్తర దక్షిణ ప్రాంతాల ఐక్యతకు నాయకుడు కావటమే కాదు, ఆ ప్రాంతాన్ని పరిపాలించాడు రాజుగా. కృష్ణుడు మాత్రం తన మురళిని మ్రోయించుకుంటూ గడిపేసేవాడు. మహాభారతం నాయకి ద్రౌపది నుండి నాయకుడు కృష్ణుడు ఎన్నడూ ఏమీ పుచ్చుకున్నది లేదు; ఇచ్చుకుంటూ పోవటమే.

తూర్పు, పడమర ఐక్యతకు చెందిన కీలక రాజ్యాలు స్పష్టంగా కృష్ణుని కాలంలో వున్నాయి. ఒకటి పాట్నా–గయలకు చెందిన మగధరాజ్యం; రెండవది హస్తినాపురం– ఇంద్రప్రస్థలకు చెందిన కురురాజ్యం. మగధరాజ్యవ్యాప్తి స్వయంగా కృష్ణుని మధుర వరకు ఉండేది. అక్కడ మగధరాజు జరాసంధుని అల్లుడు కంసుడు రాజ్యమేలుతున్నాడు. మధ్యలో మగధకు చెందిన శిశుపాలుని వంటి ఆశ్రిత మిత్రులు వుండేవాళ్ళు. మగధరాజ్యానికి వ్యతిరేకంగా కురురాజ్యాన్ని శక్తిమంతం గావించింది కృష్ణుడే. ఈ రాజ్యం విషయంలో కృష్ణుడెంతటి ఎదుగుదలకు కారకుడయ్యాడు? తూర్పున మణిపురి నుండి ప్రారంభించి పశ్చిమాన ద్వారక వరకు గల కురుభూమిలో సమావేశం ఏర్పాటు చేశాడు. దేశంలోని రెండు ప్రాంతాలను– తూర్పునగల పర్వతప్రాంతాన్నీ, పశ్చిమానగల సముద్ర ప్రాంతాన్నీ వలలో బిగించి ముడివేశాడు. ఈ రాజ్యాన్ని స్థిరంగా శక్తిమంతం గావించేందుకు కృష్ణుడు ఎంతగా శ్రమపడవలసి

వచ్చిందో; ఎంతగా దీర్ఘమైన ఉపాయం ఆలోచించవలసి వచ్చిందో. అతడు తొలిగా మగధరాజు అల్లునిపై యుద్ధం ప్రకటించాల్సి వచ్చింది. ఆ సమయంలో యావద్భారతంలో ఈ యుద్ధవార్తలే మార్మోగి ఉంటాయి. ఇది కృష్ణుని తొలి ప్రతిఘటన. శబ్దం ద్వారా కాకుండా కర్మ ద్వారా రణభేరి మ్రోగించాడు. దానిని వినకుండా వుండగలవారెవరు? దీని విషయం ఆలోచించేందుకు అందరికీ ఆహ్వానాలు పంపించారు- మగధరాజైన కృష్ణుణ్ణి చక్రవర్తిగా ఎంచుకోవాలని, ఎన్నికలో చివరిఘట్టంలో కృష్ణుని మోసాలు ఎన్నెన్నో.... కురువంశంలోనే న్యాయం, అన్యాయం అనే విషయాలను ఆధారం చేసుకొని రెండు ముక్కలు చేసి వాటిలో అన్యాయపు పక్షానికి మగధరాజ్యాన్ని కలిపేశాడు. ప్రపంచం అంతా దానిని కురువంశపు అంతర్గత అంశంగా, కేవలం పరస్పర వైరంగా భావించింది. అయితే కృష్ణునికి తెలుసు ఇంద్ర ప్రస్థం హస్తినాపురపు కురుభూమికి, రాజగిరికి చెందిన మగధ రాజ్యానికీ మధ్య తగాదా అని.

రాజగిరి రాజ్యం కంసవధతో వ్యాకులపాటుకు గురై ఉలిక్కిపడివుంటుంది. కృష్ణుడు తొలియుద్ధంలోనే పశ్చిమ శక్తుల్ని చావుదెబ్బ తీశాడు. కానీ ఇప్పుడు మరింతగా శక్తిని కూడదీయవలసి రావటమేగాక పెంచవలసి వచ్చింది. ఇది ఆరంభం మాత్రమే. ఆరంభం సజావుగానే సాగింది. ప్రపంచం అంతటికీ తెలిసిపోయింది. అయితే కృష్ణుడు తెలివి తక్కువవాడేమీ కాదు. అతడు ప్రారంభ యుద్ధాన్ని అంతిమ యుద్ధంగా ఎందుకు మార్పు చేస్తాడు. అతని వద్ద కంసుని మామను జయించే శక్తి లేదు. కంసుని మామ భారతదేశమందలి తన సర్వ శక్తితోను పోరుకు సిద్ధమయ్యాడు. యుద్ధం చేసేట్లుగా ప్రపంచానికి ఢంకామ్రోతలు వినిపించి కృష్ణుడు పారిపోయాడు. పారిపోవటం కూడ చాలా దూరం వరకు ...ద్వారక వరకు. అప్పటి నుండి అతని పేరు రణఛోడ్ దాస్ అయ్యింది. (దానర్థం యుద్ధభూమి నుండి పారిపోయేవాడు). గుజరాత్‌లో ఇప్పటికీ ఆ పేరుగలవాళ్ళు వేలాదిగా వుంటారు- బహుశా లక్షమందికి పైగానే రణ్‌ఛోడ్‌దాస్ పేరు గల వాళ్ళుంటారు. మొదట్లో ఆ పేరు విని నవ్వేవాణ్ణి; అయితే చిరునవ్వును మాత్రం నేనెన్నడూ వీడలేదు. ఇలా భారతదేశంలో మరెందరో దేవుళ్ళున్నారు పారిపోయి పరాక్రమం చూపినవాళ్ళు. అటువంటి వాళ్ళల్లో జ్ఞానసరోవరం శివుడొకడు. ఇది

పురాతన దేశం. పోరాడుతూ, పోరాడుతూ అలసిపోయిన ఎముకల ప్రోవుల్ని పారద్రోలే అవకాశం రావాలి. అయితే కృష్ణుడు పారిపోయింది ఎముకలు కుళ్ళినందువల్ల కాదు; యవ్వనాన్ని ప్రోదిచేసే ఎముకల కారణంగా. ఇప్పుడు ఎముకల్ని పటిష్ఠపరచవలసిన, విస్తరింప చేయవలసిన అవకాశం కావాలి. కృష్ణుని తొలి యుద్ధమే రాత్రిపూట దొంగతనంగా చేసే యుద్ధం వంటిది– యుద్ధం చేయటం, పారిపోవటం. చింతించదగిన విషయమేమిటంటే కొందరు భక్తులు పారిపోవటంలోనే మజాను అనుభవిస్తారు.

ద్వారక, మధురల మధ్య సూటిగా దూరం దాదాపు 700 మైళ్ళు. ఆధునికంగా రోడ్లను కొలిచినట్లు కొలిస్తే దాదాపు 1050 మైళ్ళు వుంటుంది. తేడా ఈ విధంగా దాదాపుగా 350 మైళ్ళు. కృష్ణుడు తన శత్రువునుండి చాలా దూరం పారిపోయాడు. పనిలోపనిగా తూర్పుపడమరల ఐక్యత సాధించేందుకు అతను పశ్చిమ కొసనగల ప్రవేశద్వారాన్ని ఆక్రమించాడు. తరువాత పంచపాండవుల వనవాస సమయంలో అర్జునుడితో చిత్రాంగద వివాహము, భీమునితో హిడింబి వివాహముతో జతచేసేందుకు అతడు తూర్పునగల చివరి ప్రవేశ ద్వారాన్ని కూడ స్వాధీన పరచుకొన్నాడు. ఈ దూరాలను కొలిచేందుకు మధుర నుండి అయోధ్య, అయోధ్య నుండి రాజ్‌మహల్, రాజ్‌మహల్ నుండి ఇంఫాల్ మధ్య దూరం ఎంతో తెలియాల్సిన అవసరం వుంది. అప్పటి రాజమార్గం యిదే అయ్యుంటుంది. మధుర నుండి అయోధ్య వరకు మధ్యదూరం దాదాపు 300 మైళ్ళు. అయోధ్య నుండి రాజ్‌మహల్ దాదాపు 470 మైళ్ళు. రాజ్‌మహల్ నుండి ఇంఫాల్ దాదాపు 525 మైళ్ళుండవచ్చు. అలా ఇప్పటి రోడ్డుమార్గాల కొలతల ప్రకారం దూరం 850 మైళ్ళు కాగా, తిన్నగా దూరం 380 మైళ్ళు. ఈ విధంగా మధుర నుండి ఇంఫాల్‌కు మధ్యదూరం అప్పటి రాజమార్గం ద్వారా 1600 మైళ్ళు ఉండి వుండవచ్చు. కురురాజ్యపు కేంద్రం మీదికి దాడి వెడలటం, దానిని వశపరుచుకోవటం, దానిని శక్తిమంతం గావించటం కోసం తొలిగా కృష్ణుడు 800 మైళ్ళు పారిపోయి తన సహచరుల్ని, శిష్యుల్ని దాదాపు 1600 మైళ్ళు తిప్పినారు. ఆ విధంగా తూర్పు పడమరల సంపూర్ణ భారతయాత్ర పూర్తయ్యింది. ఆనాటి భారత రాజనీతిని తెలుసుకునేందుకు దూరాలకు సంబంధించిన మరికొంత సమాచారం తప్పని సరిగా కావాలి. మధుర నుండి వారణాసి మధ్య

దూరం దాదాపు 370 మైళ్ళు. మధుర నుండి పాట్నా 500 మైళ్ళు. అప్పటి ఇంద్రప్రస్థ అయిన ఢిల్లీ నుండి మధుర మధ్య దూరం దాదాపు 90 మైళ్ళు. పాట్నా నుండి కలకత్తా దాదాపు 325 మైళ్ళు. కలకత్తా మధ్యగల దూరం ఎంత అనేదానిలో విశేషమేమీ లేదు. అయితే కలకత్తా కూడా కొంతకాలం హిందూదేశానికి రాజధాని–కాకుంటే పరాధీన హిందూస్తాన్‌కు అనవచ్చు. మగధ రాజ్యపు పునర్జన్మ ఒక అర్థంలో కలకత్తాలో జరిగిందని చెప్పవచ్చు. ఏ విధంగా అయితే కృష్ణుని కాలంలో మగధరాజ్యానికి రాజగిరి ముఖ్యపట్టణంగా వున్నదో అదే విధంగా చారిత్రక మగధరాజ్యానికి పాట్నా లేదా పాటలీపుత్రం రాజధాని. ఈ రెండింటి మధ్య దూరం దాదాపు 40 మైళ్ళు– పాట్నా–రాజగిరి కేంద్రాల పునర్జన్మ కలకత్తాలో జరిగితే, దీని అధ్యయనాన్ని చరిత్ర అధ్యయనం చేసే విద్యార్థులు, ఆ సమయంలో సాంత్వనాపూర్ణ వివేచనతో అధ్యయనం చేయాల్సివుంటుంది. ఇదంతా విదేశీ తాత్విక చింతనతో ఎందుకు జరిగిందీ అని.

కృష్ణుడు మగధరాజ్యాన్ని నాశనం చేసి కురురాజ్యాన్ని ఎందుకు స్థాపించదలచాడు? దానికి సమాధానం ఒకటి సుస్పష్టమే. భారతీయుల్లో చైతన్యం అప్పుడు అధికంగా ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో ఉండేది. ఈ ప్రాంతాలు రాజగిరి, పాట్నాల నుండి చాలా దూరం. అదీగాక మగధరాజ్యం కొంత పాతబడిపోయింది. శక్తిసామర్థ్యాలు కలదేగాని దాని విస్తరణ విరివిగా లేదు. కురురాజ్యం కొత్తది. పైగా కృష్ణుడు దీని శక్తిసామర్థ్యాలు, విస్తరణకు మూలకారకుడైన నిర్మాత. మగధరాజ్యాన్ని తిరుగులేని విధంగా తాను స్వాధీన పరచుకోవాలని చూస్తున్నాడు. దానిని తిరిగి తనకు నచ్చిన రీతిలో మలచుకొనవచ్చును, విస్తరింపచేసుకొనవచ్చును అనుకుంటున్నాడు. కృష్ణుడు త్రికాలజ్ఞుడు. అతను గ్రహించి ఉండవచ్చు– ఉత్తర పశ్చిమ దిశలలో ముందుకుసాగి యునానులు, హూణులు, పఠానులు, మొగలులు మున్నగువారి ఆక్రమణలు జరుగుతాయి అని. అందువల్ల భారతదేశానికి ఐక్యతతో కీలకంగా నిలిచే కేంద్ర నిర్మాణం జరగాల్సి వుంది; దాని ద్వారానే ఆ శక్తుల్ని అరికట్టగలిగేది అని భావించాడు. అయితే ఆ త్రికాలదర్శి విదేశీ ఆక్రమణలకు పూర్వమే మగధను మార్చివేయాలని తలంచలేదా? అలా వేలాది సంవత్సరాలుగా భారతదేశంపై తన అధికారాన్ని స్థిరపరచుకొని ఆక్రమణ సమయం వరకు కృష్ణుని ప్రాంతానికి దగ్గరలోని అంటే కనౌజ్, ఉజ్జయినిల వరకు అలా జారుకొని వుండవచ్చు–

శక్తిహీనంగా. త్రికాలదర్శికి ఇదంతా ఇలా అవుతుందని తెలిసివుండవచ్చు; అయితే ఏదో ఒకటి చేసి ఉండాల్సింది కదా... అయితే ఆయన శాశ్వతంగా తన దేశవాసుల్ని ఎటువంటి జ్ఞానుల్ని, సాధువుల్ని చేయదలిచాడు? తన పని మాత్రం కేవలం మార్గదర్శనం గావించటం. మార్గంలో కూడ బహుశా ఇబ్బందులు ఎదురుకావచ్చు. త్రికాలదర్శి అయినవానికి తనమార్గంలో పయనించేది జ్ఞానులు మాత్రమే కాదు అజ్ఞానులు కూడ అని గమనించాల్సి వుంది. వాళ్ళెంతగా నష్టపోతారో తెలుసుకోవాలి. రాముని మార్గంలో పయనించే అజ్ఞానులు కూడ పెద్దగా కోల్పోయేదేమీ వుండదు; అయితే సాధించేది కూడ స్వల్పమే. అజ్ఞానులు కురు పాంచాల సంధిని ఏం చేశారు?

కురురాజ్యానికి పునాదిరాయి కురు-పాంచాల సంధి. ఈ రెండు రాజ్యాల చుట్టుపక్కల వజ్రసమానమైన కట్టుదిట్టంగా ఐక్యత సాధించేందుకు కృష్ణుడు అటువంటి లీలలను ప్రయోగించాడు. అందువలన పాంచాలి వివాహం ఐదుగురు పాండవులతో జరిగింది. ఈ పాంచాలి కూడ ఒక అద్భుతమైన స్త్రీ. ద్రౌపదిని మించిన తీక్షణత్వం, జ్ఞానముగల వనిత వేరొకరు లేరు. కౌరవసభలో ఏ విధంగా సమాధానం చెప్పేందుకు సవాలు విసురుతుందనీ ... ఏ వ్యక్తి అయితే తనకు తాను సర్వస్వం కోల్పోయి ఓటమి పాలయ్యాడో అటువంటి వ్యక్తికి ఇతరులను పందెం కాసే స్వతంత్ర అధికారం ఉంటుందా?

అర్జునునితో సహా పంచపాండవులు ఆమె ఎదుట సారహీనులు. ఈ ద్రౌపది ఒక్కతే కృష్ణునకు తగినది. మహాభారతంలో నాయకుడు కృష్ణుడు; నాయకి ద్రౌపది. ఈ ద్రౌపదీ కృష్ణుల సంబంధం కూడ విశ్వసాహిత్యంలో నిరుపమానం. ఇరువురు స్నేహంగా ఎలా ఉండగలిగారు? అలా కాకుండా వారిరువురిలో ఎవరైనా ఒకరు ఎన్నడైనా ఉండదలిచారా? ఈ బంధం పూర్వజన్మ బంధమా లేక కురురాజ్య స్థాపన, దాని నిర్మాణానికి సంబంధించినదా? ఏది ఏమయినప్పటికీ ద్రౌపదికృష్ణుల ఈ సంబంధం రాధాకృష్ణుల బాంధవ్యం కంటే తక్కువదేమీ కాదు. కాని సాహిత్యకారుల, భక్తుల దృష్టి ఈ వైపుకు అంతగా ప్రసరించలేదు. భారతదేశపు తూర్పు-పశ్చిమ ఐక్యతా నిర్మాత తాను నేర్చినంతలో కేవలం కర్మకు, (కర్మఫలానికికాదు) బాధ్యత వహించవలసి వచ్చింది. అందుకు కారణం ఒకవేళ అది విభ్రాంతికర కర్మఫలం కొరకు జరిగివుంటుందనుకొంటే యింతటి అసంభవపు నిర్మాత కాజాలడు. అతనికి

ఇతరుల ఇంద్రప్రస్థమో, హస్తినాపురమో తగినవిగా కన్పించాయి. అదే విధంగా ద్రౌపదిని స్నేహితురాలిగా భావించాడు. అయితే లౌకికులు చెప్పే ప్రకారం అలా లేదు. ఎవరికి తెలుసు ద్రౌపదికి యిది సహజమేనని ఈ విషయంలో ఆమె హృదయానికి బాధ కలుగుతుందని.

ద్రౌపది (కృష్ణా) తనపేరుకు తగినట్లుగానే నల్లనిది. గొప్ప అందగత్తె అయ్యుంటుంది. ఆమె బుద్ధి తీక్షణత తన ఆశ్చర్యజనిత మృగనయనాలతో ప్రకాశిస్తూ వుండివుండాల్సింది. ఎరుపు కాకుండా అందమైన నల్లని రూపు, నఖశిఖ పర్యంతం శరీరం అంగ సౌష్టవంతో అలరారుతుంది. రాధ ఎర్రగా వుండివుంటుంది. బాలునిగా, యువకునిగా ఉన్నప్పుడు కృష్ణునికి, రాధకుమధ్య ఘనిష్టత అధికంగా వుండివుండవచ్చు. ప్రౌఢవయస్కుడైన కృష్ణుని మనస్సులో ద్రౌపది ఆలోచనలు వ్యాపించాయేమో. అసలు రాధాకృష్ణులు ఒకటేనైతిరి. కృష్ణుని సంతతి మాత్రం ఎంతకాలమని అతని పొరపాటును మాటిమాటికి చెప్పుకుంటూ పోతారు? అర్థం పర్థంలేని మాటల్లో యవ్వనంలో ఎర్రనామెతో గిల్లికజ్జాలు పెట్టుకోవటం; వయస్సు మళ్ళిన తరువాత శ్యామవైపు మొగ్గు చూపటం. కృష్ణుడు, ద్రౌపది విషయంలో ఏదయినా వున్నా లేకపోయినా భారతీయ పురుషులు శ్యామను బేరీజు వేయటంలో ఎరుపు పట్ల తమ పక్షపాతవైఖరిని పరిశీలించుకోవలసి వుంది.

రామాయణ నాయిక రంగు ఎరుపు. మహాభారత నాయిక నల్లనిది. ఎవరు ఎంత ఎరుపయినా నలుపే అధికంగా సజీవం. ఏది ఏమయినప్పటికి ఈ కృష్ణుని, ద్రౌపది అజ్ఞానపు కరములు పునర్జన్మను పొందాయి. అందులో కర్మఫలంగాని, దాని తాలూకు త్యాగంగాని లేనేలేవు. ద్రౌపది పాంచాల రాజ్యానికి అంటే కలగలిసిన కనౌజ్ రాజ్యానికి చెందినది. ఆ రాజ్యపు ముఖ్యపట్టణమైన ఇంద్రప్రస్థకు చెందిన అనాగరికరాజు పృధ్వీరాజు తన పూర్వజుడు కృష్ణుని దారిలో నడవలేకపోయాడు. ఏ పాంచాలి ద్రౌపది కోసం కురురాజ్యపు పునాదులు వేయబడినాయో– అదే కలగలిసిన పాంచాల రాజ్యం కోసం ఢిల్లీ–కనౌజ్‌ల మధ్య స్పర్థ విదేశీయుల ఆక్రమణకు దారితీసింది. అప్పుడప్పుడు ఏమనిపిస్తుందంటే అది వ్యక్తిగతం కాదు, అది చారిత్రక పునర్జన్మ అని– అప్పుడప్పుడు అది చప్పగ, కొన్ని పర్యాయాలు ప్రేమమయంగా. ద్రౌపది ఎక్కడ? సంయుక్త ఎక్కడ? కృష్ణుడు ఎక్కడ? పృధ్వీరాజెక్కడ? ఇదంతా

వాస్తవమే ... నిస్సారమైనది, సారవంతమైనదీ అయినటువంటి పునర్జన్మలే. అయినా అవి పునర్జన్మలే కదా.

కృష్ణునికి పునర్జన్మ విషయంలో మరికొన్ని రహస్యాలు ఉండివుండవచ్చు. రాముడు ఆదర్శవాది; ఏకరూప ఐక్యత నిర్మాత, దాని ప్రతీక కూడ. అదే విధంగా జరాసంధుడు భౌతికవాది, ఐక్యతను సాధించినవాడు. ప్రస్తుతం కొందరు కృష్ణుని, జరాసంధుని మధ్య యుద్ధం ఆదర్శవాదానికి, భౌతికవాదానికి మధ్య యుద్ధమని భావిస్తారు. వాళ్ళ నిశిత పరిశీలన సమంజసంగానే వుంది. అయితే అది పరిపూర్ణమైన ఆలోచన కాదు. జరాసంధుడు భౌతికవాది. ఏకరూప ఏకత్వాన్ని కోరుకున్నవాడు. తరువాత మగధకు చెందిన మౌర్యుల, గుప్తుల రాజ్యాలలో కొంతమేరకు ఈ విధమైన భౌతికవాదపు ఏకరీతి ఏకత్వపు ప్రాదుర్భావం జరిగింది; అదేవిధంగా బౌద్ధం కూడ ఆవిర్భవించింది. కృష్ణుడు ఆదర్శవాదపు బహురూప ఐక్యత నిర్మాత. నాకు తెలిసిన మేరకు ఇప్పటి వరకు భారతదేశపు నిర్మాణం భౌతికవాద బహురూప ఏకత్వ ఆధారంగా ఎన్నడూ జరగలేదు. చిరకాలపు చమత్కారం వెల్లడయ్యే దెన్నడంటే ఆదర్శవాదం, భౌతికవాదం చెట్టాపట్టాలేసుకున్నట్లుగ కలసిమెలసి బహురూప ఐక్యత ఆధారంగా భారతదేశ నిర్మాణం జరిగినప్పుడే. ఇప్పటి వరకు కృష్ణుని ప్రయత్నమే అన్నింటికీ మించి ఆమోదయోగ్యమైనదిగా తడుతున్నది. పోనీ అది రాముని నుండి అరువు తెచ్చుకొన్న ఏకరూపఐక్యత అనుకున్నా సరే. కృష్ణుని బహురూపకత్వంలో ఇతరులలో లేని త్రికాల జీవనం కన్పిస్తుంది.

కృష్ణుడు యదువంశ శిరోమణి. ఆయన క్షత్రియరాజు కాకపోవటం మాత్రమే కాదు; బహుశా ఆయన ఎంతగా యాదవుడో అంతగా క్షత్రియుడు కాదు. అందువల్లనే యదువనిత విషయంలో మొండితనం కన్పిస్తుంది. క్షత్రియ వనిత ద్రౌపది దానిని తొలగించలేకపోయింది. విశ్వవిరాటుడు, త్రికాలజ్ఞుడు అయిన కృష్ణుడు బహురూపి. రాముడు, జరాసంధుడు ఏకరూపానికి చెందినవారు. ఆదర్శవాదం, ఏకరూపత్వాలలో కేంద్రీకరణ, క్రూరత్వం కొంచెం తక్కువగా వున్నా సరే ఎంతో కొంత ఇరువురిలో కేంద్రీకరణ ఛాయలు కన్పిస్తాయి. మౌర్యుల, గుప్తుల రాజ్యాలలో ఎంతటి కేంద్రీకరణో బహుశా క్రూరత్వం కూడ అంతే వుండేది.

పాపం కృష్ణుడు ఎంత నిస్వార్థంగా కృషి చేసినా ప్రజల మనసుల్లో మాత్రం

రాముడే ముందంజలో ఉన్నాడు. కేవలం బెంగాలులో మాత్రమే జనం "బోల్ హరి, హరి బోల్" అంటూ హరినామస్మరణ చేస్తూ చనిపోయిన వ్యక్తి అంతిమ యాత్ర నిర్వహిస్తారు. కొంత దక్షిణభాగాన్ని మినహాయిస్తే భారతదేశమంతటా హిందువులు "రామ్ నామ్ సత్య హై" శవయాత్రను సాగిస్తారు. బెంగాల్‌లో అంతగా లేదుగాని ఒరిస్సా, అస్సాంలలో కృష్ణుని స్థానం పదిలమే. అయితే రాముడు, కృష్ణుని విషయంలో అధికులెవ్వరని తేల్చి చెప్పటం కష్టం. అన్నింటికీ మించి ఆశ్చర్యాన్ని కలిగించే అంశమేమిటంటే వ్రజభూమి నలుదిక్కులా జనం ఒకరినొకరు "జై రామ్ జీ" అంటూ నమస్కరించుకొంటారు. దారినపోయే ముక్కూ ముఖం తెలియని వాళ్ళు సైతం ఒకరినొకరు "జైరామ్‌జీ" చెప్పుకోవటంలో ఎంతో మాధుర్యం లభిస్తుంది. బహుశా యిదీ ఒక కారణమై ఉండవచ్చు.

మాధుర్యంతో మిసమిసలాడే శాంతము, సంస్కృతులకు ఆలవాలమైన త్రేతాయుగపు దేముడు రాముడు. పరిపక్వత నొంది, జటిలమై, తీక్షణంగాను, సునిశితంగాను కన్పించే మానసిక యుగానికి చెందిన దేవుడు కృష్ణుడు.

రామునికి గమ్యం ఉంది. కృష్ణుడు అగమ్యుడు. కృష్ణుడు ఎంత అధికంగా శ్రమించాడంటే అతని వంశీయులు అతణ్ణి తమ అంతిమ ఆదర్శంగా నిలుపుకునేందుకు గడగడలాడేంతగా. ఒకవేళ నిలుపుకున్నా అది మిత్రభేదాన్ని పాటించినట్లో, కూటనీతిని అనుకరించినట్లో ఉంటుంది. అతని అలసట నెరుగని సీదాతనం వాళ్ళు పుణికిపుచ్చుకోవటం అసాధ్యం. అందువల్లనే కృష్ణుడు భారతదేశంలో కర్మకు సంబంధించిన దేముడు కాలేకపోయాడు. కృష్ణుడు రాముని మించి కర్మను ఆచరించి వుండవచ్చు. ఎన్నెన్ని సంధి, విగ్రహకార్యాలు, ప్రాంతాల మధ్య సంబంధాలకు చెందిన వ్యవహారాలను అతను మార్చవలసి వచ్చిందో. అది ఎంతో శ్రమించి చేయవలసిన పనేగాక పరాక్రమంతో కూడుకున్నది. ఇప్పుడు కూడ అనేక ప్రాంతాల్లో కృష్ణనీతి అమలులో వుండాలా అనేది అతనికి సంబంధించిన అంశం. కృష్ణుడు ఏ ప్రాక్ పశ్చిమ ఐక్యతను ప్రసాదించాడో దానితోపాటు దాని ఔచిత్యం కూడ సమసిపోయింది. మిగిలిందల్లా ఆయన మనస్సు. ఆయన మాటలు. అలాగే రాముని కర్మ కూడ బతికిబట్ట కట్టింది. ఇప్పటి వరకు హిందూదేశవాసులు ఈ రెండింటి సమన్వయాన్ని సాధించలేకపోయారు. ఒకవేళ అలా జరిగితే రాముని

కర్మలో కూడ మార్పువస్తుంది. రాముడు హద్దులెరుగనంతటి దుఃఖితుడు. కృష్ణుడెన్నడూ రోదించడు. కనురెప్పలు టపటపలాడిస్తాడు కొన్నిసార్లు; అయితే అది తన సఖులనో, స్త్రీలనో మాయచేసే ప్రయత్నంలో.

ఆ కృష్ణుని మనస్సు, మాటలు ఎటువంటివి? ఇప్పటికి కూడ అప్పటి గోపికలు లేదా ఎవరు కావాలనుకొంటే వాళ్ళు ఆయన పలుకులు, మురళీగానం విని రస తన్మయులౌతారు. తమ శరీరాలకు ఆవల గెంతుతారు. దానితోపాటు కర్మానుసార త్యాగం, సుఖ దుఃఖాలు, శీతలఉష్ణాలు, జయాపజయాలు వీటన్నింటి విలీనాలు సమస్త భూతాలలో ఒక విరామమెరుగని అవ్యయభావాన్ని మధురంగా అనుభవించినట్లు వినగల్గటం అనుభూతించగలరు. ప్రపంచంలో ఒక్కడే కృష్ణుడు; అతడే దర్శనాన్ని గానంగా మార్చినవాడు.

మాటలదేవి ద్రౌపదితో కృష్ణుని సంబంధం ఎటువంటిది? అది సఖీసఖుల సంబంధమా? అది అందులో అంతిమ మెట్టువరకు చేరిందా లేక అది పరిమితుల్లేని మైదానమా? అటు పిమ్మట మెట్ల విషయంలోగాని, మైదానం విషయంలోగాని అవసరం పడనేపడదా? కృష్ణుడు ఖచ్చితంగా మోసగాడే. అయితే అతడు ద్రౌపదిని ఎన్నడూ మోసం చేసింది లేదు. అందువల్లనే బహుశా మాటకు కట్టుబడివున్నట్లే. ఎన్నడయినా అతడు ద్రౌపదికి తలంపుకు వస్తే ఎదురుగా నిలిచేవాడు. స్త్రీ పురుషుల మధ్య చిగురుటాకువంటి మైత్రి విషయంలో నేటి శాస్త్రవేత్తలు "అణచివేసిన రసికత" అంటున్నారు. ఈ విధమైన అడ్డంకి సామాజికం లేదా మనస్సు యొక్క ఆంతరిక కారణాల వలన ఉత్పన్నం కావచ్చు. పాండవులు ఐదుగురు కృష్ణుని సోదరులు;.ద్రౌపది కురు, పాంచాల ఐక్యతకు మూలస్తంభం. అడ్డంకికి సంబంధించిన కారణాలన్నీ సమకూరాయి. అయినా కృష్ణునకు ఎన్నడూ తన చిత్త ప్రవృత్తికి సంబంధించిన పనులను నిలువరించవలసిన అవసరం ఏర్పడి ఉండకపోవచ్చు. అది అతనికి సహజము. కడపటిది అంటే రాధతో సంబంధమంతగా. పైగా రసమయం కూడా. ఇదేగనుక ఒకవేళ నిజమైతే కృష్ణుడు, ద్రౌపది మధ్య గల సఖ, సఖి సంబంధం విశ్వ విదితం కావలసిందే. వివరాల ప్రకారం దానివల్ల సరికొత్త స్త్రీ, పురుష సంబంధపు ఒక కొత్త గది ఏర్పడాల్సి ఉంది. ఒకవేళ రాధ దీప్తి విలక్షణంగా కృష్ణుని వదలకుండా వుండివుంటే కృష్ణుడనే మేఘం దాని మీద కమ్ముకుంటూనే ఉంటుంది. ఒకవేళ రాధ

దీప్తి విలక్షణమైతే కృష్ణుని మేఘమూ విలక్షణమే. దీప్తిది తుష్టి ప్రధానరసం కాగా మేఘంలో ఉత్కృష్ట ప్రధానమైన కర్తవ్యం ఉంటుంది.

రాధకు సంబంధించిన రసం నిస్సందేహంగా విలక్షణమైనదే. రాధాకృష్ణులు ఒక్కరే. రాధ కృష్ణుని స్త్రీ రూపం; కృష్ణుడు రాధ పురుష రూపం. భారతీయ సాహిత్యంలో రాధ ప్రసక్తి అత్యంత పురాతనం కాదు;. ఎందువల్లనంటే అందరికంటే ముందుగా పురాణాలలో వచ్చేది 'అనూరాధ' పాత్ర. పేరే తెలియజేస్తున్నది ప్రేమ, భక్తి, కలగలిసిన ఆ స్వరూపాన్ని– ఆత్మ నిబద్ధత కలదిగా, కేవలం శారీరక బంధనంతో సరిపుచ్చుకునేది కాదని. ఆధునిక కాలంలో కూడ అటువంటి ఆత్మ నిర్భరతను పొందే ప్రయత్నం చేసింది. మీరా చాలా దూరం ఆ దిశగా ప్రయాణించింది– బహుశా ఎంతదూరం వెళ్ళిందంటే సజీవంగా వున్న ఏ దేహం కూడ గుర్తు తెచ్చుకునేందుకు అంతు చిక్కించుకోలేనంత దూరం. అయినప్పటికీ మీరా ఆత్మ నిమగ్నతలో కొంత వేడిమి కన్పిస్తుంది. కృష్ణుని మండింపజేయగల వాళ్ళెవ్వరు? అసలెవ్వరూ మండింపజాలరు? అయితే మీరా పక్కన కూర్చున్నప్పుడు మాత్రం అతనికి కొంత చెమటలు పట్టక తప్పదు. కనీసం సెగ తగులుతుంది కదా. రాధ వేడి పుట్టించేదీ కాదు, అట్లా అని చల్లగా గడ్డకట్టుకు పోయేదీ కాదు. రాధ పూర్ణరూపము. మరో అర్థంలో మీరా కథ సాటిలేనిది. పద్మిని మీరాకు పూర్వీకురాలు. ఇరువురూ చిత్తౌడ్ రాజ్యానికి చెందిన నాయికలే. వారిద్దరి మధ్య దాదాపు రెండు వందలయాభై సంవత్సరాల ఎడం వుంది. ఇరువురిలో ఎవరు పెద్ద – పతి చితిలో దూకి ప్రాణత్యాగం గావించిన పద్మినియా లేక కృష్ణుని కోసం తాను నాట్యం చేయటాన్ని ఎవ్వరూ నిలువరించజాలని మీరానా? పురాతన దేశపు ప్రతిభ యిదే. ఈ హిందూదేశం అనాదిగా ఎంతో కాలాన్ని చూస్తున్నది. పద్మిని అలసి సొలసి వేలాది సంవత్సరాలలో మీరాగా మారిపోగలదా? లేదా మీరానే పద్మిని శ్రేష్ఠ స్వరూపమా? లేకుంటే ప్రతాపుడు ఎప్పుడు వస్తే అప్పుడు తిరిగి మీరా పద్మినిగా మారిపోతున్నదా? ఓ త్రికాలజ్ఞ కృష్ణుడా! నువ్వు ఒక్క వ్యక్తిలోనే మీరాను, పద్మినిని చూపెట్టలేవా?

రాధ రసం తాలూకు పూర్తి మజా దొరికేది వ్రజభూమి తాలూకు రాజసంలో మాత్రమే. నేను సరయూ, అయోధ్య ప్రాంతపు బిడ్డను. వ్రజరసంలో బహుశా

ఎన్నడూ దొర్లజాలను. రాధ పట్టణప్రాంతపు వర్షంలో ఒక రాత్రి గడిపి ఆ రాధారాణి పాటలు విన్నవాణ్ణి.

కృష్ణుడు మహా మోసగాడు. అప్పుడప్పుడు ద్రౌపది తోటమాలి భార్య రూపుదాల్చి రాధ వద్దకు పూలు అమ్మేందుకు చేరుకుంటాడు. ఒక్కొక్కసారి వైద్యునిగా వచ్చి రాధ, యిప్పుడు అత్తవారింటికి వెళ్ళేందుకు యోగ్యమైన సమయం కాదని ప్రకటిస్తాడు. అప్పుడప్పుడు ప్రియురాలు రాధను విందుకు ఆహ్వానించేందుకు పచ్చబొట్టు పొడిచేవాళ్ళ మాదిరిగా మారువేషం వేస్తాడు. అప్పుడప్పుడు బృంద చీరె కట్టుకుని వెళ్ళేవాడు; రాధ చిటచిటలాడి మూతి ముడిస్తే బహుశా ఘల్లుఘల్లుమని ధ్వని చేయటం ద్వారానో, బాధ పడినట్లుగా నటించటం వల్లనో మురారి శ్రీకృష్ణునకు మాత్రమే ఉగ్గుపాలు గుర్తుకు వచ్చినంత పనవుతుంది. అప్పుడు రాధారాణికి ఎదురుగా కూర్చొని వివరిస్తాడు తన కళ్ళు, బృంద కళ్ళు కలుసుకోలేదని.

నాకు అర్థమైన మేరకు స్త్రీ ఎక్కడయినా పురుషునితో సమానమయ్యిందా అంటే అది కేవలం వ్రజభూమిలోనే. అదీ కృష్ణుని వద్దనే. బహుశా అందువల్లనే యిప్పటికీ భారతీయ స్త్రీలు బృందావనంలో, యమునాతీరాన ఒక చెట్టుకు ఎన్నెన్ని రుమాళ్ళు కట్టే ప్రయత్నం చేస్తారో. అసలు తన చీరెలు దొంగిలించాలని ఏ స్త్రీ కోరుకోదు? అందుకు కారణం ఏమంటే దుష్టుల మూలంగా వస్త్రాపహరణం జరిగిన సందర్భంగా కృష్ణుడు మాత్రమే దానిని సరిదిద్దగలడు. ఆ చెట్టుకు రుమాళ్ళు కట్టే స్త్రీలకు ఈ ఉదంతం చెబితే సిగ్గుపడతారు; అయితే వాళ్ళు కోరుకునే పుత్రులు, పుణ్యం వెనుక సుషుప్తి ఎందుకు గుర్తుకు వస్తుంది?

వ్రజభూమికి చెందిన మురళి జనాన్ని యింతగా విహ్వాలులను చేయటమేమిటి? దానివల్ల వాళ్ళంతా కురుక్షేత్రపు కృష్ణుణ్ణి మరచి పోవటమేమిటి? తిరిగి నాకేమని అన్పిస్తుందంటే అయోధ్యారాముడు మణిపూర్ నుండి ద్వారక చేరిన కృష్ణుని మరచిపోయేట్లు చేయనివ్వడు. ఎక్కడైతే నేను చీరె కట్టటాన్ని అభినయించటం చూచానో దాని క్రిందనే బృందావనం నుండి పారే మురికినీటి కాలువనూ చూచాను. అది యమునలో కలుస్తుంది;. ఆ రంగుల మయమైన వర్షపు నీటిలో రాధ బ్రతుకు జీవుడా అంటూ అడుగులో వేసుకుంటూ వెళ్ళాల్సి వుంటుంది. ఇది ఆ రంగులమయమైన వీధే. అక్కడి నుండి స్త్రీలు ప్రతి హోలీవేళ వర్షం కురుస్తున్నట్లు,

నీళ్ళు చిమ్ముకుంటూ లాఠీలతో బయటకు వస్తే నందగావ్‌కు చెందిన ప్రతి పురుషుడు ఢాలు పట్టుకొని రక్షణకు దిగుతాడు.

రాధారాణి కనుక ఇటువైపు వస్తే ఈ కాలువలు, ఈ మురికి అంతా లేకుండా చేస్తుంది. వర్షం కురిపించే ఆ స్త్రీల చేతుల్లో అత్తరు, గులాం, ఇంకా కొంచెంగా తడిపితే సువాసన వెదజల్లే వాటితోపాటు పిచికారీ నుంచి, నందగాం పురుషుల్ని హెూలీ ఆడేందుకు ఆహ్వానిస్తుంది. ప్రజల్లో సుగంధం యింకేం మిగలలేదు; పొదరిళ్ళు లేవు; కేవలం మిగిలింది ఏనుగులే. శీతలపవనాల్లేవు. వర్షించేప్పుడు నేను రాధారాణి గొల్లవాండ్ల కోసం తెగ వెతికాను. అంతా కలిసి ఐదు పదిండ్లున్నాయి. అక్కడ వైశ్య, బ్రాహ్మణ స్త్రీల సముదాయం ఉంది. ఎప్పుడో ఏదయినా జాతికి చెందిన గొప్ప పురుషుడో, స్త్రీయో ఉద్ధరిస్తే అది తీర్థయాత్రా స్థలం అయ్యింది; చూస్తూ చూస్తూనే దేవళాలు, దుకాణాలు వచ్చేశాయి. అప్పుడు ఈ బ్రాహ్మణ స్త్రీల ముఖాలు వాడిపోయే వున్నాయి; పేదరికంతో, రోగాలతో కృశించిపోతున్నాయి. కొందరు నన్ను మూర్ఖంగా బ్రాహ్మణవైరిగా భావించసాగారు. నేనసలు బ్రాహ్మణ మిత్రుణ్ణి. అందువలన చూస్తున్నా రాధారాణి గోపికల్ని, పడవ సరంగుల్ని తొలగించి ఈ బ్రాహ్మణ స్త్రీలు కూడ అసలైన కాంతిని పోగొట్టుకున్నారేమో. వ్రజభూమిలో పుష్పాల సుగంధాన్ని రంగరించండి. హిందూదేశానికి కృష్ణుని బహుముఖీన ఐక్యతను అందించండి. రాముని తరహా ద్విజ, శూద్ర విభజనను నిర్మూలించండి. అయితే రాముడు ఏర్పరచిన హద్దుల బాటలోనే నడవండి– సత్యము, నియమపాలన కొనసాగిస్తూ.

సరయూ గంగానదులు రెండూ కర్తవ్యాన్ని గుర్తెరిగినవే. కర్తవ్యం ఎన్నడైనా కఠోరమై అన్యాయంగా మారవచ్చు; నష్టం వాటిల్లేట్లు చేయవచ్చు. యమున,చంబల్ కాకుండా యమున వైపుకు ప్రవహించే నదులలో యితర రసప్రవాహములేవో చెప్పండి? రసంలో కలుపుకోవటం ఉంటుంది; కలహాన్ని పారద్రోలటం ఉంటుంది. అయితే అందులో సోమరితనమూ ఉంటుంది;. అదే పరాజయం పాలైనప్పుడు మనిషిని దద్దమ్మను చేస్తుంది. రసభరితమై గర్వంతో విర్రవీగే యమునాతీరంలో కృష్ణుడు తన లీలల్ని ప్రదర్శించాడు. అయినా కురుభూమి కేంద్రాన్ని మాత్రం గంగ ఒడ్డునే నిర్మించాడు. తరువాత హిందూదేశపు కొన్ని రాజ్యాల్ని యమున ఒడ్డున

నిర్మించారు. ప్రస్తుతం ఒకటి అక్కడే నడుస్తూ ఉన్నది. యమునా! అసలు నువ్వెన్నడయినా మారతావా? చివరకు గంగలోనే కలుస్తావా? ఏమిటి, ఎన్నడయినా అసలు ఈ భూమిపై రసమయ కర్తవ్యం ఉదయిస్తుందా?

కృష్ణుడా! అసలు నువ్వున్నావో లేవో ఎవరికి తెలుసునయ్యా? నువ్వు రాధతో లీలల్ని కురులీలలతో ఎలా నిర్వహించావు? ప్రజలు అనుకునేదేమంటే యువకుడైన కృష్ణునికి ఆరితేరిన కృష్ణునితో సంబంధం లేదని. వాళ్ళు చెప్పేదేమంటే మహాభారతంలో కనీసం రాధ పేరు కూడ కన్పించదు. అయితే ఆ మాటలో అంత నిజం కన్పించదు. ఎందుకంటే కోపంలో శిశుపాలుడు కృష్ణుని గడచిపోయిన కాలపు మాటల్ని మామూలుగా పేర్లు లేకుండానే చెప్పేశాడు. ప్రజలు అప్పట్లో అంతగా పట్టించుకునే వాళ్ళు కాదు– తెలిసినవాళ్ళయినా, తెలియనివాళ్ళయినా. మహాభారతంలో రాధ చర్చ వచ్చేందుకు వీలేదీ? రాధ విషయం ఎక్కడ చర్చకు వస్తుందంటే ఎక్కడయితే ముల్లోకాల స్వామి తనకు దాసుడవుతాడో అక్కడ. రాసలీలల కృష్ణుడు, గీతలోని కృష్ణుడు ఒకరే! వేలాది సంవత్సరాలుగా యిప్పటివరకు త్రాసులోని సిబ్బెలు పైకి క్రిందికి ఎందుకు తారుమారవుతున్నాయో చెప్పవయ్యా కృష్ణుడా!

–1955 జులై– జన్ పత్రిక నుండి

# రాముడు – కృష్ణుడు – శివుడు

అనువాదం : **రావెల సాంబశివరావు**

ప్రపంచ దేశాలన్నింటిలోకీ పురాణాలకు భారతదేశానిదే పెద్ద పీట. పురాణాలు శతాబ్దాల తరబడి ప్రజల మనోభావాలపై ఎడతెగని పట్టును బిగించి ఉంచాయి. చరిత్రలో ప్రసిద్ధిగాంచిన బుద్ధుడు, అశోకుని వంటి వారి పేర్లు జనాభాలో నాల్గోవంతుకు మించి తెలియకపోవచ్చు. వాళ్ళ కృషి పదిమందిలో ఒకరికైనా అరకొరగానే తెలిసి ఉండవచ్చు. వాళ్ళ కృషిని, భావనల్ని వివరించగలిగేవాళ్ళు నూటికో, వేయికో ఒక్కరున్నా అది సంభ్రమాన్ని కలిగించే విషయమే! అయితే రాముని, కృష్ణుని, శివుని పేర్లు, దేశంలోని ప్రముఖమైన మూడు పురాణాల పేర్లు, ప్రతివాళ్ళకూ తెలుసు. వాళ్ళు ఏమేం చేసారన్నది దాదాపు అందరికీ తెలిసిన విషయమే లేదా కనీసం ఇద్దరిలో ఒకరికైనా తెలిసే ఉంటుంది. ఆ పురాణ పురుషుల లీలలు, భావనలు, ఎప్పుడు ఎవరు ఏ మాట మాట్లాడిందీ, ఏ ఎత్తు ఎత్తిందీ పదిమందిలో ఒకరైనా చెప్పగలరు. ఈ దేశ సాంస్కృతిక చరిత్ర విషయానికొస్తే ఆ గొప్ప గాథల్లోని నాయకులు అసలు జీవనాన్ని కొనసాగించిన వాళ్ళేనా! కాదా? అన్నది అప్రస్తుతమే అవుతుంది. భారతీయ ఆత్మకు సంబంధించిన చరిత్ర విషయంలో అయితే ఆ ఊసెత్తవలసిన పనే లేదు. భారతదేశ చారిత్రక స్ఫూర్తి విషయంలోనూ అంతే.

**పురాణ పురుషుల్ని చరిత్ర పుటల్లోకి దిగలాగే ప్రయత్నం**

రాముడు, కృష్ణుడు చారిత్రక పురుషులైతే అయివుండవచ్చు. శివుడు కూడ గంగానదికి కాలువ త్రవ్వించిన ఇంజనీరు అయివుండటమే గాక గొప్ప పశు వైద్యునిగా, ప్రేమికునిగా, పేర్కొనబడని దాతగా ఆ పద్ధతిలోనే మనం పేర్కొనవచ్చు. వాళ్ళను చరిత్ర పుటల్లోకి దిగలాగే ప్రయత్నం చేయటం హాస్యాస్పదమే! అయినా అదే జరిగింది. వాళ్ళ జీవన గాథలకు కొలబద్దలుగా మన వాస్తవీకరణల సాధారణ

ప్రామాణికాలు సరిపోవు. నిజాన్ని మించిన వాస్తవమేమంటే దాదాపు యాభై లేదా వంద శతాబ్దాలుగా ఆ పురాణగాథలు ప్రజల మానసాలపై తరతరాలుగా ముద్రించబడినాయి. ఆ గాథలు నిరంతరంగా అలా ఒకరినుండి ఒకరికి చెప్పబడుతూ వస్తూనే వున్నాయి. అలా తిరిగి చెప్పటంలో ఋషులు, కవులు వాటిని సంస్కరించేందుకు, మరింతగా హృదయాలకు హత్తుకోనేట్లుగా చెప్పేందుకు వాళ్ళ ప్రజ్ఞాపాటవాలతో ప్రయత్నించి ఉండవచ్చు. అంతకుమించి అసంఖ్యాకులలోని తట్టుకోజాలని తపన వల్ల వాళ్ళ వాళ్ళ ఆనందాలు, బాధలు ఆ చెప్పిన విషయాన్ని రూపాంతరం చెందించసాగాయి.

ఏ జాతి పౌరాణిక గాథలైనా ఆయా ప్రజల కలలను, కన్నీళ్ళను నిక్షిప్తం చేస్తాయి. సమున్నతమైన ఆకాంక్షలకు, స్మృతులకు, కామనలకు చెరగని ముద్రలుగా నిలుస్తాయి. జీవితానికి ప్రాణప్రదమై తప్పించుకోజాలని దుఃఖానికి ప్రతిబింబాలే. స్థానిక కాలానుగుణ్య ప్రాపంచిక చరిత్రకు వాటిలో తగిన స్థానం లభిస్తుంది. రాముడు, కృష్ణుడు, శివుడు భారతదేశపు అద్వితీయ స్వాప్నికులు, పీడితులున్నూ. వాళ్ళకు సంబంధించిన గాథల్లో క్రమబద్ధత కోసం గాలించటం, వాళ్ళ జీవితాల్లోకి గతితప్పని నీతిని పేనబూనటం, వాళ్ళ జీవితాల్లో నుండి అసత్యంగానో లేదా అసంభవంగానో కన్పించే వాటిని తొలగించే ప్రయత్నం చేయటం చిట్టచివరకు ఎలా తయారవుతుందంటే తర్కాన్నితప్ప మిగతాదాన్నంతా కొల్లగొట్టినట్లుగా. కనుక మనం కరాఖండిగా శివ, రామ, కృష్ణులు లేనేలేరనే నిర్ణయానికి వద్దాం. కనీసం వాళ్ళను గురించి చెప్పిన కథల్లో మాదిరిగా లేరనుకొందాం. వాళ్ళను గురించిన కథనాలన్నీ కల్లబొల్లివిగానో, అసంభవాలుగానో పరిగణిద్దాం. కొన్ని కొన్ని సార్లు అవి ఆకుకు అందకుండా పోకకు పొందకుండా తర్కానికి దూరంగా జరిగాయనుకొందాం. అయితే అటువంటి ఒప్పుకోలు యావత్తూ అప్రస్తుతమే. ఎందుకంటే భారతీయ ఆత్మకు చెందిన చరిత్రలో ఈ ముగ్గురి పేర్లు సత్యాలై, అటువంటి వాళ్ళ వరుసలో ముందు పంక్తిలో నిలిపి అవి అసత్యాలనో, అసంభవాలనో భావించే వాళ్ళను అధిగమించి పోయాయి. చారిత్రక ఘటనలు శిలలపై చెక్కినా, లోహాలపై ముద్రించినా కాలగర్భంలో కలిసిపోవటం జరిగిందిగాని, వాళ్ళకు సంబంధించిన గాథలు మాత్రం ప్రజల మనస్సులపై చెరగని ముద్రలై నిలిచాయి.

### పురాణం ఒక అనంతమైన నవల

ఇప్పటికీ భారతదేశంలోని గిరులు దేవుళ్ళ ఆవాసాలే. అయితే ఆ దేవుళ్ళు అప్పుడప్పుడూ మైదానాల్లో మనుషుల్లా జీవించారు. గొప్ప గొప్ప నదుల్లోని సర్పాలను మచ్చిక చేసుకుంటూనో, చంపేస్తూనో బ్రతికారు. ఉడతా భక్తి సముద్రాలపై వారధులు నిర్మించింది. ఇక ఎడారుల్లోని అతీంద్రీయ విశ్వాసాలు – యూదులవి, క్రైస్తవులవి, ముస్లిములవి– రకరకాల దైవాలను ధ్వంసం చేశాయి. వాళ్ళు ధ్వంసం చేయకుండా నిలబెట్టింది ఒకే ఒక్కడిని అతడు అందనంత దూరంలో, అనంతమైన ఎత్తులో ఉంటాడు. కనుక వాళ్ళ కొండలు, మైదానాలు, నదులు పురాణ గాథలకు దూరంగా ఉండేవి. పురాతత్వ పరిశోధకులకు లేదా విశ్వవిద్యాలయాల్లో చదువుకొన్న వాళ్ళకు మాత్రమే తెలుసు– ఒలింపస్ శిఖరంపై గల దేవుళ్ళను గూర్చి, గుట్ట మిట్టలపై, నదీనదాలపై, అవనీతలంపై చంద్రుని ఎడతెగని విన్యాసాలు దేవుళ్ళను వాళ్ళ మానవావతారపు కథల్ని సజీవంగా నిలుపుతూ సుసంపన్నం గావించాయి. పురాణాలు గాథలు కావు. గాథ గురువు వంటిది. గాథ ఒక్కోసారి మనకు వినోదాన్ని పంచవచ్చు. అటువంటి తరుణంలో అది యాదృచ్ఛికంగా ఒక కళాత్మక రచనా విన్యాసపు ఉపోత్పాదితం కావచ్చుగాని, కథ బోధన వైపుకే మొగ్గు చూపుతుంది. పురాణగాథ కూడ యాదృచ్ఛికంగా బోధనకు ఉపకరించవచ్చు. వినోదపు ఉపోత్పాదితం కావచ్చు. అయితే పురాణాల ప్రాధాన్యం అటు వినోదానికిగాని ఇటు బోధనకుగాని సంబంధించినటువంటిది కాదు. కథానిక వినోదాన్ని అందించేటటువంటిది. బాల్జాక్, మొపాసా, ఓహెన్రీ వంటి వాళ్ళు వాళ్ళ కథానికలతో ప్రపంచానికి ఎంత గొప్పగా వినోదాన్ని అందించారంటే ఆయా దేశాల్లోని ప్రజలలో పదిమందిలో ఒకరికైనా ఆ కథలు సవివరంగా స్ఫురణకొస్తాయి. తత్ఫలితంగా అటువంటి వాళ్ళ జీవితాలకు నిస్సంకోచంగా గాఢత, విశాలత్వం సమకూరతాయి. అయితే పెద్దదిగా వుండే నవల కూడ వినోద ప్రదాయినే. నవల ప్రభావం పైకి అంతగా కనిపించకపోవచ్చునుగాని లోతుగా చొచ్చుకుపోయి తీరుతుంది.

పురాణం అనేది ఒక అనంతమైన నవల. అత్యద్భుత గాథల సమాహారం. అది బోధించినా, ఆనందింపజేసినా అదంతా ఉపోత్పాదితమే. అది సూర్యుని వంటిది, అది పర్వతాల వంటిది, ఫలవృక్షాల వంటిది. అవన్నీ మన జీవితాల్లో ప్రముఖమైన పాత్రను పోషించేటటువంటివి. మన మామిడిపండో, చైనా వారి పీచ్ పండో మన

శరీరంలో కణాలవుతాయి. అవి మన రక్తమాంసాల్లో కలగలిసిపోతాయి. పురాణం మానవ కణాల్లో ఒక భాగం, అది వాళ్ళ రక్తమాంసాల్లో జీర్ణించుకుపోయింది. అయితే పురాణాలను మహా మానవుల జీవితాలంతగా సరిపోల్చి చూపటం, వాటిని ఉదాత్తతకు మచ్చుతునకలుగా చూపటమన్నది ఒక వినోదభరితమైన తెలివిమాలిన పని. రాముణ్ణి, కృష్ణుణ్ణి, శివుణ్ణి మానవులు పనిగట్టుకొని మానవ ప్రవర్తనకు, ఆలోచనా విధానానికి నమూనాలుగా మార్చదలిస్తే వాళ్ళను దిగజార్చినట్లే. వాళ్ళు సకల భారతావనికి కణజాలం, రక్తమాంసాలు. వాళ్ళ సంభాషణలు, వాక్పటిమ, వాళ్ళ ప్రవర్తన, చర్యలు, కనుబొమలు ఎప్పుడు ఎలా కదిపి ఏమి చెప్పిందీ, ఏమి చేసిందీ అంచెలంచెలుగా పూసగుచ్చినట్లు చెప్పే జ్ఞానం భారతీయ జీవనంలోని ప్రతి భాగానికీ సుపరిచితమే. వాళ్ళంతా వాస్తవానికి భారతీయునికి మచ్చుతునకలు, కొలమానాలు. అది స్పృహలో ఉండి కావాలని అలా కట్టుబడి వుండటం కాదు. రక్త పరీక్షను బట్టి శరీరం ఆరోగ్యవంతమా, అనారోగ్యకరమా అని తెలుసుకునేంతగా.

గొప్ప పురాణం అనేది ఒక విధమైన అవిభాజ్య ఉత్పాదన. అందులో ఇతిహాసాలు, కట్టుకథలు, కథానికలు, నవలలు, నాటకాలు, కవిత్వం అన్నీ కూడ భారతీయుల మనస్సుల్లో అణుశక్తిలా దట్టించబడి ఉంటాయి. నిరక్షరాస్యుల్ని సైతం సంస్కరించే శక్తి ఆ పురాణాలకు ఉంటుంది. అయితే త్వరత్వరగా మార్పు చెందే అనుభవాలు వాళ్ళను చెడగొడతాయి కూడ. ఈ పురాణాలు ఒక విశ్వజనీన గాథను చెప్తూనే వాటికి స్థానిక రంగుల్ని పులమటం శోచనీయమే. మానవాళి అంతా ఒకే చోట ఒకే సమయంలో నివసించటం కుదరని పని గదా. మానవులు అనేక ప్రాంతాలలో నివశించసాగారు. ఆయా ప్రాంతాల్లో వాళ్ళ వాళ్ళ నదులు, కొండలు, మరకతం లాంటి, ఇంద్రనీలం వంటి సముద్రమో వాళ్ళకున్నాయి. దీనివల్ల అక్కడి పురుషులకు, స్త్రీలకు వాళ్ళ బిడ్డలకు విద్య ఒక శాశ్వత సమస్యగా మారింది. ఆ క్రమంలో వాళ్ళు సార్వజనీనతకు గల స్థానిక రంగుల్ని కడిగి వేయటంతో మనోద్వేగాల పిలుపులకు దూరమై, రక్తం యింకిపోయి కృశించిన నీడగా మిగిలి ఉండవలసి వచ్చింది.

**గమ్ గమ్ గంగా ...**

రైన్ నదులకు తండ్రైనా, గంగ నదుల మాతైనా, అమెజాన్ కులీనంగా

మిరుమిట్లు గొలిపినా అవన్నీ ఒక తానులో ముక్కలే. అయినా వాటి చుట్టూ అల్లుకొన్న కథలు ఎన్నెన్ని రకాలో, వాటి అర్థాలు, అవేమి చెప్తున్నాయో అటుంచి, అసలు ఆ పదాలకున్న అర్థాలు, వాటి రుచి, వాసన, స్థానికంగా, చారిత్రకంగా యుగయుగాలుగా సుపరిచితమే. గంగానది కొండల్లో నుండి, లోయల్లోనుండి నడయాడే మందగమన. పురివిప్పిన నెమలి పింఛంలా చిరుతరంగాలు, పిరుదులు పెద్దవైనందువల్ల హడావిడి లేకుండా నడయాడే మగువ వంటిది. గంగా తరంగాలు బాలీ ద్వీపంలో ఉపయోగించే సంగీత వాద్యం గమేలన్ సునాదంలా తన పేరులోనే "గమ్"ను పదిలపరచుకొని గమ్ గమ్ గమ్‌లతో సాగిపోతుంది. ఇక భారతీయ శిల్పం విషయానికొస్తే గంగ మొసలిపై, తన చెల్లెలు యమున తాబేలుపై విడదీయరాని శాశ్వత ద్వయం. పేరులేనివైనా వాస్తవానికి శిలలపై గల స్త్రీ మూర్తుల అందచందాలకు అవి తలమానికలు.

శిల్పరూపంలో వున్న గంగ, యమునలకు ఎదురుగా నిలబడి ఆసక్తితో తిలకించే వాళ్ళకు ఆ రెండూ ఒకే విధంగా కన్పించినా, స్వల్ప తేడాలు ఏది అందంగా వుందో తేల్చనివ్వక విభ్రాంతిని కల్గిస్తాయి. ఆ విధమైన స్థానిక విషయాల్లో విశ్వజనీనత పలకరిస్తుంది. దీనికి పరిష్కారమేమంటే ప్రపంచంలోని ప్రధానమైన పురాణాలను, పౌరాణిక గాథల్ని ఒక తావుకు చేర్చి వాటికి వ్యాఖ్యలు, పాఠ్యాంతరాలు లేకుండా వాస్తవంగా, అందంగా ప్రజలకు విన్నవించాలి. ప్రపంచాన్ని చుట్టి వచ్చేవాళ్ళకు ఒక ప్రత్యేక బాధ్యత ఉంది. ప్రపంచం నలుమూలలా కనిపించే భూమి మీది భ్రాంతుల్ని వివరించి చెప్పాల్సి ఉంది. ఉదాహరణకు హవాయ్‌లోని మేడమ్ పిలౌ తన ఉనికి ద్వారా రెండు మూడు రోజులు కైపెక్కిస్తుంది. అయితే ఆమెను తాకేంతలోనే మాయమవుతుంది. చూచేందుకు అదెలా ఉంటుందంటే సిగరెట్ తాగేవాళ్ళ పొగను ఆమె అగ్ని పర్వత బిలాల్లోకి లెక్కలేనన్ని సార్లు ఊది శక్తినంతా కూడగట్టుకుని తిరిగి తనలోని గంధకాన్నంతా పీల్చివేసినట్లు.

## నియమిత, అఖండ, అనంత వ్యక్తిత్వాలు

రాముడు, కృష్ణుడు, శివుడు భారతదేశపు మూడు మహోత్కృష్ట మహాస్వప్నాలు. ఏ స్వప్నం దారి దానిదే. రాముడు నియమిత వ్యక్తిత్వానికి, కృష్ణుడు అఖండ సంపన్నమైన వ్యక్తిత్వానికి, శివుడు అనంత వ్యక్తిత్వానికి సమగ్రతను కూర్చినవాళ్ళు.

దేనికదే సంపూర్ణం. ఇందులో ఒకరి సమగ్రత ఎక్కువని, ఒకరి సమగ్రత తక్కువనీ భావించరాదు. అసలు సంపూర్ణత్వానికి తరతమ భేదాలుంటాయా? సంపూర్ణత్వానికి తెలిసింది గుణానికి గల విధాలు, తరగతులు మాత్రమే. ప్రతివాళ్ళూ తమ రుచికి అనువుగా ఎంచుకోవచ్చు లేదా ఆ సమయంలో తమ జీవిత స్థితిగతులకు అనుగుణంగా తగిన సంపూర్ణత్వాన్ని ఎంచుకోవచ్చు. కొందరిలో అయితే ఆ మూడు విధాలైన సంపూర్ణత్వాలు – నియమిత, అఖండ సంపన్నత, అనంత వ్యక్తిత్వాలు కలగలిసిపోయి చెక్కిలి దవడలా అతుక్కొని ఉంటాయి. భారతదేశపు గొప్ప గొప్ప ఋషుల ప్రయత్నమంతా అదే. శివుణ్ణి రాముని చెంతకు చేర్చేవాళ్ళు. కృష్ణుణ్ణి శివుని చెంతకు చేర్చేవాళ్ళు. యమునానదీ తటాలపై రాముడు వసంత మాడేవాడు. ఈ విధంగా ప్రజలలోని వివిధ రకాలైన సంపూర్ణత్వాల కలలు సన్నిహితమయ్యాయి. అయినా వాటి ప్రత్యేక గుర్తింపును కోల్పోయిందెక్కడ? రాముడు, కృష్ణుడు విష్ణువు యొక్క రెండు విధాలైన మానవాంశాలు. వాళ్ళు ధర్మం నశించి అవినీతి పెచ్చరిల్లినపుడు భూమి మీదికి వచ్చారు. ధర్మం అంత బాగా గాడితప్పని త్రేతాయుగంలో రాముడు భూమి మీదికి రావటం జరిగింది. అష్టాంగాలతో ఆయనది పరిమిత వ్యక్తిత్వంగా రూపొందింది. కృష్ణుడు ద్వాపరంలో భూమిపై కాలుమోపే నాటికి అవినీతి పెచ్చుమీరింది. కనుక పదహారు అంశలతో సంపూర్ణ వ్యక్తిత్వంతో విరాజిల్లాడు. కృష్ణుని రూపంలో విష్ణువు భూమి మీదకు వచ్చినపుడు స్వర్గంలో ఆయన గద్దె పూర్తిగా ఖాళీగానే ఉంది. రాముని అవతారంలో విష్ణువు కొంతకాలం స్వర్గంలోనూ, కొంతకాలం భూమి మీద సంచరించాడు.

ఈ పరిమిత, అపరిమిత వ్యక్తిత్వాల విషయంలో రెండు గొప్ప కథలు చెప్తారు. రాముడు ఒకే స్త్రీపై దృష్టి నిలిపి జీవితాంతం మరో స్త్రీ వంక చూచిన పాపాన పోలేదు. ఆమే సీత. ఆమె కథ చాలా వరకు రాముని కథలో భాగమే. అతని కృత్యాలన్నీ ఆమెను వివాహమాడటం, సీతాపహరణం, ఆమెను చెరనుండి విడిపించి తేవటం, చివరకు ఆమె తన తల్లి గర్భంలోకి వెళ్ళిపోవటం చుట్టూ అల్లబడినాయి. సీత అపహరించబడినప్పుడు రాముడు అమితంగా బాధకు గురయ్యాడు, శోకించాడు. చెట్టునూ, పుట్టనూ, రాయినీ రప్పనూ అడిగాడు తన సీతను చూచారా అంటూ. అది చూచి చంద్రుడు నవ్వాడు. విష్ణువు వేలాది సంవత్సరాలు చంద్రుడి నవ్వును గుర్తుంచుకునే వుండివుంటాడు. తిరిగి విష్ణువు భూమి మీదకు కృష్ణునిగా వచ్చినపుడు

ఆయన ప్రియురాళ్ళు లెక్కలేనంత మంది. ఆయన ఒకసారి అర్ధరాత్రి పదహారు వేల మంది గోపికలతో బృందావనంలో రాసకేళిలో మునిగి తేలాడు. గోపికలు అరవై మందా, ఆరు వందల మందా అనేది అసంగతం. ఆ మహోత్కృష్ట నాట్యకేళి రాసలీలలో ప్రతిగోపికకు తన సరసన నాట్యం చేసేందుకు కృష్ణుడున్నాడు. చలింపజేసేవాడు అచలంగా ఉన్నాడు. పరమానందం అఖండం, భేదభావం లేనిది, తపన లేనిది. చంద్రుణ్ణి "ఇప్పుడు నవ్వవయ్యా చూద్దాం" అని కాలుదువ్వాడు కృష్ణుడు. చంద్రునికి చచ్చే చావయ్యింది. ఈ రెండు గొప్ప గాథల్లోనూ పరిమిత, అపరిమిత వ్యక్తిత్వాలు రెండూ సంపూర్ణ పాత్రలే పోషించాయి.

## సీత దాటరాని లక్ష్మణరేఖలు

మానవజాతి చరిత్రలో సీతాపహరణం కడు గొప్ప ఘటన. అది సవివరంగా వ్రాయబడింది. ఇది అదుపులో వున్న, రాజ్యాంగబద్ధ, పరిమిత అస్తిత్వానికి చెందిన గాథ. అరణ్యవాసంలో అడవులెంట తిరుగాడే సమయంలో సీత ఒంటరిగా వుండవలసి వచ్చిన సందర్భంలో రాముని తమ్ముడు లక్ష్మణుడు సీత చుట్టూ ఒక గిరి గీసాడు. దానిని ఆమె దాట రాదు. రాముని వైరి రావణుడు భిక్షుకునిగా వచ్చి సవినయంగా ప్రార్థిస్తూ ఆమెను గీత దాటేట్లు చేసేవరకూ అతడు అశక్తుడే. పరిమిత లేదా నియమిత నియమాలను, రాజ్యాంగబద్ధతను గుర్తిస్తుంది – అయితే అది తనకు కావలసిన మేరకే. అవి ఇబ్బందులు తెచ్చి పెట్టేవిగా వున్నాయనుకుంటే మాత్రం వాటిని అధిగమించటమే.

## రాముని అధికారం చుట్టూ గిరిగీసే ఉంటుంది

రాముని నియమిత వ్యక్తిత్వాన్ని గురించి మరో మంచి కథ చెప్తుంటారు. ఆ కథలో రాముని అధికారం చుట్టూ గిరిగీయబడిన నియమాలు, వాటిని ఆయన ఎన్నడూ అధిగమించని తీరు, అలా అధిగమించని రెండు మూడు సందర్భాలలో కళంకాన్ని మూటగట్టుకోవటం మనం చూస్తాం. అరణ్యవాసం తర్వాత రాముడు, సీత అయోధ్యకు తిరిగి వచ్చి ఆయన రాజుగా, ఆమె రాణిగా కాలం గడుపుతున్నారు. చెఱలో వున్న సీత ప్రవర్తన విషయంలో రజకుడు ఏదో సణిగాడు. అలా సణిగింది ఒకే ఒక్కడు. ఆ సణుగుడు కూడ తుచ్ఛమైంది. అందువల్ల అది నిరర్థకం. అయితే నియమానుసారం ఫిర్యాదు ఏ ఒక్కళ్ళు చేసినా అది దోషాన్ని సూచించేదే కనుక

దానికి వెంటనే తగిన పరిష్కారాన్ని కనుగొనవలసిందే లేదా శిక్ష విధించాల్సిందే. ఈ విషయంలో సీతా పరిత్యాగమొక్కటే తగిన పరిష్కారం. నియమం బుద్ధి మాలినది. శిక్ష క్రూరమైనది. ఆ ఘటన అంతా అప్రతిష్ఠాకరమైనదే. ముమ్ముందు జీవించినంతకాలం అది రాముణ్ణి దుఃఖితుణ్ణి చేస్తూనే వచ్చింది. అయినా ఆయన నియమానికే కట్టుబడ్డాడు. ఆ నియమాన్ని మార్చలేదు. ఆయన నియమిత మూర్తిమత్వంలో పూర్ణపురుషుడు. నియమాలకు, రాజ్యాంగానికి బద్ధుడు. అది ఒక ఘటన ద్వారా తాను నిరూపించాడు. అయితే అది అతనికి కళంకాన్ని తెచ్చిపెట్టింది.

నియమిత మూర్తిమత్వంతో కూడ ఆయనకు మరో మార్గం లేకపోలేదు. ఆయన పదవిని త్యజించి సీతతో తిరిగి వనవాసానికి వెళ్ళవచ్చు. ఆయన ఆ సూచన చేశాడుగాని ప్రజలు అందుకు అంగీకరించలేదు. అయితే ఆ విషయంలో పట్టుపట్టవలసింది. అప్పుడు ప్రజలు ఆ నియమాన్ని సడలించటమో, తొలగించటమో చేసి ఉండేవాళ్ళు. అయితే ఏ నియమిత మూర్తిమత్వం కూడ నియమాల తొలగింపును అంగీకరించదు. మరీ ముఖ్యంగా అది తన సమస్యా పరిష్కారానికి ఎంతో కొంత సంబంధించినదైనప్పుడు, బలవంతంగా రద్దు చేయవలసి వచ్చినపుడు ఇంకా కష్టం. చరిత్రలో వలె పురాణాలలో కూడ ఇలా జరిగుంటే, అలా జరిగుంటే అనేవిగాని, ఊహాపోహలు గాని ఆకర్షణీయాలు కావు. రాముడు అలా చేసివుంటే, అలా చేయకుండా వుంటే అనే ఊహలు నియమిత మూర్తిమత్వానికి తగిన విధంగా అలా నిర్దాక్షిణ్యంగా నియమాలకు బద్ధుడు కావటం ముందు ప్రధానాలు కాజాలవు. ఏకఛత్రాధిపత్యానికి భిన్నంగా బహుముఖ నాయకత్వంపై సమకాలీన చర్చ ఆసక్తిదాయకంగా ఉంటుందిగాని డొల్లతనాన్ని వీడదు. నాయకత్వం ఒక వ్యక్తికి సంబంధించినది గాని, పదిమందికి సంబంధించినది గాని కావచ్చు. అయితే అవి రెండూ కూడ అఖండ మూర్తిమత్వానికి సంబంధించిన నియమాలకు, రాజ్యాంగానికి లోబడి నడుచుకోవాల్సి ఉంటుంది. అయితే తేలవలసిన తేడా ఏమంటే ఒక్కడు గాని, పది పదిహేను మంది గాని వాళ్ళ అధికారపు పరిధి చుట్టూ గీసిన గీతల్ని ఏ మేరకు అధిగమించగలిగారన్నది. అయితే అలా అధిగమించటం ఒక్కడుగా కాక పదిమంది కలిసి చేయవలసిన పనైతే మరీ కష్టం. అయితే జీవితం అనేకానేక తారతమ్యాలతో పరస్పరం పోటీపడే శక్తుల నిరంతర ప్రవాహమే కాదు సంజవెలుగు కూడ.

## వ్యక్తి సముదాయ ప్రకర్షల డోలాయమాన స్థితి

ఈ ప్రవాహంలో వ్యక్తికి సంబంధించిన, సముదాయానికి సంబంధించిన ప్రకర్షల డోలాయమాన స్థితి నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. వ్యక్తిగత ప్రకర్ష సామూహిక ప్రకర్షకు దారి తీస్తుంది. దాని విపర్యయం కూడ వాస్తవమై అలరారుతుంది. దీనికి మించి మరో డోలాయమాన స్థితి ఉంటుంది. అందులో వ్యక్తికి, సముదాయానికి మధ్య ఊగిసలాట కొనసాగుతూనే ఉంటుంది. అంతకు మించిన డోలాయమాన స్థితి పరిమితత్వానికి, అఖండతకూ మధ్య నెలకొంటుంది. రాముడు రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య తరహా నియమిత మూర్తిమత్వం కలవాడు. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం పరిమిత సముదాయ స్థితి. కృష్ణుడు అఖండ సంపన్నత గల వ్యక్తి. అతని ప్రకర్ష నాయకుల అధిష్ఠాన వర్గం వంటిది. ఆ అధిష్టాన వర్గపు తెలివైన తీర్పులు నియమాలను అతిక్రమిస్తాయి. అందువల్లనే కృష్ణుడు ప్రకర్షగల సాముదాయిక శక్తి. ఈ రెండు విషయాలలో మొదటగా అధికారాన్ని చెలాయించేది వ్యక్తియా లేక వ్యక్తుల సముదాయమా? అధికారం పరిమితమైనదా లేక అఖండ సంపన్నమా? ఇక రెండవది అంతకంటే గొప్పది. అధికారం అతిక్రమించరాని నియమాలకు రాజ్యాంగానికి కట్టుబడి ఉంటుందా? ఈ గొప్ప ప్రశ్నకు సమాధానం లభించిన తర్వాత అంతకంటే అల్పమైన విషయం పరిమిత అధికారం వ్యక్తిదా లేక సాముదాయికమా? పరిమిత సాముదాయికత్వం చెలాయించే అధికారమే శ్రేష్ఠమైన పద్ధతి అని నిస్సందేహంగా చెప్పవచ్చును.

రాముడు పరిమిత వ్యక్తి. కనుక అతను కావాలని పన్నే పన్నాగాలకు, ప్రయోజనాలకు దూరంగా ఉంటాడు. విధేయత సాధించేందుకు నియమాలు, రాజ్యాంగం కొలబద్దలుగా నిలుస్తాయి. అయితే అంతరంగం ప్రేరేపింపబడకుండా కేవలం బయటి నుండి వత్తిడి పెట్టడం ప్రయోజన శూన్యమైన పనే. బయటి నుండి రాజ్యాంగపు కట్టడి లోలోపల నుండి అంతరంగం విధించుకునే పరిమితులు ఒకదానినొకటి దృఢపరుస్తాయి. అయితే వీటిల్లో ఏ చోదక శక్తి ప్రధానం అనే వాదన నిష్ప్రయోజనమే. పరిమిత మూర్తిమత్వానికి రాజ్యాంగపరమైన బాహ్య కాఠిన్యాలు అనేవి అంతర్గత మనస్సాక్షికి మరోపేరుగా నిలుస్తాయి. ఆ రెండు శక్తుల మధ్య బ్రహ్మాండమైన సర్దుబాటు, సమాంతరత నెలకొంటే అక్కడ పరిమిత మూర్తిమత్వం వర్ధిల్లినట్లే. పరిమితులు అనేవి బాహ్యమైన నియంత్రణలు. అయితే అవి అక్కడే

ఆగవు. లోపలి హద్దుల్లోకి  కూడ చొచ్చుకుపోతాయి. పరిమిత నాయకత్వం అనేది నియంత్రింపబడిన నాయకత్వమే. అది కూడ అంతరాత్మ అధికార పరిధుల్లోకి కూడ చొచ్చుకుపోతుంది. రాముడు నిజానికి నియంత్రింపబడిన వ్యక్తి. అయితే ఆయనను గురించిన వర్ణన అక్కడే నిలిపి వేయటం తప్పిదమవుతుంది. ఎందుకంటే ఆయన పరిమిత వ్యక్తి. ఆయన సంకల్పం రాజ్యాంగానికి సమాంతరంగా సాగిపోతుంది.

## మరణశయ్య మీదా మర్యాదలే!

రావణుని చివరి క్షణాలను గురించి ఓ కథ చెప్తారు. ఆయన కాలంలో ఆయనే అత్యంత ప్రజ్ఞాశాలి. అయితే ఆయన ప్రజ్ఞ చెడు మార్గాలకు మళ్ళించటం జరిగింది. దుష్టమైన ఉద్దేశ్యాలను ప్రక్కన ఉంచి చూచేట్లయితే ఆయన ప్రజ్ఞ తరతరాలుగా మానవాళికి ఉపయోగపడేటటువంటిదే. కనుకనే ఆ ప్రజ్ఞాపాఠాల్ని నేర్పమని ప్రార్థించవలసిందిగా లక్ష్మణునికి చెప్పి ఆయన వద్దకు పంపుతాడు రాముడు. రావణుడు నోరు మెదపలేదు. లక్ష్మణుడు తిరిగి వచ్చి అదంతా రావణుని అహంకారంగా భావించి ఆ పాఠాల్ని పొందటంలో సఫలీకృతుడు కాలేకపోవటాన్ని వివరించాడు. అయితే రాముడు ఓ నిముషం అసలేం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం చేశాడు. లక్ష్మణుడు వెళ్ళి రావణుని తల వద్ద నిలబడిన విషయం గ్రహించాడు. లక్ష్మణుణ్ణి తిరిగి వెళ్ళి రావణుడి కాళ్ళ వద్ద నిలబడి వేడమన్నాడు. అప్పుడు రావణుడు రాజ్యపాలన పద్ధతుల్ని వివరించాడు.

ప్రవర్తన విషయంలో దీనితో సరితూగే కథ రావటం కష్టం. దీనికి మించిన కథ రాలేదు. ప్రవర్తన అనేది మనిషికి నీతి అంత ముఖ్యమైన విషయమే. ఒక వ్యక్తి ఎలా తింటున్నాడు, ఎలా నడుస్తున్నాడు, కుర్చీలో ఎలా కూర్చుంటున్నాడు. దుస్తులు ధరిస్తున్న తీరు, తన వాళ్ళతో మాట్లాడే తీరు, వాళ్ళ సమక్షంలోనూ వాళ్ళతో దూరంగా జరిగే తీరు, వాళ్ళకు ఇబ్బంది కల్గిస్తానేమోననే భావనతో ఎల్లప్పుడూ జాగ్రత్తగా మసలుకొనే పద్ధతి, సమస్త జీవరాశితో మెలగే పద్ధతి – ఇవన్నీ ప్రవర్తన కిందికే వస్తాయి. అందులో ఏదీ దేనికీ తక్కువ కాదు. అఖండ ప్రకర్ష గల కృష్ణుడు పరిమిత మూర్తిమత్వం గల ప్రతివ్యక్తీ కోరుకునే దానికన్నా మించే మర్యాదల్ని పాటిస్తాడు. మర్యాదకు మచ్చుతునకగా, నిలకడగల తెలివితేటలకు నిదర్శనంగా నిలిచిపోతాడు,

తాబేలు సర్వాంగాలను తన డిప్పలోకి లాక్కున్నట్లు అటువంటి వ్యక్తి సర్వస్వాన్ని తనలో ఇముడ్చుకుంటాడు. కనుకనే అతనికి అన్నింటిపై అంతటి సర్వాధికారం. ఏదీకూడ అజాగ్రత్తనో, నిర్లక్ష్యాన్నో ప్రదర్శించదు. వివిధ రంగాల్లో అవి ఎదురెదురుగా నిల్చినా మర్యాదల పరిధిలో అపరిమిత మూర్తిమత్వం విరాజిల్లటం పరిమిత మూర్తిమత్వానికీ సంకేతమే. అయినా రాముడు మర్యాదకు సంబంధించిన గొప్ప గాథకు సృజనకర్తే. అదీ ప్రత్యేకించి ఓ మరణ శయ్య మీద గల ఓ ప్రజ్ఞానిధితో.

## మౌనంలోని గారడీ

రాముడు తరచుగా వింటూ ఉండే వ్యక్తి క్రిందే లెక్క. వినటం అంటే అప్పుడు తాను ఎవరితో మాట్లాడుతున్నాడో అతను చెప్పేది వినటమే కాదు, ప్రతి గొప్పవాడు చెప్పేది మాత్రమే కాదు. మిగతా ప్రజల మాటా వింటాడు. అందుకే పరశురాముడు ఓసారి నిందించటం– తాను వెనుక నిల్చి తమ్ముడితో నిరంతరాయంగా ఆవేశంగా మాట్లాడిస్తాడని. అలా నిందించటంలో కొంత న్యాయం లేకపోలేదు. తన సమర్ధకులకు, శత్రువులకు మధ్య జరిగే మాటల పోరుకు రాముడు పలుమార్లు శ్రోతగా నిలిచాడు. కొన్ని పర్యాయాలు వికృతమైన, నిందార్హమైన పర్యవసానాలకు చేరుకునేది వ్యవహారం– ఉదాహరణకు రావణుని చెల్లెలు శూర్పణఖ, లక్ష్మణునికి మధ్య వివాదమే. అటువంటి సందర్భాలలో రాముడు ఎంతో మనోనిబ్బరంతో నోరు విప్పక నిస్సాక్షికంగా వున్నట్లు కన్పిస్తూ, కొన్ని పర్యాయాలు తన సమర్ధకుల అతిని అరికడుతూనే వాళ్ళ పక్షాన మాట్లాడుతూ వాళ్ళను ఉత్తేజ పరుస్తూ ఉంటాడు. ఇక్కడ విస్పష్టమైన విధానం వున్నట్లుగా కన్పించవచ్చును గాని వాస్తవానికి మాత్రం మాటకు మాట బదులాడక, పరిస్థితికి అనుగుణంగా ఇతరుల్నే మాట్లాడనిస్తూ ఆనందించే పరిమిత మూర్తిమత్వం అది. కృష్ణుడు గొప్పగా మాట్లాడతాడు. అతనూ వింటాడు. అయితే అతను వినేది తాను మరింత బాగా మాట్లాడగలిగేందుకే. అతని మాటల గారడీ తన మార్గంలో నడిచే వారికి మరింత ఆకర్షణీయంగా ఉంటుంది. రామునికి మౌనంలోని గారడీ తెలుసు. తన మాటకు గాని, చేతకు గాని అవసరం పడనంతవరకు ఇతరులనే మాట్లాడనిస్తూ వుండే కళ అది. రాముడు అటు మాట్లాడుతూనూ, ఇటు మాట్లాడకుండానూ తన పరిమిత మూర్తిమత్వం ద్వారా ఘనుడయ్యాడు.

## రాజ్యనీతికీ వ్యక్తినీతికీ మధ్య వైరుధ్యం

రాముని జీవితం వ్యాసంలా విస్తరించుకుంటూ పోతుంది. ఇంకిపోదు. అతని వనవాసం దేశాన్ని ఒకే గొడుగు క్రిందకు తెచ్చే ఉద్దేశ్యంతో సాగింది. అంతకు ముందు అధికారం కోసం ఇరు శత్రురాజ్యాలు పోరాడుతున్నాయి. ఆ రెండు రాజ్యాలు అయోధ్య, లంక. రాముని వనవాసం రాముని అయోధ్య నుండి లంక దిక్కుగా నడిపింది – మార్గమధ్యంలో ఏదో ఒక అధికార కేంద్రానికి కట్టుబడి వుంటూ అనేక రాజ్యాలు. రాముని పరిమిత మూర్తిమత్వపు రాజనీతి రావణుని ఓ బలమైన మిత్రరాజ్యాన్ని ఎదుర్కొన్నప్పుడు బాగా బయటపడింది. వాలి ఆ మిత్రరాజ్యపు రాజు. అతని తమ్ముడు సుగ్రీవుడు, సైన్యాధిపతి హనుమంతుడు వాళ్ళ రాజ్యం రావణుని మిత్రరాజ్యంగా వున్నందువల్ల బాధపడ్డారు. కనుక ఆ పొత్తును తొలగించి రాముని వైపు చేరాలనుకొన్నారు. హనుమంతుడు తరువాత రాముడికి అత్యంత భక్తిపూర్వక సేవకుడయ్యాడు. అందుకు తార్కాణం అతను హృదయాన్ని చీల్చి చూపినపుడు అందులో రాముడు తప్ప మరేమీ కన్పించకపోవటమే. ఆ తొలి మహా పోరాటంలో రాముడు కుశాగ్రబుద్ధితో స్థిమిత మూర్తిమత్వంతో వ్యవహరించాడు. ఆ రాజ్యాన్ని రాముని రాజ్యంలో విలీనం చేయక ఉన్నది ఉన్నట్లుగానే ఉంచటం జరిగింది. ఉన్నత పదవుల్లో గాని, చిన్నఉద్యోగాల్లో గాని విదేశీయుల్ని నియమించలేదు. వాలి ద్వంద్వయుద్ధంలో మరణించిన తరువాత సుగ్రీవుణ్ణి పట్టాభిషిక్తుణ్ణి చేయటం జరిగింది. అయితే. వాలి మరణం కూడ రాముని జీవితంలోని కళంకితాలలో ఒకటిగా మిగిలిపోయింది. రాముడు చెట్టు చాటున దాగి సుగ్రీవుడు ఓటమి ఒడిలోకి చేరే సమయంలో వాలి మీదికి బాణం వేస్తాడు. అది నియమాలకు విరుద్ధం. ఏ సత్పురుషుడైనా లేదా పరిమిత మూర్తిమత్వం కలవాడైనా ఎన్నడూ అటువంటి పని చేయడు. రాముడు చెప్తాడు తాను కష్టతరమైన ద్వైదీభావంలో పడిపోయానని.

ప్రష్యా దేశ ప్రముఖ నాయకుడు ఫ్రెడరిక్ గొప్పగా వాదించిందేమంటే రాజ్యనీతికి, వ్యక్తి నీతికి మధ్య తేడా వుంటుందనీ, ఆ తేడా కారణంగా ఒక అబద్ధం పలకటం ద్వారా గాని లేదా వాగ్దాన భంగం ద్వారా గాని పెద్ద ఎత్తున మానవ సంహారాన్ని కాని, బానిస బ్రతుకుల్ని గాని అరికట్టడం జరిగే అవకాశం ఉన్న సందర్భాలలో ఒప్పందాలకు కట్టుబడి వుంటూ జీవితంలో ఏదో ఒకసారి ఒప్పందాన్ని

ఉల్లంఘించిన రాకుమారుల్ని మన్నించవచ్చునన్నాడు. కనుక రాముడు వాదించే అవకాశముంది. తాను అన్యాయంగా వాలిని చంపినా అది మూకుమ్మడి హత్యల్ని అరికట్టగలిగిందని, అటువంటి అఘాయిత్యాన్ని తాను తన జీవితకాలంలో ఒకే ఒకసారి తలపెట్టానని, దాని ద్వారా రాజ్యమంతా ధర్మపథాన నడిచిందనీ దానివల్ల అపకారం ఒక్క తనకు తప్ప మరెవ్వరికీ జరగలేదని. సరే సుగ్రీవుడు మంచివాళ్ళ సరసన చేరాడు. కావలసినంత సైన్యాన్ని సిద్ధం చేశాడు. చివరకు అది లంక దుర్గాన్ని దహనం గావించింది. నిజమే, ఒక్కని చావుతో, వాలి వధతో ఇదంతా సాధించగలిగాడు. వాలి రాజ్యం సర్వస్వతంత్రమైంది. ప్రజల అభీష్టం మేరకే ఆ రాజ్యం రామునితో చేయి కలిపింది. అయినా సరే ఆ పరిమిత వ్యక్తిత్వం నియమాన్ని ఉల్లంఘించి వుండవలసింది కాదు – అది చిన్నది కానీ, పెద్దది కానీ, జీవితం అంతట్లో ఒకసారైనా సరే, అది మరో గొప్ప నియమాన్ని నిలబెట్టడానికైనా సరే.

## శత్రు శిబిరాల్లో మంచి మిత్రులు

రామకథలోని విలీనానికి దూరమైన విస్తరణ, సామ్రాజ్యకాంక్ష లేని సంఘీభావం, అంతర్జాతీయ సంబంధాలలోనూ, క్రియాశీల రాజకీయాల్లోనూ చురుకుగా పనిచేసిన పరిమిత మూర్తిమత్వం శత్రు శిబిరాల్లోని మంచి మిత్రులను వెతుక్కుంటూ సాగిపోయింది. అదే పద్ధతిని లంకలో కూడ ప్రయోగించాడు. రావణుని తమ్ముడు విభీషణుడు రాముని మిత్రపక్షంలో చేరిపోయాడు. అయితే ఇక్కడ కిష్కింధలోని కథ పునరావృతం కాలేదు. లంక శక్తి సంపన్నమైన రాజ్యం. దాని అవలక్షణం దొడ్డది. ప్రజ్ఞతో కూడినది. ఘోర యుద్ధం సంభవించింది. ఎందరో సంహరింపబడ్డారు. చివరకు విభీషణుడు పట్టాభిషిక్తుడయ్యాడు. రావణుడి భార్య మండోదరిని తన భార్యగా స్వీకరించాడు. లంకలో కూడ న్యాయం నెలకొంది. అయితే ఈనాటికి కూడ విభీషణుడు వేగులవానికి, దేశద్రోహికి, పంచమాంగ దళానికి, జాతి సముదాయాన్ని నట్టేట ముంచిన నమ్మకద్రోహికీ మారుపేరుగా మరీ ముఖ్యంగా రాముని అధికారం దట్టింపబడిన అవధ్‌లో మారుమోగుతున్నది. ఇది ఎప్పటికీ ఒక అత్యద్భుత విషయంగా, ఒక సంకేతంగా నిలిచే ఉంటుంది. విభీషణుని దోషాన్ని ఏదీ కప్పిపుచ్చజాలదు. రాముడు, పరిమిత మూర్తిమత్వంతో అలరారే అవతార పురుషుడు, తన మిత్రత్వాన్ని ప్రజాభిప్రాయంగా మలచలేకపోయాడు. విభీషణుడికి రామునితో మైత్రి వున్నా అతని అపకీర్తి చిరస్థాయిగా

నిలిచిపోయింది. పరిమిత మూర్తిమత్వం అటువంటి మైత్రికి గౌరవార్హతను కట్టబెట్టలేక పోయింది. ధర్మం గెలిచినా ఆ విజయసాధనలో సహకరించిన ప్రతినిధి కూడ నమ్మకద్రోహి అయినప్పుడు తనఖ్యాతిపై దేశద్రోహపు మచ్చను భరించటం పరిమిత మూర్తిమత్వానికి చిహ్నమా?

## కృష్ణుడు ఏడ్వడు, ఏడిపిస్తాడు

కృష్ణుడు పూర్ణపురుషుడు. అద్భుతమూ ఆనందమూ కలగలిసిన చిరునవ్వు ఆ మోమును వీడదు. మరీ ఇబ్బందికర పరిస్థితుల్లో అది కళ్ళకే పరిమితమవుతుంది– అదెంతటి శోకమయ స్థితికి దారితీసినా సరే. ఎంతటి నిజాయితీ పరుడైనా వ్యక్తిత్వం ఏర్పడిన తరువాత జీవితం మొత్తం మీద రెండు మూడు పర్యాయాలకు మించి శోకించదు. అది కూడ అందరి ముందు చేయదు. రాముడు పెద్దవాడైన తరువాత రెండే రెండుసార్లు శోకించాడు. బహుశా ఒకసారేమో. కృష్ణుడు, రాముడు నడయాడిన దేశంలో ఎవరైతే  భోరున ఏడుస్తారో వాళ్ళను పతితులైన వారిగా భావించే పలువురు వాళ్ళను అత్యంత సున్నిత మనస్కులుగానూ పరిగణిస్తారు. ఈ అపరాధంలో కొంతైనా కృష్ణునికి చెందుతుంది. అతనెన్నడూ ఏడ్వలేదు. ఇవాల్టికీ కోట్లాది మందిని ఏడిపిస్తూనే ఉంటాడు. అతని జీవితకాలంలోనే బృందావనంలోని గోపికలు ఎంతగా పరితాపాన్ని అనుభవించారంటే నేటికీ పాటల రూపంలో ఆ పరితాపం వెల్లడింపబడటం మనం చూస్తుంటాం. "వాళ్ళ కళ్ళ వెంట పగలు రాత్రి అశ్రుధారలే అశ్రుధారలు. ఆ ధారల కళ్ళ నుండి క్రిందకి దిగి స్తనాల మధ్యగా జారిపోతున్నాయి". దుఃఖంలో ఏదో శృంగారపు తమకం, సర్వం అర్పించుకోవటమే. తనకంటూ మిగుల్చుకునేదేమీ వుండదు. కృష్ణుడు గొప్ప ప్రేమికుడై వుండి అటువంటి అర్పణను మేల్కొలిపాడు. నేటికీ కోట్లాది మంది పురుషులు, స్త్రీలు, పురుషులై ఉండి స్త్రీ వేషం ధరించటమే గాక, స్త్రీల వలే ప్రవర్తించే వాళ్ళు తమ ప్రేమికుణ్ణి వశపరచుకునేందుకు కన్నీళ్ళు కార్చినా ప్రయోజనం శూన్యం. వాళ్ళ ప్రమేయమేమీ లేకుండానే వాళ్ళు కృష్ణుడికి వశులౌతారు. ఈ అనుభూతి కొన్ని పర్యాయాలు రాజకీయాల్లోకి దారితప్పి ప్రవేశిస్తుంది – నపుంసకత్వం వంచనతో జతకడుతుంది.

జననం నుండి మరణం వరకు కృష్ణుడు అసాధారణతను, అసంభవతను, సాటిలేనితనాన్ని ప్రదర్శించాడు. జన్మించటం మామ చీకటి కొట్టులో. గణనాథుడైన

తన తండ్రిని తల్లితోపాటు అక్కడ బందీలను చేశాడు మామ. అంతకుముందు జన్మించిన తన అన్నల్ని, అక్కల్ని పుట్టగానే చంపివేశాడు. కృష్ణుణ్ణి ఓ బుట్టలో దాచి ఆ చీకటికొట్టు నుండి బయటకు తేవటం జరిగింది. నదిని దాటించి సురక్షిత ప్రాంతానికి చేర్చేందుకు బయలుదేరాడు తండ్రి. యమునానది పొంగి పొర్లుతూ ఉంది. తండ్రి కృష్ణుడున్న బుట్టను పైకెత్తుతున్న కొద్దీ యమున కూడా అంత ఎత్తుకు పొంగసాగింది. చివరకు కృష్ణుని పాదపద్మాలు నదిని తాకటంతో వరద తగ్గు ముఖం పట్టింది. దశాబ్దాల తరువాత తన పని అయిపోయింది. తనకు తెలిసిన వాళ్ళంతా మరణించటమో, చెల్లాచెదురు కావటమో జరిగింది. కొందరు హిమాలయాల వైపు తీర్థయాత్రలకు వెళ్ళిపోయారు. తమ జాతి స్త్రీలను సైతం చిన్న చిన్న దొంగల ముఠాలు బలవంతంగా ఎత్తుకు పోసాగాయి. కృష్ణుడు అయిష్టంగా ఒంటరిగా ద్వారకకు పయనమై పోతున్నాడు. దారిలో చెట్టుక్రింద కాసేపు విశ్రాంతి తీసుకుంటున్నాడు. కృష్ణుడి కాళ్ళు జింక అవయవాలుగా కన్పించటంతో ఓ వేటకాడు వేసిన బాణం కృష్ణుని ప్రాణం తీసింది. ఆ క్షణంలో కృష్ణుడేం చేశాడు? తన కడసారి చూపు వేటగాడి మీదికి మళ్ళించి ఏదో అర్థమయినట్లు తన కరుణార్ద్ర చిరుదరహాసాన్ని చిందించాడా? అక్కడే ఎక్కడో పడివున్న మురళి కోసం తన చేయి వెతకసాగిందా? దానిపై కడసారిగా దివ్యగానాన్ని ఆ రంధ్రాల నుండి విన్పించసాగాడా? చాచిన తన చేతికి తగిలిన మురళిని పట్టుకొని తృప్తిగా ఓ చిరునవ్వు విసిరాడా? అతని మదిలో ఏం మెదిలింది? జీవితం అనే నాటకం ఆనందింపజేసేదిగా విస్తృత ప్రాతిపదికపై నిర్వహింపబడాలా? ఎంతైనా అది నాటకమేగా ... సరే ఆయనకు దేవతల పిలుపు వినవచ్చిందా – విష్ణువు లేని కొరతను వాళ్ళు అనుభవిస్తున్నట్లు?

## పశ్చాత్తాపం ఎరుగని నేరగాడు

కృష్ణుడు దొంగ, అబద్ధాలకోరు, మోసగాడు, హంతకుడు. అతడు కొంచెం కూడ పశ్చాత్తాపాన్ని ఎరగకుండా అటువంటి నేరాలకు ఒడిగట్టాడు. పెంపుడు తల్లి ఇంట వెన్నను దొంగిలించటంతో ప్రారంభమైన చౌర్యం మరొకడి భార్య మనసును దొంగిలించే వరకు నైపుణ్యాన్ని పెంచుకొంది. అయితే మహాభారత కాలంలో ఎన్నడూ అసత్యం పలుకనివాడితో సగం అసత్యం పలికించాడు. అతనయితే ఓ అబద్ధాల పుట్ట. సూర్యుణ్ణి మూసి ఉంచి సూర్యాస్తమయమైనట్లు భ్రమ కల్పించి ఆ సమయంలో

ఓ గొప్ప శత్రువు ప్రాణం కోల్పోయేట్లు చేసి తిరిగి సూర్యుడు ప్రకాశించేట్లు చేశాడు. నపుంసకుడైన శిఖండిని ముందుంచి భీష్ముణ్ణి యుద్ధం చేయకుండా చేశాడు. తన చెల్లెల్ని తీసుకుని పారిపోయేదానికి మిత్రునికి సాయపడతాడు.

యుద్ధంలో నేరాలకు అన్యాయాలకు కర్ణుని రథం ఘటన ఓ మచ్చుతునక. కర్ణుడు ఖచ్చితంగా యుద్ధంలో ఇరువైపుల అత్యంత ఔదార్యాన్ని ప్రకటించే వ్యక్తి. శౌర్యంలోనూ, యుద్ధ నైపుణ్యంలోనూ అర్జునుణ్ణి చిత్తు చేయగలడు. అతని రథం యుద్ధభూమిలో కూరుకుపోయింది. ఆ సమయంలో కృష్ణుడు, అర్జునుణ్ణి బాణాలు కర్ణుడిపై సంధించమన్నాడు. కర్ణుడు అది తగినపని కాదన్నాడు. ఆ దశలో మహాభారత యుద్ధంలో చెలరేగిన వాగ్యుద్ధానికి సాటి వచ్చేది మరెక్కడా జరిగి వుండలేదు. కృష్ణుడు ఎన్నో సంఘటనలను కవిత్వ రూపంలో వివరిస్తూ ప్రతిదానికీ చివరన "ఆనాడేమాయెను నీ నీతి" అని దెప్పి పొడిచాడు. ఈ విధమైన వాగ్విలసనలో ఆ కొంచెం సేపైనా తీర్పులన్నీ మూగబోయాయి. విశ్లేషణాత్మక బుద్ధి కుశలత అంతా ఊడ్చివేయబడింది. అప్పుడు ప్రతివాళ్ళూ గుర్తుకు తెచ్చుకుంటారు దుర్యోధనుని నిండుసభలో ద్రౌపది వలువలూడ్చిన తీరును. ఆ సభలో కర్ణుడూ ఉన్నాడు, భీష్మాచార్యుడూ ఉన్నాడు. వాళ్ళంతా దుర్యోధనుని సొమ్ము తిన్నవాళ్ళే. సొమ్ము తినటం వల్ల కొంత పక్షపాతం ఏర్పడుతుంది. పైగా సొమ్ము యిచ్చినవాని పక్షాన వాళ్ళు నిలువవలసి ఉంది. ద్రౌపది కృష్ణుణ్ణి గుర్తు చేసుకోగానే చీర ఎంత లాగినా తరగనంత పెద్దదిగా మారిపోయింది. అలా వాళ్ళ బాంధవ్యంలో చెప్పనలవిగాని సౌకుమార్యం అంతరంగపు లోతుల్లో దాగివుంది.

### గీతా గానం

కృష్ణ భక్తులు ఆయన ప్రతి చర్యకు ప్రత్యామ్నాయ వ్యాఖ్యానాలు చేస్తుంటారు. ఆయన వెన్న దొంగిలించింది తన మిత్రులకు పంచేందుకంటారు. వాళ్ళ అమ్మను ఉడికించి ఉల్లాస పరిచేందుకు అలా చేసాడంటారు. బాల్యచేష్టల్ని నాటకంలో మాదిరి చేసి చూపుతూ రానున్న తరాలకు ఆదర్శ బాల్యపు అందాలకై కలలుగనేందుకు కృష్ణుడు అలా చేశాడంటారు. కృష్ణుడు తనకైతానేమీ చేయలేదనీ, ఎవరికోసమో అవన్నీ చేయటం జరిగిందేనట. వాళ్ళంతా ఆయనలో భాగమేనట. ఆయన రాధను దొంగిలించాడు. ఆయన కోసం మాత్రం కాదు. ఆమెకు పరమానందం లభింప

చేసేందుకూ కాదు. తరతరాలుగా లెక్కలేనంత మంది స్త్రీల ఆత్మలు శరీరాల నుండి బయటకు వచ్చి పరమాత్మతో లీనమయ్యేందుకట. అటువంటి వ్యాఖ్యలతో అసలేం పని? ప్రపంచమంతటా గానం చేయబడే భగవద్గీతకు చెందిన కృష్ణుడు తెలియందెవరికి? ప్రపంచం మొత్తంలోకీ భారతదేశంలోనే దర్శన శాస్త్రం పాటల రూపంలో వెలువడింది. ఆలోచన కథారూపంగాని, పద్యరూపంగానీ ధరించకుండానే పాటల రూపంలో వెలుగులోకొచ్చింది. తమ అనుభవాల ద్వారా మునులు అందించిన సత్యం అనేక ఉపనిషత్తులుగా గానం చేయబడింది. తరువాత పండితులు వాటి మధ్య తేడాలను ఎంతగా వివరించినా కృష్ణుడు వాటన్నింటినీ కాచి వడపోసి వాటికంటే శుద్ధమైన సారాన్ని తయారుచేశాడు. కృష్ణుడు తన శుద్ధమైన ఆలోచనల్ని గీతగా గానం చేశాడు.

కృష్ణుడు ఆత్మను గురించి గానం చేశాడు. దానిని గ్రహించలేని వాళ్ళు సైతం ఆయన మాటలగారడీలో పడి ఆత్మ అనశ్వరమనీ, దానికి నీరూ, నిప్పూ, గాలి ఏవీ అంటవనీ, శరీరం కేవలం పైకప్పు మాత్రమేననీ, అది నశిస్తుందని తెలుసుకుంటారు. అతడు కర్మ (పని)ని గురించి పాటలు పాడతాడు. ఫలితాన్ని ఆశించకుండా పనులు చేసుకుంటూ పోవాలంటాడు. వాటికి ప్రాతినిధ్యం వహించటం గాని, కారణంగా నిలవటం గాని, అంటిపెట్టుకొని ఉండటం కాని చేయరాదంటాడు. అతడు సమదృష్టిని గూర్చి గానం చేస్తాడు. అది సుఖ దుఃఖాలు, జయాపజయాలు, ఉష్ణం–శీతలం, లాభనష్టాలు వంటి జీవితంలోని అనేకానేక ద్వంద్వాలన్నింటా సమదృష్టిని నిలపాలంటుంది. సమత్వం అనే పదం విషయంలో భారతదేశపు భాషలన్నీ నిరుపమానంగా నిలుస్తాయి. అవి బాహ్యమైన సమతను, అంతరంగపు సమదృష్టిని రంగరించి అందిస్తాయి. బొమ్మ బొరుసు వంటి ఈ భావాన్ని కృష్ణుడు మరింత  స్పష్టంగా గానం చేసి ఉండవలసిందని అన్పిస్తుంది. సమత సమాజానికి సంబంధించినది. సమదృష్టి వ్యక్తికి సంబంధించినటువంటిది. దాని ద్వారా విభజింపబడిన దానిలో సైతం అఖండాన్ని చూడగల్గుతారు. అటువంటి గారడీ, ఆలోచనల గానానికి దూరంగా ఏ భారతీయ శిశువు పెంచబడినాడు? కృష్ణుడు తనకు తానే సమర్థించుకునేందుకు తన మొత్తం పెంపకాన్నే కాదంటాడు. కడకు కృష్ణుడు ప్రతివాళ్ళను దుఃఖంలో ముంచెత్తుతాడు. అదెలా ఉంటుందంటే, గుండె నిరంతరం అలుపు సొలుపూ లేక కొట్టుకోవటం తన కోసం గాక ఇతర

అవయవాల కోసమైనట్లుగా ఉంటుంది. ఇతర శరీరావయవాలు కూడ అంతగా పనిచేస్తే ఆ గుండె అలా కొట్టుకోవటం ఎందుకు? ఆ ఎగురుబాటు తనమేల? కృష్ణుడు గుండె వంటివాడు. తరాల తరబడి మనుష్యులు తనవలె మనగలగాలని చాటి చెప్తున్నాడు. కాని వాళ్ళు అలా తయారుకారు. ఆయనలోని మోసాన్ని, హత్యానైజాన్ని ఆచరించేందుకు పూనుకుంటారు.

## కృష్ణుని కంటే రాముడు సాధించిందే అధికం

రాముని, కృష్ణుని పాత్రలను పోల్చి చూచినపుడు ఒక గొప్ప ఆసక్తికరమైన దృగ్విషయం మన ముందు నిలుస్తుంది. కృష్ణుడు క్షణక్షణం మాయలు కల్పిస్తాడు. వరదలు, సూర్యాస్తమయాలు తను కోరుకుంటే చాలు సంభవిస్తాయి. సాధ్యం, అసాధ్యం అనే వాటి మధ్య అడ్డుగీతను అతడు చెరిపివేశాడు. రాముడు అద్భుతాలను సాధన చేయలేదు. భారతదేశం, లంక మధ్య నిర్మించిన సేతువును కూడ సముద్రుడికి పూజాదికాలు నిర్వహించిన పిమ్మట నిర్మించినా రాయిపై రాయిపెట్టి నిర్మించినదే. అయితే ఇరువురి జీవన పర్యంతపు కృషిని సంపూర్తిగా బేరీజు వేసి చూస్తే, వాటి మధ్య ఒక సమతౌల్యం కోసం చూస్తే రామునికి మించిన అద్భుతాల సృష్టికర్త మరొకరు కన్పించరు. కృష్ణుడు సాధించిందేమీ లేదు. ఇరువురు సోదరులు ఒక స్త్రీ అయోధ్య నుండి లంక వరకు దాదాపు 2000 మైళ్ళు ప్రయాణించారు. బయలుదేరినపుడు ముగ్గురే ముగ్గురు. అందులో ఇద్దరే యోధులు. ఒకరికి ఆహారాన్ని సమకూర్చటమే పని. కాని వాళ్ళు తిరిగి వచ్చేటప్పటికి ఆ ముప్వురు మొత్తం సామ్రాజ్యాన్నే జయించుకొచ్చారు. మరి కృష్ణుడో ఉన్న సామ్రాజ్యాన్ని పాలించేవాళ్ళ చేతులు మారేట్లుగా మాత్రమే చేయగలిగాడు.

ఒక పరిమిత మూర్తిమత్వం గొప్పది కావటం, అర్థవంతమైనది కావటం, ఒక అఖండ మూర్తిమత్వం అల్పమైనది, సగమైనది కావటం ఒక ప్రహేళిక వంటిదని కనీసం రాజకీయరంగంలో అయినా తెలుసుకోగలుగుతాం. అది కాలం మన ముందుంచే చిక్కుముడిని అవగాహనలోకి తెస్తుంది. ఘటనలు ఘటిల్లని జీవితంలో ప్రతిక్షణం భారంగా, నీరసంగా గడుస్తూ అంతకాలం భరించటం కష్టమనిపిస్తుంది కాని కొంతకాలం పోయాక – ఒక దశాబ్దం కాని, ఒక జీవితకాలం గాని– అదెంత సులువో, ఎంత త్వరగా గడిచిపోయిందో అర్థం కాగలదు. ఇక ఉద్వేగ భరిత

జీవితంలో అయితే ప్రతిక్షణము అద్భుతమే. మనం అది అలాగే నిలిచిపోవాలని కోరుకున్నా చాలా వేగంగా గడిచిపోయినట్లు కన్పిస్తుంది. ఒకటి రెండేళ్ళు గడిచిన పిమ్మట వెనుదిరిగి చూస్తే అది సుదీర్ఘంగానూ, భారంగానూ గడిచినట్లు అనిపిస్తుంది. మర్యాదా పురుషోత్తముడైన రాముడు, పరిమిత భగవంతుడు. పరిమిత వ్యక్తిత్వంలో అగ్రగణ్యుడు, ఒక రాజకీయ అద్భుతాన్ని సాధించాడు. సంపూర్ణ భగవానుడు. తన చర్యల ద్వారా ప్రపంచాన్ని చకచ్చకితం గావించి దానికి జీవనసూత్రాన్ని మునుపెవ్వరు చెప్పని విధంగా అభ్యసింపజేసి అఖండ మూర్తిమత్వంతో విరాజిల్లిన కృష్ణుడు రాజకీయంగా సాధించిన దానిలో సారం కంటే నురుగే అధికం.

## రాముని వారసుడు గాంధీలో కృష్ణుని సాహసం

రాముని వారసుల్లో గాంధీని మించినవారు లేరు. మరణించే సమయంలో కూడ రామస్మరణే. పరిమిత వ్యక్తిత్వంతో అలరారే ఆ ఉత్తమ మానవుణ్ణి తన జీవితానికి నమూనాగా నిలుపుకొని గాంధీ తన దేశ వాసుల్ని ఆ విధంగా నడుచుకోమన్నాడు. అయితే గాంధీలో కృష్ణుని సాహసం కూడ ఉన్నట్లు కన్పిస్తుంది. అది కూడ చాలా శక్తిమంతమైన సాహసం. ఆయన లేఖలు, ప్రసంగాలు, ఇతర రచనలు రోజూనో, ప్రతి వారమో ప్రచురింపబడేవి చూస్తుంటే అవి క్రమబద్ధమైన మేళవింపుతో గుదిగ్రుచ్చినట్లు కన్పించేవి. కాని ఆయన మరణానంతరం వాటిని పఠిస్తూంటే వివిధ పరిస్థితులకు అనుగుణంగా అర్థవంతంగా, చాకచక్యంగా ఆయన తిప్పిన మలుపులు కన్పిస్తాయి. ద్వారక మధుర వైపుకు తిరుగు ప్రయాణం కట్టింది. ద్వారక సంద్రాల బిడ్డ హత్యకు గురి కావటంతో ద్వారక సముద్రతీరంలో అంత్యక్రియలు జరిగాయి. అయితే ద్వారకకు చెందిన ఈ బిడ్డ చూపంతా పరిమిత వ్యక్తిత్వంలో అలరారే అత్యుత్తమ పురుషుని వైపే. అయోధ్య మాదిరిగా తన వారసత్వాన్ని తిరిగి నిర్మించుకోవటంలో కృతకృత్యుడయ్యాడు గాని ఆసక్తికరమైన నిరుపమానత కలబోయటంలో మాత్రం కాదు.

## శివుడు మూడో కన్ను తెరిస్తే

రాముడు, కృష్ణుడు మానవులుగా జీవించగా శివుడు ఆది, అంతము లేని వాడయ్యాడు. భగవంతుని వలె అతడు అనంతుడు. అయితే భగవంతుడికీ, శివుడికీ

తేడా ఉంది. శివుడి జీవితకాలంలో కొన్ని ఘటనలు జరిగాయి. మరెన్నో కొండ గుర్తులున్నాయి. కనుక దేవునికి మించి శివుడు పరిమిత రహితుడు. బహుశా మనిషికి తెలిసినంతలో శివుడనేది ఒక్కటే పరిమిత రహిత కల్పిత గాథ లేదా భావన. ఈ విధంగా అతణ్ణి అందుకోగలవాడు మరొకడు లేడు.

ప్రేమను జనింపజేసే దేవుడు కామునిపై శివుడు మూడోకన్ను తెరవగానే కాముడు కాలి బూడిదయ్యాడు. కాముని భార్య, ప్రేమల దేవేరి, రతీదేవి అది తెలిసి కన్నీటితో తడిసి ముద్దయిన కన్నులతో తిరిగి తన భర్తను తనకు ఇమ్మని వేడుకుంది. నిజమే, కామునిది ఘోర అపరాధమే. ఘనమైన దేవుడు శివుడు తపమాచరిస్తూండగా, అందులోనూ ఆయన మనస్సు నిశ్చలంగా, నిరాకారంగా వున్న సమయంలో కోరిక రగిలించి శివుడి తపస్సును భగ్నం చేశాడు. ప్రేమ గురి తప్పింది. అతడు భస్మమయ్యాడు. అయితే ఉల్లాసంతో ఎల్లప్పుడూ పొంగిపొర్లుతూ వుండే రతీదేవిలో తొలిసారిగా దుఃఖాన్ని చూస్తాం. ఆమె విధవ అయ్యింది. ప్రపంచం అతి భయానక ప్రారబ్ధం అంచున నిలిచినట్లయ్యింది. ప్రేమించుకోవటం అనేది మున్ముందు ప్రేమ లేకుండా జరిగిపోతుంది. ఆ తప్పిదాన్ని మన్నించలేక ప్రపంచపు అతిభయానక ప్రారబ్ధాన్ని చూసో లేక దుఃఖితురాలైన రతీదేవిని చూసో శివుడికి దయ కలిగింది. కామునికి ప్రాణం పోసాడు – అయితే అశరీరంగా. అప్పటి నుండి కామునికి రూపం లేదు. శరీరం లేదు. కాముడు ఎక్కడైనా ఉండవచ్చు. నిషేధమన్నది లేదు. ఎందులో అయినా, ఎవరిలో అయినా ప్రవేశించవచ్చు. అదే విధంగా అతడు విసిగించినా కనిపించడు. ఇదంతా ఎంతో ఎత్తున పర్వతశ్రేణిలోని కైలాసంలో జరిగి వుంటుందని భావిస్తారు. ఇక ఆ కైలాసం ఎటువంటిది – హాయిని గొలుపుతూ పరిశుభ్రంగా ఉండే నీటితో నిండిన మానససరోవరం వంటిది. గొప్ప జలాశయంలో హంసలు ముత్యాలు ఏరుతూ ఉంటాయి. అలాగే రక్తస్థల్ వద్ద నీళ్ళు ఎంతో లోతుగా నల్లగా ఉండి అందులో దుమికేందుకు అలవికానిదై ఉంటుంది. ఇక కైలాసం సంవత్సరం పొడవునా మంచుతో కప్పబడి ఉంటుంది. ఏకాంత నిశ్శబ్దం రాజ్యమేలుతూ ఉంటుంది. మరే ఇతర పర్వత ప్రాంతాల్లో లేని విధంగా ఆటంక రహితంగా ఉంటుంది. హిందూ పురాణ గాథల ప్రకారమైతే అది విశ్వానికి కేంద్రం. భూమండలంపై అత్యంత రమణీయ ప్రదేశం.

### శివునిలోని అసుర దుఃఖం

మతం, రాజకీయాలు, దైవం, జాతి లేదా ప్రజలు అంతా కలగలుపే. అది అన్ని చోట్లా అన్ని కాలాల్లో జరిగిందిగాని భారతదేశంలో మాత్రం మరీ అధికంగా. శివుడి ఘనకార్యాలు చాలా వున్నాయిగాని, వాటిల్లో చెప్పుకోదగినది పార్వతి మరణానంతరం శివుడిలో పెల్లుబికిన అసుర దుఃఖం. శివుడు పార్వతి శవాన్ని వీపుపై, భుజాలపై మోస్తూ దేశమంతా తిరిగాడు. పార్వతి శరీరంలోని భాగాలు ఒక్కొక్కటే ఊడిపోతున్నాయి. అయినా శివుడు పార్వతి చివరి శరీరభాగం పడిపోయే వరకూ తిరుగుతూనే ఉన్నాడు. మరి ఏ యితర ప్రేమికుడుగాని, దేవుడుగాని, రాక్షసుడుగాని లేదా మానవుడు గాని, అలా అరమరికలు లేని సాహచర్యపు సంపూర్ణ గాథను మనకు మిగల్చలేదు. అది అంతటితో ఆగదు. శివుడిగాథ భారతదేశపు నశింపులేని, పవిత్రమైన అఖండతను పట్టి చూపుతుంది. ఎక్కడెక్కడైతే పార్వతి శరీరభాగాలు పడిపోయాయో అక్కడ పవిత్ర తీర్థాలు వెలిసాయి. వారణాసిలో కెంపుల పోగుతో అలంకరించుకొన్న చెవిపోగు పడిపోయింది. అదే మణికర్ణిక. నేటికీ అక్కడ దహనసంస్కారాలు జరిగితే మోక్షం పొందటం నిస్సందేహమంటారు. తూర్పున గల కామరూప్‌లో పడిన శరీరభాగం కారణంగా అక్కడి పవిత్ర భావన వందలాది తరాలు మారినా చెక్కుచెదరలేదు. అమ్మమ్మలు, నాయనమ్మలు, ఆ తూర్పుప్రాంతపు స్త్రీలను గురించి హెచ్చరికలు చేస్తూ ఉంటారు. వాళ్ళు వాళ్ళ మగవాళ్ళను మంత్రతంత్రాలతో మచ్చికయ్యే పశువులుగా మార్చేస్తారట.

### బ్రహ్మ గొప్పా? విష్ణువు గొప్పా?

సృష్టికర్త బ్రహ్మ, సంరక్షకుడు విష్ణువుల్లో ఎవరు గొప్ప అనే ఆధిపత్యపు పేచీ వచ్చిపడింది. తీర్పు చెప్పమని లయకారుడైన శివుడి వద్దకు వెళ్తారు. వాళ్ళను తను ఆది అంతాలను వెతకమన్నాడు – ఒకళ్ళను తల వైపు నుండి, మరొకళ్ళను కాళ్ళవైపు నుండి. వాళ్ళల్లో ఆది, అంతాలను ఎవరు ముందుగా చూచి తిరిగి తన వద్దకు చేరుకుంటారో వాళ్ళు విజేతలుగా నిలుస్తారన్నాడు. ఆ వెతుకులాట కొన్ని యుగాలు సాగింది. ఇరువురూ అపజయం పాలై తిరిగి వస్తారు. శివుడు వాళ్ళలోని గర్వానికి బాగానే బుద్ధి చెప్పాడు. ఈ విషయమై త్రిమూర్తులు పకపకా నవ్వుకుని వుంటారు కాని మిగతా సందర్భాలలో చాలా గాథల్లో విష్ణువు కూడా అనంతుడని, అతని

నిద్ర, శరీర పరిమాణం కూడ హద్దు లెరుగవని తెలియవస్తుంది. అయితే శివుని పరిమాణం మాత్రం అనంతంగా నిర్ణయింపబడింది. అందువల్లనే ప్రత్యేకంగా నిర్వచింపబడటం. మరో కథలో శివుని కుమారులిరువురి మధ్య వివాహం విషయంలో వివాదం తలెత్తింది. పందెం వాళ్ళిద్దరిలో ఎవరైతే సమస్త విశ్వాన్ని తిరిగివచ్చి శివుని ముందు నిలుస్తారో వాళ్ళు గెలిచినట్లు. అందం, ఆరోగ్యాలతో తులతూగే కార్తికేయుడు ఒక్క నిముషం కూడ వృధా కాకుండా పందెపు పరుగు ప్రారంభించాడు. గణేశుడు, ఏనుగు తొండంతో, సంప్రదాయబద్ధంగా ఉదాసీనతకు అలవాటుపడిన వానిగా ఆలోచిస్తూ, విభ్రాంతి చెందుతూ చాలాసేపు అలాగే కూర్చుండిపోయాడు. అనుకోకుండా తన మెదడులో ఓ మెరుపు మెరిసింది. కళ్ళల్లో కొంటెతనం తొంగి చూసింది. హడావిడేమీ పడకుండా తన తండ్రి చుట్టూ ప్రదక్షిణ చేసి పందెం గెలుచుకున్నాడు. కథగా కల్పనలో అది హడావిడిగా, ఆలోచన లేకుండా చేసే పనికంటే యుక్తియుక్తంగా నిదానంగా చేసినందువల్ల లభించే ప్రయోజనాన్ని వివరించినా ముఖ్యంగా అది శివపురాణంలోని భాగమే. శివుడు అనంతుడు అయినా ఏడడుగులతో ఆయన్ని కొలిచే వీలుంది. వాస్తవానికి శివుని శరీరం కూడ పరిమితి లేనిదే.

## హాస్య రసోత్పత్తి

ఏనుగు తొండంతో గణేశునిది ఒక నిరుపమాన వ్యక్తిత్వం. తండ్రి పనితనమే గాక తన లోతైన, నిలకడగల వివేచన కూడ తోడయ్యింది. అతడు చిన్నవానిగా వున్ననాడే పార్వతి తాను స్నానానికి వెళ్తూ కావలి ఉంచి ఎవరినీ లోపలికి రానివ్వ వద్దంది. శివుడు నెట్టుకొని లోపలికి వెళ్ళే ప్రయత్నం చేశాడు. అయితే విధేయుడైన గణేశుడు అడ్డుకున్నాడు. తండ్రి తన కుమారుణ్ణే హత్య చేశాడు. పార్వతి దుఃఖానికి అంతే లేదు. అంతలో అటుగా జీవంతో తిరుగాడుతూ ఓ ఏనుగు కన్పించింది. శివుడు ఏనుగు తల నరికి గణేశుని మొండేనికి అతికించాడు. ఇక ఆనాటినుండి మహా తెలివైన ఈ గజానన దేవుడు, అటు మానవుల తెలివితేటల్ని, ఇటు ఏనుగు విధేయతను పుణికిపుచ్చుకుని మానవులతో విడదీయరాని సంబంధాన్ని కలిగివున్నాడు. హిందూ గృహాలలో జరిగే ప్రతి కార్యక్రమం ఆయన స్తోత్రంతో ప్రారంభం కావల్సిందే. ఆయనకు నమస్కరిస్తే చాలు విజయం ఖాయం. అయితే ఈ విషయంలో శివుడు తన స్వభావానికి వ్యతిరేకంగా నడవలేదుగదా అని నేను తరచూ ఆశ్చర్యానికి

గురవుతూ వుంటాను. ఆయన చేసిన పని సమర్థనీయమా? గణేశునికి తిరిగి ప్రాణం పోసి పార్వతి దుఃఖాన్ని బాపినా తాను చంపిన గున్న ఏనుగు తల్లి దుఃఖం మాటేమిటి? అయితే దానికి సమాధానం అసలా ప్రశ్నలోనే ఉంది. కొత్తగా ప్రాణం పోసుకొన్న గణేశునిలో అటు ఏనుగు, ఇటు పాతగణేశుడు సజీవులయ్యారు. ఏ ఒక్కరూ చనిపోలేదు. అటువంటి నిరంతర ఆనందానికి తెలివితేటలకు ఎంతటి సజీవ తార్కాణం. మానవుణ్ణి ఏనుగును కలగలిపి చేసిన ఆ హాస్యరసోత్పత్తి ఎంతగా కొనియాడాలి!

అయితే శివుడి మరో చర్యను మనం సమర్థించటం కొంచెం కష్టమే. అతడు పార్వతిపై పోటీకి నృత్యం చేశాడు. అడుగడుగులో పార్వతి శివుణ్ణి మించిపోయింది. వ్యవహారం పతాక స్థాయికి చేరుకుంది. శివుడు తన ఎడమకాలును పైకెత్తి ఆడాడు. పార్వతి దిగ్భ్రాంతి చెందింది. నిరుత్తర అయింది. మర్యాదగల మగువ అటువంటి ఆంగికాన్ని ప్రదర్శింపజాలదు. తన భర్త అవలంబించిన ఈ అక్రమ పద్ధతికి అవాక్కయింది. అయితే ఛాందస ప్రపంచం దానిని అశ్లీలమని, దాని బారినుండి స్త్రీ మర్యాదను కాపాడాలని ఎంతగా గింజుకున్నా జీవన నాట్యకేళిలో అటువంటి కుదుపులు సహజమే. శివుడు అటువంటి శక్తిమంతమైన ఆంగికాన్ని ప్రదర్శించటం అది వీగిపోతున్న తనని పైకి నిలిపి తుది నిర్ణయానికి దారి తీసి తన గెలుపును ఖాయపరుస్తుందనా లేక సమం చేస్తుందనా లేక జీవన నాట్యకేళిలో అలా ఒక్కొక్క స్థాయి నుండి మరో స్థాయికి చేరుతూ చివరకు పతాక స్థాయికి చేరుకోవటమా?

### జీవితమే కారణం, ఫలితాల ఎడతెగని గొలుసు కూడ

చేసిన పని నిస్సంశయంగా న్యాయ సమ్మతం కానిదిగా తేల్చి చెప్పే ఏ ఒక్క పనీ శివుడు చేసిన పాపాన పోలేదు. ఈ విధంగా ఎవరి చర్యలయితే వాటంతట అవే సమర్థనీయాలు కాగలవో అటువంటి ఏకైక సృజనకర్తగా మనిషి శివుణ్ణి గుర్తించాడు. ఎవ్వరూ తాము చేసే పనికి కారణాన్ని వెతకవలసిన పనిలేదు. తరువాత దాని ఫలితం కోసం ఎదురు చూడనవసరం లేదు. దాని సమర్థనీయత కోసం సన్నద్ధం కావలసిన పనిలేదు. అసలు జీవితమే కారణం, దాని ఫలితాల ఎడతెగని గొలుసు అటు దేవుడు, ఇటు మానవుడు వాళ్ళ చర్యలకు ఏదో ఒక పరోక్ష సమర్థనీయతను సమకూర్చుకునే ఉంటారు. అటువంటి పరోక్ష నియంత్రణలు ఒక్కోసారి ఎంతగానో దుర్వినియోగానికి దారి తీస్తాయి. అపచార పూరిత కౌశలమయ

సహేతుకత్వం సంపూర్ణంగా న్యాయసమ్మతం కాని చర్యల్ని క్రమబద్ధీకరించేందుకు ఉపయోగపడవచ్చు. దానివల్ల అసత్యం నుండి సత్యం ఉద్భవింపజేస్తున్నామనవచ్చు. బానిసత్వం ద్వారా స్వేచ్ఛ లభించిందనవచ్చు. హత్య ప్రాణం పోసేందుకే అనవచ్చు. అటువంటి క్రూర హేతురీతికి వ్యతిరేకంగా ఒకే ఒక్క నివృత్తి మార్గం ఉంది. అదే శివ భావన. ఎందుకంటే ఆయన తక్షణ సిద్ధాంతపు అవతారం. అతని ప్రతి చర్యలోను తక్షణ సమర్థత నిండివుంటుంది. దానికోసం అంతకుముందు కాని, తరువాత కాని, చేసిన దానిని ఎవ్వరూ పరిశీలింపవలసిన పనిలేదు.

## నీలకంఠుడు - అర్ధనారీశ్వరుడు

ఈ అపరిమిత తక్షణ సిద్ధాంతపు పురాణగాథ ప్రపంచానికి మరో రెండు బ్రహ్మాండమైన దృశ్యాలను మన కళ్ళముందు నిలుపుతుంది. దేవతలు, రాక్షసులు సముద్రాన్ని చిలుకగా అమృతం లభించటానికి ముందు విషం పుట్టుకొచ్చింది. ఆ విషాన్ని ఎవరో ఒకరు త్రాగవలసి ఉంది. శివుడు దేవదానవ యుద్ధంలో పాలుపంచుకున్నది లేదు. వాళ్ళంతా ఒకళ్ళకొకళ్ళు సహకరించుకుంటూ చేసిన సముద్ర మథనంలోనూ పాలుపంచుకున్నది లేదు. కథ ముందుకు సాగటానికా అన్నట్లు శివుడు హాలాహలాన్ని గుటకేశాడు. ఆ విషాన్ని కంఠంలోనే నిలిపేశాడు. అందువల్లనే నీలకంఠుడయ్యాడు. మరో దృశ్యం సర్వకాలాల్లోనూ, సర్వవేళలా ఆరాధనీయంగా కన్పిస్తుంది. తన ప్రక్కనే నిలిచిన పార్వతిని పూజించేందుకు ఒక భక్తుడు నిరాకరించటంతో అర్ధనారీశ్వర రూపం ధరించాడు- సగం పురుషుడు, సగం స్త్రీ. ఆపాదమస్తకం ఆ రూపాన్ని రూపు కట్టించుకోవటంలో తరచూ ఇబ్బంది పడేవాణ్ణిగాని ఆ రూపు కడు రమణీయం.

## పరిమితి రహిత మనస్సు - విశాల హృదయం - పరిమిత జీవనం

ఈ పురాణాల గాథలు అంతరాయాలతో అంతమౌతున్న తీరును తెలియజెప్పే ఉద్దేశ్యం నాకు లేదు. శతాబ్దాల తరబడి అవి భ్రష్టత్వానికి గురవుతూ వచ్చాయి. పరిపక్వమై సమగ్రతను సాధించవలసిన బీజం పుచ్చిపోయిన దశకు చేరుకొన్నా కొన్ని సందర్భాలలో అది విత్తబడుతూనే ఉంది. రాముని భక్తులు భ్రష్టులై భార్యలను వదిలేస్తున్నారు. కృష్ణుని భక్తులు దొంగలవుతున్నారు. శివ భక్తులు కుళ్ళిన మాంస ప్రియులవుతున్నారు. భ్రష్టత్వం, వక్రీకృతం అయ్యేక్రమంలో పరిమిత వ్యక్తిత్వం ఇరుకై

పోతున్నది. అఖండమేమో ఛిన్నాభిన్నమై పతనమవుతున్నది. పరిమిత రహితమేమో కల్పితగాథగా, నిరాకారంగా మారిపోయింది. భ్రష్టత్వం పొందిన రాముడు ఇరుకు వ్యక్తిత్వానికి పరిపక్వత సిద్ధింపజేస్తున్నాడు. దిగజారిన కృష్ణుడు పతనమైన వ్యక్తిత్వాన్ని, పతనమైన శివుడు రూపరహిత మూర్తిమత్వాన్ని అందిస్తున్నారు. రాముడు అటు పరిమితంగానూ, ఇటు సంకుచితంగానూ, కృష్ణుడేమో అటు అఖండం గానూ, ఇటు జారత్వంతోనూ, శివుడు ఇటు మితిరహితంగా అటు ఖండఖండాలుగా రెండందాలుగా జీవనం సాగించారు. దీనికంతటికీ పరిష్కారాన్ని సూచించే మూర్ఖత్వం నా వద్ద లేదు. అయితే ఇలా మాత్రం చాటిచెప్పగలను. "ఓ భారతమాతా! శివుడి మనస్సును, కృష్ణుని హృదయాన్ని, రాముని మాటల్ని చేతల్ని మాకివ్వు. మమ్మల్ని పరిమితిరహిత మనస్కులుగానూ, విశాల హృదయులుగానూ సృజియించి పరిమితులుగల జీవితాన్ని అందించు."

(జులై 1956)

# వసిష్ఠుడు – వాల్మీకి

అనువాదం : **సురమౌళి**

జైళ్ళ మంత్రి
ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం
లక్నో

జిల్లా జైలు
లక్నో. 10–12–57

గౌరవనీయులైన జైళ్ళ మంత్రిగారికి,

మీరు విధానసభలో చెప్పిన జవాబులను గురించిగానీ, జైలును మీరొక సర్పగృహంగా మార్చివేసినట్లు రుజువయ్యే సంఘటనలను గురించిగానీ నేను మీకీ ఉత్తరం రాస్తున్నానేమోనని మీరు భయపడవలసిన పనిలేదు. జైలులో అనేకరకాల ఖైదీలు ఉంటున్నారు. వీరిలోనుంచి దీర్ఘకాల శిక్ష అనుభవిస్తున్న వారి మనస్సులను సులభంగా చెడగొట్టవచ్చు. ముఖ్యంగా అలవాటుగా నేరస్థులైనవారి మనస్సులను అతి సులభంగా చెడగొట్టవచ్చు. జైలు అధికారులు, పోలీసులు ఇటువంటి 20–30 మంది ఖైదీలను, వెనుకనుంచి తోస్తూ నా మీదికి పురమాయించారు. జైలులోవున్న ఖైదీ, తలచుకున్నా ఎక్కడికీ పరిగెత్తలేడు, దాక్కోవడం కూడా సాధ్యం కాదు. ఇతర ఖైదీలతో అతన్ని కొట్టించడమంటే అతని మీదికి పాములను వదలడం వంటిదే. ప్రాణమున్న సర్పాలతో నిండిన జంతుప్రదర్శనశాలలోనికి మనిషిని ముందుగా తోసి, బయటినుంచి దానికి తాళం వేయడం, ఆ తరువాత ఎటునుంచి వీలైతే అటునుంచి మరి కొన్ని పాములను అందులోకి తోలడం వంటిదాన్నే మా పట్ల మీరు చేస్తున్నారు.

నా ఆరోగ్యం గురించి మీరు ఏమన్నప్పటికీ, నా ఆరోగ్యం గురించి మీకు నేను రాయనక్కరలేదు. మానవత్వం గురించి కూడా రాయను. ఒక దశ తరువాత ఇటువంటి విషయాల గురించి మాట్లాడుకోవడం ఉండదు. "మీరు చట్టం ప్రకారమే నడుస్తున్నారా?" అని మిమ్మల్నీ, మీ ప్రభుత్వాన్నీ నేను అడగదలచుకున్నాను. మీరు ప్రస్తావించిన నియమాలను పాటిస్తున్నారా? నన్ను ఇరవై, ముప్ఫయిమంది చేత చుట్టు ముట్టింపజేసి, బలవంతంగా మేజిస్ట్రేటు ముందుకు తెచ్చి కూర్చోబెట్టారే, ఏ చట్టాన్ని అనుసరించి చేశారో మొదట ఆ చట్టం పేరు చెప్పండి! బలవంతపెట్టే అధికారం ప్రభుత్వానికి ఏ చట్టం ప్రకారం లభించింది. అంతకుముందునుంచే జైలులో బందీ అయివుండి, జిల్లా జడ్జిగారికి, మున్ముందు కేసులతో తనకు సంబంధమే లేదని ముందుగానే రాసిన వ్యక్తిని బలవంతపెట్టే అధికారం ప్రభుత్వానికి సంక్రమింప చేసిన చట్టాన్ని చూపించండి! ముగ్గురు వ్యక్తుల చేత మేజిస్ట్రేటు నా వేలిముద్ర వేయించుకోవడం అనేది ఏ చట్టం క్రిందకు వస్తుందో కూడా చెప్పండి. ఈ రెండు చర్యలకు అధికారం యిచ్చే చట్టాన్ని చూపించలేకపోయినట్లయితే, మీలోని చాలామంది, హత్యాప్రయత్నం నేరాన్ని చేసిన దోషులవుతారు. అయితే మీకు నేను రాయలచుకున్నది వేరే విషయాలు, వేరే నియమ నిబంధనల గురించి.

ఖైదీలకు మీరు పుస్తకాలను ఏ నియమాలను అనుసరించి ఇస్తున్నారు? నా పేరుతో శ్రీ నరేర్కర్‌గారి "భూమి కన్యసీత" అనే పుస్తకం వచ్చింది. నాకిది నవంబరు 30 నాడు అందింది. మొదటి పేజీ చిరిగి వున్నది. పంపినవారు దాని మీద ఏదన్నా రాసి ఉన్నందువల్ల బహుశా అలా చేసి ఉంటారు. పంపిన ఉత్తరం నాకు 6-7 నవంబరుకే అందింది. అందువల్ల 20 లేదా 25 రోజులదాకా మీరో లేక మీ మనుషులో దీన్ని ఆపిపెట్టారన్న అనుమానం నాకు కలుగుతున్నది. భారతదేశంలోని జైళ్ళ స్వభావానికిది అనుకూలంగానే ఉన్నది. అర్థంకానిదాన్ని ఆపి పెట్టడం, లేదా చించిపారేయడం. నాటకం మరాఠీ భాషలో ఉన్నది. ఇలా ఇంకా ఎన్ని పుస్తకాలనూ, పత్రికలనూ ఆపి పెట్టారో ఎవరికి తెలుసు? 'చౌఖంభా' వారపత్రికనూ, 'మాన్‌కైండ్' మాసపత్రికనూ కూడా ఆపిపెట్టారని నా అనుమానం.

పుస్తకాలకు సంబంధించి మీ నియమాలు యిలాగే ఉంటే చాలా చెడ్డవి. మీరు చేసింది చాలా చెడ్డ పనే. కాని దానికి మంచి ఫలితం వచ్చింది. నవంబరు

30 నాటి రాత్రి అంతానూ, డిసెంబరు 1 వ తేదీ పగలంతానూ నేను ఈ నాటకాన్ని చదువుతూ అత్యుల్లాసంగా గడపగలిగాను, లేకపోతే నవంబరు 30 నాటిరాత్రి వికలమైన మనస్సుతో గడపడం కష్టమయ్యేది. ఇక, నా తల్లి, మైథిలీకి – నా తండ్రి అవధుకు చెందినవారు. బహుశా రక్తం మీద మట్టి ప్రభావం ఉంటుందేమో! సీతకథ వాస్తవంగా జరిగిందా లేదా అనేది అనవసరమైన ప్రశ్న. భారతీయులందరి తలల్లోనూ మెదులుతున్న కథే ఇది.

మరాఠీ భాష ఇంత మధురంగా ఉండగలదని నాకు తెలియదు. మరాఠీ కర్కశమైన భాష అన్న నా చిన్నప్పటి అభిప్రాయాన్ని, ఈ పుస్తకం నాకు పంపిన ఆ కొంకణి బాలిక, శాంతినాయక్, మొదట్లోనే త్రుంచిపారేసింది. ఈ నాటకం చదివింతర్వాత ఆ అభిప్రాయం మరింత మటుమాయమైంది. నరేర్కర్ కూడా బహుశా కొంకణీయుడేనేమో? ఏమైనప్పటికీ మరాఠీ భాష కూడా ఇంతగా అనుస్వార ప్రియమైనదని నాకు ఇంతకుముందు తెలియదు. ఇంతటి అనుస్వార ప్రియత్వాన్ని భారతదేశంలోని మరే భాషలోనూ నేనిదివరకు చూడలేదు. సీత ఇలా అంటూ వుంటే– “ఆణి హెం లోకాంచం మ్హణణం శ్రీరామాంనా పటలం? ....మ్హణూనచ ఖలా ఇథం యా వ్యంసం వాటలం, కనీస ఉణంఉణం వాటతంతుత్యాంభ్యా వాంచూన్” ప్రపంచంలోని ఏ నటి దీన్ని అనాలని ముందుకురాదు? అని మనస్సుకు అనిపిస్తుంది. ఈ అనుస్వార ప్రియత్వాన్ని మీరు బహుశా అర్థం చేసుకొని ఉండరు. అవసరం కూడా లేదు. పుస్తకాలు మీ పరిధికి దూరమైనవని మీరు అర్థం చేసుకుంటే చాలు. అందుకని వీటిని ఆపకండి! ఖైదీలకిచ్చే రొట్టెముక్కల్లోంచి డబ్బులు మిగుల్చుకొనడానికే మీకూ మీ జైళ్ళ యంత్రాంగానికీ సమయం చాలదాయె. ఖైదీలకు వచ్చే పుస్తకాలను మీరు చదవకుండానే ఎవరివి వారికి పంపించండి! ఈ పుస్తకం నా దగ్గరికి వచ్చినందువల్ల మంచిపనే అయింది. ఇంగ్లీషుదేముంది, నిన్న మొన్నటి బాలిక అది. ఏదో వెయ్యిన్నర సంవత్సరాలది. మరాఠీ, బెంగాలీ, తమిళం మొదలైన భాషలు హిందీవలెనే, – హిందీ అంటే ఉర్దూ కూడా అందులోనే ఉన్నదనుకోండి – వేలాది సంవత్సరాల పురాతనమైన భాషలు. ఆరేడువేల సంవత్సరాల పురాతనమైనవి. వీటి మాతృకలు సంస్కృతం, ప్రాకృతం, తమిళం, ఈనాటి యుగానికి చెందిన మాటలు కొన్ని ఆంగ్లభాషలోనే అధికంగా ఉన్నమాట నిజమే. జర్మనీలో కొన్ని మాటలు ఇంకా అధికంగా ఉన్నాయి. మరికొంత కాలం గడిస్తే జర్మనీ–

ఇంగ్లీషు భాషలు రెండూ రష్యన్ భాషతో పోటీపడజాలని పరిస్థితి వస్తుంది. హిందీభాష ఇంకా పరిపక్వం కాలేదని, అందువల్ల ఆంగ్లభాషకే అంటి పెట్టుకుని వుంటున్న కాంగ్రెసు నాయకులు, సమయం ఉండగానే రష్యన్‌భాషకు అంటిపెట్టుకుంటే మంచిది. హిందీ-మరాఠీ భాషలు ఇంకా పరిపక్వం కాలేదా? నాట్యం రాక మద్దెల ఓడన్నట్లున్నది. మరాఠీని, హిందీని ఎవరైనా ఎందుకు వ్యతిరేకిస్తారో నాకసలు అర్థమే కాదు. ఊర్మిళ సీతను వ్యతిరేకించినట్లుగానే ఉన్నదిది.

భారతదేశంలో ఈనాడు బ్రతికివున్న నాటక రచయితల్లో శ్రీనరేర్కర్ సర్వ శ్రేష్ఠులని నేను ఎన్నడో విన్నాను. 'భూమికన్య సీత'ను చదివితే ఇది నిజమే అనిపించింది. భూమికన్య సీత, భూమి పుత్రుడు శంబుకుని కేంద్ర బిందువులుగా తీసుకుని ఈ నాటకం సాగుతుంది. అంటే స్త్రీ-శూద్రపునాదుల మీద. ఈ నాటకం పునాదులు చాలా బలీయంగా, రసవత్తరంగా ఉన్నాయి. భారతీయునికైతే అత్యంత బాధామయమైన గాథగా ఉంటుందిది. అతి పురాతనమైన బాధేకాదు, ఈనాటికీ కొనసాగుతున్న బాధ. నాటకంలోని స్త్రీ పాత్రలన్నీ ప్రాణవంతంగా ఉన్నాయి. సీత, ఊర్మిళ, వాసంతి, కుశిక- అందరూ. శంబుకుని చరిత్ర బలహీనంగా, నకిలీగా తయారైంది. అతని నాలుక మీద నకిలీ తీపిరసాన్ని అధికంగా ఎక్కించినట్లున్నది. ఇంతటి బలశాలి అయిన శూద్రుని శీలం ఆయన చేతుల్లో ఇంత బలహీనంగా ఎందుకు తయారైందో శ్రీనరేర్కర్‌గారే స్వయంగా ఆలోచించుకోవాలి. రాముని పాత్రలో కూడా అతిశయం ఆవరించింది. మర్యాద పురుషోత్తముడు తన మాటల్లో అతిశయాన్ని ప్రదర్శించడు. దృఢమైన మాటలను ఆయన ఒకేసారి అంటాడు- అనేకసార్లు కాదు. అయితే నేనిక్కడ 'భూమికన్య సీత'ను సమీక్షిస్తున్నానా ఏమిటి? నా కిక్కడ వాల్మీకి-వసిష్ఠుల పరంపరలను గురించి ప్రమేయం. ఈ ఉభయుల సంఘర్షణ ఈ నాటకానికి కేంద్రబిందువు.

ఇవన్నీ తెలిసివుండి కూడా ఈ నాడు వసిష్ఠ ప్రథను కొనసాగిస్తున్న ప్రభుత్వం నుంచి నరేర్కర్ వంటి రచయితలు చిన్న చిన్న దయాధర్మాలను ఎందుకు స్వీకరిస్తూ వుంటారో నాకు ఆశ్చర్యంగా ఉంటుంది. ప్రస్తుతం భారతదేశంలోని కళాకారులు ఆచరణహీనులే. సరే ఇదేమంత ప్రధానమైన సంగతి కాదు. 'భూమికన్య సీత' అన్న నాటకంలో వసిష్ఠుని నాలుకమీద సర్వదా 'శిరచ్ఛేదం', 'నిర్వాసనం', అన్నమాటలే మెదులుతూ ఉంటాయనేది ప్రధాన విషయం. రాముడు 'హూ, హూ' అని అంటూ

వుంటాడనుకోండి! ప్రధానంగా వసిష్ఠుని మాటే సాగుతుంది. అప్పటికీ కొన్ని పరిమితులూ, మర్యాదలూ ఉండనేవుంటాయి. ఈ నాడు భారతప్రభుత్వం, రాజగురువూ– రాజూ ఒక్కరే అయిపోయింది. ఈనాటి రాజుల నాలుక మీద కూడా "శిరచ్ఛేదం", "నిర్వాసనం" అన్నమాటలే మెదులుతుంటాయి. స్వార్థం, రూఢి, ఆచారాల పట్ల వసిష్ఠుడు ఎంత కటువుగా ఉండేవాడోఈనాటి రాజు కూడా అంతే కఠినంగా ఉంటున్నాడు.

భారత ప్రధానమంత్రి తల్లక్రిందులై పోతున్నాడు. ఎందువల్ల? ద్రవిడ కజగం వారు రాజ్యాంగ ప్రతులనూ, జాతీయ పతాకాలనూ తగలబెడుతున్నందువల్ల, లేదా దాని మనుషులు, బ్రాహ్మణులు స్నానాలు చేస్తున్నప్పుడు వారి జందేలను త్రెంచిపారేస్తున్నారు కనుక, వారి జుట్లు కత్తిరిస్తున్నారు కనుక. బహుశ రెండు విషయాలు ఆయన మనస్సులోనే పరిభ్రమిస్తూ ఉండవచ్చు. రాజ్యాంగం, సాంప్రదాయం, బ్రాహ్మణస్వార్థం ఇవన్నీ ఎలా ఒకేచోట ముడిపడ్డాయి. వసిష్ఠునిది సంపూర్ణ కళల అవతారం లాగున్నది. ద్రవిడకళగం వారు చేస్తున్నపని చాలా చెడ్డపని అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. రాజ్యాంగాన్నీ, జాతీయపతాకాన్నీ తగులబెట్టడం నేరం. ఎవరి జందేన్నయినా బలవంతంగా త్రెంచడం కూడా తప్పే. అయితే జంధ్యాలూ, జుట్లూ అంతరించిపోవడం అనేది ప్రస్తుతించాల్సిన సంగతే. ఒకవేళ శ్రీ రామస్వామి నాయకర్‌తో మాట్లాడటానికి నాకే కనుక అవకాశం లభించినట్లయితే, ఆయన హృదయంలో ప్రజ్వరిల్లే అగ్నిని ప్రశంసిస్తాను. అయితే ఆ అగ్నిని తప్పుడు పనులనుంచి మళ్ళిస్తాను. కాని రాజుగారేం చేస్తున్నారు? ఒక కఠినుడైన శంబుకునికి, కఠినాతికఠినుడైన వసిష్ఠుడుగా మారి జవాబు చెబుతున్నాడు. భారతదేశం నుండి వెళ్ళిపొండని ఒకసారంటాడు. 'నిర్వాసనం' అన్నమాట! మరొకసారేమో నిర్దాక్షిణ్యంగా అణచివేస్తాం, పిచ్చాసుపత్రులకూ, జైళ్ళకూ పంపుతామంటాడు– 'శిరచ్ఛేదం' అన్నమాట.

భారతదేశపు భాషకాదిది, నిజమైన భారతదేశపు మాట కానేకాదు. నిజమైన భారతదేశం, నిజమైన చైనాదేశం మాటలు మరొకరకంగా ఉంటాయి. పురాతన ధర్మాలు తమ విమర్శను విని సహిస్తాయి. నవ్వి పారేస్తాయి. అవసరం వచ్చినపుడే దృఢంగా మారుతాయి. నూతనధర్మాలు, పాశ్చాత్య, మధ్య ఆసియాలకు చెందిన

ధర్మాలు – వాటి స్వభావమూ, తమ విమర్శను సహించవు. అయితే కొందరు ధర్మహీనులైన హిందువులు ఈరోజుల్లో రామకృష్ణులను విమర్శించే పుస్తకాలను తగులబెడుతున్న మాట నిజమే. ఇటువంటి వారే విశాలమైన ఈ దేశాన్ని ముక్కలు ముక్కలు చేసేదాకా నిద్రపోరు. రామాయణాన్ని తగులబెట్టడం తప్పే, కాని అంతకన్నా తప్పు 'రామనింద' ను తగులబెట్టడం, రామనింద చేసినవాని తల నరకడం.

శ్రీమతి అంగ్‌సాన్ విషయం నాకు ఎప్పుడూ గుర్తుంటుంది. నేనామెను తిరుగుబాటుదారైన, ఆమె సోదరి విషయం అడిగాను. ఇప్పటికీ ఆమె తిరుగుబాటుదారే. శ్రీమతి అంగ్‌సాన్ హృదయంలో అనేకరకాలైన బాధలు సర్వదా ఉండి ఉండవేమో?అయినప్పటికీ ఆమె ఇలా జవాబు చెప్పింది. "నేను బర్మీయురాలిని. నా పిల్లలందరికీ తల్లిని, భక్తులకూ, తిరుగుబాటుదార్లకూ అందరికీ తల్లిని తిరుగుబాటుదారుల్ని శిక్షిస్తాను, అయినప్పటికీ వారు నా పిల్లలే కదా?" భారతమాత తన సంతానానికందరికీ తల్లే. తిరుగుబాటుదారులైన పిల్లలకు కూడా. నాగా సమస్యను ప్రధానమంత్రి సర్వనాశనం చేసిపారేశారు. ఇప్పుడు ద్రవిడ సమస్యను చెడగొట్టడానికి కూడా బయలుదేరారు. భారతమాత తన తిరుగుబాటు పిల్లలను శిక్షిస్తూ కూడా ప్రేమించగలదని ఆయనకు తెలియదు.

ఒకసారి 1937 ప్రాంతంలో ప్రస్తుత ప్రధానమంత్రి, ముస్లింలీగు ప్రదర్శనకారులను గురించి నాతో విచిత్రమైన విధంగా మాట్లాడారు. అప్పటి విధానసభల్లో ఈ లీగేయులు ప్రవేశించారు. వీళ్ళు కాంగ్రెసువారిని గెంటివేశారు. చాలా చెడ్డపని చేశారనడంలో ఎటువంటి సందేహమూ లేదుకానీ, ఈనాటి ప్రధానమంత్రి ఆనాడన్న మాటలు విని నేను విస్తుపోయాను. మేమిద్దరమే ఉన్నాం. ఏకాంతం. పంత్ చాలా బలహీనుడనీ, ఆయన స్థానంలో తాను ఉండినట్లయితే మిషన్ గన్నులతో జవాబు చెప్పి ఉండేవాణ్ణనీ అన్నాడీయన. అయితే అప్పటిదాకా నేనాయన్ను పూర్తిగా అర్థం చేసుకొని ఉండలేదు. అయినప్పటికీ నేను వ్యతిరేకించాను. ప్రజాస్వామ్యం, అహింసా సిద్ధాంతాలను విశ్వసిస్తున్న వాడివి ఇలా ఏ విధంగా మాట్లాడగలుగుతున్నావని అడిగాను. వెంటనే మాట మార్చాడు. నిజంగా మిషను గన్నును ప్రయోగించడం అని కాదు నా ఉద్దేశం. మాట వరసకు అలా అన్నానని సవరించుకున్నాడు.

ప్రధానమంత్రి మనస్సు మొదటినుంచి వసిష్ఠ బ్రాహ్మణ తామస ఆవేశంతోనే రంగరించుకుంటూ ఉన్నది. రాజసమైన రోషం కాదది. గాంధీజీ నౌఖాలి యాత్రకాలంలో కూడా తూర్పుబెంగాల్ బురద, నీరు, దట్టమైన చెట్లూ, చేమలూ, మొదలైనవి ఈయన మనస్సును బాగా కలిచివేశాయి. అందుకు అసలు కారణాలు వేరు. భారతదేశపు పటం నుంచి వాటిని పూర్తిగానే తుడిపివెయ్యాలనుకున్నారు. ఆవేశంలో ఒకసారి ఆయన నాతో– చివరికి హిందువులు హిందువులే– ముస్లింలు ముస్లింలే అనేంతదాకా వెళ్ళారు. ఆ సంగతి నాకు తెలియదుగానీ బ్రాహ్మణులు మాత్రం ఎప్పటికైనా బ్రాహ్మణులేనన్నాను. కోపాన్ని దిగమింగడం ఆయనకు తెలుసు. నోరుమూసుకున్నాడు. ఆ తర్వాత మాటమార్చాడు. ఇటీవల శ్రీరామలఖన్ చందాపూరి నాకొక ఆసక్తికరమైన సంగతి చెప్పాడు. సోషలిస్టు పార్టీలో అతడు చేరే విషయం ఆలోచనకే రానప్పుడు, కొంతకాలం క్రితం శ్రీ చందాపురి ప్రధానమంత్రిని, మంత్రివర్గంలోనూ, ఇతర  ఉన్నత పదవుల్లోనూ శూద్రుల సంఖ్య పెంచాలని కోరాడు. ప్రధానమంత్రి అందుకు అంగీకరించనైతే అంగీకరించాడు కానీ తిరిగి 'తమిళనాడు మంత్రివర్గంలో కూడా బ్రాహ్మణులను తీసుకోవాల'న్నాడు. అప్పుడు తమిళనాడు మంత్రివర్గంలో బ్రాహ్మణుడు ఒక్కడు కూడా లేడు. ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. తమిళనాడు జనాభాలో బ్రాహ్మణుల సంఖ్య  నాలుగు శాతమే. మిగతా అన్ని రంగాల్లోనూ బ్రాహ్మణులదే ఆధిపత్యం. తమిళ బ్రాహ్మణుడెవరైనా సరే దేశ విప్లవానికి, పునరుజ్జీవనానికీ, ఇతరులకన్నా అధికంగా ఉపయోగ పడేటట్లయితే, అతడు మంత్రివర్గంలో ఉంటేనే మంచిదని నా అభిప్రాయం. కాని బ్రాహ్మణుల ప్రయోజనాల కోసం, వారి ప్రాతినిధ్యం కోసమని అతనికి మంత్రివర్గంలో స్థానం కల్పించడాన్ని నేను బొత్తిగా ఒప్పుకోను. బలవంతునికి మరింత బలాన్ని ప్రసాదించడమా?

ఆచార సంప్రదాయాలు, వ్యక్తిగత స్వార్థం, ముఠాస్వార్థాలతో, వసిష్ఠ బ్రాహ్మణుల మనస్సులు నిండి ఉంటాయి. ఆచారాల కోసం చావటం, చంపడం అతనికి తెలుసు. ముఠాస్వార్థ ప్రయోజనాలను సాధించడానికి సర్వస్వాన్ని త్యాగం చేయగలరు. దానితోబాటే తనకు తన కుటుంబానికి లౌకిక ప్రయోజనాలను కల్పించుకోవడం అతని జీవితపు ధారావాహిక లక్ష్యం అయివుంటుంది. ఆచారాలు కూడా వీరివి దేశీయమైనవీ కావచ్చు. వారికి నచ్చినటువంటి విదేశీయమైనవి

కూడా కావచ్చు. వసిష్ఠ బ్రాహ్మణుల విశ్వాసాలూ, ప్రయోజనాలూ దెబ్బతిన్నట్లయితే సర్పంవలె పగ సాధించడానికి బుసకొడుతూ అవకాశం కోసం కాచుకుని కూచుంటారు.

బహుశా మీరు నన్ను అపార్థం చేసుకుని ఉంటారు. నా స్వార్థప్రయోజనాలు వంశపరంపరల దృష్ట్యా చూసినట్లయితే నేను వసిష్ఠ బ్రాహ్మణులకు మిత్రుణ్ణిగానే ఉండవలసింది. కోమట్లు ముఖ్యంగా ఎప్పుడోఒకప్పుడు టోకు వ్యాపారం చేసినందువల్ల సమాజంలో చాలా ఉన్నతస్థానాలకు ఎదిగిన కోమట్లు అనేక వేల సంవత్సరాలుగా బ్రాహ్మణులకు సన్నిహితంగా ఉంటూవచ్చారు. వంట బ్రాహ్మణులతో సేతానీలకూ, సరుకుల సరఫరా చేసే కోమటి ఆడవాళ్ళతో సేట్లకూ ప్రణయ సంబంధాలు కూడా వంశపారంపర్యంగా కొనసాగుతూ వస్తున్నాయి. కోమటి–బ్రాహ్మణ సమైక్యతకివి ప్రతీకలు. భారతీయేతిహాసానికి ఈ సమైక్యత కూడా ఒక కేంద్రబిందువు. దేశంలో జేబులకు కోమటి యజమాని అయితే, మనస్సుకు బ్రాహ్మణుడు యజమాని. ఉభయులూ దేశానికి ఎప్పుడు ఏపాటి ప్రయోజనాలను సాధించిపెట్టారు? స్థిరత్వాన్ని ఏ మేరకు సాధించారన్న విషయాలను ఏకరువు పెట్టడం నా పని కాదు. దేశానికి బలం లభించాలంటే, దేశంలోని మొత్తం 40 కోట్లమందీ బలిష్ఠులు కావాలంటే, పొట్టమీదా, మనస్సు మీదా కొనసాగుతున్నటువంటి ఈ గుత్తాధిపత్యం అంతమైనప్పుడే సాధ్యం అవుతుంది.

బిర్లా–నెహ్రూల ఐకమత్యాన్ని, గుత్తాధిపత్యాన్ని అంతమొందించాలని నేను ఆకాంక్షిస్తున్నట్లు ఇప్పటికన్నా మీరు అర్థం చేసుకొని ఉంటారు. సేఠ్–మఠం, బిర్లా–నెహ్రూల ప్రయోజనాలు విడదీయరాని విధంగా కలిసిపోయి ఉన్నాయి కదా! చిత్తుగా వీటి మధ్య వేర్పాటు ఉన్నట్లు కనిపించినంత మాత్రాన ఒరిగేదేమీ లేదు. ప్రణయంలో ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. ముఖ్యంగా ఈనాటి యుగంలో వసిష్ఠ కోమట్లు బిర్లా వంటి నీచులుగా దిగజారిపోయినప్పుడు, నెహ్రూవంటి వసిష్ఠ బ్రాహ్మణులు దంభంతో పెట్రేగిపోతున్నపుడు ఇలాంటివి సహజమే. పైపైన కనిపించే ఈ వేర్పాటు ధోరణులు, అంతర్గతంగా వీరుభయులకూ, ప్రయోజనసాధనలో ఉన్నటువంటి సమైక్యతను కప్పిపుచ్చజాలవు. శాశ్వతంగానూ, వర్గపరంగానూ, ఉంటున్న పరస్పర ప్రయోజనాలను, పొట్ట యజమానులూ మనస్సు యజమానులూ

ఎలా వదులుకోగలరు? కలిసి మెలిసి ఎదుగుతారు. ఒక్క సంగతిని నేను స్పష్టం చెయ్యదలచుకున్నాను. సేట్లకూ, కోమటి వనితలకూ మధ్య సెఠానీలకూ బ్రాహ్మణ యువకులకు మధ్య ప్రణయ సంబంధాలుంటే నాకేమీ అభ్యంతరం లేదు. ఆ సంబంధాలు మరింతగా విస్తరించాలని నా కోరిక. బ్రాహ్మణ-భంగీ, సేఠానీ-మాల, అహిరన్-పాకీ, కహారిన్-బ్రాహ్మణ, చాకలి-సేఠ్ వంటి సంబంధాలు విరివిగా సాగాలని నా ఆకాంక్ష. నా ఈ స్వప్నం సాకారం కావడానికి చాలా సమయం పట్టగలదని నాకు తెలుసు. అయితే ఈ స్వప్నాన్ని సాకారం చెయ్యడానికి ప్రయత్నాలు జరిగితేనే భారతదేశం బలీయం అవుతుందని కూడా నాకు తెలుసు.

నేను అందరు బ్రాహ్మణులూ, కోమట్లను గురించీ రాయడం లేదు. కేవలం వసిష్ఠ ప్రథ బ్రాహ్మణుల గురించే రాస్తున్నాను. రాజనారాయణసింహ్, మధులిమాయే, బాలేశ్వర్‌దయాల్ వంటివారు బ్రాహ్మణులకులంలోనే పుట్టినప్పటికీ, వారి కంటే ఉత్తములైనవారు సోషలిస్టుపార్టీలోగానీ, భారతదేశంలోని మరే ఇతర రాజకీయ పార్టీలోగాని లేరు. బ్రాహ్మణకులంలో పుట్టారని వారిని గురించి నేను అనడం బహుశా వారికి ఇష్టం ఉండదు. వర్తమానయుగంలో వాల్మీకి పరంపరకు చెందిన వారికొరకే కులవ్యవస్థ యొక్క శేషాధ్యయనం ఉన్నది. కులాల మధ్య వేర్పాటును కొనసాగిస్తూనే సమానత్వం సాధించాలన్న మాట నిరర్థకం. కులాలు నశించాలి. వాటి సంజ్ఞలూ, సంకేతాలు కూడా నశించాలి. శూద్రులనూ, హరిజనులనూ, మోమిన్లనూ, ఆడవాళ్ళనూ, యోగ్యతలు లేకపోయినా ఉన్నతపదవుల్లో అధిష్ఠింప చెయ్యాలి. వసిష్ఠ ద్విజులు ఇందుకు ఇష్టపడరు. మాతృహంతకుడు పరశురాముని దగ్గరనుంచి, జాతిహంతకుడు నెహ్రూ వరకు వసిష్ఠ పరంపర కఠోర న్యాయమే కొనసాగుతున్నది. విశ్వామిత్రునినుంచి విశ్వేశ్వరయ్య వరకు వాల్మీకి పరంపరకు చెందిన ఉదార న్యాయం కొనసాగింది.

వశిష్ఠుడు బహుశా విదేశీయుడై ఉంటాడు. ఈనాటి ప్రధానమంత్రి అయితే నిశ్చయంగా విదేశీయుడే. కేవలం ముఖకవళికలూ, చర్మవర్ణం మాత్రమే నా ఉద్దేశం కాదు. దాదాపు పది సంవత్సరాలుగా నేనాయన ముఖాన్ని చూడలేదు. ఒక్కసారి మాత్రం కృశ్చేవ్‌తోబాటు -అదీ చాలా దూరం నుంచి చూశాను. అయితే ఆయన అనంతంగా సాగిస్తున్న వాసిష్ఠతత్వపు చర్యల ఫలితంగా ఆయన ముఖం

తరచుగా గుర్తుకు వస్తూనే ఉంటుంది. ఆయన ముఖం గుర్తుకు వచ్చినప్పుడల్లా ఆర్మీనియా వారి ముఖాలు గుర్తుకువస్తాయి. ఈ ముఖాలను నేను నికోసియాలో చూశాను. కైరోలో గ్రీక్ ఆర్మీనియా ప్రాంతాల్లో కూడా చూశాను. ముఖకవళికల దేముంది అయినా. ప్రధానమైనది మనస్సు. ప్రధానమంత్రి మనస్సు కూడా మధ్య-ప్రాచ్య ఆసియాల మనస్సు వంటిదే. మూఢమతిమనస్సు. పవిత్ర గ్రంథానుయాయుల మనస్సులు చెడుపట్లనే కాక, చెడ్డవారిపట్ల కూడా శత్రుత్వం వహిస్తాయి. భారతీయ మనస్సులు ఇందుకు భిన్నమైనవి. నిష్క్రియాత్మకంగానైనా ఉంటాయి. తమ సక్రియావస్థలో చెడుపట్ల శత్రుత్వం వహిస్తాయి. చెడ్డవారి పట్ల శత్రుత్వం వహించేవారు చెడుతో స్నేహం చెయ్యక తప్పదు.

ఎవరు దేశీయులు? ఎవరు విదేశీయులు? సెల్యూకస్ విదేశీయుడు- కనిష్కుడు దేశీయుడు, గజ్నీ విదేశీయుడు- సేర్షా దేశీయుడు, హూణులు విదేశీయులు- రాణాసాంగా దేశీయుడు, బాబర్ విదేశీయుడు- బహదూర్ షా దేశీయుడు. భారతదేశపు చరిత్రను ఈ విధంగా అధ్యయనం చెయ్యాల్సి ఉంటుంది. అయితే ఈ దేశీయుల పరిస్థితి దయనీయం. ఓటమి చెందడంలో వీరు ఆనందాన్ని అనుభవించారేమో! ఓటమి చెందడంలోనే సాహసాన్ని ప్రదర్శించారు. వీరి వారసులు కూడా ఓటమి గాయాల గాథలను విని ఆనందపరవశులౌతూ ఉంటారు. భారతీయ మేధలోని ఈ ఒక్క లోపాన్ని తొలగించడం ఎలాగ? వాల్మీకి పరంపరను శక్తివంతం చెయ్యడం ఎలాగ? ఈ పరంపరలో ఓటమి ఒక రకంగా నిహితమై ఉన్నట్లు కనిపిస్తున్నది.

ఇంత సుదీర్ఘమైన లేఖను నేను మీకెందుకని రాస్తున్నాను. ఈ వసిష్ఠ సర్పశాలకు మంత్రులు కనుక. ఒకసారి వసిష్ఠుడు ఓడిపోయాడు. మరోసారి జయించవచ్చు. అందువల్ల వసిష్ఠవాదాన్ని సమూలంగా పెరికి పారేయవలసిందిగా నా దేశ ప్రజలకు సందేశం ఇస్తున్నాను. అంతేకాదు, ఈనాడు మీకు యజమానిగా ఉన్నవాడు, ఇదివరకు కూడా మీకు యజమానిగానే ఉండినవాడు, ఒకప్పుడు నాకు కూడా గురువుగా ఉండేవాడు, ఈనాడు కాదు. నా ఈ ఉత్తరాన్ని మొత్తంగా మీ యజమానికి మీరు పంపలేకపోయినట్లయితే ఈ ఒక్క సందేశాన్ని మాత్రం ఆయనకు పంపండి. 'ఓ కఠోర బ్రాహ్మణుడా! ఉదారునివికా! న్యాయప్రియునివికా! అంతగా ప్రబలమైన

కోరిక ఉంటే  కఠోరంగానే ఉండు గాని, కాఠిన్యాన్ని వదులుకో! ప్రధానమంత్రి బహుశా అంగీకరిస్తాడేమో ఎవరికి తెలుసు? దేశం అంగీకరించడం అసలు విషయం. భారతీయ రక్తం ఔదార్యానికి, దృఢత్వానికి అనుకూలమైనది. కాఠిన్యం దాని దౌర్బల్యానికి లక్షణం.

నేను వర్తమాన ప్రధానమంత్రిని కఠిన బ్రాహ్మణుడని వర్ణించినందుకు, మీరేమిటి, చాలామంది చకితులౌతారు. కొన్ని సంవత్సరాల క్రితం అయినట్లయితే నేను కూడా చకితుణ్ణయ్యేవాణ్ణి. భోజనభాజనాదుల్లో, వేషభాషల్లో, దుస్తుల్లో ఇంతటి సర్వదేశీయుడైనవాడు, ఇంత ఉదారవాది, అందరితోనూ కలసిమెలసిపోయేవాడు. ముఖ్యంగా అల్పసంఖ్యాకులనూ, దళితులనూ దరిచేర్చుకునేవాడు కఠిన బ్రాహ్మణుడెలా అవుతాడు అని, నేను ఆలోచించే పద్ధతిలో ఎక్కడో లోపం ఉన్నదనీ చాలామంది అంటారు. నేను చెప్పేది ఒక్కటే! కాస్త ఓపికగా ఆలోచించండని. భోజనభాజనాదులు, వేషభాషల సంగతి బహిరంగ సత్యమే. వాల్మీకి వల్కలాలు ధరించవచ్చు, మోకాళ్ళ వరకే వస్త్రధారణ చేయవచ్చు, నిరాడంబరమైన చౌకవస్త్రాన్నే ధరించవచ్చు. కాని వసిష్టుడో? రాజగురువాయె! రాజసుడాయె! రాజసం ఉట్టిపడే విధంగా దర్జాగా ఉంటాడు. స్వయంగా రాజే అయిపోతే ఇంక చెప్పవలసిందేముంది?  నేను ముందే చెప్పాను. సంప్రదాయం ఏదైనా కావచ్చు. దేశీయమైనది కావచ్చు. విదేశీయమైనది కావచ్చు. ఏ కాలానికి చెందినదైనా కావచ్చు. చుడీదార్ కావచ్చు, ప్యాంటు కావచ్చు, షేర్వానీ కావచ్చు, జోధ్‌పురి కావచ్చు. ఏదైనా రాజసం ఉట్టిపడే సంప్రదాయం అయితీరాలి. నగ్నాంగ రాజ సంప్రదాయం అతి పురాతనమైపోయింది. జనానికి అది గుర్తేలేదు. వసిష్ఠుని భోజనం కూడా రుచికరంగా, సర్వగ్రాహకమైనదై ఉండి ఉంటుందని నా ఊహ. వాల్మికి వంటిది కాకపోవచ్చు. నోరూరించేది, కరకరలాడేది కాకపోవచ్చు. మాంసం అయితే ఇష్టంగానే తినేవాడనుకుంటా.

అయినప్పటికీ, ఈ నాటి వసిష్ఠుడు ముస్లింల పట్ల, స్త్రీలపట్ల కలిగివున్న అభిప్రాయాలను పరిశీలించినట్లయితే, అతనిని కఠిన బ్రాహ్మణుడని ఎలా అనగలం అంటారు. ఈ విషయమై నేను బాగా ఆలోచించాను. చాలా సానుభూతితో ఆలోచించాను. ఈ విషయాన్ని మూలంలో పట్టుకోగలిగితే ఇందులో కూడా కఠిన లక్షణాలు కనిపిస్తాయి. ఔదార్యమైతే పైపైన ఇతరులకు చూపించడానికే. ఆడవాళ్ళ

వివాహాలూ, ఆస్తిహక్కులకు సంబంధించిన చట్టాలను గురించి (హిందూకోడ్ బిల్లు) ప్రధానమంత్రి కాస్త అలిగారు. చూడటానికి ఇది చాలా ఉదారంగా కనిపించింది. అయితే నిజానికి ఈ వైఖరి వెనుక వందలాది సంవత్సరాలకు సంబంధించిన పాశ్చాత్య సంప్రదాయం ఉన్నది. దీన్ని ఆధునిక సంప్రదాయం అని కూడా అంటున్నారు. ఇది చెడ్డదని నేను అనడం లేదు. ఆడవాళ్ళకు పురుషులతో సమానంగా హక్కులు లభించాల్సిందే. నిజానికి ఇంకా అధికంగా లభించాలి. సమానత్వం రావటం అప్పుడే సాధ్యమౌతుంది. అయితే స్త్రీ-పురుష సమానత్వం విషయంలో ప్రధానమంత్రి అనుసరించిన పద్ధతి ఏదో గొప్ప ముందడుగో, ఉదారమైన చర్యో కాదు.

భారతదేశంలోని ఆడవాళ్ళలో నూటికి ఎనభైమందికి ఈ చట్టాలవల్ల కలిగే ప్రయోజనం ఏమిటి? ఈనాటి సాంఘిక ఆర్థిక వ్యవస్థ అనుమతించిన మేరకు ఈ హక్కులన్నింటినీ వారు ఇదివరకే పొందుతూ ఉన్నారు. వీటివల్ల ప్రయోజనం పొందేది ద్విజమహిళలే. బ్రాహ్మణ స్త్రీలు, ఠాకూరాయిన్‌లూ, సెఠానీలు, అదే ముఠాస్వార్థం. ఆధునికత పేరుతో, అరిగిపోయిన అదే సంప్రదాయం, అయితే చేసింది మంచి పనేనని నేను మరోసారి చెప్పదలచుకున్నాను. కఠిన బ్రాహ్మణుడు ఎప్పుడూ మంచి పని చేయనే చేయడని అనుకోవద్దు. ఎంత చిన్న సమూహానికైనా ఎంత స్వల్పాతిస్వల్పమైన స్వేచ్ఛ లభించినా, అందుకు దాన్ని సాధించినవారికి నమస్కరించి తీరవలసిందే. అయితే అర్థం చేసుకొని నమస్కరించాలి. చిన్న సమూహానికి స్వల్పమైన స్వేచ్ఛ మంచి పనేకాని, అసంపూర్ణం, ద్విజస్వార్థం. వాల్మీకి అయినట్లయితే నూటికి ఎనభైమందిగా ఉన్న ఆడవాళ్ళ సంగతిని కూడా ఆలోచించి ఉండేవాడు. ఉదారమైన మనస్సుతో వారి కష్టాలకు పరిష్కారాన్ని కనుగొనేవాడు. మంచినీళ్ళు, మరుగుదొడ్లు, భారతీయ మహిళల కష్టాలు వీటిల్లో ఉన్నాయి. సూర్యోదయానికి ముందో, సూర్యాస్తమయం తర్వాతనోగాని బహిర్భూమికి వెళ్ళే అవకాశం ఈనాడు ఆడవాళ్ళకు లేదు. మంచినీళ్ళ కోసం కూడా చాలా దూరం వెళ్ళవలసివస్తుంది. ఎంతో దూరం వెళ్ళి చేదుకుని, తోడుకుని నింపుకొనే కడివెడు నీళ్ళకు కూడా మురుగులూ, బురదనీరు, మంచినీళ్ళు- మరుగుదొడ్లకు సంబంధించిన ఈ సమస్య వసిష్ఠుని దృష్టికి వచ్చివుండదు. ఒకవేళ తెలిసినా ఆలోచించి ఉండదు. ఒకవేళ ఆలోచించినా పొగాకు పొగ పీలుస్తూ ఆలోచించి ఉంటాడు. అతనికి కావలసింది సీత-ఊర్మిళ. ఐదువేల

సంవత్సరాల నాటి వసిష్ఠుడు సీతను ఎంతగా బంధించడానికి ప్రయత్నించాడంటే పాపం ఆమె బ్రతుకంతా అగ్ని పరీక్షలతోనే గడపవలసివచ్చింది. ఈనాటి వసిష్ఠుడు సీతను బంధవిముక్తం చేయదలచుకున్నాడు. అయితే వాసంతిగానీ, కుళికగానీ అప్పటి వసిష్ఠునికి–ఇప్పటి వసిష్ఠునికి కూడా భోగవస్తువులు మాత్రం కావచ్చుగానీ, ఔదార్యం–సమానత్వం కోసం పనికివచ్చేవారు కాదు. 'తత్వమసి' కోసం పనికిరారు.

ముస్లిముల సమస్య కూడా దాదాపు ఇలాంటిదే. వసిష్ఠుని మనస్సులో ముస్లిముల పట్ల నిజంగా ప్రేమాదరాలున్నాయన్న విశ్వాసం నాకు లేదు, ఎవరిపట్లా లేవు. ఒక్క వారిపట్లనే ఏమిటి? ముస్లిములు కూడా వసిష్ఠునికి వస్తువులవంటివారు. రాజ్యసంఘటన, నిర్మాణం, సంప్రదాయాలకు పనికివచ్చే సామగ్రి, స్వార్థ ప్రయోజనాల సాధనకు ఉపకరించే సామగ్రి. ప్రధానమంత్రికి, పటేల్‌నో, టాండన్‌నో ఎదుర్కోవలసి వచ్చినపుడు మాత్రమే ముస్లిములు గుర్తుకు వస్తారు. వారి సమస్యలు జ్ఞాపకానికి వస్తాయి. ఇందుకు కారణం ఏమిటి? తన స్వంత పీఠాన్ని బలపరచుకోవలసి వచ్చినపుడే ఆయన ముస్లిములను వాడుకుంటూ ఉంటాడు. పీఠం కదలకుండా ఉన్నంతసేపూ ముస్లిముల విషయాన్ని మనసులో నుంచి తీసిపారేస్తుంటాడు. ఇటీవలి కల్లోలాల సందర్భంగా ఈ విషయం పూర్తిగా రుజువైంది. మొదట్లో ముస్లిములను ఎగదోసారు. 'మహమ్మద్' ను నిందించినప్పుడు మక్కాలోని వారో, మూఢమతులో రెచ్చిపోయినట్లుగానే ప్రధానమంత్రి రెచ్చిపోయారు. ముస్లిములు కూడా రెచ్చిపోయి ఏదన్నా చేయడానికి ఉపక్రమించగానే వారిని పాకిస్తాన్ ఏజంట్లని చిత్రించడం ప్రారంభించారు. పాపం ఆయన మాట నమ్మి రెచ్చిపోయినవారు కాల్పులలో ప్రాణాలు కోల్పోయారు. 'రామనింద' కానీ, 'మహమ్మదునింద'గానీ ఓపికగా వినగలిగిందే భారతీయ మేధ. విని రక్తం ప్రవహింప చేయడానికి గానీ పుస్తకాలు తగలబెట్టడానికి గానీ పూనుకోకుండా ఉండేది భారతీయ మనస్సు. దారితప్పిన ప్రతి దేశీయుణ్ణి దేశద్రోహి అనో పాకిస్తాన్ ఏజంట్ అనో నిందిస్తూ ఉండేది భారతీయ మనస్సు కాబోదు. 'శిరచ్ఛేదం', 'నిర్వాసనం', గొంతుకలు కత్తిరించడం, దేశాన్నుంచి బయటికి తరిమివేయడం ఇవన్నీ వసిష్ఠ లక్షణాలే.

ముస్లిములతో ప్రధానమంత్రికి నిమిత్తం లేదు. ఉన్నట్లయితే హిందువుల మనస్సుల్లోనూ, ముస్లింల మనస్సుల్లోను నాటుకొని ఉన్న బీజాలను అన్వేషించి

వాటిని ప్రతినిత్యం బయటికి తీసిపారేస్తూ ఉండవలసింది. హిందువులనుగానీ, ముస్లింలనుగానీ ఏకపక్షంగా సంతోషపెట్టడానికి ప్రయత్నాలు జరిగి ఉండేవి కావు. న్యాయం ఔదార్యం అవసరమైనప్పుడు దృఢత్వంతో పనిచేయవలసి ఉండేది. కఠినంగా, కఠోరంగా కాదు. పని బహుశా జరిగిపోయి ఉండేది. భారతదేశంలోని ముస్లిములు హృదయపూర్వకంగా ఈ దేశానికే భక్తిప్రపత్తులు ప్రదర్శించడం ఏ నాడు ప్రారంభమవుతుందో ఆ నాటి నుంచి పాకిస్తాన్ పునాదులు కూరుకొని పోవడం ప్రారంభమవుతుంది. వీరిని దేశభక్తులు చేయడానికి మనస్సులు మార్చవలసి ఉంటుంది. హిందువుల మనస్సులనూ మార్చాలి. ముస్లిముల మనస్సులనూ మార్చాలి. శరీరం కోసం అవసరమైన కొన్ని పనులు కూడా చేయాలి. శరీరం కోసం ఎటువంటి పనులూ జరగడం లేదు. వృత్తిపనులు మూతపడ్డాయి. చిన్న చిన్న వ్యవసాయ కమతాలు బీడుపడ్డాయి. చాలామంది ముస్లిములు ఈ రెండు వృత్తులలోనే బ్రతుకుతున్నారు. ఆడవాళ్ళ విషయంలో మంచినీళ్ళు-మరుగుదొడ్లను గురించిన ఆలోచన లేనట్లుగానే వృత్తిపనులను గురించిగానీ, చిన్న కమతాల గురించిగానీ ఆలోచన లేదు. ఆలోచన అంతా పెద్ద పెద్ద ఆధునిక భవనాలను గురించి పెద్ద పెద్ద కర్మాగారాలను గురించి ఉన్నది. వీటివల్ల ప్రయోజనం పొందే వారిలో 90 శాతం మంది ద్విజులే. ద్విజులలో కూడా 90 శాతం మంది పేదరికంలో మ్రగ్గుతున్నారు. ఆధునీకరణనుంచి లాభం పొందేవారు 10 శాతం కన్నా మించరు. అదే ప్యాంటు, చుడిదార్ అటువంటిదే మరేదైనా! కఠిన వాసిష్ఠం అయిందా కాలేదా?

వసిష్టుడు గుణవంతుడే. నాకు అతని గుణాలు అసలేం తెలియవనుకోకండి. ప్రధానమంత్రి శాబ్దికంగా రాజు, సామయిక శబ్దానికి. ఐతిహాసిక శబ్దానికి కాదు. సామయిక శబ్దం లేకపోతే రాజకీయరంగంలో విజయం చేకూరనే చేకూరదు. అయితే క్షణికమైన విజయమే. దేశం దాన్ని తక్షణం విస్మరిస్తుంది. ఎంతగా విస్మరిస్తుందంటే, నిన్న దేన్నయినా స్వర్ణపాత్రగా భావించి నెత్తిన పెట్టుకున్నదో ఈ వేళ దాన్నే, మసిపట్టిన మట్టిపాత్రగా భావించి తునాతునకలు చేసి పారేస్తుంది. ఐతిహాసిక శబ్దాల విషయం వేరు. వాటిద్వారా దేశ నిర్మాణం, వ్యక్తి నిర్మాణం జరుగుతుంది. అయితే చాలాకాలం పడుతుంది. అప్పుడప్పుడు 20 లేదా 50 సంవత్సరాలు పట్టినా పట్టవచ్చు. ఐతిహాసిక, సామయిక శబ్దాలను సమన్వయం చేసి సంధి కుదర్చగలిగిన గాంధీగారు లేరుకదా?

వసిష్ఠుని మనస్సు తన చిన్న పరిధిలో తన వారి కోసం చాలా రసమయంగా ఉంటుంది. ఒకప్పటి మాట. ప్రధానమంత్రి ఆనారోగ్యంగా ఉన్నారు. అకస్మాత్తుగా నేనూ అదే నగరంలో ఉండటం తటస్థించి ఆయన్ను చూడటానికి వెళ్ళాను. ఎందుకో వికలమనస్కుడై ఉన్నట్లు కనిపించాడు. మరుసటిరోజు ఉదయం ఆయన కుమార్తె విదేశాల నుంచి రాబోతున్నది. విమానాశ్రయానికి తాను వెళ్ళజాలనేమో ననిపించిందాయనకు. ఇందులో విచారపడవలసిందేమున్నది? ఎంతమంది లేరు విమానాశ్రయానికి వెళ్ళడానికి, ఆమె మేనత్త వెళుతుంది అని ఆయన్ను ఓదార్చడానికి నేను చాలా ప్రయత్నించాను. విమానాశ్రయంలో నన్ను చూడకపోతే అమ్మాయి తన మనస్సులో ఏమనుకుంటుంది? ఎంత బాధపడుతుంది? అని ప్రధానమంత్రికి ఒకటే ఆవేదన. "పోయినవాళ్ళు చెప్పరా? మీకు స్వల్పంగా అనారోగ్యంగా ఉన్నదని అని ఆయన్ను ఒప్పించడానికి ప్రయత్నించాను. ఆ రెండు నిమిషాలే! విమానం నుంచి దిగగానే చూస్తుంది. నేను కనపడను. ఇతరులతో మాట్లాడేలోగా ఆ రెండు నిమిషాలలో ఆమె మనస్సులో రకరకాల ఆలోచనలు రావా?" అన్నాడా వసిష్ఠుడు. తన వారి కోసం వసిష్ఠుని మనస్సు బహుశా ఇప్పుడు కూడా అలాగే ఉండి ఉంటుంది. అయితే నాకు సరిగ్గా తెలియదు. వసిష్ఠుని మనస్సులోని కాఠిన్యం తనవారికీ, పరవారికీ మధ్య పరిధులను విడివిడిగా ఎంతకాలం ఉంచుకోగలదో నేను సరిగ్గా చెప్పలేను.

దృఢత్వానికీ–కాఠిన్యానికీ చాలా తేడా ఉంటుంది. నిజమైన మనిషి అయినవాడు మాటలో, చేతలో దృఢంగా ఉండటం అనివార్యం. ప్రభుత్వం దృఢంగా ఉండి తీరవలసిందే. అందువల్లనే రాజ్యం ఉన్నంతవరకూ దండనాధికారం కూడా బహుశా ఉండకతప్పదు. ఏనాటికైనా మానవుడు దండనాధికారం లేకుండానే తన సామూహిక జీవితాన్ని సాగించుకోవాలని మనం కలలు కనవలసిందే. అయితే ఈ కలలు నిజమయ్యేవరకు దండనావిధానాన్ని అట్టిపెట్టుకొనవలసే ఉంటుంది. చోరులకూ దండన, నాబోటి వారికీ దండన. నాబోటివారు ఎప్పుడూ ఉంటూనే వుంటారు. ఉండవలసిందే. నాబోటి వాళ్ళు లేకపోయినట్లయితే రాజ్యం ప్రవహించే గంగ మాదిరిగా స్వచ్ఛంగా ఉండక, నీరు నిలకడగా ఉండే చెరువువలె మురికికూపంగా మారిపోతుంది. దండన స్వరూప స్వభావాలూ, పరిమాణం ఎంతగా ఉండాలనేదే అసలు విషయం. దండన సర్వదా చట్టాలనూ, రాజ్యాంగాన్నీ అనుసరించి

ఉండాలి కాని తాత్కాలిక దండనాధికారుల కోపతాపాలను అనుసరించికాదు. రాజుగారి పూలతోటలో ఒక్క పువ్వును త్రెంచుకుంటే, శిరచ్ఛేదన దండన ఇవ్వడమా? దండనకూ వైరానికీ చాలా తేడా ఉంటుంది. రాజ్యశక్తిని తమ చేతుల్లో ఉంచుకున్నవారు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. వసిష్ఠుడు వైరాన్ని సాధించుకుంటాడు-దండన విధించడు. ఆయన సంప్రదాయం ఇదే.

వైరం ఉన్నచోట, దృఢత్వం కాక, కాఠిన్యం ఉన్నచోట, ఉదారమైన న్యాయ ప్రియత్వం లేనిచోట సిద్ధాంతాల బూటకం ప్రబలి తీరుతుంది. సర్వసాధారణుడైన పేదవానికి పాలు దొరకకపోతే, వారు ఆకలితో అలమటించి పోతూ ఉంటే, వసిష్ఠుడు తాను స్వయంగా పాలు త్రాగడం లేదని గట్టిగా అరచి చెపుతాడు. పాలకు బదులుగా అతడు మాంసాన్ని ఇతర పదార్థాలను- ఏమేమి సేవిస్తాడో వాటి లెక్కలన్నీ తీస్తే వ్యవహారం తల్లకిందులై పోతుంది. మాంసం తినని వసిష్ఠుడెవడైనా ఉంటే, అతడు విభిన్న రూపాలలో పాల పదార్థాలను ఎన్ని సేర్లు త్రాగుతాడో, తింటాడో చెప్పకుండా, తన రోజువారీ భోజనంలో ఇన్ని చటాకుల బియ్యాన్నో, గోధుమలనో తగ్గించుకుంటున్నానని ఢంకా బజాయించి ప్రచారం చేసుకుంటాడు. వసిష్ఠుడు బూటకాన్ని ప్రచారం చేసి విస్తరించకపోతే మనజాలడు. రణనీతి పేరుతో ఎవరి విధానాలనూ, రాజీలనూ నిరంతరం నిందిస్తూ వస్తాడో అతనినే అవసరం వచ్చినపుడు బుద్ధుని అవతారంగా వర్ణించడానికి వెనుకాడడు. తనకన్నా బలవంతుల ముందు మానవహక్కులు, ప్రజాస్వామ్యం, సహజీవనం వంటి సిద్ధాంతాలను వల్లెవేస్తూ, అదే సమయంలో తనకంటే బలహీనులను న్యాయాలయాల్లో లాగించడం, న్యాయాలయాలను దండనాలయాలుగా మార్చడం చేస్తుంటాడు.

సిద్ధాంతం వ్యక్తిగత, లేదా ముఠాస్వార్థ ప్రయోజనాల సాధన సామగ్రిగా మారిపోయినప్పుడు, సిద్ధాంతాలకుగాని, సత్యానికిగానీ స్థాయిరూపం లేకుండా పోయి బూటకం ప్రబలడం ప్రారంభమౌతుంది. భారతదేశం వంటి భిన్నవృత్తులుగల అతిపురాతన దేశాన్ని సమైక్యంగా ఉంచగలిగేది సిద్ధాంతమూ-సత్యమే. బూటకం- కాఠిన్యాలూ దీన్ని మరింత ముక్కలు ముక్కలు చేస్తాయి. తన మొండితనంతో భారతదేశాన్ని రెండు ముక్కలుగా చీల్చింది జిన్నాయె అనడంలో సందేహం లేదు. అయితే దానితోబాటు శ్రీ నెహ్రూ, సమయానుకూలంగా పన్నిన ఎత్తుగడలూ,

స్వార్థమూ, బూటక ప్రచారాలు కూడా ఆ మొండితనానికి సహకరించాయి. ముస్లిం లీగ్‌కు చెందిన శ్రీ ఖలీకుజ్జమాకు 1936లో ఎన్నికలలో ఆయనతో కలిసి పోటీ చేస్తామని శ్రీ నెహ్రూ మాట ఇచ్చారు. ఎన్నికల్లో అధిక సంఖ్యాకులు గెలవడంతో తన మాటనూ, తన సహచరుణ్ణి కూడా తృణీకరించాడు. ఇప్పటికీ అదే సిద్ధాంత హీనత, సమయానుకూలంగా మాట మార్చడం, బూటకం కొనసాగుతూనే వున్నది. వసిష్ఠుడు తన స్వార్థాన్నీ, సంప్రదాయాన్నీ కొనసాగించుకుంటూ ఉన్నాడు. అయితే పంజాబ్, మహారాష్ట్ర, తమిళనాడుల్లో ఏం జరుగుతున్నది? ఇంకా ఎక్కడెక్కడ ఇప్పుడేం జరుగుతున్నది? ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్, గాంధీజీకి నిజమైన వాల్మీకి సంప్రదాయంలో శిష్యుడు. సింహాసనం ఎదురుగా కనబడినప్పుడు అది విరిగి ముక్కలైన సింహాసనమే అయి వుండవచ్చుగాక, చివరిదాకా తనతో ఉండలేనను కున్నప్పుడు వసిష్ఠుడు అతని వైపు ఒక్కసారి కూడా తిరిగి చూడలేదు. అంతకుముందు వారి మధ్య ఎంతటి సన్నిహితమైన స్నేహం ఉంటేనేమిగాక! రాజకీయరంగం మిత్రబృందాల క్లబ్బులని నేనడం లేదు. మానవుని కోసం, జాతికోసం ఎన్నో రకాల స్నేహాలు కలుస్తూ ఉంటాయి. విడిపోతూ ఉంటాయి. కాని స్వార్థం కోసం స్నేహాలు విడిపోతే, అది కూడా త్వరత్వరగా నిరంతరం విడిపోతూ ఉంటే, అదీ ఉత్తములలో స్నేహాలు విడిపోతూ ఉంటేనే బాధ.

భారతదేశం అతి క్రూరమైన దేశంగా మారిపోయింది. అహింసకూ, దయకూ పుట్టినిల్లయిన ఈ దేశం ఈ నాడు బహుశా ప్రపంచంలో అతి క్రూరమైన దేశంగా పరిణమించింది. ఈ నిర్బంధానికి ముందు నా స్నేహితురాలొకామె, తన భర్తతోపాటు నన్ను, కలకత్తాలోని జంతు ప్రదర్శనశాలకు తీసుకొనిపోయింది. అక్కడికి రెండు భల్లూకాలు జపాను నుంచి వచ్చాయి. వాటికి ఐస్‌క్రీం అంటే చాలా ఇష్టం. మేం వాటికి ఐస్‌క్రీం కొంత ఇచ్చాం. ఆనందంగా తిన్నాయి. హఠాత్తుగా పోట్లాటకు లంకించుకున్నాయి. బాగా పోట్లాడుకున్నాయి. ఒకదానికైతే రక్తం కూడా వచ్చింది. బాగా గుర్రు పెడుతున్నది మగది. రక్తం వచ్చినది ఆడదై ఉంటుంది. అయితే నేను సరిగ్గా చెప్పలేను. బహుశా రెండు అన్నదమ్ములైనా కావచ్చు. కానీ ఈ కొట్లాట కొన్ని క్షణాల వరకే సాగింది. హంసలు కూడా చాలా అందంగా ఉన్నాయి. ఎంత సగర్వంగా ఈదుతున్నాయో! ఒకదాని మెడమీద మరొకదాని మెడను ఆన్చి, వందలాది భంగిమల్లో నలువైపులా అవి తిరుగాడుతుంటే– నిజమైన హంసనృత్యం

అదేననిపిస్తుంది. భారతదేశంలోని మంత్రులందరూ అప్పుడప్పుడూ జంతు ప్రదర్శనశాలలు చూసి వస్తూ వుండండి! అప్పుడైనా మీలో ఇంత క్రూరత్వం ఉండదు. జంతువుల పట్ల జరుగుతున్న క్రౌర్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు జరపాల్సిందని ఆ రోజు అరుణ నాకు సూచించింది. అందుకే నేనీ విషయం మీకు రాస్తున్నాను.

అప్పుడు నాకు తోచలేదు. మాంసాహారి అయిన ఈవిడ, జంతువుల పట్ల ప్రేమను గురించి నాకు చెప్పుతున్నదని. అనేకమంది శాకాహారులు తమ గోవులనూ–ఎడ్లనూ, గేదెలనూ, మాంసాహారులకన్నా అధికంగా హింసిస్తారని నాకు తెలుసు. అనేక మంది శాకాహారులు క్రూర స్వభావం కలిగి ఉంటారని కూడా నాకు తెలుసు. అయినప్పటికీ నేను అరుణను అడిగాను – మాంసాహారం ఎందురు వదిలేయవని. జిహ్వాచాపల్యం, అలవాటు జన్మతహా సంక్రమించిన ఆచారాలన్నీ ఏకరువు పెట్టిందామె. జిహ్వాచాపల్యం కోసం, రుచికోసం మానవులు ఎంతవరకు మాంసం తింటూ ఉంటారో అంతవరకూ జంతువులను క్రూరంగా చంపడాన్ని వీలైనంత మేరకు నిరోధించాలని ఆమె మరింత గట్టిగా వాదించింది. పాపం జంతువులను ఎంత నిర్దాక్షిణ్యంగా కోస్తారు? ఒక్క సంగతి విన్నప్పుడైతే నాకు ఆశ్చర్యం వేసింది. కలకత్తా వీధులలో ప్రాణమున్న తాబేళ్ళను ముక్కలు ముక్కలుగా కోసి అమ్ముతుంటారు. ముక్కలవుతూనే ఉంటుంది. కొట్టుకుంటూనే ఉంటుంది. ఇలా కోసేవారూ అమ్మేవారూ ఎవరు? కోయించుకునేవారూ కొనుక్కునేవారూ ఎవరు? గొర్రెలు, మేకలు మొదలైనవాటిని కూడా ఇంత క్రూరంగా కాకపోయినా నిర్దాక్షిణ్యంగా కోస్తూనే ఉంటారు. భారతదేశంలోని ఈనాటి మనస్సు చాలా క్రూరంగానూ, నిర్దాక్షిణ్యంగానూ మారిపోయింది. జంతువుల పట్ల ఇంత క్రూరంగా వ్యవహరించేవారు నా మీద పడకుండా ఉంటారా? నేను మొదటినుంచీ జంతువులకు స్నేహితుణ్ణే. ఇప్పుడు మరింత.

బలహీనుడైనవాడు అధిక క్రూరంగా వ్యవహరిస్తాడు. తాను బలహీనుడు కాదని చాటి చెప్పడానికి దొంగ సాహసాన్ని ప్రదర్శిస్తాడు. లక్నో, ఢిల్లీలలోని మంత్రుల వ్యవహారం ఇలాగే ఉన్నది. స్వార్థంతో, పదవి ప్రతిష్ఠ అనే ఉన్మాదంలో వారు దేన్నయినా చేయడానికి తయారవుతూంటారు. జీవితంలో విస్తరించి

ఉన్నటువంటి క్రౌర్యం, సహాయం వారికి ఉండనే ఉంటుంది. పట్టుబడరు. కొద్దిగానో, గొప్పగానో అందరూ క్రూరులే అయిఉన్నప్పుడు బూటకపు ప్రతిష్ఠ కోసం ప్రాకులాడుతున్నప్పుడు మంత్రులైనవారు మరో నాలుగడుగులు ముందుండటంతో విశేషం ఏమున్నది కనుక! నోరు మూసుకున్న మనిషిని న్యాయాలయంలోనికి లాగించుకుని తీసుకొనిపోయి కూచోబెట్టడం నిష్కారణ క్రౌర్యమనీ, బూటకపు ప్రతిష్ఠ కోసం ప్రాకులాడే ఉన్మాదమనీ ఎవరు గ్రహిస్తారు? అంతకన్నా అతని ఫోటోనో, బొమ్మనో కూచోబెడితే సరిపోయేది. న్యాయాలయాలకంటే ఏకైక ఆయుధం మాట అనీ, ఉపయుక్తమైన మాట అనీ, దాగుడుమూతలూ, దండమూ కాదని ఎవరికి తెలుసు. 18 నవంబరుకు ముందు న్యాయస్థానాలు నాతో దాగుడుమూతలాడాయి. 18 నవంబరు తర్వాత దండప్రయోగం చేశాయి. ఏమి అవసరం వచ్చింది. నేనైతే స్వచ్ఛందంగా నా ఇష్టపూర్వకంగా మాట్లాడే నా అధికారాన్ని త్యజించాను గదా! తాను మాట్లాడే హక్కును వదిలివేసుకున్న వాణ్ణి బలవంతంగా న్యాయస్థానాల లోపలికి లాగించుకొని పోయే చట్టం ఎక్కడున్నదని అడిగేవాడెవరు? నిష్కారణమైన క్రౌర్యం, పదవి ప్రతిష్ఠ ఉన్మాదం నేరారోపితుడైన వ్యక్తి న్యాయస్థానంలో హాజరై ఉండాలన్న నియమం ఉన్నదంటున్నారు. అయితే స్వచ్ఛందంగానే తన హాజరీ అవసరంలేదని, రాతపూర్వకంగా రాసినప్పుడు చట్టాలు ఏమి చెబుతాయి.! న్యాయస్థానంగానీ, ప్రభుత్వంగానీ ఇలాంటి వ్యక్తి మీద బలవంతం చేయడానికి అధికారం ఇచ్చే చట్టం ఏదైనా ఉన్నదా? రోడ్డు మీద చెత్త పారేయవద్దు అన్న చట్టం ఉన్నట్లుగానే ముద్దాయి న్యాయస్థానంలో హాజరై ఉండాలని చట్టం వున్నదనుకోండి. అంతటితో సరిపోదు. శిక్షను స్వీకరించడానికి అంగీకరిస్తూ న్యాయ స్థానంలో హాజరవ్వడానికి నిరాకరించే వ్యక్తిని శిక్షించే నిబంధనలు కూడా ఉండాలి. క్రౌర్యం, నిరర్థకమైన క్రౌర్యం, చట్టవ్యతిరేకమైన క్రౌర్యం, నపుంసకులైనవారి పదవీ ప్రతిష్ఠోన్మాద క్రౌర్యం.

వాసిష్ఠ ద్విజ రాజకీయాల ద్వారా, పదవీ ప్రతిష్ఠోన్మాద రాజకీయాల ద్వారా భారతదేశాన్ని పునరుజ్జీవింప చేయడం అసాధ్యం. ఏ పార్టీలో అయితే, ఆడవాళ్ళూ, శూద్రులూ, హరిజనులూ, ముస్లిములూ అధిక సంఖ్యాకులుగా ఉంటారో ఆ పార్టీ మాత్రమే దేశాన్ని శక్తివంతం, సుఖవంతం, సత్యశీలవంతం, చేయగలుగుతుందని

నా దృఢాభిప్రాయం. సీత–శంబుకుల కేంద్రాన్ని మరింత పెంపొందించాలి. ఇటువంటి పార్టీలో ద్విజులు కూడా ఉంటారనడంలో సందేహం లేదు. ఉండాలి కూడా. ఐదువేల సంవత్సరాలుగా దేశ నాయకత్వం ఎవరి గుప్పిళ్ళలో ఉన్నదో వారిలో కొంతమందికైనా పునరుజ్జీవన కిరణాలు కనిపిస్తాయనడంలోనూ, ఆకర్షిస్తాయనడంలోనూ సందేహం లేదు. మొదట్లో వీరిని నేను పప్పులోని ఉప్పు అని వర్ణిస్తూండేవాణ్ణి. వీరు మొదట తమ అస్థిత్వాన్ని పూర్తిగా మలిపేసుకుని బహుజన సముదాయంలో కలసి మెలసి పోవలసి ఉంటుంది కనుక. ఈ ఉపమానంలో ఒక ప్రమాదం ఇమిడి ఉన్నట్లు ఇప్పుడు నాకనిపిస్తున్నది. 'ఉప్పు' చాలా స్వల్ప మాత్రలోనే ఉన్నప్పటికీ తనను గురించి తాను తల బిరుసుగా వ్యవహరిస్తుందేమో! అందువల్ల ఇప్పటి నుంచి నేను వీరికి పొలంలోని ఎరువును ఉపమానంగా చెప్పదలచుకున్నాను. వీళ్లైనంతవరకూ విత్తనాలు, స్త్రీలు, హరిజనులు, శూద్రులు, ముసల్మానులవే కావాలి. వీరిని నాయకత్వ స్థానంలో కూచోబెట్టాలి. ద్విజులు ఎరువుగా ఉపయోగపడాలి. అటువంటి పార్టీ రూపొందాలి.

ఆడవాళ్ళ విషయంలో కూడా మీరు చాలా క్రూరంగా, చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. నిర్బంధానికి ముందు నాకు కొన్ని ఉత్తరాలు వచ్చాయి. వాటిల్లో కొన్ని బాధలూ, ఇబ్బందులూ, కష్టసుఖాలు ఏకరువు పెట్టడం జరిగింది. వాటికి సమాధానాలు పొందితే వారికి కొంత ఊరట కలిగేది. నేను నవంబరు 8వ తేదీనాడు ఇటువంటి మూడు ఉత్తరాలు పంపాను. వాటిల్లో ఏ ఒక్కదానిలోనూ కూడా రాజకీయాలు లేవు. ఒకే ఒక ఉత్తరంలో రెండు మూడు వాక్యాలు– ఒక వేళ వాటిని రాజకీయం అని ప్రభుత్వం భావించినట్లయితే, ఆ వాక్యాల మీద ప్రభుత్వంవారు మసిపూసి ఉండాల్సింది. 27 నవంబరు వరకూ తనకు ఉత్తరం అందనేలేదని ప్రొఫెసర్ రమామిత్ర ద్వారా తెలియవచ్చింది. శ్రీ శాంతినాయక్, మార్గోస్కిన్నర్‌లకు కూడా వారికి రాసిన ఉత్తరాలు ఇంతవరకు అందివుండకపోవచ్చునని నాకు అనుమానం కల్గుతున్నది. పాపం మార్గో– భారతదేశానికి వచ్చి మా పత్రికలో పనిచేయాలని ఆరాటపడుతున్నది. వీరందరూ మానవుల కోసం ఎంతో కొంత చేశారు. దేశీయుల పాలనాయుగంలోనూ, విదేశీ పాలనాయుగంలో కూడా జైలుకు వెళ్ళిన వారొకామె. '42 విప్లవకాలంలో తన గదిలో అత్యంత ప్రమాదకరమైన సామగ్రిని భద్రంగా దాచుకున్నది. వాటిని గురించి మీరు వింటే బహుశా

మూర్ఛపోతారు. మూడో ఆమె సత్యం కోసం నెలకు రెండున్నర వేల జీతం వచ్చే ఉద్యోగాన్ని త్యజించింది. ఇలాంటి వారికి కాస్త ఊరట కలిగించే ఉత్తరాలు అందితే మీ సొమ్మేంపోతుంది?

పుస్తకాలూ, ఉత్తరాలను గురించిన మీ నియమాలను వెంటనే సవరించాలి. ఆ మాటకువస్తే సవరించాల్సిన నియమ నిబంధనలు అనేకం ఉన్నాయి. ఆంగ్లేయులు వెళ్ళిపోయారు కాని జైళ్ళు ముందటివలెనే నరకకూపాలుగా ఉన్నాయి. మీరు ఎప్పుడు విన్నా చట్టాలు, నియమాలు అంటూ ఉంటారు. ఆంగ్ల సామ్రాజ్యవాదులు నిర్మించిన ఆ కుళ్ళిపోయిన నియమ నిబంధనలనే తీసుకోండి. వాటిల్లో కాస్త మానవీయంగా ఉన్న నియమనిబంధనలు తృణీకరిస్తారా? జైళ్ళ వర్గీకరణకు ఆంగ్లేయులు కొన్ని నియమాలు తయారుచేశారు. ఇప్పటి వరకు అవి కాగితాల మీదే ఉండిపోయాయి. ఖైదీల వర్గీకరణ వారి ఆదాయమూ, విద్య, నేరం చేసే ఉద్దేశాన్ని అనుసరించి ఉండాలి. నేరం యొక్క ఉద్దేశం స్పష్టమే కదా! శాసనోల్లంఘనమనే నేరం చేసే ఉద్దేశం నిస్వార్థమైనది. ఈ నియమాన్ని అనుసరించి మా ఖైదీలనందరినీ ఉన్నత వర్గంలో ఉంచాల్సింది. మీరు ఎంతటి పాపాత్ములు? మీ నియమ నిబంధలనే మీరు నిరంతరం ఉల్లంఘిస్తూ ఉన్నారు. రాత్రింబవళ్ళు నియమ నిబంధనల జపం చేస్తూ ఉంటారు.

ఒకసారైతే మీ ప్రభుత్వం నన్ను ఒక 'మహలు' లో నిర్బంధించి ఉంచింది. ఏ నియమాన్ని అనుసరించి? దానికి వ్యతిరేకంగా నేను ఉన్నత న్యాయస్థానానికి రాసిన మాట నిజమే. నాకు మహలంటే ఇష్టం లేకకాదు. నా గదిలోనే నా మీద నిఘా ఉంచడానికి ఒక పోలీసు సూపర్నెంటును కూడా పెట్టినందుకు. గది బయట ఎంతమంది పోలీసులనైనా నిఘా కోసం నియమించండి– ఫరవాలేదు, కానీ గది లోపల పెట్టడానికి వీలులేదు. స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటి సారిగా నేను ఢిల్లీ జైలులో ఉన్నప్పుడు, సర్దార్ పటేల్, నన్ను కలుసుకోవడానికి వచ్చేవారినందరినీ నా బ్యారక్‌లోనే కలుసుకోనిచ్చారు. ప్రతిరోజూ, ఎన్నిసార్లయినా నైని జైలులో ఉన్నప్పుడు మీరు కూడా ఇలాగే వ్యవహరించారు. బహుశా సర్దార్ పటేల్‌లో ఇంతటి వాసిష్ఠం బహుశా ఉండిఉండదు. కాస్త కటువైన వాడైతే కావచ్చు. సమయం గడచినకొద్దీ కఠిన వాసిష్ఠుల వైరభారం పెంపొందుతూ ఉండనైనా ఉండవచ్చు. అయినప్పుడు నియమ నిబంధనల గురించి ఎందుకు మాట్లాడతారు?

సర్దార్ పటేల్ శూద్రుడు, వాసిష్ఠ ద్విజులకన్నా, వాసిష్ఠ శూద్రులైనా నయమేననిపిస్తున్నది నాకైతే. బొంబాయికి చెందిన కఠోర వాసిష్ఠ బ్రాహ్మణుడు మొరార్జీ దేశాయిని తొలగించే విషయంలో ద్విజులంతా ఎంతగా ఆందోళన చెందారు? అతని పరిపాలనా దక్షతను గురించి, పార్టీ నిర్మాణ సామర్థ్యం గురించి, కఠినంగా దండించగల గుణం గురించి వీటన్నింటితో బాటు సాగిపోతున్నట్లు కనిపించే రాష్ట్ర భద్రతను గురించి ఎంతగా ప్రశంసించారు. ఈ వాసిష్ఠ సాంప్రదాయానికి చెందినవాడే అయినప్పటికీ, శూద్రుడైన చవాన్ దేశాయికంటే గొప్పవాడుగానే రుజువుపరచుకున్నాడు. అందుకనే ద్విజుడైన నెహ్రూ కన్నా, శూద్రుడైన కామరాజ్ నాడార్ నయమని నాకనిపిస్తుంది. వీరు భారతదేశపు మట్టికీ, ప్రజలకూ అధికంగా సన్నిహితులై వుంటారు కనుక. వీరి ముఠా స్వార్థ ప్రయోజనాలూ, పరంపరలూ, మరోరకంగా ఉంటాయి. అయినప్పటికీ వాసిష్ఠులే. అందువల్ల దేశపునరుజ్జీవనం వీరివల్ల కూడా సాధ్యపడదు. ఇద్దరూ చెడ్డవారే అయినప్పటికీ, వాసిష్ఠ ద్విజులకన్నా, వాసిష్ఠ శూద్రులే నయమని నేననుకుంటున్నాను. చిన్న చిన్న అధికార పదవుల్లో హరిజన శూద్రులు మొదట్లో చాలా చెడ్డగా, క్రూరులుగా వ్యవహరిస్తారనే మాట నిజమే. జైలులో కూడా ఎవరైనా మాదిగ, చమార్, పాకీ, కలావర్ లేదా ఆహిర్ పాతబడిపోయినప్పుడు వారు తిట్టే బూతు తిట్లకూ, వారుకొట్టే చెంపదెబ్బలకూ అంతుండదు. అదే విధంగా శూద్రులైన అధికారులు కొంతమేరకు అస్థిరతను అనుభవిస్తూ భయం భయంగా ఉంటారు. ద్విజుడైన అధికారికన్నా తాను తక్కువ బలవంతుడను కానని రుజువు చేసుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటారు. అదే బూటకపు పదవీ ప్రతిష్ఠోన్మాదం, అయితే ప్రప్రథమపు మెట్లు– ఇవి ఇలాగే ఉంటాయి.

సమతలంగా ఉన్న భూమిపైనే ముందడుగు వేయడం చేతకాని మిమ్మల్ని మెట్లెక్కవలసిందిగా ఎలా కోరేది? జైళ్ళ పరిపాలనా యంత్రాంగంలో గత పది సంవత్సరాలుగా ఏమైనా మార్పులు చేశారా? దెబ్బలూ, బూతులూ, తిట్లూ ఏమన్నా తగ్గించారా? ఖైదీల ఆత్మగౌరవం పెంచడానికి చేసిందేమిటి? ఖైదీల్లోనే బాగా పండిపోయిన కొందరిని నంబరుదార్లుగా ఎంపికచేసి, వారిని పైకి ఎగదోసి, ఇతర ఖైదీల మీద చాడీలు చెప్పే అలవాటునూ, అబద్ధాలూ, దుర్మార్గులను ప్రోత్సహించే పురాతన పద్ధతిని మీరు అట్టే పెట్టలేదా? కొన్ని విషయాల్లోనైతే ఆంగ్లేయుల కాలంకన్నా

పరిస్థితి అధ్వాన్నమై పోయింది. చట్టం ప్రకారం ఉండవలసిన వారికన్నా బారక్సులో రెట్టింపు మందిని ఉంచుతున్నారు. ఆచరణ, నైతిక ప్రవర్తన– పతనం చెందుతాయా, బాగుపడతాయా? దుస్తుల విషయంలోనైతే పతనం కనిపిస్తూనే ఉన్నది. బెల్లం మొదలైన వాటి విషయం బహుశా కాస్త మెరుగు పడితే పడి ఉండవచ్చు. శనగలు ఉడకనే ఉడకవు. పైపైన కొన్ని మార్పులు చేశారు. దీర్ఘకాల ఖైదీలకు సెలవులు ఇవ్వడం వంటివి. అయితే ఇటువంటి సంస్కరణల వల్ల జైళ్ళ పరిపాలనలో తేడా రాలేదు. నియమనిబంధనలను అనుసరించి ఖైదీలందరికీ తిండీ, బట్టా, వసతీ కల్పించినపుడు, నంబర్‌దారీ పద్ధతి అంతమైనప్పుడు, జైలులో పని పద్ధతులు మారినప్పుడు, ఖైదీలు చదువుకోవడానికీ, వినోద కాలక్షేపం చెయ్యడానికీ అవకాశాలు సమకూరినప్పుడు తేడా కనిపిస్తుంది. ఐదారు నెలలకోసారి వినోద కాలక్షేపానికి తీసుకొనిపోతే ఏం లాభం?

మీరు చేసే పనులన్నీ పైపై చూపుడు పనులే. ఖైదీల సమ్మేళనాన్ని ఎందుకని ఏర్పాటు చేశారు. రాజ్యంలో వున్న 50–60 వేలమంది ఖైదీలలోనుంచి, ముప్ఫయి–నలభైమంది ఖైదీలను, వారికి తెల్లబట్టలు వేసి తీసుకొనివెళ్ళారు. మీరు మీ యజమానులు కూడా అంతటి తెల్లబట్టలను ఎప్పుడన్నా ధరించారో లేదో మరి! రోజూ వారికి అటువంటి బట్టలే ఇస్తే నా కెలాంటి అభ్యంతరమూ లేదు. కేవలం 'బందీ సమ్మేళనం' లో పాల్గొనడానికే అయితే మోసం, బూటకం, నాటకం, ఆ సమ్మేళనంలో ప్రసంగించినవారెవరు? వీరిలోని కొందరు ముందుగానే రాసి, బట్టీ పట్టించిన ఉపన్యాసాలను చిలుకపలుకుల్లా వల్లె వేసి వచ్చారు. ఈ చిలుకల మనస్సుల్లో ఉన్న మాటలను నాలుక మీదికి రానివ్వలేదు. నిజంగా ఉన్నదున్నట్లు విషయాలను చెప్పగలిగేవారిని వెళ్ళనివ్వనేలేదు. ఆ కాలంలోనే మేము కూడా బందీలమయ్యే ఉన్నాం కదా! 'నాలుక వున్న ఖైదీలు పాల్గోనటువంటి' 'బందీ సమ్మేళనం' ఎటువంటి సమ్మేళనం?' అని మా పత్రిక చౌఖంభా కూడా రాయలేదు. భారతదేశపు రాజకీయాలు బూటకంగా, శవప్రాయంగా తయారైనాయి. ఉత్తమమైన ఆదర్శాలున్న వారుకూడా, చైతన్యాన్నీ, గ్రహించగల శక్తిసామర్థ్యాలను కోల్పోతున్నారు.

నైనీ జైలునుంచి బ్రజ్‌మోహన్ గోయల్‌ను ఎలా పట్టుకొని వచ్చారో తెలియదు. లక్నో, ఢిల్లీకి చెందిన ఇలహాబాద్ మంత్రులనూ, మిమ్మల్నీ ఆయన బాగా

ఎరిగివున్నాడు. మీరు కూడా ఆయన్ని బాగా ఎరిగివున్నారు. 'ధర్మయుద్ధం' అన్న ఆయన పుస్తకాన్ని చూశారా? శాసనాలు, జైళ్ళు, ఇలహాబాద్ మంత్రులను గురించి చాలా విపులంగా రాశారు. ఆ పుస్తకమే కదా గొప్ప సంచలనాన్ని సృష్టించింది. తన ప్రసంగానికి ముందుగానే ఆ పుస్తకాన్ని సభలో పంచిపెట్టడానికి ఉపక్రమించాడు. ఆయన కూడా ఖైదీయే కదా! వెంటనే పట్టుకుని మళ్ళీ జైలుకు పంపించారు. ఖైదీల మహాసభ కోసమని నైనీ నుంచి లక్నోకు ఆయన్ను తీసుకునిరానైతే వచ్చారుగానీ, గప్‌చిప్‌గా మళ్ళీ తీసుకొనివెళ్ళారు. ఈ సంగతి ఎవరికీ తెలియను కూడా తెలియదు. దేశప్రజలూ, పాలకులూ, పత్రికారచయితలూ ఇలా ఉన్నారు. రహస్యమైన వార్తను సేకరించాలన్న సంకల్పమే లేదాయె. మరో హృదయవిదారకమైన సంఘటన కూడా జరిగింది. మీ ముఖ్యమంత్రిగారు, ఖైదీల సమ్మేళనం సందర్భంగా ఒక నెలరోజులపాటు శిక్ష తగ్గిస్తున్నట్లు 12-13 నవంబరు నాడు ప్రకటించారు. వేలాది మందికి ఆశలు కల్పించారు. నిరీక్షిస్తూనే ఉండిపోయారు. డిసెంబరు 17 నాటికిగాని విడుదల జరుగలేదు. జైలులో బందీలైన ఖైదీల విషయంలో ఈ రకంగా పిల్లీ-ఎలుక ఆటలు ఆడుకోవడం మంచిదికాదు.

సంస్కరణలు ఎలా జరుగుతాయి? అసత్యపు పునాదుల మీదనే భవనాన్నంతటినీ నిలబెడితిరాయె! 109వ నిబంధన క్రింద (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్) ఇంతమంది ఖైదీలుంటారని నేను ఊహించలేదు. ఈ నిబంధన ఏమిటో మీకు తెలుసుకదా! ఆవారా (తిరుగుబోతు) నిబంధన. ఆంగ్లేయులు అప్పుడప్పుడూ దీన్ని మాకు వ్యతిరేకంగా కూడా వినియోగించారు. పూర్తిగా అటవికమైన నిబంధన. ఆ రోజుల్లో మీరు కూడా ఇలాగే అంటుండేవారు. భారత రాజ్యాంగానికి ఇది వ్యతిరేకమని నా అభిప్రాయం. రాజ్యాంగం ఎక్కడెక్కడ ఎంతమేరకు ఉల్లంఘింపబడుతున్నదో పాపం. నా ఒక్క విషయంలోనే రాజ్యాంగపు ఐదు ఎముకలు విరిగిపోయాయి. ద్రవిడకళగం వారు కేవలం దీని పుస్తకాన్ని, దీని ప్రతీకను మాత్రమే కాల్చివేస్తున్నారు. మీరూ, మీ యజమానులైతే దీని ఎముకలనే విరిచిపారేస్తున్నారు. పెద్ద దేశ ద్రోహులెవరు? 109వ నిబంధనను ఇప్పటివరకూ ఎందుకని కొనసాగిస్తున్నారు? దీని బూటకపు విస్తృతి మీకు తెలియదా ఏమి? ఒక ఇనుప చువ్వ, ఒక మైనపువత్తి, ఒక అగ్గిపెట్టె. ఈ మూడు వస్తువులను పోలీసులు న్యాయస్థానం ముందు చూపించి, ఫలానా వ్యక్తినుంచి వీటిని అర్ధరాత్రి పట్టుకున్నామని ఒక్కమాట చెపితే చాలు, అతనికి

ఏడాదిపాటు నిర్బంధం తప్పదు. మీ రాజ్యం నిండా 109 నిబంధన. క్రింద ఖైదులో ఉన్నవారి సంఖ్య నాలుగైదు వేలవరకూ ఉంటుందని నా అనుమానం. అదే లెక్క ప్రకారం దేశమంతటా 15 లేదా20 వేల మంది ఉండిఉంటారు. దొంగస్వభావం, దొగతనపు అలవాటున్న వారు వీరిలో దాదాపు సగం మంది ఉంటారు. మిగతా వారినందరినీ పోలీసులూ, మేజిస్ట్రేట్లూ, జైళ్ళూ కలసి దొంగలుగా తయారు చేస్తున్నాయి.

నేను చెప్పదలచుకున్న అసలు విషయం వేరు. న్యాయస్థానాలనూ, మేజిస్ట్రేట్లనూ దొంగలుగా మార్చేది– ఒకే ఒక్క ఇనుప ఊచను చూపించి వందలాది మందికి శిక్షలు వేయిస్తున్నారన్న సంగతి–ఈసారి నాకు అవగతమైంది. శిక్షించాల్సిందిగా కోరేవాడూ, శిక్షించేవాడూ, శిక్షను అనుభవించేవాడు అందరికీ తెలుసు, మన న్యాయవ్యవస్థ అబద్ధాల పునాదుల మీద నిలబడి ఉన్నదని, శిక్షపొందే వారు నిజంగానే ఎక్కువమంది దొంగలే అనుకుందాం. అయినప్పటికీ వారికి ఇచ్చే శిక్షను ధృవపరచుకోవడానికి ప్రభుత్వమూ, మేజిస్ట్రేట్లు ఎంతగా అబద్ధాలాడు తున్నారు? అబద్ధం, దొంగతనం క్రమంగా అలవాటైపోయింది. మొదట ప్రభుత్వమూ, మేజిస్ట్రేట్లు దొంగలపట్ల దొంగతనంగానూ, అబద్ధంగానూ వ్యవహరిస్తారు. తరువాత నాబోటి వారిపట్ల కూడా అదే విధంగా వ్యవహరించటం. అలవాటేగద! అందువల్ల ప్రభుత్వోద్యోగ బృందం అలవాట్లనూ, న్యాయస్థానాల అలవాట్లనూ పతనం కాకుండా చూడవలసి ఉంటుంది. మొదట నాకీ విషయం తెలిసేది కాదు. ఇప్పుడు నాకు తెలిసివచ్చింది. దోషులకు కూడా సత్యం, నియమ నిబంధనల ప్రకారం శిక్ష విధించాలి, లేకపోయినట్లయితే అనేక మంది నిర్దోషులు చిక్కుపడిపోతారు. 109 నిబంధన క్రింద నిర్బంధంలో వున్న ఒకడు, తన సోదరుని నుంచి పదిపన్నెండు సంవత్సరాలుగా విడిపోయివున్నాడు. అతని సంగతి ఇతనికిగానీ ఇతని సంగతి అతనికిగానీ తెలియదు.

ఈసారి నేను దుఃఖాన్నీ, దుఃఖితులనూ గురించి మరికొంత అధికంగా తెలుసుకోగలిగాను. దుఃఖితుల వ్యధలనూ, దుఃఖితులైనవారే సరిగ్గా అర్థం చేసుకోగలుగుతారు. దాదాపు ప్రతి నగరంలోనూ ఇంత భారీగా దుఃఖాలయాలు నెలకొని ఉన్నాయని ఇంతకు ముందు నాకు తెలియదు. ఇదే లక్నోలో, ఇంకా

ఇతర చోట్ల చిన్నవీ, పెద్దవీ ఇంకా ఎన్ని జైళ్ళున్నాయో! జైళ్ళ పేరుతో లేనటువంటి దుఃఖమందిరాలు, జైలు బయట ఉన్నటువంటివి కూడా ఎన్ని ఉన్నాయో! వారి దుఃఖం మాత్రం ఏమంత తక్కువదని? గుమటహీకి చెందిన టేంగరీ హరిజనుడు నవంబరు 7వ తేదీన ఆకలితో చచ్చాడు. ఏడు రోజుల తర్వాత అతని కుమారుడు హరికిరణ్ కూడా ఆకలిచావు చచ్చాడు. ఈ వార్త నేను చదివినప్పటికీ, అతని భార్య, మరో ముగ్గురు సంతానం కూడా మరణాసన్నులై ఉండేవారు. ఇలా వేలాది మంది పిడికెడు తిండిలేక తపిస్తున్నారు, చచ్చిపోతున్నారు. పగలూ-రాత్రీ అనకుండా పొట్టలో అగ్ని కోట్లాదిమందిని తపింపచేస్తున్నది. తన బిడ్డకు ఒంటినిండా గుడ్డ కప్పలేక ఒకచోట ఒక తల్లి కన్నీరు కారుస్తున్నది. మరొకచోట ఒక తండ్రి తన కొడుక్కు సరైన చదువు చెప్పించలేకనో, సరైన మందులు ఇప్పించలేకనో తలబ్రద్దలు కొట్టుకుంటున్నాడు. వీరంతా దుఃఖితులే. నేనూ దుఃఖితుణ్ణే. వీరి దుఃఖాన్ని ఇప్పుడు నేను అధికంగా గ్రహించగలుగుతున్నాను. మా ఉభయుల దుఃఖానికి కారణం చాలా వరకు ఒకే రకమైంది. వీరిలో చాలామంది మిమ్మల్ని శపిస్తూ ఉండవచ్చు. శపించడం నాకు తెలియదు. తెలుసుకోవాలన్న కోరిక కూడా లేదు. శపించడం బలహీనుల ఆయుధం. అంతేకాదు దౌర్భల్యాన్ని జీవితంలో ఒక అంగంగా, ఒక అనివార్య భాగంగా రూపొందించుకోవడం కూడా. ఈ దుఃఖితులందరూ ఏ నాటికైనా బలవంతులు కావాలని నా ఆకాంక్ష. అప్పుడే నాకు ఆనందం.

ఈ ఉత్తరమంతా మీరు చదవవలసిన పనిలేదు. జైళ్ళమంత్రి అయినందువల్ల మీరు ఒక చిరునామా మాత్రమే. ఉత్తరం అంతా ఒకవేళ చదివినట్లయితే, ఎక్కడన్నా మీ మనస్సు నొచ్చుకుంటే, నాకు సమాధానం రాయడానికి మాత్రం పూనుకోవద్దు.

భవదీయుడు

**రామమనోహర లోహియా**

20-12-57

**తా.క.** : ఈ రోజు 21వ తేదీ ఉదయం నా కొక ఉత్తరం అందింది. దానివల్ల నేను 9 నవంబరు నాడు పంపిన ఉత్తరాలు ఇక్కడి నుంచి 30 నవంబరున జారీ అయినట్లు తెలిసింది.

# రామాయణ తిరునాళ్ళు

తెలుగు : ఘట్టమ రాజు

1961వ సంవత్సరం ఫిబ్రవరి 15-25 తేదీల మధ్యకాలంలో చిత్రకూటంలో రామాయణ తిరునాళ్ళు జరగనున్నాయి. చిత్రకూటం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌ల సరిహద్దులో వుంది. ఈ రామాయణ తిరునాళ్ళలో జానపద, శాస్త్రీయ సంగీత, నృత్య కార్యక్రమాలు, రామాయణానికి సంబంధించిన ఉపన్యాసాలు, నాటక ప్రదర్శనలు వుంటాయి.

భారతదేశంలోని, విదేశాల్లోని రామాయణ సంబంధమైన జానపద, శాస్త్రీయ నాట్య ప్రదర్శనలు ఏర్పాటు చేయబడతాయి. తులసీరామాయణంతోపాటు తెలుగు, తమిళం, కన్నడం, మలయాళీ ఇతర దేశీ విదేశీ భాషల్లోని రామాయణాలపై ప్రసంగాలు, ప్రదర్శనలు వుంటాయి.

వాల్మీకి రామాయణ ప్రవచనాలు వుంటాయి. రెండు, మూడు వేదికల మీద 150-200 గంటలపాటు రామాయణ ప్రదర్శనలుంటాయి. అలానే సుమారు 50 గంటలసేపు రామాయణంలోని వివిధ తత్వాలకు, సిద్ధాంతాలకు సంబంధించిన ప్రదర్శనలతో కూడుకొన్న ప్రసంగ కార్యక్రమాలుంటాయి. ప్రముఖ వక్తలు కేవలం సాంస్కృతిక విషయాల గురించే ప్రసంగాలు చేస్తారు. ఎలాంటి రుసుం చెల్లించకుండా ఎవరైనా సరే ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనవచ్చును. అయితే, ఈ ప్రదర్శనలు జరిగేటప్పుడు ప్రదర్శనశాలలోని ముందు స్థలంలో కొంత భాగం అతిథులకు రిజర్వు చేయబడి వుంటుంది.

దేశంలోని వివిధ ప్రాంతాలనుండీ, విదేశాల నుండీ వచ్చేవాళ్ళు ఇక్కడ భోజన, వసతి సౌకర్యాలు కావాలనుకుంటే 200, 300, 500 రూపాయల శుల్కం చెల్లించి దానికి అనుగుణమైన సౌకర్యాలు పొందవచ్చు.

మతం, రాజకీయాల మధ్య వున్న సంబంధం చెడిపొయ్యింది. మతం దీర్ఘకాలం నాటి రాజకీయమైతే, రాజకీయం అల్పకాలం నాటి మతం అనొచ్చు. మతం విశ్వజన శ్రేయస్సు కోసం ప్రయత్నిస్తుంది. రాజకీయం దుష్టశక్తులతో పోరాడుతుంది. సంఘంలోని చెడ్డతో పోరాటం సాగంచడంలో మతానికి స్థానం లేకుండాపోయింది. ఒక విధంగా చెప్తే మతం సత్తువ కోల్పోయిందని చెప్పొచ్చు. అలాంటప్పుడు ఈ దుస్థితిని పాడుకాలం అంటే తప్పుకాదు కదా? తులసీ రామాయణంలో నిజంగా కొన్ని విలువైన విషయాలున్నాయి. అలాగే చాలినంత చెత్తాచెదారం కూడా వుందనవొచ్చు. తులసీరామాయణంలో మంచిచెడ్డలు పాలూనీళ్ళలాగా కలిసిపోయాయని చెప్పొచ్చు. మంచిచెడ్డలు కలగలిసి తులసీరామాయణానికి ఎక్కడలేని పవిత్రతను ఆపాదించి పెట్టాయి. అంతేకాదు అది భారతీయుల వివేకాన్ని కోల్పోయేలా చేసింది, న్యాయాన్యాయ విచక్షణ దృష్టిని పోగొట్టింది కూడా. కోట్లాది భారతీయులకు ఆ వివేకాన్నీ, ఆ విచక్షణా సామర్థ్యాన్నీ మళ్ళీ కలిగించాలన్నదే ఈ రామాయణ తిరునాళ్ళ ప్రదర్శన.

పేదసాదల కోసం, పేదలే నిర్వహిస్తున్న మహాకార్యక్రమం ఇది. ఈ విశిష్టమైన, బ్రహ్మాండమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడానికై మేం శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. కాని ఈ తిరునాళ్ళు జరపడానికి అవసరమైన నిధులు సమకూర్చుకోవడానికి మేం కిందా మీదా పడుతున్నాం. ఈ తిరునాళ్ళు నిర్వహించుకోవడానికి ఎవరైనా ఆర్థికసాయం చేయదల్చుకుంటే, ఇంకా వివరంగా తెలుసుకోదల్చుకుంటే ఈ చిరునామాతో సంప్రదింపులు జరపాలని ప్రార్థిస్తున్నాం– రామాయణ తిరునాళ్ళు, కలకత్తా ధర్మసత్రం, చిత్రకూటం, బాందా జిల్లా, ఉత్తరప్రదేశ్.

## రామాయణ తిరునాళ్ళు – పార్టీలు

ఫిబ్రవరిలో చిత్రకూటంలో జరిగే రామాయణ తిరునాళ్ళకు లేక, జనవరిలో ఉజ్జయినీలో జరిగే 'ఇంగ్లీషును పారదోలండి' ఉద్యమానికీ, మార్చిలో పాట్నాలో జరిగే జాతి నిర్మూలన సమ్మేళనానికీ సోషలిస్టు పార్టీకి ఎలాంటి సంబంధమూ లేదు. ఈ సమ్మేళనాలు నిర్వహించడంలో సమాజవాదులు పార్టీ తరపున కాకుండా

వ్యక్తిగతంగా పాలుపంచుకోవచ్చు. కాంగ్రెసువాదులు, కమ్యూనిస్టులు, ఏ రాజకీయపార్టీకి చెందనివాళ్ళు ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో వ్యక్తిగతస్థాయిలో పాల్గొనవచ్చు.

## రామాయణ తిరునాళ్ళు - ఆశయాలు, పనులు (1960)

రామాయణ తిరునాళ్ళు అయోధ్యలో జరిపితే బాగుండేది. కాని, ఆ నగరం ఏడాది పొడుగునా వేలాది తీర్థయాత్రికులతో కిటకిటలాడుతూ వుంటుంది. అందువల్ల అక్కడ జరపాలని అనుకోలేదు. ఇక చిత్రకూటాన్ని ఎందుకు ఎన్నుకొన్నారు అని అడుగుతారా? ఈ ప్రదేశం అందచందాలు వొలికించే ప్రకృతితో ఆబాలగోపాలాన్నీ అలరిస్తుంది. కాబట్టి రామాయణ తిరునాళ్ళు జరపడానికి ఇది తగిన చోటని నిర్ణయించాం. ఎలాంటి పండుగలు- పబ్బాలు లేని సమయంలో, వాతావరణం ఆహ్లాదకరంగా వున్న కాలంలో అంటే ఫిబ్రవరి 15-24 తేదీల్లో ఈ రామాయణ తిరునాళ్ళు జరపడం మేలని భావిస్తాను.

నన్ను చాలామంది తిరునాళ్ళు అంటే ఏమిటని అడుగుతుంటారు. ఈ తిరునాళ్ళలో ఏమేమి కార్యక్రమాలు జరపాలని నలుగురు కలిసి చర్చించుకుంటే బాగుంటుంది. ఎందుకంటారా, ఒక్కొక్కరి మనస్సులో ఒక్కో రకమైన భావాలుంటాయి. జిహ్వకొక రుచి, పుర్రె కొక బుద్ధి అన్నారు కదా పెద్దలు. ఇలా పదిమంది ఒకచోట కూర్చొని, ఓ విషయం గురించి మాట్లాడుకొంటే భిన్నాభిప్రాయాలు రావొచ్చు. అదీ మంచిదే. అందరు కలిసి చర్చించుకొన్న తర్వాత కొన్ని నిర్ణయాలు తీసుకొని, కార్యక్రమం రూపురేఖలు తీర్చిదిద్దవచ్చు. నేను నా అభిప్రాయాల్ని ఖరాఖండిగా చెప్తే, మిగతావాళ్ళు నొసలు చిట్లించరుకదా? రామాయణ తిరునాళ్ళు జరపడంలో నా అభిప్రాయాలివి. 1. ఆనందం 2. దృక్పథం 3. రసావిష్కరణ 4. భారతీయ సంస్కృతిని పెంపొందించడం.

రామాయణం అన్న వెంటనే మనవాళ్ళు దాన్ని భగవంతునికి లంకె వేస్తారు. ఈ తిరునాళ్ళు ఇక్ష్వాకుల కాలం నుంచీ ప్రజలకు సచ్చిదానంద, బ్రహ్మానందాల్ని కలిగిస్తున్నాయి. వీటి గురించి ప్రజలకు రకరకాల అభిప్రాయాలు వుంటాయి. అందరి భావాలూ ఒక్కలాగుండవు. కాబట్టి అనిర్వికల్ప నిరాకారతత్వం గురించి

భిన్నాభిప్రాయాలుండటం సహజమే. ఇంతకీ ఈ తిరునాళ్ళలో ఆస్తికులూ పాల్గొంటారు, నాస్తికులూ పాలుపంచుకొంటారు. ఈ రెండు వర్గాలవాళ్ళూ ఆనందిస్తారు. చిత్రంగా లేదూ? ఈ రెండురకాల వాళ్ళ అభిప్రాయాల్ని సమన్వయం చేస్తే తయారయ్యే మూడో అభిప్రాయం ఎంత బాగుంటుందని? ఈ తిరునాళ్ళల్లో పాల్గొనేవాళ్ళు ఆ పరమేశ్వరుణ్ణి, ఆ పరాత్పర, పరబ్రహ్మను చర్చనీయాంశంగా పెట్టుకోకూడదు సుమా! ఈ ఉత్సవాల్లో పాల్గొనేవాళ్ళు ఆనందమే ప్రధానంగా భావించాలి. ఆస్తికులు ఈ తిరునాళ్ళలో ఓ రకంగా ఆనందిస్తే, నాస్తికులు మరో విధంగా ఆనందానుభూతి పొందుతారు. ఆస్తికులకు సంగీతం, నాట్యం, నాటకం, సాహిత్యగోష్ఠుల వల్ల సంతోషం కలుగుతుంది. అయితే ఇక్కడ ఓ చిక్కు ఎదురవుతుంది. తులసీరామాయణం చదివి ఆనందించేవాళ్ళు, దాన్ని మతం రీత్యా గౌరవిస్తారు, పూజిస్తారు కూడా. దీన్ని చాలా మంది పవిత్ర పారాయణ గ్రంథంగా భావిస్తూ, తలపై పెట్టుకొంటారు. తులసీ రామాయణంలో నిత్యజీవితానికి ఉపయోగపడే ఎన్నో సుభాషితాలు, సామెతలు, తారసపడతాయి. అవన్నీ భక్తుల హృదయాల్లో గూడు కట్టుకొని వున్నాయి. తులసీరామాయణంలోని ఎన్నో సూక్తులు ప్రజలకు దారిదీపాలుగా మార్గదర్శకత్వం వహిస్తున్నాయి.

తులసీరామాయణంలోని కొన్ని సూక్తులు జీవితాన్ని నీటిబుడగగా చిత్రిస్తూ ఈ బతుకు అశాశ్వతమని బోధిస్తాయి. మరి కొన్ని స్త్రీలను, శూద్రుల్ని నిందిస్తాయి. గోబ్రాహ్మణుల్ని పూజించాలన్న పాఠాలు చెప్తాయి. ముత్యాల్ని ఏరుకోవాలంటే చెత్తాచెదారాన్ని తొలగించాల్సిందే. అలాగే మురికి పదార్థాల్ని వేరుచేసేటప్పుడు విలువైన ముత్యాల్ని పారవేయరాదు. రామాయణ తిరునాళ్ళలో రామాయణానికి సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాల్ని రూపొందించేటప్పుడు మంచిచెడ్డల్ని గుర్తించగలిగే వివేకదృష్టిని ప్రజల్లో కలిగించాలన్న సంగతి మరవకూడదు.

ప్రజల చూపు నిశితంగా వుండాలి. ఒక విషయం గురించి చాలా లోతుగా ఆలోచిస్తూ, ఉదాత్తమైన లక్ష్యం వైపు చూపు నిలపాలి. ఇలాంటి దృక్పథం కలగాలంటే వస్తువుల, విషయాల పట్ల తులనాత్మక దృష్టిని అలవరచుకోవాలి. ఈ విలక్షణమైన దృష్టి మూడు విధాలుగా వుంటుంది. తులసీరామాయణాన్ని విదేశీ రామాయణాలతో పోల్చి చూడటం మొదటిరకం. భారతీయ భాషల్లోని రామాయణ రచనలతో, ఇతర

రచనలతో తులనాత్మకంగా పరిశీలించడం. మూడవరకం – తులసీదాసు రచనల్ని ఇతర హిందీ కవులతో పోలుస్తూ పరిశీలించడం.

భారతీయ భాషల్లోని రామాయణాల్ని లోతుగా అధ్యయనం చేసి, వాటి వైశిష్ట్యాన్ని పదిమందికీ తెలిపే విద్వాంసుల్ని ఒకే వేదికపైకి రప్పించడం, తులసీదాసు రామాయణాన్ని ఇతర భాషల రామాయణాలతో పోలుస్తూ, వాటి తారతమ్యాల్ని వివేచించడం, పండితులు తమ భాషల్లోని రామాయణాల్లోని కొన్ని విశిష్టమైన భాగాల్ని వినిపించి, ఆ విశేషాల్ని హిందీభాషల్లో వ్యక్తం చేయడం. రామాయణ మర్మజ్ఞులు తమ ఉపన్యాసాన్ని 10–15 నిమిషాల్లో శ్రోతలకు అర్థమయ్యేలా ముగిస్తే చాలు, అదే పదివేలు.

రామాయణ తిరునాళ్ళలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలన్నింటినీ శ్రవణ, దృశ్యయంత్రాల ద్వారా రికార్డు చేసి, భద్రపరిస్తే రాబోయే తరాలవాళ్ళకు ఎంతగానో ఉపయోగపడే అవకాశం లభిస్తుంది.

12వ శతాబ్దం నాటి చంద్‌బర్‌దాయీ నుంచి ఆధునిక కవి నిరాలా దాకా ఆయా కవుల ఆకారాల్లో కొలువు తీరిన హిందీ కవుల సభను నిర్వహించాలి. ఓ 20–30 మంది మహాకవుల శ్రేష్ఠమైన కవితల్ని 5 నుంచి 10 నిముషాల కాలం పాటు గానం చేయాలి ఆ మహాకవుల జాబితాను ఓ కమిటీ తయారుచేయాలి.

సంస్కృత రామాయణ, భారత, భాగవతాల గురించి, ఇతర భారతీయ భాషల్లో వెలువడ్డ పై గ్రంథాల గురించి శ్రోతలకు  తెలుసుకొనేందుకు వీలుగా హిందీలో ఉపన్యాసాలు ఇప్పించాలి. వాల్మీకి నుంచి తులసీదాసు దాకా కవులు, నాటకకర్తలు చిత్రించిన సీతారామలక్ష్మణ, ఆంజనేయాదుల గురించి, భారతదేశంలోని వివిధ భాషల్లోని జానపద కావ్యాల్లో వీళ్ళ పాత్రచిత్రణ గురించి విద్వాంసులు ప్రసంగించాలి. విదేశీ భాషల్లో రామాయణ, భారత, భాగవతకథలు ఎలా రూపొందాయో తెలియచేసే విదేశీ విద్వాంసుల ఉపన్యాసాలు తప్పనిసరిగా వుండాలి. వీటివల్ల బారతదేశ సంస్కృతిలోని భిన్నత్వంలోని ఏకత్వం స్పష్టం కావాలి. ఉపన్యాసకుల్ని ఎన్నిక చేయడంలో కమిటీ సభ్యులు చాలా జాగ్రత్త వహించాలి.

విదేశాల్లో వున్న హిందీ విద్వాంసుల్ని ఆయా దేశ రాయబార కేంద్రాల

ద్వారా సంప్రదించి, రామాయణ తిరునాళ్ళకు ఆహ్వానించాలి. కార్యక్రమాలు, సంప్రదింపులు హిందీభాషలోనే జరగాలి.

రామాయణ ప్రవచనాలు, ఉపన్యాసాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలన్నీ హిందీలో రసవంతంగా సాగాలి. తర్వాత కథక్, భరతనాట్యం, కథాకళి, మణిపురి మొదలైన నాట్యాల ద్వారా కబీరు, తులసీదాసు, జాయసీ, ఖుస్రో, రహీమ్ మొదలైన ప్రాచీన హిందీ కవుల కవితా వైశిష్ట్యాన్ని వెల్లడించాలి. ఈ కార్యక్రమం సంగీత, నాట్యరూపంలో ప్రదర్శింపబడాలి.

రామాయణ తిరునాళ్ళకు సంబంధించిన కేంద్రాలు పనిచేస్తున్న మాట నిజమే. కాని అవి మరింత శ్రద్ధాసక్తులతో శ్రమించాలి. పైన పేర్కొన్న హిందీ కవులతోపాటు, రామాయణ, భారత, భాగవతాల గురించి రచనలు చేసిన ఆధునిక హిందీ సాహిత్యవేత్తలు కూడా వున్నారు. అలాగే ఇతర భారతీయ భాషల్లోని ప్రసిద్ధ కవి, పండితులతో ఆయా భాషల్లోని రామాయణ సంబంధ రచనల విశేషాల్నీ వెల్లడించే కార్యక్రమాల్ని నిర్వహించాలి.

ఈ రామాయణ తిరునాళ్ళ సందర్భంగా రెండు, మూడు వేదికలు ఏర్పాటు చెయ్యాలి. ఒక వేదికపై రామ భరతుల కలయిక, ఇంకో వేదికపై చిత్రకూటంలోని నది గట్టున లేకపోతే మందాకినీ నదీతీరంలోనో వేర్వేరు దృశ్యాల్ని రమణీయంగా ప్రదర్శించాలి.

ఈ సందర్భంలో దేవనాగరి లిపికి, ఇతర భారతీయ భాషల లిపులకు గల సామ్య, వైషమ్యాల్ని వెల్లడించే ఉపన్యాసాలు ప్రతిభావంతులైన విద్వాంసులతో చేయించాలి. ఈ సమయంలోనే 'ఇంగ్లీషును పారదోలండి' నినాదాలు చేస్తూ ఉద్యమ సంబంధ ప్రసంగాలు చేయించాలి.

తులసీదాసు గొప్పతనం గురించి ప్రత్యేకంగా వర్ణించి చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన నిజంగానే మహాకవే. అందులో అనుమానం లేదు. ఆయన రచనల్లోని విశిష్టతను తెలియచెయ్యాలి. తులసీదాసు కవిత్వం గురించి నా అభిప్రాయాన్ని తెలియజేస్తాను. మీరు నా మాటలతో ఏకీభవించాలని నేననను. తులసీదాసు మానవీయ విలువల్ని రక్షించే బాధ్యత వహించిన కవి. భారతదేశంపై విదేశీయులు దండెత్తి, దేశాన్ని చిన్నాభిన్నం చేస్తున్నప్పుడు జీవన విలువల్ని రూపుమాపుతున్నప్పుడు

తులసీదాసు ప్రజల్లో జీవితం పట్ల నమ్మకం కుదిరేలా రచనలు చేశారు. ప్రజల్లో జీవితాసక్తిని పెంపొందించారు.

తులసీరామాయణం ఆనాటి సంక్షుభిత వాతావరణంలో ప్రజలకు ఊరట కలిగించడంలో ఆత్మవిశ్వాసం, జీవనప్రీతి చేకూర్చడంలో ప్రధాన భూమిక నిర్వహించిందని చెప్పొచ్చు. ప్రజల్లో ఆత్మబలం పుంజుకొన్నప్పుడు రసానందంకై, మత సంబంధంలేని మరోరకం కవిత్వం పుట్టుకు రావాల్సింది.

రామాయణ తిరునాళ్ళను జరపాలంటే కార్యనిర్వాహకులు కలిసికట్టుగా, శాయశక్తులా పనిచేయాల్సివుంటుంది. నేను అలహాబాదులోని ప్రొఫెసర్ విజయదేవ నారాయణ్ సాహీ, లక్ష్మీకాంత్ వర్మ, వీరేంద్రసింహ్‌గార్లతో చర్చ ప్రారంభించినప్పుడు చిత్రకూటంలోని కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. వీరేంద్రసింహ్‌గారు పూనిక వహించడం వల్ల ఈ చర్చ కొనసాగింది. అలహాబాద్‌లోని డా. రామ్‌కుమార్ వర్మ, డా. ఉదయ్ నారాయణ్ తివారి, డా. రఘువంశ్, జాయస్వాల్ ప్రభృతులు మరింత ఆసక్తి చూపారు. ఇక అలహాబాద్‌లో రామాయణ తిరునాళ్ళ కమిటీ శాఖను ప్రారంభించి, తిరునాళ్ళ రూపురేఖల్ని, కార్యక్రమాల్ని బలోపేతం చేయాలని నిశ్చయించుకొన్నాం. చిత్రకూటంలో కూడ ఓ తత్కాలపు కమిటీని స్థాపించాలని అనుకొన్నాం. అలాగే బ్రహ్మచారి, బాబా బన్వారీదాస్ మొదలైన వాళ్ళు అయోధ్యలోనూ, జబల్‌పూర్, బనారస్ వగైరా ప్రాంతాల్లోనూ కమిటీలు స్థాపించి, తిరునాళ్ళ నిర్వహణకు సంబంధించిన పనుల్ని ఉధృతం చేయాలని నిశ్చయించాం.

ఈ కమిటీలు, కొన్ని ఉపసమితుల్ని ఏర్పాటు చేసి పనులు మొదలుపెట్టాలని సూచించాం. వీలయితే అక్టోబరు 24,25 తేదీలలో చిత్రకూటంలో ఓ సమావేశం ఏర్పాటు చేసి, ఈ కమిటీల సభ్యులందర్నీ ఆహ్వానించి చర్చలు జరపాలనీ, తిరునాళ్ళ కార్యక్రమాల్ని రూపొందించాలనీ అనుకొన్నాం. ఈ సమావేశంలో పాల్గొనే అవకాశం స్త్రీలకు, శూద్రులకు, హిందీ భాషీయులకు, ఇతర భాషలు మాట్లాడేవాళ్ళకు, ఇతర మతస్థుల వాళ్ళకు కొంతవరకైనా వుండాలని సూచించాను. రామాయణ తిరునాళ్ళ కాలంలో 250, 300 రూపాయల శుల్కం చెల్లించి భోజన, వసతి సౌకర్యాలు పొంది, చిత్రకూటంలో వుండేలాగున కమిటీ చూడాలని అనుకొన్నాం. ఇలానే దేశం నలుమూలల నుండి 500 లేదా 1000 మంది వచ్చి, తిరునాళ్ళలో పాల్గొంటే

బాగుంటుందని చెప్పాను. తిరునాళ్ళను సందర్శించిన కొంతమంది సంతోషంగా, స్వచ్ఛందంగా, ఆర్థికంగా కూడా తోడ్పడవచ్చుననుకొంటాను.

రాష్ట్ర ప్రభుత్వాలు, మున్సిపాలిటీలు, నగర కార్పొరేషన్లు కూడా బహుశా ఆర్థికంగా తోడ్పడవచ్చు. అయితే ఇవి తిరునాళ్ళ నిర్వహణలో జోక్యం కలిగించుకోకుండా వుండాలి. ఈ సంస్థల నుంచి చందాలు, విరాళాలు మాత్రమే స్వీకరించాలి. తిరునాళ్ళు జరిగేటప్పుడు ఇక్కడికి రావడానికి రాదారి మార్గాల్ని, తాగునీటిని, విద్యుద్దీపాల్ని ఏర్పాటు చేసే బాధ్యత ప్రభుత్వ, మున్సిపాలిటీలే వహించాలి కదా. తిరునాళ్ళకయ్యే ఖర్చుల నిమిత్తం స్థానిక ప్రభుత్వ యంత్రాంగమే ముందుకు రావాల్సివుంటుంది. ఉత్తరప్రదేశ్ మంత్రివర్యులు డా. సంపూర్ణానంద్‌గారు మంత్రి స్థాయిలో పాల్గొంటే మంచిది. అయితే ఆయనకు చెందాల్సిన గౌరవ మర్యాదల్ని తిరునాళ్ళ కమిటీ తప్పకుండా కల్పిస్తుంది.

ఉన్నట్టుండి నాకో ఆలోచన కలిగింది. అలహాబాద్‌లో వుంటున్న ఉషాసక్సేనా ఈ కార్యక్రమంలో త్రికరణశుద్ధిగా పనిచెయ్యగలదు కదా, అలాగే ఆమెతోపాటు మరికొందరు యువతులు కూడా పాల్గొంటారు కదా! అన్న భావన కలిగింది. చిత్రకూటంలోనూ, అయోధ్యలోనూ, రామచరిత మానస్‌లోని వందలకొద్దీ చౌపాయిల్నీ, దోహాల్నీ శ్రావ్యంగా పాడగల పడవ నడిపేవాళ్ళు ఎంతో మంది వున్నారు. వాళ్ళను కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని మనం కోరాలి.

## రామాయణ తిరునాళ్ళు – ప్రయోజనాలు, ప్రణాళికలు (1961 మార్చి)

రామాయణ తిరునాళ్ళు ఏర్పాటు చేయడం వల్ల ప్రజల్లో ఆనందం, ఉత్సాహం, శాంతి, సౌభ్రాతృత్వాలు పెంపొందుతాయి. భారతదేశంలో భావైక్యం నెలకొంటుంది. రాముడు ఉత్తర – దక్షిణ భారతదేశ సమైక్యానికి ప్రతీక అన్న సంగతి అందరికీ తెలుసు. అలాగే కృష్ణుడు తూర్పు పడమరల ఏకత్వానికి చిహ్నమన్న సంగతి తెలియని వారెవ్వరు చెప్పండి. ఇకపోతే, ఆధునిక భాషాసాహిత్యానికి మూలకందం రామాయణమే కదా. తమిళంలోని కంబరామాయణం, మరాఠీలోని ఏకనాథ రామాయణం, కీర్తిదాసు రాసిన బెంగాలీ రామాయణం ఇలాగే ఇంకెన్నో

భారతీయభాషల్లో వెలువడ్డ రామాయణాలు ఆ భాషలకి కీర్తిప్రతిష్ఠలు చేకూర్చాయి. తులసీదాసు 'రామచరిత మానస్'ను కేంద్రంగా వివిధ రామాయణాల చర్చలు జరగాలి. ఆ భాషల్లోని రామాయణాల విశిష్టమైన భాగాల్ని చదివి, వినిపించి సారాంశాన్ని శ్రోతలకు పరిచయం చెయ్యాలి.

కాని ఈ రామాయణ తిరునాళ్ళ కార్యక్రమం 1961 ఫిబ్రవరిలో జరగడానికి బదులుగా అక్టోబరు 21వ తేదీకి కారణాంతరాల వల్ల మార్చబడింది. కాని ఈ రామాయణ తిరునాళ్ళు మాత్రం మనం ముందు అనుకొన్నట్లే చిత్రకూటంలోనే జరుగుతాయి. ఆర్థిక వనరులు తగినంతగా లభించక పోవడం వల్లా, మిగతా ఏర్పాట్లు జరగకపోవడం వల్లా రామాయణ తిరునాళ్ళ కార్యక్రమ తేదీల్ని మార్చవలసివచ్చింది.

మతానికీ, రాజనీతికీ వున్న సంబంధాన్ని విశ్లేషించడం కష్టసాధ్యమైన పని. ఏ దేశమైనా శాంతిభద్రతలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలంటే ఆ దేశపాలన మతాతీతంగా సాగాలి. కానీ దేశ కాల పరిస్థితులు మారాయి. మతం దీర్ఘకాలం రాజనీతిగానూ, రాజనీతి అల్పకాలం మతంగానూ రూపొందాలి. ఈ రెండింటి పరస్పర సంబంధం గురించి మేధావులు తర్జనభర్జనలు జరపాలి. మతం సత్ప్రవర్తనని, విశ్వకల్యాణాన్ని ప్రబోధిస్తుంది. రాజనీతి సంఘంలోని చెడును వ్యతిరేకిస్తుంది. చెడుతో పోరాటం సాగిస్తుంది. మంచిని పొగడడం, కోరడంతోనే మతంలో జవసత్వాలు పెంపొందవు. అంటే మతం వల్ల దేశంలో శాంతిభద్రతలు, సుఖసంతోషాలు నెలకొనవు. కేవలం చెడ్డను వ్యతిరేకించి దానితో పోరాటం సాగిస్తే దేశం ముందడుగు వెయ్యజాలదు. మతం, రాజనీతి ఇవి రెండు కలిసి దేశ సౌభాగ్యానికి పాటుపడే మార్గం ఏదైనా వుందంటారా? మతం ఏ విధంగా ప్రజల ప్రగతికి దోహదం చేయగలుగుతుంది అనే విషయం గురించి నేను ఇంకా కొంత ఆలోచించాలి. నేను నాస్తికుణ్ణి, ఆస్తికుడిగా మారకుండానే నేనీ దిశలో ముందుకు సాగాలనుకొంటున్నాను.

రామాయణ తిరునాళ్ళలో భారతీయ సంస్కృతి గురించి 20–25 ప్రసంగాలు వుండాలి. విదేశీ సాహిత్యంలోని మహాకవులైన హెూమర్, వర్జిల్, వాల్మీకి, తులసీదాసుల గురించి తప్పనిసరిగా ఓ ఉపన్యాసం వుండాలి. రెండవ ఉపన్యాసం

రాముడు, కృష్ణుడు, ఏసుక్రీస్తు, మహమ్మద్, పైగంబర్‌ల ప్రవచనాల్లోని విశిష్టత, సమానత, అసమానతల గురించి వుండాలి. మిగిలిన ఉపన్యాసాల్లో వివిధ భాషల్లోని రామాయణాల్లోని పాత్రచిత్రణ, మానవీయ సంబంధాలు, సామాజిక స్వరూపం, జాతి, కుల పరస్పర సంబంధాలు మొదలైన వాటి గురించి చర్చలుండాలి. రామాయణం, దానికి సంబంధించిన విషయాలపై పరిశోధనలు సాగించిన విదేశీ విద్వాంసులు కూడా ఈ తిరునాళ్ళలో పాల్గొనాలి. థాయ్‌లాండ్, కంబోడియా, ఇండోనేషియా లాంటి దేశాల నుండి రామాయణ ప్రదర్శనల్ని చిత్రకూటంలో ఏర్పాటు చేసేందుకు కార్యనిర్వాహకులు ఉత్తరప్రత్యుత్తరాలు జరపాలి. విదేశీ భాషల్లో వెలువడ్డ రామాయణాల్లో కొన్ని విశేషాలున్నాయి. ఖొతానీ (టర్కీ) రామాయణంలో సీత రామలక్ష్మణులిద్దరికీ భార్య, థాయీ, కంబోడియా, ఇండోనేషియా రామాయణాల్లో సీతమ్మ వదిన. మరదలు శాంత, రావణుడి బొమ్మ వున్న పటాన్ని వదిన ముందుంచుతుంది. ఆమె ముఖకవళికల్ని చూసి, ఆమె ప్రతిస్పందనన్ని చూడాలన్న తహతహ ఇందులో వ్యక్తమవుతుంది. ఇలా వివిధ భాషల్లోని రామాయణాల్ని పరిశీలిస్తే మూలకథలో పెద్ద తేడా లేదనీ, కొన్నిచోట్ల మాత్రం చిన్న చిన్న మార్పులున్నాయనే సంగతి తేటతెల్లమవుతుంది. మనకిప్పుడు కావాల్సింది మూలకథ. ఉపకథలతో, మార్పులు, చేర్పులతో అంతగా పనిలేదు.

రామాయణ తిరునాళ్ళు నిర్వహిస్తున్నది ముఖ్యంగా దరిద్ర నారాయణుల కోసం– పేదా సాదా కోసం అన్న సంగతి మరువకూడదు. ఈ సందర్భంగా జరుగబోయే కార్యక్రమాలన్ని ఆ బీదాబిక్కీ, సామాన్యజనుల కోసం. కవితా పఠనం, నాటకాలు, పాటకచ్చేరీలు, వాద్యకచ్చేరీలు – ఇవన్నీ సాధారణమైన జనుల్లో రసానందాన్ని కలిగించడమే ఆశయంగా వుండాలి.

హిందీలోని 30–35 శ్రేష్ఠమైన రామాయణ సంబంధమైన కవితలు శ్రోతలకు కవులు వినిపించాలి. అలాగే భారతీయ నాట్య సంప్రదాయాలైన కథక్, భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు రామాయణ సంబంధమైనవి ప్రదర్శింపబడాలి. తులసీదాసుగారి 'రామచరిత మానస్' విశ్వసాహిత్యంలో పేరు మోసిందే. కాని ఆ మహాకావ్యం కొన్ని చోట్ల మన వివేకాన్ని తొక్కిపట్టి, మనల్ని వెనక్కు నెట్టేసేలా చేస్తుంది. షేక్స్పియర్, గెటే, కాళిదాసు లాంటి మహాకవులు పాఠకుల మనస్సుల్ని విశాలంగా, ఉదాత్తంగా

తీర్చిదిద్దేలా కావ్యాలు రచించారు. ఇక రామాయణమంటారా ఉదాత్తమైన పాత్రల్ని చిత్రించడం ద్వారా మన మనస్సుల్ని ప్రక్షాళనం చేసి, ఉత్తమమైన మార్గంలో నడిచేలా మనల్ని ప్రేరేపిస్తుంది. మన దైనందిన జీవితంలోని సామాన్య ఘటనల్లోని నీతినియమాల్ని వివరిస్తూ మనలో మంచి–చెడు విచక్షణ గుణాన్ని కలిగిస్తూ, మనకు జీవిత విలువల్ని నేర్పుతుంది. రామాయణంలో స్త్రీల పట్ల, వెనుకబడ్డ జాతి ప్రజలపట్ల కవి చెప్పిన మాటలు వినదగ్గవీ కావు, ఆచరింపదగ్గవీ అసలే కావు. వీటిని ఓ మారు పరిశీలిద్దాం –

సీయ – రామమయ సబ్ జగ్ జానీ ।

---

కత విధి సృజీ నారీ జగ్ మాహీ ... ।
పరాధీన సపనేహు సుఖనాహీ ... ॥

(ఈ ప్రపంచమంతటా సీతారాములు వ్యాపించివున్నారని తెలుసుకోవాలి)

(ఈ ప్రపంచంలో స్త్రీ ఎలా సృష్టింపబడి వుందంటే, ఆమె అన్నివిధాలా పరుల ఆశ్రయంలో వుండిపోయింది. ఈ అస్వతంత్ర జీవితంలో ఆమెకు సుఖమే లేదు.)

స్త్రీని చిన్నచూపు చేసే పంక్తులున్నప్పుడు అవి దుఃఖంలో మునిగి వున్నప్పుడు ఎవరో అన్నారనీ, లేదా రామాయణంలోని ఏ నీచపాత్ర నోటి నుంచి వెలువడ్డ మాటలో అని, లేదా పరిస్థితులకు అనుగుణంగా మారలేని కవి కలం ద్వారా వ్యక్తమైన అభిప్రాయమని తోసిపుచ్చాలి. ఆ మాటలకు అంతకంటే ఎక్కువ ప్రాధాన్య మివ్వకూడదు.

ఈ రామాయణ తిరునాళ్ళ సందర్భంలో పెద్దలు చేసే ఉపన్యాసాలు ప్రజలకు బుద్ధి వివేకాలు కలిగిస్తాయనీ, నిజమేమిటో అబద్ధమేమిటో గ్రహించి జీవితంలో ఆచరించే జ్ఞానాన్ని కలిగిస్తాయనీ, నమ్ముతున్నాను. ప్రయాగ (అలహాబాద్) లోని డా. రఘువంశ్, శ్రీ లక్ష్మీకాంత వర్మగార్లు ఈ ఉపన్యాసమాలికకు రూపకల్పన చేసి, విజయవంతంగా నిర్వహిస్తారని భావిస్తున్నాను.

ఉపన్యాసమాలలో వక్తలుగా ప్రముఖ కన్నడకవి కె.వి. పుట్టప్ప, ప్రఖ్యాత తెలుగు కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, సుప్రసిద్ధ హిందీ పరిశోధకుడు,

రామకథా సిద్ధాంత వ్యాసకర్త ఫాదర్ కామిల్ బుల్కె, డా. రఘునాథ్ సింహ్, రామ్ స్వరూప్ చతుర్వేది మొదలైన విద్వాంసులతో రాతకోతలు జరిపాం, జరుపుతున్నాం కూడా. ఇంకా మరికొంతమంది పెద్దలకు రామాయణ తిరునాళ్ళ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు, వాటి నిర్వహణలో కూడా బాధ్యత పంచుకొమ్మని మనవి చేసుకొన్నాం.

ఆకాశవాణి కళాకారిణి కుమారి రాజేశ్ కుమారి, కోటా (రాజస్థాన్)కు చెందిన వహీదన్‌బాయిగార్లు సహకరిస్తామని మాట ఇచ్చారు. లక్నో కళాకారిణి వీణాజాహరిగారు అప్పుడే తోడ్పడటం మొదలెట్టారు. మేం కోరేదేమిటంటే సుప్రసిద్ధ కళాకారులు, రచయితలు, కార్యదక్షులు తమంతట తామే ముందుకు వచ్చి ఈ రామాయణ తిరునాళ్ళలో పాల్గొనాలని. అన్నిటికంటే ముఖ్యమైన సంగతి ఏమిటంటే చిత్రకూటం, బాందా ప్రాంతాల్లోని స్థానిక కళాకారులకు రామాయణ సంబంధ నాటకాల్లోనూ, బృందగానోల్లోనూ పాల్గొనేందుకు మంచి తర్ఫీదు ఇచ్చే ప్రతిభావంతులు కావాలి. స్థానికంగా ఉంటున్న నటీనటుల్ని, గాయకీ గాయకుల్ని, వాద్యకారుల్నీ వెదికి, పట్టి ఈ కార్యక్రమాల్లో భాగం వహించేలా చెయ్యాలి.

శ్రీయుతులు రాజాజీ, రాజ్‌నారాయణ్, జవహర్‌లాల్ నెహ్రూ మొదలైన విశిష్ట వ్యక్తుల్ని ప్రసంగించమనీ, చర్చల్లో పాలుపంచుకొమ్మని వేడుకొన్నాం కూడా.

ఈ తిరునాళ్ళలో పాల్గొనే విశిష్ట అతిథులకు, కళాకారులకు, కవి పండితులకు తగిన భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నాం. అంతేకాక ఈ తిరునాళ్ళను చూసేందుకు వచ్చే యాత్రికులకు రూ. 300, రూ. 500 శుల్కం మీద తగిన భోజన, వసతి ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ తిరునాళ్ళు 11 రోజులపాటు జరుగుతాయి. విద్వాంసులు, కళాకారులు, సంగీత సాహిత్యప్రియులు వీటిలో పాల్గొని, చర్చలు జరిపి, తమ జ్ఞానపరిధిని విస్తరించుకోవాలని అభ్యర్థిస్తున్నాం. పేదవాళ్ళకు ఈ తిరునాళ్ళలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నాం.

శ్రీ కైలాసనాథ కట్జూ (మాజీ కేంద్రమంత్రి) గారి దయవల్ల ఎన్.సి.సి. కార్యకర్తలు 'ప్రమోదవనా'న్ని శుభ్రపరిచి 2000 మందికి పైగా బస చేసేందుకు డేరాలు నిర్మిస్తారు. ఈ రామాయణ తిరునాళ్ళ ఏర్పాట్లకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి డా. సంపూర్ణానంద్‌గారలు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు.

తులసీరామాయణ సామూహిక గాన కార్యక్రమం తప్పనిసరిగా ఉంటుంది. కొంతమంది కళాకారులు దోహా, చౌపాయిల్ని రాగతాళ లయబద్ధంగా పాడితే, మిగతా ప్రేక్షకులు, శ్రోతలు – పదివేలమంది కావొచ్చు, లక్షమంది కావొచ్చు ఆ విధంగానే మనసారా పాడాలి. సామూహిక గాయకుల్లో స్త్రీలు, శూద్రులు, ఇతర మతస్థులు కూడా పాల్గొని, వేలాది, లక్షలాదిమందికి దారి చూపాలి. ఈ బృందగాయకుల్లో బ్రాహ్మణులుంటారని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

రామాయణ తిరునాళ్ళు జరిగే తేదీలు మారడం వల్ల మాకు సుమారు లక్షరూపాయల నష్టం కలిగింది. మేంకాక మరింకెవ్వరైనా ఈ ఉత్సవాలు జరపాలని తలచివుంటే వాళ్ళకు దాదాపు 20 లక్షలదాకా నష్టం వాటిల్లి ఉండేది. మాకీ లక్ష రూపాయల నష్టం కూడా గుండెల మీది బరువే. ఎవ్వరైనా దాతలు ఈ తిరునాళ్ళకు విరాళాలు ఇవ్వాలని అనుకొంటే కరవీ లేదా చిత్రకూట్‌ధామ్ సెంట్రల్ బ్యాంకులోని రామాయణ తిరునాళ్ళ ఖాతాకు చెక్కుల రూపంలోనో, నగదు రూపంలోనో పంపొచ్చు.

## రామాయణం–రామాయణ తిరునాళ్ళు, కొన్ని ఆలోచనలు (1961 మార్చి)

రామాయణ తిరునాళ్ళ తేదీలు పొడిగింపబడ్డాయి. మా వద్ద డబ్బుల్లేవు, కార్యకర్తల కొరత, పదిమంది సాయం సమయానికి అందలేదు. భారతదేశానికే విధి అనుకూలంగా లేనప్పుడు ఇక రామాయణ తిరునాళ్ళకు అనుకూలంగా ఎలా ఉంటుంది చెప్పండి. ఈసారి అక్టోబరు నెలలో తిరునాళ్ళు జరిగి తీరాల్సిందే. ముహూర్తం ఇంకా దూరంలో ఉందిలే అని మన కార్యకర్తలు నిద్రపోకూడదు సుమా! మనవాళ్ళు ఆరంభ శూరత్వం చూపి, కుంభకర్ణ నిద్రపోతే పని జరిగేదెలా? మనవాళ్ళు మరింత అప్రమత్తులై గబగబా ముందడుగులు వేయాలి మరి.

రామాయణ తిరునాళ్ళ ఉపకేంద్రాలు ముఖ్యమైన నగరాల్లో, పట్టణాల్లో త్వరగా ఏర్పాటు చెయ్యాలి. పేదసాదలతో అర్ధరూపాయి, రూపాయి, షావుకార్లతో పెద్ద పెద్ద మొత్తాలు విరాళాలుగా సేకరించాలి. చిత్రకూటంలో జరగబోయే తిరునాళ్ళ సందర్భంలో అక్కడ అతిథులకోసం నిర్మించబడే గుడిసెలు, డేరాలకుగాను కంట్రాక్టర్లతో చర్చలు జరిపి ఏమేమి వసతి సౌకర్యాలు కావాలో చెప్పి, వాటికి అనుగుణంగా రేట్లు నిర్ణయించారు.

ఈ వ్యవహారాలన్నీ నియమానుసారంగా పకడ్బందీగా సిద్ధపరచాలి. దేశవిదేశాల నుంచి తిరునాళ్ళకు రాబోయే అతిథులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూసుకోవాలి. వాళ్ళు వెయ్యో, రెండువేలమందో కావచ్చు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వాళ్ళు ఇక్కడి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని, పరస్పరం చర్చించుకొంటూ, హాయిగా కాలం గడపాలి. ఈ తిరునాళ్ళకుగాను వసూలైన డబ్బును సద్వినియోగ పరచాలి. ఎలాంటి కుంభకోణాలు జరుగకుండా జాగ్రత్త పడాలి.

రామాయణ తిరునాళ్ళ సందర్భంగా ఏర్పడ్డ సమితులు, ఉపసమితులు ఎన్నో వున్నాయి. వీటి పని విరాళాలు, చందాలు వసూలు చేయడంతో ఆగదు. ఏఏ కార్యక్రమాలు జరపాలో, ఎలా జరపాలో, ఎవరెవరి సాయం తీసుకోవాలో ఇలాంటి వాటి గురించి కూడా ఈ సమితులు, ఉపసమితులు ఆలోచిస్తూ, చర్చిస్తూ, వాటిని ఆచరణలో పెట్టాలి. తాము రూపకల్పన చేసిన కార్యక్రమాల స్వరూపం గురించి చిత్రకూటంలో వుండే కేంద్రసమితికి తెలుపుతూ, వాళ్ళ నిర్ణయాలకు వదిలివెయ్యాలి. ఇలాగే ప్రాంతీయ సమితుల నుంచి ఒక్కొక్క ప్రతినిధి, కేంద్రీయ సమితిలో భాగస్వామిగా ఉండాలి. ఇలా ఏర్పడ్డ కేంద్రసమితి సమావేశం కాన్పూరులోనో, చిత్రకూటంలోనో ఏప్రిల్ 25 లేదా 26వ తేదీన జరగాలి.

ఈ తిరునాళ్ళ సందర్భంగా హిందూమతం స్థితిగతుల గురించి చర్చలు జరగాలి. అలాగే హిందూమతానికి ఇతర మతాలకీ వున్న విభేదాల గురించి, దేశంలో జరుగుతున్న మతకలహాల కారణాల, పరిణామాల, సమస్యా పరిష్కారాల గురించి సాఫీగా చర్చలు జరగాలి. భారతదేశ సమైక్యానికి ఈ ఉపన్యాసాలు, చర్చలు దోహదం చెయ్యాలి. దేశంలోని సాధారణ జనానికి ఇవి ఉపయోగపడాలి. వాళ్ళలో సామరస్య భావాలు వికసించాలి. వాళ్లమధ్య కులం, మతాల కారణంగా పెట్రేగిపోతున్న విభేదాలు సమసిపోవాలి.

దేశీయ, విదేశీయ భాషల్లోని రామాయణాల గురించి– తెలుగు, తమిళం, థాయ్, కంబోడియా, ఫారసీ మొదలైన భాషల్లోనే అరగంటసేపు ఉపన్యాసాలు, కావ్యభాగాలు వినిపించాలి. ఇవి శ్రోతలకు అర్థం కాకపోయినా వాళ్ళలో కుతూహలం జిజ్ఞాసను రేకెత్తిస్తాయి. ఇలాగే మహాభారతం, వాల్మీకి రామాయణం, వేదాల నుంచి

కొన్ని భాగాల్ని వినిపించాలి. అలాగే బైబిల్, ఖురాన్‌ల నుంచి కూడా కొన్ని భాగాల్ని వినిపిస్తే మంచిది. ఆ రోజునే రామ, కృష్ణుల గురించి ప్రసంగాల కార్యక్రమం వుండాలి. రామాయణ, భాగవతాల తులనాత్మక పరిశీలన జరగాలి.

ఎవరో ఒక మహిళ తులసీరామాయణంలోని పద్యాల్ని కమ్మగా పాడుతూ వుంటుందనుకోండి. ఆ పాటల మధ్యలో స్త్రీలనీ, శూద్రుల్నీ కించపరిచే మాటలు తారసపడతాయనుకోండి, రామాయణంలోని ఇలాంటి అవమానకరమైన మాటలన్ని నీచపాత్రల ద్వారానో కవి పలికించాడన్నమాట. ఇలాంటివన్నీ పిచ్చి ప్రేలాపనలుగా భావించాలి. కావ్యాల్లో వందలాది పాత్రలు వుంటాయి. ప్రతిపాత్ర పలికే ప్రతిమాటా శ్రేష్ఠమైనదనీ, మంచిదనీ, అది చిరంతన సత్యమని భావించకూడదూ, స్వీకరించ కూడదూనూ.

రామాయణ కావ్యాన్ని గానం చేసే పౌరాణికులుగానీ, కథని ఆసక్తికరంగా వినిపించే ప్రవచనకారులు కానీ అందరూ సంకుచితదృష్టి కలవారుగా వుండరు. రామాయణ గానం చేసే శ్రీమతి ఇందుగారు ఓసారి నాతో ఇలా అన్నారు –" నేను ఆరాధించే ఓ మహాకవి, నేను పూజించే శ్రీరామునిచే ఓ ప్రేలాపన చేయించారు. లక్ష్మణుడు యుద్ధ క్షేత్రంలో పోరాడుతూ ఇంద్రజిత్తు, బాణప్రయోగంతో మూర్ఛిల్లిపోతే రాములవారు దుఃఖిస్తూ విలపించకుండా, పిచ్చి పిచ్చి మాటలు వాగాడు. దైవ స్వరూపుడైన శ్రీరాముడు సామాన్య మానవుడిగా వెర్రెత్తినవాడిలా ప్రవర్తించవచ్చునా? రాముడు నిజంగా అలా ప్రేలాపించి వుంటాడా?

రాముని ఈ మనోదశను చిత్రించిన కవులు వాల్మీకి, తులసీదాసులు రాముని అప్పటి మనస్థితిని చూసిన వాళ్ళెవరో చెప్పగలరా?

తలసీరామాయణంలోని పద్యాల్ని – దోహా, చౌపాయీల్ని – చదివేటప్పుడు మనం ఓ ముఖ్య విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ధార్మిక గ్రంథాల్లో కొన్ని అభ్యంతరకరమైన, అవమానకరమైన విషయాలు ప్రస్తావించబడతాయి. అలాగే వాటిలో కొన్ని ఉదాత్తమైన, ఆచరణీయమైన సంగతులూ వుంటాయి. 'రామచరిత మానస్' లో ఉదాత్తమైన, అభ్యంతరకరమైన అంశాలు కూడా వున్నాయి. రామాయణం పారాయణం చేసేవాళ్ళు ఈ దృష్టితో, ఈ లోతైన, వివేచనాత్మకమైన దృక్పథంతో అర్థం చేసుకోవాలి. రామాయణ తిరునాళ్ళలో రామాయణ గానం, నృత్యం చేసే

కళాకారులు అభ్యంతరకర సందర్భాలు తటస్థించినప్పుడు ఆ పాత్రలనో, లేదా కవినో తల్చుకుని ఓ నవ్వు నవ్వి ముందుకుపోవాలి. శ్రోతలకు, ప్రేక్షకులకు వినోదంతో పాటు వివేకమూ కలిగించాలి.

స్త్రీ పురుషుల సంబంధం గురించి కొంచెం లోతుగా విశ్లేషిద్దాం. ఈ విషయమై ఫ్రెంచి రచయిత్రి సిమోన్ దబువా 'ది సెకండ్ సెక్స్' అనే విలువైన పుస్తకం రాశారు. ప్రాచీన కాలాలనుండి ఆడా-మగా అనే ఇద్దరు వ్యక్తులు రెండు విభిన్న ధృవాలుగా పరిగణింపబడుతున్నారు. ఒక వాదం ఏమంటే పురుషుడు స్త్రీని సదా తన గుప్పిట్లోనే వుంచుకొని, ఆమెపై అన్ని పెత్తనాలు చలాయించాలనేది. రెండవ పక్షం ఏమంటే స్త్రీ స్వతంత్రంగా వుండొచ్చు కాని ఆమె మగాడి అధీనంలోనే వుండాల్సివుంటుంది. ఇదెక్కడి న్యాయం? స్త్రీకి స్వతంత్రం కల్పించి, ఆమెను తన భోగ విలాసాలకు ఉపయోగించుకోవాలనే మహత్వాకాంక్ష అన్యాయమే కదా? సిమోన్ దబువా గారి అభిప్రాయాలు సరైనవే అని తోస్తుంది.

ఇక తులసీదాసుగారి దగ్గరికి వద్దాం. స్త్రీ స్వాతంత్ర్యం, స్త్రీ పురుష సమానత్వం గురించి ఆయన రాసినంత గొప్పగా మరెవ్వరూ రాయలేదని నేననుకొంటున్నాను. తులసీదాసు స్త్రీ గురించి ఒకచోట చెప్పిన సంకుచితమైన, అవమానకరమైన మాటల్నే ప్రజలు జ్ఞాపకముంచుకున్నారు కానీ ఆయన చెప్పిన ఎన్నో ఉదాత్తమైన సుభాషితాల్ని మరిచిపొయ్యారు. ఇటీవల రామ్‌స్వరూప్ వర్మగారు తులసీదాసు 'పరాధీన సపనేహుసుఖ నాహీ' అన్నమాటలు స్త్రీ పట్ల వ్యక్తమైనవి అని నాకు జ్ఞాపకం చేశారు.

పార్వతి పెళ్ళి పరమేశ్వరునితో జరిగిన తర్వాత తన కూతుర్ని అత్తగారింటికి పంపుతూ మైనాదేవి "కతవిధి సృజేసి నారి జగమాహీ, పరాధీన సపనేహు సుఖనాహీ' అని ఆవేదన వెలిబుస్తుంది. ఈ వేదనాభరితమైన వాక్కులు తరతరాలనుండి వినవస్తున్న పలుకులే. మానవుడు ఎంత తెలివి మీరాడంటే ఈ మాటల్లోని మొదటిభాగాన్ని కప్పిపెట్టి, రెండవభాగాన్ని మాత్రం పదే పదే చెప్తుంటాడు. తులసీదాసు ఉదాత్తచిత్తులు.

"భగవంతుడు స్త్రీని ఈ విధంగా (ఎంత విచిత్రంగా) సృష్టించాడో కదా! తల్లిదండ్రుల ఇంట్లో గారాబంగా పెరిగిన కూతుళ్ళు అత్తగారింట్లో స్వేచ్ఛను కోల్పోయి సుఖమంటే ఏమిటో మరిచిపోతారు" ఎంత గొప్ప మాట చెప్పారు ఆ భక్తకవి!

రానురాను తులసీరామాయణంలోని ఈ పూర్వార్థ పదభాగాన్నే మార్చివేశారు పండితులు.

సంత్ తులసీదాసు "కర విచార దేఖహు మన మాహీ" అంటారు. "అయ్యలారా! అమ్మలారా! మీరు పై మాటల్ని మనస్సుల్లో తరచి తరచి చూసి ఓ నిర్ణయానికి రండి" అన్నారు ఆ మహానుభావుడు.

ఎంత మమకారం! ఎంత వాత్సల్యం! స్త్రీ హృదయాన్ని ఎంత చక్కగా అర్థం చేసుకొన్నాడా పెద్దాయన!! స్త్రీ పురుషుల సామరస్యాన్ని ఎంతగా కొనియాడారో ఆయన! అందుకేగా "ఈ ప్రపంచమంతా సీతారామమయం" అన్నారాయన. ( "సియా రామమయ సబజగ జానీ").

స్త్రీని కేవలం భోగవస్తువుగా భావించడం పెద్ద తప్పు. ఆమెకు స్వాతంత్ర్యం ఇచ్చామని చెప్తూ ఆమెను కీలుబొమ్మగా ఆడించడం అంతకంటే పెద్ద తప్పు. స్త్రీ పురుషుల – భార్యాభర్తల– సంబంధం, సమానత్వం, స్నేహాల పునాది కలిగివుంటేనే జీవితం సాఫీగా సాగిపోతుంది.

ఇలా స్నేహానురాగాలు పడుగుపేకల్లా రూపొందించిన జంటలు కంటిలో కలికానికైనా లభిస్తారో లేదో? సీతారాముల మధ్యలో కూడా అసమానత వున్నదని చెప్పలేం. ఆనాటి సమాజంలోని భార్యాభర్తల అనుబంధంలోని అసమానతే సీతారాముల దాంపత్య జీవితంలోనూ అగుపడుతుంది. మనదేశంలో సీత, పార్వతి, ద్రౌపదులు అనుభవించే గౌరవనీయమైన స్థానం ప్రపంచంలో మరెక్కడా కనపడదు. నాటికీ, నేటికీ. రాములవారికథ, తులసీరామాయణాన్ని శ్రద్ధగా చదివితే, లోతుగా ఆలోచిస్తే, స్త్రీ పురుష జీవితాల స్నేహానురాగాలు చక్కగా తెలుస్తాయి.

మనకు జీవితం పట్ల సరైన దృక్పథం సిద్ధించాలంటే మనం ఎన్నో మిట్టపల్లాలు ఎక్కి దిగాల్సి వస్తుంది. వాగులూ, వంకలూ దాటాల్సి వస్తుంది. అప్పుడుకాని సత్యం సాక్షాత్కరించదు. మన సంఘంలో వరదక్షిణ సమస్య రుద్రతాండవం చేస్తూంది. తల్లిదండ్రులు పెళ్ళికొడుకువైపు వార్ల గొంతెమ్మ కోరికలు తీర్చలేనప్పుడు నిస్సహాయులై దిగాలు పడిపోతారు. ఆ సమయంలో ధైర్యంతో స్వతంత్రంగా తమ దారి తాము చూసుకోవాల్సి వస్తుంది. ఇలాగే కాలమే స్త్రీలకు స్వాతంత్ర్యం ప్రసాదించేలా

తోడ్పడుతుంది. ఈ రామాయణ తిరునాళ్ళలో ప్రముఖుల ఉపన్యాసాలు వినడం వల్ల కొంతమంది హృదయాలైనా మారుతాయని ఆశిస్తున్నాను.

ప్రసిద్ధ చిత్రకారులు గీసిన విశాలమైన చిత్రాలు కూడా చూసేవాళ్ళపై గొప్ప ప్రభావం కలిగిస్తాయి విశ్వవిఖ్యాత చిత్రకారులైన యం.ఎఫ్.హుసేన్‌గారిని రామాయణానికి సంబంధించిన పెద్ద పెద్ద చిత్రాల్ని చిత్రించమని కోరాను. ఆయన అందుకు సమ్మతించారు కూడా. అందరూ రామరాజ్యం కావాలని కోరుకుంటారు. కాని నేను ఆయన్ని సీతారామరాజ్యం మీద చిత్రాలు గీయమని అర్థించాను. అందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రామాయణ తిరునాళ్ళ వివిధ ప్రాంతాల్లోని ఉపకేంద్రాలు తమ తమ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన చిత్రకారుల్ని విశిష్టమైన కళాఖండాల్ని చిత్రించమని కోరాలి.

తులసీదాసు రచించిన రామచరిత మానస్ కావొచ్చు, మరే ఇతర రామాయణాలు కావొచ్చు. వాటిలో కొన్ని సమకాలీన సంప్రదాయాల చిత్రణ కనపడుతుంది ఉదాహరణానికి తులసీరామాయణంలోని బాలరాముని కాళ్ళ గజ్జెల ప్రస్తావనను తీసుకోండి. ఈ గజ్జెలున్నాయి చూశారా, అవి ఆ కాలం నాటి మనుష్యుల్ని ఆటబొమ్మలుగా చిత్రించినట్లు ప్రతీకల్లాగా తోస్తాయి. ఆడపిల్లల కాళ్ళను అలంకరించేవి కావచ్చు, మగపిల్లల కాళ్లకు అందం కలిగించేవి కావొచ్చు ఈ గజ్జెలు. ఈ సంప్రదాయాన్ని విడిచిపెట్టాలి.

మగపిల్లలకు, ఆడపిల్లలకు చెవులు కుట్టించడం, ఆడపిల్లలకు ముక్కు కుట్టించడం– ఇవి ఎంత బాధాకరమైనవని! చెవులకు, ముక్కుకు వెండి, బంగారు ఆభరణాలు తొడిగించడం అన్ని భాషల రామాయణాల్లోనూ కనిపిస్తుంది. ఇదంతా సిరిసంపదల్ని, వైభవాన్ని ప్రదర్శించేది. ప్రజల్లో ఈ సిరిసంపదలపట్ల ఆకర్షణను కలిగించకూడదు. ఒకప్పుడు వెండి, బంగారు, నవరత్నాలు మొదలైనవి శక్తిసామర్థ్యాల్ని, అధికారాన్ని సూచించేవి. కాలం మారింది. ప్రజల దృష్టి కూడా మారాలి. ఇలాంటి వైభవాన్ని వర్ణించడం కవుల తప్పు కాదు. అది ఆ కాలం నాటి ప్రభావ ఫలితమే, పరిణామమే. కాబట్టి రామాయణం చదివేటప్పుడు ఇలాంటి వర్ణనల్ని పట్టించుకోకుండా, అవి గతకాలం నాటి వైభవ చిహ్నాలని భావించి ముందుకు సాగాలి.

తులసీరామాయణంలో శూద్రుల గురించి, గిరిజనుల గురించి అభ్యంతర కరమైన ప్రసంగాలు తారసపడతాయి. రామాయణం నీచపాత్రలే వాటిని వ్యక్తం చేశాయి. సందర్భం ఏదైనా కావొచ్చు, పైగా ఈ కావ్యాల్లో బ్రాహ్మణుల్ని ఆకాశానికి ఎత్తేసి, శూద్రుల్ని, ఇంకా తక్కువ కులం వాళ్ళను పాతాళంలోకి తొక్కివేయడం స్పష్టంగా కనపడుతుంది. ఇది కవి దృక్పథంలోని దోషమే. కాలప్రభావమే. రామాయణ రసాస్వాదనలో ఇవి అడ్డు పడకూడదు. తులసీరామాయణంలోని దోహాలకు (రెండు పాదాల పద్యం), చౌపాయిలకు (నాలుగు పాదాల పద్యం) విపరీత వ్యాఖ్యానాలు చేయడం నా అభిమతం కాదు. వ్యాఖ్యాత తన పాండిత్యబలం చేత ఆ పద్యాల్లోని అసలైన అర్థం కప్పిపుచ్చి, లేని గొప్ప అర్థాన్ని కల్పించడమూ తప్పే. రెండూ రెండే. ఉదాహరణానికి తులసీ రామాయణంలోని తెప్ప తోలే గుహుని కథ గురించి చర్చిద్దాం. తులసీదాసుగారి కాలంలో జాతి వ్యవస్థ దారుణంగా వుండేది. తులసీదాసు చిత్రించిన గుహుని, శ్రీరాముల అమాయకత్వం, ఔదార్యాలు మెచ్చదగ్గవి. మనిషికి, మనిషికి మధ్య కులం అడ్డురాకూడదన్న సత్యాన్ని నిరూపించే ఈ కథ ఆదర్శవంతమైనది. ఒక పద్యానికి నూర్లాది అర్థాలు లాగదీయడం వల్ల కవి ప్రతిభా వెల్లడి కాదు. పండితుని పాగ్రల్భ్యమూ వ్యక్తం కాదు. ఒక పద్యాన్ని వివరించేటప్పుడు దానిలోని ఔన్నత్యాన్ని వెలికితీయడంలోనే వుంటుంది వ్యాఖ్యాత ప్రజ్ఞ.

గిరిజనుడైన గుహునికి భరతుడు లక్ష్మణుడిలా కనపడతాడు.. మందీ మార్బలంతో రాముణ్ణి చూడటానికి వచ్చిన భరతుడు రాజులా కనపడతాడేకాని సామాన్యునిలా అగపడడు. అలాంటప్పుడు తానొక అంటరానివాడిలా భరతునికి దూరంగానే వుండిపోతాడు. ఇలాంటి మనిషి శ్రీరామునికి తమ్ముడా? నివ్వెరపోతాడు గుహుడు! ఇలాంటి విశిష్టమైన సందర్భం చిత్రింపబడింది తులసీరామాయణంలో.

గుహ, రాముల ప్రేమ వాల్మికీ రామాయణంలో కాని, మరే రామాయణంలో కాని వుందేమో నాకు తెలియదు. జాత్యాతీతమైన ప్రేమకు ఇంతకంటే మంచి ఉదాహరణ ఇంకెక్కడైనా ఉందా? తులసీదాసు భరతరాముల కలయికను ఈ విధంగా చిత్రిస్తారు–

"భరత అవధి సనేహ మమతాకీ ।
జదపి రాము సీయ సమతాకీ ॥

భరతుడు స్నేహం, మమతలకు నిలయం అయితే రాముడు సమతకు పట్టుకొమ్మ అని తులసీదాసు భావన. సమత అంటే మనస్సులో పుట్టే భావాల సమానత్వం అని అర్థం. రాగద్వేషాలు, సుఖదుఃఖాలు, జయపరాజయాలు - వీటిని సమానంగా చూసే మనస్తత్వమన్నమాట. ఈ సమానత్వ గుణం మనస్సులోని భావనల పట్లేకాక, బహిరంగ ప్రపంచంలోని విషయాల పట్లకూడా చెల్లుతుంది. రాముడు, భరతుడు- ఇద్దరూ నిషాదుడైన గుహుని ఎంతో ప్రేమతో కౌగిలించు కుంటారు. కాళ్ళమీద పడి నమస్కరించడమూ, కౌగిలించుకోవడమూ సమానం కావు. మొదటి సంప్రదాయం హెచ్చుతక్కువల్ని సూచిస్తుంది. ఇది తొలగిపోవాలి. కౌగిలించుకోవడం అనే సంప్రదాయం - సమానత్వాన్ని సూచిస్తుంది కాబట్టి ఈ పరంపర కొనసాగాలి.

నిషాదుడు (గుహుడు) లక్ష్మణునిలా కనపడతాడు అంటే ఆయనలా తెల్లగా వుంటాడు. తులసీదాసు ఈ కథను చాలా కుతూహలకరంగా చెప్పారు. గిరిజనుడైన నిషాదుని- గుహుని- తెల్లవాడిగా వర్ణించడం విచిత్రమే కదా! రామలక్ష్మణులు నలుపు, తెలుపు రంగులవాళ్ళు- అలాగే భరతశత్రుఘ్నులు కూడా. ఈ నలుపు తెలుపు వర్ణాల గురించి కొంత ఆలోచించాలి. ఆర్యులు తెల్లగా ఉండేవాళ్ళు, ద్రావిడులు నల్లగా వుండేవాళ్ళు అన్న సిద్ధాంతం నిజానిజాలు చర్చించాల్సి వుంటుంది. నలుపు తెలుపు సమన్వయాన్ని తెలిపే రామాయణం ఆర్యుల కథ అనీ, ఉత్తర భారతీయుల కథ అని నిర్ధారించడంలో నిజమెంత? మనం తేల్చుకోవాలి.

ఆర్యులు, ద్రావిడులు, మంగోలులు అన్న భేదాలు విదేశీయులు కల్పించినవే అని నాకు తోస్తుంది. ఒకవేళ ఆ జాతులు వుండివున్నా, అది మూడు, నాలుగువేల ఏళ్ళ కిందటి నాటి మాటే. ఇప్పుడవి పూర్తి అబద్ధాలే. ఈ ఒక్క అసత్యం ఆధారంగా మనదేశంలో భారతదేశ చరిత్ర, సాహిత్యం, భూగోళం, సంస్కృతి ఇత్యాది విషయాలు బోధింపబడుతున్నాయి. దీనివల్ల గొప్ప అనర్థం వాటిల్లుతూంది. భారతీయ భాషల వర్గీకరణ కూడా తప్పే. తమిళంలోని 'మైలమ్' సంస్కృత, హిందీ భాషల్లోని 'మయూరమ్', 'మయూర్' పదాలు ఒకటే. 'యు' 'ఎ' లేదా 'ర' 'ల' అక్షరాలు పరస్పరం మారటం భాషాశాస్త్ర నియమాల ప్రకారమే జరుగుతుంది, జరిగింది. ద్రావిడ భాషల్లోని (దక్షిణ భారతంలోని) చాలా పదాలు ఆర్యభాష (ఉత్తరాది

భాష)ల్లోని చాలా పదాలు ఇలాంటి సమానత్వం కలవే. అయితే తమిళం నుంచి సంస్కృతం, హిందీ భాషల్లో కొన్ని పదాలు పుట్టాయని కాని సంస్కృత, హిందీ భాషల కొన్ని పదాలు తమిళంలోకి వచ్చాయనికాని నేను చెప్పలేను. నాకు ఈ విషయం పట్ల ఎలాంటి ఆసక్తీ లేదు. కాని ఈ భాషలో పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడాలు జరిగిందని, ఈ ఆదాన ప్రదానాలు కొనసాగుతున్నాయని మాత్రం నేను చెప్పగలను. ఏవో కొన్ని పదాలు, గుణింతాల సామ్యం వుందని ఆర్య, ద్రావిడ, మంగోలు, ఆస్ట్రిక్ భాషల వర్గీకరణ చేయడం వివేకం కాదు. నాలుగువేల ఏళ్ళ కిందట కూడా ఇలా వుండలేదు. పోతే ఈ మూడువేల ఏళ్ళ చరిత్రలో ఇలా జరిగే అవకాశమే లేదు.

నాకు ఓ ఆసక్తికరమైన భావన లభించింది. తెలుగుభాషలో 'ఉ' కారాంత పదాలు ఎక్కువగా దొరుకుతాయి. విదేశీ పదాల చివర్లో 'ఉ' చేర్చి వాటిని తెలుగు పదాలుగా ఉచ్చరించడం జరుగుతూంది. అవధిభాషలోనూ, తులసీ రామాయణం లోనూ ఈ ఉకారాంత పదాలు ఎక్కువగా లభిస్తాయి. తెలుగులో రాములు, రాముడు,పదాలు కనిపిస్తే అవధిభాషలో 'రాము' అన్న పదం కనపడుతుంది. పదాల చివర్లో 'ఉ' కలిపితే పదానికి తీపిదనం ఎక్కువవుతుంది. ఈ పద మాధుర్యం వెనుక విజయపురిని పరిపాలించిన ఇక్ష్వాకు రాజుల భాషా ప్రభావం వుందేమో! ఈ 'ఉ' ఆంధ్రప్రదేశ్ నుంచి అయోధ్యకు వచ్చిందో లేదా అయోధ్య నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్ళిందో నేను చెప్పలేను. కాని అవధి, తెలుగు భాషల్లోని పదాల పరస్పర వినిమయం నిజంగా జరిగిందా అని తెలుసుకోవడానికి మాత్రం నేను ఇష్టపడతాను.

భారతదేశం సంపద్భరితంగా, వైభవోపేతంగా వెలుగొందిన కాలం నాటి శాసనాల్లో ఈ ప్రాంతీయ భాషల పదాలు కాని, లిపి కాని కనపడుతుందేమో అని వెతికి చూశాను. కాని అవి తారసపడలేదు. ప్రాచీన శాసనాల్లో సంస్కృత, ప్రాకృత, పాళీ భాషాపదాలు, లిపులు మాత్రం కనిపించాయి.

ఈ రామాయణ తిరునాళ్ళ సందర్భంగా భాషాశాస్త్రవేత్తలు, పిడివాదాలు చేయకుండా, సిగపట్లు పట్టకుండా ఈ విషయం గురించి శాస్త్రీయంగా, ప్రశాంతంగా చర్చలు సాగిస్తారని ఆశిస్తున్నాను.

రావణుడు దక్షిణ భారతదేశ రాజుగా పేర్కొనబడుతున్నాడు. ఈయన రాజ్యపాలన, కార్యకలాపాలన్నీ దక్షిణ భారతంలోనే సాగినట్లు తెలుస్తోంది. వానరులు, భల్లూకులు (ఎలుగుబంట్లు) కూడా దక్షిణ భారతీయులుగానే చెప్పబడుతున్నారు. వానరులు, భల్లూకులు దేవతల కోటికి చెందినవారే అనీ, రామావతారంలో ఆయన అనుచరులుగా ప్రసిద్ధి చెందినట్లు పురాణాల వల్ల, ఇతిహాసాల వల్ల మనకు తెలుస్తూనే వుంది. అలాంటప్పుడు రాముణ్ణి ఉత్తర భారతానికి చెందినవాడిగా, వానర, భల్లూకుల్ని దక్షిణాదివారిగా పేర్కొనడం సమంజసం కాదు. ఇక మిగిలింది రావణుడు. ఇతను కూడా ఉత్తర భారతదేశంలోని ఓ రాజుగా తోస్తున్నాడు. విశ్వామిత్ర మహర్షి రామలక్ష్మణుల్ని, అయోధ్య నుంచి మిథిలా నగరానికి పిలుచుకుపోతున్నాడు. మిథిల ఉత్తర భారతం పై వైపులో ఉంది. ఆ దారి మధ్యలో విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో రాక్షసుల్ని చంపించాడు.

దేవతల్ని, మునుల్ని సాధుపురుషుల్ని క్రూరంగా హింసిస్తూ, చంపివేస్తున్న రాజు ఉత్తరభారతంలోని వాడేకదా! మరి అతను ఏ వంశపు రాజు, ఏ దేశానికి రాజు? తులసీదాసు రావణుని గురించి "ఉత్తమ కుల పులస్త్య కరనాతీ" – ఉత్తమ కులానికి చెందిన పులస్త్యబ్రహ్మ వంశీకుడు అన్నాడు కదా?

రావణుడు పరమేశ్వరునితో వరాలు పొంది తన పాత రాజధానిని, ప్రాంతాన్ని వదిలిపెట్టి లంకా ద్వీపం చేరి, అక్కడ ఓ అభేద్యమైన కోటను నిర్మించి, స్వర్ణ నగరమైన లంకలో విరాజిల్లాడు. ఉత్తర భారతంలో 'రామ్‌లీల' జరిగే వుత్సవంలో రావణుడు దక్షిణ భారతీయుడే అన్న భ్రమ కలిగించడం జరుగుతూంది. రావణుని వంశానికి మసి పూయబడుతూంది. పైగా రావణుడు, కుంభకర్ణుడు, శూర్పణఖ మొదలైన పాత్రల్ని భయంకరమైన వ్యక్తులుగా చిత్రించబడడమూ జరుగుతూంది.

మొత్తం మీద రావణ కుటుంబాన్ని రాక్షస పరివారంగా చిత్రించారు కవులు. కాని అది వాస్తవం కాదు. రావణుని భార్య మండోదరి చాలా అందగత్తె. శూర్పణఖ కూడా సౌందర్యవతే మరి. ఆమె చేతి గోళ్ళు వెడల్పుగా వుండేవి. అందుకని ఆమె అన్నలు ఆమెను ఉడికిస్తూ, గేలిచేస్తూ శూర్పణఖ – అంటే చేటల్లా వెడల్పయిన గోళ్ళు కలది అని వేళాకోళం చేసేవాళ్ళు. రాక్షసుల్ని మాయావులన్నారు. వాళ్ళు తమ అందమైన ముఖాల్ని తాము కోరుకున్నట్లు మార్చుకోగలిగేవాళ్ళు. ఇతరుల్ని

భయపెట్టడానికని వాళ్ళు తమ ఆకారాల్ని భయం కలిగించేలా దిద్దుకొనేవాళ్ళు. అలాంటప్పుడు ఈ రాక్షస కులంవాళ్ళు తమవాళ్ళుగా భావించే దక్షిణ భారతీయులు పొరపడుతున్నారు. రామలీల ఉత్సవాల్ని జరిపే ఔత్తరాహులు ఈ రావణ, కుంభకర్ణాదుల్ని దాక్షిణాత్యులుగా చిత్రిస్తూ చేసే ఈ రాక్షస వధ కూడా సముచితం కాదు.

ఈనాడు రామలీలా ఉత్సవాల్లో నిలిపే రావణ, కుంభకర్ణ, ఇంద్రజిత్తుల భారీ భయానక వెదుళ్ళ బొమ్మల రూపాల్ని మార్చాల్సి వుంటుంది. అలాగే దశరథులవారి కుమారుల ఆకారాల్ని కూడా. రాముడు, భరతుడు- ఇద్దరూ నల్లనివాళ్ళే. వీళ్ళ వొంటి రంగు విషయంలో చూస్తే, దక్షిణ భారతదేశానికి చెందినవాళ్ళే. ఔత్తరాహులు కారు.

నాకు మరో కుతూహలకరమైన సంగతి తెలిసింది. రావణుని కుటుంబ సభ్యుల్లో చాలామంది పేర్లు కఠినంగా, ఉచ్చరించడానికి కష్టంగా వుంటాయి. రావణుడంటే ఎవరు? బిగ్గరగా శబ్దం చేసేవాడు. మేఘనాధుడు, కుంభకర్ణుడు, శూర్పణఖ భర్త విద్యుత్ జిహ్వుడు వీళ్ళందరూ ఆర్భాటంగా మాట్లాడేవాళ్ళే. నడిచేవాళ్ళే. వీళ్ళకు ఈ పేర్లు ఎవరు పెట్టారు? ఎందుకు పెట్టారు? పరిశోధించాల్సిన విషయమే కదా!

రామాయణ తిరునాళ్ళ సందర్భంగా జరిగే ఉపన్యాస కార్యక్రమాల వల్ల ఈ ఉత్తర దక్షిణ భేదభావాలు కొంతవరకైనా సమసి పోవచ్చని ఆశిస్తున్నాను. రామాయణం ఉత్తర దక్షిణ భారతదేశాల సంగమం. కాని కొంతమంది కారణంగా ఈ రెండింటి మధ్య అగాధం ఏర్పడి వుండటం చింతించాల్సిన సంగతి. ఈ రామాయణాలపై ఉపన్యాసాలు ఇవ్వడానికి అంగీకరించిన విద్వాంసుల్లో ముఖ్యులు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, ఫాదర్ కామిల్ బుల్కే, బాబూ రఘునాథ్ సింహ్, శ్రీమతి ఇందు, రామ్‌స్వరూప్ వర్మ, డా. రామ్‌నాథ్ త్రిపాఠిగారలు, ఇంకా మరికొంతమంది పండితులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి. ఎవరైనా పండితోత్తములు రామాయణాలపై ప్రసంగించాలని తలిస్తే, దయచేసి వాళ్ళు అలహాబాదులో వున్న శ్రీలక్ష్మీకాంత వర్మ, డా.రఘువంశ్‌గార్లతో సంప్రతించ ప్రార్థన. ఒక్కో విద్వాంసుడు 60 నిముషాలదాకా ఉపన్యసించవచ్చు. ఆ ప్రసంగంపై చర్చించడానికి మరో 20-30 నిముషాల కాలం ఉంటుంది దీనివల్ల శ్రోతల

జిజ్ఞాసువుల అనుమానాలు తీరే అవకాశం కలుగుతుంది. వక్తలు తమ ప్రసంగాల్ని రాసి, వాటిని కార్యక్రమం నిర్వాహకులకు అందజేస్తే, త్వరలోనే వాటిని పుస్తకరూపంలో ప్రచురించేందుకు వీలవుతుంది. ఉపన్యాసకులు తమ ప్రసంగాల్ని సంక్షిప్తంగా రాసి ముందుగా ఇస్తే, మేము వాటిని పత్రికా విలేఖర్లకు అందజేసి మరుసటిరోజే పత్రికల్లో పాఠకులకు అందేవిధంగా చేయగలం. ఉపన్యాసాలు ఏ భారతీయభాషలో వున్నా, వాటిని హిందీలోకి అనువదింపజేసి ప్రచురించగలం.

శ్రీరాముడు ఉత్తర దక్షిణ భారతదేశాల ఐక్యానికి ప్రతీక. శ్రీకృష్ణుడు తూర్పు పడమరల ఏకత్వానికి ప్రతినిధి. రామకృష్ణుల్లో ఇంకా ఎన్నో గొప్ప గొప్ప గుణాలున్నాయి. మనకు ప్రస్తుతం వాటితో పనిలేదు. హిందూమతంలో అంతర్గతంగా వున్న ఈ రాజకీయ దృష్టి నా కెంతో ఆశ్చర్యం కలిగించింది. నేను ఇతర మతగ్రంథాల్ని పరిశీలించినప్పుడు కూడా నాకు ఇలాంటి సామ్యమే కనపడింది. మతం, రాజనీతి పరిధులు, ఆశయాలు, నిర్వహణలు వేర్వేరుగా వుంటాయి. వీటిని కలపకూడదు. రెండు దృక్పథాలూ వేరయినా, రెండింటి మధ్య ఓ బంధం వుంటుంది. మనం దాన్ని మరిచిపోకూడదు. మతం చాలాకాలం నడిచే రాజనీతి. కాని రాజనీతి కొంతకాలం మాత్రమే సాగే మతం. ఈ రెండు దృక్పథాల్లోనూ గమనించదగ్గ విషయం ఒకటుంది. చాలాకాలం కొనసాగే రాజనీతిలో ప్రశాంతత వుంటుంది. కొంతకాలం పాటు నడిచే రాజనీతిలో అలజడులు వుంటాయి. యుద్ధాలు కూడా నడుస్తాయి. దీర్ఘకాలం నడిచే మతకాలంలో మంచి జరుగుతుంది. మంచికి పేరు ప్రసిద్ధులు వస్తాయి. కొంతకాలం సాగే రాజనీతి కాలంలో చెడుతో పోరాటం జరుగుతుంది. చెడును నిందించడం సాగుతుంది. మంచిని పొగడడం, చెడును తిట్టడం, మంచి చేయడం, చెడుతో పోరాడటం వీటిమధ్య కొంత తేడా వుంది. ఎప్పుడైతే వీటిమధ్య వుండే వ్యత్యాసం ఎక్కువై, ప్రబలమైతే రెంటిమధ్యా సంబంధం తెగిపోతుంది. అప్పుడు మంచిని పొగడటం పనికిరాకుండా పోతుంది. ఇక చెడుని నిందించడం కలహాలకు దారితీస్తుంది. మతాలు ఎంత గొప్పవైనా, కాలక్రమంలో అవి క్షీణిస్తాయి. వాటి జీవశక్తి తగ్గిపోతుంది. ఒకవేళ రాజనీతి స్వరూపం బాగానే వున్నా అది కొట్లాటలకు దారితీస్తుంది. ఇక్కడ నేను మతం చెడ్డల, రాజనీతి చెడ్డల గురించి చర్చించడం లేదు. కాని మనం ఓ సంగతి గమనించాలి. మతం

చెడ్డదయిందనుకోండి, అది కలహాలకు, యుద్ధాలకు దారితీస్తుంది. రాజనీతి చెడ్డ దయిందనుకోండి అప్పుడు సంఘంలో, దేశంలో జవసత్వాలు కోల్పోయి శ్మశానశాంతి నెలకొంటుంది.

మతం, రాజనీతుల్లో వివేకం లేకుంటే అవి రెండూ కలిసినప్పుడు దేశం భ్రష్టుపడ్తుంది, నాశనమవుతుంది. రాజ్య పరిపాలనా కాలంలో ఒకే మతానికి ప్రాధాన్య మివ్వరాదు. అప్పుడు దేశంలో మతసంఘర్షణలు జరిగే అవకాశ ముంటుంది. మతం, రాజనీతి రెండింటినీ విడివిడిగా వుంచడం ఎందుకు అవసరం అంటే అప్పుడు మతకలహాలు సంభవించవు, అందుకని. ఇంకో విషయం రాజనీతి కొలబద్దలు, మతం స్వభావాల్నీ వేర్వేరుగా వుంచాలి, తప్పదు మరి. అలా వుంచకపోతే దేశం అల్లకల్లోలమయ్యే పరిస్థితి దాపురిస్తుంది. అట్లని మతం రాజనీతులు విడివిడిగా, దూరదూరంగా వుండాలని కాదు. అవి పరస్పరం కలిసి నడవాలి. అయితే దేశహితం కలిగించే కొన్ని నీతినియమాల్ని పాటిస్తూ కొనసాగాలి. రాజకీయ క్షేత్రంలో మతం చొరబడి దేశంలో ఎంత ఉద్వేగం, ఉద్రేకం, హింస, ద్వేషాలు ఉప్పతిల్లుతున్నాయో నేను కళ్ళారా చూస్తున్నాను. మతం వల్ల ఇన్ని అవాంఛనీయ పరిస్థితులు కలుగుతున్నాయని తెలిసీ మనం మిన్నకుండి పోతున్నాం. ఇది తగదు. దేశశ్రేయస్సురీత్యా ఇది మంచిది కాదు. అందువల్ల దేశ శాంతిభద్రతలకు భంగం కలిగించే మతపరమైన కార్యకలాపాల్ని అరికట్టక తప్పదు. రాజకీయ వ్యవహారాలు కూడా తప్పుదోవలో నడుస్తున్న సంగతి తెలియని వారెవ్వరు చెప్పండి. కుటిల రాజనీతి వల్ల దేశం పంచబంగాళమయ్యే స్థితి దాపురిస్తున్నది. దీన్ని మతగురువులు, ధార్మిక పీఠాధిపతులు నిలిపి, నిర్మాణాత్మక కార్యాలపట్ల దృష్టి చూపాలి. దీనివల్ల కలిగే పరిణామాలేమిటి? ప్రజల్లో ఆస్తికత పెరుగుతుంది. కాని ధార్మిక ఆస్తికతను రాజనీతి అంగీకరిస్తున్నట్లు తోచదు. ప్రజల ఆస్తిక, నాస్తిక దృక్పథాలపట్ల రాజనీతి దేన్నీ సమర్థించకుండా పోవచ్చు. ఎలాంటి దండనీతి ప్రయోగించక పోవచ్చు. గుళ్ళూ, గోపురాలూ, మసీదులూ వీటి నిర్మాణానికి, పోషణకూ ప్రభుత్వం నుంచి సాయం అందడం నిలిచిపోవచ్చు. కాని శ్రీమంతుల అండదండలూ, కోట్లాది బీదాబిక్కీ సామాన్య జనుల నుంచి దేవాలయాల, మసీదుల నిర్వహణకు ఆర్థిక సహాయం సదా అందుతూనే వుంటాయి, సాధారణ ప్రజలు ఆస్తికతవైపు మొగ్గు చూపుతూ వుంటే. అలాంటప్పుడు ఈ ఆస్తికత, నాస్తికతల్ని సమన్వయ పరచడానికి ఓ కొత్తదారి

ఏర్పడవచ్చు. ఈ రామాయణ తిరునాళ్ళలో ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. వీటిలో ఈ దిశవైపు ఆలోచించే ఓ కార్యక్రమం కూడా వుంటుందని నేను ఆశిస్తున్నాను.

రాములవారు ఆనంద సముద్రులు, ప్రశాంత సాగరంలాంటి వారు. ఉత్తరాఖండ్‌లోని నిర్మలమైన గంగాజలం మనకు ఎలా శారీరక, మానసిక ఆనందం ఎలా చేకూరుస్తుందో, అలాగే ఈ రామాయణ జలస్నానం వల్ల మన మనస్సులు కూడా నిర్మలమవుతాయి, పవిత్రమవుతాయి. రామాయణ మహాకావ్యంలో వున్నంత శాంతరసం మరే కావ్యంలోనూ కనపడదు. తులసీదాసు 'రామచరిత మానస్'లో ఈ శాంతరసం పరాకాష్ఠకు చేరుకొంది. ఆయన వాడిన మధుర, మంజుల పదాలు కూడా మనస్సుకు గొప్ప ఆనందం చేకూరుస్తాయి. అరుదుగా శాంతరసం హద్దులు మీరిందనిపిస్తుంది. తులసీరామాయణంలోని దాదాపు అన్నిపాత్రలూ కరుణాత్మకమని పిస్తాయి. రాముని కళ్ళలో నుంచి ఎప్పుడూ నీళ్ళు ఉబుకుతూనేవుంటాయి. శాంత, కరుణరసాలు చాలా సన్నిహిత సంబంధం కలిగివుంటాయి. మనుష్యుడు భావవిహ్వలతకు లోనైనప్పుడు అతని గొంతు వణుకుతుంది. మాటలు రావు. అతని కళ్ళలోంచి కరుణరసం చిప్పిల్లుతుంటుంది. క్షణాల్లో అది వ్యాపిస్తుంది. మరింత విశాలమవుతుంది. అప్పుడు రెండురకాల ప్రమాదాలు సంభవించవచ్చు. శోకం ఎక్కువై ఏదైనా ఆపద కలుగొచ్చు, లేదా బుద్ధి సత్తువ కోల్పోయి నందువల్ల జడత్వం ఆవహించవచ్చు. హిందీ భాషీయుల మనస్సులో ఇవి చాలా కాలం నుంచి కానవస్తున్నాయి. ఈ ప్రమాదాల్ని వూహించి, తగిన జాగ్రత్తలు వహించకపోతే 'రామ్‌చరిత్ మానస్' పాఠకులు శాంతరస సముద్రంలో మునిగిపోయే ప్రమాదముంది. తస్మాత్ జాగ్రత్త! జాగ్రత్త!

ఆకాశవాణి లక్ష్మణుని ఇలా హెచ్చరిస్తుంది– "సహసాకరి పాఛై పఛితాహై" (ఆలోచించకుండా, అకస్మాత్తుగా పొరపాటు చేసి, తర్వాత పశ్చాత్తాపపడేవు. సుమా!) రాముడు "భరతునికి గద్దె ఎక్కిన తర్వాత గర్వం కలుగదు" అని అంటాడు.

"విధి బలీయమైనది, మన చేతుల్లో ఏమీ లేదు" అని ఒకరితో మరొకరు అనుకొంటారు కాని వాళ్ళు తమ తమ మార్గాల్లో తాము నడుస్తుంటారు. ఎవ్వరూ దారితప్పరు. ఆ లంకానగరంలో పాపం, విభీషణుడొక్కడే న్యాయం కోసం, విలువల

కోసం పోరాడుతుంటాడు. పళ్ళ మధ్య చిక్కుకొన్న నాలుకలా– అడకత్తెరలో పోక చెక్కవలె, వాక్ స్వాతంత్రమంటే ఇదే కాబోలు. రాక్షసరాజ్యంలో విభీషణునిలా తన అభిప్రాయాల్ని నిర్మొహమాటంగా ప్రకటించిన వ్యక్తి ఏ దేశ ప్రజాస్వామ్యంలోనూ మరొకడు కనపడడు. తులసీరామాయణమంతా చదివినా సీతారాముల సంయోగ శృంగార ఘట్టం నాకు ఒక్కటే కనిపించింది. అందుకే నాకు చిత్రకూటంలోని స్ఫటికశిల ఘట్టం బాగా నచ్చింది. వాల్మీకి రామాయణంలో ఆ దృశ్యం 'శిల' గానే వర్ణింపబడింది. ఒకవేళ రాముడు నిజంగా వుండివుంటే నాలుగైదు వేల సంవత్సరాల క్రితం ఆ బండ మీదే కూర్చొని సీత మెడలో హారం వేసివుంటాడు. – "ఏక్ బార్ చుని కుసుమ్ సుహాయే, నిజకర భూషణ రామ్ సుహాయే." (అందమైన పువ్వుల్ని ఎన్నుకొని, వాటిని దండగా కూర్చి సీత మెడలో అలంకరించాడు. తులసీదాసు తల్లిదండ్రుల సమానమైన సీతారాముల శృంగార వర్ణన చేసినందుకు సిగ్గు పడ్డాడని తర్వాత ఉన్న చౌపాయీ (నాలుగు పాదాల వృత్త పద్యం) చెప్తుంది. ప్రేమలో శాంతి వుంటుంది. ఉద్విగ్నత వుండదు. జానకీరాములు కూర్చొని సరససల్లాపాలాడిన ఆ బండ మీదే రామభరతులు ఆసీనులై ఆత్మీయంగా మాట్లాడుకొని వుండొచ్చు. ఎంత కరుణార్ద్రరస సమ్మేళనమది! ప్రకృతి సౌందర్యం వెల్లివిరిసే అలాంటి రమణీయమైన దృశ్యాన్ని నేను మరెక్కడా చూడలేదు.

నాలాంటి మనిషికి శాంతరసమంటే ఇంత ప్రేమ ఎందుకని ఎవరైనా అనచ్చు. కర్మఫలాన్ని పట్టించుకోకుండా, యుద్ధం చేస్తే రాబోయే పరిణామాల్ని తట్టుకోవాలంటే– మనశ్శాంతి పొందాలంటే మనం నిర్లిప్తతను అలవరచుకోవాలి. జయాపజయాల్ని పట్టించుకోకపోతే మానవుడు తన కర్మమార్గాన్ని వదిలేస్తాడు. 14 ఏళ్ళు ముగియక ముందే అరణ్యవాసాన్ని ముగించివేస్తాడు. ధర్మానికి కేంద్రంగా వుండడు. సత్యం, న్యాయం, మాట నిలకడల్ని వదిలేసి ప్రజలకు ఆదర్శమూర్తిగా నిలబడలేక పోతాడు. పోరాటపటిమ కోల్పోయి, సంఘంతో సర్దుకుపొయ్యేలా తయారవుతాడు. మనస్సుకు నెమ్మది కలగాలి. సమాజంలో శాంతి నెలకొనాలి. కాని పోరాటం సాగుతూ వుండాలి. అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే కుదరదు. శ్రీరాముడు ఈ అసంభవాల్ని సాధించడానికి– మన దృష్టిని సూర్యచంద్రుల వైపు ఆకర్షిస్తాడు. ఇంతకీ వాళ్ళిద్దరూ ఆయన పూర్వీకులే కదా! వాళ్ళంత గొప్పవాడు కాకపోయినా, కొద్దిపాటి ఎత్తుకు

ఎదిగినా మంచిదే కదా. మనిషి తాను దృఢనిశ్చయంతో నిలబడి చరిత్రను సృష్టించాలి. సత్యం, న్యాయం కోసం పోరాటం చేయకపోతే వాళ్ళకు మనశ్శాంతి వుండదు. ఇలా గురిలేకుండా పోరాడుతుంటే వాళ్ళు స్వార్థమనే బురదలో కూరుకుపోతారు. సౌమ్యగుణం అలవరచుకోవడం కష్టం.

రాముడు కూడా జీవితంలో చలించిపొయ్యాడు– మూడు నాలుగుసార్లు. ఆయన అలా చలించకుండా వుంటే బాగుండేది. ఆయన కొన్నిసార్లు చలనచిత్తుడైనా ఆయనలాంటి గుణసంపన్నుడు, నియమపాలకుడు మనకు ఎక్కడా తారసపడడు– చరిత్రలో కానివ్వండి, కల్పనా లోకంలో కానివ్వండి ఎంతోమంది కవులు, కథారచయితలు ఆయన జీవితంలో రకరకాల సంఘటనలు కల్పించి రచనలు చేశారు. రామాయణంలోని చాకలిపాత్ర రాముని గుణశీలాలపై మచ్చను కలిగేలా చేసింది. సీతమ్మ శీలాన్ని శంకించిన రాముడు మన ముందు ముద్దాయిగా నిలబడతాడు. ఈ రజకుని పాత్ర సృష్టి చివరకు రాముణ్ణి నిర్దోషిగా నిరూపించడంలో పరోక్షంగా తోడ్పడుతుంది. ఈ పాత్ర ప్రజాస్వామ్య ప్రభుత్వంలో అనవసరమైన చరిత్రకు దారితీసిందనవొచ్చు. విదేశీ రామాయణాల్లో కూడా ఈ రజకుని పాత్ర కనబడుతుంది. మనదేశంలోని వివిధ భాషల్లోని రామాయణాల్లోనూ, నాటకాల్లోనూ వేర్వేరు విధాలుగా కనపడుతుంది. ఈ ఘట్టం సీతమ్మ మరదలు శాంత రావణాసురుని చిత్రాన్ని, వదిన పట్టె మంచం మీది శయ్య కింద వుంచి లేనిపోని అపవాదములకు దారితీసేలా ప్రవర్తించింది. ఆమె ఈ పని వినోదానికి చేసిందో, మరెందుకు చేసిందో తెలియదు. కాని సద్దు అంటూ జరిగింది. ప్రపంచ సాహిత్యంలో ఎన్నో రామాయణా లున్నాయి. ఈ రామాయణాల్లో చిత్రింపబడ్డ మసక మసకగా కనపడే కొన్ని ఘటనలు కూడా మనల్ని ఆలోచింప చేస్తాయి. ఈ రామాయణ వైవిధ్య, విశిష్ట రూపాల గురించి తెలుసుకోవడం అవసరం. అందువల్ల ఈ రామాయణ తిరునాళ్ళ సందర్భంగా ప్రపంచంలోని వివిధ భాషల్లో వెలువడ్డ పాతా కొత్తా రామాయణాల్ని ప్రదర్శించడం అవసరం.

ఈ రామాయణ తిరునాళ్ళు పట్టణవాసుల్తో పాటు, పల్లె ప్రజల్ని కూడా ఉల్లాస పరిచేలా వుండాలి. కవిత్వం, సంగీతం, నాట్యం, నాటకం – వీటి ప్రదర్శనల వల్ల అందరి హృదయాల్లోనూ ఆనందోత్సాహాలు వెల్లివిరియాలి. మీతో నేనో విషయం

ప్రస్తావించి, నా మాటలు చాలిస్తాను. పాతికో, ముప్ఫయో హిందీ రచయితల శ్రేష్ఠమైన రామాయణ సంబంధమైన కావ్యాలూ, కథలు, నవలలు, నాటకాలు రంగస్థలం మీద నృత్యాలుగా, నాటకాలుగా, కవితాగానాల స్వరూపంలో ప్రదర్శింపబడాలి. ఇవి ప్రేక్షకుల్ని ఆనందడోలికలలో వూగించాలి. ఈ ప్రదర్శనలు ప్రేక్షకులకు కన్నుల పండువు, శ్రోతలకు వీనులవిందు చేసేలా వుండాలి. రామాయణ తిరునాళ్ళలోని కార్యక్రమాలు రకరకాలుగా వుండాలి. రంగురంగుల పూలల్ని గుత్తిగా కూరిస్తే, తెరల మీదా, వేదిక పైనా అలంకరిస్తే ఎంత అందంగా వుంటుందని! రామాయణ దృశ్యాల్ని, కథల్ని భరతనాట్యం, కూచిపూడి, కథక్, మణిపురి, మోహినీ ఆట్టమ్ మొదలైన వివిధ ప్రాంతాల నృత్యాల్లో ప్రదర్శిస్తే ప్రేక్షకులు ఎంత ఆనందిస్తారని! అలాగే ఉత్తరాది, దక్షిణాది సంగీత సంప్రదాయాల పాట కచ్చేరీలు నిర్వహిస్తే ఎంచక్కా వుంటుందో! ఈ కార్యక్రమాలన్నీ ఆయా రంగాల్లో ప్రవీణులైన కళాగురువుల ఆధ్వర్యంలో నడవాలి సుమా!

ఇండోనేషియా– కాంబోడియా–ప్రభుత్వం ఈ రామాయణ తిరునాళ్ళ సందర్భంగా తమదేశం నుండి నృత్య నాటక మండలిని చిత్రకూటానికి పంపుతామన్న చల్లనివార్తను నా చెవిని వేయటం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. ఈ కళామండలికి భారత ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందించాలి. కనీసం వాళ్ళ రైలు రవాణా ఖర్చుల్ని పూర్తిగా మాఫీ చేయడం, అంటే వాళ్ళకు ఉచిత రవాణా సౌకర్యాలు కల్పించాలి. అలా కాకపోతే వాళ్ళకు కొంతైనా రాయితీ ఇవ్వాలి.

జానపద సంగీత, నాటక కార్యక్రమాలు తప్పనిసరిగా వుండాలి. చిత్రకూట ప్రాంతంలో కోల–కిరాత గిరిజనజాతి కళాకారులున్నారని విన్నాను. నేను ఛప్‌రా–ఆరా (బీహారు రాష్ట్రం) ప్రాంతం, ఘాటో–చైతా సంగీత కార్యక్రమం విని ముగ్ధుణ్ణయ్యాను. ఇది ఆధునికమైన 'కదులు– పొర్లు' కార్యక్రమానికి దగ్గర్లో వున్న సాంస్కృతిక కార్యక్రమమట! ఘాటో– చైతా కార్యక్రమం రాధాకృష్ణుల కథకు సంబంధించినదైతే, 'కదులు– పొర్లు' కార్యక్రమం కలహాలకు, పోట్లాటలకు సంబంధించినదట. ఈ కార్యక్రమం వేదిక మీద ప్రదర్శించేటప్పుడు పాత్రలు హింసలకు దిగేవారట.

ఇంతవరకు జైపూర్ నుంచి ఇమాముద్దీన్ డాగర్, కోటా (రాజస్థాన్) నుంచి

రాజేశ్ కుమారి, వహీదన్ బాయి, లక్నో నుంచి వీణా జౌహరి లాంటి ప్రముఖ కళాకారులు ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సమ్మతించారు. ఇంకా ఎంతోమంది ప్రఖ్యాత కళాకారులు తమ సమ్మతి తెలియజేయాల్సి వుంది. స్థానిక కళాకారులు పాల్గొనడం సరేసరి. కాని బయటి ప్రాంతాల నుంచి ప్రసిద్ధ కళాకారులు పాల్గొన్నప్పుడే కదా అసలైన మజా! బెంగాలు, తమిళనాడు, మాహారాష్ట్ర ప్రాంతాల నుంచి రామాయణ సంబంధ కార్యక్రమాలు ప్రదర్శించే కళాకారులు రావాలి మరి. ఈ కార్యక్రమాలు నృత్య, నాట్య గురువుల నేతృత్వంలో ప్రదర్శింపబడాలి. చిత్రకూటానికి దగ్గర్లో వున్న కళాకారులు తప్పక పాల్గొనాలి. వాళ్ళు ఈ రామాయణ తిరునాళ్ళకు మూలస్తంభాలు కదా!

తమ తమ ఊళ్ళలో జాతర్లు, పండుగపబ్బాలు జరుగుతున్నప్పుడు అక్కడి ప్రజలు ఎంతో సంబరపడుతూ తమ ఇండ్లనీ, వాకిళ్ళనీ, వీధుల్ని ఎంత బాగా అలంకరించే వాళ్ళనీ! ఆ ముచ్చట్లు ఎక్కడ? ఆ సంబరాలు ఎక్కడున్నాయంటారు? అయినా సరే, ఇక్కడి ప్రజలు తమకున్నంతలో అలంకరిస్తే చాలు అదే పదివేలు. తులసీదాసు చేసిన అయోధ్య, మిథిల నగర వర్ణనలు ఎంత ఆహ్లాదకరంగా వున్నాయంటారు! మరి, అంత చక్కగా, ముచ్చటగా మనం మన పరిసరాల్ని అలంకరించగలమా? తలవాకిళ్ళకు నవరత్న మాలికల్ని వేలాడదీయకపోవచ్చు, పచ్చని తోరణాలు వేలాడదీయొచ్చు కదా! వీధుల్లో ముత్యాలు, రతనాలు చల్లలేకపోవచ్చు, రత్నకంబళ్ళు పరచలేకపోవచ్చు. నీళ్ళతో శుభ్రం చేయొచ్చు కదా! ఇళ్ళ ముందు అరటి స్తంభాలు నాటొచ్చు కదా. దారి పొడుగునా పచ్చని ఆకులు వేలాడదీయొచ్చు కదా. ఈ చిత్రకూట ప్రాంతాన్ని మన మందరం ఆనందంగా అలంకరించాలి. రాముడెక్కడున్నాడో, అయోధ్య అక్కడే వుంటుంది. మనందరి కృషి వల్ల ఈ రామాయణ తిరునాళ్ళు విజయవంతమైతే, మన భారతదేశ సంస్కృతి విజయపతాకం ఎగురవేసినట్లే.

నేను ఈ రామాయణ తిరునాళ్ళ సందర్భంగా క్రియాశీలురైన కొందరి పేర్లను ఢంకా బజాయించి పేర్కొంటున్నాను. నేను ఎవరికి భయపడాలి? ఎందుకు భయపడాలి? ఎవరైనా త్రికరణశుద్ధిగా పనిచేయకపోతే, అలాంటివాళ్ళ పేర్లు నేను ప్రస్తావిస్తే ఒట్టు.

ఈ భారతదేశంలో పదిమంది ఒకచోట కలిసి వొళ్ళొంచి పనిచేయడం అరుదు. కాని ఈ రామాయణ తిరునాళ్ళు అందుకు ఓ అపవాదం. ఈ సందర్భంగా నేను మీకు రెండు విషయాలు మనవి చేయదలుచుకున్నాను. మనలో రెండు దోషాలున్నాయి. మొదటిది ఏమిటంటే మనం చాలా అల్పబుద్ధి కలవాళ్ళమైపొయ్యాం. మన మధ్య స్నేహభావం కొరవడింది.

ఈ రామాయణ తిరునాళ్ళలో మనమందరం కలిసికట్టుగా పనిచెయ్యాలి. రాముడు ప్రేమ స్వరూపుడు కదా!

సంస్థల, సమితుల నియమ నిబంధనలంటే ఏమిటో, వాటి ప్రయోజనా లేమిటో మన దేశంలో ఏ కొద్దిమందికి మాత్రమే తెలుసు. సంస్థల్లో, సమితుల్లో పనిచేసేటప్పుడు వాటి సభ్యులు కాని, కార్యకర్తలు కాని తమ భిన్నాభిప్రాయాల్ని, రాగద్వేషాల్ని మరిచి, ఉల్లాసంగా, ఉత్సాహంగా పనిచేసి తాము తలపెట్టిన చిన్నా పెద్దా కార్యక్రమాల్ని విజయవంతం చెయ్యాలి. ఈ పనుల్లో మనం ఎంతోమంది బయటివాళ్ళ సహాయ సహకారాల్ని పొందాల్సివుంటుంది. కాని వాళ్ళతో కలహించి, సామూహిక కార్యాల్లో ఎలాంటి అడ్డంకులూ కల్పించకూడదు. వాళ్ళ చేతుల్లో కీలుబొమ్మలుగా మారి, తలపెట్టిన కార్యక్రమాలకు విఘ్నం కలిగించకూడదు.

ఈ రామాయణ తిరునాళ్ళు నిర్వహించేందుకు ఎన్నో సమితులు ఏర్పడ్డాయి. ఇంకా ఎన్నో సమితులు ఏర్పడనున్నాయి కూడా. విశాలమైన ఈ కార్యక్రమాలు నెరవేర్చేటప్పుడు సమితుల సభ్యుల మధ్య వాగ్వివాదాలు రావొచ్చు. కార్యకర్తల మధ్య భేదాభిప్రాయాలు కలగొచ్చు. కాని రామాయణ తిరునాళ్ళనే బృహత్ కార్యం నిర్వహించేటప్పుడు పరస్పరం కలహించకుండా, సహనంతో, అరమరికలు మరిచి, సామూహికంగా త్రికరణశుద్ధితో తలపెట్టిన మహత్ కార్యాన్ని నిర్విఘ్నంగా నెరవేర్చాలి.

చిత్రకూటంలో జరుగనున్న రామాయణ తిరునాళ్లలో బయటనుంచి ఎంతోమంది వచ్చివుంటారు. ఇంకా మరి కొంతమంది రాబోతారు కూడా. అలాంటప్పుడు కార్యకర్తలు తామరాకు మీది నీటి బిందువుల్లాగా నిర్లిప్తంగా తమపని తాము చేసుకుంటూ పోవాలేకాని ఎలాంటి ప్రలోభాలకు లొంగకూడదు. చెప్పుడుమాటలు విని సహాయనిరాకరణ చేయకూడదు. పనులు చేసేటప్పుడు

అభిప్రాయ భేదాలు పుట్టుకొస్తే, పరస్పరం చర్చలు జరిపి, సమస్యల్ని తమలోతామే పరిష్కరించుకోవాలి.

తిరునాళ్ళ సందర్భంలో అతిథులకు గుడారాలు నిర్మించేటప్పుడు ఎన్నిటిని కట్టాలి, వాటి వైశాల్యమెంత, ఎన్ని రకాలుండాలి, ఎంత వంటసామగ్రి కావాలి, ఎంతమంది వంటవాళ్ళు అవసరం, ఇంకా ఇతర పనులు చేసేందుకు ఎంతమంది పనివాళ్ళు కావాలి– ఈ విషయాల్ని నమోదు చేసి, ప్రణాళికాబద్ధంగా పనిచెయ్యాలి. గుడారాలతో పాటు గుడిసెలు కూడా కట్టాలి. ఇవన్నీ కట్టేందుకు అవసరమైన సామగ్రిని సమకూర్చుకోవాలి. వీటిల్లో బస చేసే అతిథులకు వాటి రుసుం, సౌకర్యాల గురించి సరిగ్గా తెలియచెయ్యాలి. కరపత్రాల ద్వారా, పత్రికల్లో విజ్ఞాపనలిచ్చి పకడ్బందీగా ప్రచారాలు చెయ్యాలి.

ఇన్ని పనులు చేసేటప్పుడు చాలా జాగ్రత్త వహించాలి. అనవసరమైన ఖర్చులు చేయరాదు. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అతిథుల్ని సంతుష్ట పరచేలా పథకాల్ని అమలుచెయ్యాలి. ఎవరికిగాని గుడిసెలు కాని గుడారాలు కాని ఉచితంగా ఇవ్వరాదు. ఎవరి సిఫారసులకూ లొంగరాదు. వసతి, భోజన సౌకర్యాల గురించి ఆయా కమిటీలు నిర్దేశించిన మార్గసూత్రాల్నే తప్పనిసరిగా పాటించాలి. భోజనాలు దేశీయ, విదేశీయ అతిథులకు రుచించేలా ఆయా ప్రాంతాలకు తగిన రూపంలో 3–4 రకాలుగా తయారుచెయ్యాలి. వంటవాళ్ళు, వడ్డించేవాళ్ళు, విస్తళ్ళను ఎత్తేవాళ్ళు, వంటసామగ్రిని పరిశుభ్రం చేసేవాళ్ళు శుభ్రంగా వుండేటట్లు చూడాలి. ముఖ్యంగా వడ్డించేవాళ్ళకు శుభ్రమైన సమవస్త్రాలు సమకూర్చాలి. తిరునాళ్ళలో రకరకాల పనిచేసే స్వయం సేవకుల్ని ముందుగానే సిద్ధం చేసుకోవాలి.

## రామాయణం : చర్చనీయాంశాలు (1961, మార్చి)

1. భారతీయ భాషల్లో రామకృష్ణుల కథలు
2. విదేశాల్లో రామకథ
3. విశ్వసాహిత్యంలోని మహాకావ్యాలు
   (హోమర్, వర్జిల్, వాల్మీకి, తులసీదాస్ మొదలైన కవులు)
4. హిందీ, ఇతర భారతీయ భాషలు

5. దేవనాగర లిపి, ఇతర భారతీయ లిపులు
6. విశ్వసాహిత్యంలో స్త్రీ
7. హిందీ కావ్యాల్లో స్త్రీ
8. తులసీదాసు కావ్యాల్లో స్త్రీ
9. సీతమ్మ పాత్ర చిత్రణ
10. రాముడు, కృష్ణుడు, ఏసుక్రీస్తు కథలు
11. రాముడు, కృష్ణుడు, మహమ్మద్ పైగంబర్
12. కవిత్వంలో ఉపమ
13. తులసీదాసు చిత్రించిన అయోధ్య, మిథిలా నగరాలు
14. జాయసీ, సూరదాసు, కబీర్, తులసీ, రహీమ్ మొదలైన సంత్ పురుషుల గుణగణాలు
15. రావణ వంశం నామావళి
16. నా దృష్టిలో రామాయణం (ప్రముఖ విద్వాంసుల అభిప్రాయాలు)
17. వర్ణ వ్యవస్థ
18. హిందీ కవిత్వం– వర్ణ వ్యవస్థ, వర్గ విభజన –విశ్వ కవిత్వం
19. అద్వైత సిద్ధాంతం – విభిన్న స్వరూపాలు
20. రామాయణం – దార్శనిక సంప్రదాయాలు
21. రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, మహావీరుడు – వీళ్ళ కథలు
22. నాస్తికత్వం
23. మతం – రాజనీతి
24. పురుషోత్తముడు
25. భారతదేశ బానిసత్వానికి కారణాలు– కవిత్వం, దర్శనశాస్త్రాల ఆధారంగా చర్చ
26. శాంతరసం
27. దరిద్ర నారాయణుడు
28. తులసీదాసు

## రామాయణ తిరునాళ్ళు – చిక్కులు (1961 ఏప్రిల్ 30)

మేము సంకల్పించిన రామాయణ తిరునాళ్ళకు గ్రహణం పట్టింది. విద్యాసంబంధమైన యాత్రలకు, సాంస్కృతిక బృందాల పర్యటనలకు రైల్వే మంత్రాలయం రాయితీ ఇస్తుంది కాని మతపరమైన యాత్రలకు ఇవ్వమని అగౌరవ పూర్వకమైన లేఖ మాకు అందింది. ఇండోనేషియా ప్రభుత్వం రామాయణ తిరునాళ్ళకు తమ రామాయణ నృత్య మండలిని పంపేందుకు సమ్మతించింది. కాని మాకు కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల మంత్రాలయం నుంచి మీరు ఇండోనేషియాకు సాంస్కృతిక మండలిని పంపేటట్లయితేనే ఆ సంస్థకు రైల్వే రాయితి ఇవ్వగలమని లేఖ రాసింది. చిత్రకూటం మునిసిపాలిటీ మేం తలపెట్టిన రామాయణ తిరునాళ్ళను సమ్మతించక, తామే చిత్రకూటంలో రామాయణ తిరునాళ్ళు జరపనున్నామని ఉత్తరం రాసింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మేం జరుపబోయే రామాయణ తిరునాళ్ళ గురించి దర్యాప్తు చేయాలని, అంతదాక ఏమీ చెప్పలేమని లేఖ రాసింది. మేమేదో గూడుపుఠాణీ చేస్తున్నామని తలంచింది కాబోలు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం.

పెద్ద పెద్ద నగరాల్లోని రామాయణ తిరునాళ్ళ సమితులు మొదట్లో చూపినంత ఉత్సాహం, తర్వాత ప్రదర్శించలేక పోయాయి. పేరుమోసిన శ్రీమంతులు కొందరు మా ప్రయత్నాల్ని మతపరమైన చర్యలుగా సందేహించారు. మరికొంతమంది ఉదార పురుషులు మేం ఏదో రాజకీయ వ్యూహం పన్నుతున్నామని శంకించారు. మాకు సామాన్య ప్రజలు విరాళాలిస్తారన్న భరోసా వుండింది కాని ఇలాంటి ఉదాత్తమైన సాంస్కృతిక కార్యక్రమాల పట్ల వాళ్ళు ఆసక్తి చూపలేకపొయ్యారు. బహుశా మా కార్యకర్తలు ప్రేమతో ఆత్మీయంగా ప్రజలతో సంబంధాలు పెట్టుకోలేకపోయారేమో.

ఈ రామాయణ తిరునాళ్ళు మరే పుణ్యం చేసుకున్న సంస్థ ద్వారా నెరవేరగలవేమో? నేను తలపెట్టిన ఈ సంస్థ కార్యకలాపాల నుంచి వైదొలగవలసి వచ్చింది. ప్రభుత్వ సహకారం లేకపోతే ఇలాంటి బృహత్ సాంస్కృతిక కార్యక్రమాల్ని నేరవేర్చలేమని నేను తెలుసుకోగలిగాను. సంఘంలోని చెడును నిర్మూలించాలన్న సంకల్పం ప్రభుత్వానికి కాని సంస్థలకు వుంటేనేకాని ఇలాంటి ప్రణాళికలు ఈడేరలేవు. నేను ఏప్రిలు 26 వ తేదీన చిత్రకూటంలో రామాయణ తిరునాళ్ళకు సంబంధించిన

ప్రజాసభలో మేం ఈ ఉత్సవాలకై సేకరించిన విరాళాలనీ, నిధుల్నీ చిత్రకూట మునిసిపాలిటీకి ఇచ్చేస్తే మేలని ప్రతిపాదించాను.

మునిసిపాలిటీ అధ్యక్షులు కూడా ఈ నిధుల్ని స్వీకరించడానికి సమ్మతించి నట్లనిపించింది. ఒకవేళ అలా జరుగకపోతే ఈ రామాయణ తిరునాళ్ళ సమితి ఈ ఉత్సవాలు జరపాలన్న ఆసక్తి, భక్తిశ్రద్ధలున్న మంత్రులు కాని, ధనవంతులు కాని ముందుకు వస్తే వారికి ఇవ్వొచ్చని నిర్ణయించింది.

ప్రజల్లో ఆనందం, ఉత్సాహం నింపడం, చర్చలు, ఉపన్యాసాలు, ప్రవచనాలు, సంగీత, నృత్య నాటక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో సంస్కారాన్నీ, సంస్కృతినీ పెంపొందించాలన్నదే మా ఆశయం. ప్రజల్లో భారతీయ ధార్మిక సాహిత్యం పట్ల ఆసక్తి కలిగించాలన్నదే ఈ రామాయణ తిరునాళ్ళ ఉద్దేశ్యం.

ఈ నిధుల్ని ప్రభుత్వానికి గాని మరి ఏ ఇతర సంస్థలకు కాని అప్పగించే దాకా ఈ సమితి పని చేస్తూ వుంటుంది. నేను రాబోయే రోజుల్లో నా అభిరుచికి తగినట్లు, ఆలోచనలకు సరియైనట్లు రామాయణ తిరునాళ్ళను సంకల్పించగలనా? నెరవేర్చగలనా?

# ప్రముఖుల విశ్లేషణలు

# పురాణ పాత్రలు –
# వర్తమాన రాజకీయాలు – లోహియా

– ఓల్గా

**నే**ను చేస్తున్న ఈ పని, రాస్తున్న ఈ ముందుమాట, పెద్ద సాహసకార్యమనే చెప్పాలి. ఎంతో పరిణితి చెందిన చింతనాశీలిగా, మేధావిగా, రాజకీయ నాయకునిగా ప్రజా సమూహాలను ప్రభావితం చేసిన రామమనోహర్ లోహియాగారి వ్యాస సంకలనానికి నేను ముందుమాట రాయటమేమిటి? ఐతే చిరకాల మిత్రులు, సోషలిస్టు ఆలోచనా విధానానికి నిబద్ధులు, లోహియా ఆలోచనలతో ప్రభావితులై, ఆచరణ శీలురైన రావెల సోమయ్యగారు రాయమనటంతో కాదనలేకపోయాను.

ఈ పుస్తకంలోని వ్యాసాలు పురాణ పాత్రల విశిష్టతల గురించి, ప్రత్యేకతల గురించి విశ్లేషించాయి. పురాణాలు, ముఖ్యంగా రామాయణ, మహాభారతాలు కేవలం పురాణ కాలక్షేపాలుగా మిగిలిపోకుండా భారతదేశంలోను, దక్షిణాసియా లోనూ ప్రజల ఆలోచనలను, ఆదర్శాలను, జీవిత విధానాలనూ ప్రభావితం చేశాయి. పురాణ లేదా ఇతిహాసాలుగా పిలవబడే ఈ గ్రంథాలలోని పాత్రలైన సీత, ద్రౌపది, సావిత్రి, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు అనేకమంది భారతీయులకు పూజనీయులైనారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు ఇప్పటికీ భారత రాజకీయ చదరంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తూనే ఉన్నారు. స్త్రీలను, సంస్కృతిని సీతా, సావిత్రులు ప్రభావితం చేస్తూనే వున్నారు. ఒకవైపు దేవుళ్ళుగా పూజలందుకుంటూ, మానవుల కోరికలు తీర్చేవారిగా భజింపబడుతూ, మరొకవైపు మతరాజకీయాలను ప్రభావితం చేసే ఈ పురాణ పురుషుల, స్త్రీల వ్యక్తిత్వాల గురించి, వారు అందించే ఆలోచనలు, ఆదర్శాల గురించి లోహియా గారు చేసిన పరిశీలనలు, విశ్లేషణలు ఈ పుస్తకంలో వున్నాయి.

లోహియా గారి ఆలోచనలు తులసీదాస్ రామాయణం, ఉత్తర భారతదేశంలో ముఖ్యంగా హిందీ, మైథిలీ భాషలలో రాయబడిన రామాయణ మహాభారతాలపై

ఆధారపడి సాగినవి. వాల్మీకి రామాయణం కూడా ఒక ఆధారం. నాకు వాల్మీకి రామాయణం తప్ప మిగిలిన గ్రంథ పరిచయం లేదు. జానపదుల కథలలో కూడా ఉత్తర దక్షిణ భారతదేశాలలో చాలా తేడాలుంటాయి. అందువలన నాకు చాలా పరిమితులున్నాయి. ఐతే ఈ పాత్రలను అనేక విధాలుగా అర్థం చేసుకునే, వ్యాఖ్యానించుకునే అవకాశం ఉండటం వల్ల రచయిత ఆలోచనలను వ్యాఖ్యానించే అవకాశం నాకూ ఉంటుంది.

ఈ వ్యాసాలలో లోహియాగారి అభిప్రాయాలతో నేను ఏకీభవిస్తూనే విభేదించ గలుగుతున్నానంటే అది ఆ పాత్ర సృష్టిలో రచయితలు చూపిన అద్భుత ప్రతిభే. నిజానికి ఈ వ్యాసాలలో సావిత్రి, ద్రౌపదిల గురించిన వ్యాసం చదివేవరకూ నేను సావిత్రి పాత్ర గురించి పెద్దగా ఆలోచించలేదు. ఇప్పుడు ఆలోచిస్తే సావిత్రి పాత్రను కేవలం పతివ్రతగా మాత్రమే ఎందుకర్థం చేసుకోవాలి? మృత్యువుపై పోరాటం చేసిన యోధురాలిగా, విజేతగా ఎందుకు అర్థం చేసుకోకూడదు అనిపించింది. భర్త ప్రాణాల కోసమే సావిత్రి పోరాడి ఉండవచ్చు. కానీ సాధించుకోవలసిన ఏ విషయానికైనా పట్టువిడవని పోరాట పటిమకు ఉదాహరణగా సావిత్రి నిలవదా? సావిత్రిని పతివ్రతగా, పాతివ్రత్యధర్మానికి ప్రతినిధిగా పితృస్వామ్యం ఇన్నాళ్ళూ నిలబెట్టి ఉండవచ్చు. మనమిప్పుడు దానిని subverse చేసి, ఆ అర్థాన్ని తీసివేసి ఆమె చేసిన పనికి కొత్త అర్థాన్ని ఇవ్వవచ్చు. అరవిందులు సావిత్రిని "మృత్యోర్మా అమృతం గమయ" అనే అర్థంలో వ్యాఖ్యానించారనుకుంటాను. నేనివాళ వర్తమాన రాజకీయ సందర్భంలో సావిత్రిని, తమ భర్తల ఆచూకీ కోసం, వారి ప్రాణాల కోసం, వారి శవాల కోసం యమధర్మరాజు కంటే కఠినమైన రాజ్యం (state)పై పోరాటం చేస్తున్న అనేకమంది గ్రామీణ గిరిజన స్త్రీల ప్రతినిధిగా ఆలోచిస్తున్నాను. సావిత్రిని, ఆ స్త్రీలను కూడా గౌరవిస్తున్నాను. భార్యల కోసం ఏమీ చెయ్యని అప్రయోజకత్వం కారణంగా, ఆ విధంగా సమాజాన్ని ప్రభావితం చేసిన పితృస్వామ్య ధర్మాల కారణంగా సావిత్రి విలువ తగ్గించటం సమంజసం కాదని నాకు అనిపిస్తోంది.

ద్రౌపది అంటే నాకు గౌరవం ఉంది. కానీ విమర్శా ఉంది. ఆమెను భారత స్త్రీలందరికీ ప్రతినిధిగా నిలబెట్టటం గురించి అభ్యంతరమూ ఉంది. ఆమె మొట్టమొదటే నిర్ణయాధికారాన్ని చేతిలోకి తీసుకునే అవకాశాన్ని వదులుకుంది.

కుంతి ఆదేశాన్నో, కృష్ణుని రాజకీయోపదేశాన్నో తలదాల్చవలసిన అవసరం ఆమెకేముంది? ఆమె ప్రేమించినది, మత్స్య యంత్రాన్ని ఛేదించినది ఒకరే! అర్జునుని తప్ప ఇంకెవరినీ వివాహమాడవలసిన అవసరం ఆమెకు లేదు. రాజకీయాలకు తల ఒగ్గిన ఆమె జీవితం రాజకీయాల సుడిగుండాలలో చిక్కుకుంది. ఒక్క నిర్ణయం తీసుకోక పోవటం వల్ల జీవితమంతా బాధలు పడింది. లేదా కుంతి, శ్రీకృష్ణుల మాట విందామనే నిర్ణయం వల్ల ఆమె జీవితం అనేక ఎత్తుపల్లాలను చవిచూసింది. ఆమె మేధావి, ఆలోచనాపరురాలు. కానీ ఆమె తెలివి ఎలా నిష్ప్రయోజనమైందో "ఇరావతీ కర్వే" మహాభారతంలోని పాత్రల గురించిన "యుగాంతం" పుస్తకంలో వివరంగా చర్చించారు. ద్రౌపది నిబ్బరాన్నీ. ధీర గంభీరతనూ ప్రశంసించవలసిందే. కానీ మిగిలిన పాత్రలతో పోల్చవలసిన అవసరమేముంది అనిపించింది.

ఇక శ్రీరాముడు సీత పట్ల చేసిన అన్యాయానికి ఆ వాల్మీకి కూడా బాధపడ్డాడు. ఎంతగా ప్రజారంజకుడైనప్పటికీ, అర్థరహితమైన పని చేశాడని ఒప్పుకోనివారు బహు తక్కువ. అలాగే శంబూక వధ, తాటక వధ, వాలిని చంపటం ఇలా అనేక విషయాలలో శ్రీరాముడిపై విమర్శలు ఎంతోకాలం నుంచీ వస్తూ వున్నాయి. ఆర్య ధర్మాలను దక్షిణా పథాన వ్యాపింపజేయటానికి రాముడు చేసిన యుద్ధాలను, పనులను పెరియార్ వంటివారు చాలా తీవ్రంగా విమర్శించారు. అలాగే శ్రీకృష్ణుడు ఎంత ఆరాధనీయుడో, ప్రేమాస్పదుడో అంతగా విమర్శలకూ పాత్రుడు. ఈ పాత్ర చిత్రణలోని బలం అదే. మానవ స్వభావాన్నీ, సామాజిక ధర్మాలనూ ఒకదానితో ఒకటి తలపడేలా చేసి ఆ సంఘర్షణలో జనించిన సమస్త కోణాలనూ మన చేత సందర్శింపజేయటమనే మహాద్భుత సృజనకార్యాన్ని వాల్మీకి, వ్యాసుడు నుంచి పేరు తెలియని అనేక జానపదుల వరకూ చేశారు. ముడిసరుకు అందించినది వాల్మీకి, వ్యాసుడే కావచ్చు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వీరిద్దరినీ లోహియాగారు దైవత్వం నిండిన వారిగాను, అవతార పురుషులుగానూ, మానవులుగానూ కూడా భావించినట్లు ఈ వ్యాసాలు చదివితే నాకు అనిపించింది. రాముడు నిరంతరం దేవుడిగా కావాలనే ప్రయత్నించాడనీ, కృష్ణుడు దేవుడయ్యుండి కూడా నిరంతరం మనుష్యునిగా మారుతూ ఉండేవాడని చెబుతూ లోహియాగారు చేసిన వివరణ, చూపిన ఉదాహరణలు చాలా ఆసక్తికరంగా, ఆలోచించవలసినవిగా ఉన్నాయి.

దైవత్వం, మానవత్వం– ఈ రెండు భావనల గురించిన చర్చ అనంతంగా జరుగుతూనే ఉంటుంది. మన భారతీయ చింతనలో ఈ చర్చ చాలా ప్రజాస్వామికంగా జరుగుతుంది. దేవుడు, దైవత్వం కంటే మానవత్వందే పైచేయి అయిన సందర్భాలు అనేకం కనిపిస్తాయి. సామాన్య ప్రజల ఇలవేల్పులైన దేవుళ్ళను తీవ్రంగా విమర్శించే చోట, సంప్రదాయం భారతీయ సమాజంలో, హిందూమతంలో ఉంది. ఆ చోటు చాలా విలువైనది దానిని దుర్వినియోగం చేయకూడదు. అసలే లేకుండా చేసుకోకూడదు. లోహియా గారు ఈ వ్యాసాలలో ఆ చోటును చాలా చక్కగా తీర్చిదిద్దారు. అందమూ, మేధావితనమూ రెండింటినీ కలిపి, విమర్శనాత్మకంగా ఆ చోటుని నింపారు. దానిని విస్తరించుకుంటూ పోవాల్సిన కర్తవ్యం చదువరుల మీదా, చింతనాపరుల మీదా ఉన్నది. అలాగే ఆ చోటును లేకుండా చేసే అప్రజాస్వామిక మూకల నుంచి ఆ చోటును కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా ఉంది. ఆ బాధ్యతలో భాగంగానే రావెల సోమయ్యగారు ఈ ప్రచురణ బాధ్యత స్వీకరించారనిపిస్తోంది.

'వసిష్ఠుడు–వాల్మీకి' అనే వ్యాసం చాలా ఆలోచనాత్మకంగా ఉంది. ఆనాటి రాజకీయాలతో ముడిపడిన వ్యాసమిది. నెహ్రూని వసిష్ఠుడితో పోల్చి చేసిన నిశితమైన విమర్శ. ఎలాంటివారైనా రాజ్యాధికారపు మత్తు నెత్తికెక్కితే మనుషులు ఎంత క్రూరంగా మారగలరో ఈ వ్యాసం వివరిస్తుంది.

"కులాలు నశించాలి. వాటి సంజ్ఞలు, సంకేతాలు కూడా నశించాలి. శూద్రులను, హరిజనులనూ, మోమిన్లనూ, ఆడవాళ్ళనూ, యోగ్యతలు లేకపోయినా ఉన్నత పదవుల్లో అధిష్టింపజేయాలి. వసిష్ట ద్విజులు ఇందుకు ఇష్టపడరు" అంటూ నెహ్రూని వసిష్టునితో పోల్చి తీవ్రాతితీవ్రంగా విమర్శించిన లోహియా వర్తమాన రాజకీయాలను చూస్తే మరెంత తీవ్రంగా విమర్శించేవారో! ఆ విమర్శ లేకపోవటం వల్లనే మన దేశానికి ఎంతో నష్టం జరుగుతోంది.

"వాసిష్ట ద్విజ రాజకీయాలద్వారా, పదవీ ప్రతిష్టోన్మాద రాజకీయాల ద్వారా భారతదేశాన్ని పునరుజ్జీవింప చేయడం అసాధ్యం. ఏ పార్టీలో అయితే ఆడవాళ్ళు, శూద్రులు, హరిజనులు, ముస్లిములు అధిక సంఖ్యాకులుగా ఉంటారో ఆ పార్టీ మాత్రమే దేశాన్ని శక్తివంతం, సుఖవంతం, సత్యశీలవంతం చేయగలుగుతుందని

నా దృఢాభిప్రాయం. సీత–శంబూకుల కేంద్రాన్ని మరింత పెంపొందించాలి"– ఈ వ్యాక్యాలతో లోహియా వర్తమాన రాజకీయ కార్యాచరణకు ప్రణాళికనందించిన వాడయ్యాడు. లోహియా రచనలు భవిష్యత్ భారత సమాజానికి దారులు వేసేవి. ఎప్పుడూ ప్రాసంగికతను కోల్పోవనివి. వాటిని చదివి చర్చింతవలసిన అవసరం ఉందని గుర్తించి ప్రచురిస్తున్న రావెల సోమయ్యగారి కృషికి అభినందనలు.

ముందే చెప్పినట్టు నేనీ పనికి నిస్సందేహంగా తగినదానిని కాదు. నాకు కృష్ణ, ద్రౌపదుల మధ్యనున్న సఖ, సఖీ సంబంధం గురించి విస్తృతమైన అధ్యయనం లేకపోవటం వల్ల దానిని గురించి మాట్లాడలేకపోయాను. నిజానికి ఈ భావన చాలా ఉదాత్తమైనది. స్త్రీ పురుషుల మధ్య మంచి స్నేహానికి మన పురాణ కథలలోనే ఉన్న గొప్ప ఉదాహరణ. దీనిని మొదట ప్రతిపాదించినదెవరో గానీ స్నేహంలోని సారాంశాన్ని గ్రహించినవారు. ఆ తర్వాత చాలామంది దానిని ప్రస్తావించినట్లున్నారు. ఇటీవల ప్రతిభా రే ఒరిస్సాలో రాసిన యాజ్ఞసేని నవలలో దీనిని విపులంగా రాశారు. మానవ జీవితంలోని సకల ఆత్మీయ సంబంధాల, అనుబంధాల సారాంశాన్ని ఈ సఖాసఖి స్నేహ సంబంధంలో మనం చూడవచ్చు. దానిని గురించి లోహియాగారు వివరంగానే రాయటం వల్ల ఇపుడైనా అందరూ దీనిని గురించి మాట్లాడుకుని, స్నేహ సంబంధాలలో పరిణితిని, ఉన్నతిని సాధించగల మార్గమొకటుందని తెలుసుకునే అవకాశం కలిగినట్లయింది. నేను కేవలం పాఠకులకు ఆసక్తి రేకెత్తించే ప్రయత్నమే చేయగలిగాను. ఈ పుస్తకంలోఉన్న లోతైన విషయాల గురించి తెలిసినవారు చర్చిస్తారని, దానివలన భారతీయ సమాజంలో ప్రజాస్వామిక చర్చలకు ఉన్న చోటు విస్తరించి, బలపడుతుందని ఆశిస్తూ,

# సాంస్కృతిక మోనోపలికి విరుగుడు లోహియా

– రాణి శివశంకర శర్మ

**ఒ**కే మూసలో యిమిడేపోయే ఏకరూప ఏకత్వం కాకుండా బహుళత్వంలోకి తగిన స్థానం యిచ్చే ఐక్యతని సాధించడం ఎలా అనే ప్రశ్నకి సమాధానాన్ని భారతీయ పౌరాణికతలో అన్వేషించారు లోహియా. పురాణాలని మాత్రమే కాదు భారతీయతని మన నేషనలిజాన్ని విశాల దృక్పథంతో అర్థం చేసుకోవడానికి మంచి ప్రయత్నం చేశారు లోహియా.

రాముడు, కృష్ణుడు ఉన్నారా, లేదా? వాళ్ళు చారిత్రక పురుషులా కాదా? వారిని గురించి చెప్పే సంస్కృత గ్రంథాలలో కన్సిస్టెన్సీ ఉందా లేదా అనే అకడమిక్ ప్రశ్నలలో తలదూర్చారు. అంబేద్కర్ నుంచి రంగనాయకమ్మ వరకు అందరు మేధావులూ. జ్యోతి బాపులే వంటివారు పురాణాలని చారిత్రీకరించడానికి వలస చారిత్రక భావాలని ఆశ్రయించారు.

వీరు అందరూ విస్మరించిన విషయం పురాణాలని నేటి మంచి చెడుల నైతిక దృష్టిలోంచి, రియలిస్టు ధోరణిలోంచి తవ్వకాలు జరపడం వల్ల ఒనగూరేది ఏమిటి? అనే ప్రశ్నని వేసుకోకపోవడం.

ఈ నలిగిన బాటకి దూరంగా జరిగాడు లోహియా. అంబేద్కర్ రంగనాయకమ్మలలా లోహియా పుస్తకాల పురుగు కాలేదు. సంస్కృత గ్రంథాల గొడ్డు చాకిరీ చేయలేదు.

జన మానసంలో పురాణాలు ఎలా రూపుదిద్దుకొంటూ వచ్చాయి? పురాణాలు ప్రజా సమూహాల మధ్య ఐక్యతకి, అలాగే వివిధ వివక్షలకి ఏక కాలంలో ఎలా దారితీశాయి అనే విషయంపై మధించాడు. అంతేకాదు 'రాజ్యం' ఆవిర్భావ వికాసాలలో పురాణపాత్రలు, పౌరాణిక భావనలు చేసిన దోహదం, వాటిని అర్థం

చేసుకోవడం ద్వారా రాజ్య స్వరూప స్వభావాలని రాజ్యం యొక్క 'సైక్'ని మనం ఎలా పట్టుకోవచ్చో వివరించాడు లోహియా.

లోహియా ఇటువంటి మౌలిక భావనల్ని ముందుకు తేవడానికి గ్రంథాలకంటె మౌఖికతలోని జనంలోని నానుడులని కథలని ఆశ్రయించాడు. రామచరిత మానస్ వంటివాటిని కూడా జన బాహుళ్యం నుంచే గ్రహించాడు. భారతఖండంలో గ్రంథానికి మౌఖికతకి గల మౌలిక సంబంధంలోకి వెళ్ళి, సారాన్ని బయటికి లాగాడు.

ఈ విధమైన లోహియా వైఖరికి తాత్విక కారణం వుంది. జాతీయరాజ్యం ఏర్పడుతున్న సమయంలో వచ్చిన ప్రధాన సమస్య– ఐక్యతని సాధించడం ఎలా అనేది. ఈ ప్రశ్నకి అంబేద్కర్ లాంటివాళ్ళు కూడా సమాధానం చెప్పటానికి ప్రయత్నించారు.

కాని జాతీయ ఐక్యతకి బలిపశువులుగా మారకుండా వుండడం ఎలా, ఐక్యత మోనోపలిగా ఘనీభవించకుండా జాగ్రత్త పడడం ఎలా, జాతీయ 'ఐక్యత' అనేది మూసతత్వంగా హెర్డ్ ఇన్‌స్టింక్ట్‌గా గుంపుతత్వంగా మాస్ హిస్టీరియాగా మారకుండా జాగ్రత్త పడడం ఎలా అనే ప్రశ్నకి సమాధానాన్ని లోహియా మాత్రమే అన్వేషించాడు. ఇది గాంధీ వారసత్వం.

నెహ్రూకి కాని అంబేద్కర్‌కికాని జాతి 'ఐక్యత' అనే ఆధునిక భావనలోని లొసుగులపై దృష్టి లేదు. ఐక్యత సాధించడం ఎలా అనేదే అంబేద్కర్ ప్రశ్న. 'హిందూయిజం'లో కులం వుంది. స్త్రీల పట్ల వివక్ష వుంది. కనుక బౌద్ధంలోకి వెళ్ళిపోయాడు. అది ప్రస్తుతం భారతఖండంలో సజీవమైనది కాదు. అందుకే శ్రీలంక, బర్మాలకి కూడా వెళ్ళాడు. వాళ్ళని మెచ్చుకొన్నాడు. ఐతే కమ్యూనిస్టు నియంతృత్వం రష్యాలో విచ్ఛిన్నతకి దారితీస్తుందని జోస్యం చెప్పిన అంబేద్కర్ బుద్ధిస్టు రాజ్యాలైన శ్రీలంక, బర్మాలకి అదే గతి పడుతుందని ఊహించలేకపోయాడు. కారణం– బౌద్ధం పేరుతోకాని మరే పేరుతో కాని ఏర్పడే జాతీయ 'ఐక్యత' తీవ్ర నిరంకుశత్వంలోకి పతనమయ్యే ప్రమాదాన్ని ఆయన పసిగట్టలేదు. పాత తప్పుల్ని నిర్మూలించి, కొత్త ఐక్యతని స్థాపించడం గురించి వున్న తొందరలో ఆధునికత తెచ్చే సమానత్వం, ఐక్యత వంటి భావాల పరిమితులు వాటి పునాదులు విస్మరించబడ్డాయి. అందువల్లనే అంబేద్కర్ పాతని పురాణాలని తిట్టిపోయడం దగ్గరే మిగిలిపోయాడు. బౌద్ధాన్ని ఆకాశానికి ఎత్తేశాడు.

అదే సమయంలో లోహియా పురాణ పాత్రల ఆధారంగా ఐక్యత బహుళత్వాలకి మధ్య జరిగిన సంఘర్షణనీ, సమన్వయాన్నీ కూడా పట్టుకోవడానికి ప్రయత్నించాడు. ప్రజల కథలు, మాటలలో లీనమైపోయిన పౌరాణికత ద్వారా ప్రజల అంతరంగాల్లోనే యీ జటిల సమస్యకి పరిష్కారాన్ని అన్వేషించాడు లోహియా. మొత్తంగా ప్రజల విశ్వాసాల్నీ వారి మౌఖిక సంస్కృతిని తిరస్కరించి గ్రంథాలలోకి కూరుకుపోయిన అంబేద్కర్ యీ సదవకాశాన్ని జారవిడుచుకొని కేవలం నిరాకరణ, నిందలకి పరిమితమయ్యాడు. తద్వారా అంబేద్కర్ ఐక్యత బహుళత్వాల మధ్య సంభాషణకి కాక కేవల 'ఐక్యత'కి ప్రాధాన్యమిచ్చి, మూస 'ఐక్యత' వల్ల వచ్చే ప్రమాదాన్ని నివారించే మార్గాన్ని కనుగొనడంలో విఫలమయ్యాడు.

బహుళత్వాన్ని పక్కన బెట్టి 'ఐక్యత'కే ప్రాధాన్యం యిచ్చే ధోరణి వల్లే అంబేద్కర్ సంస్కృత వాల్మీకి రామాయణాన్నే ఆధారం చేసుకొని రాముని వ్యక్తిత్వాన్ని విశ్లేషించడానికి ప్రయత్నించాడు. అందులో ఉన్న వైరుధ్యాలని ఆధారం చేసుకొని రాముని వ్యక్తిత్వాన్ని విశ్లేషించడానికి పూర్తి లొసుగులతో కూడినదిగా వ్యాఖ్యానించాడు. చివరికి రాముని ఏకపత్నీ వ్రతాన్ని కూడా శంకించాడు. రంగనాయకమ్మ కూడా రామకథని సంస్కృత రామాయణంలోనే వెతికి తప్పుపట్టింది.

ఈ క్రమంలో కేవలం గ్రంథంపై ఆధాపడిన యిటువంటి విమర్శకులు పురాణం అంటే ఘనీభవించిన వాస్తవం కాదు అనే సత్యాన్ని విస్మరించారు. పురాణాలు యితిహాసాలు నిరంతర వ్యాఖ్యానానికి గురౌతూ వచ్చాయన్న వాస్తవాన్ని విస్మరించారు.

ఈనాడు హిందూవాదులు బహుళ రామాయణాలని తిరస్కరించి వొకే రామాయణం వాల్మీకి రామాయణాన్ని ప్రామాణిక గ్రంథంగా నిలపడానికి చూస్తున్నారు. ప్రామాణికత పేరుతో జాతీయ మూస 'ఐక్యత'ని పైకి ఎత్తడం అనేది హిందూవాదులలోనూ ఆధునిక ప్రగతిశీలులలోనూ కూడా కనబడ్తుంది. రాముణ్ణి పైకెత్తే హిందూవాదులు, తిరస్కరించే ప్రగతివాదులు యిద్దరూ కూడా పౌరాణిక బహుళత్వానికి సాంస్కృతిక బహుత్వానికి దూరంగా జరిగారు.

యీ మూస ఐక్యతని నిరాకరిస్తూ ఐక్యత–బహుళత్వాల సమన్వయాన్ని ఆశించాడు లోహియా. పురాణ పురుషులని వారి స్థల కాలపరిమితులలోనే గుర్తిస్తూ కూడా, వారిలో ఎటువంటి ప్రత్యేకత ఉదాత్తత వుందో నిరూపించాడు. రాముడిని

నియమబద్ధ వ్యక్తిత్వానికి, కృష్ణుడిని బహుళత్వానికి, శివుడిని స్థలకాలాతీత అనంతత్వానికి ప్రతీకలుగా గుర్తించాడు లోహియా.

రాముడిని యీనాటి విలువలతో మంచివాడా చెడ్డవాడా అనే అంతిమ నిర్ధారణలకి వచ్చే వైఖరిని పక్కన బెట్టండి. రాముడు నియమాలకీ చట్టాలకీ లోబడినవాడు. నియమాలు చట్టాలు ఎలా ఏర్పడతాయి? వాటిని ఆధిపత్య వర్గాలు పై నుంచి రుద్దడం వల్ల మాత్రమే కాదు. ప్రజల సమ్మతి వల్ల కూడా ఆ నియమాలూ చట్టాలు కొనసాగుతాయి. యీ 'సమ్మతి'కి గల ప్రాధాన్యతని గ్రాంసీలాంటివారు గుర్తించారు. అందుకే రాముడు 'చాకలి' వాని మాటవిని భార్యని అడవిలో విడిచి పెట్టేశాడు. జన 'సమ్మతి'కోసం అగ్నిప్రవేశాన్ని అంగీకరించాడు. రాజ్యత్యాగం కూడా చేశాడు కదా?

అత్యంత ఆధునిక దేశం అమెరికాలో యిప్పుడు అబార్షన్ వ్యతిరేక చట్టాలు రావడమేమిటి? దానికి కొందరు వ్యక్తులు వ్యవస్థలు మాత్రమే కారణం కాదు. ప్రజాబాహుళ్యంలో వున్న మత విలువలు, సాంస్కృతిక విలువలు యిటువంటి తీర్పులని సమ్మతిని చేకూరుస్తాయి. యిటువంటి విలువలు కొందరు రుద్దడం వల్ల మాత్రమే కాదు. ప్రజలలోని అనేక వర్గాలు క్రియాశీలంగా వుంచడం వల్లనే ఆ విలువలు చలామణిలో ఉంటాయి. అందుకే రాజ్యాన్నీ ఆధిపత్యాన్నీ వొక సెంటర్‌లోనే చూడడం పొరపాటు. అందుకే రాముడిని నిందించేముందు, ఆ విలువలు ప్రజాబాహుళ్యంలో వున్నవే అనే సంగతి మరువరాదు. స్త్రీలపై ఆధిపత్యం, వివక్ష అనేది రాముడిలోనే కాదు చాకలివానిలో కూడా వుంది. రాజు, సామాన్యుడు యిక్కడ యేకం అవుతున్నారు.

రాముడు కుటుంబ విలువలకీ, నియమాలకీ కట్టుబడి రక్తపాతాన్ని నిరాకరించి అడవికి వెళ్ళిపోయాడు. యిది అశోకుడికి భిన్నమైన పద్ధతి. అశోకుడు ఎంతో హింసని ఆచరించి, రాజ్య విస్తరణ చేసిన తర్వాత శాంతిని అహింసని బహుళత్వాన్ని బోధించాడు. తన సామ్రాజ్య సుస్థిరత్వానికి శాంతి అవసరం కూడా. (ఈ క్రమంలో అశోకుడు సోదరులని కూడా హింసించాడు).

కానీ రాముడు తండ్రి మాటకి విలువ యిస్తూ రాజ్యాన్ని సోదరుడికి అప్పజెప్పి అడవిబాట పట్టాడు. ఆనాడు తండ్రి మాట జవదాటక పోవడం వొక విలువగా

మారడానికి రాముడి కథ కారణం. యిది రాజ్యంలోనూ కుటుంబంలోనూ సాపేక్ష శాంతిని పాదుకొలిపింది. యీ విధంగా రాముడు మర్యాదా పురుషోత్తముడయ్యాడు. రాజ్యం కోసమో, ఆస్తి కోసమో రక్తసంబంధీకుల హింసని నిలువరించాడు. ఐతే అశోకుడు కాని రాముడు కాని ఒక మహాసామ్రాజ్య స్థాపనలో భాగంగా ధర్మాన్ని ప్రవర్తింపజేశారు. వాలిని కాని రావణుని కాని రాముడు చంపి వుండవచ్చు కాని రాజ్యం తన గుప్పెట్లో పెట్టుకోలేదు. ఆయా కుటుంబీకులకే అప్పజెప్పాడు.

మౌర్య, గుప్త సామ్రాజ్యాలు కేంద్రీకృతమైన రాజ్యాన్ని అమలుపరిచాయి. యీ కేంద్రీకృత రాజ్యానికి రాముడు ప్రతీక. కేంద్రీకృత రాజ్యం నిలవాలంటే కొన్ని ప్రజాస్వామిక విలువలని అమలు పరచక తప్పదు.

ప్రజలలోని విలువలే ప్రజాస్వామిక విలువలు. వాటికి అవే గొప్పవి, సమగ్రమైనవి కావు విలువలు. విలువల మథింపు నిరంతరం జరగాలి. వివక్షని తగ్గించడానికి ప్రయత్నం జరగాలి. ప్రజాసామాన్యంలో వివక్ష మాత్రమే లేదు. ప్రజలు అనుసరించే మతం, సంస్కృతులలో సమానత్వానికి బీజాలు కూడా వున్నాయి. వాటిని విస్తరింపజేయాలి.

రాముడు కేంద్రీకరణకి ఏకత్వానికి సింబల్. శ్రీకృష్ణుడు బహుళత్వానికి సింబల్. మూసఐక్యతని నివారించాలంటే బహుళత్వాన్ని అర్థం చేసుకోవాలి. శ్రీకృష్ణుని ఆవాహన చేయాలి. శ్రీకృష్ణుడు అంటే అతనితో అనుబంధం కల ద్రౌపది, మీరాబాయిలు కూడా.

ద్రౌపదితో శ్రీకృష్ణుని సంబంధాన్ని సఖి-సఖా సంబంధం అంటాడు లోహియా. ఈ అనుబంధం శృంగారపరమైనది కాదు. మానవునికి సంబంధించిన సకల అనుబంధాల సమాహారం.

శ్రీకృష్ణుడు కళలకీ, ప్రేమకీ సౌందర్యానికి ప్రతిరూపం. అతడు ఘనీభవించిన రాజ్యం కాదు. అలాగే యాదవుడైన రాజు కావచ్చుకాని అనేకసార్లు యుద్ధం నుంచి పలాయనం చిత్తగించినవాడు. అనేక తాత్విక చింతనల సారాన్ని సమన్వయ దృష్టితో గీతగా బోధించినవాడు. తన కడుపులో విశ్వాన్ని దాచుకొన్నవాడు.

ఆధునిక యుగంలో యీ రెండు పాత్రల సమన్వయం అత్యావశ్యకం. ఎప్పటికంటె నేటి జాతీయ రాజ్యం కేంద్రీకృతమైనది, ఏకీకృతమైనది. నేటి ఆధునిక

రాజ్యాలు మతపర సంకుచితత్వంలోకి దిగజారిపోవడానికి కారణం – కేంద్రీకరణ, మూస ఐక్యత. మహారాజ్యాలని సృష్టించవచ్చు కాని అవి మూసలుగా బంధిఖానాలుగా మారే ప్రమాదం ఎక్కువ. రాజ్యనియంత్రణ సూక్ష్మస్థాయిలోకి విస్తరించే అవకాశం ఎక్కువ. నేటి టెక్నాలజీ దానికి అనుగుణంగానే వుంది.

రాజ్యం మితిమీరి ఏకీకృతమయ్యే ప్రమాదాన్ని పసిగట్టడం వల్లే లోహియా మెగా యంత్రాలపట్ల సందేహం వ్యక్తం చేశాడు. కనీసం చిన్నయంత్రాలని ప్రత్యామ్నాయంగా నిలిపాడు. పేదవాళ్ళు అనే కాదు చిన్నా చితకా, చితికిపోయే నాగరికత యిది. యిక్కడ మెగా యంత్రం, పెట్టుబడి, రాజ్యం మితిమీరిన కేంద్రీకరణ వైపు దారితీస్తూ ప్రత్యామ్నాయాలని అన్నిటినీ రద్దుచేసివేస్తున్నాయి. మౌర్య, గుప్త… మరే సామ్రాజ్యమైనా దీనితో పోల్చదగినవి కావు. గాంధీ హిందూ స్వరాజ్‌లో రైల్వే వ్యవస్థకి భయపడడానికి కారణం సకల స్థానికతలనీ, ప్రత్యేకతలనీ ధ్వంసం చేసే మూస ఐక్యతపట్ల భయమే. గాంధీ జాతీయవాది కావచ్చు. కానీ 'జాతీయత' నియంతృత్వంగా నిరంకుశత్వంగా మారే ప్రమాదాన్ని పసిగట్టినవాడు. అందుకే యీశ్వర్ అల్లా తేరేనామ్ అంటూ సాంస్కృతిక ప్రతీకలలోని బహుళత్వాన్ని చాటి ప్రమాదాన్ని నిరించడానికి ప్రయత్నించాడు.

రామాయణ మేళ ఉత్సవాల కోసం చేసిన ప్రయత్నంలో సాంస్కృతిక ప్రతీకలని మూసలుగా ఘనీభవించకుండా, బహుళత్వ సారాన్ని నిలపడం ప్రధానం. అందుకే స్వదేశీ విదేశీ రామాయణాల ప్రదర్శన, చర్చ జరగాలని భావించాడు లోహియా. ఈ సందర్భంగా రామాయణ కల్పవృక్ష కర్త విశ్వనాథ సత్యనారాయణని కూడా ఆహ్వానించడమే కాదు, చిత్రకారుడు ఎం.ఎఫ్.హుస్సేన్‌ని పురాణ చిత్రాలు వేయమని ప్రోత్సహించినది లోహియానే. తర్వాతి కాలంలో దేవతల నగ్న చిత్రాలు గీసి హిందూవాదుల ఆగ్రహానికి గురై విదేశాలకు వెళ్ళిపోయాడు హుస్సేన్.

ఇప్పుడు ఇండియా కూడా బహుళత్వానికి దూరంగా జరుగుతోంది. ఈ సందర్భంలో రామపూజనే కాదు రావణ ఆరాధనని కూడా ఏకకాలంలో ఆహ్వానించిన లోహియా బహుళత్వ దృష్టి అత్యవసరం.

రాముడు, రావణుడు శత్రువులు కదా అని అడగవచ్చు. కాని లోహియా ఒక కథ చెప్తాడు. మరణావస్థలో వున్న రావణుని వద్ద రాజనీతి గురించి తెలుసుకొమ్మని లక్ష్మణుని రాముడు పంపుతాడు.

భారతీయ తాత్వికతలో అసలే పొసగని వైరుధ్యాలు అంటూ ఏమీలేవు. జంటలు తప్ప వైరుధ్యాలు లేవు. అందుకే రామస్తుతినే కాదు, రామనిందని కూడా ఆహ్వానించగలగడమే నిజమైన భారతీయత అని లోహియా భావించాడు.

రాముడు పరిమితులకి హద్దులకి సంబంధించిన పాత్రయైతే, శివుడు అనంతత్వానికి హద్దులు లేని స్థితికి ప్రతిరూపం అంటాడు లోహియా.

చిదంబర క్షేత్ర పూజారి నాతో చెప్పిన మాటలు గుర్తుకు వస్తున్నాయి. శివుడు మూడు స్థితులలో వుంటాడు. రూపం నటరాజు, రూపారూపం శివలింగం, అరూపం (నిర్గుణం) ఆకాశలింగం అదే చిదంబర రహస్యం. రాజకీయ పరిధులని దాటి మిస్టిసిజాన్ని తాకుతాడు లోహియా.

ఐతే శ్రీకృష్ణుడు వైయుక్తికమైన సమదృష్టిని, సామాజికమైన సమతని కలపడంలో పూర్తిగా సఫలం కాలేదు అని వొకచోట అంటాడు లోహియా. ఈ విధంగా వ్యక్తినీ, సమాజాన్నీ, ఆధ్యాత్మికతనీ రాజకీయాన్నీ మేళవించాలని ప్రయత్నిస్తాడు. ఇది గాంధీ తత్వానికి కొనసాగింపే.

యింత గాఢత్వం యితరులలో మనకు కనబడదు. కారణం – పురాణాలని తిట్టవచ్చు లేక దూరంగా వుండి విశ్లేషించవచ్చు కాని, అనుభూతి చెందడం నాగరికం కాదు అని వలసవాద విద్య మనకి నేర్పింది.

గ్రీకు పురాణగాథల్ని గ్రీకు పురాతన శిల్పాల్ని చూసి మానవజాతికి బాల్యదశకు చెందిన అద్భుతాలుగా మార్క్సు అనుభూతి చెందుతాడు. దానిలో ఎవరికీ అనాగరికత కనబడదు. భారత పురాణాల పరిస్థితి వేరు. భారతీయ పురాణాలు గుడులలో గోపురాలలో శిల్పాలలో, శిథిలాలలో కాదు మన భాషలో జాతీయాల్లో విడదీయరాని భాగం. ఐతే దాన్ని పాశ్చాత్యంతో పోలిస్తే వెనుకబాటుగా భావించారు కోశాంబివంటి వారు. అందువల్ల మనలో యింకిపోయిన పౌరాణికతని తెగనరుక్కోవడమే నాగరికత పురోగతి అని భావించారు వలస ఆధునికులు.

అందువల్ల ఆర్య సమాజ్ స్థాపకుడు దయానంద సరస్వతితో మొదలై జ్యోతిబాపులే అంబేద్కర్ వంటివారు పురాణాలలోని చెడుగుని మాత్రమే చూశారు కాని అవి ఎటువంటి విలువలని పురిగొల్పుతాయో చెప్పలేకపోయారు. హిందూ

వాదులు రాముడిని చారిత్రక పురుషుడిగా మార్చి, మూసజాతీయ ఐక్యతకి సింబల్‌గా మార్చారు.

లోహియా యిప్పుడు యెందుకు అవసరం అంటే – ఆ మూస ఐక్యత స్థానంలో బహుళత్వంతో కూడిన ఐక్యత దృష్టిమాత్రమే ప్రజాస్వామ్యాన్ని కాపాపగలదు.

పూర్తిగా అంగీకరించడం లేక నిరాకరించడం అనేవి గుడ్డి ఆరాధనకి భిన్న రూపాలు అంటాడు లోహియా. అందుకే పురాణ ఇతిహాసాలలోని సంకుచితత్వాన్ని వర్ణలింగ వివక్షలని నిరసించడానికి వెనుకాడడు. కాని ఆ పేరుతో పురాణాలు నిర్వహించిన పాత్రని ప్రభావాలని ఏకపక్షంగా నిరాకరించాడు.

శివునితో వివాహం అనంతరం పార్వతిని అత్తవారింటికి పంపే సందర్భంలో తల్లి మేనక పార్వతితో పలికిన మాటల సందర్భంలోని యీ చతుష్పది చాలా ఆకట్టుకొంది లోహియాని.

కత బిధి సృజినారీ జగఘూహీ
పరాధీనా సవనేహూ సుఖనాహీ

హే భగవాన్, హే పరమాత్మా! అసలు నీవు ఆడదాన్ని ఎందుకు సృష్టించావు. పరాధీనకు స్వప్నంలో సైతం సుఖం వుండదు.

యిలాంటి వాక్యాలు స్త్రీల పరాధీనతలోని దుఃఖాన్ని తెలియజేస్తాయి. పురాణకథల మాటున స్త్రీ హృదయం వ్యక్తమౌతుంది. మా అమ్మన పిన్ని అప్పగింతల సమయంలో వొకపాట పాడేది. ఆ పాటలో అత్తవారింటిలో ప్రతి నిముషం తిండి దగ్గరి నుంచి అన్ని విషయాలలో ఎంతగా అణగి మణగి పరాధీనంగా జీవించాలో వర్ణించబడింది. హృదయం భారంగా ఐపోయేది వింటుంటే.

ప్రాచీనమైనదైనప్పటికీ నవీనమైనది పురాణం. ఇది వ్యుత్పత్తి అర్థం. పురాణం నిలవనీరు కాదు. నూతన అర్థాల్ని కల్పించుకొంటూనే వుంటుంది. ఐతే ఆ పేరుతో స్వారస్యాన్ని చెడగొట్టకూడదు అని యీ చతుష్పదిని కొందరు మెలితిప్పి వాడుకున్న తీరుని వ్యతిరేకిస్తారు లోహియా.

అసలు ఏ విషయాన్నైనా గుడ్డిగా అంగీకరించడం వ్యతిరేకించడం అనేదానికి

పూర్తిగా విరుద్ధం లోహియా వైఖరి. అన్నిటినీ నలుపు–తెలుపులు మంచిచెడుల వైఖరిలోంచి కాక సంక్లిష్ట ఆలోచనవైపు దారి తీస్తాడు లోహియా. దీనికి మంచి ఉదాహరణ హిందూకోడ్ బిల్ పట్ల లోహియా వైఖరి.

నెహ్రూ సారథ్యంలో హిందూకోడ్ బిల్లుని న్యాయశాఖామంత్రిగా వున్న అంబేద్కర్ ప్రవేశపెట్టారు. దానిని ఛాందస వాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. కారణం అది అగ్రవర్ణ స్త్రీలకి ఆస్తి హక్కుని కల్పిస్తోంది. వివాహం విడాకుల విషయంలో స్త్రీలకి స్వేచ్ఛని కల్పిస్తోంది.

ఐతే యీ బిల్లు సందర్భంగా నెహ్రూపై విసుర్లు విసిరాడు లోహియా. ఆయన విమర్శ హిందూ ఛాందస వాదుల విమర్శకి పూర్తిగా భిన్నమైనది. హిందూకోడ్ బిల్లు వల్ల అగ్రవర్ణ స్త్రీలకే లాభం. అది కూడా గుడ్డిలో మెల్లలా కొంతవరకు మెరుగే. కాని అసలు ఆస్తే లేని అపార జన సామాన్యం పట్ల నెహ్రూ వైఖరి ఏమిటి? మారు మనువు వంటివి వున్నాయి. కనుక నిమ్న కులాలకి యీ బిల్లు వల్ల జరిగేదేమీ లేదు అంటాడు లోహియా. బహుజనం సమస్యల గురించి నెహ్రూ దృష్టి పెట్టడం లేదు అని విమర్శిస్తాడు.

ఈనాడు దళితవాదులు బ్రాహ్మణ సంస్కర్తల గురించి విమర్శిస్తారు. కాని అంబేద్కర్ బిల్లు విషయంలో బ్రాహ్మణ సంస్కర్తగా మాత్రమే వ్యవహరించాడు. లోహియా ఆ పరిమితిని ఆనాడే బయటపెట్టాడు.

ప్రతి విషయాన్నీ అంగీకార తిరస్కారాలతో చూసే వైఖరికి భిన్నంగా ప్రతి విషయాన్నీ బహుముఖాలుగా చూసే పద్ధతి లోహియా పద్ధతి.

రాముడు ఏకపత్నీ వ్రతుడా కాదా అని సంస్కృత రామాయణాన్ని అంబేద్కర్ అకడమిక్‌గా తవ్వి తీస్తున్న కాలంలో, లోహియా చాలా విచిత్రమైన ప్రశ్నవేస్తాడు. పాశ్చాత్య లోకంలో బహుపత్నీ వ్రతం గురించి కథలు గాథలు చారిత్రక పురుషుల వృత్తాంతాలు లేకపోవడానికి కారణం ఏమిటి? భరతఖండంలోని కథలలో పురాణపురుషుల వృత్తాంతాలలో బహుభార్యాత్వం రాజ్యం చేయడానికి కారణం ఏమిటి? ఇదీ లోహియా ప్రశ్న. ఈ ప్రశ్న అంబేద్కర్ ప్రశ్నకన్న వెయ్యిరెట్లు లోతైనది. సాధారణంగా పాశ్చాత్యం గురించి భరత ఖండ సంస్కృతి గురించి మన దృష్టిలో పేరడైమ్ షిఫ్ట్‌ని తీసుకు వచ్చే ప్రశ్నయిది.

అందువల్ల వొకే మూసలోకి వొదిగిపోయే దళిత బహుజన హిందూత్వ వాదాలకి అతీతంగా బహుళత్వంతో కూడిన ఆలోచనా విధానాన్ని ప్రవేశపెట్టిన గొప్ప థింకర్ లోహియా.

రాజకీయ నాయకులు బ్రాహ్మణుల పాదాలకి మొక్కడాన్ని కూడా లోహియా విమర్శించాడు. (ఇటీవల కంచిలయ్య విమర్శించారు) ఐతే ద్రావిడ దళిత బహుజన వాదులలా మొత్తంగా సంస్కృతిని చాపచుట్టి విసిరివెయ్యడం అనే అవివేక చర్యకి వొడిగట్టలేదు లోహియా. అందువల్లనే సామాజిక వివక్షలని, రుగ్మతలని సంస్కృతిలోని లోపాలని గుర్తించడంలో లోహియా అందరికంటే ముందున్నాడు. కాని సంస్కృతి, పురాణం వేసే ప్రభావాలని సానుకూల అంశాలని గుర్తించడంలో ఆయన వారిలా వెనకబడిపోలేదు. ఆవేశంలో కొట్టుకుపోతూ అన్నిటినీ కాలదన్నలేదు.

అందువల్లనే లోహియా యీనాటి అవసరం. ప్రజాసంస్కృతిలో సహజసిద్ధంగా వున్న సామరస్యధోరణిని పునరుద్ధరించి హిందూ ఫాసిజాన్ని ఎదుర్కోవడానికి గాంధీ లోహియాల సమగ్రదృక్పథం నేటి అవసరం.

ఒకే గ్రంథాన్నీ ఒకే దేవుణ్ణీ ఏకరూప జాతీయతని నెత్తిమీద రుద్దుతున్న ఫాసిస్టు కాలంలో - రామాయణ మేళాపేరుతో బహుళ కథనాల్నీ బహుళ రామాయణాల్ని ముందుకు తీసుకువచ్చిన లోహియా దృష్టి నేటి అవసరం. అంగీకరించడమో వ్యతిరేకించడమో కాక బహుళంగా మల్టీ డైమన్షన్స్‌తో చూసే దృష్టి ముఖ్యం.

# మెదళ్ళకుండే దుమ్ము దులిపే
# ఆలోచనలు

– డా. నాగసూరి వేణుగోపాల్

తెలుగు సమాజంలో సుమారు రెండు దశాబ్దాల క్రితం ప్రయివేటు రంగంలో 24 గం. టెలివిజన్ వార్తాఛానళ్ళు మొదలయ్యాయి. ఆకర్షించేది ప్రతిదీ, లాభదాయకమైనది ప్రతిదీ వార్తాంశంగా మారిపోయింది! ఫలితంగా తర్వాతి ఐదారేళ్ళలో మతపరమైన భక్తి సంబంధిత అంశాలతో ప్రత్యేక తెలుగు ఛానళ్ళు కూడా ప్రారంభమయ్యాయి. అప్పటికి దశాబ్ది కాలంగా తెలుగు టీవీ ఛానళ్ళ వాలకం గురించి అధ్యయనం చేస్తున్నాను, వారం వారీ కాలమ్ రాస్తున్నాను. భక్తి ఛానళ్ళలో తుంపులు తుంపులుగా చాలా మతవిషయాలు, భక్తి సమాచారం ఇవ్వడం మొదలైంది. ఇలాంటి సమాచారం ఫలితంగా క్రమంగా విశ్వాసాలు ఎలా, ఎందుకు మొదలయ్యాయి. మతాల ప్రయోజనం ఏమిటి, అలాగే మత చట్రం పరిమితి ఏమిటి – వంటి తాత్త్విక విషయాల పట్ల సమాజపు ఆలోచన మళ్ళుతుందని ఆశించాను. అది నా ఆలోచనలలో అమాయకత్వంగా ఎంతోమందికి అనిపించినా, అలాంటి క్రమపద్ధతి ఉండే ఆలోచనా విధానంగల నాకు అది అత్యాశ అని అప్పటికనిపించలేదు. కానీ జరిగింది వేరు! కొంతమందికి లాభాలదారి కాగా, కొందరికి ప్రవచనకారులుగా మంచి ఉపాధి మార్గం లభించింది. ఆచారాలకు ప్రచారం పెరిగి, ఆలోచన మరింత అంతర్ధానమైంది! ఇది మనకళ్ళ ముందు జరిగిన విషాదం!!

మతం, భక్తి అనేవి వాణిజ్యానికీ ప్రచారానికీ ప్రయోజనమని తొలుత వ్యాపారవేత్త గ్రహిస్తే పిమ్మట రాజకీయ నాయకులు రంగ ప్రవేశం చేస్తారు. ఎంత కాకతాళీయమో గమనించాలి. భారతదేశపు తొలి ప్రయివేటు టెలివిజన్ ఛానల్ 'జీ' టీవీ 1992 అక్టోబరు 7న మొదలు కాగా; బాబ్రీ మజీద్ కూల్చివేత 1992 డిసెంబరు 6న సంభవించింది. ఈ రెండు సంఘటనలకు నేరుగా సంబంధం

లేదు. కానీ చారిత్రక పరిణామాలను సమగ్రంగా చూసినపుడు ఇలాంటి వాటిని సమాయత్తం చేసే చోదక శక్తులు ఏమిటో, దాని అంతర్వాహిని ఏమిటో కొంత బోధపడే అవకాశం ఉంది. అయితే అదెలా వీలవుతుంది? ఈ నేల, ఈ గాలి స్వభావం, తీరూ పరిగణనలోనికి తీసుకోకుండా చేసే విశ్లేషణలన్నీ అధారంలేని సాముగారడీలే!

తైల సాంకేతిక విజ్ఞానశాస్త్రంలో ప్రపంచస్థాయి శాస్త్రవేత్తగా, 'శివభారతం', 'కన్యాశుల్కం' గురించి సాధికార విమర్శ చేసిన డా. సర్దేశాయి తిరుమల రావు (1928–1994) గారిని "మనిషి ఆస్తికుడిగా ఉండాలా?, నాస్తికుడిగా ఉండాలా?", అని పాతికేళ్ళ క్రితం ప్రశ్నించినపుడు వారు "ఆస్తికుడు క్రమంగా నాస్తికుడు కావాల"ని జవాబు ఇచ్చారు. భారతీయ సమాజానికి చక్కగా వర్తించే తరుణోపాయమిది. మీరు నాస్తికులైనా, మొత్తం సమాజం నాస్తికంగా మారుతుందని నమ్మకం లేదు. మీరు మరింత ఆస్తికులుగా మారినా ప్రమాదం కనుక మతంతో ముడిపడిన సమాజంలో ఉండక తప్పడంలేదు.

1977–'78 నుంచి పత్రికలు, పుస్తకాలు, రాజకీయాలు అలవోకగా పరిశీలిస్తున్న నా ఈడువారికి తమిళనాడు గురించి ఒక అభిప్రాయం ఉండేది. మతాచారాలను విభేదించడం, ద్రావిడ పార్టీల నాస్తిక ఉద్యమాలు వగైరా గమనించి ఆ సమాజంలో మతాచారాల పాత్ర తక్కువ, హేతువాదం ఎక్కువ అనిపించేది. కానీ దశాబ్దం క్రితం ఉద్యోగం కారణంగా ఓ నాలుగేళ్ళు మద్రాసులో కాపుర మున్నాను. అక్కడ దేవాలయాల అలంకరణలు, వ్యక్తుల మత చిహ్నాలు, సమాజంలో ఆచారాల హడావుడి తక్కువేమీకాదని అనుభవపూర్వకంగా బోధపడింది. ఇదేమిటని నా సీనియర్ కొలీగ్‌ను ఈ విషయాలు ప్రస్తావించి అడిగితే బిగ్గరగా నవ్వుతూ ఆ వ్యతిరేక ప్రచారం వల్ల ఈ ఆచారాల హంగామా పెరిగిందేమో అన్నారు! ఈ పరిశీలన వాస్తవం కావచ్చు, కాకపోవచ్చు! అయితే ఇలాంటి విశ్లేషణా ప్రయత్నం ఎవరు చేయాలి? మతాలను అతిగా ప్రేమించేవారు, అమితంగా ద్వేషించేవారు పరిశీలించి చేసి సాధించిన ఫలితాలు సమాజపు సవ్యమైన ప్రతిబింబాలు కావు! వీరిలో కొరవడినదేమిటి?

## 2

ఇపుడు రావెల సోమయ్య పూనుకుని వెలువరిస్తున్న రామమనోహర్ లోహియా ఆలోచనల పుస్తకం ఎంతో సందర్భోచితం, అవసరం! లోహియా కనుమరుగై ఐదున్నర దశాబ్దాలైంది. అయినా ఇప్పుడు ఇలాంటి ఆలోచనా ధోరణి, తర్కించే పద్ధతి ఎంతో అవసరం. ఇందులో కేవలం ఆరువ్యాసాలే ఉన్నాయి. అన్నీ అనువాదాలే. అందులో ఐదు లోహియా వ్యాసాలకు అనువాదం కాగా, ధర్మవీర్ భారతి మహాశయుడు లోహియాతో తన పరిచయం వివరిస్తూ, లోహియాను మనకు పరిచయం చేస్తారు. నెహ్రూ భారతదేశాన్ని అన్వేషిస్తే, లోహియా దేశంతో మమేకమయ్యారంటారు డా. ధర్మవీర్ భారతి. లోహియాను సమగ్రంగా తెలుసుకోవాలంటే ఆయన ప్రకృతిలోని సమత, స్వాతంత్ర్యంతో పాటు సౌందర్యాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని వివరించి – తద్వారా లోహియా చూపుకుండే విరాడ్రూపాన్ని మనకు చవి చూపిస్తారు!

ఇక లోహియా ఐదు వ్యాసాల్లో మూడు – 'రాముడు – కృష్ణుడు – శివుడు', 'కృష్ణుడు', 'ద్రౌపది – సావిత్రి' వ్యాసాలు కలిపి గతం ఏమిటో, హిందూమతం బీజాలు ఏమిటో చెబితే; 'వసిష్ఠుడు – వాల్మీకి' వ్యాసం లోహియా దర్శించిన నెహ్రూ యుగపు దేశ రాజకీయ సామాజిక పరిస్థితులకు దర్పణంగా చేసిన వ్యాఖ్యానం. ఈ 'వసిష్ఠుడు–వాల్మీకి' వ్యాసంలోని వాదనా చాతుర్యం, పాండితీ ప్రకర్షతోపాటు జైలు అధికారులకు దొరకకుండా; ఆయనను అర్థం చేసుకునేవారు, వారికి కొంచెం శ్రమిస్తే బోధపడేట్టు రాశారు. అదీ ఆయన వ్యాస శిల్పం. ఇక చివరి వ్యాసం 'రామాయణ తిరునాళ్ళు'లో లోహియా ఇచ్చిన ప్రణాళిక, ఏమాత్రం చిన్న ప్రయోగం కూడా జరుగకుండా ఆగిపోయిన కల. నేటికీ అది ఉపయుక్తంగా కనిపిస్తున్న ఆశలపల్లకి. కనుక ఈ అరడజను వ్యాసాలు ఒక సమగ్రతను సాధించాయి. అలాగే అనువాదకులు ముప్పురు (సురమౌళి, రావెల సాంబశివరావు, ఘట్టమరాజు) సాధించిన సమిష్టి ఫలితం ఆసక్తికరంగా నిలిచి చదివించే వైవిధ్యం! అదే సమయంలో ఈ వ్యాసాలు సగటున 25 పేజీల నిడివితో సాగి, పాఠకుల నుండి సీరియస్‌నెస్ డిమాండ్ చేస్తాయి. ఎందుకంటే వీటిలో విషయం అలాంటిది.

• ఈ పుస్తకం ఎందుకు అవసరం? ఈ వ్యాసాలు ఎందుకు చదవాలి?? ఈ మాటల సముదాయాలు పరిశీలించండి:

- "చరిత్ర కూడా సిగ్గుపడవలసిందే. రాముని, కృష్ణుని గాథల్లో ఒక్కో గొలుసుకట్టును ఎంతో ఉల్లాసంగా, సప్రమాణంగా తెలుసుకుంటారు. అదే సమయంలో చారిత్రక వ్యక్తులయిన బుద్ధుని, అశోకుని వంటి వారి విషయంలో మాత్రం తెగిన జ్ఞాపకాలుగా మాత్రమే మిగిలిపోతాయి." ('కృష్ణుడు' వ్యాసం).
- "రాక్షస రాజ్యంలో విభీషణునిలా తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా ప్రకటించిన వ్యక్తి ఏ దేశ ప్రజాస్వామ్యంలోనూ మరొకరు తారసపడరు." ('రామాయణ తిరునాళ్ళు').
- "... ఈ ఒక్క గాథను మినహాయిస్తే - యూరోపు చరిత్రలో ఒకసారి అనేకమంది భార్యలను చేసుకున్న కథలు నాకు కనిపించలేదు." ('ద్రౌపది - సావిత్రి).
- మానసిక స్థితిని, దృక్పథాన్ని పునర్వ్యవస్థీకరించుకునే పనికి పూనుకున్నట్టయితే సావిత్రి - ద్రౌపది గాథల గురించి చర్చలు ప్రేరేపించండి (ద్రౌపది - సావిత్రి).
- "భారతదేశంలోని మంత్రులందరూ అప్పుడప్పుడు జంతు ప్రదర్శన శాలలు చూసి వస్తుండండి! అప్పుడైనా మీలో ఇంత క్రూరత్వం ఉండదు." ('వసిష్ఠుడు - వాల్మీకి')
- "ఈ సుందర కావ్యాలనూ, ఈ సుందర గాథలను తప్పుడు ఆధారాల మీద, తప్పుడు పునాదుల మీద అల్లారని నా అభిప్రాయం. (ద్రౌపది-సావిత్రి).
- "సీత, పార్వతి, ద్రౌపదులకియ్యబడ్డ గౌరవనీయమైన స్థానం ప్రపంచంలో మరెక్కడా కనబడదు. నాటికీ, నేటికీ రాములవారి కథ, తులసీ రామాయణాన్ని శ్రద్ధగా చదివితే, లోతుగా ఆలోచిస్తే స్త్రీ పురుష జీవితాల స్నేహానురాగాలు చక్కగా తెలుస్తాయి. ('రామాయణ తిరునాళ్ళు').

- "క్రైస్తవం ప్రపంచంలో బహుశా ఎందుకు విస్తరించి ఉంటుందో తెలుసా? దాని విరోధులు రోమన్ల వల్లనే" ('కృష్ణుడు').
- "...మతం దీర్ఘకాల రాజనీతిగానూ, రాజనీతి అల్పకాలం మతంగా రూపొందాలి." ('రామాయణ తిరునాళ్ళు')
- "...ఈ కావ్యాల్లో బ్రాహ్మణుల్ని ఆకాశానికి ఎత్తేసి, శూద్రుల్ని ఇంకా తక్కువకులం వాళ్ళను పాతాళంలోకి త్రొక్కివేయడం స్పష్టంగా కనబడుతుంది. (రామాయణ తిరునాళ్ళు).
- "...భారతదేశం నిరంతరం బానిస అవడానికి కారణం నాయకుల లేదా రాజుల అనైక్యత కాదని, ప్రజల ఔదాసీన్యమని ఈ సమావేశం అభిప్రాయం." ('కృష్ణుడు').

– ఇలా ధగధగలాడుతూ, ఆలోచనలు రేపే లోహియా భావనలు ఈ పుస్తకంలో చాలా ఉన్నాయి. అన్నింటినీ ఇక్కడ పేర్కోవడం సాధ్యం కాదు!

**3**

దయ, ప్రేమ, కరుణ, క్షమ, సహనం, ఓర్పు వంటి మానవీయ లక్షణాలు ఎందుకు కొందరికే వస్తాయో, ఎలా వస్తాయో, వచ్చినా ఏ స్థాయిలో వస్తాయో ప్రస్తుతం సైన్స్ వివరించే దశలో లేదు. ఒక ఊరి వాసులు, ఒకే వీధి నివాసస్తులు, ఒకే తల్లి బిడ్డలు కూడా ఈ లక్షణాలలో ఎందుకు వైరుధ్యం కలిగి ఉంటారో మన విజ్ఞాన శాస్త్రాలు గానీ, సామాజిక శాస్త్రాలు గానీ పూర్తిగా వివరించలేకపోతున్నాయి. దీనికి కీలకమైన అంశం – మనసు. దీనిని పరిగణనలోకి తీసుకోకుండా రూపొందే ఆలోచనల చట్రాలు, మేధావుల వాదనలు ఖచ్చితంగా అసమగ్రమే! అదే సమయంలో స్థానిక స్వభావాన్ని, స్థానికతను విస్మరించి చేసే విశ్లేషణలు కూడా అసంపూర్తియే!

మతాన్ని గుడ్డిగా ఇష్టపడటం ఎంత ప్రమాదమో, మతాన్ని మితిలేకుండా ద్వేషించడం కూడా అంతే ప్రమాదం కావచ్చు. నిజానికి ఈ రెండు ధోరణులు కూడా మతవాదం అవుతాయి. కొందరి ఘనకార్యాలను అందరి ఖాతాలో వేసి ఖండించడం వల్ల మంచి కన్నా చెడే ఎక్కువ చేస్తుందని గమనించాల్సిన అవసరం

చాలా ఉంది! కేంద్రంలో బిజేపి అధికారం పొందేవరకు మేధావులు మత ప్రభావాన్ని పూర్తిగా అంచనా వేయలేకపోయారు. హేళన చేస్తూ, కొట్టివేస్తే అసలుకే మోసమని ఇప్పుడు క్రమంగా తెలిసొస్తోంది. పనికొచ్చే ప్రత్యామ్నాయం (వర్కబుల్ సొల్యూషన్) ఇవ్వకుండా ఖండించడం కూడా సరికాదు. చారిత్రక వ్యక్తులు బుద్ధుడు, అశోకుని కన్నా జనబాహుళ్యానికి (ఫిక్షన్‌గా భావించడబడే) రాముడు, కృష్ణుని కథలు బాగా పరిచయం అని లోహియా చెప్పడం కీలకం. అదే సమయంలో మతాన్ని పూర్తిగా ఖండించే కమ్యూనిస్టులు, నెత్తికెత్తుకునే బిజేపి కాకుండా మతంతో ఢీకొనని ధోరణి (అప్ పార్టీలాగా) క్రమంగా పెరుగుతుందేమో! ప్రస్తుత పరిస్థితుల్లో బిజేపి మరికొంత కాలం దేశాన్ని, రాష్ట్రాలను ఏలుతుంది. కనుక మత విషయాలను ఎలా పరిగణించాలి, ఎలా అర్థం చేసుకోవాలి అనే దృక్పథాలలో మార్పు చాలా అవసరం.

**4**

అడుగడుగునా లోహియా చూపుకుండే విలక్షణమైన ధర్మం మనల్ని కట్టిపడేస్తుంది, కదిలించి పడేస్తుంది! ఆయన మత సంబంధమైన విషయాల గురించి చెబుతూనే ఏది వదిలివేయాలో, దేన్ని గట్టిగా పట్టుకోవాలో చెబుతూనే భారతీయ సమాజపు స్వభావాన్ని కూడా విశ్లేషిస్తారు. రామాయణం మనదేశపు ఉత్తర దక్షిణాలకు సంబంధించిందనీ, కృష్ణాయణం తూర్పుపడమరల వ్యవహారమని లోహియా విశ్లేషించడం అబ్బురం. అలాగే 'కృష్ణుడు' వ్యాసంలో "సరికొత్త స్త్రీ పురుష సంబంధపు గది ఏర్పడాల్సి ఉంది" – అని అనడం గురించి లోతుగా, తీవ్రంగా ఆలోచించాల్సి ఉంది. 'ద్రౌపది – సావిత్రి' వ్యాసంలో "బుద్ధిమంతుడైన వాడెవడూ ప్రభుత్వ పదవిని అధిష్ఠించకూడదనే మాట, వ్యవస్థ అంతా తక్కువ స్థాయిది అనే రీతిలో పరిగణించడం తెలుసు. కానీ ఇక్కడ తెలివైన వారికి అధికారం కూడా వస్తే మరింత ప్రమాదం అని చెప్పడం నా వరకు కొసమెరుపే! అలాగే "రామనింద గానీ మహమ్మదు నింద గానీ ఓపికగా వినగలిగేది భారతీయ మేధావిని రక్తపాతం జరుపడానికి గానీ, పుస్తకాలు తగులబెట్టడానికి గానీ పూనుకోనిదే భారతీయ మనస్సు" అనే నిర్వచనం కూడా ఆలోచనాత్మకమే కాదు, ఎంతో ఆచరణాత్మకం! దీన్ని సాధించగలిగితే రక్తపాతాలుండే వీలేలేదు కదా! 'వసిష్ఠుడు – వాల్మీకి' వ్యాసంలో లోహియా అభిప్రాయం చూడండి" భారతదేశం వంటి విభిన్న వృత్తులు గల అతి పురాతన దేశాన్ని సమైక్యంగా ఉంచగలిగే సిద్ధాంతం– సత్యమే! బూటకం, కాఠిన్యాలు

దీన్ని మరింత ముక్కలు ముక్కలు చేస్తాయి". బూటకమే కాదు, కాఠిన్యం కూడా! ఈ మాటను చాలా జాగ్రత్తగా పరిశీలించాలి. అదే వ్యాసంలో "ఆడవాళ్ళ విషయంలో మంచినీళ్ళు, మరుగు దొడ్లు గురించిగానీ వృత్తి పనులు గురించి గానీ, చిన్న కమతాల గురించి గానీ ఆలోచన లేదు" అని మన నాయకుల చెంపలు ఛెళ్‌మనిపిస్తారు. నేటికీ ఈ సమస్యలు సమస్యలుగానే ఉన్నాయి.

వైరుధ్యాలను విప్పి చెప్పడంలో లోహియా అందె వేసిన చేయి. రాముని వారసుల్లో గాంధీజీని మించినవారు లేరంటూనే, గాంధీజీలో కృష్ణుని సాహసం కూడా ఉందంటారు లోహియా!

ఇలా ఎన్ని విషయాలు రాయడం? లోహియా రచనలలోని పురాణం, మత ప్రస్తావన ఉన్న ఐదు వ్యాసాలను అనువదింపచేసి తెలుగులో సోమయ్యగారు ప్రచురించడం సకాలంలో జరుగుతున్న సత్కార్యం. పిడివాదులు, అతివాదులతో సహా అందరూ గమనించాల్సిన విషయాలు ఈ వ్యాసాల్లో ఉన్నాయి.

ఒకచోట నగ్నముని 'విలోమ కథలు' గుర్తుకు వస్తాయి. ఆ మాటలతో ఈ వ్యాసాన్ని ముగిస్తున్నాను.

"మనిషి ఏకాంతంలో ఉన్నప్పుడు, ఒంటరిగా కూచున్నప్పుడు లేదా పడుకున్నప్పుడు లేదా పగటిపూటో, రాత్రిపూటో ఒంటిగా నడుస్తున్నప్పుడు తలకాయను వేరు చేసి, చేతపట్టుకుని దానిలోపల ఇదివరకు నిండి ఉన్నటువంటి చెత్తా చెదారాన్ని, దుమ్ముని ధూళినీ దులిపి తుడిచి మళ్ళీ దాన్ని అంటించుకోవాలి ధరించాలి".

సరిగ్గా అలాంటి పనికి దోహదం చేస్తుందీ పుస్తకం! పాఠకులకు అభినందనలు.

**– డా. నాగసూరి వేణుగోపాల్**

9440732392

# "పురాణ ప్రతీక - ఆధునిక జ్ఞానవీచిక"

-డా॥ అవధానం రఘుకుమార్

"ఏ జాతి పౌరాణిక గాథలైనా ఆయా ప్రజల కలలను, కన్నీళ్ళను నిక్షిప్తం చేస్తాయి. సమున్నతమైన ఆకాంక్షలకు, స్మృతులకు, కామనలకు చెరగని ముద్రలుగా నిలుస్తాయి" - (లోహియా, రామ - కృష్ణ - శివ, పే. 71).

ఒక జాతి, దేశ, ప్రాంత ప్రజల గతం పురాణాల రూపంలో ఘనీభవించ వచ్చును. అయితే వాటిని విశ్లేషించేపుడు కానీ, పునర్ నిర్వచించేపుడు కానీ సంయమనం, సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించాలి. కేవలం ఎగతాళికో, తిట్టుకో, కించపరచడానికో, రెచ్చగొట్టడానికో పురాణాలను, పురాణ పాత్రలను వాడుకుంటాం, తత్కాలీన విజయమే మా దృష్టి అంటే ఏదో ఒక రోజున అది తిరగబడే అవకాశం ఉంది. అందుకే ఒక జాతి పురాణాలను పునఃపరిశీలించేపుడు ముందస్తుగా ఆ ప్రజల పట్ల గౌరవంతో, బాధ్యతతో పనిచేయాలి. ఒక్క మతమూ, పురాణాలే కాదు. ఒక సమాజపు చరిత్ర సంస్కృతులను గౌరవ ప్రదంగా, జాగ్రత్తగా పరిశీలించకుండా నిర్లక్ష్య ధోరణితో కూడిన విమర్శలు చేస్తే అది చాలా ఇబ్బందులకు కారణం అవుతాయి.

"మతం, రాజకీయాలు, దైవం, జాతి లేదా ప్రజలు. అంతా కలగలుపే. అది అన్ని చోట్లా అన్ని కాలాల్లో జరిగింది. కానీ భారతదేశంలో మాత్రం మరీ అధికంగా" అంటారు లోహియా మరోచోట. ఇలా ఇక్కడ ఎందుకు ఎక్కువగా జరిగింది అన్న ప్రశ్నకు ఇక్కడి కొన్ని ప్రత్యేక భౌతిక, భౌగోళిక, సాంస్కృతిక, చారిత్రక పరిస్థితుల ఆధారంగా, తాత్వికత ఆధారంగా జవాబులు వెతుక్కోవాలి. అలా వెతుక్కునే క్రమం ఈ పరిస్థితుల పట్ల, ప్రజల పట్ల మరింత ఎక్కువ గౌరవంతో, ఎక్కువ ప్రేమతో, ఎక్కువ శాస్త్రీయంగా పరిశీలించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. ఇక్కడి

ప్రజలను, వారి అనుభవాలను, వారి గతాన్ని, వారి జ్ఞానాన్ని ఎగతాళి చేస్తే ఫలితం ఉండకపోగా, మరింత ఋణాత్మక ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఒక సమాజంలో 95% పైగా నమ్మే విశ్వాసాలను, ఆచరణలను సంస్కరించే, సదుద్దేశ్యంతో విమర్శించే వారు ప్రజల పట్ల మరింత ప్రేమతో గౌరవంతో విమర్శను నిర్మించాలి.

ఇక్కడ ఒక చిన్న సంఘటన గురించి చెప్పాలి. అమర్త్యసేన్ తన 'ఆర్గుమెంటేటివ్ ఇండియన్' పుస్తకంలో ఒక విషయం ప్రస్తావించారు. 1980లలో ఆయన లండన్ విమానాశ్రయంలో కొంతసేపు గడపవలసి వచ్చింది. ఆయన విమానాశ్రయంలోని పుస్తక దుకాణాలను దర్శించి అక్కడ ఇండియా గురించిన పుస్తకాలకై వెదుకుతున్నారట. ఫిలాసఫీ, చరిత్ర... ఇలా, అన్ని విభాగాలు వెదికినా ఆయనకు కావలసిన పుస్తకాలు దొరకలేదు. చివరికి ఆ దుకాణపు యజమానిని అడిగితే ఆయన 'మతం' అనే విభాగంలో ఉంటాయని చెప్పారట. ప్రపంచానికి భారత పరిచయం అది. 'సెక్యులర్' అనుకునే ఆధునిక ప్రజాస్వామ్యాలలో కూడా మతం, చరిత్ర, పురాణాలు ప్రతీకలు అత్యంత ప్రభావశీలమైనవి. సల్మాన్ రష్దీ – 'శాటానిక్ వెర్సెస్', తస్లీమా నస్రీన్ – 'లజ్జ', డాన్‌బ్రౌన్ 'డావిన్సీకోడ్'.. పుస్తకాల విషయంలో వివిధ దేశాల ప్రజలు, వివిధ రకాలుగా స్పందించారు.

ఒక సమాజపు, ప్రాంతపు, ప్రజల గతాన్ని విమర్శించడం, ప్రశ్నించడం తప్పేమీ కాదు. నిజానికి ఈ ప్రశ్నించే ప్రక్రియే పురోగతికి మార్గం. ఏ సమాజం మార్పులేకుండా వుండదు. ఆదిమ కమ్యూనిజమూ, అంతిమ కమ్యూనిజం, సనాతనం... ఇలాంటి వన్నీ ఒక అందమైన, ఊహాజనితమైన గతపు పునరావిష్కరణలే కాని, చారిత్రక వాస్తవాలు కావు. మానవుడు గతంలోనూ, నిన్న, నేడూ, రేపూ – తనను సవాలు చేస్తున్న ప్రకృతి శక్తులతోనూ, తన ఉనికి ప్రశ్నిస్తూ చుట్టూతా వున్న జీవ ప్రపంచంతోనూ, తోటి మనుషులతోనూ, తనతోనూ నిరంతర ఘర్షణలో వుంటాడు. అయినా ఆ ఘర్షణలన్నీ వ్యతిరేకతలతో కూడుకున్నవీ కావు.

12, 13 శతాబ్దాల తరువాత యూరోప్‌లో, 'స్కాలాస్టిక్' కాలం అయిపోయాక, అరబ్బు దేశాల పరిచయం వల్ల, పాశ్చాత్యులు గ్రీకు తాత్విక గతంతో పునఃసంబంధాలు ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి దాకా కేవలం క్రైస్తవ మత గ్రంథాలే తమ గతం

అనుకున్న వారికి ఈ గ్రీకు తత్వశాస్త్రపు స్మృతి గొప్ప జ్ఞానాగ్నిని రగిలించింది. గ్రీకు తత్వ, పురాణ రచనలు సంపాదించి, చదివి, అద్భుతమైన ఉద్వేగాలకు, ఆలోచనలకు గురి అయిన యూరోపు సమాజం మెల్లగా సాంస్కృతిక పునరుజ్జీవనం వైపు మళ్ళింది. అలా ప్రారంభం అయిన చలనశీలత వారిని నాస్తికులుగా, హేతువాదులుగా, పదార్థ వాదులుగా.. మార్చింది. ఇలా అనేక ప్రకంపనలకు లోనవుతూ, గతాన్ని అత్యంత విశ్లేషణాత్మకంగా, తులనాత్మకంగా, సూక్ష్మంగా, శాస్త్రీయంగా పరిశీలించే వైపు తీసుకెళ్ళింది. అయినా వారు  ఆ పరిశీలనను కేవలం తిట్టు కవిత్వానికి పరిమితం చేయలేదు.

ఉదాహరణకి ఈడిపస్ కాంప్లెక్స్. ఈడిపస్ అనే థేబ్స్ రాజు కొన్ని విచిత్రకరమైన సంఘటనల వల్ల తన తండ్రిని చంపి తల్లిని పెళ్ళిచేసుకుంటాడు. అది తెలిసిన తరువాత ఆమె ఉరిపోసుకుని చనిపోతుంది. దీనిని ఆధునిక మనో విశ్లేషణ శాస్త్రంలో 'ఈడిపస్ కాంప్లెక్స్' అనే ఒక మానసిక అసమతుల్యంగా వాడుకున్నారు. చిన్న పిల్లలో ఎదుగుదలలో వచ్చే భిన్న సంఘర్షణ, తన వ్యతిరేక జండర్ పట్ల ప్రేమ (తల్లి పట్ల), తన సమాన వ్యతిరేక శక్తి (తండ్రి) పట్ల ద్వేషం. అంటే పౌరాణిక కథలు, గాథలు మనిషి ఆంతరంగిక, అచేతనావస్థలోని భయాలను, కోర్కెలను ప్రతిబింబించే ఓ పద్ధతి. ఇలాంటి ఉదాహరణలు సైకాలజీ, ఆర్థిక శాస్త్రం, సామాజిక శాస్త్రం...ల నుండి ఎన్నో చెప్పవచ్చును. ఒక సమాజం తన గతాన్ని పురాణాలను అర్థం చేసుకోవడం, విశ్లేషించడం, తిరిగి తత్కాలీన సామాజిక పరిస్థితికి అన్వయించడం, సృజనాత్మకంగా ఆలోచించడం అంటే ఇదే!

అయితే గతాన్ని విమర్శించే, పరిశీలించే, ప్రశ్నించే పునరుజ్జీవన కాలపు యూరోపియన్ జ్ఞానం, గతాన్ని హేళన చేసే, తిరస్కరించే, అసహ్యించుకునే మార్గంలోకి మాత్రం తీసుకెళ్ళలేదు.

అయితే, ఇక్కడ మరో ప్రశ్న కూడా వేసుకోవాలి. మార్క్స్ – ఎంగెల్స్‌లు గ్రీకు, రోమన్ పురాణాలపైన, కళలపైన ఎలాంటి ఆలోచనలు చేశారు? (ఈ విషయంపై – "మార్క్స్, ఎంగెల్స్ ఆన్ లిటరేచర్ అండ్ ఆర్ట్, ప్రోగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో 1976, మార్క్సిస్ట్స్.ఆర్గ్ ని ఒక్కసారిగ మనిద్దరం) వాళ్ళు ఈస్కలస్ (Aeschylus) (క్రీ.పూ. 5,6 శతాబ్దాలకు చెందిన గ్రీకు విషాద నాటక రచయిత)

షేక్స్‌పియర్, డికెన్స్, గోథే, డాంటే తదితర రచయితలను ఇష్టపడేవారు. చాలాసార్లు తమ ప్రత్యర్థుల్ని విమర్శించేపుడు వర్జిల్ (క్రీ.పూ. 1 క్రీ.శ. 1వ శతాబ్ద కాలపు రోమన్ కవి) ప్లాటస్ (Plautus) (క్రీ.పూ. 3, 2వ శతాబ్దపు రోమన్ కవి నాటక రచయిత), మధ్య యుగాల జర్మన్ కవులు గాట్ ఫ్రిట్ ఫాన్ స్ట్రాస్‌బర్గ్, ఈషెన్ బాక్‌లను, క్రీ.శ. 1వ శతాబ్దపు పెర్సియస్‌లను, అలాగే అనే పౌరాణిక కావ్యాల నుండి చాలా విస్తృతంగా ప్రస్తావిస్తూ రాసే వారని అర్థం అవుతుంది.

కావ్యాలూ, పురాణాలు, వాటిలోని భావ ప్రకటనలు ఆనాటి ఆర్థిక, ఉత్పత్తి సాధనాల స్థాయి, విధానాలు, ఆధిపత్యం పై ఆధారపడి ఉంటాయి అని తెలిసిన మార్క్స్‌కు, ఎంగెల్స్‌కు వాటిని ఏ పద్ధతిలో, ఏ అంశాల ఆధారంగా విమర్శించాలో వాడుకోవాలో తెలుసు. అలాగే మార్క్స్ అనేక విషయాలపైన ఆసక్తి ఉన్న వ్యక్తి. తత్వశాస్త్రం, ఆర్థిక శాస్త్రం, రాజకీయ సిద్ధాంతాలు, ఆధునిక విజ్ఞాన శాస్త్రం… ఇలా అనేక విషయాలను ఆయన నిరంతరం పరిశీలించేవాడు. యవ్వనంలో మార్క్స్ కవిత్వం పై కూడ కొంత ప్రయత్నం చేశాడు. కానీ మార్క్స్, ఎంగెల్స్‌లు పురాణ ప్రతీకల పట్ల చూపించిన ఉన్నతమైన పద్ధతి ఇండియాలో కమ్యూనిస్టులకు అలవాటు కాలేదు. నిజానికి మార్క్స్ పి.హెచ్.డి. కూడా ఎపిక్యూరస్‌ ఆధారంగా చేశాడు. అలాగే ప్రామోథియస్ ఆయనకు ఇష్టమైన ఒక పౌరాణిక పాత్ర.

1866లో మొదటి ఇంటర్నేషనల్‌లో చాలా మంది సభ్యులు – అన్ని దేశీయతలు, దేశాలు కాలం చెల్లి పోయిన విషయాలుగా ప్రకటించినపుడు, మార్క్స్ అలాంటి ఆలోచనలు అసంబద్ధమైనవి అన్నాడట (S.S. Prawer, Karl Marx and World Literature, 2022). అంతే కాదు, మార్క్స్ తన పిల్లలని కూడా గ్రీకు, రోమన్ పురాణాలని చదవమని ప్రోత్సహించేవాడట.

పునరుజ్జీవన కాలంలో గతాన్ని విమర్శనాత్మకంగా చూసే ప్రక్రియ అనేక విషయాలని వ్యతిరేకతలుగా, ఘర్షణలుగా, ఘర్షణల సమన్వయంగా చూసిందే కాని ఏక మొత్తంగా గతాన్ని తీసిపారేసే ప్రక్రియగా కానీ, అసహ్యించుకునే విధంగా కానీ తీసుకుపోలేదు. అందుకు ప్రధాన కారణం ఆనాటికి ఆ సమాజాలు ఆర్థికంగా బలపడుతూ రావడం. అలాగే తాత్విక ధారలో ఎదుగుతూ రావడం. ఆర్థిక వెసులు

బాటు, చక్కని తాత్వికత వల్ల గతాన్ని ద్వేషించే ప్రక్రియలా కాక, ఆధునిక యూరోపియన్లు పాశ్చాత్యులు దాన్ని అర్థం చేసుకునే వైపు ప్రయాణం చేశారు.

దాదాపు 8వ శతాబ్దం తరువాత దేశీయ రాజ్యాలను, అధికారాన్ని క్రమంగా కోల్పోతూ వస్తున్న భారతదేశం 10-11 శతాబ్దాల నుండి పూర్తిగా కొత్త వ్యక్తుల హస్తగతం అయ్యింది. అయినా 16వ శతాబ్దం దాకా వచ్చిన ఎక్కువ భాగం వీరులు మొత్తం మీద ఈ దేశాన్ని తమ దేశంగా చేసుకోవడంతో తొలి రోజులలో కొంత ఘర్షణాత్మకంగా వాతావరణం వున్నా, 15-16 శతాబ్దాలకి ఈ దేశ ప్రజలతో ఒక సమంజసమైన అంగీకారానికి వచ్చారు. కానీ 17వ శతాబ్దం నుండి భారతదేశంలో ప్రవేశించిన యూరోపియన్లు - పోర్చుగీసు, పోలాండ్, ఫ్రెంచ్, ఇంగ్లాండ్, డచ్ ఆక్రమణ దారులు ఈ దేశాన్ని నిరంతరం దోచుకునే ఒక ధనాగారంలా చూశారే కానీ, దానితో ఎప్పుడూ కలవడానికి ప్రయత్నించలేదు.

భారత దేశంపై యూరోప్ ప్రభావం చాలా తీవ్రమైనది. ముఖ్యంగా బ్రిటిష్ వారు తమను తాము స్థిరీకరించుకునే ప్రక్రియలో భాగంగా తమను తాము ఉన్నత జాతులుగా ప్రకటించుకుంటూ, ఈ దేశపు వాసుల్ని అనాగరికులుగా, చరిత్ర లేని వారిగా, తమ బాధ్యత తీసుకుని, సంస్కరించి, వీలయితే గంపగుత్తగా క్రిస్టియనైజ్ చేయాలి అని గాఢంగా నమ్మారు. అలాంటి ఆలోచనలో నుండే క్లైవ్‌లు, డల్హౌసీలు, మెకాలేలు, జాన్ మిల్, అలాగే ఇండాలజిస్టులు - విలియమ్ జోన్స్, మోనియర్ విల్లియమ్స్, మాక్స్ ముల్లరులు.. తదితరులు పుట్టుకొచ్చారు. చాలాసార్లు రాజ్యం, మతం, అధికార గణం ఒకే ఆలోచనతో, సమన్వయంతో కూడా పని చేశాయి.

అనేక మత, సాంస్కృతిక, చారిత్రక, కారణాల వల్ల మతాలుగా, ప్రాంతాలుగా, వర్గాలుగా, కులాలుగా.. శిలాజాలుగా మారిన దేశ ప్రజలు బ్రిటిష్ రాకతో తిరిగి చలనశీలం అయ్యారు. అయితే ఈ చలన శీలత 19,20 శతాబ్దాలలో విస్తృతమైన, అత్యంత సంఘర్షణాత్మకమైన చరిత్రకు, బౌద్ధిక ప్రకంపనలకు కారణం అయ్యింది. ఇదే సమయంలో అనేక రాజకీయ, పరిపాలన కారణాల వల్ల బ్రిటిష్ వలసవాద సామ్రాజ్యం ఒక్కొక్క సమూహాన్ని దగ్గర తీయడం, అవసరం తీరాకా ప్రక్కనపెట్టడం (దీన్నే కొంత మంది విభజించి పాలించడం అన్నారు) అనే ఒక వినూత్న ప్రయోగం చేశారు. మొదట ముస్లింలు, ఆపైన హిందూ మతంలోని

ఉన్నత వర్గాలు, ఇంకాస్త ముందుకు వెళ్ళి హిందూ మతంలో వివక్షకు గురైన వర్గాలు. ఇలా చాలా కలయికలకు, ప్రస్తారణలకు ఈ సమాజం, ప్రజలూ గురి అయినారు. ఈ మొత్తం ప్రక్రియ చివరికి భారత సమాజం పరస్పర వ్యతిరేకమైన, వ్యతిరేకతను కూడా దాటి శత్రువులుగా మారిన ప్రజల సమూహాలుగా, వ్యక్తులుగా మారింది.

భారత స్వాతంత్ర్య పోరాటం తొలి రోజులలో ఆధునిక యూరోప్ విధానాల ఆధారంగా రూపుదిద్దుకున్నా, ప్రజలని చైతన్యవంతులుగా చేయడంలోనూ, సంఘటితం చేయడంలోనూ, మరింత ఎక్కువగా సామాన్యులను ఉద్యమంలో భాగస్వామ్యం చేయడంలోనూ – మతం, మతపు గుర్తులు, దేవుళ్ళు బలంగానే ఉపయోగపడ్డారు. 'వందే మాతరం' గీతంలోనూ, ఇంకా అనేక ఉద్యమ సాహిత్య, కళా రూపాలలోనూ మతాధారిత నిర్మాణం ప్రధాన పాత్ర పోషించింది. నెహ్రూ లాంటి కొంత మంది ఆధునికులు ఉన్నా, తిలక్, గాంధీ, పటేల్, బోస్.. లు ఏదో రూపంలో పురాణ, ఇతిహాస వ్యక్తుల పాత్రల ఆధారంగా ప్రజల కల్పనను ఉత్తేజపరచిన వారే!

తిలక్ 'గణేష్', గాంధీ 'రామరాజ్యం' బంకించంద్ర చటర్జీ 'వందే మాతరం' – ఇలాంటి కల్పనలు. వాటితో సమాంతరంగా మరోవైపు ఆర్.ఎస్.ఎస్, హిందూ మహాసభ, జన సంఘ్‌లు, ముస్లిం లీగు. క్రిస్టియన్ పార్టీలు కూడా తమతమ ప్రభావాన్ని చూపాయి. కొన్ని ధనాత్మకమైన ప్రాతిపదికలైతే, కొన్ని మితవాద, సంకుచిత వాదాలకూ కారణం అయ్యాయి. నిజానికి భారతదేశ స్వాతంత్ర్య పోరాటం అసాధ్యమైనదే. ఎందుకంటే బ్రిటిష్ పాలనను ఆహ్వానించే సమూహాలు, స్వాతంత్రం మాకు వద్దు, అనే సమూహాల సంఖ్య ఎక్కువగా వున్న సమయం అది. ఏది ఏమైనా అప్పుడే ఎదుగుతున్న సాధారణ భారత సమాజం – అంటే – మధ్య తరగతి ప్రజల ఆకాంక్షగానే స్వాతంత్ర పోరాటం నడిచింది. అనేక మంది ఊహలకు, ఆలోచనలకు, అంచనాలకు భిన్నంగా కేవలం 62 సంవత్సరాల పోరాటంతో ఈ దేశం స్వాతంత్ర్యం పొందడం ఒక అద్భుతం. ఈ మథనంలో కలసి వచ్చిన ప్రాపంచిక, ఆర్థిక, చారిత్రక నేపథ్యం, గాంధీ లాంటి అన్ని పాపాలని, విషాన్ని స్వీకరించే ఒక శివుడు దొరకడం.. ఇలా మొత్తం మీద ఈ దేశం 26–01–1950కి ఒక సర్వ సత్తాక ప్రజాస్వామ్యం దేశంగా అవతరించింది. మనకంటే భీకరమైన,

హింసాత్మకమైన ఆవేశపూరితమైన యుద్ధాలు చేసిన అనేక దేశాలు స్వాతంత్ర్యం సంపాదించుకోలేకపోయాయి. దీనికి ఐర్లాండ్ ఒక గొప్ప ఉదాహరణ.

స్వాతంత్ర్యం అయితే వచ్చింది కానీ అది కేవలం రాజకీయ స్వేచ్ఛగానే మిగిలిపోయింది. కానీ మేధోపరంగా ఈ దేశం నేటికి వలస వాద ప్రభావాల నుండి దూరం కాలేకపోతోంది. ముఖ్యంగా తమ గతంతో సమన్వయం పొందలేని ప్రజగా మిగిలిపోయింది. తన గతాన్ని విపరీతంగా, గుడ్డిగా ప్రేమించే వారు, గతం అంతా అద్భుతం మహోన్నతం అని భావించేవారు ఒక వైపు, గతం అంతా పీడన, అన్యాయం, అక్రమం, అణచివేత అని నిరసించి, ద్వేషించేవారు, అసలు మాకు గతంతో పనే లేదు అనే ఆలోచనకు చెందిన వారు మరోవైపు.. ఇలా దేశం వలస వాదం సృష్టించిన విధ్వంసం, ద్వేషాలు, అసహనంతో కూడుకున్న వాతావరణంలో నుండి అయితే నేటికి తేరుకోలేదు.

గతాన్ని అర్థం చేసుకునే ప్రక్రియ ఈ దేశంలో వలసవాదం పుణ్యమా అని విచిత్రమైన పోకడలు పోయింది. పాశ్చాత్య దేశాలు గతాన్ని అర్థం చేసుకునే ప్రక్రియ అత్యంత సంస్కారవంతమైన, జ్ఞాన ఆధారిత ప్రక్రియగా సాగితే, ఈ దేశంలో అది అనేక ఘర్షణలకు కేంద్రంగా తయారయ్యింది. "ఉదాహరణకు – గ్రీకు, రోమన్, క్రిస్టియన్ – ఇలా అనేక మత పురాణ గ్రంథాలు, పురాణ పురుషులు, స్త్రీలు, పాత్రలను పాశ్చాత్యులు నేటి సమాజపు రుగ్మతలను వ్యతిరేకించే, వివరించే, సామాజిక గుర్తులుగా మార్చుకుని తత్వశాస్త్రంలోనూ, సామాజిక, ఆర్థిక, మానసిక, వైద్య శాస్త్రాల లోనూ నిర్వచనాలకి, పునర్నిర్వచనాలకి ఉపయోగిస్తే ఈ దేశంలో పురాణ కథలూ, పాత్రలు కేవలం ఆరాధనకు లేదా ద్వేషానికి ప్రతీకలుగా మారాయి.

మతాభిలాషులు, ఆర్.ఎస్.ఎస్, హిందూ మహాసభ, జనసంఘ్‌లకు పురాణ పాత్రలు పౌరుషానికి, బలానికి, శత్రు భయంకరులుగా చిత్రీకరించడానికీ ఉపయోపడితే, అదే గుర్తులు హేతువాదులకు, సామ్యవాదులకు, దళిత వాదులకు క్రూరత్వానికి, అణచివేతకు, గతపు పాపాలకు ప్రతీకలుగా మారాయి. ఈ మొత్తం సంఘర్షణాత్మక సామాజిక నేపథ్యంలో గాంధీ, నెహ్రూ, లోహియా లాంటి ఉదారవాదులు ప్రజలను సమన్వయపరిచే, ఘర్షణలను నివారించే ప్రతీకలుగా ఈ పురాణ పాత్రలను నిర్వచించడానికి ప్రయత్నం చేశారు. కానీ ద్వేషానికి

ఉన్నంత వాడి, వేగం, పట్టుదల ప్రేమకి ఉండదు. అందువల్ల ఈ నాటి భారతదేశ సమాజం ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్య గతానికి, వర్తమానానికి మధ్య ఉన్న ఈ ఘర్షణను ఎలా పరిష్కరించాలి అనేదే!

**పురాణ ప్రతీకల వివరణ – డా. లోహియా:**

అలా ఒక సమన్వయానికి ప్రయత్నం చేసిన కొద్ది మంది మేధావులలో డా॥ రామ్ మనోహర్ లోహియా ఒకరు. మిగతా ఆధునిక సమాజాలలో లాగా పౌరాణిక పాత్రలు ఈ దేశంలో కేవలం గుర్తులు, ప్రతీకలు కావు. ఏ క్షణాన్నైనా భరించలేని అగ్నిజ్వాలలను సృష్టించగల భయంకర జ్ఞాపకాలు. అందుకే ఒక సమాజపు గతాన్ని జాగ్రత్తగా, మర్యాద పూర్వకంగా, సహనంతో పరిశీలించి, క్రొత్త ఆలోచనలను ప్రజల ముందు వుంచాలే కానీ, ద్వేషంతో కూడిన, రెచ్చగొట్టే విధానాలు ఈ దేశానికి ప్రజలకు, ఏ మార్పుకూ మార్గం సూచించలేవు. ఇంకా వీలయితే అవి తిరోగమన శక్తులకు అద్భుతమైన బలాన్ని, ఆయుధాలను ఇస్తాయి. ఇది లోహియా గుర్తించినంత గొప్పగా ఎవరూ చేయలేదనే అనిపిస్తుంది.

నిజానికి భారతీయ పౌరాణిక గాథలను, కథలను పునర్నిర్వచించడం – దాదాపు 18వ శతాబ్దపు మధ్య కాలం నుండే ప్రారంభం అయ్యింది. అయితే ఈ ప్రక్రియ ప్రధానంగా "అపరాధ భావన" ప్రాతిపదికగా మొదలయ్యింది. అంటే పాశ్చాత్యులు, ఈ దేశపు పురాణాలని అసహ్యకరమైన, నీతి బాహ్యమైన, నిర్హేతుకమైన కథలుగా, చరిత్రగా చెప్పడాన్ని బలంగా నమ్మిన వర్గం – తమ గతం అంతా లోప భూయిష్ఠమని, దుర్మార్గం అనే భావనలోనికి, అందులో నుండి అపరాధ భావనకి, అందులోనుండి ఈ గతాన్ని సంస్కరించి ఆధునికుల మధ్య ఆధునికంగా నిలబెట్టాలి అనే తపనగా మొదలయ్యింది.

క్రిస్టియానిటీ, ఇస్లాం, బుద్ధిజంలో లాగా ఒకే మతం, ఒకే దేవుడు, ఒకే గ్రంథం లేకపోవడం వల్ల హిందూ సమాజం ముక్కలయిపోయింది అని, ఆ పైన వర్ణ, కుల వ్యవస్థలు అత్యంత దారుణమైన మారణ హోమాన్ని సృష్టించాయి అని విశ్వసించిన వారు ఈ దేశంలో అన్ని సమస్యలకు ఈ బహుళత్వమే కారణం అని నమ్మడం మొదలు పెట్టారు. ప్రత్యామ్నాయంగా బ్రహ్మ సమాజ, ఆర్యసమాజ, హిందు మహాసభ లాంటి ఏకేశ్వరోపాసన, ఒక నిర్ణయాత్మకమైన పుస్తకం, ఏకరూప

మతం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. నిజానికి ఏదైతే ఈ దేశపు బలమో – అంటే "బహుళత్వం" అదే ఈ దేశపు బలహీనతగా అర్థం చేసుకున్నారు. అక్కడి నుండి అంతిమ మార్గం ఈ మతాన్ని వదిలేయడమే అన్న బలమైన తాత్వికతగా రూపం తీసుకుంది.

ఈ ప్రక్రియలో ఒక ప్రధాన ధోరణి ఈ దేశానికి, దీని గతానికి సంబంధించి అన్ని విషయాలను హేళన చేయడం తిరస్కరించడం, ఆ ధోరణి మరింత ముందుకు వెళ్ళి ఈ దేశంలోని అన్ని ఉత్తమ ఆలోచనలూ విదేశాల నుండి అరువు తెచ్చుకున్నవి అనే వాదన దాకా వెళ్ళింది. ఈ దేశంలో అద్భుతమైన విషయాలు ఏవైనా వుంటే అవి బయటి నుండి వచ్చినవి, చెడు విషయాలు వుంటే అవి ఈ దేశమువి. నీరద్ సి. చౌదరీ, అంబేద్కర్, ఇండియన్ కమ్యూనిస్టులు, పెరియారులు.... ఇలా అనేక మంది సంస్కరణ పేరుతో చెప్పింది సారాంశంగా ఇదే! ఇక్కడ మరో ఉదాహరణ కూడా చెప్పుకోవాలి.

భారతీయ చింతన గురించి రాసిన నండూరి రామ్మోహన రావు షడ్దర్శనాల గురించి రాస్తూ, రాహుల్ సాంకృత్యాయన్‌కు సంబంధించిన ఒక అంశం ప్రస్తావిస్తాడు. న్యాయ, వైశేషికాల గురించి వివరిస్తూ సాంకృత్యాయన్ అవి భారతీయులు గ్రీకు నుంచి కాపీ కొట్టారట అని వ్యాఖ్యానిస్తాడు. అయితే ఈ దేశపు అదృష్టమో, ఏమో కానీ, అది తెలిసిన రష్యన్ ఇండాలజిస్టులు చాలా తీవ్రంగా పరిశోధించి సాంకృత్యాయన్ తప్పని – ఈ రెండు దర్శనాలు వాటి గ్రీకు సమాన వ్యాఖ్యానాల కంటే ముందువని, లేదా సమకాలీనమని, ఎట్టి పరిస్థితులలోనూ కాపీ కాదని తేల్చి చెప్పారట. నిజానికి రష్యన్ ఇండాలజిస్టులు ఆ పని చేయకపోయినా, లేదా ఏ జర్మన్, ఇంగ్లాండ్, ఫ్రాన్స్.. ఇండాలజిస్టులు ఆ పని చేసినా మన ఇండియన్ కమ్యూనిస్ట్ మేధావులు సాంకృత్యాయనే కరెక్ట్ అని ఇప్పటికీ నమ్మేవారు. బాధాకరమైన విషయం ఏమిటంటే నేటికి అనేక మంది వామపక్ష మేధావులు సాంకృత్యాయన్ మార్గంలోనే నడవటం!

ఏదైనా ఒక సమాజం, ముఖ్యంగా సుదీర్ఘమైన చరిత్ర, సంస్కృతి ఉన్న సమాజాన్ని విమర్శనాత్మకంగా చూసేప్పుడు విమర్శించేపుడు అవతలి వైపు నుండి వచ్చే స్పందన కొంతైనా ఊహించకలగాలి. కోట్ల మంది విశ్వసించే మతం, చరిత్ర,

విశ్వాసం తప్పు అని చెప్పాలంటే అపారమైన ఓపిక, పరిశోధన, అద్భుతమైన వివరణ ఇవ్వగలిగే జ్ఞానం, శక్తి వుండాలి. కేవలం గతం పట్ల కసితోనో, వేరే ఉద్దేశ్యాలు ఉంచుకుని విమర్శనే ప్రధాన జీవన మార్గంగా ఎంచుకుంటే, ఏదో ఒక రోజున అధిక సంఖ్యాకుల ఆగ్రహాన్ని, తిరుగుబాటును చూడవలసి వస్తుంది కదా! నిజానికి నేడు అదే కదా జరుగుతున్నది.

చరిత్రను విమర్శనాత్మకంగా చూడటం, విశ్లేషించడం, తద్వారా సామాజిక మార్పుకు కారణం అవడం ఏ సమాజమైనా ఆహ్వానిస్తుంది. అయితే ఆ విమర్శలో ఏదో దుర్మార్గపు ఆలోచన ఉందని కానీ, లేదా విమర్శ బయటికి కనబడుతూన్నంత అందంగా, నిష్పాక్షికంగానూ లేదని తెలిసిన నాడు, ఏ సమాజమైతే మిమ్మల్ని జ్ఞానులుగా, మార్గదర్శకులుగా భావించిందో అదే సమాజం, అదే ప్రజలు మిమ్మల్ని ద్వేషించడం, నిరసించడం, తిరస్కరించడం మొదలు పెడతారు. అవగాహన లోపాన్ని కూడా క్షమిస్తారు, కానీ కుట్ర పూరిత మేధస్సును క్షమించరు.

## 2

## మతం, పురాణం, ప్రతీకలూ, భారతదేశం

భారతదేశ చరిత్రను, ప్రజలను చాలా తీవ్రంగా ప్రభావితం చేసిన అంశాలలో 'మతం' ఒకటి. ఈ దేశం, ప్రజలు మత విశ్వాసాలతో ఎంతగా పెనవేసుకు పోయారంటే, చాలా మంది విదేశీయులకు 'ఇండియన్స్' అంటే 'మత విశ్వాసులు' అనేంతగా. ఈ దేశాన్ని అర్థం చేసుకోవడం అంటే, ఈ దేశపు మతాలను, వాటి మధ్య సయోధ్య లేదా ఘర్షణలను అర్థం చేసుకోవడమే. ఈ దేశపు స్వాతంత్ర్యోద్యమంలో కూడా తిలక్, లాలా లజపతిరాయ్‌లు బలమైన మత చిహ్నాలను ఎన్నుకున్న తర్వాతే దాన్ని ప్రజా ఉద్యమంగా మార్చగలిగారు. గాంధీ లాంటి వారు ప్రత్యేక మతోన్మాదాన్ని ప్రోత్సహించకపోయినా, ఆయన వేషభాషలు, ఆధ్యాత్మిక అప్పీలు, 'రామ రాజ్యం' లాంటి కల్పనలు భారతీయ మూలలో నుండి వచ్చినవే. నిజానికి గాంధీ 'రామ రాజ్యం' ఒక ఉదారవాద, అరాచక వాద ఊహాజనిత కల్పనే! అది ఆయనకు బాగా తెలుసు. అది ఏ మాత్రం మత సంబంధం కాదు. అయినా ఆయనలోని ఉదారవాది, అదర్శవాది అతివాద హిందూమతవాదులకు

బలిగా మారడం చరిత్రకు తెలిసిందే. అంటే మతపు సింబల్స్, మతనిర్వచనాలు, పునర్నిర్వచనలూ ఎంత కత్తిమీద సామో అందరికీ అర్థం అయ్యే వుంటుంది.

గాంధీకి ముందు, గాంధీ తరువాత కూడా అనేక మంది ఆధునికులు, సంప్రదాయ వాదులు హిందూ పురాణాలని, పురాణ పురుషుల్ని అనేకసార్లు పునఃపరిశీలనకు గురి చేశారు. ఉదాహరణకు కె.ఎమ్.మున్షీ రాసిన 'కృష్ణావతార' (ఏడు భాగాలు పూర్తి అయ్యి, ఎనిమిదవ భాగం అసంపూర్తిగా వుండి పోయిన ఈ బృహత్తర ప్రయత్నం) ముందు మాటలో తన ప్రయత్నం ఎందుకో వివరించే ప్రయత్నం వుంది. మహాభారతంలో తొలిసారి రూపు దిద్దుకున్న ఈ 'కృష్ణ' సాహిత్యం అనేక తదనంతర సాహిత్యంతో మరింత విస్తృతం అయ్యింది. ఇలా చెప్పుకుంటూ పోయిన క్రమంలో "తన కాలపు వ్యక్తులకు తెలిసిన కృష్ణుడు ఎవ్వరూ"? అన్న సందేహం వచ్చేలా, తయారయ్యింది. అనేక గుణ, గణ విశేషణాలు కలసి సాధారణమైన చదువరికి అర్థం అవటం అసాధ్యం అని చెప్పలేను కానీ, చాలా కష్టతరం అవుతోంది అంటాడు మున్షీ. ఈ విస్తృతమైన సాహిత్యం, కథలూ, గాథలూ – అన్నింటిని జల్లెడపడుతూ, కృష్ణుణ్ణి తన నాటి కృష్ణుడిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాను అంటారు.

మరోవైపు డా॥ బి.ఆర్. అంబేద్కర్ తన "రిడిల్స్ ఆఫ్ హిందూయిజం" (అంబేద్కర్ మరణానంతరం 1987లో పుస్తకంగా వచ్చింది) లో రాముడిని ఒక నేరస్తుడిగానూ, బలహీనుడిగానూ, పిరికి వాడిగానూ, ఉన్నత కులాల రాజుగాను, శూద్రులను అణచివేసి, బ్రాహ్మణుల ఆధిపత్య ధోరణులకు బలం చేకూర్చిన వాడిగా నిరసిస్తాడు. అలాగే కృష్ణుడిని ఒక మోసకారిగా, అతని జీవితాన్ని ఒక మోసాల సమాహారంగా భావించాడు. ఇ.వి. రామస్వామి నాయికర్ లేదా పెరియార్ – "రామాయణం – యథార్థ పరిశీలన" లో "రామాయణం" "భారతం" ఆర్యులు కల్పించిన శృంగార గాథలలో ప్రధానమైనవి అనీ, అవి ద్రావిడుల స్వాభిమాన ఆలోచనలను తుడిచి వేయడానికి, వారి వివేచనా పరిజ్ఞానాన్ని మొద్దుపరచటానికి, మానవత్వాన్నే నాశనం చేయటానికి, ఆర్యులు పన్నిన ఉచ్చులోకి ద్రావిడులను లాగటానికి చేసిన వ్యూహం అని అంటారు. దేబీ ప్రసాద్ చట్టోపాధ్యాయ అనే మార్క్సిస్ట్ (వాట్ ఈజ్ లివింగ్ అండ్ వాట్ ఈజ్ డెడ్ ఇన్ ఇండియన్ ఫిలాసఫీ)

ప్రకారం కొన్ని ప్రత్యేక విలువలని, భావజాలాన్ని సమాజం పై రుద్దటమే, ఈ రామాయణ, భారత పురాణ ఇతిహాసాల పని అంటాడు. అంటే ఒక రకంగా ఆర్య, బ్రాహ్మణ భావజాల ప్రచారానికి ఈ కావ్యాల నిర్మాణం, పునర్నిర్మాణం జరిగింది అని ఆయన ప్రతిపాదన.

ఇటీవలి కాలంలో దేవదత్ పట్నాయక్ అనే చదువరి వృత్తిరీత్యా డాక్టరు అయిన "మిథాలజిస్టు" (అంటే పురాణ ప్రతీకలని వివరించే స్పెషలిస్ట్) తులనాత్మక మిథాలజీలో ముంబయి యూనివర్సిటీ నుండి ఒక కోర్సు చేశాడు. తన తొలి పుస్తకం – "శివ : యాన్ ఇన్ట్రోడక్షన్" మొదలుకొని నేటి దాకా పురాణ ప్రతీకలని వివరిస్తూ అనేక ఉపన్యాసాలు, పుస్తకాలు రాశాడు. "మిత్" అనేది లేని సమాజం మనజాలదు అంటాడు. అ "మిత్" అనేది మంచి, చెడు, బాధ్యతలు, హక్కులు, స్వర్గం, నరకం.. అనేక భావనలను సృష్టించే, నిలబెట్టే, తద్వారా సమాజాన్ని ప్రభావితం చేసే మార్గం. ప్రపంచాన్ని దర్శించే పద్ధతి. ప్రతి సమాజం తనదంటూ ప్రత్యేకమైన "మిత్'లను సృష్టించుకుంటుంది. పాతవాటిని మార్చుకుంటూ వుంటుంది. ఇది ఒక నిరంతర ప్రక్రియ. అంటే "మిత్" లు కూడా శాశ్వత నిర్మాణాలు కావు. మారుతున్న సామాజిక, చారిత్రక నేపథ్యాలలో అవి కూడా మారుతూ వచ్చాయి.

ఇవే కావు, మరోవైపు క్రిస్టియన్ మిషనరీలు, మితవాద ఇస్లామిక్ మతవాదులు హిందూయిజంపై హిందూ దేవతలపై, హిందూ పురాణాలపై తమ విమర్శను, సాధారణ విమర్శస్థాయి దాటిన ప్రచారాన్ని ముమ్మరం చేయటం మొదలు పెట్టారు. ఉన్నవ లక్ష్మీనారాయణ గారి 'మాలపల్లి' నవల క్రిస్టియన్ మతం, ప్రభుత్వం, అధికారం, న్యాయవ్యవస్థల సమన్వయ ప్రయత్నాన్ని బాగానే బహిర్గతం చేసింది.

ఇదే సమయంలో మరోవైపున అవకాశాల కోసం ఎదురు చూస్తున్న దెబ్బతిన్న పులిలా కొందరు హిందూ సంప్రదాయ వాదులు ఈ సవాళ్ళను ఎదుర్కొనే వ్యూహాలను రచిస్తున్నారు. హిందు మహాసభ, ఆర్.ఎస్.ఎస్. ఆర్యసమాజ్‌లు, వ్యతిరేక మతవాదాలను ఎలా ఎదుర్కోవాలి, హిందూసమాజాన్ని ఎలా ఒక బలమైన సంఘటిత మతంగా మార్చాలి అనే విషయంపై అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. అప్పటికే రామకృష్ణ పరమహంస ప్రధాన శిష్యుడు స్వామి వివేకానంద విదేశీ గడ్డపై ఒక శంఖారావం వినిపించాడు. హిందూ సమాజం జూలు విదిలిస్తోంది.

1850–1950ల భారతదేశ చరిత్ర ఒక అగ్ని గుండం. అన్ని రకాల పరస్పర సంఘర్షణల మధ్య భారత దేశ స్వాతంత్ర పోరాటాన్ని, వలసవాద వ్యతిరేక పోరాటాన్ని నడపటం, దాన్ని ఒక విజయపు స్థాయికి తీసుకెళ్ళడం అంత సులభమైన పనీ కాదు. ఇక్కడే ఇద్దరు వ్యక్తులు గాంధీ, లోహియాలు మతాన్ని ఉన్నత విలువలతో ఎలా తిరిగి ఆవిష్కరించాలి, ఎలా ఈ పునరుద్ధరించిన మతం ఛాందసం వైపు కాకుండా, తత్కాలీన ప్రాపంచిక సమాజంలో మనగలిగేలా, మానవ సమాజపు అంత్యోదయానికి ఎలా ఉపయోగించాలి అని, ఉదారవాద వ్యవస్థగా, నైతిక నిర్మాణంగా, సమసమాజ స్థాపనకు ఎలా ఉపయోగించుకోవచ్చును అని మధనపడ్డారు.

గాంధీకి మతం అంటే నైతికత. ఆయన 'రామరాజ్యం' పురాణమైన, ఒక అందమైన ఊహని, ఆధునిక సమాజంలో 'అధికారం' లేని రాజ్యంగా – (ఆయన అసలు పదం – 'ఎన్‌లైటెన్‌డ్ అనార్కీ') తయారు చేయడం. "తేజోవంతమైన, జ్ఞానవంతమైన ప్రజలు కల రాజ్య రాహిత్యం." అయితే తన ప్రధాన ఆశయమైన స్వాతంత్ర్య ఉద్యమంలో అన్ని మతాలని, అన్ని వర్గాలని, అన్ని ప్రాంతాలని కలుపుకు పోతే కాని 'స్వాతంత్ర్యం' సాధ్యం కాదు అని అర్థం అయిన వ్యక్తిగా ప్రతిక్షణం తన ఊహాత్మక రాజ్యాన్ని తత్కాలీన ప్రజాకాంక్షలకు అనుగుణంగా తగ్గిస్తూ వచ్చాడు. మొత్తం మీద 15–08–1947ల దేశానికి స్వాతంత్ర్యం అయితే వచ్చిందే కాని మతం తన విశృంఖల ప్రళయ నాట్యాన్ని ఆయన కళ్ళముందే ప్రదర్శించింది. కలలు కకావికలం అవుతున్న ఆ సంధి దశ చివరికి తనను సృష్టించిన సృష్టికర్తనే బలిగొన్నది.

స్వతంత్ర భారతదేశం 26–01–1950ల తరువాత సర్వసత్తాక రాజ్యం. కొన్ని వేల నూతన ప్రయోగాలకి అది స్థావరం అయ్యింది. ఇప్పుడు మనల్ని బయటి నుంచి నడిపించేవాడు, మన నడవడిని నిర్దేశం చేసేవాడూ లేడు. మత ప్రాతిపదికన విడిపోయిన భారత దేశం ఎక్కువ భాగం 'టెక్ష్టువల్'గా సెక్యులర్ దేశం. కానీ భౌతిక నిజం ఏమిటంటే ఇండియా ప్రధానంగా మతాధారిత ఆధ్యాత్మిక దేశం. 95 శాతం పైగా ప్రజల్లో ఇంకా ఆస్తికులుగా బలంగా కొనసాగుతున్న దేశం. ఇంత మంది అత్యధికుల నమ్మకాలనీ, వ్యాసాలని విస్మరించి ఎవరైనా ఈ దేశానికి దిశ, దశ నిర్దేశించగలరా?

ఇలాంటి సందర్భంలో లోహియా చాలా వినూత్నమైన ప్రయత్నం చేశాడు. ఒకవైపు పెరియార్, అంబేడ్కర్‌లతో సంఘటిత ఆలోచనలు చేస్తూనే, మరోవైపు పురాణ, ఇతిహాసాలను, పాత్రలను చారిత్రక, సామాజిక, మానసిక, శాస్త్రాల అధ్యయన కేంద్రంగా చేశాడు. ఆధునిక మానవుడికి, పాశ్చాత్య రాజకీయ, సామాజిక సిద్ధాంతాలతో ప్రభావితం అయిన వారికి మతం మొత్తంగా చెడుది, భయంకరమైనది. మనిషిని నిరంతరం అజ్ఞానంలోకి నెట్టేది. మనిషిని దోపిడీ చేసే ఆయుధం. పురాణ ప్రతీకలన్నీ అత్యంత త్వరితంగా, నిష్కర్షగా విసిరిపారేయవలసిన అంశాలు. ఈ రాజకీయ, సామాజిక వాతావరణంలో, ముఖ్యంగా ఇండియాలో, ఈ వైరుధ్యాలను ఎలా అర్థం చేసుకోవాలి? ఎలా పరిష్కరించుకోవాలి? – అన్న ప్రయత్నం చేసిన వినూత్న రాజకీయ, సామాజిక సిద్ధాంతకారుడు – లోహియా.

"ఆరిపోయిన దీపాలతో ఇంకెన్నాళ్ళు పండుగ జరుపుకోగలరు"? అన్న లోహియా ప్రశ్న (పే. 10) చాలా అవసరమైన ప్రశ్న. పండుగలకీ, పురాణాలకీ కూడా కొత్త చమురు, కొత్త వత్తులు, కొత్త వెలుగులు కావాలి. అయితే మిగతా ప్రపంచ దేశాలలో లాగా కాక, ఇక్కడ పాత దీపాలు ఎప్పుడూ పూర్తిగా ఆరిపోలేదు. కొత్త దీపాలు, పాత వాటిని తమ కాంతితో దాచేయనూ లేదు. నెహ్రూ, తన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో ఈ దేశాన్ని, సమాజాన్ని వర్ణిస్తూ ఒక గొప్ప మాట అంటాడు. "ఆమె (భారతదేశం) ఒక పురాతన రాతి ఫలకం. ఆ ఫలకంపై పొరలు, పొరలుగా ఆలోచనలూ ఊహలూ, స్వప్నాలు చెక్కబడ్డాయి. అయితే ఏ కొత్త రాతలూ అంతకు ముందు రాయబడ్డ రాతలను పూర్తిగా మరుగున పెట్టలేకపోయాయి. తుడిచి వేయలేక పోయాయి." నెహ్రూ, లోహియాల మధ్య తీవ్ర విభేదాలు పరిష్కరించలేనంత కఠినమైన శిలలూ కావు.

లోహియా పురాణ పాత్రలనీ, ప్రతీకలని అనేక వైరుధ్యాల మధ్య, సంఘర్షణల మధ్య సజీవంగా చూశాడు. అందుకే "రామ కథలో రాముని పాత్రలో, నాకు కనిపించిన మూడు నాలుగు లోపాలలో సీత పట్ల ఆయన వ్యవహరించిన తీరు కూడా ఒక లోపం అని నేను భావిస్తున్నాను," అంటూనే మర్యాదా పురుషోత్తమం "రామతత్వం" అంటాడు. (పే. 22–23). "కృష్ణుడు సంపూర్ణ మానవుడు : బోధపడని వ్యక్తి; బాగా తింటాడు, తినిపిస్తాడు. ఎంతగానో ప్రేమిస్తాడు. ప్రేమించటం ఎలాగో

నేర్పుతాడు.. నిర్లిప్త భోగానికి గొప్ప త్యాగి, యోగిగా నిలిచాడు" (పే. 50) అంటూనే "అపరిమితుడు" అంటాడు.

ద్రౌపది-సావిత్రుల వంటి స్త్రీ పాత్రలు నిజంగానే ప్రపంచ పురాణ సాహిత్యంలో లేవు. పాతివ్రత్యాలని నిరసించే ఆధునిక స్త్రీ వాదం యముడిని (మృత్యువును) ప్రశ్నించిన సావిత్రి సాహసాన్ని, తెగువను అర్థం చేసుకోలేక పోవడం సహజమే. కానీ ఏకపత్నీవ్రతపు (లేదా ఏక సత్నీ వ్రతపు) ఔన్నత్యాన్ని నిరసించే వారికి ద్రౌపది అర్థం కాకపోవడం విచిత్రమే! "ద్రౌపది చాలా మహోన్నతురాలు - పిరికిది కాదు. యావత్ ప్రపంచ చరిత్రలో గానీ, ప్రపంచ సాహిత్యంలోగాని, పురాణ గాథలలో గానీ.. ఇలాంటి వ్యక్తి" లేదు. అలాగే కృష్ణ ద్రౌపదుల అద్భుత సంబంధం కూడా ప్రపంచ సాహిత్యంలో కానరాదు అంటాడు లోహియా! "కృష్ణా - కృష్ణుల సంబంధం. ఇది అన్నా-చెల్లెళ్ళ సంబంధమేనని పండితులు చెపుతూ ఉన్నప్పటికీ, మహాభారతం చదివితే అలాగనిపించదు. సఖా-సఖీ సంబంధం" (పే. 25)

ఇంతకీ ఈ సఖా-సఖీ సంబంధం - "అన్నా-చెల్లెళ్ళ", "ప్రేమికుల", "తల్లీ కొడుకుల" సంబంధం అని ప్రత్యక్షంగా అనడానికి వీలు లేక పోయినా - "తల్లీ-కొడుకు, తండ్రి-కూతురు, ప్రియ-ప్రియులు, అన్నా-చెల్లెలు, అక్కా-తమ్ముడు" ఇలాంటి సంబంధాలన్నీ ఒక చోట పోగు చేసి, కలగాపులగం చేసి, రసం పిండితే వచ్చే "ఒక నూతన మానవ సంబంధం" (పే. 26). "భారత స్త్రీలకు నిజమైన ప్రతినిధి ద్రౌపదేననీ, సావిత్రి కాదని" ఆయన అన్నప్పుడు చాలా ఆశ్చర్యంగా వుంటుంది. ద్రౌపది జ్ఞాన పరిణతి, సద్యఃస్ఫూర్తి, విషయ అవగాహన, సాహసం (పే. 26) దృష్టిలో ఉంచుకునే ఆయన ద్రౌపదికి సంబంధించిన అనేక కథలని ప్రస్తావించాడు. "...నిజానికి ఈ వాక్యం వెనుక భారతీయ పురాణేతిహాసాల కథలనూ, హిందూ పురాణాల గాథలనూ, వాటి సారాన్ని గ్రహించి, మన మానసికస్థితిని పునస్సంఘటితం చేయాలన్న ఆకాంక్ష ఉన్నదని గ్రహించాలి" (పే. 30) అంటూ అభ్యర్థిస్తాడు.

రాముడిని 'పరిమిత' వ్యక్తీకరణ అంటూ - "రాముడు ఆదర్శవాది; ఏకరూప ఐక్యత నిర్మాత, దానికి ప్రతీక కూడా" (పే. 63) అనీ అంటాడు లోహియా. "కృష్ణుడు ఆదర్శవాదపు బహురూప ఐక్యత నిర్మాత" (పే. 65) అనీ వెంటనే అంటాడు. అయితే

భారతదేశపు ప్రాచీన, ఆధునిక చరిత్రను జాగ్రత్తగా గమనిస్తే, అనేక సందర్భాలలో రాముడు ఇచ్చిన స్ఫూర్తి చాలా బలమైనది. 'భగవద్గీత' అనేక క్లిష్ట సమయాలలో, అనేక మందికి సమస్యలను, సందేహాలనూ పరిష్కరించి, సమన్వయ జ్ఞానం ఇచ్చినా – 'రాముడి' పేరును కార్యాచరణలో ఎత్తుకోవడం, అలాంటి ప్రతి సందర్భంలోనూ సాధారణ ప్రజానీకం అత్యంత ఉత్సాహంతో క్రియాశీలకంగా మారడం గమనించాం. ఇది లోహియాకి బాగా అర్థం అయ్యింది. అందుకే ఆయన సోషలిస్టులకు 'రామాయణ మేళాలు' జరపమనే సలహా ఇస్తాడు.

అందుకే అంటాడు లోహియా "కృష్ణుడు ఎంత నిస్వార్థంగా కృషి చేసినా ప్రజల మనసుల్లో మాత్రం రాముడే ముందంజలో ఉన్నాడు" (పేజి. 64). స్త్రీ పురుషుల మధ్య చిగురుటాకు వంటి మైత్రి విషయంలో నేటి శాస్త్రవేత్తలు "అణచివేసిన రసికత" అంటున్నారు (పే. 65). "స్త్రీ ఎక్కడయినా పురుషునితో సమానమయ్యిందా అంటే అది కేవలం వ్రజ భూమిలోనే, అదీ కృష్ణుని వద్దే" (పే. 67). "హిందూ దేశానికి కృష్ణుని బహుముఖీన ఐక్యతను అందించండి. రాముని తరహా ద్విజ, శూద్ర విభజనను నిర్మూలించండి. అయితే రాముడు ఏర్పరచిన హద్దుల బాటలోనే నడవండి – సత్యమూ, నియమ పాలన కొనసాగింపు" అంటాడు లోహియా, రామ–కృష్ణుల సమన్వయ ప్రతిపాదన చేస్తూ. రాముడు, కృష్ణుడు, శివులు నియమిత, అఖండ, అనంత వ్యక్తిత్వాలు అంటాడు లోహియా. అయితే దేనికదే "సంపూర్ణం" (పే. 74). "శివుడి గాథ భారత దేశపు నశింపులేని, పవిత్రమైన అఖండతను పట్టి చూపుతుంది" (పే. 90)

"పురాణం అనేది ఒక అనంతమైన నవల. అత్యద్భుత గాథల సమాహారం" అంటాడు మరోచోట. వాటిలో కాలక్రమేణ, పాలక వర్గాల ప్రయోజనం కోసం కొన్ని కథలూ, కల్పనలూ చొప్పించబడి వుండవచ్చును. అయితే భారతదేశ పాలక వర్గం ఆధునికులు ఊహించినట్టుగా ఒకే లేదా కొన్ని ప్రత్యేక వర్గాల చేతిలో మాత్రమే చలన రహితంగా, నిరంతరంగా లేదు. తనదంటూ చారిత్రక గతి సూత్రాలను తయారు చేసుకోలేని ఆధునిక మేధావివర్గపు చేతగాని తనం కాకపోతే, భారతదేశం కూడా నిరంతరం చలన శీలతకు లోనైన సమాజం. నిజానికి యూరోపు, అమెరికా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల కంటే ఎక్కువ ప్రకంపనలకు లోనయిన సమాజం.

నేను లోహియా రచనలతో తొలి రోజులలో ఎక్కువగా ప్రభావితం అయ్యినవి – 'మార్క్స్, గాంధీ, సోషలిజం', కులం గురించి వ్రాసిన 'వసిష్ఠుడు – వాల్మీకి' మరియు 'వీల్ ఆఫ్ హిస్టరీ.' అయితే ఈ మధ్య లోహియా ఫిలాసఫీని సమగ్రంగా పరిశీలించి, ఒక పుస్తకంగా రాసే క్రమంలో కొద్దిగా నిరాశకు గురి చేసింది ఆయన 'వసిష్ఠుడూ – వాల్మీకి' ఆధారంగా చేసిన కుల తత్వ పరిశీలన. అయితే ఇక్కడ ఒక్క విషయం ప్రస్తావించాలి. తాత్విక ఊహగా చూస్తే – ఈ 'వసిష్ఠ–వాల్మీకి' నిర్మాణం చాలా అద్భుతమైన ఊహ. అయితే తాత్కాలిక రాజకీయ సమరంలో ఈ నిర్మాణం తన ప్రత్యర్థి నెహ్రూను విమర్శించేందుకే అన్నట్టుగా వుంది. నిజానికి ఈ విషయంపై చాలా చిన్నప్పుడు, అంటే 13–14 ఏళ్ళ వయసులో నేను చదివిన నార్ల వేంకటేశ్వరరావు గారి సంభాషణల రూపంలోని 'జాబాలి' రచనను కూడా ప్రస్తావించాలి. అది కూడా తిరిగి ఈ మధ్య చదివినప్పుడు చాలా కృత్రిమంగానూ, లేని ఒక వైరుధ్యాన్ని ప్రయత్నపూర్వకంగా పునర్ నిర్మిస్తున్నట్లు అనిపించింది. వసిష్ఠుడు, వాల్మీకుల వైరుధ్యం నా ఉద్దేశంలో లోహియా విచారధారలో ఒక బలహీన అంశం.

కానీ, ఇలా పురాణ పాత్రలను, తాత్కాలిక సమాజపు పరిశీలన కోసం ధనాత్మకంగా ఉపయోగించే విధానం మాత్రం నాకు చాలా ఇష్టం. పురాణాలు, కథలూ, గాథలూ – ఒక సమాజపు నరనరాలలో ఇంకిపోయిన జ్ఞాపకాలు. చరిత్రను ఒక కాలక్రమంగా చదవడంగా చూసిన పాశ్చాత్యులకు, ఆధునికులకు వింతగా, కాలాతీతంగా అనిపించినా పురాణాలు ఒక జాతి తన ఉన్నత శిఖరాలను,లోయల్ని గుర్తు పెట్టుకునే ఒక అద్భుత ప్రక్రియ. అందులో ఆనంద, విషాదం, అనుభవం, జ్ఞానం... ఇలా ఎన్నో కాలపు గుళికల్లో ఇమిడి ఉంటాయి. ఈ విషయంలో పాశ్చాత్యులు, ముఖ్యంగా సామాజిక సిద్ధాంతం, మానసిక విశ్లేషణలలో వారి అతి తక్కువ పురాణ ప్రతీకల్ని ఉపయోగించుకున్న తీరు భారతీయులు గుర్తించవలసిన, అర్థం చేసుకోవలసిన అవసరం అయితే వుంది.

పురాణ ప్రతీకల పునర్నిర్మాణం అవసరం. అది గతంలోనూ జరిగింది. ఇప్పుడూ అవసరమే. "మానసికస్థితిని, దృక్పథాన్ని పునర్వ్యవస్థీకరించుకునే పనికి పూనుకున్నట్లయితే, 'సావిత్రి – ద్రౌపది' గాథలను గురించి చర్చలను ప్రేరేపించండి" (పే. 39). పురాణాలను ప్రతీకలను, వ్యక్తుల్ని, దర్శించే అర్థం చేసుకునే, విశ్లేషించే,

సమన్వయించే ప్రక్రియలో లోహియా ఇచ్చిన పనిముట్లు చాలా విలువైనవి, అందమైనవి. అందుకే ఆయన మాటల్లోనే నా ఈ ప్రయత్నాన్ని ముగిస్తాను.

"ఓ భారత మాత! శివుడి మన్సును, కృష్ణుని హృదయాన్ని, రాముని మాటల్ని, చేతల్ని మాకివ్వు. మమ్మల్ని పరిమితి రహిత మనస్సులుగానూ, విశాల హృదయులుగానూ సృజియించి, పరిమితులు గల జీవితాన్ని అందించు" (లోహియా పే. 94).

ఈ పురాణ ప్రతీకల అర్థాల అన్వేషణ లోహియాతో మొదలు కాలేదు. లోహియాతో అంతమూ కాదు. కానీ లోహియా వివరణలలో ఒక అద్భుతమైన, అందమైన, ఆలోచించవలసిన అంశం ఏమిటంటే – ఆయన వాటిపట్ల చూపిన గౌరవం. వాటిని కేవలం విమర్శనీయ విషయాలుగా కాక, వర్తమాన సమాజం వాటి నుండి నేర్చుకునే పాఠాలు, సమాజాన్ని మరింత ముందుకు తీసుకుపోయే ప్రయత్నంలో వాటిని ఎలా ఉపయోగించుకోవచ్చును అనే ప్రయత్నం చాలా గొప్పది. ఇలాంటి ప్రయత్నాలు సమాజంలో అనవసరపు ఘర్షణలను నివారిస్తూ, అవసరమైన ఘర్షణలకు తగిన ప్రాముఖ్యం ఇస్తాయి. వ్యతిరేకిలో కూడా ఆలోచనలను కలిగించి, మార్పుకు కారణం అవుతాయి.

# విశ్వమానవ రాగం లోహియా మానసగానం

- ఎమ్వీ రామిరెడ్డి
9866777870

ప్రసంగం ఒక దిక్సూచి. ఒక శస్త్రచికిత్స. ఒక వ్యక్తిత్వవికాస మంత్రం. ఇప్పుడు సింహభాగం నాయకులు గుప్పించేవన్నీ ఊకదంపుడు, ఊహదింపుడు ప్రసంగాలే. ఒకప్పుడు అలా కాదు. తమ మాటలు ఎదుటివారి గుండెల్లోని చీకట్లను చీల్చాలని, వారి మేధావికాసానికి బాటలు వేయాలని నేతలు తాపత్రయపడేవారు. "ఒక మంచి ప్రసంగమివ్వటానికి మూడు వారాల ముందునుంచే నేను సిద్ధమవుతాను" అంటారు మార్క్ ట్వెయిన్.

సునిశిత పరిశీలన, అపరిమిత పరిశోధన, నిర్వచిత పరిజ్ఞానం, నిర్దుష్ట అవగాహన కలిగి ఉన్నవారు మాత్రమే తమ ప్రసంగాల ద్వారా విలువైన మాటల ఆయుధాలను ప్రజల మనసుల్లో భద్రపరచగలరు. ప్రముఖ సోషలిస్టు నేత రామ్ మనోహర్ లోహియా నిస్సందేహంగా ఈ కోవకు చెందిన మేధావి. వివిధ ప్రాంతాల పర్యటనల్లో భాగంగా తన స్వరచిత్తంతో ప్రజల్లో మేధావికాసానికి అనితరసాధ్యమైన కృషి చేశారు. సంక్లిష్టమైన అంశాల లోతుల్లోకి చొచ్చుకుపోయి, వాటి మూలాల స్వరూపస్వభావాలను విశ్లేషించి, వాటిలోని చీకటివెలుగుల్ని ప్రజల ముందు పరిచారు. కాబట్టే, కాలం మారినా ఇవాళ్టికీ ఆయా అంశాలు ప్రాసంగికతను కోల్పోలేదు. పైగా, వర్తమాన అరాజకీయ సంక్షుభిత సందర్భంలో మరింతగా అధ్యయనయోగ్యమైన పాఠ్యాంశాల్లా నిలిచిపోయాయి.

1949 నుంచి 1963 వరకు వివిధ వేదికలపై చేసిన ప్రసంగాలను ప్రముఖ సాహితీవేత్త రావెల సాంబశివరావు గారు "విశ్వమానవరాగం లోహియా మానస గానం" పేరిట తెలుగులోకి అనువదించారు. గాఢమైన తాత్త్విక భావనలు, భౌతిక–

పారలౌకిక ప్రతిపాదనలు, మూర్త-అమూర్త ప్రాధాన్యాంశాలు, సిద్ధాంతాల లోతుపాతులు వంటి కఠినతరమైన విశేషాల గురించి లోహియా ఆంగ్ల/హిందీ భాషల్లో చేసిన ప్రసంగాలను మన భాషలోకి అనువదించటం అంత తేలిగ్గాదు. సుదీర్ఘ వాక్య సముదాయాలను అర్థం చెడిపోకుండా మనసుకు హత్తుకునేలా చెప్పటం వెనక సాంబశివరావు గారి సాహితీప్రజ్ఞ దాగి ఉంది. తెలుగుభాషపై ఆయనకున్న సాధికారత అనువాదాన్ని సైతం పరిమళభరితం చేసింది.

"వాస్తవాన్ని మనం రష్యా రూపంలో ఆదర్శమయం గావిస్తే వాస్తవానికి చెందిన మరో రూపం అమెరికాగా ప్రత్యక్షమైతే దాన్ని దెయ్యంగా చిత్రీకరిస్తారు. ఇలా కమ్యూనిస్టు మనసు భావిస్తుంది. అలాంటిదే అమెరికా మనస్సుకూ తదుతుంది. అదీ దెయ్యాన్ని చూపుతుంది ఎందువల్లనంటే అమెరికా దేశస్థుడు కమ్యూనిస్టు కాకపోయినా అతడూ అదే తప్పిదానికి పాల్పడతాడు. అమెరికాలోని వాస్తవ పరిస్థితిని ఆదర్శమయం చేస్తాడు; రష్యాలో ఉన్న స్థితిని భూతంగా చిత్రిస్తాడు".

ఈ వాక్యాలు చదువుతుంటే... ఉక్రెయిన్ మీద రష్యా సేనలు కురిపిస్తున్న బాంబులు మీ మనసుల్లో పేలటం లేదూ! లోహియా 1952లో హైదరాబాదులో ప్రసంగిస్తూ చెప్పిన మాటలివి. ఆయన దార్శనికతకు అద్దం పట్టే ఆ ప్రసంగాన్ని "ఒక తాత్త్విక ప్రతిపాదన" పేరిట అనువదించారు.

అసలేమిటీ తాత్త్విక ప్రతిపాదన?

"వాస్తవాన్ని గ్రహించటం, ఆదర్శాన్ని రూపొందించటం బాల్యం నుండీ ఒకదానితో ఒకటి పెనవేసుకుపోయి ఉంటాయి".

కాబట్టి "ఉన్న స్థితి, ఉండవలసిన స్థితి బిడ్డకు ప్రారంభంలోనే హత్తుకునేట్లు చెప్పాలి".

సరిగ్గా ఈ రెండు విషయాల్లోనూ మానవమేధ సకారాత్మకంగా వికసించక పోవటంతో జ్ఞానసముపార్జన డోలాయమానస్థితిలో చిక్కుబడిపోయింది. విమర్శనాత్మక ప్రావీణ్యాలు అల్లంత దూరంలోనే శిలలై నిలబడిపోయాయి. 'అంతిమ సత్యాన్ని కనుగొనదలచినవాళ్లు మధురమైన గీతాలు, మగువలు, బంగారం, తత్సంబంధమైన వాటన్నింటినీ విసర్జించా'లన్న వివేకం కొరవడింది.

కమ్యూనిజంలోని ఖాళీల చిరునామా తెలియజెప్పే క్రమంలో వాస్తవానికీ, ఆదర్శానికీ మధ్య సరిహద్దురేఖల్ని లోహియా తాత్వికంగా నిర్వచించారు. 'ప్రస్తుత నాగరికత పేదరికం, భయం, యుద్ధాల ఫలితం' అంటారు. ఇదే విషయమై అమెరికా, రష్యాలు ఒకదానిపై మరొకటి దుమ్మెత్తి పోసుకుంటాయి. ప్రపంచదేశాలన్నీ శ్రద్ధగా వినేట్లు రంకెలు వేస్తాయి. ఈ రణగొణ ధ్వనుల మధ్య ఇదే దేశాలు 'విషపూరిత అంశాలుగా తయారైన పేదరికం, యుద్ధం, భయం వంటి మూడు విషయాల్లో ఈషణ్మాత్రం కూడ నివారించలేకపోయాయి' అన్న వాస్తవాన్ని గుర్తించలేం. ఫలితంగా పేదరికం పెచ్చుపెరిగిపోతోంది. యుద్ధం పెచ్చరిల్లిపోతోంది. అట్లా అని ఏదో ఒక పక్షానికి కోపుగాయలేం లేదా నిందించలేం.

పారిశ్రామికీకరణతోపాటు విప్లవాలూ చరిత్రలో భాగమయ్యాయి. మొదటిది మానవ జీవనగతిని నియంత్రించగలిగితే, విప్లవాలు మాత్రం పరిపక్వం కాలేక, నిజాయితీ దిశగా మలుపు తిరగలేకపోయాయి. ఫలితంగా వ్యక్తి ఒక అంకెగానో, అనుబంధ అంశంగానో, గుర్తింపు చిహ్నంగానో భ్రష్టు పట్టిపోయాడు. పోనీ, ప్రేమను ఆధారంగా చేసుకుని నిర్వహింపబడే విప్లవాలేమైనా సఫలం అవుతాయా అంటే... ఏండ్లూ పూండ్లూ పట్టే మాట అటుంచి, అసలవి ప్రారంభమే కావని చెబుతారు లోహియా. ఇంకోవైపు, విద్వేషం ఆధారంగా చెలరేగే విప్లవాలు నియంతృత్వానికి దారి తీస్తాయి. మరి ఏమిటి దారి? అని ప్రశ్నించేవాళ్లకు ఆయనిచ్చే సమాధానం...

"నా మనసులోని విప్లవం ఎటువంటిదంటే ముందు పని జరగాలి. నెలకొన్న నియంతృత్వం అంతమొందాలి".

హింస, అహింస, విప్లవం, యుద్ధం– దేన్నీ సంపూర్ణంగా సమర్థించరు లోహియా. జనసమూహాల సత్యాగ్రహదీక్షల్ని మాత్రం ఆహ్వానిస్తారు. మానవబుద్ధి సరైన కోణంలో వికసించటం ఒక్కటే అంతిమ సత్యం కావాలంటారు. అదే కదా సామాజిక ప్రగతికి అసలైన అంకురార్పణ.

"ఎన్నడూ, ఏ విషయంలోనూ ఒక సత్యసమ్మతమైన, సంపూర్ణమైన గ్రహణశక్తి అనేది ఉండదు. మానవాళి ఎన్నటికైనా సంపూర్ణ సత్యాన్ని చేరుకొనగలదని ఎవరైనా భావిస్తే వాళ్లు పప్పులో కాలేసినట్లే. ఎందువల్లనంటే ఏ విధమైన జ్ఞానవిస్తరణ అయినా అజ్ఞానపు విస్తరణే కాగలదు".

❖❖❖

బనారస్‌లో 1953లో లోహియా ప్రజలనుద్దేశించి ఇచ్చిన ప్రసంగాన్ని 'భౌతికం – పార లౌకికం' పేరుతో సాంబశివరావు గారు అనువదించారు. ఆహారం, జీవన ప్రమాణాలు, నాగరికత, ఆధునికత తదితర అంశాలు ప్రపంచ యవనికపై ఏయే రూపాల్లో దృశ్యమానం అవుతున్నాయో లోహియా వివరించారు. ఈ విషయంలో ఐరోపా, అమెరికాలకు చెందిన యువత నిబ్బరంగా ఉన్నారు. భారత్, ఇతర పేదదేశాల్లోని యువత మాత్రం ఆందోళన చెందుతున్నారు. యుద్ధసన్నద్ధత, సుందరమయ ఆధునిక జీవనసరళి కోసం వెంపర్లాటలో ఇరువర్గాల భావిపౌరులూ ఆందోళన పడుతున్నారు. అయితే– ఆకలి, అసంతృప్త జీవన ప్రమాణాలు... పేదదేశాలకున్న బోనస్ ఆందోళన. అది అలా అలా పెరిగి పెద్దై నిరాశా నిస్పృహల్ని నాటు పెడుతుంది. ఆ నిస్పృహ లోతుల్లో దిగబడిపోయి, ప్రామాణిక పథాల్ని సారవంతం చేసే మార్పు కోసం కృషి చేయాలన్న అవసరాన్నీ విస్మరిస్తారు. "తినటానికి ఉన్నవారి కంటే తినటానికి తిండి సరిపడ లేనివారు ఆలోచనల్లో, ఆచరణలో విప్లవాత్మకంగా దూరం జరిగే దశలో ఉన్నారు". ఇలాంటి పరిస్థితుల్ని అధిగమించి సార్వజనీన ఆమోదయోగ్య పునర్నిర్మాణ సూత్రాలను అందిపుచ్చుకోవాల్సిన అవసరాన్ని లోహియా నొక్కి వక్కాణించారు.

ఈ అంశాల గురించి లోతుగా వివరించటానికి ఆయన యుగోస్లావియాకు చెందిన మిలోవన్ జిలాస్ (Milovan Djilas), భారతీయుడైన వినోబా భావేలను తీసుకున్నారు. ఇద్దరివీ సమరూప ఆదర్శాలే. అయితే "జిలాస్ ఉత్పత్తిని అవసరాలకు మించి ఎన్నో రెట్లు అధికం చేయాలంటే, వినోబా కోర్కెల్ని తగినంతగా అదుపు చేయాలంటాడు. జిలాస్ భౌతికవాదిలా కనిపిస్తే, భావే ఆధ్యాత్మికవాదిలా కనిపిస్తాడు" అని చెప్పిన లోహియా ఇక్కడే "ఈ పైపై భేదం ఎంతగానో తప్పుదారి పట్టించేదిగా ఉంటుంది" అంటూ మతలబు విప్పుతారు.

అయితే, కోరికలను అదుపులో పెట్టుకోవటంలోని క్లిష్ట పరిస్థితులను గొప్పగా విశ్లేషించారు. సన్యాసాశ్రమాల్లో తప్ప సామాజిక లోగిళ్లలో అది సాధ్యం కాదని కుండ బద్దలు కొట్టారు. దాతృత్వం కొడిగట్టినప్పుడు సన్యాసాశ్రమంలో సైతం ప్రార్థనలు, ధ్యానాలు నిలిచిపోతాయంటారు. 'భావే చెప్పే విధంగా బంగారం నుండి విముక్తి ఈ లోకంలో కుదరదు గాక కుదర'దంటారు.

"దేశాల మధ్య పారిశ్రామిక, శాస్త్రీయ, సాంకేతిక రంగాల్లో పొడసూపే వ్యత్యాసాలను అధిగమించేందుకు మనకు గల ఏకైక మార్గం: కనీసం సిద్ధాంతపరంగానైనా– సరికొత్త నాగరికత, వినూత్న సాంకేతికత్వపు ఆవిష్కరణల ద్వారా మాత్రమే"నని వివరించారు. 'భౌతికవాదపు ఎద్దును మేపవలసిందేగాని, కొమ్ములు పట్టుకొని వంచాల్సిందే'నని తీర్మానిస్తారు.

భౌతిక, పారలౌకికాల ఆనవాళ్లను ప్రజల మనసుల్లోకి దిగుమతి చేసే క్రమంలో లోహియా దేశవిదేశాల బలాలు, బలహీనతల్ని నిర్మొహమాటంగా బహిర్గతం చేశారు. నిష్పాక్షిక చూపుతో ఆయా మడతల్లోని సౌందర్యంతోపాటు దుమ్ముధూళినీ సందర్శించారు.

కలిమిలేముల మధ్య విలాసజీవులు నిలబెట్టే నిర్దయత్వపు ఇనుపతెరలను కూలదోయటానికి అవసరమైన విప్లవానికి లోహియా ఆహ్వానం పలుకుతారు. "భారతదేశానికి చెందిన యువ సోషలిస్టులు ఈ విధమైన విప్లవాన్ని మనస్సుల్లోను, సమాజంలోను సాధించాల్సి ఉంది. ఈ విధమైన విప్లవం ఎదురుదాడి చేసే లేదా పక్కదెబ్బ కొట్టే శత్రువులను సైతం ఓడించేందుకు శక్తిసామర్థ్యాలను కలిగినదిగా భావించాలి" అంటారు.

1955లో పూరిలో చేసిన ప్రసంగం ఓ వ్యక్తిత్వ వికాస పాఠ్యాంశం. అయితే 'అమూర్తం – మూర్తం' పేరుతో వెలువడిన ఈ విభాగాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేయాలి. వాక్యాల మధ్య గుప్తంగా దాగి ఉండే భావశకలాలను మనసుతో అర్థం చేసుకోవాలి. పోలీసు కాల్పులు, అలహాబాద్ విధాన ప్రకటనల నేపథ్యంలో మూలకారణాలను అన్వేషించే ప్రయత్నమే ఈ ప్రసంగం.

'ఆదర్శం మానవమేధలో రెండు రూపాలుగా కనిపిస్తుంది. ఒకటి అమూర్తం, రెండు మూర్తం.

అమూర్త ఆదర్శం సాధారణ కోరికలకు సంబంధించినది. ప్రజాస్వామ్యం, న్యాయం, సమానత్వం, మనిషిని మరో మనిషి పీడించటాన్ని అంతమొందించటం వంటివి సాధారణ ఆదర్శాలు.

మూర్తరూపం ఆచరణను ప్రేరేపిస్తుంది. సాధారణ ఆదర్శాన్ని వర్తమాన వాస్తవానికి జత చెయ్యాలంటే అది మూర్త రూపాన్ని కలిగి ఉండాలి. వర్తమాన

వాస్తవానికి కొలబద్ధగా నిలవాలంటే అమూర్తం మూర్తంలోకి రూపాంతరం చెందాలి'.

"మనిషి సశరీరంగా ఉన్నంతకాలం ధర్మసూత్రాలకు, వాటి ఆచరణకు కొంత తేడా తప్పదు. అది మనం మానవ స్వభావానికి సమకూర్చే రాయితీ". ఉద్వేగాల తప్పిదం, వ్యక్తిత్వపు తప్పిదం, శక్తిలేమి వల్ల ఉత్పన్నమయ్యే తప్పిదాల మధ్య మౌలిక భేదాలను మానవీయ కోణంలో విశ్లేషించారు. బాధగా తప్పిదాన్ని గుర్తించేకంటే ఏదో ఒక మంచి చేయటమే మేలని ఒక విధమైన సంతృప్తితో మనిషి ముందుకు సాగుతాడని చెబుతారు.

సిద్ధాంతాలు, ఆచరణ మధ్య గల ఏకీభావం ఎలాంటిదో తేలిగ్గా అర్థమయ్యేట్టు వివరించారు. సామాజిక తత్వశాస్త్రాలు సైతం సాధించలేకపోయిన వాస్తవాదర్శాలను లోతుగా విశ్లేషించారు.

"మనిషి మనస్సులో వాస్తవ పరిస్థితుల్ని శోధించే కృషి కన్పించదు. ఎంతసేపటికీ సలహాలివ్వటం, బోధించటం, నీతిదాయక ధర్మసూత్రాలను వల్లించటమే కన్పిస్తుంది. మనం ఎన్నడూ ఉన్న స్థితిని ఉండవలసిన స్థితిగా గుర్తించరాదు. ఆదర్శాన్ని వాస్తవంగా గుర్తించే స్థితి మరణించే వరకు కొనసాగుతుంది. దానికి ప్రధానంగా బాధ్యత వహించేది ప్రేమ. అయితే శోధించటం, అర్థం చేసుకోవటం అనే అంశాలలో అది ఎల్లప్పుడూ విఫలమవుతూనే ఉంటుంది" అని చెప్పిన లోహియా మహాత్మాగాంధి తరువాత మనస్సు ద్వారా ఆదర్శాన్ని గ్రహించేందుకు ప్రయత్నించిన వారు లేరని స్పష్టం చేశారు.

మూర్త–అమూర్తాల ఆనుపానులు శోధించే క్రమంలో మను, యాజ్ఞవల్క్యుని సిద్ధాంతాలను సైతం ప్రస్తావించటం లోహియా అధ్యయన పరిజ్ఞానానికి నిదర్శనం.

ఇటీవల సోషలిస్టు పార్టీలో మూడో వర్గం ఒకటి పుట్టుకొచ్చిందని చెబుతారు. పార్టీలో సహకరించే వాళ్లకు, సమరశీలురకు మధ్య రాజీ కుదర్చాలనుకునే ఈ తరహా జీవులు 'బ్రోకర్ల'తో సమానమంటారు. అర్థం పర్థంలేని బతుకీడ్చే పరాన్నభుక్కులుగా పేర్కొంటారు. ఈ వ్యవహారాన్ని మరింత లోతుగా చర్చించేందుకు మరికొన్ని కోణాలనూ సునిశితంగా విశ్లేషించటం లోహియా లోచూపునకు మచ్చుతునక. స్వాతంత్ర్యానికి పూర్వం కాంగ్రెసు పార్టీలో స్వరాజ్యం కావాలని కొట్లాడే వాళ్లతోపాటు ఏ మార్పూ అవసరం లేదనే వాళ్లూ ఉండేవాళ్లట. అక్కడా

మూడోవర్గం ఉండేది. "అయితే, అది నేటి ప్రజా సోషలిస్టు పార్టీలోని మూడవ వర్గానికి భిన్నం. అప్పటి మూడోవర్గం చాలా జాగరూకతతో వ్యవహరించేది. అది ప్రసంగాల్లో, చర్యల్లో తీవ్రవాదాన్ని సమర్థిస్తున్నట్లే వుండేది. ఆ రోజుల్లో ప్రసంగాల్లో తీవ్రతను ఆచరణలోని సంప్రదాయంతో రంగరించి జాతీయవాద శక్తుల్ని పరిపక్వ దశకు చేర్చేవాళ్లు. ఆ విధంగా ఉదాహరణకు 1928లో కాంగ్రెసులోని మధ్య వర్గీయులు సంపూర్ణ స్వరాజ్యం కోసం పోరాడే సుభాష్ చంద్రబోసును మోసం చేశారనే నిందను మోపినా ఏదో విధంగా వాళ్లు ఒక సంవత్సరం గడిచిన తర్వాత ఘనవిజయం సాధించలేదా అని సమర్థించుకుంటారు" అని మన ఊహలకందని సున్నితమైన అంశాలను వెల్లడించారు.

భారతదేశంలో రాజకీయ సన్నాహాలకు సంబంధించి లోహియా సాధారణీకరించిన ఐదు సూత్రాలను నిర్వచించారు. పనిలో పనిగా యువసోషలిస్టులు తమ అవగాహనలోని తప్పిదాల్ని తొలగించుకోటానికి చేయాల్సిన కృషిపై మార్గనిర్దేశం చేశారు.

❖ ❖ ❖

సమానత్వం యొక్క స్వరూపస్వభావాల విశ్లేషణే మరో ప్రసంగం. ఊరింపు, భయం అనేవి అసమానత్వానికి దారి తీస్తాయి. భయం, పేరాశలకు సంతృప్తికరమైన ప్రత్యామ్నాయాలు లేకపోవటం ఒక కారణమంటారు. సర్వసమాన సౌభ్రాత్రత్వం అనే ప్రబల విశ్వాసం ఇంతవరకు సాపేక్షికంగా దుర్బలమైన నీతిశాస్త్ర పునాదులపై నిలిచి ఉందంటారు. "సత్యము లేదా ఆనందము వంటి జీవితానికి సంబంధించిన లక్ష్యం ఎంతటి వ్యక్తిగతమో అంతటి వ్యక్తిగతరహితం కూడ. అది వ్యక్తిని పరిష్కారానికి నోచని చర్యలవైపుకు లాగవచ్చు లేదా తనని తాను సంపూర్ణంగా పునరుజ్జీవింప చేసుకునే దిశగానూ నడపవచ్చు"నని విశ్లేషిస్తారు. భౌతిక సమానత్వంలో అది వేళ్లూనకుండా సాటివారితో మనోద్వేగభరిత రక్తసంబంధం సమకూర్చుకోవటం అసంభవమని తేల్చిచెప్పారు.

అంతిమంగా సమానత్వాన్ని మనిషి తన బాహ్యాంతర భావనల సారం నుంచీ, ఆధ్యాత్మిక–భౌతిక కోణాల నుంచీ అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

విశ్వమానసానికి సంబంధించి కొన్ని మౌలిక అంశాలను విభిన్న కోణాల నుంచి సమీక్షించారు.

"వాస్తవాలనేవి బెసకని పాతభావనల మూసలోకి బలవంతంగా నెట్టబడు తున్నాయి. వాస్తవాలకు, భావనలకు మధ్య స్వేచ్ఛామయంగా యిచ్చిపుచ్చుకునే ధోరణి లేకుండాపోయింది. కొత్త సాహసయాత్ర తాలూకు ఏదో తరహా భీతి ఏదో జనాన్ని చుట్టుముడుతున్నది. ఏదో యాభైయ్యేళ్లనాటి ఆలోచనా తీరాలకే అంటిపెట్టుకొని వుంటున్నారు.

"సృజనాత్మక ఆలోచనలకు సంకేతంగా ఎవరయినా సరే ప్రపంచంలోని ప్రధానమైన రుగ్మతల్ని పేర్కొని వాటికి తగిన నివారణోపాయాలు కనుగొనాల్సి ఉంది.

"ప్రస్తుతం ఆధునిక ఆర్థిక వ్యవస్థల్లో విరివిగా వెలువరించే కోరిక– కుంటుపడిన ఆర్థిక వ్యవస్థల్ని ఆదుకోవాలనేది ఒక కర్మకాండ మాత్రమే. మహా అయితే దురదకు పైపై గీకుడు వంటిది. ఆర్థిక సిద్ధాంతాల నన్నింటినీ తిరగరాయాల్సి వుంది. ఇంజినీరింగుకు సంబంధించిన నైపుణ్యాలకు సరికొత్త నమూనాలను సమకూర్చాల్సి ఉంది".

హిందూమతం మూలాల్ని, పరిణామాల్ని, పర్యవసానాల్ని వివరిస్తూ సాగిన ప్రసంగం చాలా విలువైనది. హిందూమతంలోని ఉదారవాదానికీ మతమౌఢ్యానికీ మధ్య జగడాన్ని మించిన 'ప్రమాదకరమైనయుద్ధం' లేదంటారు. అదే సమయంలో క్రైస్తవం, ఇస్లాం, బౌద్ధం– వీటన్నింటికి వాటి అంతఃకలహాలు వాటికి ఉన్నాయంటూ అందుకు గల కారణాలను విశ్లేషించారు.

'నిరంతరం శాఖోపశాఖలుగా విడివడే ఉన్న' హిందూమతం చీలికలకు దూరంగా నిలబడగలిగింది. హిందూమతం విషయంలో ఉదారవాదులకూ, మతమౌఢ్యులకూ మధ్య పొసగకపోవటానికి గల కారణాలను వివరించారు. కులవ్యవస్థ విషయంలో మాత్రం అటు ఉదారులూ ఇటు సనాతనులూ పదుగుపేకల్లా కలిసిపోయిన నగ్నసత్యాన్ని వెల్లడించారు. "కులం ఒక వ్యవస్థగా కొన్ని రూపాల్లో సడలింపుకు గురి కావచ్చుగాని దాని మానసిక అలవాటు మాత్రం కోల్పోజాలదు.

హిందూమతంలోని ఉదారత్వం, సనాతనత్వం కులం విషయంలో పరిష్కారాన్నెరుగని సమస్యగానే బెదిరిస్తూ ఉంటుంది".

అలాగే, మనకు మనం మూఢంగా విధించుకున్న నియమనిబంధనలు కూడా మతం మత్తులోంచి మనం బయటకు రాలేని పరిస్థితులకు దారితీశాయి. సహనం అనేది హిందూమతానికి ఆభరణం లాంటిది. కానీ, చరిత్రపుటల్లో నమోదవుతున్న నరమేధాలన్నీ ఈ ఆభరణాన్ని వెలవెలబోయేలా చేస్తున్నాయి. సనాతన అత్యుత్సాహం, అసమగ్ర సమైక్యత, ఉదారవాద విదూషకత్వం వంటి అనేక అంశాలు హిందూమతంలోని పగుళ్లకు నిరంతరం కారణమవుతున్నాయని చెబుతారు.

సిద్ధాంతాల గురించి వాటిపట్ల తన అవగాహన, ఆచరణీయ మార్గాల గురించి ఓ ప్రసంగంలో లోహియా లోతైన చర్చ జరిపారు. పెట్టుబడిదారీ విధానపు క్రమానుగతి సిద్ధాంతాన్ని తేలిగ్గా అర్థం చేసుకోటానికి ఆయన ఇలా చెబుతారు...

"మనం ఒకవేళ పెట్టుబడిదారీ విధానం ఉత్పత్తి శక్తులకు, ఉత్పత్తి బాంధవ్యాలకు మధ్య ఘర్షణను కలుగజేసిందని చెప్పదలిస్తే, అప్పుడు అలా చెప్పేదాన్ని యిలా పూరించాల్సి వుంటుంది. దాని పరిణామక్రమంలో అది కూడ రెండు ప్రపంచాలను సృష్టించింది– ఒకదానిలో సాంకేతికపరమైన విప్లవాత్మక ప్రగతిని అందిస్తూ రెండవ దానిలో ప్రజలకు పేదరికాన్ని, దుర్భర దారిద్ర్యాన్ని, అంతులేని వ్యధను పంచింది. ఒక ప్రపంచానికి అది ఉత్పత్తికి అవసరమయ్యే వనరులు యిబ్బడిముబ్బడిగా అందిస్తూ, రెండవ దానిలో ఉత్పత్తికి సంబంధించి పనికి రాకుండాపోతున్న ఉపకరణాలను పంచింది".

అంటే, తన ప్రసంగాన్ని మార్క్సిజపు పరీక్షలకు గురిచేసి ఆ వెలుగులో ముందుకు సాగటం లోహియా అభిమతం కాదు. సత్యాన్వేషణలో తన పరిశోధనను ప్రజల హృదయాల్లోకి బట్వాడా చేయటమే అసలైన లక్ష్యం.

సోషలిస్టు పార్టీ రూపొందించుకొని 1956లో హైదరాబాదులో దాని వ్యవస్థాపక సదస్సులో ఆమోదించిన "నియమాల నివేదిక" మరో విలువైన ప్రసంగపాఠం.

❖❖❖

"లోహియా ఆలోచనా స్రవంతిలో విమర్శనాత్మక దృక్కోణం" గురించి ప్రముఖ పాత్రికేయులు ఎ.బి.కె.ప్రసాద్, 'ప్రపంచంలోని అనేక విభిన్న విలువలని సార్వజనీన విలువలుగా మార్చటానికి లోహియా చేసిన ప్రయత్నాల' గురించి డాక్టర్ అవధానం రఘుకుమార్, "సోషలిజానికి శాశ్వత నిర్వచనాలు ఉండవంటూ, నిత్యం దాన్ని ఎవరికివారు కొత్తగా కనుక్కోవాల్సిందే"నని లోహియా చెప్పిన మాట బుద్ధుడి బోధనతో సమానమంటూ మోతే గంగారెడ్డి రాసిన ముందుమాటలు ఈ పుస్తకం విలువను పెంచాయి.

పుస్తకం చివర్లో 'అనుబంధం'గా అందించినలోహియా జీవన విశేషాలు ఈ తరానికి ఎంతో ఉపయుక్తం.

తెలుగు సాహిత్యంపై మంచి పట్టున్న రచయిత సాంబశివరావు గారు. అందువల్ల అనువాదశైలి ఆత్మీయంగా మనల్ని అల్లుకుపోతుంది. సుదీర్ఘ వాక్యాలను అనువదించేటప్పుడు భావ వ్యక్తీకరణలో ఏమాత్రం తేడా తలెత్తినా అర్థం మారిపోయే ప్రమాదముంది. ప్రసంగంలో పునరుక్తులూ కొన్ని అనవసర ప్రస్తావనలూ ఉంటాయి. వాటిని జాగ్రత్తగా పరిహరించాలి. ఈ జాగ్రత్తలన్నీ అత్యంత శ్రద్ధాసక్తులతో పాటించినట్లు ప్రతి వాక్యమూ మనకు సాక్ష్యం చెబుతుంది. మచ్చుకు కొన్ని...

"మేధోపరమైన సంస్కృతి అంటే ముమ్మరంగా సాగే యాంత్రిక చర్యల సాంకేతికతకు కన్నెర్ర". (54వ పేజీ)

"అవగాహన లోపానికి పశ్చాత్తాపం అంటే ఏమిటో అసలు తెలియనే తెలియదు" (60వ పేజీ)

"మనిషి జీవనరీతినో, సమాజ గతినో మార్పు చెందించేందుకు సమానత్వం, అద్వైతం రెండూ కూడా అత్యంత శక్తిమంతమైన ప్రేలుడు పదార్థాలే".

"జీవితకాలంలోని ఉన్నత ఆశయాలన్నీ ఏదోవిధంగా ఊహాజనిత మరణానంతర ఉనికితో లంకె వేసుకోజూస్తాయి".

"ఐరోపాలోని పలు పట్టణాలు రాత్రిపూట మోసపూరిత ప్రేతాత్మల్లా కన్పిస్తాయి".

ఈ ప్రసంగాలకు ఇప్పటికీ ప్రాసంగికత ఉందా అంటే...

కచ్చితంగా ఉంది. అయితే, కొన్ని విషయాలను కాలం ప్రమాణంగా అర్థం చేసుకోవాలి. దాన్ని పక్కనబెడితే, లోహియా దార్శనికత అనన్యసామాన్యం. అవగాహన అపూర్వం. విశ్లేషణ వినూత్నం. ఏడు దశాబ్దాల కిందట ఆయన ప్రస్తావించిన అనేక విషయాలు ఇవాళ్టికీ ప్రపంచ యవనికపై పచ్చిగా కదలబారుతున్నాయి. ఆయన ఆశించిన స్థాయికి సుదూర తీరంలోనే మానవమేధ స్తంభించిపోయింది.

“మనకు ప్రస్తుతం కావలసింది సరైన ఆలోచనా విధానం, ఒక సంఘటిత దృక్పథం. మన మనస్సు తృష్ణమయం కావాలి. గాంధీ లేదా మార్క్స్ భావనల్ని సారాంశాలను గ్రహించే దిశగా మనం సంప్రదాయానికి అంటకాగకుండా తృష్ణకే పరిమితం అయితే ఫలితం వుంటుంది”.

ఈ నాలుగు వాక్యాలనైనా స్పష్టంగా అర్థం చేసుకుని, ఆచరణలో నిరూపించుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉంది.

ఎమెస్కో ప్రచురించిన ఈ పుస్తకానికి గిరిధర్ గౌడ్ గారి ముఖచిత్రం అదనపు విలువను చేకూర్చింది (ప్రతులకు ఎమెస్కో బుక్స్ – 040–23264028).

‘అనువాదకుని ఉల్లేఖనం’లో రావెల సాంబశివరావు గారు చెప్పిన వాక్యంతోనే ఈ వ్యాసాన్ని ముగించటం అత్యంత సముచితం...

“హృదయానికీ, మేధకీ లంకె కుదిర్చి రాజకీయాల్లోకి లోచూపును, క్రమశిక్షణను, మానవీయ కోణాన్ని ఆహ్వానించిన నేత డాక్టర్ రామ్ మనోహర్ లోహియా”.

**(పాలపిట్ట, జూన్ 2022)**